వరాహమిహిర విరచిత

బృహత్సంహిత



జ్యోతిషవిశారద - వాస్తు సమ్రాట్

డా॥ ముదుండి విశ్వనాథరాజు

పిహెచ్.డి

వరాహమిహిర విరచిత

బృహత్సంహిత

సుఖ సమృద్ధికారక మౌలిక జ్ఞాన ప్రదాయక

సర్వోత్తమ సంహితా గ్రంథము

అనువాదం

జ్యోతిష విశారద, వాస్తు సమ్రాట్

డా. ఎం. విశ్వనాథ రాజు

భాషాప్రవీణ

ఎం.ఏ. తెలుగు, హిందీ, సంస్కృతం, జ్యోతిషం (గోల్డ్‌మెడలిస్ట్)

ప్రకాశకులు

శ్రీ సాయి వాస్తు పబ్లికేషన్స్

హైదరాబాదు - 500052

ఫోన్ : 9440945403, 040-24017595

Varaha mihira Virachitha
Bruhat Samhita
Translated by Dr. M. Viswanatha Raju
Sri Sai Vastu Publications

First Edition - 1000 copies
May : 2013
Price : 180/-

Books available at
Dr. M. V. Raju
H.No. 6-3-120/6, N.P.A. Colony
Near Mahesh Vidya Bhavan School
Sivarampally, Hyderabad - 500052
Phone : 9440945403
040-24017595

D.T. P: Sri Vagdevi Grafics.Hyderabad, **Ph No :** 9490025154

All Visalandra Show Rooms
Bank Street, Hyderabad ph: 24602946
***Sri Gopal Publications**, Lane Opp. Arya Samaj Mandir,*
Hyderabad - 027.Ph : 24658101
***Telugu Book House**, Hyd - 027, Ph No: 9247446497*
***Gandhi Book House**, Gandhi Gnana Mandir, Koti,*
Hyderabad, Ph : 9490004261

ముందు మాట

'ఖ్యాతో వరాహమిహిరో నృపతేస్సభాయాం' అని ఖ్యాతిని పొందిన మహోన్నత పండితుడు వరాహమిహురుడు. క్రీ.శ 6వశతాబ్దివాడు,విక్రమార్కుని ఆస్థాన విద్వాంసుగా కొందరు భావింతురు. ఇతడు బృహజ్జాతకము, బృహత్సంహిత, లఘు జాతకము,వివాహపటలము,యోగయాత్ర సమాస సంహిత గ్రంథములను రచించెను. బృహత్సంహిత సంహితా గ్రంథములలో ప్రధానమైనది. ఈ గ్రంథములో సిద్ధాంత, సంహిత, హోరలను త్రిస్కంధముల వివరణ కలదు. దీనిలో గ్రహచార వశమున జరుగు సుభిక్ష దుర్భిక్షాది విషయములు ప్రతిపాదింపబడెను. వీటితో పాటు స్వర, ముహూర్త,శకున,పురుష స్త్రీ, గజ, తురగ, రత్న, ప్రతిమ, వాస్తు ప్రాసాదాది లక్షణ విశేషములనేకము తెలుపబడెను.

ఇంతవరకు ఈ గ్రంథము తెలుగులో అనువదింపబడలేదు. వాస్తు జ్యోతిష శాస్త్రాభిలాషులైన పాఠకులకుప యోగపడునను తలంపుతో భట్టోత్పలుని వ్యాఖ్యానానుసారముగా ఈ గ్రంథమును తెలుగు లోనికి అనువదించుట జరిగినది. నాచే రచించబడిన "ప్రాచీనవాస్తు శాస్త్రాలు- అధునిక వాస్తు పరిశీలన" పరిశోధన గ్రంథము,నాచే అనువదింపబడిన విశ్వకర్మ ప్రకాశము, నారదసంహిత,వాస్తురాజ వల్లభము,మయమతము,ముహూర్త చింతామణి గ్రంథములు పలువురు పండితుల మన్ననలు పొందినవి. వారి ప్రేరణ ప్రోత్సాహము ఈగ్రంథానువాదమునకు కారణమైనది.

శాస్త్రాభిలాషులైన తెలుగు పాఠకులు, జ్యోతిష విద్యార్థులు ఈ గ్రంథమును చదివి శాస్త్రజ్ఞానమును పొందగలరని యాశించుచున్నాను. ఈ గ్రంథాధ్యయనము వలన ఏ కొంత ప్రయోజనము పొందినను నాకృషి సఫలమైనదని తలంతును.

ఈ గ్రంథ రచనకు ప్రోత్సహించిన ప్రముఖ వాస్తు జ్యోతిష పండితులు శ్రీ పల్లావజ్ఝల రామకృష్ణ శర్మగారికి, శ్రీ యమ్. లాల్‌బహదూర్ శాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

డి టి పి కార్యాన్ని సకాలంలో సక్రమంగా నిర్వహించి గ్రంథమును సర్వాంగ సుందరముగా తీర్చిదిద్దిన శ్రీ వాగ్దేవి గ్రాఫిక్స్ అధినేత, ప్రియశిష్యుడు శ్రీ వై. సత్య నారాయణ మూర్తికి ఆశీ:పూర్వక అభినందనలు తెలియజేయుచున్నాను. పండితులు ఈ గ్రంథముద్రణలో దొర్లినతప్పులను తెలియజేసిన మలిముద్రణలో సరిజేయ గలవాడనని వినయపూర్వకముగా తెలియజేయుచున్నాను. ఈగ్రంథ ముద్రణలో సహకరించి ప్రోత్సహించిన మిత్రులు శ్రేయోభిలాషులకు హృదయపూర్వక నమస్సులతో

భవదీయుడు

డా. ఎం విశ్వనాథ రాజు

కృతి సమర్పణం



గ్రంథకర్త ఇతర రచనలు

1. ప్రాచీన వాస్తు శాస్త్రాలు - ఆధునిక వాస్తు పరిశీలన (వాస్తులో మొట్టమొదటి పరిశోధనా గ్రంథము)- రూ॥ 300/-
2. విశ్వకర్మ ప్రకాశము - వచనము - రూ॥ 100/- (ఆధునిక వాస్తు సమస్యలకు సమాధాన గ్రంథము)
3. నారద సంహిత - 170/-
4. వాస్తురాజ వల్లభము - 72/-
5. మయమతము - 90/-
6. ముహూర్త చింతామణి - 130/-

విషయసూచిక





బృహత్సంహిత

1. శాస్త్రోపనయనాధ్యాయము

మంగళాచరణము

జయతి జగత: ప్రసూతిర్విశ్వాత్మా సహజ భూషణం నభస:
ద్రుతకనకసదృశ దశశతమయూఖమాలార్చిత: సవితా 1

సకలబ్రహ్మాండ ఉత్పత్తికి కారకుడు,విశ్వాత్మ, ఆకాశమునకు సహజాలంకార మైనవాడు,కరుగుతున్న బంగారముతో సమానమైనవాడు, వేలకిరణముల మాలతో సుశోభితుడైన సూర్య భగవానుడున్నతుడై వెలుగుచున్నాడు.

ప్రథమముని బ్రహ్మ ద్వారా వివరముగా చెప్పబడిన యథార్థ(సత్య) విషయమును తెలిసికొని, దాని స్వరూపమును అత్యంత సంక్షిప్తముగా, విస్తార రహితముగా స్పష్టముగా తెలియజేయుచున్నాను. ప్రాచీనఋషులు తెలిపిన విషయములు యథార్థమైనవి మనుష్యులు తెలిపినవి యథార్థములు కావనితెల్పుట ఉచితముకాదు. మునుల (బ్రహ్మాదుల) మంత్రాత్మక వచనములు కూడ వివిధ గ్రంథములతో అర్థసమానత్వమును పొందుతున్నవి. అక్షర భేదముండవచ్చును. అర్థభేదముండదు.

బ్రహ్మ రచించిన గ్రంథములో **"క్షితి తనయ దివసవారో న శుభకృత్"** అని, మనుష్యకృత గ్రంథములో **"కుజ దినమనిష్టమ్"** అని వ్రాయబడెను. దీనిలో పాఠభేదము తప్ప అర్థములో భేదములేదు. బ్రహ్మాది ఋషులు రచించిన అతివిస్తారమైన స్వరూపమును చూచి దాని స్వరూపమును గ్రహించి సంక్షేపముగా క్రమముతో శాస్త్రమును నిర్మించవలెనని నాకుత్సాహము కలిగినది.

ఈ జగత్తు మొదట అంధకారమయము.ఆ అంధకార విషయ రూపజలములో తేజోరూపమైన స్వర్ణమయమైన అండముత్పన్నమైనది. దాని రెండుభాగములు స్వర్గము, పృథివిగా మారినవి. ఈ భాగములలో సూర్యుడు చంద్రుడను రెండు నేత్రములు కలిగిన బ్రహ్మ ఉత్పన్నమయ్యెను.

భూమి ఉత్పత్తి విషయములో అనేకప్రమాణములు దొరుకును, కపిలముని మతానుసారము మూలప్రకృతి జగదుత్పత్తికి కారణము, కణ్వాదుని ప్రకారము ద్రవ్యాది

పదార్థము,కొందరు కాలము,కొందరు స్వభావమనిరి. మీమాంసకులు కార్యవ్యవహారము జగదుత్పత్తికి కారణమనిరి.

భూమి ఉత్పత్తిని గురించి విస్తృతముగా చర్చించుట వ్యర్థము. ఈ విషయును చర్చించు సందర్భమున అనేక అతివిస్తృత విషయముల చర్చ అవసరమగును. అందువలన ఈ ప్రసంగమును వదలి ప్రస్తుతము జ్యోతిషశాస్త్రాంగముల వర్ణన చేయవలెను.

అనేక భేదములతో కూడిన జ్యోతిషశాస్త్రములో మూడుస్కంధము (సంహిత తంత్ర హోర)లున్నవి. సంపూర్ణ జ్యోతిషశాస్త్ర విషయముల వర్ణన కలిగినది సంహిత యగును.గణితము ద్వార గ్రహగతుల నిర్ణయము చేసిన దానిని తంత్రమందురు. దీనికతి రిక్తముగా జాతకఫలము ముహూర్తాది నిర్ణయములు కలది హోరాస్కంధమగును.

నేను కరణగ్రంథము(పంచసిద్ధాంతిక)లో తారాగ్రహ(భౌమాదిపంచ గ్రహములు) ముల వక్రము,మార్గము,అస్తమయము,ఉదయాది వర్ణన చేసితిని. హోరా (బృహజ్జాతకము, బృహద్వివాహపటలము గ్రంథములలో జన్మ,యాత్ర వివాహాది విషయములను వివరము గా వర్ణించితిని.

మొదటి శాస్త్రోపనయన నిరూపణాధ్యాయము సమాప్తము

2. సావంత్సర సూత్రాధ్యాయము

ఈ అధ్యాయములో సాంవత్సర సూత్ర (జ్యోతిష లక్షణము) ములను తెలిపెదను.

కులీనుడు సుందరుడు నమ్రస్వభావి సత్యవాది ఇతరుల దోషములను ఎత్తిచూపనివాడు, రాగద్వేషరహితుడు, దృఢమైన పుష్ట శరీరము కలవాడు, సర్వాంగములు కలవాడు, మంచిలక్షణములు కలవాడు, కాళ్లు చేతులు గోళ్లు కన్నులు గడ్డము దంతములు చెవులు లలాటము శిరస్సు కలవాడు, సుందరముగా పలుకువాడు, గంభీరుడు, ఉత్తమ జ్యోతిషుడగును. ఎందువలననగా శరీరాకృతిననుసరించియే దోష గుణములుండును.

దైవజ్ఞ గుణములు :

పవిత్రుడు చతురుడు సభలో మాట్లాడువాడు, వాచాలుడు ప్రతిభాశాలి, నిర్మల మనస్కుడు, సభలో నిర్భయముగా నుండువాడు, సహపాఠులతో పరాజయము పొందనివాడు, ఇతరుల చేష్టలను గ్రహించువాడు,వ్యసనరహితుడు,శాంతికుడు (వేదమంత్ర పాఠ అనుష్ఠానములు చేయువాడు) పౌష్టికుడు (ఆయువు ధనాదులను పెంచువిద్య), అభిచారుడు (మరణ, మోహన ఉచ్చాటన, విద్వేషణ, వశీకరణ, స్తంభన, చాలనాది విద్యలు తెలిసినవాడు) దేవపూజనుడు, వ్రతుడు, ఉపవాస నిరతుడు, తనశాస్త్రజ్ఞానము ద్వారా ఆశ్చర్యజనక విషయములను బయటకు తీయువాడు,ప్రశ్నోత్తరములు చేయువాడు, ప్రాకృతిక ఉత్పాతము లను నివారించుటకు అడగకుండగనే శాంతికర్మలను తెలియ

జేయువాడు, గ్రహగతిని గుణించువాడు, సంహిత హెూరగ్రంథముల అర్థమును తెలిసిన వాడు దైవజ్ఞుడగును.

దైవజ్ఞ లక్షణము : గ్రహగణిత విభాగములో నున్న పౌలిశ, రోమక, వాసిష్ఠ, సౌర, పైతామహ – ఈ ఐదుసిద్ధాంతములో ప్రతిపాదించిన యుగ,వర్ష,అయన,ఋతు, మాస, పక్ష, అహెూరాత్ర, ప్రహర, ముహూర్త ఘటి,పల,ప్రాణ, త్రుటి, అవయవాది కాలములు, భగణము రాశి అంశము కల వికలాది క్షేత్రముల జ్ఞానము జ్యోతిష్కుని కుండవలెను. సౌర సావన నక్షత్ర చాంద్ర –ఈ నాలుగు మాసములు,అధిక,క్షయమాసముల ఉత్పత్తి కారణము లు తెలిసినవాడు జ్యోతిష్కుడగును. ప్రభవాది అరవైసంవత్సరములు,దానిలోవచ్చు యుగములు,వర్ష,మాస,దిన,హెూరాధిపతులప్రవర్తన మరియు నివృత్తి జ్ఞానముండవలెను.

అనేకశాస్త్రములలో తెల్పిన సౌరాది మానముల యథార్థస్థితి దైవజ్ఞుడు తెలిసికొని యుండవలెను. సిద్ధాంతములో సౌరాది మానముల భేదము, అయననివృత్తి భేదము, సమమండల ప్రవేశకాలిక అంశముల భేదము, ఛాయా జలయంత్ర దృగ్గణిత జ్ఞానము దైవజ్ఞునకుండవలెను. సూర్యాది గ్రహముల శీఘ్ర,మంద,దక్షిణ,ఉత్తర,నీచ,ఉచ్చగతుల కారణములను తెలిసినవాడై యుండవలెను. సూర్య చంద్రగ్రహణములలో స్పర్శ, మోక్ష జ్ఞానము, స్థితి,విభేద,వర్ణ,దేశ,భావీగ్రహ సమాగమము,గ్రహయుద్ధములను తెలుపువాడై యుండ వలెను. ప్రత్యేక గ్రహము యొక్క యోజనాత్మక కక్షాప్రమాణము మరియు ప్రత్యేక దేశముల దేశాంతర ప్రమాణము తెలిసినవాడై యుండవలెను.

పృధ్వి నక్షత్ర గమనము, సంస్థానము, అక్షాంశము,లంబాంశము, ద్యుజ్యాచా పాంశము,చరఖండము,రాశ్యుదయము,ఛాయ,నాడి,కరణాదిక్షేత్రము, కాలము కరణము లను తెలిసిన వాడై దైవజ్ఞుడుండవలెను. గీటురాయి అగ్నిశానములతో పరీక్షింప బడిన శుద్ధమైన బంగారమువలె స్వచ్ఛమైనశాస్త్రమును తెలియజేయువాడు,అనేక విధములైన ప్రశ్నభేదములను తెలిసిన వాడు, నిశ్చయాత్మకమైన జ్ఞానము కలవాడై దైవజ్ఞుడుండవలెను.

శాస్త్రార్థమును తెలుపనివాడు, ప్రశ్నకుత్తరమునీయనివాడు, శిష్యులకు శాస్త్రమును బోధించనివాడు ఏవిధముగా శాస్త్రజ్ఞుడగును? గ్రంథార్థమును గ్రహింపక విరుద్ధార్థమును తెలియజేయువాడు బ్రహ్మదగ్గరకు వెళ్ళి వేశ్యవలె ముఖస్తుతి చేయుమూర్ఖు డగును. శాస్త్రమును తెలిసినవాడు ఛాయ,జలయంత్రాది సాధనముల ద్వార లగ్నజ్ఞానమును తెలిసినవాడు ఫలితశాస్త్రములో జ్ఞానము కలవాడు,సకలగుణ సంపన్నుడైన వ్యక్తి పలికిన పలుకులు ఎప్పుడు నిష్ఫలమునీయవు.

ఈదుతున్న మనుష్యుడు ఎప్పుడు గాలివాటముతో సముద్రమును దాటలేడు. కాలపురుష సంజ్ఞకమైన జ్యోతిషశాస్త్ర రూపమైన మహాసముద్రమును ఋషిమునులు కాక మిగిలిన మనుష్యులు మనసుతో కూడ దాటలేరు.

హోరాశాస్త్రములో రాశి,హోర,ద్రేక్కాణ,నవాంశ ద్వాదశాంశ త్రింశాంశ రాశుల బలాబలము,సూర్యాదిగ్రహముల దిగ్బలము,స్థానబలము,కాలబలము, చేష్టాబలముల ద్వారా బలవిచారము, ప్రకృతి,ధాతు,ద్రవ్య,జాతి,చేష్టాదుల పరిగ్రహము, గర్భాధానము, జన్మకాలము,విస్మయజనము – విశ్వాసజన్య ఆదేశము అనగా నాలవేష్టిత కోశవేష్టిత, యమల ఆదిజన్మల విషయములు తెలిపి విశ్వాసము కలిగించుట, శీఘ్ర మరణము, ఆయుర్దాయము,దశ,అంతర్దశ,అష్టకవర్గు,రాజయోగము, చంద్ర యోగము, ద్విగ్రహాది యోగము, నాభ సంయోగాదుల ఫలము,ఆశ్రయము, భావ,దృష్టి, నిర్ణయ,గతి, అనుకా (పూర్వాది జన్మలు) దివిచారము,తాత్కాలిక ప్రశ్నల శుభాశుభా విచారము,(చర్చ) వివాహో (ఉపనయనషచూడాకరణ,గృహప్రవేశ)ది కర్మల విచారము–గ్రంథకారుడు (వరాహ మిహురుడు) తాను రచించిన బృహజ్జాతకము, వివాహపటలాది గ్రంథములలో విస్తారముగా తెలియజేసినాడు.

యాత్రా సమయములో నుండు తిథుల(నంద,భద్ర,జయ,రిక్త,పూర్ణ)శుభాశుభత్వము, వార,కరణ, నక్షత్ర,ముహూర్త,లగ్న, యోగ శరీరాంగములను పట్టుకొనుట, స్వప్న, విజయమునకు సంబంధించిన స్నానము, గ్రహయజ్ఞము, గణయాగము, అగ్నిలింగము, ఏనుగు గుర్రముల చేష్టలు, సేనాపతులు చేయుశబ్దములతో పశువుల చేష్టలు, వాయు, మేఘ,వృష్టి మున్నగు నిమిత్తములు, గ్రహబలానుసారము ఆరువిధములైన సంధి, విగ్రహము, యానము,ఆసనము,ద్వైధీభావము, సంశ్రయాది విచారము, ఉపాయముల (సామ దామ భయ భేద) సాధ్యాసాధ్యవిచారము, మంగళ, అమంగళ, శకున, సేనాధివాస భూమి, అగ్నివర్ణ, మంత్రి,చర,దూత వనవాసుల సమయానుసార ప్రయోగము, శత్రు దుర్గ ప్రాప్తి, మున్నగు అన్ని విషయములు యాత్రా విషయ ప్రసంగములు హెూరాశాస్త్రములో వర్ణింపబడినవి.

భగణములతో కూడిన హెూరాశాస్త్రము ప్రపంచములో విస్తరింపబడినది, బుద్ధితో అంకితమై, హృదయములో కూర్చబడినదై యున్నది. దాని ఆదేశము ఎప్పుడు నిష్ఫలము కాదు. సంహితా సంబంధ విషయమును గ్రహించిన వ్యక్తి దైవచింతకుడగును. వక్ష్యమాన విషయములు వర్ణింపబడునది సంహితయగును. సూర్యాది గ్రహముల సంచారము, ఆసంచారములో జరుగు గ్రహముల స్వభావము వికారము, ప్రమాణము (బింబ పరిమాణము) వర్ణము, కిరణము, ద్యుతి(కాంతి) సంస్థానము(ఊర్ధ్వాధోగామి తోరణ దండాది సంస్థానము) అస్తమయము, ఉదయము, మార్గము, మార్గాంతరము, వక్రము, అనువక్రము, నక్షత్రములతో గ్రహసమాగమము, నక్షత్ర చలనము, వీటిఫలము, నక్షత్ర విభాగముల ద్వార జరుగు కూర్మచక్రము వలన దేశములకు శుభాశుభఫలము, అగస్త్యముని సంచారము, సప్తర్షుల సంచారము, గ్రహభక్తి (దేశ ద్రవ్యప్రాణుల ఆధిపత్యము) నక్షత్ర

వ్యూహము (ద్రవ్యజనుల ఆధిపత్యము) గ్రహ శృంగాటకము, (పంచతారా గ్రహముల శృంగాటక స్థితి వలన శుభాశుభ ఫలజ్ఞానము) గ్రహయుద్ధము, గ్రహసమాగమము, గ్రహము వర్షపతి యగుట వలన ఫలము, గర్భలక్షణము, రోహిణీ యోగము, స్వాతీయోగము, ఆషాఢీ యోగము, సద్యోవర్షణము, కుసుమలతా లక్షణము, పరిధి, పరివేషము, పరిఘ, వాయువు, ఉల్క, దిగ్దాహము, భూకంపము, సంధ్యాకాలపు ఎరుపు, గంధర్వ నగరము, ధూలము, నిర్ఘాతము, అర్ఘకాండము, అన్నోత్పాదనము, ఇంద్రధ్వజము, ఇంద్రధనుస్సు, వాస్తువిద్య, అంగవిద్య, వాయసవిద్య, అంతర చక్రము, మృగచక్రము, అశ్వచక్రము, వాతచక్రము, ప్రాసాద లక్షణము, ప్రతిమా లక్షణము, ప్రతిష్ఠ, వృక్షాయుర్వేదము, వృక్షదోహదము,ఉదగార్గలము, నీరాంజనము, ఖంజనోత్పాత శాంతి, మయూర చిత్రకము, ఘృతలక్షణము, కంబల లక్షణము, ఖడ్గలక్షణము, పట్టలక్షణము, కృకవాకు (కోడి)లక్షణము, కూర్మలక్షణము, గోలక్షణము, అజాలక్షణము, శ్వ(కుక్క) లక్షణము, అశ్వలక్షణము, హస్తిలక్షణము, పురుష లక్షణము, స్త్రీ లక్షణము, అంత:పుర చింతనము,పిటికము, ముత్యము, వస్త్రఛేదము, చామరము,దండము,శయనము, ఆసనాది లక్షణము,రత్నపరీక్ష,దీపలక్షణము, దంతకాష్ఠాది శుభాశుభ నిమిత్తఫలము,పురుషుల రాజుల లక్షణముల చింతనము, ఏకాగ్ర చిత్తముతో దైవజ్ఞుడు చేయవలెను. ఒంటరిగ దైవజ్ఞుడు శుభాశుభ ఫలము నిర్ణయము చేయుటకు సమర్థుడుకాడు. అందువలన సమృద్ధిగా ధనము నిచ్చి దైవజ్ఞులతో పాటు శాస్త్రజ్ఞానము తెలిసిన నలుగురు దైవజ్ఞులను రాజు నియమించవలెను. ఆనలుగురు దైవజ్ఞులలో ఒకరిని పూర్వ అగ్ని కోణములో, రెండవ వారిని దక్షిణ నైరృతికోణములో, మూడవవారిని పశ్చిమ వాయువ్య కోణములో, నాల్గవవారిని ఉత్తర,ఈశాన్యకోణములో పరీక్ష కొరకు నియమించవలెను. ఉల్కాపాతములు చూచిన వెంటనే లుప్తమైపోవును. వాటి ఆకారము, వర్ణము, స్నేహప్రమాణము గ్రహ నక్షత్రముల అభిఘాతము మున్నగువాటి ద్వార శుభాశుభ ఫలములు కలుగును.

జ్యోతిషశాస్త్రములో అన్ని అంగములు, ఉపాంగములలో నిపుణుడు, హోరాశాస్త్ర గణితశాస్త్రములలో ప్రవీణుడైన జ్యోతిష్కుని పూజించని రాజు నాశనమును పొందును. వనములో నుండువాడు, మమతారహితుడు, ఎవరికి ఏమి ఇవ్వటానికి ఆసక్తి లేనివాడు కూడ గ్రహనక్షత్రాదులు తెలిసిన దైవజ్ఞుని అడుగును. దీపము లేని రాత్రి, సూర్యుడు లేని ఆకాశమువలె జ్యోతిషహీనుడైన రాజు శోభితుడుకాక అంధునివలె దారిలో తిరుగును. దైవజ్ఞుడు లేకున్న ముహూర్తము, తిథి, నక్షత్రము, ఋతువు అయనాది విషయములకు నష్టము కలుగును. అందువలన జయము,యశము,సంపద, భోగము, మంగళములు కలుగవలెనని కోరు రాజు విద్వాంసుడు శ్రేష్ఠుడైన జ్యోతిష్కుని దగ్గరకు వెళ్ళి తన భవిష్యత్తును గూర్చి అడుగవలెను. అన్ని విధముల తన శుభమును కోరుకొను మనుష్యుడు దైవజ్ఞుడు

లేని దేశములో నివసించరాదు. నేత్రస్వరూపుడైన దైవజ్ఞుడున్న చోట పాపముండదు. జ్యోతిషశాస్త్రమును చదివేవాడు చదివించేవాడు నరకమునకు వెళ్ళడు. జ్యోతిషశాస్త్రమును పఠించు మనుష్యునకు బ్రహ్మలోకము ప్రాప్తించును.

జ్యోతిషశాస్త్ర సంబంధమైన శబ్దార్థములను గ్రహించు జ్యోతిష్కుడు శ్రాద్ధకర్మలో మొట్టమొదట భోజనము చేయుటకర్హుడగును. పంక్తిలో పవిత్రత కలిగించువాడు, ఆదరణీయడగును. మ్లేచ్ఛ యవనుల వద్ద ఈశాస్త్రమున్నవారు ఋషులవలె పూజింప బడుదురు. ఇక బ్రాహ్మణుల విషయము చెప్పవలసినదే మున్నది. వారు తప్పక పూజింప బడుదురు. ఇంద్రజాల విద్యలో తనశరీరమును దాచి గుప్తరూపముతో ప్రశ్నకర్త అభిప్రాయమును తెలిసికొని తెలిపేవాడు, కర్ణపిశాచీ సిద్ధితో ప్రశ్నాదులను తెలియజేయు జ్యోతిష్కుని ఎవరు ఏది అడుగరాదు. అతడు దైవజ్ఞుడు కాదు.

జ్యోతిషశాస్త్ర జ్ఞానము లేకుండ తాను దైవజ్ఞుడనని తెల్పి వ్రతములు ఉపవాసాదులను తెలియజేయు పంక్తి దూషకుడైన పాపిని నక్షత్రసూచకుడందురు. నక్షత్ర సూచకుల ద్వార తెలియజేయు వ్రతములు ఉపవాసములు పర్వాదులను చేయు మనుష్యుడు ఆనక్షత్ర సూచకునితో పాటు అంధతామిస్రనామక నరకమునకు వెళ్ళును. నగర ద్వార సమీపములో మట్టితో చేసిన గోళీతో ప్రార్థన చేసిన యాచకుని యాచన అప్పుడప్పుడు ఫలించును. అదే విధముగా మూర్ఖులు తెలిపిన ఆదేశములు అప్పుడప్పుడు సత్యములగును.

ధనసంపాదనా దృష్టితో జ్యోతిషశాస్త్ర జ్ఞానము లేని కారణముగా జ్యోతిషశాస్త్రమును వదిలి భిన్నమైన విషయములను చర్చించు ఉన్మత్తుడైన జ్యోతిష్కుని రాజు వదలిపెట్టవలెను. జ్యోతిషశాస్త్రములోని హెూర,గణిత,సంహితా విషయములలో సంపూర్ణ జ్ఞానమున్న దైవజ్ఞుని, జయించు ఇచ్ఛగల రాజు పూజించి సన్మానము చేయవలెను. అతని ఆదేశమును పాలించవలెను. దేశకాలజ్ఞానము కలిగిన దైవజ్ఞుడు వెయ్యి ఏనుగులు, నాలుగువేల గుర్రములు చేయలేని కార్యమును చేయగలడు.

దైవజ్ఞుని వలన చంద్ర నక్షత్రముల సంవాదమును వినుట వలన దుష్టస్వప్నము, దుష్ట చింతనము, దుష్టదర్శనము, దుష్టకర్మాది చెడుప్రభావములు శీఘ్రముగా నశించును. తల్లిదండ్రులు స్వజనులు మిత్రులు కూడ ప్రయత్నించని విధముగా దైవజ్ఞుడు రాజు హితము కోరి అతనికీర్తిని పెంపొందించుటకు ప్రయత్నించును.

రెండవ సాంవత్సర సూత్రవిచారాధ్యాయము సమాప్తము



3. ఆదిత్యచారాధ్యాయము

నిశ్చయముగా నీవిషయమును తెలిసికొనవలెను. ఒకానొక సమయములో ఆశ్లేషానక్షత్ర అర్ధభాగములో సూర్యుడుండగా దక్షిణాయణము, ధనిష్ఠానక్షత్ర అర్ధభాగములో సూర్యుడుండగా ఉత్తరాయణము ప్రారంభమయ్యేది. అలాకాని యెడల పూర్వశాస్త్రములో ఈ విధమైన వర్ణన ఉండేదికాదు. ఇప్పుడు దక్షిణాయణము కర్కాటకరాశి నుండి ఉత్తరాయణము మకరరాశి నుండి జరుగుతున్నది. తెలుపబడిన అర్థమునకు అభావము వికృతమగును. ఈ విషయములు ప్రత్యక్షముగా పరీక్షించి తెలిసికొనవలెను. సూర్యుని ఉదయము అస్తమయములను దూరములో నున్న సంకేతములతో అయన చలనములను పరీక్షించవలెను. దూరమున నున్న వృక్షముల ఎదుట సూర్యుని ఉదయాస్తమయములను చూచి పరీక్షించవలెను. రెండవరోజున కూడ అక్కడిస్థితిని పరీక్షించి సూర్యుడు వృక్షమునకు దక్షిణము లేక ఉత్తరముల వైపుకి వెళ్ళినది తెలిసికొనవలెను. లేక మహామండలములో ఛాయాప్రవేశము, నిర్గమముల చిహ్నాముతో అయన చలనములను గుర్తించవలెను.

సూర్యుడు మకరరాశిలో ప్రవేశింపక దక్షిణవైపుకి పయనించిన పశ్చిమ దక్షిణ దిశలలో నున్న జనులకు నాశనము కలుగును. కర్కాటకములో ప్రవేశింపక ఉత్తరము వైపుకి పయనించిన పూర్వఉత్తర దిశలలోనున్న జనులకు నాశనము కలుగును. సూర్యుడు మకరరాశిని దాటి ఉత్తరమువైపుకి తిరిగి వెళ్ళుచున్న జనులకు కళ్యాణము ధన ధాన్యవృద్ధి కలుగును. సూర్యుడు కర్కాటకరాశిని దాటి దక్షిణదిశవైపుకి తిరిగి వెళ్ళు చున్నను పైనతెల్పిన ఫలము కలుగును. వికార యుక్తముగా సూర్యగతి కలిగిన లోకులకు భయము కలుగును.

పండుగ సమయములు వదలి మిగిలిన సమయములో త్వష్టనామక గ్రహము సూర్యమండలమును అంధకారము చేసిన రాజులకు నాశనము కలుగును. శస్త్రము, అగ్ని, దుర్భిక్షములతో ప్రజలకు నాశము కలుగును.

రాహుపుత్రుడు కేతువు, తామస,కీలకాది నామములతో ముప్పదిమూడు విధములుగా నుండును. వీరందరి స్థానము,ఆకారము,ఆకృతులను సూర్యమండలములో చూచి ఫలితమును చెప్పవలెను. తామసకీలకమను పేర్లు కలిగిన రాహుపుత్రులు సూర్య మండలములో అశుభమును, చంద్రమండలములో శుభఫలమునిచ్చును. కాని ధ్వాంక్ష (కాక) కబంధ(ఛిన్న) ప్రహరణ(శస్త్రము) సమానమైన ఆకృతిలో చంద్రమండలములో కనపడిన అశుభఫలము నిచ్చును.

ఈ తామస కీలకాదుల ఉదయమునకు ముందు వికారయుక్త జలము ధూళితో కూడిన వాయువు ఆకాశమండలము పర్వతములు వృక్షములు, శిఖరము వీటన్నిటిని నాశనము చేయును. ఋతువులకు విపరీతముగా వృక్షములలో పూవులు పండ్లు కలుగును.

సూర్యుని వేడివలన పశుపక్ష్యాదులు వ్యాకులము చెందును. దిశలలో దహనము నిర్ఘాతము భూకంపాది భయంకర ఉత్పాతములు కలిగిన ఏడురోజులలోపల కేతువు కనిపించిన పూర్వవర్ణిత ఉత్పాతములే కలుగును. ఏకారణము చేతనైన ముందు తెల్పిన ఉత్పాతములు కనపడిన తామసకీలకాదులదర్శనముకానప్పటికి పైఉత్పాతముల ఫలితమునే తెలుపవలెను.

సూర్యబింబములో నున్న తామసకీలకాదులు ఏదేశములలో కనిపించునో ఆదేశముల రాజులు ప్రజలు వ్యసనము(చెడు అలవాట్లు)లతో దు:ఖమును పొందెదరు. ఆకలితో బాధపడు మునులు అధర్మపరులు చరిత్రహీనులై మాంసరహిత శరీరము కలిగిన బాలురను హస్తములలో పెట్టుకొని దేశాంతరములకు వెళ్ళెదరు. సజ్జనుల ధనము దొంగల పాలగును. అందువలన సజ్జన పురుషులు దీర్ఘశ్వాసతో సంకుచిత నేత్రములతో కనబడుదురు. రాజు మరియు పరదేశపు రాజుల వలన పీడింపబడుజనులు నిందలు చేసుకొనుచు తమ రాజు చేయుపనులను గూర్చి ఇతరులకు తెలిపెదరు. నీటితో నిండిన మేఘము కూడ వర్షించదు. నదులు జలరహితమగును. ధనధాన్యముల ఉత్పత్తి తక్కువగును.

సూర్యమండలము దండాకృతిలో కనిపించిన రాజుకు మృత్యువు కలుగును. శిరస్సులేని శరీరము కనిపించిన వ్యాధి భయముత్పన్నమగును. కాకి ఆకృతిలో కనిపించిన దొంగల భయము, స్తంభాకృతిలో కనిపించిన దుర్భిక్షము కలుగును.

సూర్యమండలము తెల్లగానున్న బ్రాహ్మణులకు, ఎరుపువర్ణముగా నున్న క్షత్రియులకు, పీతవర్ణముగా నున్న వైశ్యులకు, కృష్ణవర్ణముగా నున్న శూద్రులకు నాశము కలుగును. పూర్వోక్త వర్ణములు స్నిగ్ధ(నునుపుగా మెరుస్తున్న) మైన బ్రాహ్మణాది వర్ణములకు శుభము కలుగును. గ్రీష్మఋతువులో రక్తవర్ణముగల సూర్యమండలము భయమును కలిగించును. వర్షఋతువులో నల్లగానున్న అనావృష్టి కలిగించును. హేమంత ఋతువులో పీతవర్ణము గల సూర్యమండలము శీఘ్రరోగమును భయమును కలిగించును. ఇంద్రధనుస్సుతో సూర్యమండలము ఖండితమైన రాజులకు విరోధము కలిగించును. వర్షాకాలములో నిర్మలమైన కాంతితో నున్న సద్యోవృష్టి(వెంటనే వర్షము) కురియును. వర్షాకాలములో శిరీషపుష్పకాంతితో సూర్యమండలమున్న రోజున వర్షము కురియును. నెమలి పింఛమువలె కనపడిన పన్నెండుసంవత్సరముల వరకు వర్షము కురవదు. సూర్యబింబము శ్యామవర్ణముతో కనిపించిన కీటకముల భయము, భస్మము వలె కనిపించిన ఇతరదేశము వలన భయము కలుగును. రాజు జన్మనక్షత్రములో సూర్యమండలములో ఛిద్రము(రంధ్రము) కనిపించిన రాజుకు నాశనము కలుగును. కుందేలు రక్తముతో సమానమైన వర్ణము సూర్యమండలములో కనిపించిన యుద్ధము జరుగును. చంద్ర సమానమైన వర్ణము సూర్యమండలములో కనిపించిన అప్పుడున్న రాజుకు నాశనము కలిగి వేరొకరు రాజగును.

ఘటా(కుండ)కృతిలో సూర్యమండలము కనిపించిన దేశములో ఆకలితో పీడితులై జనులు ప్రాణములను విడుతురు. ఖండాకారముగా కనిపించిన ప్రజలకు నాశనము కలుగును. కాంతిహీనముగా కనపడిన భయమును కలిగించును. తోరణరూపములో కనిపించిన పట్టణములు నాశనమగును. ఛత్ర (గొడుగు) సమానముగా కనిపించిన దేశము నాశనము పొందును.

సూర్యమండలము ధ్వజము, చాపసమానముగా కనిపించిన యుద్ధము జరుగును. సూర్యమండలములలో నల్లనిరేఖ కనిపించిన మంత్రివలన రాజు మరణించును. ఉల్క, పిడుగు మెరుపులు ఉదయించిన సూర్యునిపై కనపడిన వర్తమాన రాజుకు మరణము కలుగును. ఇతరరాజు పట్టాభిషిక్తుడగును. ప్రతిరోజు ఉదయాస్తమయములలో పరివేషముతో సూర్యమండలమున్న, లేక రక్తవర్ణముతోనున్న నిశ్చయముగా ఇతర వ్యక్తి రాజగును.

రెండుసంధ్యలలో శస్త్రసమాన స్వరూపముతో మేఘము సూర్యమండలముపై కప్పబడిన యుద్ధము జరుగును. మృగ,మహిషి(ఎద్దు) పక్షి ,ఖర(గాడిద) సమానమైన స్వరూపముతో మేఘము సూర్యమండలము పై ఆచ్ఛాదితమైన (కప్పబడిన) భయమును కలిగించును.

అగ్నితో కాల్చబడిన బంగారము పరిశుద్ధమైనట్లు సూర్యపరితాపముతో పీడింపబడి నక్షత్రము శుద్ధమగును. సూర్యమండలమునకు ఉత్తరదిశలో ప్రతి సూర్యుడు కనిపించిన వర్షము కురియును. దక్షిణదిశలో కనిపించిన గాలి వాన వచ్చును. రెండువైపుల కనిపించిన రాజుకు, క్రింది వైపుకి కనిపించిన ప్రజలకు నాశము కలుగును. ఆకాశములో రక్తసమానముగా ఎరుపు వర్ణము, లేక ధూళితోకూడిన ఎరుపువర్ణముతో సూర్యమండలము కనిపించిన రాజు తొందరగా నశించును.

సూర్యమండలము కృష్ణ, విచిత్ర,నీలవర్ణములతో కూడి భయంకరముగా కనిపించిన, లేక సంధ్యాకాలములో అడవిజంతువులు భయంకర శబ్దములు చేసిన ప్రజలు నాశనమగుదురు. స్వచ్ఛము,అఖండితము స్పష్టము, అతిస్వచ్ఛము, దీర్ఘకిరణములు, వికార రహితవర్ణము, చిహ్నములతో సూర్యబింబము కనిపించిన లోకమునకు శుభమును కలిగించువాడగును.

మూడవ ఆదిత్యచారాధ్యాయము సమాప్తము



4. చంద్ర చారాధ్యాయము

సూర్యుడు ఎదురుగా నున్న కుండకు ముందు సగభాగము ప్రకాశము అనగా శుక్లవర్ణము దానికి వ్యతిరేకదిశలో కుండ సగభాగము తననీడతో చీకటి అనగా కృష్ణవర్ణముతో నుండును. అదే విధముగా సూర్యునికి క్రిందిభాగములో ఎదురుగానున్న చంద్రుని అర్ధభాగము ప్రకాశవంతమై శుక్లవర్ణముతో, సూర్యునికి వ్యతిరేక దిశలో నున్న చంద్రుని నీడతో అర్ధభాగము అంధకారమై కృష్ణవర్ణముతో కనపడును.

అద్దముపై పడిన సూర్యకిరణముల ప్రతిబింబముతో గృహములోపల అంధకారము దూరమగును. అదేవిధముగా చంద్రునిపైపడు సూర్యకిరణముల ప్రతిబింబముతో రాత్రులందు అంధకారము నష్టమగును. వెన్నెల వ్యాపించును. సూర్యుని క్రిందిభాగమును వదులుతు చంద్రుని కాంతి ఎంతక్రిందకు వెళ్ళునో అంతవరకు చంద్రుని క్రిందిభాగము క్రమముగా సూర్యుని కాంతి వలన ప్రకాశమానమగును. అపరాహ్ణకాలపు వెలుగులో కుండ పశ్చిమ భాగములో శుక్ల (వెలుగు) వర్ణము పెరుగును. అదేవిధముగా ప్రతిరోజు సూర్యుని నుండి దూరములో సంచరించు చంద్రుని శుక్లత్వము వృద్ధిని పొందును.

చంద్రుడు జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ నక్షత్రములకు దక్షిణములో సంచరించు సమయములో బీజములు,జలచరములు,వనములకు నాశనము కలుగును. పైన తెల్పిన నక్షత్రములకు ఉత్తరదిశలో చంద్రుడు పయనించిన శుభము కలుగును. విశాఖ అనురాధ నక్షత్రములకు దక్షిణభాగములో చంద్రుడు పయనించిన పాపఫలము నిచ్చును. మఘ విశాఖ నక్షత్రములకు మధ్యలో చంద్రుడు పయనించిన శుభఫలమునిచ్చును.

రేవతి నక్షత్రమునుండి ఆరు నక్షత్రములు (రేవతి,అశ్విని,భరణి,కృత్తిక, రోహిణి, మృగశిర) అనాగత(అప్రాప్తము గతించక)మై చంద్రునితో కలియును. ఆర్ద్ర నుండి పన్నెండు నక్షత్రములు (ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, మఘ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనూరాధ) మధ్యభాగముతో చంద్రునితో కలియును. జ్యేష్ఠ నుండి తొమ్మిది నక్షత్రములు (జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణ,ధనిష్ఠ,శతభిష,పూర్వాభాద్ర పద,ఉత్తరాభాద్రపద) అతిక్రాంత (అతిక్రమించి)మై చంద్రునితో కలియును. దీని అర్థమేమనగా చంద్రుడు ఉత్తరాభాద్రతో ప్రవేశించిన సమయములోనే రేవతి నక్షత్రముతో సంయోగమగును. అదే విధముగా రేవతిలో ప్రవేశించిన వెంటనే అశ్వినితో – ఇదేవిధముగా మిగిలిన నక్షత్రములతో సంయోగమగును. ఆర్ద్రాది పన్నెండు నక్షత్రములలో మధ్యలోనికి వెళ్ళిన తర్వాత సంయోగము కలుగును. జ్యేష్ఠాది తొమ్మిది నక్షత్రముతో ముందు నక్షత్రములోనికి చంద్రుడు వెళ్ళిన తర్వాత వెనుక నక్షత్రముతో సంయోగమును పొందును. మూల నక్షత్రములోనికి వెళ్ళిన తర్వాత జ్యేష్ఠా నక్షత్రముతో సంయోగము పొందును. అదేవిధముగా మిగిలిన నక్షత్రములను గ్రహించవలెను.

చంద్రశృంగము కొద్దికొద్దిగా ఉన్నతమవుతు నౌకవలె విశాలమైన నావికులకు

కష్టము, మిగిలిన జనులకు శుభదాయకమగును. చంద్రుని శృంగము సగము ఉన్నతమై నాగలి ప్రమాణమును పొందిన, హల (నాగలి)వాహకులకు, హలముతో జీవించువారికి పీడకలుగును. రాజులకు కారణములేకుండ స్నేహము కలుగును. సుభిక్షమగును. చంద్రుని దక్షిణశృంగము సగముపైకి లేచినట్లు కనపడిన అది దుష్టలాంగల నామక(దక్షిణ శృంగము సగము లేచుట) సంస్థానమగును. దీని వలన పాండ్యదేశపు రాజుకు తన సేనలవలన మృత్యువు కలుగును.

చంద్రశృంగము సమానముగా కనిపించిన ప్రథమ దినమువలె సుభిక్షము క్షామము వృష్టి(వర్షము) కలుగును. అనగా పాడ్యమిదినములో వలె సుభిక్ష క్షామవృష్టులు ఒకనెల వరకుండును. దండాకారముగా చంద్రుడు కనిపించిన గోవులకు పీడకలుగును. రాజు కఠోరదండము నిచ్చువాడగును. చంద్రుడు ధనుషాకారములో నున్న (కార్ముక సంస్థానము) యుద్ధము జరుగును. ధనుస్సు జీవ(అల్లెతాడు)మున్న దిశలో నున్న రాజుకు జయము కలుగును. యుగసంస్థానములో చంద్రుని దక్షిణ శృంగపు అగ్రభాగము కొంచెము ఉన్నతమైన పార్శ్వశాయీ సంస్థానమగును. దీనివలన ధనవంతులకు వ్యాపారులకు వర్షమునకు నాశము కలుగును. ఎక్కువఎత్తుకి ఉన్న కారణముగా చంద్రుని ఒకశృంగము అధోముఖమైన ఆర్జితనామక సంస్థానమగును. దీని వలన మానవులకు పశువులకు దుర్భిక్షము కలుగును.

చంద్రుని బింబమునకు నాలుగు వైపుల గోలాకారపు రేఖ కనపడిన అది కుండ సంజ్ఞక సంస్థానమగును. దీని వలన రాజులు తమస్థానమును వదలి వెళ్ళి కలసివచ్చును. ముందుతెల్పిన సంస్థానముల కభావములో చంద్రశృంగము ఉత్తరదిశవైపుకి లేచియున్న క్షేమము సస్యవృద్ధితో పాటు వర్షము కలిగించునదగును. చంద్రశృంగము దక్షిణదిశలకు లేచియున్న దుర్భిక్షము, భయకారకమగును. చంద్రశృంగము కనపడకున్న, క్రిందివైపుకున్న సంపూర్ణముగా కొత్తరూపములో నున్న చూచేవారిలో ఒక మనుష్యునికి మృత్యువు కలుగును.

చంద్రశృంగమునకు సంబంధించి పది విధములైన సంస్థానములను వర్ణించిన తర్వాత దానివలన ఉత్పన్నమగు అనేక విధములైన చంద్ర స్వరూపముల ఫలములను తెలిసికొనవలెను. చంద్రమండలము చాలా చిన్నదిగా నున్న దుర్భిక్షము, అధికముగా నున్న సుభిక్షము కలుగును. చంద్రబింబము మధ్యముగా నున్న అది వజ్రసంజ్ఞమగును. దాని వలన జనులు ఆకలితో భయభీతు లగుదురు. రాజుల మధ్య పరస్పరము భ్రమాత్మకస్థితి ఉత్పన్నమగును. చంద్రబింబము మృదంగాకృతిలో కనిపించిన జనులకు సుభిక్షము కలుగును. చంద్రమండలము విశాలముగానున్న రాజులకు ధనవృద్ధిని, అభివృద్ధిని కలిగించును. చంద్రబింబము స్థూల స్వరూపముతోనున్న సుభిక్షము కలుగును. సూక్ష్మస్వరూపముతో నున్న ప్రియధాన్యములుత్పత్తి చేయునదగును.

చంద్రశృంగము మంగళగ్రహముతో వేధింపబడిన దూరముగా నుండు పెద్దరాజులకు నాశనము కలిగించును. శనిచే వేధింపబడిన శస్త్ర,క్షుద్బాధలతో భయము కలుగును. బుధునితో వేధింపబడిన అనావృష్టి దుర్భిక్షము కలుగును. గురునిచే వేధింపబడిన చిన్నరాజులకు నాశనము కలుగును. ముందు తెల్పిన ఫలితములు శుక్లపక్షములోనైన స్వల్పముగా, కృష్ణపక్షములోనధికముగా జరుగును.

చంద్రబింబము బృహస్పతితో వేధింపబడిన గాంధార, సౌవీరిక, సింధు, కీర, పర్వతీయ, ద్రవిడదేశములలో పదినెలల వరకు బ్రాహ్మణులు,ధాన్యములకు నాశనము కలుగును. మంగళ గ్రహముతో చంద్ర బింబము వేధింపబడిన అశ్వాది వాహనములు ద్వారయోధులకు నాశనము కలుగును. త్రిగర్త, మాలవ, కౌలింద, గణపుంగవ, శిబి, అయోధ్యలలో నున్న జనులకు రాజులకు నాశము కలుగును. ఇదేవిధముగా కురు,మత్స్య, శక్త్యధిపతులు జనులు ఆరునెలల లోపల నాశనమగుదురు.

శని చంద్రమండలమును వేధించిన పదినెలల వరకు యోధులకు మంత్రులకు కురు వంశీయులకు పూర్వదిశలోనున్న రాజులకు నాశనము కలిగించును. బుధుడు చంద్ర మండలమును వేధించిన మగధ, మధుర, వేణానదీ తటమునందున్న దేశములలోని మనుష్యులు పీడింపబడుదురు. పశ్చిమదేశములలోని ప్రజలు అన్ని విధములైన సుభిక్షములను పొందెదరు. కేతువు చంద్ర బింబమును వేధించిన, అన్ని విధములైన శుభములు, ఆరోగ్యము సుభిక్షములు కలుగును. శస్త్రములతో జీవనము సాగించు మనుష్యులకు నాశనము కలుగును. విశేషించి దొంగలకధిక పీడ కలుగును.

గ్రహణచంద్రునిపై ఉల్కాపాతమైన సమయములో రాజు జన్మనక్షత్రములో చంద్రుడున్న ఆరాజుకు నాశనము కలుగును. చంద్రబింబము భస్మ(బూడిద) సమానమైన కాంతితో, రక్తవర్ణము కిరణరహితము కృష్ణవర్ణము ఖండితము కంపితమై కనబడిన దుర్భిక్షము కలహము రోగము దొంగలభయము కలుగును.

శివుని కొరకు పార్వతీదేవి హిమము మంచు కుందపుష్పములు లేక స్ఫటిక మణులతో సమానముగా నత్యంత సుందరముగా తయారుచేసిన చంద్రుని మనుష్యుడు రాత్రి యందు చూచిన కళ్యాణకరమగును. అనగా హిమాదులతో సమానమైన చంద్రుని రాత్రులందు చూచుట వలన అన్నివిధములైన శుభములు కలుగును.

శుక్లపక్షములో తిథులు వృద్ధిపొందుతున్నపుడు బ్రాహ్మణ క్షత్రియ ప్రజాగణములు వృద్ధిని పొందును. తిథులు తగ్గుతున్నపుడు హాని జరుగును. సమానముగానున్న సాధారణ ఫలము కలుగును. వికారరహితమైన గమనము, కిరణములు కలిగిన చంద్రుడు కుముదము మృణాళము ముక్తాహార సమానమై వర్ణము కలిగి తిథులలో హెచ్చుతగ్గులు మనుష్యుల విజయమునకు కారణమగును.

నాల్గవ చంద్రచారాధ్యాయము సమాప్తము

5. రాహు చారాధ్యాయము

కొందరి మతముననసరించి రాహునామక రాక్షసుని తల ఖండింప బడినప్పటికి అమృత పానము చేసిన కారణముగా ప్రాణముపోక గ్రహత్వము ప్రాప్తించినది. సూర్యచంద్ర స్వరూపుడైన రాహువు నలుపుగానున్న కారణముగా బ్రహ్మవరప్రసాదము వలన గ్రహణ కాలము కాక మిగిలిన సమయములో ఆకాశములో కనిపించడు. రాహువు ముఖము, తోక ఈరెండుభాగములలో విభజింపబడినవాడని, సర్పాకారము కలవాడని కొందరు తెలుపుదురు.

రాహువు ఆకారము కలిగి, రాశులలో చలించేవాడు శిరస్సు కలవాడు, బింబమువలె నున్నవాడు స్థిరమైన గతి కలవాడైన భగణార్ధ (180 డిగ్రీలు) మందున్న రవి చంద్రులను ఏవిధముగా మ్రింగగలడు. రాహువు అనిశ్చిత గతి కలిగినవాడైన గణితముతో నతనిని ఏవిధముగా తెలిసికొనగలము. ముఖము పుచ్ఛాది అంగముల కలవాడైన అమావాస్య పూర్ణిమలు కాక రెండవ మూడవ నాల్గవ ఐదవరాశులలో నున్న సూర్యచంద్రులను ఎందుకు మ్రింగలేడు అనగా అమావాస్య పూర్ణిమలు వదలి మిగిలిన సమయములలో గ్రహణము ఎందుకురాదు.

రాహువు సర్పాకారము కలవాడైన ముఖముపుచ్ఛముతో ఆరురాశుల దూరములో నున్న రవిచంద్రులను గ్రహణ సమయములో ముఖ పుచ్ఛముల మధ్యలో భగణార్ధమును కూడ ఆక్రమించగలడు. ఇద్దరు రాహువులున్న ఒకరాహువుతో చంద్రుని గ్రస్తాస్తము, లేక గ్రస్తోదయము కలుగును. అదే విధముగా చంద్రునికి ఆరంశముల దూరములో నున్న సూర్యుని కూడ మొదటి రాహువువలె రెండవ రాహువు గ్రహించుట చూడవచ్చును. రెండు రాహువులున్న ఒకడు నియతిగతి, రెండవవాడు అనియతగతి కలవాడగును. అది ఉచితముకాదు. ఎందువలననగా అనియగతి కలవాడైన రాహువు వలన చంద్రుని గ్రస్తోదయము లేక గ్రస్తాస్తమైన తక్షణమే, అతనికి విపరీత దిశలో ఆరు అంశముల (180 డిగ్రీల) దూరములో నియతగతిలో నున్న రాహువు సూర్యుని కూడ గ్రహించవలెను. కాని ఆవిధముగా ఇంతవరకు జరగలేదు.

చంద్రుడు గ్రహణకాలములో భూఛాయలో,సూర్యగ్రహకాలములో సూర్య మండలములో ప్రవేశించును.అందువలన చంద్రగ్రహణస్పర్శ పశ్చిమదిశ, సూర్య గ్రహణ స్పర్శ పూర్వదిశలో నారంభముకాదు.సూర్యుని ఆవరణవశమున వృక్షపుఛాయ ఒకవైపుకే పెరుగును.అదేవిధముగా సూర్యుని ఆవరణవశమున భూమిఛాయ ప్రతిరాత్రిలో పెద్దదిగానగును.

సూర్యుని నుండి ఏడవరాశిలో నున్న పూర్వాభిముఖ గతుడైన చంద్రుని కాంతి వృత్తము తక్కువగా ఉత్తరము లేక దక్షిణశరముపై నుండును. ఆసమయములో

పూర్వాభి ముఖముగా చలించు చంద్రుడు భూఛాయలో ప్రవేశించును.

అన్నిదేశములో చంద్రగహణము ఒకే రూపముతో సూర్యగ్రహణము విభిన్నరూపము తో కనిపించును. దానికి కారణము మేఘమువలె క్రిందనున్న చంద్రుడు పశ్చిమవైపు నుండి వచ్చి సూర్యబింబమును మూసివేయును. అందువలన వివిధ దేశములలో దృష్టివశమున అనేక రూపములుగా కనిపించును. చంద్రగ్రహణమును ప్రతిదేశములో సమానరూపములో చూడవచ్చును. చంద్రుని ఆవరణము పెద్దదగుట వలన అర్ధగ్రసిత చంద్రబింబములో కుంఠ విషాణ(స్థూలశృంగము)మగును. సూర్యునిఆవరణము చిన్నదగుట వలన అర్ధగ్రస్త మండలములో తీక్ష్ణవిషాణ(సూక్ష్మశృంగము)మగును. ఈవిధముగా దివ్యదృష్టి కలిగిన ఆచార్యులు గ్రహణకారణమును తెలిపిరి. కాని గ్రహణము నకు రాహువు కారణముకాదు. ఈవిషయములో రాహువు కారణము కాదనుట శాస్త్ర మర్యాదను పాటించుటకేనని గ్రహించవలెను.

పూర్వకాలములో బ్రహ్మ రాహునామక అసురునకు ఒక వరమునిచ్చెను. గ్రహణకాలములో ప్రజలద్వార సమర్పించు హుతాంశము (హవన ఆహుతులు)తో నీకు తృప్తి కలుగుతుంది. ఈకారణముగా గ్రహణ సమయములో సూర్య చంద్రులతో రాహువునకు సాన్నిధ్యమేర్పడును. రాహువు వలననే చంద్రుని దక్షిణోత్తర గతికలుగును.

గర్గాది ఆచార్యులు ఉత్పాతముల ద్వారా గ్రహణకారణములను తెలిపిరి వారి ద్వార తెలిపిన గ్రహణజ్ఞానము స్పష్టముగాలేదు. పూర్వకాలము కంటె భిన్నమైన కాలములో కూడ ఉత్పాతముల ద్వార గ్రహణము జరిగినది. దానిని ఉత్పాతమందురు. కొందరి మతముననుసరించి అమావాస్య పూర్ణిమలలో ఐదుగ్రహముల యుతి జరిగిన సమయము లో గ్రహణము సంభవించదు. గ్రహణమునకు పూర్వము అష్టమి దినములో జలములో నూనెపోసి స్పర్శమోక్షముల దిశను తెలిసికొనవలెను. అనగా గ్రహణమునకు పూర్వము అష్టమిదినము జలములో నూనెపోయవలెను. అదిఏవైపుకి వ్యాపించిన ఆవైపు స్పర్శకాలమని, దానికి వ్యతిరేక దిశ మోక్షకాలమని తెలిసికొనవలెను.

అవనతి వలన సూర్యగ్రాసము,వలనము అవనతి వలనదిశ,మరియు తిథ్యంతము వలన గ్రహణకాలమును ఏవిధముగా తెలిసికొనవలెనో నేను (గ్రంథకారుడు) కరణగ్రంథము (పంచ సిద్ధాంతిక)లో తెలిపితిని. కల్పాది నుండి ఆరేసి మాసముల వృద్ధితో ఏడుపర్వములకు బ్రహ్మ,చంద్ర,ఇంద్ర,కుబేర,వరుణ,అగ్ని,యములు దేవత లగుదురు. బ్రహ్మపర్వములో గ్రహణమైన బ్రాహ్మణులకు పశువులకు ఉన్నతి కుశలము, ఆరోగ్యము, ధాన్యవృద్ధి జరుగును. పండితులకు పీడ అనావృష్టి కలుగును. ఇంద్రపర్వములో రాజుల మధ్య విరోధము, శరదృతువులో ఉత్పన్నమగు ధాన్యనాశము, జనులకు మంగళము కలుగును. కుబేరపర్వములో ధనవంతుల ధననాశము, సుభిక్షము వరుణపర్వములో

రాజులకశుభము, ఇతర జనులకు శుభము ధాన్యవృద్ధి కలుగును. అగ్నిపర్వములో ధాన్యవృద్ధి,ఆరోగ్యము,అభయము వర్షము కలుగును. దీనికి వేరొక నామము మిత్రము యమపర్వములో వర్షాభావము,దుర్భిక్షము,ధాన్యనాశము కలుగును.ఈ పర్వములు కాక మిగిలిన పర్వములలో గ్రహణము కలిగిన ఆకలిబాధ అనావృష్టి అశుభఫలము కలుగును.

గణితగత గ్రహణకాలము కంటె ముందు లేక తర్వాత గ్రహణము కనిపించిన దానికి క్రమముగా వేలాహేనము,అతికాలగ్రహణమందురు. వేలాహీన పర్వములో గర్భనాశము, శస్త్రకోపము కలుగును. అతివేల కాలములో గ్రహణము జరిగిన ఫల పుష్పనాశము, భయము, ధనధాన్యనాశము కలుగును.వేలాహీనము,అతివేల కాలములలో కలుగు గ్రహణఫలము నేను (గ్రంథకారుడు) పూర్వశాస్త్రముల ననుసరించి తెలిపితిని.కాని స్పష్టమైన గణితజ్ఞానము కలిగిన దైవజ్ఞుని వలన సిద్ధించు గణితకాలము ఎప్పుడు అసత్యముకాదు.

ఒకేనెలలో సూర్యచంద్ర గ్రహణములైన తమ సేనల వలన క్షోభ కలిగి రాజులకు నాశనము కలుగును. యుద్ధము జరుగును. సూర్యచంద్రుల పాపగ్రహములచే చూడబడిన గ్రహణము వలన ఉదయము లేక అస్తమయమైన,శరదృతువులోఉత్పన్నమగు ధాన్యములకు రాజుకు నాశనము కలుగును.మహామారి (రోగములు) దుర్భిక్షములు కలుగును.

సూర్యుడు లేక చంద్రుడు సగముదయించి రాహువుతో గ్రహింపబడిన నిషాదజాతి జనులకు, కష్టజీవులకు, అన్నివిధములైన యజ్ఞములకు నాశము కలుగును. గ్రహణ దినము యొక్క దినమానము రాత్రిమానములను ఏడుతో భాగించిన ఏడు భాగములగును. ఈ ఏడుభాగములలో ప్రతిభాగములో సూర్యుడు లేక చంద్రుని స్పర్శ లేక మోక్షము జరిగిన వేర్వేరు ఫలితములు క్రింద తెలిపిన విధముగా చెప్పబడెను.

ఆకాశములో ప్రథమభాగములో చంద్రుడు లేక సూర్యుడు గ్రస్తమైన అగ్నికార్యము లతో జీవించువారు, అధిక గుణవంతులు, బ్రాహ్మణులు ఆశ్రమవాసులు నాశనమగుదురు. ద్వితీయభాగములో చంద్రుడు లేక సూర్యుడు గ్రస్తమైన కృషీవలులు, పాఖండులు, వ్యాపారులు, క్షత్రియులు, సేనాపతులు నాశనమగుదురు. మూడవభాగములో చంద్రుడు లేక సూర్యుడు గ్రస్తమైన చిత్రలేఖకులు, శూద్రులు,మ్లేచ్ఛులు, మంత్రులు నాశనమగుదురు. నాల్గవభాగములో చంద్రుడు లేక సూర్యుడు గ్రస్తమైన రాజు, మధ్యదేశము నాశనమగును. కాని ధనధాన్య విషయములో సమృద్ధి కలుగును.ఐదవభాగములో నైన పశువులు, మంత్రులు, అంత:పుర వాసులు, వేశ్యాజనులు నాశనమగుదురు. ఏడవభాగములో నైన దొంగలు గుహలలో నివసించువారు నాశనమగుదురు.ఏ ఖాంశములో మోక్షము కలుగునో ఆఖాంశములో ఆవ్యక్తులకు తెల్పిన అశుభ ఫలము కలగదు. వారికి శుభఫలము కలుగును. సూర్యచంద్ర గ్రహణములు ఉత్తరాయణములోనైన బ్రాహ్మణ క్షత్రియులకు, దక్షిణాయణ

లోనైన వైశ్యశూద్రులకు నాశనము కలుగును. ఉత్తర పూర్వ దక్షిణ పశ్చిమదిశలలో ఏదిశలోనైన రాహువు కనిపించిన ప్రదక్షిణ క్రమములో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు నాశనము కలిగించువాడగును. నాలుగు విదిక్కులలో (ఈశాన్య ఆగ్నేయ నైరృతి వాయువ్య) నున్న రాహువు మ్లేచ్ఛ పథిక (ప్రయాణికులు) అగ్నికార్య జీవులకు నాశనము కలిగించును. దక్షిణ దిశలో రాహువు కనపడిన జలచరములు, ఏనుగులు, ఉత్తరదిశలో కనపడిన ఆవులు ఎద్దులు నాశనమగును. పూర్వదిశలో రాహువు కనపడిన భూమండలమంత జలముతో నిండును. పశ్చిమదిశలో కనపడిన కృషకులు,సేవకులు,బీజములకు నాశనము కలుగును.

మేషరాశిగత సూర్య చంద్రులకు గ్రహణమైన పాంచాల, కలింగ, శూరశేన, కాంభోజ, ఓఢ్ర, కిరాతులు, శస్త్రములతో జీవనము చేయువారు, అగ్ని కార్యముతో జీవనము చేయువారు పీడితులగుదురు. వృషభరాశిగత సూర్యచంద్రులకు గ్రహణమైన గోపాలకులు పశువులు పూజనీయ మనుష్యులు పీడను పొందెదరు. మిథునరాశిలోనున్న సూర్యచంద్రులకు గ్రహణమైన ఉత్తమస్త్రీలు రాజు మంత్రులు ప్రాణధారులైన అన్యజీవులు, కళాకారులు, యమునానదీ తటములో నివాసమున్నవారు, బాహ్లిక మధ్య దేశములు (సాకేత, మిథిల,కౌశాంబి,కౌశిక,అహిక్షేత్ర, గయ, విధ్యాదులు) సుహ్నా దేశవాసులు పీడితులగుదురు.

కర్కాటకరాశిలో సూర్యచంద్రులకు గ్రహణమైన అభీర శబర పహ్లావ (దక్షిణదేశ రాజ వంశములు)యుద్ధవీరులు, మత్స్య, కురు, శకట పాంచాల దేశనివాసులకు అంగహీన మనుష్యులకు పీడ కలుగును. సింహరాశిలో సూర్యచంద్రులకు గ్రహణమైన పులింద,మేకల (పర్వత విశేషము) నివాసులు,బలమైన జంతువులు రాజులు, రాజసమానులు, వనములో నివసించువారు పీడింపబడుదురు. కన్యారాశిలో సూర్యచంద్రాదులకు గ్రహణమైన ధాన్యము, కవి,లేఖక,గానవిద్యలు తెలిసినవారు,రాళ్లతో జీవించువారు,త్రిపురనామక దేశమునకు ధాన్యమునకు నాశనము కలుగును.

తులారాశిలో నున్న సూర్యచంద్రులకు గ్రహణమైన అవంతిదేశములో నివసించువారు,పశ్చిమ సముద్రతీరమందుడువారు,సజ్జనులు, వ్యాపారులు దశార్ణ, మరు, కచ్ఛ దేశవాసులు నాశనము పొందుదురు. వృశ్చికరాశిలో సూర్యచంద్రులకు గ్రహణమైన ఉదుంబర,మద్ర,చోలదేశవాసులకు,వృక్షములు, యుద్ధముచేయు మనుష్యులకు కఠోరశస్త్రధారణ చేయువారికి నాశనము కలుగును.

ధనూరాశిలో నున్న సూర్యచంద్రులకు గ్రహణమైన మంత్రి, ప్రధానమనుష్యులు, గుర్రములు విదేహదేశము (మిథిల)లో నివసించువారు, బాహుయుద్ధము చేయువారు,

పాంచాల దేశములో నివసించువారు, వైద్యులు వ్యాపారులు, కఠోరశస్త్రములను ఉపయోగించు వారికి నాశనము కలుగును. మకరరాశిలో నున్న సూర్యచంద్రులకు గ్రహణమైన మత్స్యములు, మంత్రులు నీచకర్మ చేయు మనుష్యులు, మంత్ర, ఔషధములు తెలిసినవారు, వృద్ధులు శస్త్రములతో జీవించువారు నాశనము పొందెదరు.

కుంభరాశిలో నున్న సూర్యచంద్రులకు గ్రహణము కలిగిన పర్వతములందు నివసించు మనుష్యులు, ఇతరదేశములలో నుండువారు, బరువులు మోయువారు, దొంగలు అహీరులు,దరదదేశవాసులు, ప్రధానమనుష్యులు, సింహనగర బర్బరదేశములో నుండు మనుష్యులు నాశనము పొందెదరు. మీనరాశిలో నున్న సూర్యచంద్రులకు గ్రహణము కలిగిన సముద్రపుఒడ్డున,సముద్రజలములోనుత్పన్నమగు ద్రవ్యములు,అడవి మనుష్యులు, బుద్ధిమంతులు,జలవిక్రయముతో జీవనముచేయువారు నాశనము పొందెదరు. నక్షత్రఫలము కూర్మవిభాగముద్వారా తెలుపవలెను. ఏనక్షత్రములో సూర్యచంద్రుల గ్రహణమగునో కూర్మవిభాగములో ఆనక్షత్రముండు దేశములోని ప్రజలు పీడను పొందెదరు.

సవ్య, అపసవ్య, లేహ, గ్రసన, నిరోధ, అవమర్దన, ఆరోహ, ఆఘ్రాత మధ్యతమ, తమోంత్య - ఈ పది రకములైన గ్రాసము (గ్రహణము)లు రవి చంద్రులకగును. గ్రహణ సమయములో సూర్యచంద్రుల సవ్య(దక్షిణ)భాగములో రాహువు గమనము చేసిన భూమి జలముతో సంపూర్ణము, హర్షితము భయరహితమగును. అపసవ్యభాగములో గమనము చేసిన రాజులను దొంగలకు పీడ ప్రజలకు హాని కలుగును. రాహువు నాలుకవలె సూర్యచంద్రులను గ్రహణకాలములో రుచిచూచిన(నాకిన) దానిని లోహనామక గ్రహణ మందురు. ఈవిధముగా గ్రహణమైన భూమిలోని అన్ని ప్రాణులు సంతోషముతో, జలముతో సంపన్నమగును.

సూర్యచంద్ర బింబముల తృతీయ,చతుర్థ, అర్ధభాగములను రాహువు గ్రహించిన **గ్రసన**నామక గ్రాసమగును. దీనివలన ఐశ్వర్యవంతుడైన రాజుకు ధననాశనమగును. ఆదేశములోనున్న జనులకు కూడ ధననాశనమగును. రాహువు సూర్యచంద్రులను నాలుగువైపుల నుండి గ్రహించి మధ్యభాగములో పిండాకారమునున్న **నిరోధ**నామక గ్రాసమగును. దీనివలన భూమిపైనున్న సర్వప్రాణులకు ఆనందము కలుగును.

సూర్యచంద్ర మండలములలో ఒకప్రదేశము గ్రహణకాలములో బాష్పయుత నిశ్వాసవాయువుతోమలినమైన అద్దమువలె కనిపించిన దానిని **ఆఘ్రాత**నామక గ్రాసమందురు. దీని వలన జగత్తులో ప్రాణులఉత్పత్తి,వర్షవృద్ధి కలుగును. సూర్యచంద్ర బింబముల మధ్యభాగము రాహువుతో మూయబడి నాలుగువైపుల నిర్మలమైన **మధ్యతమ**నామక గ్రాసమందురు. దీనివలన మధ్యదేశములో నష్టము,ఉదరసంబంధ

రోగము కలుగును. ఈవిధమైన గ్రహణము సూర్య గ్రహణములో మాత్రమే జరుగును. సూర్య బింబముకన్న చంద్రబింబము చిన్నదిగానుండును. అందువలన చంద్ర గ్రహణము లో పైనతెల్పిన గ్రాసము సంభవముకాదు. సూర్యచంద్ర బింబముల చివరి భాగములో ఎక్కువగ,మధ్యభాగములో తక్కువగా రాహురూపము అంధకారముతో కనిపించిన **తమోంత్య** నామక గ్రాసమగును. దీని వలన సస్యనాశము జనులకు దొంగలకు భయముత్పన్నమగును.

సూర్యచంద్ర బింబముల గ్రహణసమయమున రాహువు వర్ణము తెల్లగానున్న కల్యాణము శుభము కలుగును. కాని బ్రాహ్మణులకు పీడ కలుగును. అగ్నివర్ణముతో నున్న అగ్నిభయము కలుగును. అగ్నికార్యముతో జీవనము చేయువారికి పీడకలుగును.

హరిత(ఆకుపచ్చ)వర్ణముగా నున్న రోగములవృద్ధి సస్యనష్టము కలుగును. పీత(పసుపు)వర్ణమైన శీఘ్రగాములైన పశువులు, బలవంతులు మ్లేచ్ఛజాతులకు నాశము కలుగును. దుర్భిక్షమగును. రక్తవర్ణమైన దుర్భిక్షము అనావృష్టి పక్షులకు పీడకలుగును. ధూమ్ర(పొగ)వర్ణమైన కళ్యాణము సుభిక్షము అల్పవృష్టి కలుగును. పావురమువలె రక్తపీత శ్యామ (నలుపు)వర్ణమైన ఆకలిబాధ దుర్భిక్షము కలుగును.

పావురమువలె లేక నల్లని వర్ణమున్న శూద్రులకు వ్యాధి కలిగించును. స్వచ్ఛమణివలె పీతవర్ణముతో కనపడిన వైశ్యులకు నాశము సుభిక్షము కలుగును. అగ్నిజ్వాల వలె కనపడిన అగ్నిభయము కలుగును. గైరిక(బంగారు, జేగురురాయి)వర్ణముతో కనపడిన యుద్ధము జరుగును. గరికవలె నల్లని లేక పసుపు వర్ణముతో కనపడిన మహామారి వ్యాపించును. పాటల పుష్పమువలె తెల్లని వర్ణము కనిపించిన పిడుగుపడు భయము కలుగును. ధూళి లేక మిశ్రితవర్ణముతో రాహువు కనిపించిన క్షత్రియులకు వర్షమునకు నాశము కలుగును.

గ్రహణకాలములో సూర్యచంద్రులపై బుధదృష్టి పడిన నెయ్యి లేక తేనె,నూనె మరియు రాజులకు నాశము కలుగును. కుజదృష్టి పడిన యుద్ధము,అగ్నిభయము దొంగల భయము కలుగును. శుక్రదృష్టి పడిన ధాన్యములకు నాశము భూమిపై అనేక విధములైన కష్టములు కలుగును. శనిదృష్టి వలన దుర్భిక్షము, అనావృష్టి దొంగలభయము కలుగును. గ్రహదృష్టి వలన స్పర్శ మోక్ష సమయములలో జరుగు అశుభ ఫలము చెప్పబడెను. గురుదృష్టి వలన కూడ ప్రజ్వలిత అగ్నివలన జలము నాశనమగునట్లు అశుభఫలముల వలన నాశము కలుగును.

సూర్యచంద్ర గ్రహణ సమయములో వాయువు, ఉల్కాపాతము, ధూళివర్షము, భూకంపము,అంధకారము,వజ్రపాతమున్నగు ఉత్పాతములు కలిగిన ఆరేసి మాసములకు మరల గ్రహణము సంభవించును. అనగా సూర్యచంద్ర గ్రహణములలో

వేగముగా గాలి వీచిన ఆరునెలల తర్వాత ఉల్కాపాతము, పన్నెండు నెలల తర్వాత ధూళివర్షము, పద్దెనిమిది మాసముల తర్వాత భూకంపము, ఇరవైనాలుగు మాసముల తర్వాత అంధకారము, ముప్పైమాసముల తర్వాత వజ్రపాతము జరిగిన తర్వాత ముప్పైఆరు మాసములకు మరల గ్రహణము కలుగును.

సూర్యుడు లేక చంద్రుని ఒకరాశిలో అల్పాంశములో కుజాది గ్రహములకు శరాభావమైన అవిగ్రస్తమని పిలువబడును. ఈవిధముగా కుజగ్రహము గ్రస్తమైన అవంతిదేశములో నున్న మనుష్యులు, కావేరి నర్మదానదీ తీరములో నుండేవారు గర్వముతో కూడిన రాజులు పీడితులగుదురు.

బుధగ్రహము గ్రస్తమైన గంగా యమునానదుల మధ్యభాగము నేపాలము పూర్వీసముద్రము, శోణనదము, స్త్రీ,రాజు,యోధులు, బాలకులు విద్వాంసులందరు నాశనమగుదురు. గురుగ్రహము గ్రస్తమైన పండితులు,రాజు,మంత్రి,ఏనుగులు, గుర్రములు సింధునదీ తీరము నందున్న వారు, ఉత్తరదిశలో నున్నవారు నాశనమగుదురు. శుక్రగ్రహము గ్రస్తమైన దాశేరక, కైకయ (కాశ్మీరము) శిభిదేశములలో నున్న మనుష్యులు, స్త్రీజనము, మంత్రులందరు పీడితులగుదురు. శనిగ్రహము గ్రస్తమైన మరుభూమి,పుష్కర, సౌరాష్ట్ర దేశములలో నివసించు జనులు, గోస్వాములు, పారియాత్ర పర్వతము నందుండువారు నాశనమగుదురు.

కార్తీకమాస అమావాస్యలో సూర్యగ్రహణము పూర్ణిమలో చంద్రగ్రహణము క్రమముగానైన అగ్నితో జీవించువారు (కంసాలి కమ్మరి) మగధదేశములో నివసించు వారు, పూర్వదిశలోని రాజులు, కోశల,కల్మాష,శూరసేన,కాశీవాసులు పీడితుల గుదురు. మంత్రులు భృత్యుల (సేవకులు)తో కూడి కళింగదేశపు రాజు నాశనమగును. రాహువు క్షత్రియులకు సంతాపమును,జగమునకు కళ్యాణము సుభిక్షమును కలిగించును.

మార్గశీర్షమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము, పౌర్ణమిలో చంద్ర గ్రహణమైన కాశ్మీర,కౌశల,పుండ్రదేశములలో నుండువారు, మృగములు, పశ్చిమ దేశముల వారు, సోమ రసమును త్రాగువారు నాశనమగుదురు. జగత్తుకు సువృష్టి, క్షామము, సుభిక్షము కలుగును.

మాఘమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము, పౌర్ణమిలో చంద్ర గ్రహణము కలిగిన మాతాపితల భక్తులు, వశిష్ఠగోత్రము వారైన బ్రాహ్మణులు స్వాధ్యాయ ధర్మనిరతులు, ఏనుగులు,గుర్రములు,వంగ,అంగ,కాశీదేశవాసులు పీడితులగుదురు. జగత్తులో వ్యవసాయ దారుల కోరికననుసరించి వర్షము కురియును. ఫాల్గుణమాసములో అమావాస్యలోసూర్యగ్రహణము,పౌర్ణమిలో చంద్ర గ్రహణము కలిగిన వంగ,అశ్వక,అవంతి

మేకలదేశములలో నుండువారు, నాట్యకారులు, ధాన్యములు, ఉత్తమస్త్రీలు,ధనుస్సులు నిర్మించువారు,శిల్పులు క్షత్రియులు తాపసులు పీడితులగుదురు.

చైత్రమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము, పౌర్ణములో చంద్రగ్రహణమైన చిత్రకారులు లేఖకులు,గానవిద్యానిపుణులు,వేశ్యాదులు,వేదవిదులు, బంగారు వ్యాపారులు, పౌండ్ర,ఓఢ్ర,కైకయ,అశ్మకదేశములలో నున్నవారు పీడితులగుదురు. భూమిపై ఇంద్రుడు కొన్నిచోట్ల అధికవర్షము, కొన్నిచోట్ల అల్పవర్షము కలిగించును.వైశాఖమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము,పౌర్ణమిలో చంద్రగ్రహణ మైన ప్రత్తి,నువ్వులు, పెసలు, నాశనమగును. ఇక్ష్వాకు,వైధేయ,శాక,కళింగదేశములలో ఉపద్రవము కలుగును.కాని లోకము సుభిక్షముగా నుండును.జ్యేష్ఠమాసములో అమావాస్యలో సూర్యగ్రహణ మైన, పౌర్ణమిలో చంద్రగ్రహణమైన రాజు,బ్రాహ్మణులు,రాజపత్ని,ధాన్యము,వర్షము, మహాగణము, ఉత్తరదిశలో నుండు మనుష్యులు, సాల్వదేశీయులు, నిషాదులందరికి నాశనము కలుగును.

ఆషాఢమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము పౌర్ణమిలో చంద్ర గ్రహణమైన ఉదపానము(వాపి కూప తటాకములు) నదీతీరములో నివసించు మనుష్యులు, నదీప్రవాహము ఫలమూలములను తిని బ్రతికేవారు, గాంధార,కాశ్మీర,పులింద,చీన దేశస్థులు నాశనమగుదురు. భూమిపై అక్కడక్కడ వర్షములు కురియును.

శ్రావణమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము, పౌర్ణమిలో చంద్ర గ్రహణ మైన కాశ్మీర,పులింద,చీన,యవన,కురుక్షేత్ర,గాంధార,మధ్యదేశ,కాంభోజ దేశములలో నివసించు వారు,గుర్రములు గాడిదలు, శరదృతువులోనుత్పన్నమగు అన్నము ఇవన్ని నాశనమగును.ఇతర దేశములలో మనుష్యులు అన్నోత్పత్తి అధికమగుటవలన సుఖ సంతోషములతో నుందురు.భాద్రపదమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము, పౌర్ణమిలో చంద్రగ్రహణ మైన కళింగ వంగ మగధ సౌరాష్ట్ర మ్లేచ్ఛ సువీర దరద అశ్మక దేశములకు, స్త్రీల గర్భము లకు నాశనము కలుగును.లోకములో సుభిక్షముండును.

ఆశ్వయుజమాసములో అమావాస్యలో సూర్యగ్రహణము,పౌర్ణమిలో చంద్రగ్రహణమైన కాంభోజ,చీన,యవనదేశములలో నుండువారు,శల్యచికిత్సకులు, బాహ్లిక దేశస్థులు,సింధునదీ తటమందుండువారు. ఆనర్త,పౌండ్రదేశములో నుండువారు, వైద్యకిరాతులందరికి నాశనము కలుగును.లోకములో సుభిక్షముండును.

దక్షిణ,వామదవుడలు,దక్షిణకుక్షి (పొట్ట),వామకుక్షి, దక్షిణపాయువు (గుదము) వామపాయువు, సంచర్దనము,జరణము,మధ్యవిదరణము,అంత్యవిదరణము – ఇది సూర్య చంద్రులకు గ్రహణకాలిక దశ మోక్షములని తెలిపిరి.

చంద్రగ్రహములో దాని నివర్తము(మోక్షము) అగ్నికోణములోనైన దక్షిణ హను నామక మోక్షమగును.ఆసమయములో రాహువు ధాన్యహాని, ముఖరోగము, రాజులవలన

పీడ, సువృష్టిని కలిగించును. ఈశాన్యకోణములో బింబమునకు మోక్షము కలిగిన దానిని వామహను నామక మోక్షమందురు. ఆసమయములో రాహువు రాజకుమారులకు భయమును, ముఖరోగమును, శత్రుభయమును, సుభిక్షము నిచ్చును. గ్రహణ సమయములో బింబమోక్షము దక్షిణకుక్షి(పార్శ్వము)లోనైన **దక్షిణకుక్షి** నామక మోక్షమగును. ఆసమయములో స్త్రీలకు గర్భవిపత్తికలుగును. ధాన్యములు మధ్యమ ముగా పండును.

రాహుదర్శనము గ్రహణసమయములో నైర్రుతి,వాయవ్యకోణములలోనైన క్రమముగా **దక్షిణపాయు** నామకమోక్ష మగును. దక్షిణపాయు నామకమోక్ష స్థితిలో గుద, లింగములలో రోగము అల్పవృష్టి కురియును. **వామపాయు** నామక మోక్ష సమయములో రాజు రాణులకు నాశనము కలుగును.

చంద్ర బింబమును పూర్వభాగములో స్పర్శించి అదేదిశలో మోక్షమైన **సంఛర్దన** నామక మోక్షమగును. ఈ మోక్షము లోకములో క్షామము, ధాన్యము,సంతోషము కలిగించు నదగును. చంద్రబింబము పూర్వభాగములో స్పర్శ, పశ్చిమభాగములో మోక్షమైన **జరణ** నామక మోక్షమగును. దీనిలో ఆకలి,యుద్ధభయముతో జనులు రక్షణ పొందలేని స్థితిలో నుందురు. గ్రహణసమయములో చంద్ర బింబము మధ్యభాగములో ప్రవేశము కనిపించిన **మధ్యవిదరణ** నామకమోక్షమగును. ఇదిరాజులకు వారిసేనలకు పరస్పరము క్షోభను కలిగించును. సుభిక్షము స్వల్పవృష్టి కలిగించునదగును. గ్రహణసమయములో చంద్రబింబ ప్రాంతభాగము నిర్మలము మధ్యభాగములో అధికచీకటి కనబడిన **అంత్యవిదరణ**నామక మోక్షమగును. దీనిలో మధ్యదేశము శరదృతువులో ఉత్పన్నమయ్యే ధాన్యము నాశనమగును.

ముందుతెల్పిన చంద్రగ్రహణ మోక్షవిచారములు సూర్యగ్రహణములోను గ్రహించవలెను. అక్కడ పూర్వదిశా స్థానములో పశ్చిమదిశ, పశ్చిమదిశా స్థానములో పూర్వదిశ,ఉత్తరదిశా స్థానములో దక్షిణము, దక్షిణదిశాస్థానములో ఉత్తరదిశ కల్పన చేయవలెను. ఈ విధముగా దిక్కులను వ్యతిరేకముగా చేసి మోక్షఫలములను చూడవలెను. మోక్షమైన తర్వాత ఏడుదినములలో ధూళి వర్షము కురిసిన అన్ననాశనము, నీహార (మంచువర్షము)మైన రోగభయము, భూకంపమైన ప్రధానరాజు మరణము, ఉల్కాపాతమైన మంత్రనాశము, నానావర్ణములతో మేఘమున్న అధికభయము, మేఘగర్జనమైన గర్భనాశము (21వ అధ్యాయములో చెప్పబడిన గర్భలక్షణము) విద్యుత్పాత (పిడుగు)మైన రాజు, సర్పము,సూకరాదులకు పీడ,పరివేషమైన రోగపీడ,దిగ్దాహమైన రాజభయము, అగ్ని భయము, ప్రచండవాయు ప్రచారమైన దొంగలభయము, నిర్ఘాతమైన (సుడిగాలి) ఇంద్రధనుస్సు కనపడిన పవనసంఘాతమైన (కిరణ మేఘ వాయు సంఘర్షణము) దుర్భిక్షము, ఇతరరాజు సేనల వలన భయము కలుగును. గ్రహయుద్ధము లేక కేతుదర్శనమైన రాజుల మధ్య యుద్ధము జరుగును. నిర్మల జలవర్షము కురిసిన సుభిక్షము, గ్రహణము

వలన ఉత్పన్నమైన అశుభఫలములకు నాశనము కలుగును.

చంద్రగ్రహణమునకు పదిహేను రోజుల తర్వాత సూర్యగ్రహణమైన అవినీతి, స్త్రీ పురుషులలో ద్వేషముత్పన్నమగును. సూర్యగ్రహణమునకు పదిహేను రోజుల తర్వాత చంద్ర గ్రహణమైన బ్రాహ్మణగణములు అనేక యజ్ఞఫలములను, భోగములనను భవింతురు. ప్రజాగణము సంతోషించును.

ఐదవ రాహుచారాధ్యాయము సమాప్తము

6. భౌమచారాధ్యాయము

కుజ గ్రహమునకు ఐదు ముఖము లుండును. దానిలో మొదట ఉష్ణముఖ నామక మంగళగ్రహ లక్షణము చెప్పబడును. ఏనక్షత్రములో మంగళగ్రహముదయించునో దాని సప్తమ అష్టమ నవమ నక్షత్రములలో అదివక్రమైన ఉష్ణముఖ మంగళ నామములతో తెలుపబడును. ఉష్ణముఖ మంగళగ్రహము ఉదయించు సమయములో అగ్నికర్మచేసి జీవనముచేయు వారికి పీడ కలుగును.

తన ఉదయ నక్షత్రము నుండి పదవ,పదకొండవ,పన్నెండవ,నక్షత్రములో మంగళ గ్రహము వక్రియైనదానిని **అశ్రుమంగళ**మందురు. ఆసమయములో రసములలో దోషమును కలిగించును. రోగములవృద్ధి,అనావృష్టిని కలిగించును. తన అస్తకాల నక్షత్రము నుండి పద్నాలుగవ నక్షత్రములో మంగళగ్రహము వక్రియైన **వ్యాలముఖ** మంగళమందురు. రెండు దంతముల పశువులు అనగా పంది కుక్క మున్నగునవి సర్పము అడవిజంతువుల ద్వార పీడ కలుగును. కాని భూమిపై సుభిక్షము కలుగును.

ఏనక్షత్రములోనైన కుజగ్రహమస్తమించిన దాని పదిహేనవ పదహారవ నక్షత్రము లో వక్రమైన **రుధిరానన**మందురు. మంగళగ్రహము వక్రిగానున్నంత వరకు ప్రజలకు ముఖరోగము భయము సుభిక్షము కలుగును. తన అస్తమయ నక్షత్రము నుండి పదిహేడవ పద్దెనిమిదవ నక్షత్రములో మంగళ గ్రహము వక్రమైన **అసిముసల** మంగళమగును. దీనివలన దొంగలకు పీడ అనావృష్టి శస్త్రభయము కలుగును.

మంగళగ్రహము పూర్వఉత్తరఫల్గుని నక్షత్రములలో ఉదయించి ఉత్తరాషాఢ నక్షత్రములో వక్రమైన, రోహిణిలో అస్తమించిన మూడు (స్వర్గ,మర్త్య,పాతాళ)లోకములలో పీడకలుగును. మంగళగ్రహము శ్రవణా నక్షత్రములో నుదయించి పుష్యమి నక్షత్రములో వక్రమైన మూర్ధాభిషిక్త క్షత్రియునకు పీడ కలుగును. ఏనక్షత్రములో ఉదయించునో ఆనక్షత్ర దిశలోనున్న దేవతలకు జనులకు నాశనముకలుగును. మంగళగ్రహము మఘా నక్షత్రములో వక్రమైన పాండ్యదేశ రాజు నాశనమగును. శస్త్రభయముత్పన్నమగును. అనావృష్టి కారకుడగును. మంగళగ్రహము మఘా నక్షత్రముతో పాటు విశాఖ నక్షత్రమును కూడ

భేదన (విభజన చేయుట) చేసిన జనులకు భయంకర మరణము కలుగును.

రోహిణి నక్షత్రమునకు దక్షిణము నుండి మంగళగ్రహము సంచరించిన అధికధరలు, అనావృష్టి కలుగును. ధూమయుక్తము శిఖాయుక్తమైన మంగళగ్రహమును చూచుట వలన పరియాత్ర పర్వతముపై నివసించు జనులకు నాశనము కలుగును.

మంగళగ్రహము రోహిణి,శ్రవణ, మూల,ఉత్తర, ఉత్తరాషాఢ,ఉత్తరాభాద్ర, జ్యేష్ఠ, నక్షత్రములలో సంచరించి మేఘములను నాశనము చేయును. శ్రవణ,మఘ, పునర్వసు, మూల,హస్త,పూర్వాభాద్ర,అశ్విని,విశాఖ,రోహిణి నక్షత్రములలో మంగళగ్రహము సంచరించిన అధికఫల దాయకమగును. అధికనిర్మలమైనవాడు, కింశుక, అశోకపుష్ప సమాన వర్ణమువాడు,స్పష్ట సుందర కిరణములవాడు, కాల్చిన తామ్ర సమానవర్ణమువాడైన కుజుడు ఉత్తరక్రాంతిలో సంచరించి నచో రాజులకు శుభమును కలిగించువాడు ప్రజలకు సంతోషము నిచ్చువాడగును.

ఆరవ భౌమచారాధ్యాయము సమాప్తము

7. బుధచారాధ్యాయము

బుధుని ఉదయము జరిగినపుడు ఏదోఒక ఉత్పాతము తప్పక జరుగును. ఈ ఉత్పాతము జలము, అగ్ని, వాయువుల ద్వార భయమును కలిగించును. ధాన్యములు తక్కువ ఎక్కువ ధరలతో నుండును. శ్రవణ, ధనిష్ఠ, రోహిణి, మృగశిర, ఉత్తరాషాఢ నక్షత్రములను భేదిస్తు (దాటుతు) బుధుడు సంచారము చేసిన వర్షాభావము, రోగభయము కలుగును.

ఆర్ద్ర నుండి మఘ వరకు (ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, మఘ) నక్షత్రములో ఏదైన నక్షత్రములో బుధుడు సంచరించిన యుద్ధము క్షుధ(ఆకలి) రోగము, అనావృష్టి,అనేక విధములైన దు:ఖములతో ప్రజలు పీడతులగుదురు. హస్త నుండి (హస్త చిత్త స్వాతి విశాఖ అనురాధ జ్యేష్ఠ) ఆరు నక్షత్రములలో బుధుడు భ్రమణము చేసిన ఆవులు, ఎద్దులకు అశుభము కలుగును. నూనె నెయ్యి మధురాది రసముల మూల్యము వృద్ధియగును. అయినప్పటికి భూమిలో అనేక విధములైన అన్నముల సమృద్ధి కలుగును.

ఉత్తర, కృత్తిక, ఉత్తరాభాద్ర, భరణి నక్షత్రములలో బుధుడు చరించిన ధాతువులకు (వస,రక్త, మాంస, మేధ, అస్థి, మూలుగు, వీర్యము) నాశము కలుగును.అశ్విని, శతభిష, మూల,రేవతి నక్షత్రములలో సంచరించిన వ్యాపారులు, వైద్యులు, నౌకాజీవనము చేయువారు,జలముతో ఉత్పన్నమగు ద్రవ్యములు,గుర్రములు నాశనమగును.పూర్వ ఫల్గుణి, పూర్వాషాఢ, పూర్వాభాద్ర నక్షత్రములలో బుధుడు సంచరించిన ఆకలి, శస్త్ర చోర రోగ భయములు కలుగును.ప్రాకృత,మిశ్ర, సంక్షిప్త, తీక్ష్ణ, యోగాంతిక,ఘోర,పాప ఇవి పరాశర తంత్రములో తెల్పిన నక్షత్రములు వీటిలో బుధునికి ఏడుగతులు కలవు.

స్వాతి, భరణి, రోహిణి, కృత్తిక నక్షత్రములలో బుధునికి ప్రాకృత గమనము కలుగును. మృగశిర, ఆర్ద్ర, మఘ, ఆశ్లేష నక్షత్రములలో మిశ్రమగతి, పుష్యమి, పునర్వసు, పుబ్బ, ఉత్తర నక్షత్రములలో సంక్షిప్తగతి, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, జ్యేష్ఠ,అశ్విని, రేవతి నక్షత్రములలో తీక్ష్ణగతి,మూల పూర్వాషాఢ ఉత్తరాషాఢనక్షత్రములలో యోగాంతిక గతి, శ్రవణ,చిత్త, ధనిష్ఠ, శతభిష నక్షత్రములలో ఘోరగతి,హస్త అనూరాధ జ్యేష్ఠ నక్షత్రములలో పాపగతి కలుగును.

ఈవిధముగా పరాశరమహర్షి బుధుని ఉదయాస్తమయముల ద్వారా గతి లక్షణములను తెల్పెను.ప్రాకృతిగతిలో బుధుని ఉదయమగును. దానిలో బుధుడు 40 దినములుదయించును. 40 దినములకు అస్తమయమగును. ఈ విధముగా మిశ్రగతిలో నున్న బుధుని ఉదయాస్తమయములు 30 దినములు, సంక్షిప్తగతిలో 22 దినములు, తీక్ష్ణగతిలో 10 దినములు, యోగాంతిక గతిలో 9 దినములు, ఘోరగతిలో 15 దినములు పాపగతిలో బుధుని ఉదయము9 దినములు అస్తస్థితిలో 9 దినములుండును.

బుధుడు ప్రాకృతగతిలో నున్నప్పుడు ఆరోగ్యము, వృష్టి, ధాన్యవృద్ధి క్షేమము కలుగును సంక్షిప్త మిశ్రగతిలో బుధుడున్న మిశ్రఫలము అనగా మధ్యమఫల రూపములో కొంత ఆరోగ్యము, కొంతవృష్టి, కొంతధాన్యపు వృద్ధి జరుగును. మిగిలిన తీక్ష్ణ యోగాంతిక ఘోర పాపగతులలో విపరీతఫలము అనగా రోగపీడ, అనావృష్టి, ధాన్యహాని, అకళ్యాణ కారకమగును.దేవలమతానుసారము బుధగతి ఋజ్వి, అతివక్ర,వక్ర,వికల, అని నాలుగు విధములు. ఈగతుల స్థితి ప్రమాణము ఉదయాస్తమయములలో ఋజ్వి 30 దినముల వరకు, అతివక్ర 24 దినముల వరకు, వక్రము 12 దినముల వరకు, వికల 6దినములవరకుండును. ఋజ్విగతి ప్రజలకు హితముచేయును. అతివక్రము దుర్భిక్షమును, వక్రము శస్త్ర భయమును, వికలము భయమును రోగమును కలిగించును.

పుష్య, ఆషాఢ, శ్రవణ,మాఘ మాసములలో బుధుడు కనిపించిన లోకములో భయముత్పన్నమగును.కాని ఈమాసములలో బుధుడు అస్తమయమైన శుభఫలము ప్రాప్తించును. కార్తీక ఆశ్వయుజమాసములలో బుధుడు కనిపించిన జనులకు శస్త్ర,చోర (దొంగ) అగ్ని, రోగ, క్షుద్బాధా(ఆకలి) భయములుత్పన్నమగును. బుధుని అస్తమయములో నగరము శత్రువులతోనాక్రమించబడినను, బుధాస్తమయ కాలములో దానికి ముక్తి కలుగును.ఒక పండితుని మతము ననుసరించి పశ్చిమదిశలో బుధుని ఉదయమైన ఆదిశలో నున్న పురములలోని మనుష్యులకు లాభము కలుగును. సువర్ణకాంతి,చిలుకవంటి వర్ణము, నీలమణివలె నిర్మలము, విస్తీర్ణమైన బుధ బింబము కనపడిన లోకములో సుఖము కలుగును. దీనికి వ్యతిరేకమైన వర్ణముతో బుధుడు కనపడిన అశుభము కలుగును.

ఏడవ బుధచారాధ్యాయము సమాప్తము

8. బృహస్పతిచారాధ్యాయము

ఏ నక్షత్రములో బృహస్పతి ఉదయమును పొందునో ఆనక్షత్రముననుసరించి పన్నెండు మాస నామముల క్రమములో పన్నెండు సంవత్సరములగును. కృత్తికాది రెండేసి నక్షత్రములలో బృహస్పతిఉన్నచో కార్తికాది పన్నెండు మాసమువలె పన్నెండు వత్సరము లగును. కాని పన్నెండు వర్షముల మధ్యలో ఐదు, పదకొండు, పన్నెండు వర్షములు మూడేసి నక్షత్రముతోనగును. కృత్తిక రోహిణి నక్షత్రములలో గురువు ఉదయించిన కార్తీకాది వర్షమగును. ఇదేవిధముగా మిగిలిన వత్సరములు కూడా కల్పన చేయవలెను.

కార్తీకనామక వర్షములో వాహనము (బండి) అగ్నులతో జీవితము నడుపు (కమ్మరి,కంసాలి)వారికి గోవులకు పీడకలుగును. లోకులకు వ్యాధి, యుద్ధము జరుగును. ఎరుపు పసుపు పుష్పములు వృద్ధి పొందును. మార్గశీర్ష వర్షములో అనావృష్టి కలుగును. అడవి జంతువులు, ఎలుకలు, శలభములు (మిడుత) పక్షుల వలన ధాన్యనాశనమగును. మనుష్యులకు వ్యాధి భయము కలుగును. పౌష్యవర్షములో లోకము సుఖముగా నుండును. రాజులు విరోధమును విడిచెదరు. ధాన్యముల మూల్యము రెండు మూడురెట్లగును. పౌష్టిక కర్మలకు ప్రసిద్ధి కలుగును. మాఘనామక వర్షములో పిత్రుపూజకు ప్రాధాన్యత పెరుగును. అన్ని ప్రాణులు సంతృప్తితో ఆరోగ్యముతో నుండును. సుందరవృష్టి ధాన్యముల మూల్యములో సమత్వము మిత్రలాభము కలుగును.

ఫాల్గుణవర్షములో కొన్ని స్థానములలో మంగళకార్యములు ధాన్యవృద్ధి జరుగును. కానిఅన్ని స్థలములలో మంగళకార్యములు, ధాన్యవృద్ధి జరుగదు. స్త్రీలు అభాగ్యలగుదురు. చోరులధికమగుదురు. రాజుల ఉగ్రత్వము (కోపము) పెరుగును. చైత్రవర్షములో స్వల్ప వర్షము, అన్నము దుర్లభమగును,లోకులలో కుశలత, రాజులలో కోమలత్వము, ధాన్యవృద్ధి కలుగును. సుందరరూపము కలవారు పీడితులగుదురు. వైశాఖవర్షములో రాజులతో పాటు జనులందరు ధర్మనిరతులు, భయరహితులు ఆనందయుక్తులై యజ్ఞకర్మలను చేయుదురు. అన్నిధాన్యములకు వృద్ధి కలుగును.

జ్యేష్ఠవర్షములో జాతితో కులముతో ధనముతో ఉన్నతశ్రేణితో శ్రేష్ఠపురుషులు రాజులు ధర్మమును తెలిసినవారగుదురు. శమీధాన్యమును వదలి మిగిలిన ధాన్యములు పీడింపబడును. ఆషాఢవర్షములో కొన్నిచోట్ల ధాన్యము, కొన్నిచోట్ల వర్షమునకభావమగును. యోగక్షేమములు మధ్యమములగును. రాజులు పనులందాసక్తి కలిగి యుందురు.

శ్రావణవర్షములో అన్నిధాన్యములు బాగుగా పండును. క్రూరులు,పాఖండి జనులు (వేదములను నిందించువారు) వారిభక్తగణము పీడితులగుదురు. భాద్రపద వర్షములో వేరుశనగలు, ముందుగా చల్లినధాన్యము ఫలించును. కాని ఈవర్షములో ఆరంభమునకు తర్వాత చల్లినధాన్యము నాశనమగును. లోకములోనక్కడక్కడ సుభిక్షము, కొన్నిచోట్ల భయము కలుగును. ఆశ్వయుజ వర్షములో అధికవృష్టి కలుగును. ఆనందముతో

ప్రజలుందురు. అన్నిప్రాణులలో బలవృద్ధి, అన్నవృద్ధి కలుగును. ఉత్తరానక్షత్రములో చరించుచున్న గురుడు లోకములో సుభిక్షమును క్షేమమును కలిగించును. దక్షిణములో విపరీత ఫలితము నిచ్చును. నక్షత్రముల మధ్యలో సంచారముచేస్తున్న గురుడు మధ్యమ ఫలమునిచ్చును.

బృహస్పతి అగ్ని వర్ణముతోనున్న అగ్నిభయము, పీత వర్ణముతోనున్న వ్యాధి, శ్యామ వర్ణముతోనున్న యుద్ధము, హరిత(ఆకుపచ్చ)వర్ణముతో నున్న దొంగలపీడ, ఎరుపు వర్ణముతో నున్న శస్త్రభయము, ధూమ్ర(ధూళి) వర్ణముతోనున్న అనావృష్టి కలుగును. బృహస్పతి పగలు కనిపించిన రాజుకు నాశనము, తారలతో కూడి రాత్రియందు బృహస్పతి నిర్మల బింబముతో కనపడిన ప్రజలకు స్వస్థత చేకూర్చువాడగును.

కృత్తిక రోహిణి నక్షత్రములు సంవత్సర పురుషునికి శరీరము, పూర్వాషాఢ ఉత్తరాషాఢలు నాభి, ఆశ్లేష హృదయము, మఘ పుష్పమగును. సంవత్సర పురుషుని శరీరాంగములు శుద్ధములై, పాపగ్రహములతో కూడక యున్న శుభఫలదాయకమగును. రోహిణి లేక కృత్తిక సంవత్సర పురుషుని శరీరాంగములు పాపగ్రహములతో కూడియున్న, అగ్నివాయువులతో పీడను కలిగించును. నాభిరూపమైన పూర్వాషాఢ ఉత్తరాషాఢ నక్షత్రములలో పాపగ్రహములున్న దిర్భిక్షము కలుగును. పుష్పరూప మఘా నక్షత్రములో పాపగ్రహములు కూడిన మూలపదార్థములు, ఫలములకు హాని కలుగును. హృదయరూప ఆశ్లేషనక్షత్రములో పాపగ్రహములున్న ధాన్యములకు హాని కలుగును.

శాలివాహనుని కాలమునుండి ఎన్ని వర్షములు గడిచినవో ఆశకవర్షములను పదకొండుతో గుణించి ఆగుణఫలమును తిరిగి నాలుగుతో గుణించవలెను. ఆగుణఫలములో 8589 అంకెను కలుపవలెను. ఈయోగఫలమును 3750తో భాగించిన వచ్చిన లబ్ధముతో శకవర్షమును కలుపవలెను. ఈయోగ ఫలమును 60తో భాగించగ మిగిలిన శేషమును ఐదుతో భాగించవలెను. వచ్చిన లబ్ధము శేషము వర్తమాన యుగవర్షాది యగును. అనగా లబ్ధి నారాయణాది యుగమగును. శేషముతో వర్తమానయుగము వర్షము మాసము దినము ప్రాప్తమగును. ముందు తెల్పిన వర్షసంఖ్యను 12చే భాగించిన వచ్చిన లబ్ధమును నవగణిత వర్షాది గుణఫలములో జోడించి 4తో భాగించవలెను. వచ్చిన లబ్ధముతో సమానమైన సంఖ్యానక్షత్రములో బృహస్పతి ఉండునని తలంచవలెను. ఇక్కడ నక్షత్ర గణన 24 వ నక్షత్రముతో చేయవలెను. అనగా ఒకటి లబ్ధమైన 25వ పూర్వాభాద్ర రెండు లబ్ధమైన ఉత్తరాభాద్ర నక్షత్రముగా తెలిసికొనవలెను.

ఉదాహరణకు శక సంవత్సరము 1876ను తీసుకొన్న 1876 ను 11తో గుణించిన 20636 వచ్చును. దానిని 4తో గుణించిన 82544 వచ్చును. దానిని 3750తో భాగించిన లబ్ధవర్షము 24,వర్షశేషము 1133 వచ్చును. 1133ను 12చే గుణించిన 13596 వచ్చును.

దానిని 3750తో భాగించిన లబ్ధమాసము 3, మాసశేషము 2346 వచ్చును. దానిని 30తో గుణించిన 70360 వచ్చును. దానిని 3750చే భాగించిన లబ్ధదినము 18, దినశేషము 2770 వచ్చును. దానిని 60చే గుణించి, 3750తో భాగించిన లబ్ధఘుడియలు 46, ఘుటీశేషము 300వచ్చును. దానిని 60చే గుణించిన గుణఫలము 172800 వచ్చును. దానిని 3750తో భాగించిన లబ్ధఘుడియలు 46,ఘుటీశేషము 300 వచ్చును. దానిని 60చే గుణించి 3750తో భాగించిన లబ్ధఫలము 4,ఫలశేషము 3000 వచ్చును.అర్ధాధికే రూపం గ్రాహ్యామ్ అని నియమముతో లబ్ధఫలము 5 అగును. అనగా వర్షాది లబ్ధము 24/3/18/46/5 వచ్చును.దీనిని ఇష్టశకాబ్దమునకు 1876కు కలిపిన 1900/3/18/46/5 వచ్చును. 1900ను 60చే భాగించిన లబ్ధము 31, శేషము 40 వచ్చును. అప్పుడు శేష షష్ట్యబ్ద ప్రమాణము 40/3/18/46/5 అగును. 40 సంవత్సరముల తర్వాత 41వ సంవత్సరము ప్లవంగనామము ఇష్టశకాబ్దమైన 1876కు సిద్ధించును.ఈ 40/3/18/46/5ను 5చే భాగించిన లబ్ధము 8,శేషము 0/3/18/46/5 అగును. అందువలన ఇది నవమయుగము(సోమ)లో వర్షాది 0/3/18/43/5 సమయము. అనగా 3మాసములు 18 రోజులు,43 ఘుడియులు,5 విఘుడియులని తెలియును.

విష్ణువు,బృహస్పతి,ఇంద్రుడు, అగ్ని, ప్రజాపతి, అహిర్బుధ్న,పిత,విశ్వేదేవ, సోమ, శక్రానల(ఇంద్రాగ్ని) అశ్వినీకుమార, సూర్యులు ఈ పన్నెండు మంది పన్నెండు యుగముల స్వాములు. సంవత్సరము పరివత్సరము,ఇదావత్సరము,అనువత్సరము, ఇద్వత్సరములు – ప్రత్యేకయుగములో ఐదేసి వత్సరములగును. వీటిస్వాములు క్రమముగా అగ్ని సూర్య చంద్ర ప్రజాపతి శివులగుదురు.సంవత్సరనామక వర్షములో మధ్యమ రూపముగా(శ్రావణ భాద్రపద ఆశ్వయుజ కార్తీక మాసములు) వృష్టికురియును. పరివత్సర నామకవర్షముతో మొదటి (శ్రావణ భాద్రపదలు) భాగములో, ఇదావత్సరములో నాలుగు మాసములలో అధికవర్షము కురియును.అనువత్సరనామకవర్షములో చివరిలో (ఆశ్వయుజ, కార్తీకములు) వర్షము కురియును. ఇద్వత్సరనామక వర్షములో స్వల్పవర్షము కురియును.

ముందు తెల్పిన పన్నెండుయుగములలో విష్ణువు ఇంద్రుడు బృహస్పతి అగ్ని వీటికి దేవతలగుదురు. వారు ఉత్తములు,(శ్రేష్ఠయుగములు), మధ్యలోని నలుగురు (ప్రజాపతి, ఉత్తర ప్రౌష్ఠపదాదిపుడు,పిత,విశ్వేదేవుడు)దేవతలు మధ్యములు (మధ్య యుగము),చివరి లోనున్న నలుగురు (సోమ,శక్రానల,అశ్వి,సూర్య)దేవతలు అశుభులు (అధమయుగము).

ధనిష్ఠానక్షత్ర ప్రథమాంశలో నున్న బృహస్పతి మాఘమాసములో ఉదయించును. ఆసమయములో 60సంవత్సరములలో మొదటిదైన ప్రభవనామక సంవత్సరము ప్రారంభ మగును. ఈవర్షము ప్రాణులకు హితము కలిగించును. ప్రభవ సంవత్సరములో కొన్ని చోట్ల వర్షముకురవదు, కొన్నిచోట్ల వాయుప్రకోపము, కొన్నిచోట్ల అగ్నిప్రకోపము కలుగును. కొన్ని చోట్ల ధాన్యములలో ఈతిబాధలు కలుగును. కొన్నిచోట్ల కఫాత్మక రోగముల పీడ

కలుగును. అయినప్పటికి ప్రజలతో అధిక కష్టము దు:ఖముల బాధ కనపడదు.

ద్వాదశయుగములలో మొదటియుగములోని (విష్ణు) ద్వితీయ సంవత్సర నామము విభవ, మూడవది శుక్ల, నాల్గవది ప్రమోద, ఐదవది ప్రజాపతి యగును. ఈనాలుగు వర్షములలోఉత్తరోత్తరములలో శుభఫలములు కలుగును. ఈ సంవత్సరములలో రాజుల శాసనపద్ధతి వలన ధాన్యము,చెరకు యవాది అన్నములు బాగుగా పండి మంచి ఫలితము నిచ్చును. అన్ని ప్రాణులు నిర్భయము, ద్వేషరహితము ఆనందయుతము, కలిదోష (అధరవ్యాధి, దరిద్రత,శోక,కలహ,మృత్యువులు) రహితమై యుండును. ద్వాదశ యుగములలో ద్వితీయుగాంతర్గత అంగిర, శ్రీముఖ, భావ, యువ, ధాత నామములతో ఐదు వర్షములగును. దీనిలో మొదటిమూడు (అంగిర, శ్రీముఖ, బావ) శుభ ప్రదములు మిగిలిన రెండు (యువ ఘాత) మధ్యమ ఫలములనిచ్చును.

మూడవదైన ఐంద్రసంజ్ఞక యుగములో ఈశ్వర,బహుధాన్య, ప్రమాధి, విక్రమ, వృషాది నామములతో ఐదు వర్షములుండును. వీటిలో మొదటి రెండు ఈశ్వర, బహుధాన్య సంవత్సరములు శుభమును కలిగించును. ఈ సంవత్సరములలో జనులు సత్య యుగ సమానముగా ధార్మిక,సుఖదీర్ఘాయువులతో నుందురు. ప్రమాధినామ సంవత్సరమ శుభమును కలిగించును. విక్రమ, వృషనామక సంవత్సరములలో సుభిక్షము కలుగును. కాని రోగభయములు కలుగును. ఆగ్నేయ యుగములోని చిత్రభాను సంవత్సరము శుభదాయకమగును. రెండవ సుభాను నామక సంవత్సరము మధ్యమ ఫలమునిచ్చును. మూడవదైన నతనామక సంవత్సరము రోగ మృత్యువులను కలిగించును. తారణనామక సంవత్సరము అత్యధికవృష్టిని కలిగించి ధాన్యవృద్ధిని రాజులకు ఆనందమును కలిగించును. ఐదవదైన వ్యయ నామక సంవత్సరముశుభప్రదమగును. ఈసమయములో కామప్రవృత్తి అధికమగును. జనులు వివాహాది మంగళ కార్యములు చేయుదురు.

పంచమమైన త్వాష్ట్రయుగములో సర్వజిత్,సర్వధారి,విరోధి,వికృతి,ఖర, సంవత్సరములుండును. వీటిలో సర్వధారి సంవత్సరము శుభమును మిగిలినవి భయమును కలిగించును. ఆరవ(ప్రోష్టపద) యుగములో నందన, విజయ, జయ, మన్మథ, దుర్ముఖ సంవత్సరములుండును. వీటిలో మొదటి మూడు శుభమును మన్నథనామ సంవత్సరము మధ్యమఫలము, దుర్ముఖనామ సంవత్సరము అశుభమును కలిగించును.

సప్తమ(పితృసంజ్ఞక) యుగములో హేలంబ, విలంబ, వికారి, శర్వరి, ప్లవము లని ఐదు సంవత్సరములుండును. దీనిలో ప్రథమ సంవత్సరములో ఈతి బాధలతో ధాన్యహాని కలుగును. అధికవృష్టి అతివేగముగా గాలివీచును. విలంబ నామక సంవత్సరము లో అల్పధాన్యములు, అతివృష్టి కలుగును. వికారినామక సంవత్సరములో అత్యధిక వేగముతో వృష్టికురయును. శర్వరీనామక సంవత్సరములో దుర్భిక్షము కలుగును. ప్లవనామక సంవత్సరము శుభదాయకమై అతివృష్టి కలిగించును.

ఎనిమిదవదైన వైశ్వయుగములో శోకహృత్, శుభకృత్, క్రోధి, విశ్వావసు, పరాభవ సంవత్సరములుండును. దీనిలో శోభకృత్, శుభకృత్ సంవత్సరములు ప్రజలకు ఆనంద కలిగించును.(క్రోధి సంవత్సరము శుభదాయకము,విశ్వావసు పరాభవ సంవత్సరములు మధ్యమ ఫలమునిచ్చును. తొమ్మిదవదైన సౌమ్యయుగములో ప్లవంగ కీలక సౌమ్య సాధారణ రోధకృత్ సంవత్సరములుండును. ప్లవంగ సంవత్సరములో ప్రజలకు కష్టములు కలుగును.కీలక సౌమ్య సంవత్సరములు శుభప్రదము సాధారణ సంవత్సరము స్వల్పజలము అనావృష్టి ఆది ఈతిబాధలు కలిగించును. రోధకృత్ సంవత్సరములో మధ్యమవర్షము ధాన్యవృద్ధి కలుగును.

పదవదైన శక్రాగ్నియుగములో పరిధావి, ప్రమాది, విక్రమ, రాక్షస, అనల సంవత్సరము లుండును. పరిధావి సంవత్సరములో మధ్యదేశములో నాశము, రాజుమరణము, స్వల్పవృష్టి, అగ్నిభయము కలుగును. ప్రమాది సంవత్సరములో ప్రజలు సోమరులగుదురు. కలహము, రక్తపుష్ప, రక్తబీజ వృక్షములకు నాశనము కలుగును. విక్రమ సంవత్సరములో మనుష్యులానందముగా నుందురు.రాక్షస అనల సంవత్సరము లలో ప్రజలకునాశము కలుగును.రాక్షస సంవత్సరములో యవలు, గోధుమలు, శనగల ఉత్పత్తి, అనల సంవత్సరములో అగ్నిప్రకోపము,మారకము (రోగాలు) కలుగును. పదకొండవ ఆశ్వినయుగములో పింగళ,కాలయుక్త, సిద్ధార్థ, రౌద్ర, దుర్మతి సంవత్సరము లుండును. పింగళ సంవత్సరములో అతివృష్టి,దొంగలభయము, శ్వాససంబంధ రోగములు కలుగును.కాలయుక్త సంవత్సరములో అనేకఫలితములు కలుగును. సిద్ధార్థ సంవత్సరములో సంపత్తి కలుగును. రౌద్రసంవత్సరములో అశుభఫలము ప్రజలనాశము కలుగును. దుర్మతి సంవత్సరములో మధ్యమవృష్టి కురియును.

పన్నెండవదైన భాగ్యయుగములో మొదటి దుందుభినామ సంవత్సరములో ధాన్యవృద్ధి కలుగును.ద్వితీయ అంగార సంవత్సరములో రాజులకు నాశము, భయంకరమైన వృష్టి కలుగును. తృతీయరక్తాక్ష సంవత్సరములో సూకరా (పంది)దుల భయము రోగము కలుగును. క్రోధనామక సంవత్సరములో జనులమధ్య క్రోధము కలుగును. దేశములోని ప్రజలు కలహములతో నష్టమును పొందెదరు. క్షయ నామక సంవత్సరములో అనేక విధముగా జనులు నాశమును పొందెదరు. బ్రాహ్మణులకు భయము, కర్షకులు, వైశ్యులు, శూద్రులు, పరద్రవ్యమును హరించు వారికి సమృద్ధిని కలిగించును. ఇతరశాస్త్రములలో 60 సంవత్సరములకు తెలిపిన ప్రమాణమును నేను సంక్షేపముగా బృహస్పతి చారాధ్యాయములో తెలిపితిని.నిర్మల కిరణము విశాలబింబము, కుముద (తెల్లకలువ)పుష్పము, కుందపుష్పము స్ఫటికమణి సమానమైన కాంతి కలిగినవాడు, గ్రహయుద్ధములో పరాజయము పొందనివాడు, ఉత్తమమార్గములో పయనించువాడగు బృహస్పతి జనులకు హితము చేయవాడగును.

ఎనిమిదవ బృహస్పతిచారాధ్యాయము సమాప్తము

9. శుక్రచారాధ్యాయము

శుక్రునకు తొమ్మిది వీధులు, ఉత్తర మధ్య, దక్షిణములను మూడు విధములైన మార్గములు,వాత-వ్యాంగ-వైశ్వానరములను మూడు విధములైన మార్గములు, ఆరు విధములైన మండలములుండును. వాటిలో మొదటివీధి లక్షణములు అన్యమతానుసారము చెప్పబడును.

తొమ్మిది వీధులు - నాగ గజ ఐరావత వృష గో జరద్గవ మృగ అజ దహనములు ఈ తొమ్మిది వీధులకు అశ్విన్యాది మూడేసి నక్షత్రముల క్రమముతో ఒక ఆచార్యుడు తెలిపెను. అశ్విని భరణి కృత్తిక-నాగవీధి, రోహిణి మృగశిర ఆర్ద్ర-గజవీధి,పునర్వసు పుష్యమి ఆశ్లేష- ఐరావత వీధి, మఖ పుబ్బ ఉత్తర - వృషవీధి,హస్త చిత్త స్వాతి - గోవీధి, విశాఖ అనురాధ జ్యేష్ఠ - జరద్గవ వీధి, మూల పూర్వాషాఢ ఉత్తరాషాఢ - మృగవీధి,శ్రవణం ధనిష్ఠ శతభిషం-అజవీధి,పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర రేవతి-దహన వీధిగా తెలిసికొనవలెను.

గ్రంథకారుని మతమునసరించి వీధులకు నక్షత్రములీవిధముగా నున్నవి. భరణి కృత్తిక స్వాతి-నాగవీధి,రోహిణి మృగశిర ఆర్ద్ర-గజవీధి, పునర్వసు పుష్యమి ఆశ్లేష-ఐరావతవీధి, మఖ పుబ్బ ఉత్తర-వృషవీధి, అశ్విని పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర రేవతి-గోవీధి, శ్రవణ ధనిష్ఠ శతభిషం-జరద్గవవీధి, అనూరాధ జ్యేష్ఠ మూల-మృగవీధి, హస్త చిత్త విశాఖ-అజవీధి, పూర్వాషాఢ ఉత్తరాషాఢ నక్షత్రములు-దహనవీధిలో నున్నవి.

వీధులు - నక్షత్రముల స్ఫుటార్థ చక్రము

వీధులు	నాగ	గజ	ఐరావత	వృష	గో	జరద్గవ	మృగ	అజ	దహన
అన్యమతా	అశ్విని	రో	పున	మఖ	హస్త	విశాఖ	మూల	శ్రవ	పూభా
నుసారము	భ	మృ	పు	పుబ్బ	చిత్త	అనూ	పూ షా	ధని	ఉ భా
నక్షత్రములు	కృ	ఆర్ద్ర	ఆశ్లేష	ఉత్తర	స్వాతి	జ్యేష్ఠ	ఉ షా	శత	రేవతి
గ్రంథకర్త	భర	రోహి	పున	మఖ	అశ్వి	శ్రవణం	అనూ	హస్త	పూ షా
మతాను	కృత్తి	మృగ	పు	పుబ్బ	పూభా	ధనిష్ఠ	జ్యేష్ఠ	చిత్త	ఉ షా
సారము	స్వాతి	ఆర్ద్ర	ఆశ్లేష	ఉత్తర	ఉ భా	శత	మూ	విశా	--
నక్షత్రములు	--	--	--	--	రేవతి	--	--	--	--

పూర్వము తెలిపిన తొమ్మిదివీధులలో నాగాది మూడేసి వీధులు క్రమముగా ఉత్తరము, మధ్య,దక్షిణమార్గములలో నుండును. అదే విధముగా నాగ గజ ఐరావత వీధులు ఉత్తరమార్గములో,వృష గో జరద్గవ వీధులు మధ్యమార్గములో, మృగ అజ దహనవీధులు దక్షిణ మార్గములో నుండును. ఈమూడేసి వీధులలో ఒక్కొక్కటి క్రమముగా ఉత్తర, మధ్య దక్షిణ మార్గములలో నుండును. నాగవీధి ఉత్తరమార్గములో,గజవీధి మధ్య

మార్గములో,ఐరావతివీధి దక్షిణమార్గములో,వృషవీధి ఉత్తరమార్గములో, గోవీధి మధ్య మార్గములో, జరద్గవవీధి దక్షిణ మార్గములో,మృగవీధి ఉత్తరమార్గములో,అజవీధి మధ్య మార్గములో,దహనవీధి దక్షిణమార్గములో నుండును.నాగవీధి ఉత్తరోత్తర మార్గము లో,గజవీధి ఉత్తర మధ్యమార్గములో,ఐరావతవీధి ఉత్తర దక్షిణమార్గములో, వృషవీధి మధ్యోత్తరమార్గములో, గోవీధి మధ్యమధ్యమార్గములో, జరద్గవవీధి మధ్య దక్షిణ మార్గములో, మృగవీధి దక్షిణోత్తర మార్గములో, అజవీధి దక్షిణ మధ్య మార్గములో,దహన వీధి దక్షిణ దక్షిణమార్గములో నుండును.

మార్గవీధి స్ఫుటార్థ చక్రము

వీధులు	నాగ-గజ-ఐరావత			వృష-గో-జరద్గవ			మృగ-అజ-దహన		
సూర్యమార్గము	ఉత్తరము			మధ్య			దక్షిణము		
లో వాటి	ఉత్తర	మధ్య	దక్షిణ	ఉత్తర	మధ్య	దక్షిణ	ఉత్తర	మధ్య	దక్షిణ
దిశలు	ఉత్తరో త్తర	ఉత్తర మధ్య	ఉత్తర దక్షిణ	మధ్యో త్తర	మధ్య మధ్య	మధ్య దక్షిణ	దక్షిణో త్తర	దక్షిణ మధ్య	దక్షిణ దక్షిణ

ఇతర ఆచార్యుల మతముననుసరించి నక్షత్రమార్గములో వీధిమార్గమున్న విధముగా దక్షిణ ఉత్తరమధ్య మార్గములను కల్పనచేయవలెను.నక్షత్ర మార్గమునకు దక్షిణములోనున్న తారాగణయోగము దక్షిణమార్గస్థితమై యుండును.లేక నక్షత్ర మార్గమునకు దక్షిణములోనున్న గ్రహము దక్షిణ మార్గగతము,ఉత్తరములో నున్న ఉత్తర మార్గగతము మధ్యలో నున్న మధ్యమార్గగతమగును.

కొందరిమతము ననుసరించి భరణి ఆది తొమ్మిదినక్షత్రములు (భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆర్ద్ర, పునర్వసు,పుష్యమి, ఆశ్లేష, మఖ)ఉత్తరమార్గములో పుబ్బ మొదలు తొమ్మిది నక్షత్రములు (పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి,విశాఖ, అనూరాధ,జ్యేష్ఠ, మూల) మధ్యమార్గములో పూర్వాషాఢ మొదలు తొమ్మిది నక్షత్రములు(పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణ, ధనిష్ఠ, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి, అశ్విని) దక్షిణమార్గములో నుండును. జ్యోతిషశాస్త్రము గ్రహనక్షత్రములపై నాధారపడిన ఆగమశాస్త్రము. ఆగమ శాస్త్రమును వదలి దీనిని తెలిసికొనలేము. అందువలన సందేహించుట మంచిదికాదు. ఋషులు త్రికాలదర్శులు అందరికి పూజనీయులైన వారందరి మతములను సంగ్రహించి తెలియజేయుదును.

ఉత్తరవీధిలో స్థితుడైయున్న శుక్రుని ఉదయము లేక అస్తమయమైన సుభిక్షము మంగళకరమగును.మధ్యవీధిలో నున్న మధ్యమఫలము దక్షిణవీధిలోనున్న కష్టములు కలిగించును. నాగాది తొమ్మిదివీధులలో క్రమముగా అత్యుత్తమము, ఉత్తమము, అల్పము, సమమధ్యము న్యూన,అధమ కష్ట, కష్టతమ ఫలములనొసంగును.నాగవీధిలో అత్యుత్తమము,

గజవీథిలో ఉత్తమము,ఐరావతవీథిలో అల్పము,వృషవీథిలో సమము,గోవీథిలో మధ్యమము, జరద్గవవీథిలో న్యూనము,మృగవీథిలో అధమము,అజవీథిలో కష్టము, దహనవీథిలో కష్టతమఫలము నొసంగును. భరణి నుండి నాలుగు నక్షత్రములు(భరణి కృత్తిక రోహిణి మృగశిర) ప్రథమమండలమగును. ఈమండలములో శుక్రునికి ఉదయాస్తమయములు కలిగిన లోకములో సుభిక్షము కలుగును. అంగ వంగ మహిష బాహ్లిక కలింగదేశములలో భయము కలుగును. ప్రథమమండలములో ఉదయించిన శుక్రునిపై ఏదైన గ్రహమున్న భద్రాశ్య,శూరసేనక,యౌధేయిక, కోటివర్ష దేశముల రాజులకు నాశనము కలుగును.

ఆర్ద్ర నుండి నాలుగు నక్షత్రములు (ఆర్ద్ర పునర్వసు పుష్యమి ఆశ్లేష) ద్వితీయ మండలములో నుండును. ఈమండలములో శుక్రుని ఉదయాస్తమయములైన అధికవృష్టి, ధాన్యములకు విశేషవృద్ధి కలుగును. బ్రాహ్మణుకు దుష్టులకు అశుభము కలుగును. ఉదయించిన శుక్రుడు ఏదైన గ్రహముతో పీడింపబడిన మ్లేచ్ఛులు, వనమునందు నివసించువారు, కుక్కలతో జీవించువారు, గోవులను పెంచువారు. గోనర్దము(పతంజలి జన్మభూమి చిదంబరములో నివసించువారు)నందుండువారు. పాపకర్యములు చేయువారు. శూద్రులు మిథిలాదేశములో నివసించువారు ఉపద్రవములను పొందెదరు.

మఖ నుండి ఐదు నక్షత్రములు (మఖ పుబ్బ ఉత్తర హస్త చిత్త)నాల్గవ మండలములో నుండును. దీనిలో ఉదయించు చంద్రుడు ధాన్యనాశము దుర్భిక్షిము దొంగలభయము, అధర్ములకు ఉన్నతి, వర్ణసంకరమును కలిగించును. ఈమండలములో నున్న శుక్రుడు ఇతరగ్రహములతో పీడింపబడిన వృక్షములతోపాటు శబర శూద్ర పుండ్రాది జాతులకు, పశ్చిమదేశ శూలిక దేశములందు నివసించు వారికి వనవాసులకు ద్రావిడ సముద్రతట నివాసులకు హాని కలిగించును.

స్వాతి నుండి మూడు నక్షత్రములు (స్వాతి విశాఖ అనూరాధ)నాల్గవ మండలములో నుండును. దీనిలో శుక్రుని ఉదయాస్తమయములైన బ్రాహ్మణ క్షత్రియులకు సుభిక్షము ఉన్నతి కలుగును. మిత్రులందు పరస్పరము ద్వేషముత్పన్నమగును. ఈ మండలములో నున్న శుక్రుడు ఇతరగ్రహముతో పీడితుడైన కిరాతులస్వామికి మృత్యువు, ఇక్ష్వాకువంశములో పుట్టినవారు మ్లేచ్ఛ,అవంతి, పులింద, తంగణ, శూరసేన దేశములలో నివసించువారికి నాశము కలుగును.

జ్యేష్ఠ నక్షత్రము నుండి ఐదు నక్షత్రములు (జ్యేష్ఠ మూల పూర్వాషాఢ ఉత్తరాషాఢ శ్రవణం) ఐదవమండలమగును. దీనిలో శుక్రుని ఉదయాస్తమయములైన దుర్భిక్షము చోర రోగభయములు కలుగును. కాశ్మీర అశ్మక మత్స్య,చారుదేవి నదీతటము, అవంతి దేశములలో నివసించువారికి పీడ కలుగును. ఈమండలములోనున్న శుక్రుడు అన్యగ్రహము వలన పీడితులైన ద్రవిడ శబర అంబష్ఠ త్రిగర్త సౌరాష్ట్ర సింధు సౌవీర దేశవాసులకు కాశీరాజుకు నాశనము కలుగును.

ధనిష్ఠ నుండి ఆరు నక్షత్రములు (ధనిష్ఠ శతభిషం పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర

రేవతి)ఆరవమండలమగును. ఈమండలములో శుక్రుని ఉదయాస్తములైన శుభము కలుగును. భూమి ధనము గోవులు ధాన్యములతో వృద్ధిపొందును. కాని కొన్నిచోట్ల భయము కలుగును. ఈమండలములో శుక్రుడు ఇతరగ్రహముతో పీడింపబడిన శూలిక గాంధార అవంతి దేశములలో నున్న మనుష్యులకు పీడ కలుగును. విదేహదేశము యవన శకదాసులకు వృద్ధి కలుగును. పూర్వోక్తమండలములో స్వాతి ఆది (నాలుగు) జ్యేష్ఠాది (ఐదు) మండలములలో పశ్చిమదిశలో శుభమును కలిగించును. మఘాది (మూడు) మండలములలో పూర్వదిశలో శుభమును కలిగించును. మిగిలిన మూడు మండలములలో(ప్రథమ ద్వితీయ షష్ఠ) యథోక్త ఫలమును తెలిసికొనవలెను.

శుక్రుడు సూర్యాస్తమయముకన్న ముందు కనిపించిన భయమును కలిగించును. పగలంతా కనిపించిన దుర్భిక్షము,రోగము, మధ్యాహ్నములో చంద్రునితోకూడి కనిపించిన రాజు సేన నగరముల మధ్య భేదభావముత్పన్నమగును. కృత్తికా నక్షత్రములో శుక్రుడు గమనము చేసిన నదీతటములు నాశనమగును. జలపూర్ణమైన నదులు భూమిపైన ఎత్తు పల్లవములను సమతలముగా చేయును. అనగా వరదలతో నదులుప్పొంగును.

రోహిణినక్షత్రమును దాటుతూ శుక్రుడు పయనించిన పృథివి బ్రహ్మహత్యచేయు దానివలె కేశములతో అస్తి (ఎముక) ఖండములతో తెలుపు నలుపు వర్ణముతో కపాలిక సమానముగా వ్రతధారణ చేయును. అదేవిధముగా బ్రహ్మహత్య చేయు మనుష్యులు పాపశాంతి కొరకు మనుస్మృతి ననుసరించి అస్థిఖండములను ధరించి కాపాలిక వ్రతధారణ చేయుదురు. అనగా భూమిలో మహామారి సర్వత్ర వ్యాపించును.

మృగశిరానక్షత్రములో పయనించిన రసాదులు,ధాన్యములు నాశనము పొందును. ఆర్ద్రా నక్షత్రములో పయనించిన కోసల కలింగదేశములు నాశనమగును. అతివృష్టి కురియును. పునర్వసు నక్షత్రములోనున్న అశ్మక, విదర్భదేశములకుపద్రవము కలుగును. పుష్యమి నక్షత్రములో నున్న అధికవృష్టి, విద్యాధరులతో యుద్ధములో నష్టము కలుగును. ఆశ్లేషా నక్షత్రములో గమనము చేసిన లోకులకు సర్పములవలన పీడ కలుగును. మఖానక్షత్రములో పయనించిన హస్తి (ఏనుగు) పతులకు పీడ అధికవృష్టి కలుగును. పుబ్బ నక్షత్రములో పయనించిన శబర పులింద జనులకు నాశము అతివృష్టి కలుగును. ఉత్తర నక్షత్రములో పయనించిన కురు,జాంగల,పాంచాలదేసవాసులకు నాశము,అతివృష్టి కలుగును.

హస్త నక్షత్రములో శుక్రుడు పయనించిన చిత్రకారులు పీడింపబడుదురు. అనావృష్టి కలుగును. చిత్తానక్షత్రములో పయనించిన బావులు నిర్మించు వారికి పక్షులకు పీడ కలుగును. కాని సుందరవృష్టి (మంచివర్షము) కురియును. స్వాతినక్షత్రములో శుక్రుడు పయనించినపుడు అతివృష్టి, ధూతవాణిజ్య కర్మలు చేయువారు నావ నడుపువారు ఉపద్రవములను పొందెదరు. విశాఖ నక్షత్రములో పయనించిన సుందరవృష్టి కురియును. వాణిజ్యకర్మ చేయువారు పీడితులగుదురు. అనూరాధ నక్షత్రములో పయనించినపుడు క్షత్రియులతో విరోధము,జ్యేష్ఠలో క్షత్రియులలో ప్రధానవ్యక్తికి నాశము కలుగును. మూలలో

నున్న శుక్రుడు ప్రధాన వైద్యులకు నాశము కలుగును. ఈ మూడు నక్షత్రములలో శుక్రుడున్నపుడు అనావృష్టి కారకుడగును.

పూర్వాషాఢ నక్షత్రములో శుక్రుడున్నపుడు జలజీవులు పీడింపబడును. ఉత్తరాషాఢ నక్షత్రములో రోగోత్పత్తి, శ్రవణంలో కర్ణపీడ, ధనిష్ఠలో పాఖండులకు భయమును కలిగించును. శతభిషనక్షత్రములోనున్నపుడు మద్యవిక్రేతలు పీడితులగుదురు. పూర్వాభాద్రలో నున్నపుడు జూదరులు కురుపాంచాల దేశప్రజలు పీడితులగుదురు. వర్షము కురియును. ఉత్తరాభాద్రలో శుక్రుడున్నపుడు ఫలమూలములు, రేవతిలో నున్నప్పుడు పథికులు (బాటసారులు),అశ్వినిలో నున్నపుడు అశ్వపాలకులు భరణి లోనున్నపుడు కిరాతకులు, యవనులు పీడితులగుదురు. కృష్ణపక్ష చతుర్దశి, అమావాస్య, కృష్ణపక్ష అష్టమి తిథులలో శుక్రుని ఉదయాస్తమయములైన భూమి జలముతో పరిపూర్ణమగును. బృహస్పతి,శుక్రుడు పరస్పరము సప్తమరాశిలో నున్నపుడు రోగములు అనేక విధములైన భయములతో ప్రజలు పీడితులగుదురు. అనావృష్టి కలుగును. శుక్రునికి ముందు బృహస్పతి,కుజుడు శని గ్రహములున్న మనుష్యులు,నాగులు,విద్యాధరుల మధ్య యుద్ధము,భయంకర వాయువుతో వృక్షముల నాశము, మిత్రుల మధ్య శత్రుభయము, బ్రాహ్మణులలో కర్మరాహిత్యము, వర్షాభావము, వజ్రపాతము (పిడుగుపడుట) వలన పర్వతములు నాశనమగును.

శుక్రుని ముందు శని గమనము చేసిన మ్లేచ్ఛజాతి, పిల్లి ఏనుగు, గాడిద, దున్నపోతు, నల్లనిధాన్యము, పంది, నిషాదుడు, శూద్రుడు, దక్షిణదిశలో నున్న ప్రజలు నేత్రరోగములు, వాయువికారములతో నష్టపోదురు. శుక్రునికి ముందు కుజుడు గమనము చేసిన అగ్ని,క్షుధ(ఆకిలి) అనావృష్టి దొంగలవలన ప్రజలకు, ఉత్తరదిశలోనున్న జంగమ స్థావర ప్రాణులు, అగ్ని,విద్యుత్తు(మెరుపు)ధూళితో దిశలు నాశనము పొందును.

శుక్రుని ముందు గురువు గమనము చేసిన తెల్లని వస్తువులు, బ్రాహ్మణుడు, గోవులు, దేవతాగృహములు, పూర్వదిశ నాశనమగును. మేఘములు వడగండ్లను కురిపించును.ప్రజలకు కంఠరోగము కలుగును. శరత్కాలములో పండుధాన్యములధికమగును. శుక్రునికి ముందు బుధుడు గమనము చేసిన వర్షము, పిత్తజ, కామలా (సుఖ) రోగములుత్పన్నమగును. గ్రీష్మఋతువులో పండు ధాన్యముల వృద్ధి జరుగును. వనరాసులు అగ్నిహోత్రులు, వైద్యులు, యోధులు, గుర్రములు, వైశ్యులు, గోవులు, వాహనములు రాజులు, పసుపురంగు వస్తువులు పశ్చిమదిశ నాశనమగును.

శుక్రుని వర్ణము అగ్ని సమానమైన అగ్నిభయము, రక్తసమానమైన శస్త్రకోపము, గరుకురాయిపై రాసిన బంగారలు రేఖవలె నున్న రోగములు, చిలుక సమాన వర్ణముతో పసుపు రంగులోనున్న శ్వాసరోగముల ఉత్పత్తి భస్మసమానముగా నల్లని వర్ణముతో నున్న అనావృష్టి కలుగును. కుముద పుష్పము చంద్రసమాన కాంతితో స్పష్టకిరణములు, విపులమూర్తి, సుందరగతి, వికారరహిత ఆకారముతో నున్న శుక్రుడు ప్రజలను కృతయుగమువలె (వ్యాధి దరిద్ర శోకరహితము)చేయును.

తొమ్మిదవ శుక్రచారాధ్యాయము సమాప్తము

10. శనిచారాధ్యాయము

శనిగ్రహము శ్రవణ స్వాతి హస్త ఆర్ద్ర భరణి పుబ్బ నక్షత్రములలో నిర్మల రూపముతో నున్న భూమి జలముతో పరిపూర్ణమగును. ఆశ్లేష శతభిష జ్యేష్ఠ నక్షత్రములలో నున్న సుందర క్షేత్రము, స్వల్పవృష్టి కలుగును. మూలనక్షత్రములో నున్న దుర్భిక్షము, యుద్ధము, అనావృష్టి కలుగును. ఈవిధముగా సంక్షిప్తముగా ఫలితమును తెలిపి ప్రతీ నక్షత్రమునకు ఫలమును తెలిపెదను.

శనిగ్రహము అశ్విని నక్షత్రములోనున్న గుర్రము, గుర్రములను చూచేవారు, కవి,వైద్యుడు,మంత్రులు నాశనమగుదురు. భరణి నక్షత్రములో నున్న వర్తకము, వాద్యకారులు గాయకులు అన్యాయమార్గములో నడిచేవారు, నిషాదులు వీరందరికి నాశనము కలుగును.

కృత్తికా నక్షత్రములో శనిగ్రహమున్న అగ్నిచే జీవించేవారు, సేనాపతులు నాశన మగుదురు. రోహిణి నక్షత్రములోనున్న కోసల మద్రకాశి, పాంచాల దేశములో నున్న వారు,బండ్లతో జీవించేవారు నాశనమగుదురు. మృగశిరా నక్షత్రములో శని గ్రహమున్న వత్సదేసవాసులు యాజకులు యజమానులు ప్రధానమనుష్యులు మధ్య దేశవాసులు పీడితులగుదురు. ఆర్ద్రలో నున్న పారతర మద్ర దేశములలోనున్నవారు, తెలికలి, రజక (చాకలి) చోరులు పీడితులగుదురు.

పునర్వసు నక్షత్రములో శనిగ్రహమున్న పాంచాల దేశములో, గుహలలో నుండువారు,సురాష్ట్రవాసులు సింధునదీ తటములందుండువారు,సౌవీర దేశములో నుండువారు పీడితులగుదురు. పుష్యమి నక్షత్రములోనున్న ఘంటలను కొట్టువారు,గుహలలో నుండువారు, యవనులు, వ్యాపారులు, కిరాతులు, ధూర్తజనులు పుష్పములు పీడింపబడును.

ఆశ్లేషా నక్షత్రములో శనిగ్రహమున్న ప్రాణులు, సర్పములు పీడింపబడును. మఖనక్షత్రములో శనియున్న బాహ్లిక,చీన,గాంధార, శూలిక పారతదేశములలో మనుష్యులు వైశ్యులు కోష్ఠాగారులు, వణిజులు, కిరాతకులు పీడితులగుదురు. పుబ్బ నక్షత్రములో శనిగ్రహమున్న షడ్రసములనమ్మేవారు, వైశ్యులు కన్యలు మహారాష్ట్ర నివాసులు పీడితులగుదురు. ఉత్తర నక్షత్రములో నున్న రాజులు బెల్లము ఉప్పు బిక్షుకులు జలము తక్షశిల నగరవాసులు పీడింపబడును.

హస్తనక్షత్రములో శనియున్న క్షురకులు (మంగలి) కుమ్మరులు దొంగలు వైద్యులు శిల్పులు ఏనుగులను పట్టేవారు, వైశ్యులు, కోశలదేశవాసులు, మాలాకారులు(పూలవారు) పీడితులగుదురు. చిత్తానక్షత్రములో నున్న స్త్రీగణము లేఖకులుచిత్రకారులు పీడితుల గుదురు. స్వాతీ నక్షత్రములో శనియున్న మగధదేశవాసులు,గుప్తచరులు,దూతలు,సారధులు, నావను నడిపేవారు, నటులు పీడితులగుదురు.

విశాఖ నక్షత్రములో శనియున్న త్రిగర్త,చీన,కులూతదేశవాసులు,కుంకుమ,

లక్క,ధాన్యము, మాంజిష్ఠ (ఎరుపు) కౌసుంభ(అడవికుసుంబ పువ్వు) పుష్పములకు నాశము కలుగును. అనూరాధ నక్షత్రములోనున్న కులూత తంగణ ఖస(నేపాల) కాశ్మీరదేశవాసులు మంత్రులు, చక్రచరులు,(కుమ్మరులు,తెలికలవారు) ఘంటను వాయించువారు శిల్పులు పీడితులగుదురు. మిత్రులమధ్య పరస్పరము భేదభావముత్పన్నమగును.

జ్యేష్ఠా నక్షత్రములో శనియున్న రాజులు, పురోహితులు,రాజులచే పూజింపబడేవారు, శూరులు, సన్యాసులు,ప్రధానకులస్థులు పీడితులగుదురు. మూలా నక్షత్రములో శనియున్న కాశి కోశల పాంచాల దేశములలో నుండువారు ఫలములు, ఔషధములు, యుద్ధవీరులు పీడితులగుదురు. పూర్వాషాఢ నక్షత్రములో శనియున్న వంగ, కోశల,గిరివ్రజ మగధ పూండ్ర మిథిల తామ్రశిల్పి దేశవాసులు పీడితులగుదురు. ఉత్తరాషాఢ నక్షత్రములోనున్న దశార్ణదేశవాసులు,యవన,ఉజ్జయినీవాసులు,శబరజాతి,పర్వతములపై నుండువారు కుంతిభోజ దేశములో నుండువారు పీడితులగుదురు.

శ్రవణా నక్షత్రములో శనియున్న అధికారులు, ప్రధాన బ్రాహ్మణులు, వైద్యులు, పురోహితులు పీడితులగుదురు. ధనిష్ఠా నక్షత్రములో నున్న మగధేశ్వరునికి విజయము, ధనాధికారికి వృద్ధి కలుగును. శతభిషా పూర్వాభాద్ర నక్షత్రములో శనియున్న వైద్యులు, కవులు, శౌండికులు (మద్యము విక్రయించేవారు) వ్యాపారులు,నీతిశాస్త్రము తెలిసినవారు పీడితులగుదురు. ఉత్తరాభాద్రలోనున్న నదీతీరవాసులు, రథాధికారులు, శిల్పులు, స్త్రీలు సువర్ణము నాశన మగును. రేవతి నక్షత్రములోనున్న రాజునాశ్రయించి యుండువారు, క్రౌంచద్వీపములో నుండువారు,శరత్కాల ధాన్యములు, శబరజాతి, యవనులు పీడితులగుదురు. విశాఖనక్షత్రములో గురుడు,కృత్తికలో శనియున్న సమయములో ప్రజలు నీతిలేనివారగుదురు. ఒకేనక్షత్రములో రెండు గ్రహములున్న నగరములలో పరస్పర ద్వేషము త్పన్నమగును.

శని గ్రహము అనేక వర్ణములతోనున్న పక్షులకు నాశము, పసుపుపచ్చగానున్న దుర్భిక్షము, రక్తవర్ణముతో నున్న యుద్ధము భస్మ (బూడిద)వర్ణముతో నున్న ప్రజలమధ్య ద్వేషము కలుగును.

శనిగ్రహ వర్ణము వైదూర్యమువలె నిర్మలముగానున్న ప్రజలకు శుభము కలుగును. వాణ లేక ఆతస్మీ పుష్ప సమానవర్ణముతో నల్లగానున్న శుభము కలుగును. శనిగ్రహము ఏవిధమైన వర్ణమును ధరించునో ఆవర్ణసమానులైన మనుష్యులకు నాశనము కలుగును. తెల్లనివర్ణమున్న బ్రాహ్మణులకు,రక్తవర్ణమున్న క్షత్రియులకు, పచ్చనివర్ణమున్న వైశ్యులకు, నల్లనివర్ణమున్న శూద్రులకు నాశము కలుగును. ఈవిధముగా ప్రాచీనులు తెలిపిరి.

పదవ శనిచారాధ్యాయము సమాప్తము

11. కేతుచారాధ్యాయము

గర్గ పరాశర అసితదేవలులు మరియు మిగిలిన ఆచార్యులు తెలిపిన కేతు చారమును చూచి సందేహ రహితముగా కేతుచారమును గూర్చి తెలిపెదను. గణితము ద్వారా కేతు అస్తమయము ఉదయములను గూర్చి తెలిసికొనలేము. దివ్య (ఆకాశములో ఉద్భవింవును) అంతరిక్ష (గ్రహనక్షత్ర స్థానములో ఉదయించును) భౌమ (భూమిపై ఉదయించును) నామములతో మూడు విధములైన కేతువులుండును. ఉత్పాత రూపము లగుట వలన వీటి ఉదయాస్త మయములు తెలిసికొనలేము.

ఖద్యోతము పిశాచాలయము (యక్షినిస్థానము) మణి (చంద్రకాంతాది మణులు) రత్నములు వీటినివదలి అగ్నికన్న వేరైన,అగ్నితో సమానమైన రూపము కనిపించిన కేతు రూపముగా భావించవలెను. ధ్వజము,శస్త్రము,గృహము,వృక్షము,అశ్వము,గజాది రూపములలో కనిపించిన అది అంతరిక్ష కేతువగును. అది నక్షత్రములలో కనపడిన దివ్య కేతువు, అన్యస్థానములలో కనిపించిన భౌమకేతువగును. కొందరు నూటొకటి అని ఇతరులు సహస్రమని (వెయ్యి) నారదముని అనేక రూపములతో ఒకటే కేతువని తెలిపెను.

ఒకటైన అనేకమైన దీనివలన నాకు ఏమి ప్రయోజనము లేదు. కాని ఉదయము, అస్తమయము, దానిస్థానము, స్పర్శము (గ్రహనక్షత్రముల స్పర్శ) అధూమనము (శ్వేత, రక్త, పీత, కృష్ణవర్ణము) వలన నేను ఫలమును తెలిపెదను. ఎన్నిరోజులు కేతువు కనిపించునో దాని అస్తమయమునకు 45దినముల తర్వాత అన్నిమాసముల వరకు,మరియు ఎన్ని మాసముల వరకు కనిపించునో అస్తమయమునకు 45దినముల తర్వాత అన్నివర్షముల వరకు ఫలము నిచ్చును. చిన్నది సన్ననిది నిర్మలమైనది స్నిగ్ధమైనది సరళమైనది కొన్నిరోజులలో అదృశ్యమైనది, తెల్లనిది ఉదయకాలములో వర్షము కురిపించునదైన కేతువు సుఖమును కలిగించును.

పైనతెల్పిన లక్షణములకు భిన్నమైన కేతువు శుభమును కలిగించదు. ఇంద్రధనుస్సు ఆకారము, రెండు మూడు శిఖల ఆకారముతోనున్న కేతువు శుభఫలము నీయదు. ముక్తాహారము, మణిసువర్ణ సమానమైన కేతువులు ఇరవైఐదు విధములుగా నుండును. సూర్యపుత్ర కిరణనామక కేతువు పూర్వపశ్చిమ దిశలలో కనపడును. పైన తెల్పిన ఇరవైఐదింటిలో ఒకటి కనపడిన రాజుల మధ్య పరస్పర ద్వేషముత్పన్నమగును.

చిలుక, అగ్ని, లోహము, లక్క లేక ఎరుపు వర్ణపు కాంతితో అగ్నిపుత్రులై ఐదు విధములుగా కేతువులు కనిపించును. ఇవి అగ్నికోణములో కనిపించును. వీటి దర్శనము వలన అగ్నిభయము కలుగును. వంకరశిఖరము, రూక్ష కృష్ణవర్ణములు కలిగి యమ

పుత్రులై ఇరవైఐదు విధములుగా కేతువులుందురు. ఇవి దక్షిణదిశలో ఉదయించును. వీటి ఉదయమైన భూమిపై మహామారి ఉత్పన్నమగును (రోగములు వ్యాపించును)

వృత్తాకారము, దర్పణ(అద్దము) సమానము, శిఖారహితమై కిరణములతో కూడి జలము నూనెలవలె ఇరవైరెండు విధములుగా భూమి పుత్రకేతువులుందురు. ఇవి ఈశాన్యములో ఉదయించును. వీటి దర్శనము వలన దుర్భిక్షము కలుగును. బ్రహ్మపుత్రుడు మూడుశిఖలు కలిగి మూడువర్ణములతో కూడిన ఒక కేతువుండును. ఇది అన్ని దిశలలో ఉదయించును. దీని దర్శనమైన అన్నిప్రదేశములు నాశనమగును. ఈవిధముగా నూటొక్క కేతువుల లక్షణములు చెప్పబడినవి. తర్వాత ఎనిమిదివందల తొంభై తొమ్మిది కేతువుల లక్షణము తెల్పెదను.

విస్తీర్ణము, శుక్లము (తెలుపు) నిర్మల శరీరము కలిగిన ఎనభై నాలుగువిధములైన శుక్ర పుత్రకేతువులున్నారు. ఇది ఉత్తర, ఈశాన్యకోణములో ఉదయించును. వారిదర్శనము వలన అశుభఫలము కలుగును. నిర్మలకాంతితో కూడి రెండుశిఖల శనీశ్వర పుత్రులు అరవై విధములైన కేతువులున్నారు. వీరు కనక (బంగారు) సంజ్ఞకలిగి అన్ని దిశలలో ఉదయించును. వారి దర్శనము వలన అశుభఫలము కలుగును. తెల్లనిది ఒకతార కలిగినది శిఖ లేనిది నిర్మల శరీరము కలిగినదైన అరవైఐదు విధములైన బృహస్పతి పుత్రులు కేతువులున్నారు. వీరు వికచసంజ్ఞ కలిగి దక్షిణ దిశలో ఉదయింతురు. వీరి దర్శనము వలన అశుభఫలము కలుగును.

అస్పష్టము సూక్ష్మశరీరము, దీర్ఘము, శ్వేతవర్ణము (తెలుపు) కలిగి, అన్నిదిశలలో ఉదయించు తస్కరనామక బుధపుత్రులు ఏభై కేతువులుందురు. వీరి దర్శనము అశుభఫలము నిచ్చును. రక్తము లేక అగ్ని సమానకాంతివాడు, మూడుశిఖలు, మూడుతారలు కలిగిన అరవై విధములైన మంగళ పుత్రులు కేతువులుందురు. వీరు ఉత్తరదిశలో ఉదయింతురు. వీరి దర్శనము వలన అశుభఫలము కలుగును.

రాహుపుత్రులు తామస కీలకసంజ్ఞ కలిగిన ముప్పైమూడు విధములైన కేతువులుందురు. వీరు సూర్యచంద్ర మండలములలో కనిపింతురు. వీరి ఫలితము సూర్యచారాధ్యాయములో తెలుపబడినది. ఎక్కువకాంతి కలిగిన అగ్నిపుత్రులు నూట ఇరవై విధములైన కేతువులుందురు. వీరు విశ్వరూప సంజ్ఞ కలిగి భయంకరమైన అగ్నినిచ్చు వారగుదురు.

శ్యామ (నల్లని) అరుణ (ఎర్రని) వర్ణములతో తారలు లేకుండ చామర సమానముగా విస్తృత కిరణములతో డెబ్బైఏడు వాయు పుత్రులైన కేతువులుందురు. వారు అరుణ సంజ్ఞతో కూడి పాపఫలముల నిచ్చెదరు. తారాపుంజమువలె నున్న ప్రజాపతి పుత్రులు ఎనిమిది విధములైన కేతువులున్నారు. వీరు గణక సంజ్ఞ కలిగి అశుభఫలము

నిచ్చెదరు. చతుర్భుజాకారుడైన బ్రహ్మపుత్రులు చతురస్ర సంజ్ఞ కలిగిన నూటనాలుగు మంది కేతువులున్నారు. వీరు అశుభఫలము నిచ్చెదరు. ఈ కేతువులిద్దరు అన్ని దిశలలో ఉదయింతురు.

వంశ,గుల్మా(లత)కారము కలిగినవారు వరుణపుత్రులు కంకసంజ్ఞ మరియు చంద్రసమానకాంతి కలిగిన ఇరవైరెండు మంది కేతువున్నారు. వీరుఅన్ని దిశలలో ఉదయింతురు. వీరిదర్శనము అశుభఫలము నిచ్చును. కబంధ సంజ్ఞ కలిగిన కాలపుత్రుడు ఛిన్న (నరుకబడిన) శరీరము, పురుష సమాన ఆకృతి కలిగినవాడు అస్పష్టతారలు కలవారైన తొంభైమంది కేతువులు అన్నిదిశలలో ఉదయించును. వీరి దర్శనము వలన పుంద్ర దేశములో శుభము, మిగిలిన దేశములలో అశుభఫలము కలుగును. శ్వేతవర్ణము కలిగి విస్తృతమై ఒకతార కలిగిన విదిశపుత్రులు తొమ్మిది విధములైన కేతువులున్నారు. వీరు విదిశలలో నుత్పన్నమగుదురు. వీరిదర్శనము వలన అశుభఫలము కలుగును. ఈవిధముగా ఒకవెయ్యి మంది కేతువులున్నారు. ముందు వీరి గురించి తెలుపబడును.

ఉత్తరమువైపు విస్తృతము స్థూలము నిర్మలమై పశ్చిమదిశలో ఉదయించు వసానామక కేతువుండును. ఇతని ఉదయము వలన భూమిపై మహామారి(వ్యాధులు)వ్యాపించును. కాని దేశము సుభిక్షముగానుండును. ముందు తెల్పిన వసాకేతువు వలె ఉదగాయతాది లక్షణములతో కూడిన రూక్ష అస్థికేతువుండును. అతడు దుర్భిక్షము కలిగించును. వసాకేతు లక్షణములతో కూడి,నిర్మలమై పూర్వదిశలో శస్త్రకేతువు ఉదయించును. ఇతడు శస్త్ర యుద్ధము చేయువాడు మనుష్యులను చంపువాడగును.

ధూమ్రవర్ణపు కిరణములవాడు, అమావాస్యలో పూర్వదిశలో ఉదయించువాడై, ఆకాశములో ఆర్ద్రాభాగములో కపాలకేతువు సంచారము చేయును. అతని దర్శనము వలన భూమిపై దుర్భిక్షము మహామారి (వ్యాధులు) అనావృష్టి రోగములు త్పన్నమగును. పూర్వదిశలో అగ్నికోణములో ఉదయించువాడు, మూడుశిఖలవాడు,కపిశ(నీరుకాలి రంగు) రూక్ష తామ్ర (ఇత్తడి) సమానమైన కిరణములవాడు ఆకాశములో మూడు భాగములలో గమనము చేయు రౌద్రనామక కేతువున్నాడు. అతని దర్శనము వలన కపాలకేతు ఫలితములు కలుగును.

పశ్చిమదిశలో ఉదయించువాడు, దక్షిణదిశలో ఒక అంగుళము శిఖ కలిగినవాడు, ఉత్తరదిశకు వెళ్ళుకొలది పొడవుగా మారువాడు. సప్తర్షి, ధ్రువతార అభిజిత్ నక్షత్రములను స్పర్శించి తిరిగివచ్చువాడు, ఆకాశములో ఆర్ద్రాభాగములోనికి వెళ్ళి దక్షిణదిశలో అస్తమించు వాడైన చలకేతువుండును. ఇతని దర్శనము వలన ప్రయాగ నుండి అవంతి వరకున్న దేశములు, పుష్కరారణ్యము నుండి ఉత్తరదిశలో దేవికానది

వరకున్న దేశములు నాశనమగును. మధ్య దేశములు అధికనాశనము పొందును. ఇతర దేశములు రోగములు దుర్భిక్షములతో నాశనము పొందును. దీనిఫలము దర్శన కాలము నుండి పదిమాసముల వరకుండును. కొందరి మతము ననుసరించి పద్దెనిమిది మాసముల వరకుండును.

శ్వేతకేతువు పూర్వదిశలో అర్ధరాత్రి సమయములో కనిపించును. దక్షిణదిశకు శిఖ కలిగియుండును. కసంజ్ఞక కేతువు ఎండ్లబండి కాడి ఆకారములో నుండి పశ్చిమదిశలో అస్తమించును. నిర్మలముగా వీరిద్దరు ఏడురోజులు కనిపించిన సుభిక్షము కలుగును. ఏడు దినములకన్న అధికముగా కనామక కేతువు కనిపించిన పదివర్షముల వరకు శస్త్రముల వలన మనుష్యులకు పీడ కలుగును.

శ్వేతనామక కేతువు జటాసదృశము, రూక్షము, కపిలవర్ణము కలిగి ఆకాశములో మూడుభాగముల వరకు వెళ్ళి తిరిగి వచ్చును. ఇతని దర్శనమైన ప్రజలలో మూడవవంతు మిగులుదురు. రెండువంతుల ప్రజలు నష్టమగుదురు. ధూమ్ర (పొగ)వర్ణ శిఖకలిగి కృత్తికా నక్షత్రములో కనిపించువానిని రశ్మి కేతువందురు. ఇతని దర్శనము వలన శ్వేత కేతువు వలె ఫలము కలుగును. ఈ ధ్రువసంజ్ఞక కేతువు అనిశ్చిత గమనము, ప్రమాణము, వర్ణము, ఆకృతులు గలవాడు, అన్నిదిశలలో కనపడువాడు, దివ్యఅంతరిక్ష, భౌమ భేదములు కలిగినవాడు, నిర్మలమైనవాడై శుభఫలము నిచ్చును. ఈ కేతువు నాశనమగుతున్న సేనాంగములలో, నాశమగుతున్న దేశములలోని గృహములు, వృక్షములు, పర్వతములలో, నాశమవుతున్న గృహస్థుల ఉపకరణ ద్రవ్యములలో కనపడును.

కుముద పుష్పమువలె కాంతి గలవాడు, పశ్చిమదిశలో ఉదయించువాడు, తూర్పు వైపుకి శిఖగలవాడు, ఒకరాత్రిలో కనపడువాడు కుముద కేతువుగును. ఇతని దర్శనమైన భూమి సుభిక్ష మగును. పశ్చిమదిశలో ఒకప్రహర ప్రమాణ రాత్రిలో ఒకమారు కనిపించువాడు, పాలధారవలె స్పష్టమైన శిఖగలవాడు మణికేతువగును. ఈ కేతువు ఉదయకాలము నుండి నాలుగున్నర నెలల వరకు సుభిక్షమును, ముంగిస మున్నగు క్షుద్రజంతువుల ఉత్పత్తికి కారణమగును. పశ్చిమదిశలో కనపడువాడు, నిర్మలుడు పశ్చిమోన్నతమైన శిఖగలవాడు జలకేతువగును. అతడు ఉదయించిన తొమ్మిదిమాసముల వరకు ప్రజలకు సుభిక్షము శాంతిని కలిగించును. పూర్వదిశలో ఒకరాత్రి కనిపించువాడు సూక్ష్మతారతో కూడి సింహపు తోకవలె దక్షిణావర్తశిఖ గలవాడు భవకేతువగును. ఇతడు నిర్మలమూర్తియై ఎన్ని క్షణములు కనిపించునో అన్ని మాసముల వరకు ప్రాణాంతక రోగములుత్పన్నమగును.

పూర్వదిశలో కేవలము ఒకరాత్రిలో కనపడువాడు మృణాలము (తామరతాడు) వలె గౌరవర్ణము కలవాడు పద్మకేతువగును. అతడుదయించిన ఏడు వర్షముల వరకు

సుభిక్షము ప్రజలకు ఆనందము కలిగించును. పశ్చిమదిశలో అర్ధరాత్రి సమయములో ఉదయించేవాడు, దక్షిణశిఖవాడు, రక్తవర్ణము నిర్మల శరీరము కలవాడు ఆవర్తకేతువగును. అతడు ఎన్ని క్షణములు కనిపించునో అన్నిమాసములు సుభిక్షముగా నుండును.

పశ్చిమదిశలో సంధ్యాకాలములో ఆకాశములో మూడవభాగము వరకు కనిపించువాడు, ధూమ్రలేక తామ్ర వర్ణములలో మూడు శిఖలు గలవాడు ఆవర్తకేతువగును. అతడెన్ని క్షణములు కనిపించునో అన్ని సంవత్సరముల వరకు యుద్ధము వలన రాజులు నాశనమగుదురు. ఉదయకాల నక్షత్రమునకు పీడకలుగును.

శుభకేతువులను వదలి మిగిలిన కేతువుల ద్వార స్పర్శించబడిన నక్షత్రముల వలన నాశమగు రాజుల గురించి తెలుపబడును. కేతువుతో స్పర్శించబడిన (ముట్టిన) అశ్వినీ నక్షత్రము వలన అశ్వక దేశాధిపతి, భరణి వలన కిరాతకుల అధిపతి, కృత్తిక వలన కలింగాధిపతి, రోహిణి వలన శూరసేన దేశాధిపతి నాశనమగుదురు. మృగశిర నక్షత్రమైన ఉశీవర దేశాధిపతి, ఆర్ద్రా నక్షత్రమైన మత్స్యదేశాధిపతి, పునర్వసువైన అశ్మక దేశాధిపతి, పుష్యమియైన మగధాధిపతి నాశనమగుదురు. ఆశ్లేషా నక్షత్రమైన అసికేశ్వరాధిపతి, మఘా నక్షత్రమైన అంగదేశాధిపతి,పుబ్బానక్షత్రమైన పాండ్యదేశాధిపతి, ఉత్తరా నక్షత్రమైన ఉజ్జయినీపతి, హస్తా నక్షత్రమైన దండకవనస్వామి నాశనమగుదురు.

కేతువుతో స్పర్శించబడిన చిత్తా నక్షత్రము వలన కురుక్షేత్రాధిపతికి మరణము,స్వాతీ నక్షత్రమైన కాశ్మీర,కాంభోజదేశాధి పతులకు నాశనము కలుగును. విశాఖనక్షత్రమైన అలకాధిపతి, అనూరాధా నక్షత్రమైన పుండ్రాధిపతి, జ్యేష్ఠా నక్షత్రమైన సార్వభౌముడైన రాజుకు నాశనమగును.

కేతువుతో స్పర్శించబడిన మూలా నక్షత్రము వలన ఆంధ్రమద్రక దేశముల అధిపతులకు, పూర్వాషాఢ నక్షత్రమైన కాశీనాధునకు, ఉత్తరాషాఢ నక్షత్రమైన యౌధేయక అర్జునాయన శిబి చైద్య దేశరాజులకు నాశనము కలుగును. శ్రవణా నక్షత్రమైన కేకయ దేశాధిపతికి, ధనిష్ఠయైన పాంచాలాధిపతికి శతభిషా నక్షత్రమైన సింహళదేశాధిపతికి, పూర్వాభాద్ర నక్షత్రమైన వంగదేశాధిపతికి, ఉత్తరాభాద్ర నక్షత్రమైన నైమిషారణ్య దేశాధిపతికి, రేవతీ నక్షత్రమైన కిరాతాధిపతికి నాశనము కలుగును.

కేతువు ఉల్కతో పీడితమై (కొట్టబడిన)న శుభమును కలిగించును. వృష్టి యుక్తమైన అతిశుభమును కలిగించును. అదే కేతువు చోళ,అవగాణ,సితహూణ, చీనదేశములలో నున్న ప్రజలకు అశుభమును కలిగించును. కేతువుశిఖ ఏదిశలో వంగి ఉండునో ఏనక్షత్రముతో స్పర్శకలిగియుండునో వాటికి సంబంధించినస్థానములలో అన్యభోగీ జనులతో పాటు అత్యధిక పరాక్రమముతో జయించిన గ్రామములతో గరుడుడు తన శక్తితో సర్పములను భక్షించినట్లు రాజులు భోగముల ననుభవింతురు.

పదకొండవ కేతుచారాధ్యాయము సమాప్తము

12. అగస్త్యచారాధ్యాయము

సూర్యమార్గమును నిరోధించినవాడు, వింధ్యాచల శిఖర గర్వమునణచినవాడు, మునుల పొట్టను చీల్చినవాడు దేవతల శత్రువు వాతాపిని జీర్ణము చేసుకున్నవాడు, సముద్రమును త్రాగినవాడు, దక్షిణదిశకు శోభను కలిగించినవాడు, జలరాశిని నిర్మలముగా చేసినవాడైన అగస్త్య మునిని సంక్షేపముగా వర్ణన చేయుదును.

జలప్రవాహము కలవాడు మకరము (మొసలి)ల గోళ్ళతో చీల్చబడిన పర్వత శిఖరములు కలవాడు రత్నములతో కూడిన ముకుటముతో దేవతాదులను తిరస్కరించు వాడు, ఇక్కడక్కడ పడిన మిశ్రితమైన శ్రేష్ఠ ముత్యములతో కూడిన జలప్రవాహముతో సముద్రమును అగస్త్యముని అతిసుందరముగా తయారుచేసినాడు.

అగస్త్యముని సముద్రజలములను గ్రహించినప్పటికి మణిరత్న ప్రవాళములతో కూడిన వృక్షముల పంక్తితో శిఖరములతో సర్పరహితమైన పర్వతములతో సముద్రము అతి శోభాయమానమై యున్నది. సముద్ర జలమును అగస్త్యముని గ్రహించుట వలన జలాభావము వలన సముద్రజలములో చలించుమత్స్యములు (చేపలు) నీటి ఏనుగులు, సర్పములు ఇక్కడక్కడకు చెదిరి పోయునవి. రత్నములు మణులు బయటపడి స్వర్గశోభను కలిగించినవి.

జలము నష్టమైనప్పటికి చలించు మత్స్యములు ముత్యములు శంఖములతో కూడిన సముద్రము శరదృతువులో తరంగములు తెల్లని కలువలు, హంసలతో కూడిన సరోవరశోభను పొందినది. మత్స్యరూపమేఘము, మణిరూపమైన తార, స్ఫటికమణి రూపమైన చంద్రుడు, జలభావరూపమైన శరత్కాల కాంతి, సర్పముల పగడలపైనున్న సూర్యకాంతి చంద్రకాంతి మణుల కిరణముల రూపమైన కేతువుతో కూడిన సముద్రమును నిర్మించెను.

సూర్యమార్గమును నిరోధించుటకు ఉన్నతమైన శిఖరముతో భయము కలిగించేది. విద్యాధర కంధరములో విద్యాధర గణములతో విద్యాధర శరీరములో కలిగిన కంపముతో అత్యున్నత ధ్వజరూపమైన వస్త్రముతో శోభించునది. ఏనుగుల మదముతో ఉత్పన్నమైన గంధమును ఆస్వాదించుతున్న భ్రమర గణములతో కూడిన శిరోమాలను ధరించిన సింహములతో కూడిన గుహలు కలిగినది, గజములతో కూల్చబడినపుడు కంపించిన పుష్పములతో కూడిన వృక్షములపై చంచలము ఆనంద పూర్వక మధురశబ్దములు చేయు భ్రమరము (తుమ్మెదలు)ల పంక్తితో కూడినది. అశ్వము ఎలుక వ్యాఘ్రము (పులి) వానరము లతో కూడిన పర్వతశిఖరములతో ఆకాశమును చూచించునది. నిర్జనస్థానములో మదన వృక్షములతో మదనాతురమైన రేవానదితో కూడినది, దేవతలచే సేవించబడు ఉద్యానవనములు కలది జలహారి నిరాహారి వాతాహారులైన బ్రాహ్మణుల మునులతో

సేవించబడునదైన వింధ్యాచలమును నిరోధించిన అగస్త్యముని ఉదయమును వినుము.

ఏవిధముగా దుర్జన సాంగత్యము వలన దూషితుడైన మనుష్యుడు సజ్జన సాంగత్యము వలన నిర్మల హృదయుడగునో అదే విధముగా వర్షఋతువులో బురదతో కూడిన జలము అగస్త్యముని దర్శనము వలన నిర్మలమగును. తాంబూల సేవనముతో కూడిన ఎఱ్ఱని పెదవుల మధ్య వెలుగు దంత పంక్తివలె, నవ్వుతున్న స్త్రీవలె రెండు పార్శ్వములందు ఎరుపు రంగు చక్రవాకముల మధ్య శబ్దాయమానమైన హంసపంక్తితో విరాజిల్లు నదులతో శరదృతువు శోభించుచున్నది.

భ్రమణము (తిరుగుతున్న) చేయుచున్న భ్రమరపంక్తితో భూషితము, నీలకమలము ల దగ్గరున్న తెల్లని కమలముతో శోభితమైన నదులతో శరదృతువు, భ్రూలతలతో కూడిన కటాక్ష వీక్షణములతో చరించు మదనాతుర స్త్రీవలె శోభించుచున్నది.

తరంగము వంటి కంకణము ధరించిన వాపీరూపియైన కామినీ స్త్రీ రాత్రియందు మేఘములు వెడలిన పిమ్మట పొందిన చంద్రుని శోభను చూచుటకొరకా యనునట్లు భ్రమరములతో కూడిన కుముదరూపమైన కృష్ణ తారాయుక్త నేత్రములను తెరుచుచున్నది. అనేక విధములైన విచిత్రమైన కమలములు హంసలు చక్రవాకములు కారండవములతో శోభించు తటాక రూపమైన హస్తముద్వారా భూమి అనేక రత్నములు పుష్పములు ఫలములతో అగస్త్యమునికి అర్ఘ్యమిచ్చుచున్నదాయను నట్లున్నది.

మేఘములచే ఆవరింపబడిన, ఆకారముగల సర్పముల పడగలతో ఉత్పన్నమైన విషరూప అగ్నితో దూషితమై చంద్రుని ఆజ్ఞతో కురిసే జలము అగస్త్యముని దర్శనముతో శుభప్రదమగును. ఎవరిని స్మరించిన పాపము నష్టమగునో, అటువంటి వరుణ పుత్రుడైన అగస్త్యుని స్తుతించుట వలన కలుగు ఫలమును ఏమని చెప్పగలము. గర్గాది మునుల ద్వారా ఏవిధముగా అతనికి అర్ఘ్యవిధి తెలుపబడినదో అధే విధముగా రాజుల హితము కొరకు నేను తెలియజేయుదును. గణితము ద్వారా ప్రతిదేశములో ఇతని దర్శనమును గూర్చి తెలిసికొని పండితులు తెలుపవలెను. సింహరాశిపై ఇరవైమూడవ అంశముపై సూర్యుడు ప్రవేశించినపుడు ఇతని దర్శనమగును.

సూర్యకిరణముల వలన రాత్రి అంధకారము కొంతపోయిన తర్వాత జ్యోతిష్కుడు తెల్పిన దక్షిణదిశలో భూమిపై రాజు అగస్త్యమునికి అర్ఘ్యమీయవలెను. శరత్కాలములో సుగంధముతో కూడిన పుష్పములు, ఫలములు సముద్రములో ఉత్పన్నమగు రత్నములు, బంగారు వస్త్రము, గోవులు వృషభములు పాయసయుత భోజనము, ద్రవ్యములు పెరుగు సుగంధయుత ధూపము, చందనముతో అర్ఘ్యమీయవలెను. శ్రద్ధతో కూడిన రాజు అర్ఘ్యప్రదానము విధిపూర్వకముగా చేసిన రోగరహితుడగును. శత్రువులను జయించును. ఈ విధముగా ఏడు సంవత్సరములు భక్తిపూర్వకముగా అర్ఘ్యము సమర్పించిన సముద్ర

భూమికి రాజుగా ప్రసిద్ధిచెందును.

తనశక్త్యనుసారము దొరికిన వస్తువులతో అర్ఘ్యమిచ్చిన బ్రాహ్మణులు వేదములను, స్త్రీలు పుత్రులను, వైశ్యులు గోవులను, శూద్రులు ధనమును పొందును. బ్రాహ్మణాది వర్ణముల వారికి రోగక్షయము ధార్మికఫలము ప్రాప్తించును. అగస్త్యుడు రూక్షుడైన (కఠినుడైన) రోగములను, కపిలవర్ణమైన అనావృష్టిని, ధూమ్రవర్ణముతోనున్న గోవులకు నష్టమును, లోహితవర్ణముతో నున్న దుర్భిక్షము యుద్ధమును, సూక్ష్మముగా నున్న నగరమునకు నష్టమును కలిగించును.

సువర్ణ రజిత స్ఫటిక సమాన కిరణములతో భూమికి తృప్తిని కలిగిస్తు అగస్త్యముని కనిపించిన భూమిపై అధికధాన్యముతో, నిర్భయముతో, రోగరహితమై మనుష్యులుందురు. అగస్త్యముని ఉల్కకేతువులతో కూడియున్నచో భూమిపై దిర్భిక్షము రోగములు కలుగును. అగస్త్యముని సూర్యుని హస్తగతమైన ఉదయించును. రోహిణి నక్షత్రగతమైన అస్తమించును.

పన్నెండవ అగస్త్య చారాధ్యాయము సమాప్తము

13. సప్తర్షిచారాధ్యాయము

ఏకావలీ భూషణము(ఆభరణ విశేషము)తో,శ్వేతకమలమాలతో చిరునవ్వుతో కూడిన స్వామి సహితుడైన కామిని వలె ఏడుగురు మునులతో ఉత్తరదిశ శోభాయ మానముగా నుండును. మునిపంక్తితో కుటిల (వంకరగా)ముగా నున్న కారణము వలన పూర్వము తెల్పిన అన్ని విషయములు త్పన్నమగును. ధ్రువునితో కూడి తిరుగుతున్న సప్తర్షులతో ఉత్తరదిశ నాట్యము చేయుదాని వలె కనపడును.

ధ్రువనక్షత్ర రూప నాయకుని ప్రదేశములో తిరుగుతున్న సప్తర్షులతో ఉత్తరదిశ మాటిమాటికి నర్తించును. వృద్ధగర్గమతానుసారము దీనిని సంచారమందురు. యుధిష్ఠిరుడు రాజ్యము చేయుచున్నప్పుడు మఘానక్షత్రములో సప్తర్షులున్నారు.

ఒక నక్షత్రములో వంద సంవత్సరములు సప్తర్షులుందురు. పూర్వదిశలో ఉదయమైన నక్షత్రములో సప్తర్షిమండలము కనిపించిన ఆనక్షత్రములో సప్తర్షిమండలము ముండునని తలంచవలెను.పూర్వదిశలో భగవానుడు మరీచి, అతనికి పశ్చిమములో వశిష్ఠుడు, అతనికి పశ్చిమములో అంగిరుడు, అతని తర్వాత అత్రి, అతనికి సమీపమున పులస్త్యుడు, అతని తర్వాత పులహుడు, అతని తర్వాత క్రతువు. ఈవిధముగా పూర్వదిశ నుండి మొదలుకొని క్రమముగా సప్తర్షులస్థితి యుండును.వీటిమధ్యలో అరుంధతీ వశిష్ఠులుందురు.

ఉల్క, వజ్రము (పిడుగు) ధూమకేతువులతో పీడింపబడి వివర్ణము జ్యోతిరహితము

స్వల్పబింబమైన సప్తర్షిమండలము తమతమ వర్ణములవారిని నాశనము చేయును. విపులము నిర్మలమైన బింబముతోనున్న తమవర్ణముల వారికి వృద్ధిని కలిగించును.

మరీచిపీడితుడైన గంధర్వ, దేవ, రాక్షస, మంత్ర, ఔషధ, సిద్ధ, యక్ష, నాగ, విద్యాధరులకు పీడను కలిగించును. నిర్మలము విపులమైన మరీచి వారికి వృద్ధిని కలిగించును. వశిష్ఠుడు పీడితుడైన శక, యవన, దరద, పారత, కాంభోజ, తాపసులు వనవాసులు పీడితులగుదురు. కిరణములతో సంపన్నమైన వారికి వృద్ధి కలుగును. అంగిరుడు పీడితుడైన జ్ఞానులు, బుద్ధిమంతులు బ్రాహ్మణులు పీడితులగుదురు. నిర్మలము విపులమైన వారికి వృద్ధికలుగును. అత్రిపీడితుడైన వనము జలములలో ఉత్పన్నమగు ద్రవ్యములు సముద్రము నదులు పీడింపబడును. విపులము స్నిగ్ధమైన వాటికి వృద్ధి కలుగును.

పులస్త్యుడు పీడితుడైన రాక్షస పిశాచ దానవ దైత్యసర్పములు పీడితులగును. స్నిగ్ధము విపులమైన వాటికి వృద్ధి కలుగును. పులహుడు పీడితుడైన కందమూలములు, ఫలములు పీడింపబడును. స్నిగ్ధము విపులమైన వాటికి వృద్ధి కలుగును. క్రతువు పీడితుడైన యజ్ఞములు యజ్ఞకర్తలు పీడితులగుదురు. స్నిగ్ధము విపులమైన వాటికి వృద్ధి కలుగును.

పదమూడవ సప్తర్షిచారాధ్యాయము సమాప్తము

14. కూర్మ విభాగాధ్యాయము

ఇరవైఏడు నక్షత్రములను తొమ్మిది వర్గములుగా విభజించి, ప్రత్యేకవర్గములో కృత్తికాది క్రమములో మూడేసి నక్షత్రములనుంచవలెను. ఈ తొమ్మిది వర్గములలో మేరుపర్వము నకు దక్షిణభాగములో నున్న భారతవర్షమును మధ్యభాగముగా భావించి మిగిలినభాగములను పూర్వదిశాది క్రమములో నుంచి తొమ్మిదిభాగములు చేసెను.

భద్ర, అరిమేద, మాండవ్య, నీప, ఉజ్జిహాన, సంఖ్యాత, మరు, వత్స, ఘోష, యాముచ,సారస్వత, మత్స్య, మాధ్యమిక, మధుర,ఉపజ్యోతిష, ధర్మారణ్య, శూరసేన, శౌరగ్రీవ, ఉద్దేహిక, పాంచాల, గుడ, అశ్వత్థ, పాండు, సాకేత, కంక, కురు, కాలకోటి, కుకుర, పారియాత్రనగ, ఔదుంబర, కాపిష్ఠల, హస్తినాపుర – ఈదేశములు కృత్తికాది మూడు నక్షత్రముల వర్గము (భారతవర్షము)లో నున్నవి.

అంజన, వృషభధ్వజ, ధ్వజ, పద్మ, మాల్యవానగిరి, వ్యాఘ్రముఖ, సుహ్మ, కర్వట, చంద్రపుర, శూర్పకర్ణ, ఖస, మగధ, శిబిరగిరి, మిథిల, సమతట ఓఢ్ర(ఒరిస్సా) అశ్వవదన, దంతురక, ప్రాగ్జ్యోతిష, లౌహిత్యనద, క్షీరోదసముద్ర, పురుషాద, ఉదయగిరి, భద్ర, గౌడక, పౌండ్ర, ఉత్కల, కాశి, మేకల, అంబష్ఠ, ఏకపద, తామ్రలిప్తక, కోశలక, వర్ధమాన దేశములు ఆర్ద్రాది మూడు నక్షత్రముల వర్గములో (పూర్వదిశ) నున్నవి.

కోశల, కలింగ, వంగ, ఉపవంగ, జఠరాంగ, శౌలిక, విదర్భ, వత్స, ఆంధ్ర,

చేదిక, ఊర్ధ్వకంఠ, వృష, నాలికేర, చర్మద్వీప, వింధ్యాచల, త్రిపురిశ్మశ్రుధర, హేమకూట, వ్యాలగ్రీవ, మహాగ్రీవ, కిష్కింధ, కంఠకస్థల, నిషాదరాష్ట్ర, పురిక, దాశార్ణ, నగ్నశబర, పర్ణశబర, దేశములు ఆశ్లేషాది మూడు నక్షత్ర వర్గములో (ఆగ్నేయము)నున్నవి.

లంక,కాలాజిన,సౌరికర్ణి, తాలికట, గిరినగర, మలయపర్వత, దర్దుర, మహేంద్ర, మాలింద్య, భరూకచ్ఛ, కంటక, కంకన, నవవాసి, శిబిక, ఫణికార, కొంకణ, ఆభీర, ఆకర, వేణ, ఆవర్తక, దశపుర, గోనర్ద,కేరల,కర్ణాట, మహాటవి, చిత్రకూటపర్వత,నాసిక్యదేశ, కొల్లగిరి, చోల,క్రౌంచద్వీప,జటాధర, కావేరీనది,ఋష్యమూకపర్వత,వైదూర్య,శంకముక్తాకర, అత్ర్యాశ్రమ,వారిచర, ధర్మపురద్వీప, గణరాజ్య, కృష్ణవెల్లూర, పిశిక, శూర్పాద్రి, కుసుమనగ, తుంబవన, కార్మణేయక,దక్షిణసముద్ర,తాపసాశ్రమ, ఋషిక కాంచి, మరుచి పట్టణ చేర్య,ఆర్యక, సింహల, ఋషభ, బలదేవ, పట్టన,దండకావన, తిమిలింగాశన, భద్ర, కచ్ఛ, కుంజరదరి, తామ్రపర్ణి – ఈదేశములు ఉత్తరా నక్షత్రము నుండి మూడు నక్షత్రముల వర్గము (దక్షిణము)లో నున్నవి. పహ్లవ,కాంభోజరాజ,సింధు, సౌవీర,వాడ్వాముఖ, అశ్వ,అంబష్ఠ, కపిల,నారీముఖ, ఆనర్త,ఫేనగిరి, యవన, మార్గర, కర్ణప్రావేయ, పారశవ, శూద్ర, బర్బర, కిరాత, ఖండ, క్రవ్యాద,ఆభీర,చంచూక,హేమగిరి, సింధునద, కాలక, రైవతక, సురాష్ట్ర, బాదర, ద్రవిడ – ఈదేశములు స్వాతి నక్షత్రము నుండి మూడునక్షత్రముల వర్గము (నైరృతి)లో నున్నవి.

మునిమాన్, మేఘవాన్, వనౌఘ, క్షురార్పణ, అస్తగిరి, అపరాంతక, శాంతిక , హైహయ,ప్రశస్తాద్రి,వోక్కాణ, పంచనద, రమఠ, పారత, తారక్షితి, జృంగ, వైశ్య, కనక, శక మర్యాదహీనులై పశ్చిమదిశలో నివాసముండు మ్లేచ్ఛజాతి ప్రదేశము ఇవన్ని జ్యేష్ఠ నక్షత్రము నుండి మూడు నక్షత్రముల వర్గము (పశ్చిమ)లో నున్నవి. మాండవ్య, తుషార, తాల,హల,మద్ర,అశ్మక, కులూత,హలడ,స్త్రీరాజ్య నృసింహవనస్వస్థ,వేణుమతీనది, ఫల్గులుకా,గులుహా,మరుకవచ్ఛ,చర్మ,రంగ,ఏకవిలోచన,శూలిక,దీర్ఘగ్రీవ,ఆశ్వకేశ –ఈ దేశములు ఉత్తరాషాఢ నక్షత్రము నుండి మూడు నక్షత్రముల వర్గముతో (వాయువ్యము) లో నున్నవి.

కైలాస, హిమవాన్, వసుమాన్, ధనుష్మాన్, క్రౌంచ, మేరుగిరి, ఉత్తరకురల, క్షుద్రమీన, కైకయ, వసాతి, యామున, భోగప్రస్థ, అర్జునాయన, ఆగ్నీధ్రు, ఆదర్శ, అంతర్ద్విపి, త్రిగర్త,తురగానవ,శ్వముఖ, కేశధర, చిపిటనాసిక, దాసేరక, వాటధాన, శరధాన, తక్షశీల, పుష్కలావత, కైలావత, కంఠధాన, అంబర, మద్రక, మాలవ, పౌరవ, కచ్ఛార, దండపింగల, మాణహల,హూణ, కోహల, శీతక, మాండవ్య, భూతపుర, గాంధార, యశోవతీనగరి, హేమతాల,రాజన్య,ఖచర,గవ్య,యౌధేయ, దాసమేయ, శ్యామక, క్షమధూర్త – ఈదేశములు శతభిష నక్షత్రము నుండి మూడు నక్షత్రముల వర్గము (ఉత్తరము)లో నున్నవి.

మేరుక,నష్టరాజ్య, పశుపాల,కీర,కాశ్మీర,అభిసార,దరద,తంగణ, కులూత, సైరంధ్రి, నవరాష్ట్ర,బ్రహ్మపుర,దార్వాడామర,వనరాజ్య,కిరాత, చీన,కౌణిద, భల్ల,పటోల, జఠాసుర, కునట, ఖస, ఘోష, కుచిక, ఏకచరణ, అనువిద్ధ, సువర్ణభూ, వసుధన, దివిష, పౌరవ, చీరనివాసి, త్రినేత్ర, ముంజాద్రి, గాంధర్వ – ఈదేశములు రేవతి నుండి మూడు నక్షత్రముల వర్గము (ఈశాన్యము)లో నున్నవి.ఆగ్నేయాది నవవర్గముల పాపగ్రహములతో పీడింపబడిన క్రమముగా పాంచాల మగధ కలింగ అవంతి ఆనర్త సింధు సౌవీర హారహౌర మద్ర కౌలింద దేశ రాజులకు నాశనము కలుగును.

పద్నాలుగవ కూర్మ విభాగాధ్యాయము సమాప్తము

15. నక్షత్రవ్యూహాధ్యాయము

శ్వేతపుష్పము అగ్నిహోత్ర మంత్రము తెలిసినవాడు,యజ్ఞశాస్త్ర జ్ఞానము కలవాడు, వైయాకరణుడు, ఆకరికుడు,మంగలి బ్రాహ్మణుడు కుమ్మరి, పురోహితుడు, జ్యోతిష్కుడు, వీరందరు కృత్తికా నక్షత్ర పదార్థములు.సువ్రతుడు, సన్యాసవృత్తివాడు, రాజు,యోగి,బండితో జీవించు వాడు, ఆవులు, ఎద్దులు, జలములో నుండు జంతువులు, వ్యవసాయదారుడు పర్వతము, సంపదలు కలవాడు వీరందరు రోహిణి నక్షత్ర పదార్థములు.

సుగంధద్రవ్యములు, జలముత్పన్నమగు ద్రవ్యములు, పుష్పములు ఫలములు రత్నములు వనవాసులు, పక్షులు, మృగములు, సోమరసము త్రాగువారు, గానవిద్య తెలిసినవారు, కాముకులు, పత్రవాహకులు వీరందరు మృగశిరా నక్షత్ర పదార్థములు వధించువారు, ప్రాణులను బంధించువారు, అసత్యమును పలుకువారు, పరస్త్రీగాములు, దొంగలు, ధూర్తులు భేదమును కలిగించువారు, పొట్టుతో కూడిన ధాన్యము, క్రూరులు, మంత్రములను తెలిసినవారు, వశీకరణ మంత్రములను తెలిసినవారు, వేతాల కర్మ తెలిసినవారు వీరందరు ఆర్ద్రా నక్షత్రగత పదార్థములు.

సత్యభాషణులు దానము చేయువారు, శుచితో కూడినవారు, ఇతరుల ధనము నాశింపనివారు, కులీనులు,సుందరులు,బుద్ధిమంతులు,యశస్సు కలిగినవారు, ధనవంతులు, ఉత్తమధాన్యము, వ్యాపారులు, సేవకులు, శిల్పులు, వీరందరు పునర్వసు నక్షత్రగత పదార్థములు,యవలు,గోధుమలు,చెరకు,వనము,మంత్రి,రాజు,జలముతో జీవించువారు, సజ్జనులు పుత్రకామ్యాదియజ్ఞములు చేయువారు వీరందరు పుష్యమి నక్షత్రగత పదార్థములు.

కృత్రిమద్రవ్యములు, కందమూలములు, ఫలములు కీటకములు సర్పముల విషము,ఇతరుల ధనమున పహరించువాడు,పొట్టుగల ధాన్యము అన్నిరకముల ఔషధములు ఇవన్ని ఆశ్లేషా నక్షత్రగత పదార్థములు, ధని,ధాన్యాగారము, పర్వతముపై

నివసించువారు, తల్లిదండ్రులను సేవించువారు, వ్యాపారి శూరులు మాంసాహారి స్త్రీదేషులు వీరందరు మఘా నక్షత్రగత పదార్థములు.

నాట్యము చేయువారు, స్త్రీలు,అందిరికి ప్రియులు,గానవిద్య తెలిసినవారు,శిల్పులు విక్రయ ద్రవ్యములు, దూది,ఉప్పు,తేనె,నూనె,బాలురు వీరందరు పుబ్బ నక్షత్రగత పదార్థములు.మంచి హృదయము కలిగినవారు, ఇతరుల ధనమును కోరనివారు,నీతిజ్ఞులు, పాఖండులు (వేదములను నిందించువారు) దానము చేయువారు, శాస్త్రము లందాసక్తి కలవారు, సుందరధాన్యములు, అధిక ధనము కలవారు, కర్మనిరతులు, వీరందరు ఉత్తరా నక్షత్రగత పదార్థములు.దొంగలు, గుర్రాలు, రథముపై వెళ్ళువారు, హస్తి సాధనపతులు, శిల్పులు, క్రయ విక్రయ ద్రవ్యములు,పొట్టుగల ధాన్యములు తినువారు, వ్యాపారులు, తేజస్సు కలవారు, వీరందరు హస్తా నక్షత్రగత పదార్థములు. అలంకారములు తెలిసినవారు,మణుల లక్షణములు తెలిసినవారు,రాగజ్ఞులు,లేఖకులు,గానవిద్య తెలిసినవారు,సుగంధద్రవ్యములు తయారుచేయువారు, గణితజ్ఞులు, బట్టలు తయారు చేయువారు, నేత్రరోగ చికిత్సకులు, రాజుకుపయోగపడు ధాన్యము ఇవన్ని చిత్తా నక్షత్రగత పదార్థములు.

పక్షులు,మృగములు, అశ్వములు వ్యాపారులు, ధాన్యములు, చిన్నజంతువులు, తాపసులు, క్రయవిక్రయములలో ప్రావీణ్యము కలవారు, వీరందరు స్వాతీ నక్షత్రగత పదార్థములు. రక్తపుష్పము, రక్తఫలము, వృక్షము, నువ్వులు, మినుములు, దూది,శనగలు, ఇంద్రుని భక్తులు, అగ్నిభక్తులు వీరందరు విశాఖా నక్షత్రగత పదార్థములు.

శౌర్యము కలవారు,గణనాయకులు, సాధుగోష్ఠి యందు ఆసక్తికలవారు, ప్రయాణము నందాసక్తి కలవారు, సాధువులు, శరత్కాలములో నుత్పన్నమగు ధాన్యములు ఇవన్ని జ్యేష్ఠా నక్షత్రగత పదార్థములు. ఔషధములు వైద్యసమూహములలో ప్రముఖులు, కందమూల ఫలములతో జీవించువారు అన్ని రకములైన బీజములు, అధికధనవంతులు, కందమూలములు ఇవన్ని మూలా నక్షత్రగత పదార్థములు.

కోమల హృదయము కలవాడు,జలమార్గములో నడిచేచాడు, సత్యము పలుకువాడు, ఇతరులధనమునాశించువాడు,ధనవంతుడు, వంతెన నిర్మించువారు, జలముతో జీవించువారు, జలమువలన ఉత్పన్నమగు ఫలములు, పుష్పములు ఇవి పూర్వాషాఢ నక్షత్రగత పదార్థములు. ముఖ్యమంత్రి, మల్లయోధుడు, ఏనుగు, గుర్రము, దైవభక్తుడు, వృక్షాదులు, యుద్ధకుశలుడు, భోగి, తేజస్వి వీరందరు ఉత్తరాషాఢ నక్షత్రగత పదార్థములు.

మాయావి, అన్నిపనులు చేయుట యందునేర్పరి, ఉత్సాహవంతుడు, ధర్మాత్ముడు, భక్తుడు, సత్యమును పలుకువాడు వీరందరు శ్రవణా నక్షత్రగత పదార్థములు. అహంకార

రహితుడు, నపుంసకుడు, అస్థిరమైత్రి చేయువాడు, స్త్రీద్వేషి, దానముచేయువాడు, అధిక ధనవంతుడు, జితేంద్రియుడు వీరందరు ధనిష్ఠానక్షత్రగత పదార్థములు.

పాశికుడు (వలతో జంతువులను చంపువాడు) చేపలను పట్టువాడు, జలములో నుత్పన్నమగు ద్రవ్యములు, జలజంతువులతో జీవించువాడు, పందులను పెంచువాడు, చాకలి,మద్యమునమ్మువాడు,పక్షులనుచంపువాడు వీరందరు శతభిషా నక్షత్రగత పదార్థములు. దొంగ, పశుపాలకుడు, క్రూరుడు, నీచజనులు, శఠుడు (పరోపకారము చేయనివాడు) ధర్మరహితుడు, వ్రతములు చేయనివాడు, బాహుయుద్ధము తెలిసినవాడు వీరందరు పూర్వాభాద్ర నక్షత్రగత పదార్థములు.

బ్రాహ్మణుడు,యజ్ఞములు చేయువాడు,తపస్వి,ఆశ్రమవాసి, పాఖండి (వేదములను నిందించువాడు) రాజు, ఉత్తమధాన్యములు ఇవి ఉత్తరాభాద్ర నక్షత్రగత పదార్థములు. జలమువలన ఉత్పన్నమగు పదార్థములు ఫలములు,పుష్పములు,ఉప్పు, రత్నము, శంఖములు,ముత్యములు కమలము మున్నగు పుష్పములు సుగంధద్రవ్యములు, వ్యాపారులు, నావికులు వీరు రేవతి నక్షత్రగత పదార్థములు.

గుర్రములను దొంగిలించువాడు, సేనాపతి, వైద్యుడు, సేవకుడు, గుర్రమును తోలువాడు, వ్యాపారస్తుడు,సుందరుడు,అశ్వరక్షకుడు వీరందరు అశ్వనీ నక్షత్రగత పదార్థములు. రక్తముతో కూడిన మాంసమును తినువాడు, క్రూరుడు, వధ, బంధనము, తాడనము (కొట్టుట)చేయువాడు పొట్టు కలిగిన ధాన్యము, నీచకులములో పుట్టినవాడు, ఉదార గుణములు లేనివాడు, వీరందరు భరణీ నక్షత్రగత పదార్థములు.

పుబ్బ,పూర్వాషాఢ, పూర్వాభాద్ర, కృత్తికలు బ్రాహ్మణులకు, ఉత్తర ఉత్తరాషాఢ ఉత్తరాభాద్ర పుష్యములు క్షత్రియులకు, రేవతి అనూరాధ మఘ రోహిణులు వైశ్యులకు, పునర్వసు హస్త అభిజిత్ అశ్వినులు క్రయవిక్రయములు చేయువారికి,మూల ఆర్ద్ర స్వాతి శతభిషములు క్రూరమనుష్యులకు, మృగశిర జ్యేష్ఠ చిత్త ధనిష్ఠలు సేవకులకు, ఆశ్లేష విశాఖ శ్రవణ భరణులు చండాలురకు స్వాములగుదురు.

రవి శనిగ్రహములతో ముక్తి పొందిన, మంగళ గ్రహముతో భేదము లేక వక్ర గమనముచే దూషితమైన, గ్రహణకాలములో ఉల్కతో హతమైన (కొట్టబడినది), చంద్ర కిరణములచే పీడితమైన, స్వాభావికముగా ఉత్తమగుణ రహితమైన దానిని పీడిత నక్షత్రమని మునులు తెలిపెదరు.ఈ విధముగా పీడింపబడిన నక్షత్రము పూర్వము చెప్పిన తన వర్గము వారికి నాశనము కలిగించును. పైలక్షణములకు భిన్నముగానున్న నక్షత్రము వృద్ధిని కలిగించును.

పదిహేనవ నక్షత్ర వ్యూహాధ్యాయము సమాప్తము

16. గ్రహభక్తి యోగాధ్యాయము

నర్మదానదికి పూర్వభాగము, శోణనదము,ఓఢ్ర,వంగ,సుహ్మ,కలింగ,బాహ్లిక, శక,యవన,మగధ,శబర, ప్రాగ్జ్యోతిష, చీన, కాంబోజ, మేకల, కిరాత, వికట, పర్వతము బయట మధ్యలో నివసించువారు. పులింద జనులు, ద్రవిడదేశ పూర్వార్ధము, యమునానది దక్షిణ తీరము, వింధ్యాచల మధ్యభాగము, కలింగ దేశజనులు, పుండ్ర, గోలాంగూల, శ్రీపర్వత, వర్ధమాన, ఇక్ష్వావతీనది, తస్కర పారతదేశ వాసులు, వనములు, గోపాలకులు, బీజములు, పొట్టుధాన్యము, కటుక ద్రవ్యములు, వృక్షములు సువర్ణము, అగ్ని విషము, యుద్ధవీరులు, ఔషధములు, వైద్యులు, చతుష్పద పశువులు, వ్యవసాయదారులు, రాజులు, క్రూరులు, యుద్ధములో జయంచే కోరిక కలవారు, దొంగలు, సర్పములు, నిర్జనస్థానము, యశోవంతులు, తీక్ష్ణజనులు వీరందరికి సూర్యుడు స్వామియగును.

పర్వతదుర్గములు, జలదుర్గములు, కోశలదేశపు జనులు, భరుకచ్ఛ సముద్రము, రోమక, తుషార,వనవాసులు, తంగణ, హల, స్త్రీరాజ్యములు, సముద్రములోని ద్వీపములు, మధుర రసము,అగ్నిపుష్పములు,ఫలములు, జలము,ఉప్పు,మణులు,శంఖము, ముత్యములు,జలములో జనించు వస్తువులు, ధాన్యము,యవలు, ఔషధములు, గోధుమలు, సోమరసము త్రాగు మనుష్యులు, ఆక్రంద దేశజనులు బ్రాహ్మణులు, తెల్లనివస్తువులు, జనులందరికి ఇష్టులు, అశ్వములు, కాముకులు, స్త్రీలు, సేనాధిపతి, భోజనసామగ్రి, వస్త్రము, కొమ్ములున్న పశువులు, నిశాచరులు, రైతులు, యాజ్ఞికులు వీరందరికి చంద్రుడు స్వామి యగును.

శోణనదము, నర్మదానది, భీమరథానది, పశ్చిమదేశములు, నిర్వింధ్య, వేత్రవతి, సిప్ర,గోదావరి,వేణ,గంగ,పయోష్ణి,సింధు,మాలతి, పారానది, ఉత్తర పాండ్యము, మహేంద్ర పర్వతము,వింధ్యాచలము, మలయగిరి సమీప దేశములు,చోళ, ద్రవిడ, విదేహ, ఆంధ్ర, అశ్మక,భాసాపర,కొంకణ,సమంత్రిషిక,కుంతల,కేరళ,దండకారణ్య, కాంతిపుర, మ్లేచ్ఛ, సంకరజాతి, నాసిఖ్య, భోగవర్ధన, తర్కరాట,వింధ్యాచల సమీప దేశములు, తాపి, గోమతి నదుల మధుర జలములు త్రాగువారు, వనవాసులు, దుర్గ, కర్వటదేశవాస జనులు, పధికులు,పాపులు పనియందాసక్తి లేనివారు,రాజులు,బాలకులు,ఏనుగులు, దాంభికులు, పిల్లలనుకొట్టువారు,పశుపాలకులు,రక్తఫలములు,రక్తపుష్పములు,ప్రవాళములు, సేనాపతులు,బెల్లము,మదిర,తీక్ష్ణ (వేపాదులు) కోశాగారము, అగ్నిహోత్రి, ధాతువుల,గని, శాక్య, భిక్షు, చోర,శఠులు,దృఢద్వేషులు,అధికభోజనము చేయువారు, వీరందరికి కుజుడు స్వామియగును.

లోహిత్య, సింధునదులు, సరయు, గాంభీరిక, రాథాఖ్య, గంగ, కౌశికి, విపాశ,

సరస్వతి, చంద్రభాగానది, మధురకు పూర్వార్ధభాగము, హిమాలయ పర్వతము, గోమంత పర్వతము, చిత్రకూట పర్వత ప్రాంతములో నున్న మనుష్యులు, సౌరాష్ట్రములో నున్న మనుష్యులు, వంతెనలనాశ్రయించి యుండువారు, పర్వతములపైన నుండువారు, వాపి, కూప, తటాకములు, యంత్రములను తెలిసినవారు, గానవిద్యను తెలిసినవారు, లేఖకులు, మణుల లక్షణములను తెలిసినవారు, గానకోవిధులు, సుగంధద్రవ్యములు చేయువారు, చిత్రకారులు, వైయాకరణులు, జ్యోతిష్కులు, వైద్యులు, శిల్పులు, గుప్తచరులు, కుహకులు, బాలురు, కవులు, శఠులు పరోపకారము చేయనివారు, చాడీలు చెప్పేవారు, అభిచారులు (వశీకరణాదులు తెలిసినవారు) దూతలు, నపుంసకులు, హాస్యమును పండించువారు, భూతప్రేత తంత్రములను తెలిసినవారు,ఇంద్రజాలము తెలిసినవారు, రక్షకులు, నాట్యకారులు, నెయ్యి, నువ్వులనూనె, నూనె పదార్థములు,బీజములు, పులుపు వస్తువులు, బ్రహ్మచారులు, రసాయనములు తెలిసినవారు,వేసరములు(అశ్వవిశేషము) వీరందరికి బుధుడు స్వామియగును.

సింధునది పూర్వభాగము, మధురకు పశ్చిమార్ధభాగము, భరత, సౌవీర, స్రుఘ్న, ఉత్తరదిశలో నుండువారు, విపాశానది, శతద్రూనది, రమఠ, త్రైగర్త, పౌరవ, అంబష్ఠ, పాతర, వాటధారణ, యౌధేయ, సారస్వత, అర్జునాయన, మత్స్యదేశములోని సగభాగము, ఏనుగులు,గుర్రములు,పురోహితులు, రాజు, మంత్రి, మంగళకార్యములు, పౌష్ఠికకార్యములు, దయాళువు, సత్యము పలుకువాడు, ఇతరుల ధనమును కోరనివాడు, తపస్వి, విద్వాంసుడు, దానము చేయువాడు, ధర్మము చేయువాడు, గ్రామములో పుట్టినవాడు, వైయాకరణుడు అర్థమును తెలిసినవాడు, వేదములు తెలిసినవాడు, అభిచారుడు, నీతిశాస్త్రము తెలిసినవాడు, రాజు యొక్క ఆయుధములు, గొడుగు, ధ్వజము, చామరాదులు, సుగంధద్రవ్యములు, కుష్ఠము, మాంసీతగరము,రసము,ఉప్పు,మినుములు,మధుర రసము,జిగురు, చోరకము, (సుగంధ ద్రవ్యము) సుగంధద్రవ్యములు వీటన్నింటికి గురువు స్వామి యగును.

తక్షశిల నగరము,మాత్రికాబత దేశము,బహుగిరి,గాంధారము,పుష్కలా వతకము, ప్రస్థలము,మాలవము, కైకయము,దాశార్గము,ఉశీనరము,శిలి,వితస్త,ఐరావతి, చంద్రభాగానది జలము త్రాగువారు, రథములు, వెండి,ఆకరము (అర్థోత్పత్తి స్థానము) ఏనుగులు,గుర్రములు,మహామాత్ర(ఏనుగులరాజు) ధని, సుగంధ ద్రవ్యములు, పుష్పములు, చందనము, మణులు, వజ్రము, భూషణము, కలము, శయ్యాప్రధానము, యువకుడు, స్త్రీలు,కామోపకరణము (పుష్ప ధూపమాలా చందనము) మృష్టము(శోధితము) అన్నము భుజించువాడు, మధుర భోజనము చేయువాడు, ఉద్యానము,జలము, కాముకుడు, యశస్వి, సుఖవంతుడు, దాత, సుందరుడు, విద్యావంతుడు, మంత్రి, క్రయవిక్రయము

వలన జీవనము సాగించువాడు, కుమ్మరి, వివిధరకాల పక్షులు, ఫలత్రయము (ఏలకులు లవంగాలు మిరియాలు) నేత్రపటము, కంబలము, పత్రోర్ణికము, రోధ్రము (సుగంధ ద్రవ్యము) పత్రము (సుగంధపత్రము) నారికేళము,జాజిఫలము, అగరు, వస, పిప్పలి, చందనము, వీటన్నింటికి శుక్రుడు స్వామియగును.

ఆనర్తము, అర్బుదము, పుష్కరము, సౌరాష్ట్రము, ఆభీరము, శూద్ర, రైవతకములు, సరస్వతీనదికి పశ్చిమ ప్రదేశము, కురుభూమిలో పుట్టిన మనుష్యులు, ప్రభాసక్షేత్రము, విదిశా నగరము, వేదస్మృతినది,మహీనదీ తటమందున్న మనుష్యులు, ఖలులు, మలినులు, నీచులు, నూనెవారు,నిర్బల నంపుకులు, బంధన స్థానమునందున్నవారు, పక్షులను చంపువారు,అపవిత్రులు,ధీవరులు,కురూపులు,వృద్ధులు,పందులను పెంచువారు, సంఘములో ప్రముఖులు,నియమమును పాటించనివారు,శబరులు,పులిందులు, దరిద్రులు, కటు ద్రవ్యములు,చేదు,విధవస్త్రీ, సర్పము, చోరుడు,ఎద్దు,గాడిద,ఒంటె, శనగలు, బఠాని, ధాన్యములు వీటికి శని స్వామియగును.

పర్వతశిఖరము, కందకములు,గుహలందు నివాసించువారు,మ్లేచ్ఛజాతి, శూద్రులు,నక్కమాంసము తినేవారు,శూలిక,అశ్వముఖ,అంగహీన మనుష్యులు, కులమునకు కలంకమును కలిగించువారు, క్రూరులు,కృతఘ్నులు,చోరులు,మిధ్యావ్యవహారము చేయువారు,శౌచరహితులు,కృపణులు,గాడిద,గుప్తచరులు,వాయుయుద్ధమును తెలిసినవారు, అధికోపము కలిగినవారు, గోతులలో నుండువారు,నీచులు,కుత్సిత పురుషులు, మిధ్యా ధర్మము కలవారు,రాక్షసులు, ఎక్కువనిద్రించు జంతువులు,ధర్మహీనులు, మినుములు, నువ్వులు, వీటిన్నింటికి రాహువు స్వామియగును.

గిరిదుర్గము,పహ్లవము,శ్వేతము, చోల,ఆవగాణ, మరుభూమి, చీన, గుహలలో నివసించువారు, ధనవంతులు, ఉదారుడు, వ్యవసాయి,పరాక్రమి, పరస్త్రీగామి, వివాది ఇతరుల దోషములను చూపువాడు,మత్తుడు,మూర్ఖుడు,అధార్మికుడు,జిగీషుడు, (జయించుటకు ఇచ్ఛకలవాడు) వీరందరికి కేతువు స్వామి యగును.

ఉదయసమయములో నిర్మలము,విపులము, స్వభావస్థితము, నిర్ఘాతము,ఉల్క, ధూళి, గ్రహయుద్ధములో కొట్ట బడినది, తనరాశిలో నున్నది, ఉచ్చరాశిగతము లేక శుభగ్రహము (చంద్ర బుధ గురు శుక్రులు)లచే చూడబడు గ్రహములు ఎవరికి స్వామి యగునో వారికి శుభము కలుగును.

ఏదైన గ్రహము పూర్వోక్త శుభ లక్షణములకు వ్యతిరేకముగా నున్న తన వర్గమును శస్త్రము యుద్ధము మరియు రోగములతో నాశనము చేయును. ఈ విధముగా ఉత్పాతము కలిగిన రాజు లేక ప్రజలకు శత్రువులు పుత్రులు మంత్రులకు భయము లేకున్నను అనావృష్టి కారణముగా పట్టణములు పర్వతములు నదులవైపు ప్రయాణము

చేయవలసి వచ్చును. ఈరకమైన ఉత్పాతములు జరిగినపుడు రాజు లేక ప్రజలకు శత్రువులకు,పుత్రులకు మంత్రులకు తప్పక భయము కలుగును. ఏవిధముగానైన ఆకష్టముల నుండి ముక్తిని పొందినప్పటికి అనావృష్టి కారణముగా ధాన్యము, కూరలు, జలము కొరకు ఎప్పుడు వెళ్ళని పురములు పర్వతములు నదులను ఆశ్రయించవలసి వచ్చును.

పదహారవ గ్రహభక్తి యోగాధ్యాయము సమాప్తము

17. గ్రహయుద్ధాధ్యాయము

ఏ సమయములో ఏవిధముగా తారాగ్రహములకు యుద్ధము త్రికాలజ్ఞులై ఋషులు తెలిపిరో ఆవిషయమును సూర్య సిద్ధాంతము ననుసరించి పంచసిద్ధాంతికలో నేను తెల్పితిని. ఆకాశములో చరించుచు తమ తమ మార్గము లోపలనుండి దూరము నుండి చూచిన ఒకేస్థానములో నున్నట్లు కనిపించు గ్రహములను పరాశరాది మునులు ఆసన్నక్రమయోగ భేదము, ఉల్లేఖము, అంశుమర్దనము, అపసవ్యమని నాలుగు విధములైన గ్రహయుద్ధములుగా తెలిపిరి. క్రిందనున్న గ్రహబింబముతో పైనున్న గ్రహబింబము ఆచ్ఛాదిమైన భేదము,ఒక బింబ పరిధిని వేరొకబింబ పరిధి స్పర్శించిన ఉల్లేఖము, రెండు గ్రహములకు పరస్పరము కిరణ సంయోగమైన అంశుమర్దనము, దక్షిణోత్తరములందున్న అపసవ్య నామక గ్రహయుద్ధమగును.

భేదనామక యుద్ధమైన వర్షాభావము, మిత్రులు, ఉత్తమ కులములో జన్మించిన మనుష్యుల మధ్య పరస్పర భేదభావము కలుగును. ఉల్లేఖయుద్ధమైన శత్రుభయము, మంత్రుల మధ్య విరోధము, దుర్భిక్షము కలుగును. అంశు విరోధ యుద్ధమైన రాజులకు మధ్య పరస్పర యుద్ధము శస్త్ర,రోగ,ఆకలి బాధలచే మనుష్యులకు అత్యంత పీడ కలుగును. అపసవ్య యుద్ధమైన రాజుల మధ్య పరస్పర యుద్ధము జరుగును.

సూర్యుడు మధ్యాహ్న సమయములో ఆక్రందము, పూర్వదిశలో నున్న పౌరము, పశ్చిమదిశలో యామ సంజ్ఞకమగును. బుధుడు గురువు శనులు ఎల్లప్పుడు పౌరము, చంద్రుడు ఆక్రందము, కేతువు కుజుడు రాహువు శుక్రులు యామ సంజ్ఞకమగును. ఈ గ్రహములు పీడితమైన ఆక్రందము యామ పౌరులకు నాశనము కలుగును. ఆక్రంద సంజ్ఞక గ్రహము పీడితమైన ఆక్రందము, యామ సంజ్ఞక గ్రహము పీడితమైన యాయి (గమనము చేయునది) పౌరసంజ్ఞకమైన పురవాసులకు నాశము కలుగును. విజయమైన తమవర్గము వారికి విజయము కలుగును.

పౌరగ్రహము వలన పౌరగ్రహము పీడితమైన పురవాసులైన రాజుల వలన పురవాసులకు నాశనమగును. ఒదేవిధముగా యాయి గ్రహముతో ఆక్రంద గ్రహము

పీడితమైన యాయి మనుష్యుల వలన ఆక్రంద మనుష్యులు, ఆక్రందగ్రహముతో యాయి గ్రహము పీడితమైన ఆక్రందము వలన యాయి నాశనమగును. నాగర గ్రహముతో యాయి పీడితమైన నగర మనుష్యునితో యాయి మనుష్యుడు, యాయి గ్రహముతో నాగర గ్రహము పీడితమైన యాయి మనుష్యునితో నాగర మనుష్యుడు నాశనమగును.

దక్షిణదిశలో నున్నది రాక్షసమైనది (స్నేహ రహితము) కంపాయ మానమైనది ఇతర గ్రహము దగ్గరకువెళ్ళక తిరిగి వచ్చునది. సూక్ష్మబింబము కలది అన్యగ్రహముతో ఆక్రమింపబడినది, వికారయుతమైనది,కారణరహితమైనది, వివర్ణమైనదైన గ్రహము పరాజితమగును.

పూర్వోక్త లక్షణములకు వ్యతిరేకమైనది(ఉత్తరదిశలో నున్నది స్నిగ్ధము, కంప రహితము, ఇతర గ్రహముల దగ్గరకు వెళ్ళనిది, తేజస్సు కలది) దక్షిణదిశలో నున్నప్పటికి విపులము నిర్మలము కాంతివంతమైన బింబము కలిగిన గ్రహము విజయమును పొందును.

సమాగమ సమయములో రెండు గ్రహములు కిరణయుక్తము, విపులము, స్నిగ్ధ (చిక్కదనము)మైన రెండు గ్రహవర్గములకు ప్రీతి,వ్యతిరేకమైన తమవర్గములకు హాని కలిగించునవగును.

పంచతారా గ్రహములకు పరస్పర యుద్ధము లేక చంద్రునితో సమాగమము, లేక తమ లక్షణములతో అప్రకాశితమైన అనగా యుద్ధములో ఏది విజయము పొందినది. ఏది పరాజితమైనది. వీటిజ్ఞానము లేనపుడు లేక సమాగమ సమయములో చంద్రుడు ఉత్తర దక్షిణములలో నుండక మధ్యలో నున్నప్పుడు భూమిపై నున్న రోజులకు సందిగ్ధ ఫలితమును తెలుపవలెను.

మంగళగ్రహము గురునితో పరాజితమైన బాహ్లీకదేశములో నివసించువారు విజయమును కోరువారు,అగ్నితో జీవించువారందరు పీడితులగుదురు. బుధునితో పరాజయము పొందినశూరసేన కలింగ శాల్వదేశములో నుండుమనుష్యులు పీడితులగుదురు. శనితో పరాజయము పొందిన నగరములందు నివాసము చేయు జనులు విజయమును పొందుదురు. మిగిలినవారు దు;ఖమును పొందెదరు. శుక్రునితో పరాజయము పొందిన ధాన్యముండు స్థానము, మ్లేచ్ఛజాతి జనులు, క్షత్రియులు పీడితులగుదురు.

కుజగ్రహముతో బుధుడు పరాజయము పొందిన నది తాపసులు, అశ్వదేశ వాసులు, రాజులు ఉత్తరదిశలో నివాసము చేయువారు, యజ్ఞము చేయు మనుష్యులు పీడితులగుదురు. బృహస్పతితో పరాజయము పొందిన మ్లేచ్ఛజాతి, శూద్రజాతి, చోరులు, ధనవంతులు,పుర జనులు త్రిగర్తదేశవాసులు, పర్వతము లందు నివసించువారు, పీడితులగుదురు. భూకంపము కలుగును. శనితో పీడితుడైన నావనడిపేవారు,యోధులు,

జలము వలన ఉత్పన్నమగు వస్తువులు,ధనవంతులు,యోధులు,జలము వలన ఉత్పన్నమగు వస్తువులు, ధనవంతులు, గర్భిణీస్త్రీలు పీడితులగుదురు. శుక్రునితో పరాజయము పొందిన అగ్ని ప్రకోపము, ధాన్యము, మేఘములు, ప్రయాణము చేయు రాజులు నాశనము పొందెదరు.

గురునితో వలన శుక్రుడు పరాజితుడైన నాయకుడు, ప్రధాన జనులకు నాశము, క్షత్రియ బ్రాహ్మణులకు పరస్పర విరోధము,అనావృష్టి కోసల కలింగ వంగ వత్స మత్స్య మధ్యదేశములలో నివసించువారు,నపుంసకులు శూరసేనదేశములో నుండువారు పీడితులగుదురు. కుజునితో పరాజితమైన సేనాధిపతి మరణము, రాజులమధ్య యుద్ధము జరుగును. బుధునితో పరాజితమైన పర్వతములందు నివసించువారు నశించును. ఆవుపాలు నశించును. అల్పవృష్టి కురియును. శనితో పరాజితమైన గణములలో ప్రధానవ్యక్తి, యోధులు, క్షత్రియ వర్గము జలములో నుత్పన్నమగు వస్తువులు పీడింపబడును. సామాన్య భక్తిఫలము స్వాభావిక ఫలము నాశనమగును.

శుక్రునితో శని గ్రహము పరాజితమైన అన్ని వస్తువుల ధరలు పెరుగును. సర్పములు,పక్షులు, మాన్యజనులకు పీడకలుగును. కుజునితో పరాజితమైన తంగణ, ఆంధ్ర, ఓఢ్ర, కాశి, బాహ్లీక దేశవాసులు వ్యాపారులు, పశుపక్ష్యాదులు, ఏనుగులు పీడింపబడును. గురువుతో పరాజయము పొందిన ఎక్కువ స్త్రీలుగల దేశము, మహిషక శక దేశములలో నుండు ప్రజలు పీడింపబడుదురు.

కుజ, బుధ, గురు, శుక్ర శనిగ్రహముల విశేషఫలము తెలుపబడెను. మిగిలిన ఫలితము గ్రహభుక్తి వలన తెలుపవలెను. వ్యక్తావ్యక్త(కనపడి కనపడని) రూపముగా గ్రహములు ఏవిధముగా పీడితమగునో అదేవిధముగా గ్రహములు స్వభక్తి (భావము) ఫలములను నశింపజేయును.

పదిహేడవ గ్రహయుద్ధాధ్యాయము సమాప్తము

18. శశిగ్రహ సమాగమాధ్యాయము

గ్రహనక్షత్రములకు సమీపముగా చంద్రుడు ప్రదక్షిణక్రమములో ఉత్తరము వైపుకి పయనించిన రాజులకు శుభము, దక్షిణమువైపుకి వెళ్ళిన అశుభము కలుగును. కుజగ్రహమునకు ఉత్తరమువైపుకి చంద్రుడు గమనము చేసిన పర్వత నివాసులకు బలవంతులకు విజయము కలుగును. యాయి (ప్రయాణము చేయు) మనుష్యులకు క్షత్రియులకు సంతోషము కలుగును. భూమిలో అధికధాన్యములు పండును.

బుధునికి ఉత్తరపువైపుకి చంద్ర గమనమున్న పురవాసులైన రాజులకు విజయము, సుభిక్షము, ధాన్యవృద్ధి, లోకులకు మానసికతృప్తి, రాజులకు ధనాగారమునకు వృద్ధి

కలుగును. గురుగ్రహమునకు ఉత్తరదిశలో చంద్రగమనమున్న పురవాసులకు బ్రాహ్మణులకు,క్షత్రియులకు, పండితులకు, ధర్మములకు మధ్యదేశవాసులకు వృద్ధి సుభిక్షము కలుగును. ప్రజలందరు సంతోషముతో నుందురు.

శుక్రగ్రహమునకు ఉత్తరవైపుకి చంద్ర గమనమున్న ధనాగారము ఏనుగులు, గుర్రములు వృద్ధి పొందును. ధనుర్ధారులు యాయులకు (జయించు ఇచ్ఛగలవారు) విజయము, ధాన్య ఉత్పత్తి కలుగును. శనిగ్రహమునకు ఉత్తరదిశకు చంద్రగమనమున్న పురవాసులకు రాజులకు విజయము కలుగును. శకులు బాహ్లీకులు, సైంధవులు, పహ్లావ దేశవాసులు సంతోషము పొందెదరు.

ఏనక్షత్రములకు ఉత్తరదిశలో చంద్రుడు ఉత్పాతరహితుడై గమనము చేయునో ఆనక్షత్రములు గ్రహముల ద్రవ్యములకు వృద్ధి, దక్షిణదిశలో గమనము చేసిన హాని కలుగును. గ్రహములకు ఉత్తరదిశలో చంద్రుడు గమనము చేసినశుభఫలము కలుగును. దక్షిణదిశలో గమనము చేసిన దానికి వ్యతిరేక ఫలము కలుగును. ఈవిధముగా చంద్రునితో కూడిన గ్రహములు నక్షత్రముల యోగమును సమాగమమందురు. సూర్యునితో కూడిన అస్తమయము, కుజాది గ్రహములతో పరస్పర సంయోగమును యుద్ధమందురు.

పద్దెనిమిదవ శశి గ్రహసమాగమాధ్యాయము సమాప్తము

19. గ్రహవర్ష ఫలాధ్యాయము

సూర్యుని సంవత్సరములో మాసములో దినములో భూమిపై అల్పధాన్యము దైవ వశముతో భక్షణ చేయు కోరిక కలిగిన దంష్ట్రీ గణము (సర్పము పంది మొదలగు జంతువులు) తో కూడిన వనము, నదులలో అల్పజలము, రోగనాశము కొరకుపయోగపడు ఔషధముల కభావము, శిశిరకాలము (మాఘ ఫాల్గుణమాసాలు)లో సూర్యుని వలన భయంకర తాపము, పర్వతసమాన మేఘములలో కూడ అనావృష్టి ఆకాశములోనున్న నక్షత్రములు మరియు చంద్రునిలో కాంతి విహీనత్వము (లేకపోవటము) తాపసులకు శోకము, గోవులకు దు:ఖము కలుగును. యుద్ధములో ఏనుగు, గుర్రము పదాతులతో కూడిన అసహ్యాసైన్యము ధనువు ఖంగ, ముశలలతో, మంత్రులతో కూడిన రాజులు దేశమును నాశనము చేయుదురు.

చంద్రుని సంవత్సరములో మాసములో దినములో చలిత పర్వతములు, సర్పము కజ్జలము(మేఘము) భ్రమరము (తుమ్మెద) గవలము (ఎద్దుకొమ్ము) తో సమానమైన నిర్మల జలముతో భూమి పూర్ణమవుతు, విరహ జనుల ప్రేమపూర్వక ధ్వనులతో దిశలను పరిపూర్ణము చేయుచు మేఘములతో నిండిన ఆకాశము, కమలములు, కుముదములతో కూడిన జలము, పుష్పించిన వృక్షములు మధుర శబ్దములను చేయు భ్రమరములతో

కూడిన ఉపవనము, అధికముగా పాలనిచ్చు గోవులు, సుందరమైన నేత్రములతో తమపనులకు ఆనందము కలిగించు స్త్రీలు, గోధుమలు, శాలి యవాది, శ్రేష్ఠధాన్యములు చెరుకులు, నాగరికులు, అగ్నిస్థానము,శ్రేష్ఠ యజ్ఞములతో కూడిన భూమి రాజులచే పరిపాలించబడును.

మంగళ సంవత్సరములో మాసములో దినములో వాయుసంచారముతో గ్రామము వనము, నగరములను దగ్ధముచేయు భయంకరమైన అగ్నిప్రజ్వలిల్లును. దొంగల వలన దొంగిలింపబడిన జనులు హా హా కారము చేయుదురు. ఆకాశములో వ్యాపించిన మేఘమెప్పుడు అధికవర్షము కురవదు. నీచస్థానములో ఉత్పన్నమైన ధాన్యము ఎండిపోవును.పండిన ధాన్యము కూడ వజ్రపాతాది (పిడుగులు) ఉత్పాతములతో నష్టమగును.రాజులు ధర్మముగా పరిపాలనచేయరు. పైత్యరోగము లధికమగును. సర్పముల వలన రోగులకు పీడకలుగును. ఈవిధముగ కుజుడు స్వామిగానున్న సంవత్సరము లో ప్రజలు పీడితులగుదురు. ధాన్యములు నాశనమగును.

బుధుని సంవత్సరములో మాసములో దినములో లోకములో శుభము కలుగును. ఇంద్రజాలవిద్య తెలిసినవారు,ఆశ్చర్యముతో చూచువారు,ధనము సంపాదించుట తెలిసినవారు, నగరములో నుండువారు, గానవిద్యను తెలిసినవారు, లేఖకులు, గణితజ్ఞులు, అస్త్రవిద్యను తెలిసినవారు, ఉన్నతులగుదురు. రాజులు ప్రజలు అత్యంతసంతోషముతో జీవనము చేయుచు ఒకరికొకరు ద్రవ్యములనిచ్చుకొను వారగుదురు.వ్యవసాయము, పశుపాలనము,వాణిజ్యము అభివృద్ధి చెందును.మూడువేదముల(ఋక్ యజు సామవేదము) పఠనమధిక మగును.మనువు రచించిన దండ నీతిననుసరించి న్యాయము నడుచును.

గురు సంవత్సరములో మాసములో దినములో యజ్ఞములు రాత్రికాలమును వదలి బ్రాహ్మణులు ఉచ్చరించు మంత్రధ్వని స్వర్గము వరకు చేరును. యజ్ఞములను విఘ్నము చేయు రాక్షసుల మనస్సుకు కష్టమును, ఇంద్రాది దేవతల మనసుకు ప్రసన్నత కలుగును. రాజుల రక్షణలో ఉత్తమధాన్యము,ఎక్కువ ఏనుగులు,పదాది దళములు, గుర్రములు ధనములతో కూడిన గోకులములు భూమిపై పరిపూర్ణ మగును. మనుష్యులు దేవతాసమానులగుదురు.ఎల్లప్పుడు భూమిపైజలము పరిపూర్ణముగా నుండును. మేఘములు ఆకాశములో వ్యాపించును.భూమి అధికధాన్యములతో సమృద్ధమగును.

శుక్రుని సంవత్సరములో మాసములో దినములో శాలిధాన్యములు, చెరకులు, పర్వత సమానమైన మేఘములతో కూడిన జలము పరిపూర్ణమైన సుందరకమలములతో కూడిన తటాకములతో కూడిన భూమి సంపూర్ణమైన భూషణములతో కూడిన స్త్రీవలె

శోభాయమానమగును. శత్రుపక్షములోని సేనలను నాశనము చేయుట వలన కలిగిన జయశబ్దములతో కూడిన దిశలతో రాజులు పరిపూర్ణులై యుందురు. ఆనందముతో కూడిన సజ్జన జనులు, నష్టపోయిన దుర్జనులతో భూమి నిండియుండును. వసంతఋతువులో స్త్రీలు ఆనందముతో మాటిమాటికి మద్యపానము చేయుదురు. వేణువు వీణతో కూడిన గాయకులు గానము చేయుదురు. అభ్యాగతులు మిత్రులు బంధువులతో గృహస్థులు భోజనము చేయుదురు. అన్నివైపుల కామదేవుని జయఘోషలు వినపడును.

శని సంవత్సరములో మాసములో దినములో దొంగలతో యుద్ధములతో పశు ధాన్య రహితమై, సంగ్రామములో బంధుజనుల మరణముతో దు:ఖించిన జనులతో, రోగములు, ఆకలిబాధలతో జనులు వ్యాకులతను పొందును. వాయువులతో కొట్టబడిన మేఘములతో ఆకాశము కనబడును. వాపి కూప(నూతులు) తటాకములు దుమ్ముతో కూడియుండును. నదులలో అతితక్కువ జలముండును. ఇంద్రుడు తక్కువ వర్షమును కురిపించును. జలములేని కారణమున ధాన్యము నష్టమగును. అక్కడక్కడ జలముతో సంతృప్తి కలుగును.

సూక్ష్మము, అస్పష్ట కిరణము, నీచస్థానస్థితము గ్రహయుద్ధములో పరాజితమైన గ్రహము సంపూర్ణ ఫలమునీయదు. దీనికి వ్యతిరేకముగా నున్న సంపూర్ణ ఫలము నిచ్చును. అశుభ వర్షములో రవి, అశుభమాసములో కుజ శనుల వృద్ధి జరుగును. దీని వలన తెలిసినదేమనగా అశుభగ్రహ వర్షములో అశుభగ్రహ మాసములో అత్యంత అశుభఫలము కలుగును. వర్షాధిప మాసాధిపు లిద్దరు శుభగ్రహములైన శుభ ఫలవృద్ధి కలుగును. ఒకరు శుభులై వేరొకరు అశుభులైన అల్పఫలము కలుగును.

పందొమ్మిదవ గ్రహవర్ష ఫలాధ్యాయము సమాప్తము

20. గ్రహ శృంగాటకాధ్యాయము

తారాగ్రహములు (కుజ బుధ గురు శుక్ర శనులు) ఏదిశలో కనపడునో, ఏదిశలో రవి అస్తమించునో ఆదిశలో శస్త్రకోపము దుర్భిక్షము, ఉపద్రవముల భయము కలుగును. గ్రహముల ఆకారము చక్ర ధను త్రికోణ దండ పుర ప్రాస (ఆయుధ విశేషము) క్రాంత వజ్ర సమానముగా మధ్యలో సన్నముగా రెండువైపుల విస్తరించి యున్న భూమిపై అన్నివైపుల దుర్భిక్షము, అనావృష్టి మనుష్యులలో రాజులలో యుద్ధము జరుగును.

సూర్యాస్తమయ సమయములో ఏదేశపు ఆకాశభాగములో గ్రహమాల కనిపించునో, ఆదిశలో అన్యరాజుల ఆగమనము వారి వలన ఉపద్రవము కలుగును. గ్రహములు కలియు ఏడు నక్షత్రములలో కూర్మనక్ష త్ర వ్యూహములో చెప్పబడినదేశముల జనులకు నాశనము కలుగును. గ్రహ నక్షత్రములు రెండు పరస్పరము నిర్మలమైన

కిరణములు కలవైన వారికిశుభము కలుగును.గ్రహ సంవర్తము,గ్రహ సమాగమము, గ్రహసమ్మోహము, గ్రహసమాజము, గ్రహసన్ని పాతము, గ్రహకోశము, - ఇవన్ని ఆరు యోగములు. వీటి లక్షణములు ఫలితములు తెలుపబడును.

ఒకే నక్షత్రములో పౌర (నాలుగు) లేక యాయి (పాప) గ్రహముతో కూడి నాలుగు లేక ఐదు సంఖ్యలతో ఏకత్రితమైన సంవర్తము, వాటితో కేతు రాహువు కూడిన సమ్మోహము, పౌరగ్రహములలో పౌరగ్రహము లేక పాపగ్రహములతో పాపగ్రహములున్న గ్రహసమాజము, శని మరియు గురు గ్రహముల సంయోగములో వేరొక గ్రహము కలిసిన గ్రహకోశము, ఒక గ్రహము పశ్చిమదిశలో, వేరొకటి పూర్వదిశలో ఉదయించి రెండును ఒకే నక్షత్రములో నున్న గ్రహసమాగమమగును. ఈ సమాగమములో తారాగ్రహము నిర్వికార శరీరము కలది, నిర్మలము మరియు విపుల బింబము కలిగినదై శుభమును కలిగించును. లేకున్న అశుభము కలుగును.

సంవర్త సమాగమ యోగములలో మధ్యమఫలము, సమ్మోహము, కోశయోగము లలో ప్రజలకు భయము, సమాజ యోగములో సుసమము (ముందుకన్న తర్వాత అధికఫలము) సన్నిపాతములో పరస్పర ద్వేషము కలుగును.

ఇరువదవ గ్రహ శృంగాటకాధ్యాయము సమాప్తము

21. గర్భ లక్షణాధ్యాయము

ప్రపంచమునకు అన్నమే ప్రాణము, అన్నము వర్షాధీనము. అందువలన ప్రయత్న పూర్వకముగా వర్షఋతు పరీక్షచేయవలెను. గర్గ పరాశర కాశ్యప వజ్రాది మునుల వలన తెలుపబడిన గర్భలక్షణములను దర్శించి నేను వర్షాకాల లక్షణములను తెలియ జేయుచున్నాను.

రాత్రి పగలు గర్భలక్షణములో మనసును లగ్నము చేయు దైవజ్ఞుల పలుకులు మునుల వలె వర్షజ్ఞాన విషయములో అబద్ధము కానేరదు.ఈ జ్యోతిషశాస్త్రము కన్న ఏశాస్త్రము గొప్పది? ఎదీలేదు.అది తెలిసికొని వినాశ రూపమైన కలికాలములో కూడ మనుష్యులు త్రికాల దర్శులగుదురు.

కొందరి మతమునను సరించి కార్తీక శుక్ల పూర్ణిమ తర్వాత గర్భదినమగును.ఇది అందరిమతము. అందువలన గర్గాదుల మతమును తెలిపెదను. మార్గశిర శుక్లపాడ్యమి నుండి చంద్రుడు పూర్వాషాఢ నక్షత్రములో నున్నపుడు గర్భలక్షణమును తెలిసికొనవలెను. చంద్రుడు ఏనక్షత్రములోనున్నపుడు గర్భస్థితి యగునో దానికి తర్వాత 195 రోజుల తర్వాత ప్రసవమగును. (సావనమానములో 195 రోజుల తర్వాత అదే నక్షత్రము వచ్చును)

గర్భము శుక్లపక్షములోనైన కృష్ణపక్షములో, కృష్ణపక్షములోనైన శుక్లపక్షములో, పగలైన రాత్రిలో రాత్రిలోనైన పగలు, పూర్వసంధ్యలోనైన పశ్చిమసంధ్యలో,పశ్చిమ సంధ్య లోనైన పూర్వ సంధ్యలో ప్రసవమగును.

మార్గశిర పుష్యమాస శుక్లపక్షములో గర్భమైన అల్పవృష్టిని కలిగించును. చైత్ర శుక్ల పాడ్యమితో మాసమును లెక్కించవలెను. చైత్రశుద్ధ పాడ్యమి నుండి వైశాఖ కృష్ణ అమావాస్య వరకు ఒకమాసము, వైశాఖ శుద్ధ పాడ్యమి నుండి జ్యేష్ఠకృష్ణ అమావాస్య వరకు రెండవ మాసము. పుష్యమాస కృష్ణ పక్షములో గర్భమైన శ్రావణ శుక్ల పక్షములో, మాఘమాస శుక్ల పక్షములో గర్భమైన శ్రావణకృష్ణ పక్షములో, మాఘకృష్ణ పక్షములో గర్భమైన భాద్రపద శుక్లపక్షములో,ఫాల్గుణ శుక్లపక్షములో గర్భమైన భాద్రపద కృష్ణపక్షములో, ఫాల్గుణ కృష్ణ పక్షములో గర్భమైన ఆశ్వయుజ శుక్లపక్షములో, చైత్రశుక్ల పక్షములో గర్భమైన ఆశ్వయుజ కృష్ణపక్షములో, చైత్ర కృష్ణపక్షములో గర్భమైన కార్తీక శుక్లపక్షములో ప్రసవమగును (వర్షము కురియును)

గర్భకాలములో మేఘము పూర్వదిశలో నున్న ప్రసవకాలములో పశ్చిమదిశలో, పశ్చిమదిశలో నున్న పూర్వదిశలో, దక్షిణదిశలో నున్న ఉత్తరదిశలో, ఉత్తరదిశలో నున్న దక్షిణదిశలో, ఆగ్నేయకోణములో నున్న వాయవ్యకోణములో,వాయవ్యకోణములో నున్న ఆగ్నేయకోణములో,ఈశాన్యకోణములో నున్న నైరృతికోణములో, నైరృతికోణములో నున్న ఈశాన్యకోణములో మేఘములుండును. ఈవిధముగా వాయువు దిశను కూడా గ్రహించ వలెను.

గర్భకాలములో పూర్వదిశనున్న వాయువు ప్రసవకాలములో పశ్చిమ దిశవైపు కుండును. గర్భకాలములో ఆహ్లాదజనకము, సుఖస్పర్శ మరియు ఉత్తరము ఈశాన్యము పూర్వదిశలో ఉత్పన్నమగు వాయువు నిర్మల ఆకాశము స్నిగ్ధము శ్వేతము (తెల్లని) పరివేశములో వ్యాపించిన చంద్రసూర్యులు,ఆకాశములో వ్యాపించిన మేఘము, సూచ్యాకారము, క్షురాకారము లోహితమేఘములు, కాకి అండసమానము, మయూరకంఠ సమానము, నిర్మలమైన నక్షత్రములతో కూడిన ఆకాశము, ఇంద్రధనుస్సు, మేఘములధ్వని, మెరుపులు ప్రతిసూర్యులతో కూడిన పూర్వాపర సంధ్యలు, సూర్యునికి ఎదురుగా ఉత్తర ఈశాన్య పూర్వదిశలో నున్న పక్షులు మృగములు, నక్షత్రములకు ఉత్తరమార్గములో నిర్మలము ఉత్పాత రహితగ్రహముల గమనము, బాధారహిత వృక్షముల అంకురములు (బిసళ్ళు) ఆనందముతో కూడిన మనుష్యులు పశువులు ఈ గుణములతో కూడి గర్భసమయమున నున్న గర్భము పుష్టిని కలిగించును. మార్గశిర శుక్లపాడ్యమి నుండి వైశాఖమాసాంతము వరకు గర్భపరీక్షను చేయవలెను. గర్భము వృద్ధి పొందుటకు ఋతువు స్వభావముతో నుత్పన్నమగు లక్షణములను ముందు తెల్పెదను.

పుష్య మార్గశీర్షమాసములలో రెండు సంధ్యలలో రక్తవర్ణములో నావరింపబడిన మేఘము శుభమునిచ్చును. మార్గశీర్ష మాసములో అల్పశీతలము, పుష్యమాసములో మంచు కురిసిన శుభము కలుగును. మాఘమాసములో భయంకర వాయువు, సూర్య చంద్రులు మంచుతో కూడిన మలినకాంతితో కూడినవారై అతిశీతలము మేఘరహితమైన సూర్యుని ఉదయాస్తమయములు శుభమునుకలిగించును ఫాల్గుణమాసములో భయంకర మైన వాయువు, మేఘోదయము, సూర్యచంద్రుల నిర్మలము అఖండమైన పరివేషము,కపిల తామ్రవర్ణసూర్యుడు శుభమును కలిగించును. చైత్రమాసములో వాయువు, మేఘము, వర్షము పరివేషముతో కూడిన గర్భము శుభమునిచ్చును. వైశాఖమాసములో మేఘము, వాయువు, జలము, మెరుపు, మేఘము, గర్జన యుతమైన గర్భము శుభమును కలిగించును.

ముత్యము వెండితో సమానమైన శ్వేతవర్ణము, తమాలవృక్షము నీలికమలము కాటుక సమానమైన కృష్ణవర్ణము, జలచర జంతువులతో సమాన కాంతితో గర్భకాలిక మేఘమున్న అధిక వర్షము కురియును. భయంకర కిరణములతో కూడిన సూర్యతాపము అల్పవాయువుతో కూడిన గర్భకాలిక మేఘము 195వ దినమున (ప్రసవకాలమున) క్రోధితము వలె అత్యధిక వర్షము కురియును.

గర్భాకాలములో ఉల్కాపాతము, మెరుపులు, ధూళితో కూడిన వర్షము, దిక్కులలో ఉష్ణము, భూకంపము గంధర్వ నగరము, కీలకాది కేతువుల దర్శనము, గ్రహయుద్ధము, నిర్ఘాతము (ధ్వని),రుధిరాది (రక్తము,మాంసము,వస,నెయ్యి,నూనె) వికారయుత వృష్టి పరిఘ, ఇంద్రధనుస్సు, రాహువు, చంద్ర సూర్య గ్రహణముల దర్శనము గర్భమును నాశనము చేయును.

ఋతువుల స్వభావానుకూల లక్షణములతో వ్యతిరేకముగా గర్భవృద్ధి హానిని కలిగించుచు. అన్ని ఋతువులలో పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, రోహిణి ఈ ఐదు నక్షత్రములలో వృద్ధిపొందిన గర్భము ప్రసవకాలములో అధికవర్షము కురియును. శతభిషము, ఆశ్లేష, ఆర్ద్ర, స్వాతి, మఘ నక్షత్రములో ఉత్పన్నమైన గర్భము ఎక్కువ దినముల వరకు పుష్టిని పొందును. ఉక్తపంచ నక్షత్రములలో వృద్ధి పొందిన గర్భము ఎన్ని దినములు త్రివిధ ఉత్పాతములు (దివ్యఅంతరిక్ష భౌమ) కలుగునో అన్ని దినముల వరకు వర్షము కురవదు.

పైన తెల్పిన ఐదు నక్షత్రములో ఒకనక్షత్రములో మార్గశీర్షములో గర్భము వృద్ధిపొందిన ప్రసవసమయములో 8దినములు,పుష్యమాసములో 6 దినములు మాఘ మాసములో 16దినములు, ఫాల్గుణమాసములో 20 దినములు, చైత్రమాసములో 20 దినములు, వైశాఖమాసములో 30 దినములు వర్షము కురియును.

ముందు చెప్పబడు ఐదు నిమిత్తములలో గర్భమైన ప్రసవకాలములో వంద

యోజనముల వరకు వర్షము కురియును. నాలుగు నిమిత్తములలో గర్భమైన యాభై యోజనములు, మూడు నిమిత్తములలో గర్భమైన ఇరవైఐదు యోజనములు, రెండు నిమిత్తములతో గర్భమైన పన్నెండు యోజనములు, ఒకనిమిత్తములో గర్భమైన ఐదు యోజనముల వరకు ప్రసవకాలములో వర్షము కురియును.

ఐదు నిమిత్తములతో కూడిన గర్భము ఒక ద్రోణవర్షము కురియును. వాయువుతో కూడిన గర్భము మూడు ఆఢకములు, మెరుపులతో కూడిన గర్భము ఆరు ఆఢకములు, మేఘములతో కూడిన గర్భము తొమ్మిది ఆఢకములు, మేఘగర్జనలతో కూడిన గర్భము ప్రసవకాలములో పన్నెండు ఆఢకముల వర్షము కురియును. గర్భకాల నక్షత్రము పాపగ్రహములతో కూడిన ఉపలము,(రాయి) వజ్రము మత్స్యములతో కూడిన వర్షము కురియును. గర్భకాలిక నక్షత్రములో చంద్ర రవులతో కూడి శుభగ్రహ(బుధ గరు శు క్ర)దృష్టి కలిగిన అధికవర్షము కురియును. పుష్టగర్భము గ్రహోపఘాతాది (దివ్య అంతరిక్ష భౌమాది) కారణములతో జలము లేనిదైన ద్వితీయ గర్భ గ్రహణకాలములో మిశ్రితవర్షము కురియును. ఎక్కువ సమయముంచిన ఆవుపాలు కఠినమగునట్లు అధిక సమయమైన జలము కఠినమైన ఉపల (రాయి) రూపమును పొందును.

వాయువు, జలము, విద్యుత్తు, మేఘధ్వని, మేఘములతో కూడినదైన గర్భము ప్రసవకాలములో అధికవృష్టిని కలిగించును. ఈవిధముగా గర్భసమయములో అధిక వర్షము కురిసిన ప్రసవ సమయములో అధికవర్షము కురియును.

ఇరవై ఒకటవ గర్భ లక్షణాధ్యాయము సమాప్తము

22. గర్భధారణాధ్యాయము

జ్యేష్ఠశుక్ల అష్టమి నుండి నాలుగు దినముల వరకు గర్భధారణకు శుభదినములు. ఈ దినములలో సుఖస్పర్శ, శుభవాయువు (ఉత్తర ఈశాన్యము పూర్వదిశలలో ఉత్పన్నమగు వాయువు) నిర్మల మేఘములతో కూడిన ఆకాశము శుభమును కలిగించును. జ్యేష్ఠ శుక్లపక్షములో స్వాత్యాది నాలుగు నక్షత్రములలో (స్వాతి విశాఖ అనూరాధ జ్యేష్ఠ) వర్షము కురిసిన క్రమముగా శ్రావణాది (శ్రావణ భాద్రపద అశ్వయుజ కార్తీక) నాలుగు మాసము లలో అనావృష్టి కలుగును. జ్యేష్ఠ శుక్లపక్షములో స్వాతి నక్షత్రములో వర్షము కురిసిన శ్రావణమాసములో, విశాఖలో వర్షము కురిసిన భాద్రపదములో, అనూరాధలో వర్షము కురిసిన ఆశ్వయుజములో,జ్యేష్ఠ ఆషాఢలలో వర్షముకురిసిన కార్తీకములో అనావృష్టి కలుగును.

పై నాలుగు గర్భధారణా దినములు ఒకే విధముగానున్న శుభము, అసమానము గానున్న దొంగల వలన భయము కలుగును. ఈ విషయమునకు పుష్టి కలుగుటకు వశిష్ఠుని వచనము వ్రాసెదను.

విద్యుత్తు జలకణము ధూళితో కూడిన వాయువు, మేఘములతో కప్పబడిన రవి చంద్రులు ఉత్తర .ఈశాన్య పూర్వ దిశలలో విద్యుత్తుతో కూడిన గర్భధారణ దినమైన అన్నిధాన్యములకు వృద్ధిని పండితులు తెలుపవలెను. ధూళితో కూడిన వర్షము, జలము, బాలుర సుందర చేష్టలు,పక్షుల మధుర ధ్వని మట్టిలో లేక జలములో వాటి క్రీడ, స్నిగ్ధము వికారరహితము పరవేష సహితమైన రవి చంద్రులతో కూడిన గర్భధారణ దినమైన అన్నిధాన్యముల వృద్ధికలుగుటకు తగిన వర్షము కురియును. స్నిగ్ధము, దట్టమైన ప్రదక్షిణ క్రమములో (పూర్వదిశ నుండి దక్షిణము, దక్షిణము నుండి పశ్చిమము, పశ్చిమము నుండి ఉత్తరము, ఉత్తరము నుండి పూర్వదిశ) ప్రయాణము చేయు మేఘము గర్భధారణ సమయములో నున్న శుభము కలుగును.

ఇరవై రెండవ గర్భధారణాధ్యాయము సమాప్తము

23. ప్రవర్షణాధ్యాయము

జ్యేష్ఠ శుక్ల పూర్ణిమ జరిగిన తర్వాత పూర్వాషాఢాది అన్ని నక్షత్రములో వర్షము కురిసిన జలము యొక్క శుభాశుభ ఫలమును తెలుపవలెను. వర్షము కురిసిన శుభము అనావృష్టి కలిగిన అశుభమును తెలుపవలెను. ఒక హస్త సమాన వ్యాసము కలిగినది ఒకహస్త సమానములైన లోతు కలిగినది వర్తులాకారముతో నున్నదైన కుండతో వర్షజలమును కొలువవలెను. జలము నిండిన ఈ కుండలో ఒక యాభై పలముల (ఒక అఢక) తో సమానమైన జలముండును. యాభై పలములు ఒక అఢకము,నాలుగు అఢకములు ఒకద్రోణమగును.

వర్షము వలన భూమిపై దుమ్ముపోయిన గడ్డి పోసలపై జలకణములు కనిపించిన దానిని జలప్రమాణముగా తీసుకొనవలెను. పూర్వాషాఢాది నక్షత్రములలో ఏనక్షత్రములో వర్షము కురియునో ఆనక్షత్ర పరిమాణముననుసరించి వర్షమును తెలుపవలెను.

కశ్యపాది మునుల మతానుసారము ప్రవర్షణ కాలము (జ్యేష్ఠ శుక్ల పూర్ణిమ తర్వాత పూర్వాషాఢాది ఇరువై ఏడు నక్షత్రముల కాలము) లో ఒక ప్రదేశములో వర్షము కురిసినప్పటికి వర్షాకాలములో అధిక వర్షము కురియును. ఇతరుల మతముననుసరించి ప్రవర్షకాలములో తక్కువలో తక్కువగా పదియోజనముల వరకు వర్షము కురిసిన వర్షాకాలములో ఉత్తమ వృష్టి కురియును. గర్గ వశిష్ఠ పరాశరాదుల మతముననసరించి ప్రవర్షణ కాలములో పన్నెండు యోజనముల వరకు వర్షము కురిసిన వర్షాకాలములో ఉత్తమ వృష్టి కురియును.

ప్రవర్షణ కాలములో పూర్వాషాఢాది నక్షత్రములలో ఏనక్షత్రములో వర్షము కురియునో, ప్రసవకాలములో అదే నక్షత్రములో తిరిగి వర్షము కురియును. ప్రవర్షణ

కాలములో పూర్వాషాఢాది నక్షత్రములలో వర్షము లేకున్న ప్రసవ కాలములో కూడా వర్షము కురవదు.

హస్త పూర్వాషాఢ మృగశిర చిత్త రేవతి ధనిష్ఠ నక్షత్రములలో ప్రవర్షణ కాలములో వర్షము కురిసిన ప్రసవకాలములో పదహారు ద్రోణుల వర్షము కురియును. ఇదేవిధముగా శతభిష జ్యేష్ఠ స్వాతి నక్షత్రములలో నాలుగు ద్రోణులు, కృత్తికలో పదిద్రోణులు,శ్రవణ మఘ అనూరాధ భరణి మూల నక్షత్రములలో పదహారు ద్రోణులు, పుబ్బలో ఇరవై ఐదు ద్రోణులు, పునర్వసులో ఇరవైద్రోణులు, విశాఖ ఉత్తరాషాఢలలో ఇరవై ద్రోణులు, ఆశ్లేషలో పదమూడు ద్రోణులు, ఉత్తరాభాద్ర ఉత్తర రోహిణిలలో ఇరవైఐదు ద్రోణులు, పూర్వాభాద్ర పుష్యమిలలో పదిహేను ద్రోనులు, అశ్వినిలో పన్నెండు ద్రోణులు, ఆర్ద్రలో ప్రవర్షణ కాలములో వృష్టి జరిగిన ప్రసవకాలములో పద్దెనిమిది ద్రోణుల వర్షము కురియును.

రవి శని కేతు కుజ లేక త్రివిధ ఉత్పాతముల (దివ్య అంతరిక్ష భౌమ)వలన నక్షత్రములు పీడింపబడిన అమంగళము అనావృష్టి కలుగును. ఉపద్రవరహితమైన బుధ గురు శుక్రులతో నక్షత్రములున్న మంగళము అతివృష్టి కలుగును.

ఇరవై మూడవ ప్రవర్షణాధ్యాయము సమాప్తము

24. రోహిణీ యోగాధ్యాయము

సువర్ణ పాషాణ సముదాయములో ఉత్పన్నమైన వృక్షముల పుష్పములపై నిలిచిన భ్రమరముల శబ్దములతో కూడినది, వివిధ ప్రకారములైన పక్షుల కిలాకిలారావములతో విద్యాధరుల గీతములతో ఉత్పన్నమైన మధురశబ్దములతో కూడినది, సుమేరుపర్వతముపై నున్న ఉపవనములో నారదుని కొరకు బృహస్పతి తన శిష్యుల కొరకు గర్గుడు పరాశరుడు కాశ్యపుడు మయుడు రోహిణీ చంద్రుల సమాగమమును గూర్చి తెల్పిన విషయమును స్వల్పముగా వివరించుటకు ప్రయత్నించుచున్నాను.

ఆషాఢమాస కృష్ణపక్షములో రోహిణి చంద్రుల సమాగమము చూచి గ్రహచింతకులైన దైవజ్ఞులు శాస్త్రములో తెల్పినవిధముగా భూలోకములో శుభాశు భములను తెలుపవలెను. భూతకాల విషయము ప్రయోజనము లేనిదగుట వలన ముందు జరుగు రోహిణీయోగమును తెలుపవలెను. ఈయోగమును నేను పంచ సిద్ధాంతికలో తెలిపితిని. చంద్రబింబ ప్రమాణము చంద్రకాంతి, చంద్రుని వర్ణము, చంద్రమార్గము, అనేక విధములైన ఉత్పాతములు వాయువు ద్వారా భూమిపై జరుగు శుభాశుభములు తెలుపవలెను.

నగరములో ఉత్తరము లేక పూర్వదిశలో బ్రాహ్మణుడు హవనము చేయుచు మూడురోజులు ఉపవాసము చేయవలెను.అశ్వీన్యాది నక్షత్రముతోపాటు సూర్యాది

సమ గ్రహములను వ్రాసి, ధూపము, పుష్పములతో బలిని సమర్పించి పూజించవలెను. రత్నములు, జలము, ఔషధములు, ప్లవములతో ఆచ్ఛాదితమై అనేక విధములైన పూజిత వస్తువులు,అకాల మూల(మంటల వలన నల్లని వర్ణము క్రిందిభాగమున లేనటువంటి) కలశములను నాలుగు దిశలందుంచి ధర్భలతో ఆచ్ఛాదనము చేయబడిన స్థండిలము అలికిన స్థలముపై కూర్చొనవలెను. తర్వాత మహావ్రత నామక మంత్రముతో మంత్రించిన బీజములను కలశములోపోసి,సువర్ణము కుశలతోకూడిన జలమును దానిలో నింపవలెను.పన్నెండు హస్తముల ఎత్తుకలిగిన గోడపై దండప్రమాణము (నాలుగు హస్తముల పొడవు)తో పతాకమును కట్టవలెను. ముందు దిక్కులను రోహిణీయోగములో నుండు చంద్రసమయములో వాయువుననుసరించి ఎగురుపతాకముతో దిక్కులను తెలిసికొనవలెను.

రోహిణీ నక్షత్రములో చంద్రుడున్న రోజున సూర్యోదయము మొదలుకొని తరువాతి రోజు సూర్యోదయము వరకు ఎనిమిది ప్రహరలుగా విభజించవలెను. మొదటి ప్రహర నుండి వాయుస్థితిని పరీక్షించవలెను. ప్రథమ ప్రహరలో వాయువు చలించిన శ్రావణ కృష్ణపక్షములో, రెండవ ప్రహరలో చలించిన శ్రావణ శుక్లపక్షములో, మూడవ ప్రహరలో చలించిన భాద్రపద కృష్ణపక్షములో, నాల్గవప్రహరలో చలించిన భాద్రపద శుక్లపక్షములో, రాత్రిప్రథమ ప్రహరలో చలించిన ఆశ్వయుజ కృష్ణపక్షములో, రెండవ ప్రహరలో చలించిన ఆశ్వయుజ శుక్లపక్షములో,మూడవప్రహరలో చలించిన కార్తీక కృష్ణపక్షములో, నాల్గవ ప్రహరలో చలించిన కార్తీకశుక్లపక్షములో,సుందరవృష్టి (అధికవర్షము) కురియును. సూర్యోదయము నుండి అర్ధప్రహరలో వాయువు చలించిన శ్రావణకృష్ణాది ఏడురోజులు దానిలో సగమైన మూడు ముప్పావు రోజులుగా వర్షమును తెలుపవలెను. పతాకము సవ్యదిశలో సక్రమముగా చలించిన ఎల్లప్పుడు శుభమును కలిగించును. వాయువు యొక్క స్థిరత్వము ననుసరించి శుభాశుభ ఫలమును తెలుపవలెను.

రోహిణీ నక్షత్రములో చంద్రుడున్న సమయములో కుండలో నుంచిన బీజములు చిగురించిన స్థితిననుసరించి వర్షవృద్ధి ఉండును.శాంతము మధురముగా పలుకు పక్షులు, అడవిజంతువులు ధ్వనులు నిర్మలమైన ఆకాశము,సుందరవాయువు శుభమును కలిగించును. దీనితర్వాత మేఘములు వాయువుల కల్పన చేయుదును.

కుండలాకారముగా కనిపించు పొట్టకారణముగా సర్పముల ఆకారముతో, కొన్నిమార్లు తెలుపు నలుపుగా, కొన్నిమార్లు తెల్లగా, కొన్నిమార్లు నల్లగా, కొన్నిసార్లు మెరుపువలె వికసించిన కమలముల వలె స్వచ్ఛముగా, ప్రక్కభాగములో లోహవర్ణపు కాంతివలె భ్రమరమువలె కుంకుమ వర్ణమువలె, పుష్పమువలె స్వచ్ఛకాంతి కలిగి మేఘములతో కూడిన ఆకాశము రోహిణీయోగ సమయములో శుభమును కలిగించును.

మెరుపు ఇంద్రధనుస్సు కృష్ణవర్ణ మెరుపులతో కూడియుండుట వలన విచిత్ర వర్ణములతో కూడిన ఆకాశము దావాగ్నివలె కనపడి ఏనుగులు దున్నల వలన ఆకులితమైన వనమువలె రోహిణీయోగములో శుభమును కలిగించును. లేని యెడల అంజన పర్వతముపై నుండు నల్లని రాళ్ళతో సమానమైనవి, మంచు, ముత్యము, శంఖము, చంద్రకిరణముల కాంతిని హరించు మేఘములతో కూడిన ఆకాశము రోహిణీయోగములో శుభమును కలిగించును.

మెరుపు రూపమైన మధ్యబంధనము (ఒడ్డాణము) హంసరూపమైన ముందు దంతములు, జారిపడు జలరూపమదము, చలించుచున్న అగ్రభాగ రూపహస్తము, ఇంద్ర ధనుస్సువలె ఎత్తైనధ్వజమువలె నున్న తమాలవృక్షము మరియు భ్రమరము వలె నల్లని కాంతి కలిగి హస్తిసమానమైన మేఘములు కలిగిన ఆకాశము రోహిణీయోగ సమయములో శుభమును కలిగించును.

ఆకాశములో సంధ్యాకాలపు రంగుతో నీలికమలమువలె, పీతాంబరము ధరించిన విష్ణువు కాంతిని దొంగిలించు కాంతి కలిగిన మేఘములు, మయూరము, చారక మెండకముల (కప్ప) మధుర శబ్దములతో దిగంతముల వరకు వ్యాపించిన ఆకాశములో అధికవృష్టిని కలిగించు మేఘములు, ముందు తెల్పిన విధముగా రెండుమూడు దినములు ఆకాశములో కనిపించిన సుభిక్షముతో మనుష్యులకు ఆనందమును కలిగించును. భూమిపై అధికవృష్టి కురియును.

రూక్షము, అల్పమైన వాయువుతో ప్రేరితమై ఒంటె, కాకి, శవము, వానరము, లేక అన్యనిందిత జీవుల కాంతితో శబ్దరహితమైన మేఘము అశుభవృష్టిని అనావృష్టిని కలిగించును. మేఘరహిత ఆకాశములో సూర్యకిరణములు,తీక్ష్ణమైన మరియు రాత్రియందు నిర్మలమైన నక్షత్రములతో కూడిన ఆకాశము,వికసించిన కుముదములు కలిగిన సరోవరము వలెనున్న సుందరమైన వృష్టి కురియును.

పూర్వదిశలో ఉదయించు మేఘముల వలన ధాన్యవృద్ధి, ఆగ్నేయదిశలో ఉదయించు మేఘములతో అగ్నిభయము, దక్షిణదిశలో ఉదయించు మేఘముల వలన ధాన్యనాశము, నైరృతిలో ఉదయించు మేఘముల వలన ధాన్యముల అర్ధఉత్పత్తి, పశ్చిమ దిశలో ఉదయించు మేఘముల వలన సుందరవృష్టి, వాయవ్యకోణములో ఉదయించు మేఘముల వలన పూర్ణవృష్టి,ఈశాన్యకోణములో ఉదయించు మేఘముల వలన ఉత్తమధాన్యము కలుగును. దిశలననుసరించి వాయుఫలములీ విధముగా తెలిసికొనవలెను.

రోహిణీయోగ దినములో వర్షము కురియునపుడు ఉత్తరాది నాలుగు దిశలలో ప్రదక్షిణక్రమములో శ్రావణాది నాలుగుమాసముల నామముల నుంచి నాలుగు కుండలను స్థాపించవలెను. ఏమాసపు కుండ జలముతో నిండునో ఆమాసఫలమునిచ్చును. జలము లేకున్న అనావృష్టి, కొద్దిగా జలమున్న దానికితగిన విధముగా వృష్టి కలుగును. సగములో

సగము నాల్గవవంతులో నాల్గవవంతు ఈవిధముగా వర్షము తెలుపవలెను. రోహిణీయోగ సమయములో వర్షము కురియునపుడు ఉత్తరాది నాలుగుదిశలలో ప్రదక్షిణ క్రమములో ఉత్తరాది దిశలలో నున్న రాజు, దేశము, బ్రాహ్మణాది నాలుగు వర్ణముల నామముల నుంచి పూర్వమువలె నాలుగు కుండలను స్థాపించవలెను. ఏదిశలో నున్న కుండ నష్టమైన ఆదిశలో నున్న రాజు, దేశము, వర్ణములకు నాశనము కలుగును. ఏదిశలో నున్న కుండ నుండి జలము బయటకు ప్రవహించునో ఆదిశలోని రాజులకుపద్రవము కలుగును. ఏదిశలోని కుండలో కొంచెము జలముండునో ఆదిశలో రాజాదులు మధ్యమ ఫలము పొందెదరు. ఏదిశలోని కుండ జలముతో నిండియుండునో ఆదిశలో రాజాదులకు అధిక శుభఫలము కలుగును.

దూరముగా దగ్గరగానున్న చంద్రుడు రోహిణీ నక్షత్రమునకు దక్షిణదిశలో సంయోగము పొందిన లోకమునకు దు:ఖము కలిగించువాడగును. రోహిణీ నక్షత్రమును దక్షిణములో స్పర్శించుచు ఉత్తరమువైపుకి చంద్రుడు గమనము చేసిన సుందరవృష్టి కలుగును. లోకులకు అనేకవిధమములైన ఉపద్రవములు కలుగును. రోహిణీ నక్షత్రమును స్పర్శించు కుండ ఉత్తరమువైపుకి చంద్రుడు గమనము చేసిన సుందరవృష్టి, లోకులకు శుభమును కలిగించువాడగును.

రోహిణీ నక్షత్రమునకు ఆరు తారలుండుట వలన రోహిణిని శకటమందురు. మధ్యమ నుండి చంద్రుని గమనము చేసిన ఆశ్రయరహితములై, పిల్లల కొరకు భోజనమును కోరుతున్నవారై, సూర్యకిరణ వశమున ఉష్ణజలమును త్రాగుతున్నవారై జనులు అనిశ్చిత స్థానములో ప్రయాణము చేయుదురు. చంద్రుని ఉదయమైన తర్వాత పశ్చిమదిశలో రోహిణీ నక్షత్రముదయించిన గమనము చేసిన లోకులకు అనేకవిధములైన శుభము కలుగును. కామాతురులైన స్త్రీజనము పతులకు వశులగుదురు. ప్రియురాలి వెనుక కాముకులైన పురుషులు గమనము చేయునట్లు రోహిణీనక్షత్రము వెనుక చంద్రుడు గమనము చేసిన కామాతురులైన పురుషులు స్త్రీలకు వశులగుదురు. రోహిణీ ఆగ్నేయ కోణములో చంద్రుడుండు వర్షములో అనేక ఉపద్రవములు,నైరృతిలో చంద్రుడున్న అతివృష్టి, ఆదిఈతిబాధలతో పీడితులై ధాన్యనాశము, వాయవ్య కోణములో చంద్రుడున్న మధ్యమభాగము(తక్కువధర)సుందరవృష్టి కలుగును. చంద్రుడు రోహిణీ నక్షత్రము యొక్క ఒకశృంగ భాగమును స్పర్శించిన కఠోరభయము బింబముతో ఆచ్ఛాదన చేసిన స్త్రీలవలన రాజుకు నాశము కలుగును.

గోప్రవేశ సమయములో(సంధ్యా సమయము)వనము నుండి వచ్చు పశువులతో ఎద్దు లేక నల్లని పశువున్న ఆసంవత్సరము అధికవృష్టి కురియును. శాబల (నలుపు తెలుపు) వర్ణపు పశువు ముందున్న మధ్యమఫలము నలుపు ఎక్కువఉన్న వర్షము, తెలుపు ఎక్కువ ఉన్న స్వల్పవర్షము, పూర్తిగా తెల్లగానున్న అనావృష్టి కలుగును.

మేఘములతో మూయబడిన ఆకాశములో రోహిణీయోగ సమయములో చంద్రుడు కనిపించుచున్న సంవత్సరములో రోగభయమధికమగును. భూమిపై అధికధాన్యము, వర్షము కలుగును.

ఇరవై నాల్గవరోహిణీయోగాధ్యాయయము సమాప్తము

25. స్వాతీ యోగాధ్యాయము

రోహిణీ యోగములో కలుగు ఫలితములవలె ఆషాఢశుక్ల పక్షములో స్వాతీ యోగములో నున్న చంద్ర ఫలితములను గ్రహించవలెను. స్వాతీయోగములో నున్న విశేషఫలితములను గూర్చి తెలిపెదను.

స్వాతీ నక్షత్రములో ఉన్న చంద్రుని సమయము రాత్రి పగలు రెండింటిని మూడేసి భాగములు చేయవలెను. రాత్రిప్రథమ భాగములో వృష్టి కలిగిన అన్ని ధాన్యములకు వృద్ధి కలుగును. ద్వితీయభాగములోనైన నువ్వులు పెసలు మినుములకు వృద్ధి, తృతీయ భాగములో గ్రీష్మఋతు ధాన్యమునకు వృద్ధి, శరత్కాల ధాన్యమునకు అభావము, పగలు ప్రథమభాగములోనైన సుందర వృష్టి, ద్వితీయభాగములోనైన కీటకములు సర్పములతో కూడిన వర్షము, తృతీయభాగములోనైన మధ్యమ వృష్టి కలుగును. సంపూర్ణముగా రాత్రి పగలు వర్షము కురిసిన వర్షాకాలములో దోషరహితమైన వర్షము కురియును.

మాఘ కృష్ణ సప్తమిలో స్వాతి నక్షత్రగత చంద్రుడున్న సమయములో మంచు కురిసిన భయంకరమైన వాయువు వీచిన, జలముతో మేఘము గర్జించిన, విద్యున్మాలతో ఆకాశము వ్యాపించిన మేఘములతో కప్పబడిన కారణముగా చంద్రుడు సూర్యుడు తారలు కనపడకున్న వర్షాకాలములో ఆనందముతో అన్నిధాన్యములతో కూడి జనపదము లుండును. ఈ విధముగా ఫాల్గుణ చైత్ర వైశాఖమాసముల కృష్ణ పక్షములో విశేష రూపముతో పరిశీలన చేయవలెను.

ఇరవై ఐదవ స్వాతీయోగాధ్యాయము సమాప్తము

26. ఆషాఢీ యోగాధ్యాయము

ఆషాఢమాస శుక్ల పూర్ణిమ దినమున చంద్రుడు ఉత్తరాషాఢ నక్షత్ర గతుడైనపుడు అన్నిధాన్యములను తక్కెడలో తూకము వేసి వేరువేరుగా నుంచవలెను. రెండవరోజు వాటన్నింటిని మరల తూకము వేయవలెను. తూకము ఎక్కువైన ధాన్యములు ఆసంవత్సరములో ఎక్కువగా పండును. తక్కువైన ధాన్యములకు హాని కలుగును. ఇక్కడ తక్కెడను మంత్రించుటకు తగిన మంత్రము కలదు.

మంత్రయోగముతో సత్యరూపమైన సరస్వతీ దేవిని ఉపాసన చేయవలెను. ఓ సత్య స్వరూపిణియైన సరస్వతీ ! పరమార్థ రూపవస్తువును నీవే చూపించగలవు. ఎందు వలననగా నీవు సత్యవ్రతురాలవు. అసత్యముతో చంద్రుడు సూర్యుడు కుజాది గ్రహములు

నక్షత్రములు పూర్వదిశలో ఉదయించి పశ్చిమములో అస్తమించును. వేదములలో నున్న ఆ సత్యము బ్రహ్మావాదులలో నున్న.మూడులోకములలో నున్న దానిని చూపించును. నీవు బ్రహ్మ పుత్రికవు కాని ఆదిత్య అని పలుకబడెదవు. కాశ్యప గోత్రముతో తులా నామముతో ప్రసిద్ధి పొందినదానవు.

పది అంగుళముల ప్రమాణమున్న నాలుగేసి సూత్రములను (త్రాళ్లు) ఆరు అంగుళముల ప్రమాణమున్న శిక్యక (తక్కెడ) వస్త్రముతో బంధించవలెను. రెండు తక్కెడల మధ్యలో ఆరు అంగుళముల ప్రమాణముతో దండమును బంధించవలెను. దక్షిణవైపు నున్న తక్కెడపై బంగారము, ఉత్తరవైపు తక్కెడపై కూపము, నది సరోవరముల జలముతో పాటు ద్రవ్యములనుంచవలెను. మొదటి దినము కన్న రెండవ రోజు కూపజలము బరువు పెరిగిన అనావృష్టి, నదీజలము పెరిగిన మధ్యమ వృష్టి, సరోవర జలము పెరిగిన ఉత్తమవృష్టి కురియును. గజదంత ప్రమాణముతో ఏనుగు గోవు గుర్రము మున్నగువాటి రోమముతో(వెంట్రుక) క్రమముగా వాటికి సువర్ణముతో రాజుకు, మైనముతో బ్రాహ్మణాది నాలుగు వర్ణములకు దేశవర్షమాస దిశలకు, తమతమ ప్రమాణము లతో మిగిలిన ద్రవ్యములకు శుభాశుభ ఫలమును తెలుపవలెను.

సువర్ణ తులాదండము శ్రేష్ఠమైనది. వెండిది మధ్యమము, ఖదిర వృక్షపు కర్రతో తులాదండమును చేయవచ్చును. లేని యెడల మనుష్యని బాధించు బాణమును తులా దండముగా నుపయోగించవచ్చును. ఆ తులాదండము పన్నెండు అంగుళములపొడవుండ వలెను. రెండవ రోజు తూసిన ద్రవ్యములు స్వల్పమైన ఆసంవత్సరములో వాటి నాశనము, అధికమైన అధికవృద్ధి,సమానమైన మధ్యమఫలము కలుగును.

ఈవిధముగా పరమ గోపనీయ మైన తులా రహస్యమును తెలిపితిని. రోహిణీ యోగకాలములో దీని విచారణ చేయవలెను. స్వాతి ఉత్తరాషాఢ రోహిణీ నక్షత్రములలో నున్న చంద్రునితోపాటు పాపగ్రహముల (కుజ శని రాహు కేతు) యోగమున్నప్పుడు శుభము కలుగదు. మూడు యోగముల (రోహిణి స్వాతి ఆషాడీ)ఫలము లేక రెండు యోగముల ఫలము సమానమైన నిస్సందేహముగా అదేఫలమును తెలుపవలెను. మూడు యోగములకు వేరువేరు ఫలములు కలిగినప్పటికి రోహిణీ యోగఫలమును ఆసంవత్సరములో తెలుపవలెను.

పైన తెల్పిన మూడు యోగముల సమయములో పూర్వదిశలో వాయువు చలించిన ధాన్యముల వృద్ధి, ఆగ్నేయ కోణములో వాయువు చలించిన అగ్నిప్రకోపము, దక్షిణదిశలో నైన అల్పవృష్టి, నైరృతి కోణములోనైన మధ్యమవృష్టి, పశ్చిమదిశలోనైన ఉత్తమవృష్టి, వాయవ్య కోణములోనైన అధికవృష్టి, ఉత్తర దిశలోనైన సుందరవృష్టి, ఈశాన్య కోణములో వాయువు చలించిన ఉత్తమవృష్టి కలుగును.

ఆషాఢకృష్ణ చతుర్థీ దినమున పూర్వాషాఢ నక్షత్రములో మేఘము వర్షము కురిసిన ఆసంవత్సరములో వర్షము అధికమగును. వర్షము కురవకున్న అనావృష్టి కలుగును.

ఆషాఢ పూర్ణిమ దినమున సూర్యాస్తమయ కాలములో ఈశాన్య కోణములో గాలి వీచిన భూమిపై అధిక ధాన్యము పండును.

ఇరవైఆరవ ఆషాఢీ యోగాధ్యాయము సమాప్తము

27. వాతచక్రాధ్యాయము

ఆషాఢ శుక్లపూర్ణిమ దినమున పూర్వసముద్రపు తరంగాగ్రభాగము నుండి చలించుచున్న కారణముగా తిరుగుచున్న సూర్య చంద్రుల కిరణ రూప జటలతో శోభించుచున్న వాయువు ఆకారములో చరించును. ఆసంవత్సరములో అన్ని వైపుల నీలవర్ణపు మేఘములు శారదీయ ధాన్యముల సమృద్ధితో వసంతఋతువులో అతిసమృద్ధి యుత ధాన్యములతో భూషితమై భూమి సుందరముగా నుండును.

ఆషాఢ శుక్ల పౌర్ణమి దినమున సూర్యాస్తమయములో అప్రతిహతముగా ఆగ్నేయ కోణము నుండి గాలి వీచిన ఆసంవత్సరములో అన్ని దిశలలో అగ్నిజ్వాలలు వ్యాపించి ప్రజ్వలింపబడి భూమి అత్యధిక ఉష్ణముతో భస్మమును బయటికి పంపుచు అనగా భూమిపై వర్షాభావము, అగ్నిభయము, ప్రజలనాశము ఉపద్రవములు కలుగును.

ఈ యోగములో ఆషాఢ శుక్ల పౌర్ణమి దినమున సూర్యాస్తమయ సమయమున సముద్రమునకు సమీపములో చిన్న ఏలకులు, లవలీ, లవంగ వృక్షములపై తిరుగుతు నైరృతివైపుకి గాలి వీచిన ఆకలిదాహముతో మరణించు మనుష్యుల ఎముకల ముక్కల భారముతో వ్యాపించిన భూమి ఉన్మత్తము అతిచంచలమైన ప్రేతవధువు వలె కనిపించును.

ఈ యోగములో ధూళి పైకిలేచి చంచలము భయంకరమైన గాలి వీచిన ఈ సంవత్సరములో ధాన్యములతో రాజుల యుద్ధములతో అన్ని స్థలములలో వస,మాంసము రక్తములతో భుమి నిండియుండును.

ఈయోగములో ఆషాఢ శుక్ల పూర్ణిమ దినమున సూర్యాస్తమయములో ధూళి సంయోగముతో సర్పములవలె వాయవ్యకోణములో వీచిన గాలి ఆసంవత్సరములో జలధారలతో ఆనందముతో శబ్దములను కలిగించు కప్పల సమూహముతో కూడి, ధాన్యముల బీజోత్పత్తి రూపచిహ్నములతో సుందరముగా తయారైన భూమి సుఖ సంతోషములధికమైన కారణముగా భాగ్యరూపమైన సేనవలె కనిపించును.

గ్రీష్మఋతుపు చివరలో (ఆషాఢ శుక్ల పూర్ణిమ దినమున) మేరు పర్వతముతో ఆచ్ఛాదికమైన సూర్యకిరణముల వలన (సూర్యాస్తమయ సమయములో) అతి సుగంధ యుత మైన కదంబ పుష్పముల గంధముతో ఉత్తరమువైపుకి వీచిన గాలి ఆసంవత్సరములో మెరుపుతో ఉత్పన్నమైన సంపూర్ణ కాంతి స్వరూపజ్ఞాన కారణముగా ఉత్పన్నమైన మేఘములు, మేఘములతో ఆచరించిన చంద్ర కిరణములతో కూడిన భూమి జలముతో సంపూర్ణమగును.

ఆషాఢ శుక్లపూర్ణిమ దినమున సూర్యాస్తమయ సమయమున దేవతల సేవ కొరకు శీతలము భయంకరమైన శబ్దములు కలిగించునది,పున్నాగ అగరు పారిజాత

పుష్పముల సుగంధముతో ఈశాన్య కోణములో గాలివీచిన ఆసంవత్సరములో పూర్ణజల రూప యౌవనముతో పండిన ధాన్యములతో వ్యాపించిన భూమి ఉండును. ధర్మాత్ములు శత్రువులను తనవశములో చేసుకొను రాజులు బ్రాహ్మణాది వర్ణములకు తగిన విధముగా రక్షణ కలిగించును.

చంద్ర సూర్యకిరణములు తారలు లేకుండ ఆకాశము లేకున్న దానిని భాద్రపద మని చెప్పకూడదు. ఎందువలననగా ఆసమయములో మేఘములు వర్షింపవు.

ఇరవైఏడవ వాతచక్రాధ్యాయము సమాప్తము

28. సద్యోవర్షాధ్యాయము

కృష్ణపక్షములో వర్షప్రశ్న వేసినపుడు జలచరరాశిలో నున్న చంద్రుడు లగ్నములో నున్న శుక్లపక్షములో జలచరరాశిలోనున్న చంద్రుడు కేంద్రములోనున్న, ఈరెండు యోగములలో చంద్రుడు శుభగ్రహములతో చూడబడిన తొందరగా అధికవృష్టి, పాప గ్రహములతో చూడబడిన స్వల్పవృష్టి కురియును.

వర్షప్రశ్నలో ప్రశ్నకర్త తడిచిన వస్తువు, జలము, జలసంజ్ఞిక వస్తువు (క్షీర, అబ్జ ఇత్యాది)ను స్పర్శించి, జలసమీపముననున్న జలసంబంధమైన కార్యములో నున్న, ఇతరుల ద్వార జలశబ్దమును వినిన వెంటనే వర్షము కురియును. వర్ష సమయములో ఉదయపర్వతముపై అత్యంత తీక్ష కిరణములతో కఠినత్వముతో చూచుటకు సమర్థుడు, కాలిన సువర్ణ సమానము నిర్మల వైదూర్య కాంతివాడైన సూర్యుడు ఏదినములో కనిపించునో ఆదినములో వర్షము కురియును. మధ్యాహ్న సమయములో అతి తీక్ష్ణకిరణముతో సూర్యుడున్న దినమున వర్షము కురియును. రుచిలేని జలము,గోనేత్ర సమానము కాకి అండసమానమైన ఆకాశము,నిర్మల మైన దిశలు,లవణ వికృతి(ఉప్పులో వికార స్వరూపము) వాయువిరోధము,అతిగ పైకి ఎగిరిపడుతున్న మత్స్యములు, అధికశబ్దము చేయుచున్నప్పుడు వర్షమునకు కారణమగును.

పిల్లి తనగోళ్ళతో భూమిని గోకిన, లోహములో పచ్చిమాంసపు వాసన వచ్చిన, మార్గములో బాలురు నిర్మించిన వంతెన కనపడిన వెంటనే వర్షము పడునని తెలుపవలెను. అంజనపు(కాటుక) చూర్ణము వలె పర్వతములు, జలముతో నిండిన గుహలు, జలముతో నుండు కోళ్ల కన్నులతో సమానముగా చంద్ర కిరణములు కనపడిన వెంటనే వర్షము కురియును. కారణము లేకుండ చీమలు గుడ్లను ఒకచోటు నుండి మరొక చోటుకి తీసుకొని వెళ్ళటము, సర్పముల సంపర్కము, సర్పములు వృక్షములపైకి ఎక్కటము,గోవు అకారణముగా గెంతటము చేసిన వెంటనే వర్షము కురియును.

వృక్షముపై భాగమున నుండి ఊసరవెల్లి ఆకాశము వైపుకి చూచిన గోవులు ఆకాశము వైపుకి తిరిగి సూర్యుని చూచిన వెంటనే వర్షము కురియును. పశువులు ఇంటి నుండి బయటకు వెళ్లుటకు ఇష్టపడకున్న, చెవులు కాళ్లు ఆడించిన, పశువులవలె కుక్క

కూడ అదే చేష్టను చేసిన వర్షము కురియునని తెలుపవలెను. ఇంటిపై భాగమున నున్న కుక్క ఆకాశము వైపుకి తిరిగి అరుస్తున్న ఈశాన్యకోణములో మెరుపు కనబడిన జలముతో భూమి సమానమగును. అతిగా వర్షము కురియును.

చిలుక పావురముల నేత్ర సమానముగా తేనెవలె చంద్రుడున్న ఆకాశములో రెండవ చంద్రుడు కనబడిన వెంటనే వర్షము కురియును. రాత్రులందు మేఘము గర్జించిన పగలు రక్తసమానముగా దండాకారములో మెరుపు కనిపించిన పూర్వదిశలో చల్లని గాలివీచిన వర్షము కురియును. లతల లేతాకులు ఊర్ధ్వముఖమైన, జలము ధూళిలో పక్షులుస్నానము చేసిన సరీసృపములు(సర్పాదులు)గడ్డిపై నున్న వెంటనే వర్షము కురియును.

మయూరము, చిలుక, నీలకంఠము, చాతకము, జలపుష్పము కమలములతో సమానమైన కాంతి గలది, తుమ్మెద పర్వతము మొసలి తాబేలు పంది మత్స్యములతో సమానమైన ఆకారము గలది ఐన మేఘము వెంటనే వర్షించును. నాలుగు వైపుల సున్నము లేక చంద్ర సమానమైన శ్వేతవర్ణము, మధ్యలో భ్రమరము కాటుక సమానకాంతి కలది, నిర్మలమైన జలబిందువులను వదులుతు సోపానమువలె నున్న మేఘము పూర్వదిశలో ఉత్పన్నమై పశ్చిమదిశవైపుకి, పశ్చిమ దిశలో ఉత్పన్నమై పూర్వదిశవైపుకి ప్రయాణము చేసిన భూమిపై వెంటనే వర్షము కురియును.

సూర్యుని ఉదయాస్తమయములో ఇంద్రధనుస్సు, పరిఘ (47అ-19వ శ్లోకం) రెండవ సూర్యుడు రోహిత (47వ.అ-20వశ్లోకము) లేక సూర్యచంద్ర పరివేషముకనపడిన వెంటనే వర్షము కురియును. ఉదయాస్తమయములో తిత్తిరపక్షి రెక్కవలె ఆకాశమున్న ఆనందముతో పక్షిగణము శబ్దముచేసిన క్రమముగా పగలు రాత్రి వర్షము కురియును. ఉదయకాలములో పైనతెల్పిన లక్షణములున్న పగలు, అస్తమయములోనున్న రాత్రియందధిక వర్షము కురియును.

వెయ్యి, అమోఘ (30 అ-11వశ్లోకము) అస్తాచల పర్వతహస్తమువలె ఉత్పన్నమైన సూర్యకిరణములు కనిపించిన, లేక మేఘము భూమి దగ్గరకు వచ్చి గర్జించినపుడు కురిసిన వర్షము ఉత్తమ యోగమునిచ్చును. వర్షాకాలములో శుక్రుని నుండి సప్తమరాశిలో స్థితుడై చంద్రుడు శుభగ్రహములతో చూడబడిన లేక శని తొమ్మిది లేక ఐదవరాశిలో నుండి శుభగ్రహములతో చూడబడిన జలాగమనము జరుగును. గ్రహముల ఉదయాస్తమయ కాలములో చంద్రునితో కలిసినపుడు మండలములో ప్రవేశించినపుడు, పక్షాంతములో, సూర్యుని దక్షిణాయనాంతము ఉత్తరాయణాంతములో, సూర్యుడు ఆర్ద్రా నక్షత్రములో నున్నపుడు తప్పక వర్షము కురియును. బుధ-శుక్ర,బుధ -గురు, గురు-శుక్ర, శని-కుజుల యోగమున్న వాటిపై శుభగ్రహదృష్టియున్న వాయువు అగ్నులభయము కలుగును.

సూర్యునికన్న మందగతి గ్రహము ముందుకి శీఘ్రగతి గ్రహము వెనుకకున్న భూమి జలముతో సమృద్ధియగును. రాత్రులందు మిణుగురులు మేఘము దగ్గరకు

వెళ్ళిన వెంటనే మేఘములు ధాన్యము వృద్ధి పొందునట్లు వర్షము కురియును. ప్రదోష సమయములో వర్షము కురిసిన లేక నక్క అరిచిన నిశ్చయముగా ఏడురోజుల వరకు వర్షము కురియును.

ఇరవై ఎనిమిదవ సద్యోవర్షణాధ్యాయము సమాప్తము

29. కుసుమ లతాధ్యాయము

వృక్షముల ఫలములు పూలను చూచి ద్రవ్యముల సులభత్వము ధాన్యముల నిష్పత్తిని తెలిసికొనవచ్చును. శాలవృక్షముల ఫలముల పూలవృద్ధి వలన కమలశాలీ ధాన్యాదులు, రక్త అశోకము వలన రక్తధాన్యములు క్షీరముల వలన పాండూకములు, నీల అశోకముల ఫల పూలవృద్ధితో సూకర ధాన్యముల వృద్ధిని తెలిసికొనవలెను.

వట (మర్రి) వృక్షముల వలన యవలు, తిందుక వృక్ష వృద్ధి వలన షష్ఠకధాన్యము రావివృక్షముల వృద్ధి వలన అన్నిధాన్యములవృద్ధిని తెలిసికొనవలెను. నేరేడు వలన నువ్వులు, మినుములు, శిరీషముల వలన కంకిధాన్యములు, మధూకము వలన గోధుమలు, సప్తపర్ణ వృక్షములవలన యవధాన్యముల వృద్ధిని తెలిసికొనవలెను. వసంత లతలు కుందపుష్పములు ఫలములవృద్ధి వలన ప్రత్తి, వేగిస వృక్షము వలన ఆవధాన్యము, రేగి వృక్షముల వలన ఉలవలు, బిల్వవృక్షముల వలన పెసలవృద్ధిని తెలిసికొనవలెను.

వేతసవృక్షపు ఫల పుష్పములవృద్ధి వలన అవిసె గింజలు, పలాశపుష్పముల వలన కోద్రవము, తిలకము వలన శంఖము, ముత్యములు వెండి ఇంగుదీ వృక్షముల వలన శనగల వృద్ధిని తెలిసికొనవలెను. హస్తికర్ణ వృక్షపు ఫలపుష్పముల వృద్ధి వలన ఏనుగులు, అశ్వ కర్ణముల వలన గుర్రములు, పాటల వృక్షముల వలన ఆవులు, కదలీ (అరటి)వృక్షపు ఫలపుష్పముల వృద్ధి వలన మేకలు గొర్రెలు వృద్ధిని పొందును. చంపాపూల వృద్ధి వలన బంగారము, బంధు జీవము వలన పెసలు, కురవకము వలన వజ్రములు, నందికావర్తము వలన వైడూర్యమణుల వృద్ధి కలుగును.

సింధువారము వలన ముత్యములు, కుసుంభము వలన కేశరము, రక్తకమలము వలన రాజు, నీలకమలము వలన మంత్రివృద్ధిని తెలిసికొనవలెను. సువర్ణపుష్పము వలన వ్యాపారి, కమలము వలన బ్రాహ్మణుడు, కుముదము వలన పురోహితుడు, సౌగంధికము వలన సేనాపతి, అర్క (జిల్లేడు)ము వలన బంగారపువృద్ధిని తెలిసికొనవలెను. మామిడి వృక్షము వలన మనుష్యుల క్షామము, భల్లాతకము వలన భయము, పేల వలన ఆరోగ్యము, ఖదిర శమీవృక్షముల వలన దుర్భిక్షము, అర్జున వృక్షము వలన సుందరవృష్టిని గుర్తించవలెను.

పిచుమంద (నింబ) నాగకేసర పుష్పముల వృద్ధివలన చెరకు, కోవిదారము వలన అగ్ని, శ్యామలతవృద్ధి వలన వేశ్య, వ్యభిచారి, ఆదిస్త్రీల వృద్ధిని తెలిసికొనవలెను. వృక్షములు లతల ఆకులు గుబురుగా ఛిద్రరహితమై కనపడిన సమయములో సుందరవృష్టి కురియును. ఆఆకులు రూక్షమై (కఠినము)ఛిద్రములైన (చిరిగిన) స్వల్పవృష్టి కురియును.

ఇరవై తొమ్మిదవ కుసుమ లతాధ్యాయము సమాప్తము

30. సంధ్యా లక్షణాధ్యాయము

సగము అస్తమించిన సూర్యబింబము తర్వాత ఆకాశములో నక్షత్ర గణము బాగుగా కనపడని వరకు ఒకసంధ్య(సాయంసంధ్య) యగును.మరియు నక్షత్రములకు స్వల్పకాంతి కలిగిన తర్వాత సగముదయించిన సూర్యబింబము వరకు రెండవ సంధ్య (ఉదయసంధ్య) జరుగును. లక్షణముల ద్వార దీని ఫలితము ముందు తెలుపబడును. అరణ్యవాసులైన పశువులు, పక్షులు, వాయువు, రవిచంద్రులు, పరివేషము, ప్రతిసూర్యుడు, పరిఘ, మేఘరేఖ, వృక్షాకార మేఘము, ఇంద్రధనుస్సు, గంధర్వ నగరము, సూర్యరశ్మి, దండము, సూర్యకిరణములు, జలవాయువుల సంఘాతము దుమ్ము వీటన్నింటికి సంధ్యాకాలిక స్నేహము వర్ణము వలన ఫలమును తెలుపవలెను.

మాటిమాటికి భయంకర శబ్దము చేయు మృగము గ్రామముల నాశనమునకు కారణమగును. సేనకు దక్షిణభాగములో నుండి సూర్యాభిముఖమై భయంకర శబ్దములు చేసిన సేనలు నష్టమగును. సంధ్యాకాలములో సేనలకు వామభాగములో సూర్యాభిముఖమై మృగసమూహము లేక వాయువులున్న సంగ్రామము, దక్షిణదిశలో సూర్యాభిముఖము కాకుండ నున్నచో సేనల సమాగమము రెండు వైపుల నున్న వర్షము కలుగును.

సూర్యాభిముఖమైన మృగములు మరియు పక్షుల శబ్దములతో కూడిన ప్రాత:సంధ్య దేశమును నాశనము చేయును.సూర్యాభిముఖమై దక్షిణదిశలో నున్న మృగములు పక్షులశబ్దములతో కూడిన సంధ్య శత్రునగరములకు గ్రహణము కలిగించును. గృహము వృక్షము తోరణములు (గృహద్వారము) కంపితమవుతు ధూళి మృత్కండములతో కూడి ప్రబలము భయంకరము రూక్షము మరియు ఆకాశము నుండి పక్షులు క్రిందికి పడుతున్న సంధ్యా సమయపు గాలి అశుభఫలము నిచ్చినదగును.

మెల్లగా వీచు గాలితో కంపించిన ఆకులతో వృక్షము, వాయురహితము మధుర శబ్దములతో కూడిన పక్షులు మృగములతో కూడిన సంధ్యశుభమును కలిగించును. దండము, విద్యుత్తు, మత్స్యాకృతి కలిగిన మేఘము, ప్రతిసూర్యుడు, పరిఘ, ఇంద్రధనుస్సు, ఐరావతము(47 అ-20శ్లోకం) సూర్యకిరణములు ఇనవ్ని సంధ్యాకాలములో నిర్మలముగా నున్న వర్షము కురియును.

సంధ్యాకాలములో ఖండము, విషమము, వర్ణరహితము, వికృతము, కుటిలము, అప్రదక్షిణ క్రమములో పరివేష్టితము,సూక్ష్మము, అల్పము శక్తిరహితము మలినమైన సూర్యుడు కిరణములతో కనపడిన మనుష్యుల మధ్య పరస్పరము విరోధము, వృష్టిని కలిగించును. అంధకార రహితముగా పరివేష్టితమైన సూర్యకిరణములున్న భూమండలము కల్యాణకారి యగును.

సంపూర్ణముగా ఆకాశములో వ్యాపించిన, నిర్మలము అఖండితము, స్పష్టమైన

సూర్యకిరణములు శుభఫలముల నిచ్చును. కల్మాషము(పసుపు తెలుపు నలుపు వర్ణముల మిశ్రమము)కొంచెము పసుపు, పసుపు, విచిత్ర, మంజిష్ఠమువలె ఆకుపచ్చని వర్ణము, నలుపు తెలుపుల మిశ్రమ వర్ణముతో ఆకాశమండలమును వ్యాపించిన సూర్యకిరణములు కనిపించిన దానికి ఏడుదినముల తర్వాత వృష్టి, స్వల్పభయము కలుగును.

సూర్యకిరణములు తామ్రవర్ణముతో నున్న సేనాపతికి మృత్యువు, పీత రక్త వర్ణముతో నున్న సేనాపతికి కష్టము, ఆకుపచ్చరంగుతో నున్న పశువులు ధాన్యములకు నాశము, ధూమ్రవర్ణముతో నున్న ఆవులకు నాశము, మాంజిష్ఠ (రక్త)వర్ణముతో నున్న శస్త్రము,అగ్నితో భయము,పసుపుపచ్చని వర్ణము వాయువుతో కూడిన వర్ణముతో, భస్మ సమానమైన అనావృష్టి, తెలుపు నలుపు నీలము పసుపు వర్ణములమిశ్రమముగా నున్న అతితక్కువ వర్షము కురియును.

బంధూకపుష్పము కాటుకవలె నున్న ధూళి (దుమ్ము) సూర్యునివైపుకి వెళుతున్న ప్రజలు అనేకరోగములతో పీడింపబడును. తెల్లని వర్ణము కలిగిన ధూళి సూర్యునివైపుకి వెళుతున్న ప్రజలకు వృద్ధి శాంతి కలుగును. సూర్య కిరణములు మేఘము వాయువు ఈ మూడు కలిసి దండమువలె నున్న దానిని దండమని అందురు. ఆదండము కోణములలో నున్న రాజులకు దిశలలోనున్న నాలుగు వర్ణములకు అశుభమును కలిగించును.

ఒకవేళ దండము సూర్యోదయ, మధ్యాహ్న సూర్యాస్తమయ సమయములలో కనపడిన శస్త్రభయము, ఉపద్రవములు కలుగును. తెల్లని వర్ణము కలదైన బ్రాహ్మణులకు రక్తవర్ణము కలదైన క్షత్రియులకు, పసుపువర్ణము కలదైన వైశ్యులకు కృష్ణవర్ణము కలదైన శూద్రులకు నాశనము కలుగును. ఏదిశలో నున్న ఆదిశ నాశనమగును. సూర్యునివైపు దీని మూలభాగము వేరొకవైపు ముఖముండును.

పెరుగు సమానముగా అగ్రభాగము కలది, నీలవర్ణభాగముతో సూర్యుని ఆచ్ఛాదన చేయునది, ఆకాశమధ్యములో నున్నది, పీత (పసుపుపచ్చ)వర్ణముతో దట్టముగా మూలము వైపుకి ఆవరించిన మేఘ వృక్షము అధికవృష్టిని కురియును. శత్రువులను జయించుటకు విజయేచ్ఛ కలిగిన రాజు వెనుక కొంత దూరము వెళ్ళి మేఘ వృక్షము నష్టమైన ఆరాజుకు మరణము కలుగును. ఒకవేళ మేఘ వృక్షము చిన్నదైన యువరాజుకు మంత్రికి మరణము కలుగును.

నీలికమలము, వైడూర్యము కమము వంటి కాంతి కలిగివాయురహితమై సూర్యకిరణములతో ప్రకాశించు సంధ్యయున్న రోజున వర్షము కురియును. గంధర్వ నగరము,హిమము, ధూమము దుమ్ముతో కూడిన సంధ్య వర్షాకాలములో అనావృష్టి అన్యఋతువులో శస్త్రకోపము కలిగించును. శిశిరఋతువులో ఎరుపు వసంతఋతువులో పీతవర్ణము గ్రీష్మఋతువులో శ్వేతవర్ణము, వర్షఋతువులో చిత్రవర్ణము, శరదృతువులో

కమలమువలె,హేమంత ఋతువులో రక్తవర్ణముతో సంధ్య కనపడిన శుభము,వేరే విధముగా నున్న అశుభము కలుగును.

సంధ్యాకాలములో శస్త్రముతో కూడిన పురుషునివలె మేఘ ఖండము కనపడిన శత్రుభయము,సూర్యునితో ఆచ్ఛాదితమై శ్వేతవర్ణముతో గంధర్వనగరము కనపడిన పురమునకు లాభము, సూర్యునితో భేదించిన గంధర్వ నగరమున్న పురమునకు నాశము కలుగును.తెల్లని స్వచ్ఛమైన కిరణములతో వీరణ(చర్మవాద్యము)సమానకాంతితో శాంత దిశలో ఉత్పన్నమగు మేఘము సూర్యునికి దక్షిణభాగములో ఆచ్ఛాదనమైన వర్షము కురియును. సూర్యోదయములో ఉత్పన్నమగు మేఘరేఖ తెల్లని వర్ణముతోనున్న రాజుకు నాశము,రక్తవర్ణముతో నున్న సేనానాశము, సువర్ణకాంతితో నున్న సేనలకు వృద్ధి కలుగును.

సూర్యునికి రెండువైపుల పరిధి (ప్రతిసూర్యుడు) కనపడిన అధికవర్షము కురియును.పరిధి అన్నిదిశలకు వ్యాపించియున్న ఒక జలకణము కూడ కురవదు. అనావృష్టి కలుగును.సంధ్యాకాలములో ధ్వజము,ఛత్రము,పర్వతము, ఏనుగు, గుర్రము వలె రక్తవర్ణముతో మేఘము కనపడిన యుద్ధము జరుగును.పలాల(పొట్టు) పొగవలె నిర్మల శరీరము కలిగిన మేఘము రాజు సేనలకు వృద్ధినికలిగించును. రెండు సంధ్యలలో వ్రేలాడునట్లుగ వృక్షమువలె అతిలోహిత వర్ణముతో ప్రకాశించు పురమువలె మేఘము కనపడిన శుభము కలుగును.

సంధ్యాకాలములో సూర్యునికి ఎదురుగా నున్న పక్షి, శృగాలము (నక్క) మృగ శబ్దములతో దండము, దుమ్ము, పరిఘాదులతో లేక ప్రతిదినము వికారయుక్త సూర్యునితో నున్న సంధ్య దేశమును రాజును సుభిక్షమును నాశనము చేయును. పూర్వసంధ్య తన ఫలమును అదే సమయములో నిచ్చును. సాయంసంధ్య రాత్రి లేకమూడు దినములలో, పరివేషము,దుమ్ము,పరిఘ, అమోఘసూర్య కిరణాలు, ఇంద్రధనుస్సు, ప్రతి సూర్యుడు మేఘము, వాయువు, అదేసమయములో లేక ఏడు దినములో, పక్షులు అదే సమయములో లేక ఎనిమిది దినములలో మృగములు ఏడుదినములలో శుభాశుభ ఫలము నిచ్చును.

సంధ్య తనకాంతి ప్రకాశించు దూరము వరకు ఫలమునిచ్చును. మెరుపు ఆరు యోజనముల వరకు, మేఘ గర్జనము ఐదుయోజనముల వరకు ప్రకాశించును. అంతదూరము వరకు ఫలము నిచ్చును. కొందరి మతము ననుసరించి ఉల్కాపాతమైన ప్రదేశమునకే కాక అన్నిచోట్ల ఫలము నిచ్చును. ప్రతిసూర్యనామ పరిధి మూడు యోజనముల వరకు, పరిఘ ఐదు యోజనముల వరకు, పరివేష చక్రము ఐదు లేక ఆరు యోజనముల వరకు ఇంద్రధనుస్సు పది యోజనముల వరకు ప్రకాశము నిచ్చును. అంతదూరము వరకు ఇవన్ని ఫలితము నిచ్చును.

ముప్పదవ సంధ్యా లక్షణాధ్యాయము సమాప్తము

31. దిగ్దాహ లక్షణాధ్యాయము

దిగ్దాహము పీతవర్ణముతో నున్న రాజభయము, అగ్నివర్ణమైన దేశనాశనము, ఎడమవైపు లోహవర్ణమైన గాలి కనపడిన ధాన్యనాశము జరుగును. దిగ్దాహము అధిక కాంతితో ప్రకాశించును. సూర్యునివలె కనపడు ద్రవ్యముల ఛాయను కూడ ప్రకాశింప జేయును. రాజుకు అధికభయము కలుగును. అది రక్తవర్ణముతోనున్న శస్త్రభయము కలుగును.

పూర్వదిశలో దిగ్దాహము కనపడిన రాజుతోపాటు క్షత్రియులందరిని పీడించును. ఆగ్నేయ కోణములో కనపడిన శిల్పులకు కుమారులకు పీడకలుగును. దక్షిణదిశలో కనపడిన క్రూరమనుష్యులు, వేశ్యలు దూతలు పునర్భూస్త్రీలు (తిరిగి వివాహము చేసికొను స్త్రీలు) పీడితులగుదురు. నిర్మలమైన ఆకాశము నక్షత్రములు దక్షిణావర్తమై తిరుగుతు వాయు సువర్ణములవలె దిగ్దాహమున్న రాజుతోపాటు ప్రజలందరికి హితమును కలిగించును.

ముప్పది ఒకటవ దిగ్దాహాధ్యాయము సమాప్తము

32. భూకంప లక్షణాధ్యాయము

కాశ్యపాదుల మతముననుసరించి నీటిలో నున్న పెద్దప్రాణుల బలప్రయోగము వలన భూకంపము కలుగును. ఇతరుల మతముననుసరించి భూభారము వలన అలసిన దిగ్గజముల విశ్రాంతి వలన భూకంపము వచ్చును. కొందరి (వసిష్ఠాదులు) మతము ననుసరించి వాయువులు ఒకదాని కొకటి తగులుకొని పృథ్విపై పడుట వలన శబ్దముతో కూడి భూకంపము కలుగును. ఇతరుల మతానుసారము ప్రజల ధర్మాధర్మముల ననుసరించి భూకంపము కలుగును.

పూర్వకాలములో ఆకాశము నుండి పడుతు భూమిపై ఎగురుతున్న రెక్కలు కలిగిన పర్వతముల ద్వారా కంపితమైన భూమి దేవతల సభలో సిగ్గుతో పలికినది. ఓ భగవంతుడా! నీవు నాపేరును అచలమని పెట్టితివి. కాని చలించుచున్న, తిరుగుతున్న పర్వతముల ద్వారా నాపేరు చలాయమానమైనది. అందువలన ఈ దు:ఖమును సహించు టకు నేను సమర్థురాలను కాను. గద్గదవాణి కలిగినది అదురుతున్న అధరము కలిగినది, నమ్రము, అశ్రుయుతమైన నేత్రములు కలదైన భూదేవిని చూచి బ్రహ్మ పలికెను. ఓ ఇంద్రా! భూదేవి యొక్క కష్టమును తొలగించుటకు పర్వతముల రెక్కలను వజ్రముతో నరుకుము. ఇంద్రుడు బ్రహ్మ వచనములను స్వీకరించి భూదేవితో పలికెను. భయపడకుము కాని శుభాశుభ ఫలమును తెలిసికొనుటకు వాయువు అగ్ని ఇంద్ర వరుణులు పగలు రాత్రి క్రమములో ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్థభాగములలో నిన్ను కదిలించెదరు.

పగలు పూర్వార్ధములో వాయువు, ఉత్తరార్ధములో అగ్ని, రాత్రికి పూర్వార్ధములో ఇంద్రుడు, ఉర్తరార్ధములో వరుణుడు నిన్ను కంపింప జేయుదురు.

ఉత్తరఫల్గుణి, హస్త, చిత్త, స్వాతి, పునర్వసు, మృగశిర, అశ్విని – ఈ నక్షత్రములో వాయు మండలమునకు సంబంధించినవి. వీటిలో ఏదైన నక్షత్రములో భూకంపమైన దానికి ఏడు దినములకు పూర్వము ముందు తెలుపు లక్షణము కలుగును. దూళితో అన్ని దిశలు వ్యాపించును. భూమిపై దుమ్ము ఎగురుతు వృక్షములను పెకిలిస్తు గాలి వీచును. సూర్యకిరణములు మందమగును. వాయువ్య దిశలో భూకంపమైన ధాన్యము జలము ఔషధము లు నాశనము పొందును. వ్యాపారులకు వాపు దుమ్ము (శ్వాస ఆడకుండుట) ఉన్మాదము జ్వరము దగ్గులతో కూడిన పీడ కలుగును. వేశ్య శస్త్రజీవి వైద్యుడు స్త్రీ కవి గాయకుడు వ్యాపారి శిల్పులు సౌరాష్ట్రము కురు మగధ దశార్ణ మత్స్యదేశముల మనుష్యులు పీడితులగుదురు.

పుష్యమి కృత్తిక విశాఖ భరణి మఖ పూర్వాభాద్ర పుబ్బ – ఈ ఏడు నక్షత్రములు ఆగ్నేయ మండలమునకు సంబంధించినవి. వీటిలో ఏనక్షత్రములోనైన భూకంపము కలిగిన దీనికి ఏడు దినములకు ముందు తెల్పిన లక్షణములు కలుగును. ఏడు దినముల మధ్యలో దిగ్దాహము ఏడుతారలు ఉల్కలు పడుట వలన వెలుగుతు ఆకాశముండును. వాయు సహాయముతో అగ్నివ్యాపించును. ఆగ్నేయ భూకంపములో మేఘము జలాశయముల (వాపి కూప తటాకము) నాశము రాజుల మధ్య పరస్పర ద్వేషము, దాహము విచర్చిక జ్వరము, విస్ఫురిక (రోగ విశేషము) పాండురోగము కలుగును. తేజస్వి కోపముతో నున్న మనుష్యుడు అశ్మక అంగ బాహ్లీక తంగణ కలింగ వంగ ద్రవిడ శబర దేశముల జనులను అనేక విధములుగా బాధించును.

అభిజిత్తు, శ్రవణము ధనిష్ఠ రోహిణి జ్యేష్ఠ ఉత్తరాషాఢ అనూరాధ – ఈ ఏడు నక్షత్రములు ఇంద్రమండలము లోనివి. వీటిలో దేనిలోనైన భూకంపమైన ఏడు రోజుల ముందు ముందు తెలుపు లక్షణములు జరుగును. పర్వత సమానమైన శరీరము కలది గంభీర ధ్వని చేయునది మెరుపు కలిగినది మహిషశృంగము భ్రమరము సర్పముల కాంతి సమానమైన మేఘము వర్షము కురియును. ఇంద్ర కంపములో ప్రధాన కులములో ఉత్పన్నమగు మనుష్యుడు, యశోవంతుడు రాజుల గణములో ప్రధానుడు నాశనమగును. అతిసారము, కంఠరోగము, సుఖరోగము, కఫరోగము కలుగును. కాశి యుగంధర పౌరవ కిరాత కీర అభిసార హలమద్ర అర్బుద సురాష్ట్ర మాలవ దేశవాసులు పీడితులగుదురు. ప్రయోజనసారమైన వర్షము కురియును.

రేవతి పూర్వాషాఢ ఆర్ద్ర ఆశ్లేష మూల ఉత్తరాభాద్ర శతభిషం – ఈఏడు నక్షత్రములు వరుణమండలము లోనివి. ఈ నక్షత్రములలో భూకంపమైన దీనికి ఏడు

దినముల పూర్వము, ముందు తెలుపబడు లక్షణములు కలుగును. వరుణకంపముతో సముద్ర నదీ తటములలో నివసించు వారికినాశము కలుగును. అతివృష్టి, పరస్పరము ద్వేషము లేకుండ ఉన్న మనుష్యులు, గోనర్దము చేది కుకుర కిరాత వైదేహదేశములలో నివసించు మనుష్యులకు నాశనము కలుగును.

భూకంపఫలము ఆరు నెలలలో, నిర్ఘాత ఫలము రెండు నెలలలో కలుగును. గర్గాదిమునుల మతానుసారము అన్య (నిర్ఘాత ఉల్కాపాతాదులు) ఉత్పాతముల ఫలము మండలము వరకుండును. ఉల్క గంధర్వపురము దుమ్ము నిర్ఘాతము భూకంపము దిగ్దాహము భయంకర వాయువు సూర్యచంద్ర గ్రహణము వికారయుక్త నక్షత్రము తారాగణము మేఘరహిత వర్షము, వికారయుతవాయువుతో కూడిన వర్షము, అగ్నికీలలు వనములో నివసించు పశువులు ఊరిలోనికి రావటము, రాత్రిలో ఇంద్రధనుస్సు కనపడటము, సంధ్యలో వికారము, పరివేష ఖండము నదుల ప్రయాణములో వైపరీత్యము, ఆకాశములో తూర్యనాదము ప్రకృతిలో విరుద్ధలక్షణము కలుగుట వీటన్నిటి ఫలితములు వాటి మండలములననుసరించి తెలుపవలెను.

ఇంద్రమండలములో ఉత్పన్నమగు కంపము వాయవ్య కంపమును, వాయవ్య మండలములో ఉత్పన్నకంపము ఇంద్ర కంపమును, వరుణమండలములో ఉత్పన్న కంపము అగ్నికంపమును, అగ్నిమండలములో ఉత్పన్నకంపము వరుణ కంపమును, వేలజాత కంపము నక్షత్రకంపమును, నక్షత్రకంపమును వేలజాత కంపమును నాశము చేయును. వాయవ్య మండలాంతర్గత వాయవ్యకంపము తనఫలమునకు నష్టము కలిగించును. ఈ విధముగా మండలము యొక్క అన్య ఫలమును తెలిసికొనవలెను.

పకవేళ ఆగ్నేయ మండలము మరియు వాయవ్య వేలలో, వాయువ్య మండలము ఆగ్నేయవేలలో భూకంపము కలిగిన విఖ్యాత రాజులకు మరణము లేక మరణసమాన కష్టము కలుగును. మనుష్యగణము దుర్భిక్షము మృత్యువు అనావృష్టితో పీడితులగుదురు. వరుణ మండలము మరియు ఐంద్రవేలలో ఐంద్రవేల మరియు వరుణమండలములో భూకంపము కలిగిన లోకులకు సుభిక్షము కుశలము వర్షము మనశ్శాంతి కలుగును. గోవులు ఎక్కువగా పాలనిచ్చును. రాజులు పరస్పరము ద్వేషరహితులై యుందురు.

అంగస్ఫురణాది ఉపద్రవములలో ఎవరి ఫలకాలమును తెలుపలేదో అక్కడ వాయవ్యమండలమైన రెండు మాసములలో, ఆగ్నేయమండలమైన మూడు పక్షములలో, ఇంద్రమండలమైన ఏడు దినములలో, వరుణమండలమైన అదే రోజున ఫలము కలుగును. వాయు మండలములో భూకంపమైన రెండు వందల యోజనముల వరకు, అగ్నిమండలములో నైన పదియోజనముల వరకు, వరుణమండలములోనైన ఒకవంద ఎనభై యోజనముల వరకు, ఐంద్రమండలములో భూకంపమైన అరవైకన్న అధిక

యోజనముల వరకు భూమి కంపించును. భూకంపము జరిగిన తర్వాత మూడవ, నాల్గవ, ఏడవ, ముప్పదవ, పదిహేనవ, నలభై ఐదవ దినములలో మరల భూకంపమైన ప్రధానమైన రాజుకు నాశనము కలుగును.

ముప్పది రెండవ భూకంప లక్షణాధ్యాయము సమాప్తము

33. ఉల్కా లక్షణాధ్యాయము

స్వర్గములో శుభఫలములననుభవించిన ప్రాణుల స్వరూపమే ఉల్క. ధిష్ణ్య ఉల్క అశని, విద్యుత్తు (మెరుపు) తార – ఇవి ఐదు ఉల్కభేదములు. ఉల్క పదిహేను రోజులలో దిష్ణ్య పదిహేనురోజులలో, అశని మూడు పక్షములలో (45రోజులు) మెరుపు ఆరు దినములలో, తార ఆరుదినములలో ఫలము నిచ్చును. తార చతుర్థాంశ ఫలమును, దిష్ణ్య సగమును, విద్యుత్తు ఉల్క అశని సంపూర్ణ ఫలమునిచ్చును.

అశని అధికశబ్దము చేయుచు భూమిని విదారణ(భేదించుట) చేయుచు చక్రము వలె తిరుగుతు మనుష్యుడు ఏనుగు గుఱ్ఱము మృగము రాయి గృహము వృక్షము పశువులపై పడును. విద్యుత్తు ప్రాణులకు భయమును కలిగిస్తు మాటమాటికి శబ్దము చేస్తు కుటిలము విస్తృతమైన శరీరముతో ప్రాణులు కాష్ఠరాశులపై అధిక ప్రకాశముతో చాలా తొందరగాపడును. దిష్ణ్య సన్నగా తోకతో, ప్రజ్వలించుచున్న అగ్నివలె, రెండు హస్తముల పొడుగు పది ధనువుల ప్రమాణము కలిగిన ప్రదేశము మధ్యలో ఎక్కువగా కనపడును.

తార ఒకహస్తము పొడవుతో శ్వేత తామ్ర కమల సూత్ర సమానముగా ఆకాశములో కనపడుతు వంకరగా క్రిందికి పైకి వెళ్ళును. ఉల్క విశాలమైన శిరస్సుతో పురుష ప్రమాణముతో క్రిందికి పడును. దీనికి అనేక భేదములున్నవి. ఇది ప్రేతము, శస్త్రము,గాడిద, ఒంటె,నక్కపంది,నాగలి,మృగము (ఉడుము) సర్పము,ధూళి సమానముగా రెండు శిరస్సులతో కనపడును. ఇవన్ని పాపఫలముల నిచ్చును.

ధ్వజము, మత్స్యము,ఎనుగు, పర్వతము, కమలము,చంద్రుడు గుఱ్ఱము మండుతున్న ధూళి హంస శ్రీవృక్షము(కొబ్బరి)వజ్రము, శంఖము, స్వస్తిక (రాజచిహ్నము) రూపములతో ఉల్కకనపడిన లోకులకు సుభిక్షము కుశలము కలుగును. ఆకాశ మధ్యములో అనేక విధములుగా క్రిందికి పడుతు ఉల్క రాజు రాష్ట్రములను నాశనము చేయును. ఆకాశములో ఉల్క మాటిమాటికి తిరుగుతున్న ప్రజలకు విపత్తు కలుగును.

సూర్యచంద్రులను స్పర్శిస్తు చంద్రుని నుండి బయటికి వచ్చి భూకంపమును కలిగిస్తు క్రిందికి పడిన ఉల్క వేరే రాజు ఆగమనము,రాజభయము, దుర్భిక్షము అనావృష్టిని కలిగించును. సూర్యచంద్రుల చుట్టు ప్రదక్షిణ క్రమములలో తిరుగుతున్న క్రమముగా పురములో నుండు వారికి బయట ఉన్నవారికి నాశనమును కలిగించును. సూర్యుని

చుట్టు ప్రదక్షిణము చేసిన పురవాసులకు, చంద్రుని చుట్టు ప్రదక్షిణము చేసిన బయటనున్న వారికి నాశనము కలుగును సూర్యకిరణము నుండి బయటపడి ప్రయాణించువారికి ముందుపడిన ఉల్క శుభఫలమును కలిగించును.

తెలుపు ఎరుపు పసుపు నలుపు వర్ణపు ఉల్క క్రమముగా బ్రాహ్మణాది వర్ణములకు నాశనము కలిగించును. తెల్లని ఉల్క బ్రాహ్మణులకు, ఎర్రని ఉల్క క్షత్రియులకు, పసుపురంగు ఉల్క వైశ్యులకు, నలుపురంగు ఉల్క శూద్రులకు నాశనము కలిగించును. శిరస్సుతో నిలబడిన బ్రాహ్మణులకు ఛాతితో నిలబడిన క్షత్రియులకు, ప్రక్కభాగమున నిలబడిన వైశ్యులకు, తోకతో నిలబడిన శూద్రులకు నాశనము కలుగును.

శ్యావ(కపివర్ణము) రక్త నీల రుధిర సమానము, అగ్ని సమానము, నలుపు, బూడిద రంగులతో రూక్షముగా,సంధ్యాకాలములో పగటిసమయములో ఉత్పన్నమగు వక్రము ఖండితమైన ఉల్క పురవాసులకు శత్రువుల వలన భయము కలిగించును. నక్షత్రములకు గ్రహములకు ఉపఘాతము (కొట్టుట) చేసిన ఆ నక్షత్రములను లేక గ్రహనక్షత్రములను నాశనము చేయును. సూర్యచంద్రుల ఉదయాస్తమయ సమయము లలో హననము (కొట్టుట)చేసిన క్రమముగా పురవాసులకు బయట నివసించు వారికి నాశనము కలుగును.

పుబ్బ పునర్వసు ధనిష్ఠ మూలనక్షత్రముల యోగమున్న తార ఉల్కతో హతమైన (కొట్టబడిన) యువతులకు పీడ కలుగును. పుష్యమి స్వాతి శ్రవణ నక్షత్రయోగములున్న తార ఉల్కతో హతమైన బ్రాహ్మణ క్షత్రియులకు పీడ కలుగును. ఉత్తర,ఉత్తరాషాఢ,ఉత్తరాభాద్ర,రోహిణి, మృగశిర, చిత్త, అనూరాధ, రేవతి నక్షత్రములతో యోగమున్న తార ఉల్కతో హతమైన రాజులకు పీడకలుగును. పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్రపద, భరణి, మఘ,ఆర్ద్ర,ఆశ్లేష,జ్యేష్ఠ,మూల నక్షత్రముల యోగమున్న తార,ఉల్కతో హతమైన దొంగల భయము కలుగును. అశ్విని, హస్త, అభిజిత్తు, కృత్తిక, విశాఖ నక్షత్రముల యోగమున్నతార ఉల్కతో హతమైన కళాకారులకు పీడ కలుగును.

ఉల్క దేవతామూర్తిపై పడిన రాష్ట్రమునకు భయము, ఇంద్రునిపై పడిన రాజులకు భయము, ఇంటిపై పడిన గృహయజమానికి పీడ కలుగును. దిక్పతి గ్రహము ఉల్కతో పీడితమైన ఆదిశలోనుండు మనుష్యులకు,వ్యవసాయభూములపై పడిన వ్యవసాయదారు లకు,చిన్నమందిరము దగ్గరున్న వృక్షముపై పడిన పూజనీయ వ్యక్తులకు పీడకలుగును. పూర్వద్వారము పై పడిన పురమునకు, ద్వారముపై పడిన పురవాసులకు, బ్రహ్మమందిరముపై పడిన బ్రాహ్మణులకు, గోశాలపై పడిన గోవులకు గోపాలురకు నాశనము కలుగును.

ఉల్కాపాత సమయములో వీరుల గర్జనము, ఆస్ఫోటితము(ఛాతీపై ఒక భుజముంచి రెండవ హస్తముతో చేయుశబ్దము) వాద్య గానముల శబ్దము రాజులకు

దేశమునకు భయము కలిగించును. ఉల్క ఆకాశములో ఎక్కువ సమయము వరకున్న, దండాకారముగా కనపడిన, ఆకాశములో వంకరగా బంధించిన దానివలె నున్న, ఇంద్రధనుస్సు వలె కనపడిన రాజుకు భయము కలుగును.

విపరీత (ఎక్కడ నుండి వచ్చినదో అక్కడకు) దిశలో వెళ్లు ఉల్క వ్యాపారులను, వంకరగా చలించు ఉల్క రాజులను, క్రిందివైపు ముఖము కలిగిన రాజులను, వంకరగా చలించు ఉల్క బ్రాహ్మణులను నాశనము చేయును. ఉల్క నెమలి ఫించము వలె నున్న లోకులకు నాశనము కలిగించును.సర్పము వలె చలించిన స్త్రీలకు అశుభఫలము నిచ్చును.మండలాకృతిగ నున్న ఉల్క నగరమును, ఛత్రాకృతి (గొడుగు ఆకారము) కలిగిన పురోహితులను నాశనము చేయును. వెదురు కర్రవలె కనపడు ఉల్క దేశమునకు భయమును కలిగించును.సర్పము,పంది అగ్నికీల మాలను ధరించిన దానివలె శబ్దముతో కూడిన ఉల్క పాపఫలము నిచ్చును.

ఇంద్రధనుస్సు వలె ఆకాశము ఉత్పన్నమై వెంటనే విలీనమైన ఉల్క మేఘములను నాశనము చేయును. వాయువు వలె వంకరగా చలిస్తు క్రింది వైపుకి నడచు ఉల్క శుభము నీయదు. ఏదిశ నుండి వచ్చిన ఉల్క పురము సేనలపై పడునో ఆదిశలో నున్న రాజుకు భయము కలుగును. ఉల్క ప్రకాశిస్తు క్రిందికి పడుతున్న ప్రయాణము చేయు రాజు వెంటనే నాశనము పొందును.

ముప్పదిమూడవ ఉల్కా లక్షణాధ్యాయము సమాప్తము

34. పరివేష లక్షణాధ్యాయము

వాయువు ద్వారా ఆక్రమింపబడిన సూర్య చంద్రులు మేఘములతో కూడిన ఆకాశములో అనేక వర్ణములలో కనిపించిన దానిని పరివేషమందురు. ఈ పరివేషము ఇంద్ర,యమ,వరుణ,నిరృతి,వాయు,శివ,బ్రహ్మ,అగ్నికృతమై (చేయబడినదై) క్రమముగా రక్త నీల అల్పశ్వేత(కొంచెము తెలుపు) కపోత(పావురము) మేఘ, శ్వేత కృష్ణ హరిత(ఆకుపచ్చ) శ్వేతవర్ణములతో నుండును.

కుబేరుడు మేచక(మయూరనీలము) వర్ణపు పరివేషమును కలుగజేయును. ఇతరుల మిశ్రిత వర్ణముతో పరివేషము కలుగజేయును. పరివేషము తగు విధముగా ఉత్పన్నమై నష్టమైన అది వాయుకృతమై స్వల్పఫలము నిచ్చినదగును. నీలకంఠము, మయూరము, వెండి, నూనె, పాలు, జలముతో సమానమైన కాంతి కలిగిన పరివేషము క్రమముగా శిశిరాది ఋతువులలో ఉత్పన్నమగును. శిశిర ఋతువులో నీలకంఠమువలె, వసంత ఋతువులో మయూర కాంతివలె, గ్రీష్మఋతువులో వెండికాంతితో, వర్షఋతువులో నూనె వలె, శర దృతువులో పాలవలె, హేమంత ఋతువులో నీటివలె కాంతి కలిగి మండలాకారముగా నిర్మలముగా నున్న ప్రజలకు కుశలము సుభిక్షము కలుగజేయును.

సంపూర్ణ ఆకాశములో ప్రయాణించునది అనేక వర్ణములు రక్తవర్ణము కలది, రూక్షము, అఖండితము, బండి, ధనుస్సు త్రిభుజాకారము కలగినదైన పరివేషము అశుభ ఫలము నిచ్చును. మయూరకంఠము వలె నీలవర్ణము కలిగిన పరివేషము అతివృష్టిని, అనేక వర్ణముల కలిగిన పరివేషము రాజులకు నాశము, ధూమ్రవర్ణ పరివేషము భయము, ఇంద్రధనుస్సు, అశోక పుష్పమువలె నున్న లోహితకాంతి కలిగిన పరివేషము యుద్ధమును కలిగించును.

ఒకే వర్ణము అధికనిర్మలము క్షురా (మంగలికత్తి)కృతి కలిగిన మేఘములతో వ్యాపించిన పరివేషము తన ఋతువులో కనిపించిన వెంటనే వర్షము కురియును. పీతవర్ణ పరివేషమై సూర్యకిరణములు తీక్ష్ణములైన వెంటనే వర్షము కురియును. సూర్యుని వైపుకి ముఖము పెట్టిన మృగములు పక్షులు శబ్దములు చేయుచున్నపుడు రూక్ష (కరుకుదనము)మై మూడు సంధ్యలలో ఉత్పన్నమై అతి విస్తృతముగా పరివేషము కనపడిన భయమును కలిగించును.

ప్రతిరోజు పగలు సూర్యుని, రాత్రి చంద్రుని రక్తవర్ణముతో పరివేషము కనపడిన రాజుకు నాశము కలుగును. ఉదయాస్తమయ కాలములలో సూర్యచంద్రుల పరివేషము కనబడిన రాజుకు నాశము కలుగును. రెండు మండలముల పరివేషము సేనాపతికి భయము కలిగించును.కాని అధికశస్త్ర భయము కలిగించదు.తృతీయాది (మూడు నాలుగు ఐదు) మండలములు కలిగిన పరివేషము శస్త్రకోపము, యువరాజుకు భయము శత్రువుల వలన నగరమునకు అవరోధము కలిగించును.

కుజాది గ్రహములు చంద్రుడు ఏదైన ఒక నక్షత్రము – ఈమూడు పరివేషములో నున్న మూడు రోజులలో వర్షము ఒకనెలలో యుద్ధము జరుగును. రాజుకు జన్మలగ్నేశుడు జన్మ నక్షత్రము పరివేషములో నున్న అశుభఫలము నిచ్చును.పరివేష మండలములో శనియున్న చిన్నధాన్యములకు నాశము, గాలివాన, వృక్షములకు హాని, రైతులకు నాశము కలుగును. కుజగ్రహమున్న కుమారుడు, సేనాపతి సైన్యములకు వ్యాకులత, అగ్నిభయము, శస్త్రభయము కలుగును. గురుడున్న పురోహితులు, మంత్రులు రాజులకు పీడ కలుగును. బుధుడున్న మంత్రులు వృక్షాదులు లేఖకులకు వృద్ధి, సుందరవృష్టి కురియును.శుక్రుడున్న గమనముచేయు క్షత్రియులకు, రాణులకు పీడ,దుర్భిక్షము కలుగును. కేతువున్న దుర్భిక్షము, అగ్ని,మరణము,రాజు మరియు శస్త్రములవలన భయము కలుగును.పరివేష మండలములో రాహువున్న గర్భభయము వ్యాధి రాజభయము కలుగును.

రవి లేక చంద్ర పరివేషములో భౌమాది రెండు గ్రహములున్న యుద్ధము, మూడున్న దుర్భిక్షము, అనావృష్టి, నాలుగున్న మంత్రులు పురోహితులతో పాటు రాజుకు మృత్యువు, ఐదు గ్రహములున్న జగత్తులో ప్రళయము కలుగును. కేతు ఉదయము

కాకున్న కుజాది గ్రహములు నక్షత్రములు వేరువేరుగ పరివేషములో నున్న రాజుకు పీడ కలుగును.

పాడ్యమి మొదలుకొని నాలుగు తిథులలో పరివేషము కనపడిన బ్రాహ్మణాది నాలుగు వర్ణములకు నాశము కలుగును. అనగా పాడ్యమిలో పరివేషము కనపడిన బ్రాహ్మణులకు, తదియలో కనపడిన క్షత్రియులకు,విదియలో కనపడిన వైశ్యులకు, చవితిలో కనపడిన శూద్రులకు, నాశము కలుగును. పంచమిలో పరివేషము కనపడిన శ్రేణులకు (సమాన జాతుల సమూహము) షష్ఠిలో కనపడిన నగరమునకు, సప్తమిలో కనపడిన కోశము (ధనాగారము)నకు, అష్టమిలో కనపడిన యువరాజుకు, నవమి దశమి ఏకాదశు లలో కనపడిన రాజుకు అశుభము కలుగును. ద్వాదశిలో నగరమునకు అవరోధము, త్రయోదశిలో సేనలకు కష్టము కలుగును. చతుర్దశిలో పరివేషము కనపడిన రాజులకు పూర్ణిమలో కనపడిన రాజుకు నాశనము కలుగును.

పరివేషములో లోపల రేఖ కనపడిన నగరవాసులకు, బయట కనపడిన గమనము చేయువారికి, విజయేచ్ఛ కలిగిన రాజులకు, పరివేష మధ్యములో రేఖ కనపడిన యుద్ధము నందలి సేనలకు వస్తువులకు శుభాశుభమును కలిగించును. ఎరుపు నలుపు రూక్ష వర్ణము పరివేషములో కనపడు భాగమున పరాజయము కలుగును. పరివేషము లోపల ఎరుపు నలుపు రూక్షవర్ణము కనపడిన నగరవాసులకు, బయట కనపడిన గమనము చేయువారు విజయేచ్ఛ కలిగిన రాజులకు, మధ్యలో కనపడిన సేనలకు పరాజయము కలుగును. నిర్మలముగా తెల్లగా కాంతియుక్తముగ నున్న భాగమునకు విజయము కలుగును.

ముప్పదినాల్గవ పరివేష లక్షణాధ్యాయము సమాప్తము

35. ఇంద్రాయుధ లక్షణాధ్యాయము

మేఘ సంపన్నమైన ఆకాశములో వాయువుతో కలిసిన సూర్యకిరణములు వివిధ రకముల వర్ణములతో కూడి ధనుస్సు ఆకృతిలో కనపడును. దానినే **ఇంద్రధనుస్సు** అని యందురు. కొందరి మతముననుసరించి నాగరాజ కులములో ఉత్పన్నమైన సర్పముల నిశ్వాసముతో ఇంద్రధనుస్సు ఉత్పన్నమగునని తెల్పెదరు. దీనికి ఎదురుగా వెళ్ళిన రాజులకు పరాజయము కలుగును.

అఖండము, భూమితో కూడియున్నది, ఉజ్జ్వలము, స్నిగ్ధము (కాంతితో కూడినది) అవికలము, నానావర్ణయుక్తము, రెండుసార్లు పుట్టినది, లేక పశ్చిమదిశలో కనపడిన ఇంద్రధనుస్సు శుభఫలమును అధికవర్షమును కలిగించును. విదిక్కులలో (ఈశాన్య ఆగ్నేయ నైరృతి వాయువ్యములు) ఇంద్రధనుస్సు కనపడిన ఆదిశలో నున్న స్వామికి

నాశనము కలుగును. కొంచెము ఎరుపు పసుపుపచ్చని, నీలపురంగుతో ఇంద్రధనుస్సు కనపడిన క్రమముగా శస్త్రదోషము, అగ్నిదోషము, దుర్భిక్షము కలుగును.

నీటిలో ఇంద్రధనుస్సు కనపడిన అనావృష్టి, భూమిపై కనపడిన ధాన్యనాశము, వృక్షముపై కనపడిన వ్యాధి,పుట్టపై కనపడిన శస్త్రభయము రాత్రిలో కనపడిన మంత్రి మరణము కలుగును. అనావృష్టి సమయములో పూర్వదిశలో ఇంద్రధనుస్సు కనపడిన వర్షము,వర్షసమయములో కనపడిన అనావృష్టి కలుగును.పశ్చిమదిశలో నున్న ఇంద్రధనుస్సు ఎల్లప్పుడు వర్షమును కురిపించును.

రాత్రిసమయములో పూర్వదిశలో ఇంద్రధనుస్సు కనపడిన రాజు పీడితుడగును. దక్షిణ దిశలో కనపడిన సేనాపతి, పశ్చిమదిశలో కనపడిన ప్రధాన పురుషుడు, ఉత్తర దిశలో కనపడిన మంత్రికి నాశనము కలుగును. రాత్రి సమయములో శ్వేతాది (తెలుపు ఎరుపు పసుపు నలుపు) వర్ణములతో ఇంద్రధనుస్సు కనపడిన బ్రాహ్మణాది వర్ణములకు నాశనము కలుగును.శ్వేతవర్ణమైన బ్రాహ్మణులకు రక్తవర్ణముతో కనపడిన క్షత్రియులకు, పీతవర్ణముతో కనపడిన వైశ్యులకు, కృష్ణవర్ణముతో కనపడిన శూద్రులకు నాశనము కలుగును. ఏదిశలో ఇంద్రధనుస్సు కనపడునో ఆదిశలో నున్న రాజు వెంటనే నాశనము పొందును.

ముప్పదిఐదవ ఇంద్రాయుధ లక్షణాధ్యాయము సమాప్తము

36. గంధర్వ నగర లక్షణాధ్యాయము

ఉత్తరాది దిశలలో గంధర్వనగరము కనపడిన పురోహిత, రాజ సేనాపతి, యువరాజుకు దోషము కలుగును. ఉత్తరదిశలో కనపడిన పురోహితులకు పూర్వదిశలో రాజులకు, దక్షిణదిశలో సేనాపతులకు, పశ్చిమదిశలో యువరాజులకు దోషము కలుగును.శ్వేతవర్ణమైన బ్రాహ్మణులకు, రక్తవర్ణమైన క్షత్రియులకు,పీతవర్ణమైన వైశ్యులకు, కృష్ణవర్ణమైన శూద్రులకు నాశనము కలుగును. ఉత్తరదిశలో గంధర్వ నగరమున్న రాజులకు విజయము కలుగును.విదిక్కులలోనున్న సంకరజాతి జనులకు నాశనము కలుగును. శాంతదిశలో తారలతో కూడి కనపడిన రాజునకు విజయము కలుగును.

ప్రతిదినము ఏల్లప్పుడు గంధర్వనగరము కనపడిన రాజుకు, దేశమునకు భయము కలిగించును. ధూమము,అగ్ని,ఇంద్రధనుస్సు వలె కాంతితో కనపడిన దొంగలకు వనవాసులకు నాశనము కలుగును. పాండు (తెల్లని) వర్ణముతో గంధర్వనగరము కనపడిన మెరుపులతో పాటు గాలివీచును. దీప్తదిశలో (86 అధ్యాయము 12శ్లోకం)నున్న ఆ దిశలో నుండు రాజుకు మరణము కలుగును. వామభాగములో శత్రుభయమును,దక్షిణ దిశలో జయమును కలిగించును. ఆకాశములో అనేకవర్ణములతో పతాకము ధ్వజము లేక పురద్వారము వలె గంధర్వనగరము కనపడిన యుద్ధములో ఏనుగులు, మనుష్యులు గుర్రముల రక్తమును భూమి అధికముగా త్రాగును.

ముప్పదిఆరవ గంధర్వ నగరాధ్యాయము సమాప్తము

37. ప్రతిసూర్య లక్షణాధ్యాయము

సూర్యుని ఋతువర్ణ సమానమైన వర్ణముతో ప్రతిసూర్యుడుండును. నిర్మలమై వైడూర్యమణి వలె స్వచ్ఛముగా తెల్లగా నున్న క్షేమము, సుభిక్షము కలుగును. పీతవర్ణము గానున్న ప్రతిసూర్యుడు వ్యాధిని కలిగించును. అశోక పుష్పమువలె లోహిత (ఎరుపు) వర్ణముతో నున్న శస్త్రకోపమును కలిగించును. ప్రతిసూర్యులమాల కనపడిన దొంగల భయము, ఉపద్రవము రాజుకు నాశనము కలుగును. సూర్య మండలమునకు ఉత్తర దిశలో ప్రతిసూర్యుడు కనపడిన వర్షము కురియును. దక్షిణదిశలో కనపడిన గాలివీచును. రెండువైపుల కనపడిన రాజుకు, క్రిందివైపుకి కనపడిన ప్రజలకు నాశనము కలుగును.

ముప్పది ఏడవ ప్రతిసూర్యలక్షణాధ్యాయము సమాప్తము

38. రజో లక్షణాధ్యాయము

దట్టమైన అంధకారము వలె ధూళితో పర్వతము, పురము, వృక్షములు, అన్నిదిశలు వ్యాపించి కొంచెము కూడ కనపడకున్న రాజుకు నాశనము కలుగునని చెప్పవలెను. ఏదిశలో దుమ్ము వ్యాపించునో, ఏదిశలో నాశనమగునో ఆరెండు దిశలలో ఏడురోజుల లోపల నిస్సందేహముగా భయము కలుగును. దట్టమైన దుమ్ము తెల్లగానున్న మంత్రికి దేశమునకు పీడ వెంటనే శస్త్రము వలన కష్టము, అతికఠినముగా కార్యసిద్ధి జరుగును.

సూర్యాస్తమయములో ఉత్పన్నమైన దుమ్ము ఒకటి రెండు దినములు ఆకాశములో వ్యాపించి యున్న ఉగ్రభయము కలుగును. ఒకేచోట స్థిరముగా నున్న దుమ్ము ఒకరాత్రి వరకున్న ప్రధాన రాజుకు మృత్యువు, మిగిలిన బుద్ధిమంతులైన రాజులకు శుభము కలుగును. ఏదేశములో రాత్రులందు దట్టమైన ధూళి ఎగురునో ఆదేశములో తప్పక ఇతర రాజు యొక్క ఆగమనము కలుగునని తెలుపవలెను.

మూడు లేక నాలుగు రోజులు ఆగకుండ దుమ్ము పడుతున్న అన్ని రసములకు వినాశము కలుగును. ఐదుదినముల వరకు దుమ్ము పడిన రాజులు సేనాపతులకు కష్టము కలుగును. కేతువు మున్నగువాటి ఉదయము తర్వాత ధూళిపడిన అధిక భయము కలుగును. ఆచార్యుల మతమునననుసరించి శిశిరఋతువులో కాక మిగిలిన ఋతువులలో ఫలితము తప్పక కలుగును.

ముప్పది ఎనిమిదవ రజో లక్షణాధ్యాయము సమాప్తము

39. నిర్ఘాత లక్షణాధ్యాయము

గాలితో గాలి కొట్టుకొని భూమిపై పడినపుడు కలుగు శబ్దమును నిర్ఘాతమందురు. అది సూర్యాభిముఖముగా నుండి పక్షుల శబ్దముతో కూడియున్న చెడుఫలము నిచ్చును.

సూర్యోదయ కాలములో నిర్ఘాతమైన అధికరణిక,(ఎక్కువగా యుద్ధములో ఉన్న వారు) రాజు,ధని, శూద్రుడు, స్త్రీ, వ్యాపారి,వేశ్యలు నాశనమగును. పగలు మొదటి ప్రహరలో నిర్ఘాతమైన మేకలు గొర్రెల కాపరులు శూద్రులు పురవాసులు నాశనమగుదురు. ద్వితీయ ప్రహరలోనైన రాజసేవకులు బ్రాహ్మణులు పీడను పొందును.తృతీయ ప్రహరలోనైన వ్యాపారి మేఘములకు నాశనము కలుగును. చతుర్ధ ప్రహరలోనైన దొంగలు పీడితుల గుదురు. రాత్రి ప్రథమప్రహరలోనైన ధాన్యములకు, ద్వితీయ ప్రహరలోనైన పిశాచ సమూహములకు నాశనము కలుగును. తృతీయప్రహరలోనైన ఏనుగు గుర్రములకు నాశనము కలుగును.చతుర్ధప్రహరలో నిర్ఘాతమైన ప్రమాణము చేయువారు నాశనమగుదురు.ఏదిశలో భగ్నమైన కుండవలె భయంకరమైన శబ్దము కలుగునో ఆదిశలో నాశనము జరుగును.

ముప్పది తొమ్మిదవ నిర్ఘాతలక్షణాధ్యాయము సమాప్తము

40. సస్య జాత కాధ్యాయము

వృశ్చిక, వృషభరాశులలో సూర్యుడు ప్రవేశించిన సమయము గ్రీష్మ మరియు శరదృతువులలో ఉత్పన్నమగు ధాన్యముల శుభాశుభఫలితములు బాదరాయణుడు ఈ క్రింది విధముగా తెల్పెను.

సూర్యుడు వృశ్చికరాశిలో ప్రవేశించినసమయములో సూర్యుని నుండి కేంద్ర స్థానములలో (వృశ్చిక,కుంభ,వృషభ,సింహ)శుభగ్రహములున్న, లేక ఇతరస్థానములలో నున్న శుభగ్రహములతో వృశ్చికములోనున్న సూర్యుడు కనపడిన గ్రీష్మఋతువులో ధాన్యముల వృద్ధి కలుగును.

సూర్యుడు వృశ్చికరాశిలో నున్నపుడు కుంభరాశిలో గురుడు సింహరాశిలో చంద్రుడు లేక సింహరాశిలో గురుడు, మరియు కుంభరాశిలో చంద్రుడున్నపుడు గ్రీష్మ ఋతువులో ఉత్పత్తియగు ధాన్యములకు వృద్ధి కలుగును.సూర్యుడు రెండవ లేక పన్నెండవ స్థానములో శుక్రుడు లేక బుధుడు లేక ఇద్దరు ఒకేరాశిలో నున్న గ్రీష్మఋతువులో ధాన్యములకు వృద్ధి కలుగును.పూర్వోక్త యోగములలో బృహస్పతి దృష్టి యున్న గ్రీష్మఋతువులో ఉత్పత్తియగు ధాన్యములకు వృద్ధికలుగును.

రెండు శుభగ్రహముల మధ్యలో వృశ్చికరాశిలో సూర్యుడున్న మరియు సూర్యునికి సప్తమరాశిలో గురు చంద్రులున్న ధాన్యములకు వృద్ధి కలుగును. వృశ్చికరాశికి మొదటి

భాగములో సూర్యుడు,దానికి ద్వితీయములో సూర్యుడున్న ధాన్యములకు సగము వృద్ధి కలుగును. వృశ్చికరాశిలోనున్న సూర్యునికి ఏకాదశములో శుక్రుడు, చతుర్థములో చంద్రుడు, ద్వితీయములో బుధగ్రహములున్న ధాన్యములకు వృద్ధి కలుగును.పూర్వోక్త యోగములో దశమములో గురువున్న గోవులు పాలనధికముగా నిచ్చును.

కుంభరాశిలో గురువు,వృషభరాశిలో చంద్రుడు, వృశ్చికరాశిలో సూర్యుడు మకరములో కుజ శనులున్న ధాన్యములకు వృద్ధి కలుగును.కాని తర్వాత శత్రుసైన్య గమనము, రోగభయము కలుగును.

వృశ్చికరాశిలో సూర్యుడు పాపగ్రహములతో కూడియున్న ధాన్యములకు నాశము కలుగును సప్తమరాశిలో పాపగ్రహమున్న ధాన్యముల ఉత్పత్తికి నాశము కలుగును. వృశ్చికరాశిలోనున్న సూర్యుని నుండి ద్వితీయస్థానములో పాపగ్రహములుండి శుభ గ్రహముల దృష్టి లేనపుడు మొదట నాటిన ధాన్యములకు నాశము కలుగును.తరువాత నాటిన ధాన్యములు బాగుగాపండును.వృశ్చికములోనున్న సూర్యుని నుండి సప్తమ (వృషభ) రాశిలో సప్తమము కాక వేరే కేంద్రములలో లగ్న చతుర్థ దశమభావములలో ఒక్కొక్క పాపగ్రహ(కుజ శనుల)మున్న ధాన్యములకు హానికలుగును.రెండు పాపగ్రహములు శుభగ్రహములచే చూడబడిన కొన్ని ప్రదేశములందు ధాన్యములకు నాశము కలుగును.

వృశ్చికములో సూర్యుడున్నపుడు సప్తమ షష్ఠస్థానములలో పాపగ్రహములు కుజ శనులున్న ధాన్యములకు వృద్ధి కలుగును.కాని ధాన్యముల ధరలు పెరుగును.పూర్వస్థితి వలెనే వృషభరాశిలో సూర్యుడున్నపుడు శరత్కాల ధాన్యములకు నాశము,లేక అభివృద్ధిని పండితులు తెలిసికొనవలెను.

మేషాది (మేష వృషభ మిథున)మూడురాశులలో గమనము చేయుచున్న సూర్యుడు శుభగ్రహములతో కూడియున్న గ్రీష్మఋతువులో పండు ధాన్యముల ధరలు తక్కువగును. లోక పరలోకములు రెండింటికి ఉపయోగమగును.అనగా ధరలు తగ్గుట వలన బంధు వర్గములతో కూడి అధికముగా నుపయోగించుట వలన లోకులకు, దానాది ధర్మ కార్యములు చేయుట వలన పరలోకమున కుపయుక్తమగును.

ఈ విధముగా ధను మకర కుంభములలో నున్న సూర్యుడు శుభగ్రహములతో కూడిన లేక చూడబడిన శరత్కాల ధాన్యములు ఉపయోగకరములగును. మేషాది లేక ధనూరాశి నుండి మూడురాశులలో నున్న సూర్యుడు పాపగ్రహములతో కూడిన లేక చూడబడిన వ్యతిరేక ఫలితము కలుగును. విక్రయ (అమ్మే) సమయములో ఈయోగము మంచిదగును. అందువలన సూర్యుడు విపరీత యోగములో నున్నపుడు విక్రయము చేయవలెను.

నలుబదవ సస్యజాతకాధ్యాయము సమాప్తము



41. ద్రవ్య నిశ్చయాధ్యాయము

ఏ ద్రవ్యములకు మేషాది రాశిరూప అధిపతులకు మునులు శుభాశుభ ఫలములను తెలిపిరో వాటి గురించి ఇక్కడ తెలిపెదను. వస్త్రములు గొర్రెల చర్మముతో నిర్మించు వస్త్రములు,మేకచర్మముతో నిర్మించు వస్త్రములు పెసలు,గోధుమలు, చెట్టుజిగురు, యవలు జలములేని భూములలో ఉత్పన్నమగు ఔషధములకు స్వామి మేషరాశి. వస్త్రము, పుష్పము, గోధుమలు, శాలిధాన్యములు, యవలు, దున్నలు, ఎద్దులకు స్వామి వృషభము. ధాన్యము, శారదీయ లతలు, కుముదములు, ప్రత్తికి స్వామి మిథునము.

కొర్రలు,అరటి,గరిక,అన్నిఫలములు,కందమూలములు,పత్రములు, నారికేళము లకు స్వామి కర్కాటకము. పొట్టుధాన్యము, మధురాది రసములు, సింహాది ప్రాణులు, చర్మము, బెల్లములకు స్వామి సింహరాశి. అవిసెచెట్టు, మినుములు, ఉలవలు, పెసలు, శాలిధాన్యములకు స్వామి కన్యారాశి. పెసలు యవలు గోధుమలు మెంతులకు స్వామి తులారాశి,

చెరకు ఫలములు,లోహము, మేక, గొర్రెలకు సంబంధించిన వస్తువులకు స్వామి వృశ్చికము. గుర్రము ఉప్పు వస్త్రము అస్త్రము నువ్వులుధాన్యము ధాన్యములకు స్వామి ధనూరాశి,వృక్షములు, గుల్మములు లతలు ఫలములు చెరకు బంగారము లోహములకు స్వామి మకరము, నీటిలో ఉత్పన్నమగు వస్తువులు,ఫలములు,పూలు, రత్నములు, చిత్రవస్తువులకు స్వామి కుంభము. కపాల సంభవ రత్నములు(ముక్తాఫలములు) జలము నుండి ఉత్పన్నమగు వస్తువులు,వివిధ రకాలైన నూనెలు చేపల వలన ఉత్పన్నమగు ముత్యములకు స్వామి మీనరాశి యగును.

ఏరాశి నుండి చతుర్ధ దశమ ద్వితీయ ఏకాదశ సప్తమ నవమ పంచమములలో గురుడు, ద్వితీయ ఏకాదశ దశమ పంచమ అష్టమములో బుధుడుండునో ఆరాశులకు తెల్పిన వస్తువులు వృద్ధిపొందును. ఏరాశి నుండి షష్ఠ సప్తమములలో శుక్రుడుండునో ఆరాశికి తెల్పిన వస్తువులకు హాని మిగిలిన స్థానములలో శుక్రుడున్న వాటికి వృద్ధి కలుగును. ఏరాశి నుండి పాపగ్రహములు (రవి కుజ శనులు) ఉపచయ (తృతీయ షష్ఠ ఏకాదశ) స్థానములలో నుండునో ఆద్రవ్యములకు వృద్ధి మిగిలిన స్థానములలో నున్న హాని కలుగును.

ఏరాశి నుండి ఉపచయ స్థానములలో నున్న పాపగ్రహములు (రవి కుజ శనులు) బలవంతులై (మిత్రరాశి స్వరాశి ఉచ్చ స్వనవాంశ) శుభదృష్టి కలిగియుండునో ఆరాశికి తెలిపిన పదార్థములు అధికధరలు కలిగి దొరుకుట కష్టమగును. ఏరాశిలో ఇష్టస్థానములో (పూర్వము తెలిపిన వృద్ధిస్థానము) బలవంతులైన శుభగ్రహములున్నవో ఆరాశికి తెలుపబడిన ద్రవ్యములు తక్కువధరలలో దొరుకును.

గోచరపీడలో నున్న రాశి(గురువు మున్నగు గ్రహములు చతుర్థ ఆది శుభ స్థానములకు భిన్నమైన స్థానములలో నున్నపుడు) శుభగ్రహములతో చూడబడినపుడు పీడను పొందదు. అనగా ఆరాశికి సంబంధించిన పదార్థములు తక్కువ ధరలకు దొరుకును. పాగ్రహములతో చూడబడిన రాశిలో నున్న పదార్థముల ధరలు అధికమై దొరుకుట కష్టమగును.

నలుబది ఒకటవ నిశ్చయాధ్యాయము సమాప్తము

42. అర్ఘ కాండాధ్యాయము

మేషాదిరాశులలో సూర్యుడు గమనము చేయునపుడు ప్రతినెలలో అమావాస్య పూర్ణిమలలో అతివృష్టి, ఉల్క,దండము,పరివేషము,గ్రహణము,పరిధి,మున్నగు ఉత్పాతములను చూచి ద్రవ్యముల ధరలను గుర్తించవలెను. అమావాస్య పూర్ణిమలకు భిన్నమైన తిథులలో జనులకు ఉత్పాతములు, రాజులకు శస్త్ర కలహము వలన పీడ కలుగును. మేషరాశిలో సూర్యుడున్న సమయములో గ్రీష్మఋతువులో ఉత్పన్నమగు ధాన్యములు వృషభరాశిలో సూర్యుడున్నపుడు ఫలించు కందమూలములు ఫలములను సంగ్రహించ వలెను.మేషవృషభముల నుండి నాలుగవ మాసములో ఆవస్తువులను విక్రయించిన అధిక లాభమును పొందవచ్చును.

మిథునరాశిలో సూర్యుడున్నపుడు మధురాది రసములను సంగ్రహించవలెను. వాటిని తర్వాత ఆరుమాసములలో విక్రయించిన అధికలాభము కలుగును. కర్కాటకరాశిలో సూర్యుడున్నపుడు మధువు, సుగంధ ద్రవ్యములు, నూనె నెయ్యి పంచదారలను సంగ్రహించి తరువాతి నెలలో విక్రయించిన రెండింతలు లాభములు వచ్చును. రెండు మాసముల ముందు లేక తర్వాత విక్రయించిన నాశము కలుగును.

సింహరాశిలో సూర్యుడున్న సమయములో బంగారము మణులు చర్మము శస్త్రములు ముత్యములు వెండి వస్తువులను సంగ్రహించి ఐదవనెలలో విక్రయించిన లాభములు కలుగును. ఐదవనెలకు ముందు వెనుకలందు విక్రయించిన హాని కలుగును. కన్యారాశిలో సూర్యుడున్నపుడు ఉత్పాతములను చూచిన చామరము, గాడిద, ఒంటె, గుఱ్ఱములను సంగ్రహించి ఆరవ నెలలో విక్రయించిన రెట్టింపు లాభము వచ్చును.

తులారాశిలో సూర్యుడున్నపుడు పూర్వోక్త ఉత్పాతములను చూచి నూలుబట్టలు ఉన్ని వస్త్రములు సామానులు మణులు కంబళి గాజువస్తువులు పచ్చనివస్త్రములు పూవులు ధాన్యములను సంగ్రహించి ఆరవనెలలో విక్రయించిన రెట్టింపులాభము వచ్చును.వృశ్చికరాశిలో సూర్యుడున్నపుడు పూర్వోక్త ఉత్పాతములు జరిగినపుడు ఫలములు కందమూలములు అనేకవిధములైన రత్నములు సంగ్రహించి తర్వాత విక్రయించిన

రెట్టింపు లాభము వచ్చును.

ధనూరాశిలో సూర్యుడున్నపుడు పూర్వోక్త ఉత్పాతములు జరిగినపుడు కుంకుమ శంఖములు పగడములు గాజువస్తువులు ముత్యములు సంగ్రహించి ఆరుమాసముల తర్వాత విక్రయించిన రెట్టింపు లాభము వచ్చును. మకరము లేక కుంభరాశులలో సూర్యుడున్నపుడు పూర్వోక్త ఉత్పాతములు జరిగినపుడు లోహము పాత్రలు ధాన్యములను సంగ్రహించి ఒకనెల తర్వాత విక్రయించిన వ్యాపారి రెట్టింపు లాభమును పొందును. మీనరాశిలో సూర్యుడున్నపుడు ఉత్పాతము జరిగిన కందమూలములు ఫలములు పాత్రలు రత్నములను సంగ్రహించి ఆరు మాసములలో విక్రయించిన కోరిన లాభము వచ్చును.

ఏయేరాశులలో చంద్ర సూర్యులు తమ తాత్కాలిక అధిమిత్ర గ్రహములతో కూడియున్న లేక చూడబడిన ఆరాశిలో మాత్రమే ముందు తెల్పిన లాభము కలుగును. ఏరాశిలో సూర్యునితో కూడిన చంద్రుడు లేక పూర్ణచంద్రుడు శుభగ్రహములతో కూడిన లేక చూడబడిన ఆరాశికి సంబంధించిన ద్రవ్యముల ధరలు పెరుగును. అదే విధముగా ఏరాశిలో పాపగ్రహములతో కూడిన లేక చూడబడిన ఆరాశికి సంబంధించిన ద్రవ్యములకు నాశనము కలుగును. ఈవిధముగా ప్రతిరాశిలో నున్న ద్రవ్యముల శుభాశుభ ఫలమును తెలిసికొనవలెను.

నలుబది రెండవ అర్ఘ కాండాధ్యాయము సమాప్తము

43. ఇంద్ర ధ్వజ సంపదాధ్యాయము

దేవతలందరు బ్రహ్మతో పలికిరి. ఓ. భగవాన్ ! రాక్షసులతో యుద్ధము చేయుటకు మేము సమర్ధులము కాము. అందువలన మీశరణు పొందితిమి. భగవానుడైన బ్రహ్మదేవత లతో పలికెను. క్షీరసాగరములో భగవానుడైన నారాయణుడు విరాజ మానుడైనాడు. ఆయన ఒకధ్వజమును మీకు ఇచ్చును. అది చూచిన రాక్షసులు యుద్ధములో నిలబడరు.

ఈ విధముగా వరమును పొంది ఇంద్రునితో కూడి దేవతలు క్షీరసాగరమునకు వెళ్ళి భగవానుడైన నారాయణుని ఈ విధముగా స్తుతించెను. శ్రీవత్స చిహ్నముతో కౌస్తుభమణి కిరణములతో ప్రకాశమాన వక్షస్థలము కలవాడు, లక్ష్మీనాథుడు, అచింత్యుడు, అనౌపమ్యుడు, అన్ని ప్రాణులందుండుట వలన సముడు, ప్రాణులందరికి అతి కష్టముతో తెలిసికొదగిన వాడగుట వలన సూక్ష్ముడు, పరమాత్మ అనాది (ఉత్పత్తి రహితుడు) విష్ణువు (వ్యాపకుడు) అజ్ఞాత నిధనుడైన నారాయణుడు ఇంద్రాది దేవ గణముల వలన సంతుష్టుడు, అసుర స్త్రీల ముఖములను వికసింపచేయువాడైన విష్ణువు సూర్యసమానమైన కాంతి కలిగిన ధ్వజమును ఇంద్రాది దేవతలకు ప్రదానము చేసెను.

విష్ణువు తేజస్సుతో ఉత్పన్నమైన,ఎనిమిది చక్రములతో కూడినది ప్రకాశించునది

మణులతో అలంకరింపబడినది రథముపై నున్నది శరత్కాల సూర్యునివలె ప్రకాశించు ధ్వజమును ఇంద్రుడు అధిక సంతోషముతో పొందెను. కింకిణుల (చిన్నగంటలు) సమూహముతో అలంకరింపబడినది, మాల, ఛత్రము, ఘంట, పిటకము(ధ్వజమునకు అలంక రించు భూషణము) లతో కూడిన ఉన్నతమైన ధ్వజముతో యుద్ధములో శత్రుసేనను నాశనము చేసెను.

ఇంద్రుడు పైభాగమున ప్రయాణము చేయుచు (భూమిపై నుండి స్వర్గమునకు వెళ్ళేవాడు) చేదిదేశ రాజైన వసువుకు ఒక వెదురు దండమునిచ్చెను. దానిని విధి పూర్వకముగా చేదిదేశపు రాజు పూజించెను. వసువు చేసిన పూజకు ప్రసన్నుడై ఇంద్రుడు పలికెను. రాజైన వసువువలె ఏరాజు ఉత్సవము చేయునో ఆరాజు అనేక విధములైన రత్నములతో కూడి భూమిని శాసించు రాజగును. ప్రజలు సంతోషముతో భయరోగ రహితులై అనేక విధములైన అన్నముల (తినేపదార్థములు)తో కూడియుండును. భూమిపై శకునముల ద్వారా ధ్వజము శుభాశుభ ఫలము నిచ్చును.

శుభ కరణము (99 అధాయయము 4-5శ్లోకముల చెప్పబడిన) శుభదినము, శుభనక్షత్రము, శుభశకునము, శుభముహూర్తములో జ్యోతిషుడు వండ్రంగి వనమునకు వెళ్ళవలెను. ఉద్యానవనము, దేవాలయము, శ్మశానము, పుట్ట, మగ్గము, యజ్ఞభూమిలో ఉత్పన్నమగునవి, పొట్టివి, ఊర్ధ్వశుష్కములు (పొడవై ఎండినవి)ముళ్ళుకలవి లతలతో కూడినవి, వందావృక్షములతో కూడనవి, అనేక పక్షుల గూడులలో నున్నవి, గాలి వలన పడినవి,అగ్నివలన మండినవి, స్త్రీలింగ నామములు కలిగిన వృక్షములు కాక వేరే వృక్షములను ఇంద్రధ్వజము కొరకు నరుక వలెను.

అర్జున(నదీసర్జ వృక్షము) అజకర్ణ(నల్లమద్ది) ప్రియక(వేగిస) ధవ (నాగరంగ వృక్షము) మేడి - ఈ ఐదు వృక్షములు ధ్వము కొరకు శుభము నిచ్చును. వీటిలో ఒకటి లేక అన్యవక్ష్యమాన (మిగిలిన ముందు చెప్పబోవు) శుభలక్షణములు కలిగిన వృక్షముల దగ్గరకు వెళ్ళి బ్రాహ్మణులు లేని స్థానములో రాత్రి సమయములో విధిపూర్వకముగా పూజ చేసిన తర్వాత వృక్షమును స్పర్శించి వక్ష్యమాన మంత్రమును చదువవలెను.

యానీహ వృక్షే భూతాని తేభ్య: స్వస్తి నమోఽస్తు వ:
ఉపహారం గృహీత్వేమం క్రియతాం వాసపర్యయ:
పార్థివస్త్వాం వరయతే స్వస్తి తేఽస్తు నగోత్తమ
ధ్వజార్థం దేవరాజస్య పూజేయం ప్రతిగృహ్యతామ్

"ఈ వృక్షముపై నున్న జంతువులన్నిటికి శుభమగుగాక. మీరందరికి నేను నమాస్కారము చేయుచున్నాను. ఈ బలిని స్వీకరించి వేరొక చోట నివాసము చేయుడు. ఓప్రధానవృక్షమా! నీకుశుభమగుగాక,ఇంద్రధ్వజము కొరకు మిమ్ములను తీసికొను

చున్నాను. అందు వలన నేను చేయు పూజను స్వీకరించుడు."

తర్వాత సూర్యోదయ సమయములో ఉత్తరము లేక పూర్వముఖముగా నిలబడి వృక్షమును నరుకవలెను. గొడ్డలి శబ్దము రావటము మంచిదికాదు. మధురము మరియు ఘనశబ్దము వచ్చిన మంచిది.

అఖండితము, అవక్రమై పూర్వలేక ఉత్తరదిశలలో వృక్షము పడిన రాజుకు విజయము కలుగును. దీనికి వ్యతిరేకముగా వృక్షము పడిన అశుభము కలుగును. వృక్షము ముందు నుండి నాలుగంగుళములు, మూలము నుండి ఎనిమిది అంగుళములు నరికి జలములో వేయవలెను. తర్వాత జలము నుండి తీసి బండి లేక మనుష్యుల వలన పుర ద్వారమునకు తీసుకొనిరావలెను.

కర్రను తీసికొని వచ్చు సమయమున బండి ఆర(చక్రపు అంచు) విరిగిన సేనల మధ్య భేదము, నేమి (బండి కల్లు చుట్టు వేయు ఇనుపకట్టు) విరిగిన సేనలకు నాశము, ఇరుసు విరిగిన నాశము, అణి(ఇరుసు చీల) విరిగిన వడ్రంగికి నాశము కలుగును.

భాద్రపద శుక్ల అష్టమి దినమున నగరములో నుండు మనుష్యులు, జ్యోతిషులు, మంత్రులు, కంచుకులు, సుందర వేషధారులు, బ్రాహ్మణులతో కూడిన రాజు పురవాసుల ద్వార నూతన వస్త్రములను కప్పి పూలదండలు గంధ ధూపములతో శంఖ తూర్యధ్వనులతో పురములో ప్రవేశము చేయవలెను.

మనోహరమైన పతాకము తోరణము వనమాలలతో భూషితమైనది ఆనందముతో నున్న మనుష్యులతో కూడినది,సుందరముగా నలంకరింపబడినది,సుందరముగా నలంకరించుకొనిన వేశ్యలు కలది, సుందరముగా నలంకరించిన దుకాణములు కలది పుణ్యాహవచనము వేదమంత్రములతో కూడినది, నటులు, నాట్యము చేయువారు, గాన విద్యను తెలిసినవారితో వ్యాపించిన చతుష్పథము(నాలుగు మార్గముల కూడలి)లతో నగర ముండవలెను.

ఆనగరములో శ్వేత వర్ణ పతాకము విజయము, పీతవర్ణ పతాకము రోగము, అనేక వర్ణముల పతాకము విజయము, రక్తవర్ణపతాకము శస్త్రప్రకోపమును కలిగించును. నగరములో ప్రవేశించు సమయములో కర్రను ఏనుగు గుర్రము మున్నగు జంతువులు పడవేసిన భయము కలుగును. ఆసమయములో బాలురు చప్పట్లు కొట్టిన, ఆవుల మధ్య జగడము జరిగిన యుద్ధము జరుగుట కవకాశముండును.

తరువాత వండ్రంగి విధి పూర్వకముగా కర్రను తరిమెన పట్టు యంత్రము పైనుంచవలెను. రాజు తర్వాత వచ్చు ఏకాదశిలో జాగరణ చేయవలెను. శ్వేత వస్త్రము తలపాగ ధరించవలెను. పురోహితులు ఇంద్ర విష్ణు దేవతా మంత్రములతో అగ్నిలో హోవనము చేయవలెను. ఆసమయములో దైవజ్ఞులు అగ్ని యొక్క శుభాశుభ నిమిత్తములను

పరిశీలన చేయవలెను.

ఇష్టద్రవ్య సదృశము, సుగంధితము, విమలము, ఘనము, ప్రజ్వలితమైన అగ్ని శుభ కారకమగును. అన్యలక్షణములతో కూడిన అగ్ని అశుభదాయకమగును. ఈ విషయము నాయోగగ్రంథములో విస్తారముగా చెప్పబడినది.

పూర్ణాహుతినిచ్చు సమయములో స్వయముగా ప్రజ్వలిత శిఖలు కలిగి నిర్మలమైన దక్షిణావర్తముగా చలించు శిఖలు కలిగిన అగ్ని ఉన్న, గంగా యమునా నదుల రూపహారము కలిగినది సముద్రము రూపమేఖల (వడ్డాణము) కలిగినదైన పృధ్విని జనవశము నందుంచు కొనును. సంపూర్ణమైన భూమికి రాజగును.

సువర్ణము అశోకము గోరింట వైడూర్యమణి, నీలకమల సమానమైన కాంతి కలిగిన అగ్ని హవనము చేయు రాజభవనములో రాత్రులందు రత్నముల కిరణములతో అంధకారమున కవకాశము కలుగదు. సముద్రము మేఘము ఏనుగు నగారా వలె ప్రజ్వలితమైన అగ్నిలో శబ్దము కలిగిన హవన కర్తయైన రాజుయొక్క గమనకాలములో మదించిన ఏనుగులతో కప్పబడి నాలుగు దిశలు అంధకార సమానమగును. అనగా రాజుకు అధికసంఖ్యలో ఏనుగులు లభించును.

పతాకము, కుండ, గుర్రము, ఏనుగుల, సమానముగా అగ్ని కనపడిన సూర్యుని ఉదయాస్తమయ సమానమైన అధరములు కలిగినది, హిమాలయ సదృశ స్తనములతో కూడిన భూమి హవన కర్తమైన రాజు వశమగును. ఏనుగు మీద జలము పేలాలు నెయ్యి తేనె సమానమైన వాసన కలిగిన హవనము చేయురాజుకు ప్రణామము చేయుచున్న రాజుల కిరీట మణుల కాంతులతో రాజుముందు భాగమున నున్న భూమి బ్రద్ధలగునట్లుగ కనబడును.

పూర్వోక్త ప్రకారముగా ఇంద్రధనుస్సును ఎత్తు సమయమున అగ్నిస్వరూపము శుభాశుభ ఫలములు తెలుపబడినవి. వాటిని జన్మ సమయము, యజ్ఞకాలము, గ్రహశాంతి, యాత్ర వివాహముతో విచారణ చేయవలెను. బెల్లము, అప్పములు, పాయసము, దక్షిణలతో బ్రాహ్మణులకు పూజచేసి శ్రవణా నక్షత్రయుక్త ద్వాదశి తిథిలో, లేక శ్రవణా నక్షత్రముతో కూడిన అన్యతిథిలో ధ్వజమును నిలబెట్టవలెను.

ధ్వజము పైభాగమున ఐదు లేక ఏడు శక్ర కుమారీలను నిర్మించవలెనని మనువు తెల్పెను. ధ్వజము ఎత్తులో నాల్గవవంతు నంద, సగముతో సమానముగా ఉప నంద, ధ్వజమునకు పదహారవ భాగమధికముగా రెండు వసుంధరలను, అన్నింటిమధ్యలో వసుంధరకు ఎనిమిదవ భాగమధికముగా శక్రజానిత్రిని తయారు చేయవలెను. పూర్వము ఆనందముతో దేవతలు ఇంద్రధ్వజమునకు ఏ ఆభరణములు ధరింపజేసిరో అధే విధముగా విచిత్ర రూపములతో కూడిన ఆభరణములతో నలంకరించవలెను.

ఎఱ్రని అశోక సమానమకాంతివాడైన విశ్వకర్మ చతురస్రాకారపు ఆభరణమును ఇంద్రధ్వజమునకిచ్చెను. బ్రహ్మ మరియు శంకరుడు అనేక మణులతో కూడిన ఒడ్డాణము నిచ్చెను. ఇంద్రుడు నీలము ఎరుపు వర్ణములతో ఎనిమిది కోణములు కలిగిన మూడవ ఆభరణము నిచ్చెను. యముడు నలుపు కాంతితో నున్న మయూరనామక నాల్గవ ఆభరణము నిచ్చెను. వరుణుడు ఎరుపు రంగు కలిగిన జలావర్తము వలె నున్న ఆరుకోణములు కలిగిన ఐదవ ఆభరణము నిచ్చెను. వాయుదేవుడు మయూర పంకము, మేఘమువలె నీలవర్ణము కలిగిన ఆరవ ఆభరణము కేయూర నామక ఏడవ ఆభరణము నిచ్చెను. అగ్నిదేవుడు అగ్నిశిఖ వలె కాంతి కలిగిన గోళాకారముతో నున్న ఎనిమిదవ ఆభరణము నిచ్చెను. ఇంద్రుడు వైడూర్యమణితో సమానమైన కాంతి కలిగిన తొమ్మిదవ కంఠాభరణము నిచ్చెను. త్వష్టానామక సూర్యుడు రథచక్రము వలెనున్న కాంతివంతమైన పదవ ఆభరణము నిచ్చెను. విశ్వదేవుడు కమల సమానమైన ఉధ్వంశనామము కలిగిన పదకొండవ ఆభరణము నిచ్చెను. బృహస్పతి శుక్రులు క్రిందపైన నిర్మించిన ముందు భాగమున విస్తృతమై లాక్షారస సమానలోహితవర్ణము కలిగిన పదమూడవ ఆభరణము నిచ్చెను. ఏయే దేవతలు ఇంద్ర ధ్వజమునకు ఏ అభరణములు నిర్మంచినారో వారే వాటికి దేవతలు. ఇది పండితులు తెలిసికొనవలెను.

ధ్వజము మూడవభాగము మొదటి పిటకము పరిధి యగును. ద్వితీయాది పన్నెండు పిటకములు తమ ముందు పిటకములకన్న ఎనిమిది భాగములు తక్కువ చేయవలెను. శాస్త్రజ్ఞులు పుర్ణిమ దినమున పిటకములతో ఇంద్రధ్వజమును అలంకరించ వలెను. నియమానుసారముగా మనువు ద్వారా ప్రతిపాదింపబడిన వక్ష్యమాన (ముందు చెప్పబోవు) మంత్రములను వదువవలెను.

హరార్క వైవశ్వత శుక్ర...........వీరా ఉత్తరాభవన్తు

మహాదేవుడు సూర్యుడు యముడు ఇంద్రుడు చంద్రుడు కుబేరుడు అగ్నివరుణుడు మహర్షిగణము అన్నిదిశలు అప్సరసలు శుక్రుడు బృహస్పతి కార్తికేయుడు వాయుదేవతల సముదాయములతో ప్రకాశమానమై అనేక రూపములతో శ్రేష్ఠ ఆభరణములతో ఏవిధముగా పూజింపబడుదురో ఓదేవా! అదే విధముగా యజ్ఞములలో ప్రసన్నమైన మనస్సుతో అన్ని ఆభరణములను స్వీకరింపుము. అజ అవినాశి ఎల్లప్పుడు ఉండువాడవు ఏకరూపుడవు, వ్యాపారుడవు, పన్నెండు రూపములవాడవు, ప్రధాన పురుషుడవు, చిరంతనుడవు, యమస్వరూపుడవు, అందరిని సంహరించువాడవు, అగ్నివి సహస్ర శిరస్సులవాడవు, ఇంద్రుడవు మరియు స్తుతించుటకు యోగ్యమైనవాడవు,విద్వాంసుడవు, అగ్నివి, పాలించువాడవు, ఇంద్రుడవు,రక్షకుడవు, దేవతలకు స్వామివి, శక్రుడవు, వృత్రాసురిని సంహరించువాడవు, సుందరమైన సేనలు కలిగినవాడవైన నిన్ను నేను పిలుచుచున్నాను.

మావీరులైన సేనలకు యుద్ధములో విజయమగుగాక!

రాజు ఇంద్ర ధ్వజములను భూషణములతో అలంకరించు సమయమున దానిని ఎత్తే సమయమున నగరములో ప్రవేశించు సమయములో, పుష్పములను అలంకరించు నపుడు విసర్జనము చేయు సమయమున ఉపరోక్త (పైనతెల్పిన) మంత్రమునుచ్ఛరించవలెను.

ఛత్రము,పతాకము,దర్పణము(అద్దము) అర్థచంద్రుడు,అనేక విధములైన మాలలు, అరటిచెట్టు, చెరుకు, దిక్పాలకుల (ఇంద్ర అగ్ని యమ నైరృతి వరుణ వాయు కుబేర మహాదేవ) తో కూడిన అఖండితమైన ఎనిమిది త్రాళ్లతో బంధించినది బలమైనది కర్రతో తయారుచేయబడినది రెండుమాత్రుకలు కలది దృఢముగా బంధింపబడినది, యాత్రార్గలము సారయుతమైన వృక్షములతో తయారైన కుమారికతో కూడినదైన ఇంద్ర ధ్వజమును నిలబెట్టవలెను.

మంగళప్రదము, ఆశీర్వాదము, ప్రణామము మధ్య జన ఘోషలతో సంపన్నమై డోలు మృదంగము శంఖము భేర్యాది ధ్వనులతో, వైదిక మంత్రోచ్చారణలతో బ్రాహ్మణుల మంగళ ధ్వనులతో యుక్తమైన ధ్వజము రాజుద్వారా ఎత్తబడవలెను. ఫలములు, పెరుగు, నెయ్యి,పేలాలు, తేనె, పూవులు చేతితో తీసుకొని నతమస్తకము కలవాడు మంగళ శబ్దములు పలుకుతు పురజనులతో ప్రజలస్వామియైన రాజు, దేవతల స్వామియైన ఇంద్రుని ధ్వజమును శత్రువులను వధించుటకు నగరము వైపుకి వంచవలెను.

నాతిత్వరితము(తొందర లేకుండ) అవిలంబము (ఆలస్యము లేకుండ) అంకపీతము (కంపించకుండ) అనష్టమాలతో భూషణములతో అలంకరింపబడిన ధ్వజమును ఎత్తిన శుభము కలుగును. ఈ లక్షణములకు భిన్నములైన లక్షణములతో నున్న ధ్వజమును ఎత్తిన శుభము కలుగదు.

ఇంద్ర ధ్వజముపై మాంసమును తినుపక్షి, గుడ్లగూబ, పావురము, కాకి, తెల్లనిగద్ద కూర్చొనిన రాజుకు అత్యంత భయము, నీలకంఠము (నెమలి)కూర్చొనిన యువరాజుకు భయము, డేగ కూర్చొనిన నేత్రభయము కలుగును. ఆఛత్రధ్వజము భగ్నమైన రాజుకు మరణము, దానిపై తేనెటీగలు తేనెపట్టు నిర్మించిన దొంగలభయము, ఉల్కపడిన పురోహితు లకు నాశము,వజ్రపాతమైన పట్టపురాణికి నాశము కలుగును.

ధ్వజపతాకము పడిన రాణికి నాశము, పిటకము పడిన అనావృష్టి ధ్వజము మధ్యభాగము విరిగిన మంత్రులకు నాశము,అగ్రభాగము విరిగిన రాజుకు హాని,ధ్వజము మూలభాగము విరిగిన నగరవాసులకు హాని కలుగును. పొగతో ధ్వజము కప్పబడిన అగ్నిభయము, అంధకారము వ్యాపించిన వికలత్వము, సర్పము త్రొక్కబడి మరణించిన లేక క్రిందపడిన మంత్రులకు నాశము కలుగును.

ధ్వజమునకు ఉత్తరదిశలో ఏదైన ఉత్పాతమైన బ్రాహ్మణులకు పూర్వదిశలో నైన క్షత్రియులకు, దక్షిణములో నైన వైశ్యులకు, పశ్చిమములోనైన శూద్రులకు కష్టము కలుగును. ఇంద్రధ్వజము విరిగిన వేశ్యలకు నాశము కలుగును. ఇంద్రధ్వజము ఎత్తే సమయములో త్రాడుతెగిన బాలురకు మాతృక (తోరణమునకు ప్రక్కనున్న కర్ర) విరిగిన రాజమాతకు పీడ కలుగును. ఇంద్రధ్వజమునకు సమీపమున చరించు జనులకు మరియు బాలుర చేష్టలతో శుభాశుభ ఫలము కలుగును.

తన బలము వృద్ధి పొందుటకు నాలుగు దినముల వరకు (ద్వాదశి నుండి పూర్ణిమ వరకు) పూజించుటకు నిలబెట్టిన ఇంద్రధ్వజము మంత్రులతో కూడి రాజు ఐదవదినమున (పాడ్యమి) అంతిమ పూజను చేసి విసర్జన చేయవలెను. ఉపరిచర వసువుతో నడిపింపబడినది, రాజులతో చేయబడినదైన ఈ విధిని నిర్వహించిన రాజు శత్రువులవలన భయమును పొందదు.

నలుబది మూడవ ఇంద్రధ్వజ సంపదాధ్యాయము సమాప్తము

44. నీరాజనాధ్యాయము

మేఘ రూపమైన పలకము చంద్రసూర్య రూప నేత్రములు కలిగిన కమలనాభుని నేత్రములు తెరచినపుడు గుర్రము ఏనుగు మనుష్యులు జలమును స్పర్శించవలెను. కార్తీక లేక ఆశ్వయుజ శుక్లపక్షద్వాదశి, అష్టమి పూర్ణిమ అమావాస్య దినములలో నీరాజన నామకశాంతిని చేయవలెను. నగరమునకు ఈశాన్యకోణములో ఉత్తమ భూమిపై ప్రశస్తవృక్షము నుండి పదహారు హస్తముల ఎత్తు పది హస్తముల వెడల్పులో ఒకతోరణమును చేయవలెను.

విజయసారము మేడి అర్జున వృక్షముల శాఖలతో కూడిన వెదురుతో నిర్మించిన మత్స్యము ధ్వజము చక్రములతో అలంకృతమైన శాంతి గృహమును నిర్మించవలెను. భల్లాతక (జీడి) శాలిధాన్య కుష్ఠ (పులుము) తెల్లనిఆవాలను పుష్టి కొరకు శాంతిగృహము, గుర్రముల మెడలో కట్టవలెను. శాంతి గృహములో సూర్య వరుణ విశ్వేదేవుడు బ్రహ్మ ఇంద్ర విష్ణు మంత్రములతో ఏడు దినముల వరకు గుర్రములకు శాంతికర్మ చేయవలెను. పుణ్యాహ వాచనము శంఖ ధ్వని భేరీధ్వని గీతశబ్దములతో భయరహితము పూజితమైన గుర్రమును భయపెట్టటము కొరడాతో కొట్టడము చేయరాదు.

ఎనిమిదవ రోజు తోరణమునకు దక్షిణవైపు ఉత్తరాభిముఖముగా వేదికలో కుశలు వస్త్రములతో కప్పబడిన అగ్నిని స్థాపన చేయవలెను. చందనము కూఠము (పులుము చెంగల్వకోష్టు)మంజిష్ఠము (ప్రకాశించు ఎరుపు) మనశ్శిల, కంకణము, వచము, దంత్యము, అంజనము (కాటుక) పసుపు, సువర్ణపుష్పి, అగ్నిమంథము,శ్వేతము, పూర్ణకోశము, గంగా

ఫలము, త్రాయమాణము, సహదేవి,నాగపుష్పము,స్వగుప్త,శతావరి,సోమవలి మున్నగు ఔషధములను సమానముగా తీసుకొని పూర్ణకలశములో నుంచి తేనె పాయసము ఉలవలు మున్నగువాటితో విభిన్న పదార్థములతో నివేదన చేయవలెను.

చంద్ర,పలాశ, మేడి, అశ్మరి, రావి కర్రలతో సమిధలను తయారుచేయవలెను. సంపత్తిని కోరు రాజు బంగారము లేక వెండితో స్రుక్కు(యజ్ఞోప కరణము)ను తయారు చేయవలెను. పులిచర్మముపై పూర్వాభి ముఖముగా అగ్ని సమీపములో గుర్రము వైద్యుడు జ్యోతిష్కునితో పాటు రాజు కూర్చొనవలెను. యాత్రానామక పుస్తకములో ఇంద్ర ధ్వజాధ్యాయములో వేది పురోహిత అగ్ని లక్షణములు చెప్పినవి ఈ నీరాజనాధ్యాయములో గ్రహించవలెను.

వక్ష్యమాన (ముందు చెప్పబడిన) లక్షణములతో కూడిన గుర్రము ఏనుగు అక్షతలు శ్వేతవస్త్రము దండము ధూపము మున్నగు వాటితో పూజించి అనేక విధములైన వాద్యములు పుణ్యాహ శబ్దములతో తమ ఆశ్రమ సమీపముననున్న తోరణముల దగ్గర మధుర శబ్దములతో సాంత్వన వచనమును పులుకుతు మెల్లమెల్లగా తీసుకొనిరావలెను.

రాజుద్వారా తేబడిన గుర్రము దక్షిణపాదమును ఎత్తి నిలబడిన రాజు శ్రమ పడకుండ శత్రురాజును జయించును. గుర్రము భయపడిన రాజుకు శుభము కలుగదు. ఏనుగు గుర్రముల మిగిలిన చేష్టలను నేను యాత్రానామక గ్రంథములో తెలిపిన విధముగా యుక్తిపూర్వకముగా తెలిసికొనవలెను.

పురోహితుడు అన్నపుముద్దను తయారు చేసి దానిని మంత్రించి గుర్రమునకు ఎదురుగా నుంచిన గుర్రము దానిని వాసనచూచిన లేక కొంచెము తినిన రాజుకు విజయము కలుగును. లేని యెడల పరాజయము కలుగునని తలంచవలెను.

మేడిచెట్టు చిన్నకొమ్మను నీటిలో నానబెట్టి దానితో శాంతి పూర్వక మంత్రములతో గుర్రమును రాజును ఏనుగును సేనలను స్పర్శించవలెను. తర్వాత బ్రాహ్మణుడు దేశవృద్ధి కొరకు అభిచార కర్మలో తెలుపబడిన అథర్వణ మంత్రములను చదువుతు మట్టితో చేసిన శత్రువు ప్రతిమ వక్షస్థలమును తీక్ష్ణమైన శూలముతో చీరవలెను. తర్వాత పురోహితుడు కళ్ళెమును మంత్రించి గుర్రము ముఖమునకు తగిలించవలెను. తర్వాత నీరాజనము చేసిన రాజు సేనలతో కూడి ఈశాన్య కోణములో ప్రయాణించవలెను.

మృదంగ శంఖధ్వనులతో ఆనందమును పొందుతు. ఏనుగుల మదజలపు వాసనలతో కూడిన వాయువు కలిగినవాడై కిరీటముపై నున్న మణులపై కిరణముల శరత్కాల సూర్యునివలెనున్న రాజు, సుగంధయుక్త వాయువును సేవించు శ్వేత చామరము లతో కల్పింపబడిన సుందరమైన మాలలు వస్త్రములతో కూడిన రాజు హంసపంక్తులతో వ్యాప్తము సుగంధయుత వాయువులతో హిమాలయమువలె నున్న రాజు, అనేక వర్ణములతో

కూడిన రత్నములతో కూడిన కిరీటము కుండలములు బాహుబంధులతో భూషితమైన కారణమున ఇంద్రధనుస్సు వంటి కాంతి కలిగిన రాజు ఎగురుతున్న గుర్రములు భూమిని చీల్చుచున్నపుడు. ఏనుగులు మరియు జయించు మనుష్యులతో కూడి దేవతల మధ్యలో నున్న చంద్రునితో సమానుడుగానున్న రాజు ప్రయాణము చేయవలెను.లేని యెడల వజ్రము ముత్యములతో కూడిన తెల్లని మాల, తెల్లని తలపాగ, తెల్లని చందనము, తెల్లని వస్త్రముతో కూడి ఛత్రధారణతో ఏనుగుపై విరాజమానమైన రాజు మేఘములపై భాగమున చంద్రుని క్రిందనున్న శుక్రునితో సమానముగా గమనము చేయవలెను.రాజుతో పాటు సంతోషముతో నున్న మనుష్యులు, గుర్రములు ఏనుగులతో కూడి నిర్మలమైన ఖడ్గములతో ప్రకాశమానమై వికారరహితమై శత్రువులకు భయావహమైన సేనాగణములతో శత్రువులను శీఘ్రముగా జయించవలెను.

నలుబది నాల్గవ నీరాజనాధ్యాయము సమాప్తము

45. ఖఞ్జనక లక్షణాధ్యాయము

ఖంజన నామము కలిగిన పక్షి ప్రథమదర్శన ఫలమును గర్గాదిమునులు తెలిపిన విధముగా నేనిప్పుడు తెలియజేయుచున్నాను.స్థూలశరీరము కలిగినది ఉన్నతమైనది నల్లని మెడ కల్గిన పక్షి భద్రసంజ్ఞకమగును. ఇది కనపడిన శుభము కలుగును.ముఖము నుండి కంఠము వరకు నల్లగా నున్న ఖంజన పక్షి సంపూర్ణ సంజ్ఞకమగును. ఇది అన్నికోరికలను నెరవేర్చును. కంఠములో నల్లని బొట్టు తెల్లని చెక్కిలి యున్న రిక్తసంజ్ఞక ఖంజనమగును. దాని దర్శనము వలన అంతాశూన్యమగును. పీతవర్ణ ఖంజనము గోపీత సంజ్ఞకమగును. ఇది కనపడిన క్లేశము కలుగును.

మధురమైన సుగంధ ఫలములు పూలతో కూడిన వృక్షముపై పవిత్ర జలాశయము లో ఏనుగు గుర్రము సర్పముల తలపై దేవాలయపు తోట భవనము, ఆవుల గొట్టము, సజ్జనుల సమావేశస్థానము, వివాహాది ఉత్సవస్థానము, రాజు బ్రాహ్మణుల సమీపము, ఏనుగు, గుర్రము గొడుగు చామరముపై బంగారమునకు సమీపమున కమలము నీలికమలము పూజాస్థానము పెరుగు గిన్నె ధాన్యరాశిపై ఖంజనపక్షి కనపడిన శుభము కలుగును.

బురదపై కూర్చొని ఖంజనపక్షి కనపడిన రుచికరమైన భోజనము దొరుకును. పేడపై కనపడిన పాలు నెయ్యి పుష్కలముగా లభించును.గరికపై కనపడిన వస్త్రలాభము, బండిపై కనపడిన దేశనాశము, ఇంటిపైకప్పుపై కనపడిన ధననాశము, చర్మముతో తయారుచేయు రంధ్రము కలిగిన వస్తువులపై కనపడిన బంధనము, అపవిత్రస్థానముపై కనపడిన రోగము,మేకపోతు లేక గొర్రెపై కనపడినవెంటనే మిత్రులతో సమావేశము

కలుగును. దున్నపోతు ఒంటె గాడిద శ్మశానము ఇంటిమూల మట్టిగుట్ట మేడ ప్రహరిగోడ భస్మము (బూడిద) వెంట్రుకలపై ఖంజనపక్షి కనపడిన మరణము రోగభయ రూపమైన అశుభ ఫలము కలుగును.

రెండు రెక్కలను కదుపుతు ఖంజనపక్షి కనపడిన శుభము కలుగదు. నదిలో నీటినిత్రాగుతు కనపడిన శుభము కలుగును.సూర్యోదయ కాలములో ఖంజనము కనపడిన శుభఫలము, అస్తమయకాలములో కనపడిన అశుభము కలిగించునదగును. నీరాజనము చేసిన తర్వాత ఏదిశలో వెళుతున్న ఖంజనపక్షి రాజుకు కనపడునో ఆదిశలో గమనము చేసిన శత్రురాజు వెంటనే వశమగును.

ఖంజనము మైథునము చేయు స్థలము క్రిందనిధి, వమనము(వాంతి చేయుట) చేయుప్రదేశములో గాజు, మలవిసర్జన చేయు ప్రదేశము క్రింద బొగ్గు ఉండును. దానిని పరీక్ష చేయుటకు భూమిని త్రవ్వి తప్పక చూడవలెను. చనిపోయిన ఖంజనపక్షి కనపడిన మృత్యువు,వికలభావముతో కనపడిన వైకల్యము, రోగస్థితిలో కనపడిన రోగము కలుగును. గృహములో ప్రవేశించు సమయములో ఎదురుగా కనపడిన ధనలాభము, ఆకాశములో ఎగురుతు కనపడిన బంధుసమాగమము కలుగును.

శుభస్థానములో శుభలక్షణములతో కూడిన ఖంజనము కనపడిన సుగంధ పుష్పములు ధూపముతో రాజుకు అర్ఘ్యము నీయవలెను. ఈవిధముగా ఖంజన దర్శనము వలన శుభఫలము వృద్ధి కలుగును. అశుభఫలము నిచ్చు ఖంజనము చూచిన రాజు బ్రహ్మ గురుసజ్జన దేవతలను పూజించిన అశుభఫలము తొలగును ఏడు రోజుల వరకు మాంస భక్షణము చేయక ఉండవలెను.

ఖంజనపక్షి మొదటి దర్శనఫలము ఒకసంవత్సరములో జరుగును.తర్వాత ప్రతి రోజు జరుగుదర్శనఫలము ఆ దినములోనే జరుగును. దిశ స్థానము శరీరాకృతి, లగ్నము నక్షత్రము శాంత దీప్తదిశలననుసరించి శుభాశుభములను తెలిసికొని ఫలితమును తెలుపవలెను.

నలుబది ఐదవ ఖంజనక లక్షణాధ్యాయము సమాప్తము



46. ఉత్పాతాధ్యాయము

మహర్షి గర్గుడు ఉత్పాతముల గూర్చి అత్రిమునికి తెలిపెను. వాటి సంక్షేప రూపము ఇక్కడ ఉన్నది. ప్రకృతిలో విరుద్ధ ఘటన జరుగుట ఉత్పాతము, మనుష్యుల అవినయ ప్రవర్తన వలన కలుగు పాపముల వలన ఉపద్రవములు కలుగును. దివ్యము అంతరిక్షము భౌమ ఉత్పాతములు ఉపద్రవములను సూచించును. మనుష్యుల అవినయ ప్రవర్తన వలన అప్రసన్నులైన దేవతలు ఉత్పాతములను కలిగింతురు. వాటి నివారణకు రాజు శాంతిని చేయవలెను.

సూర్యాది గ్రహములు అశ్విని ఆది 27 నక్షత్రములు వికారయుక్తమైన దివ్య నామక ఉత్పాతమగును. ఉల్క నిర్ఘాతము వాయువుల వికృతి, సూర్యచంద్ర మండలము లలో పరివేషము,గంధర్వనగరము, ఇంద్రధనుస్సు మున్నగువాటితో రోహితము, ఐరావతము దండము పరిఘ ఉత్పాతముల నామమే అంతరిక్ష ఉత్పాతము. చలించు వాస్తు యొక్క స్థిరత్వము, స్థిరవాస్తు యొక్క చలనము వలన భౌమనామక ఉత్పాతమగును. ఈభౌమ ఉత్పాతమునకు శాంతి చేసిన దుష్ప్రభావము నష్టమగును.అంతరిక్ష ఉత్పాతమునకు శాంతి చేసిన దాని ప్రభావము తగ్గును. దివ్య ఉత్పాతమునకు శాంతి చేసిన దాని చెడు ప్రభావము తొలగును. ఈ విధముగా ఒక చార్యుడు తెలిపెను.

అధిక సువర్ణము, అన్నము, గోవు భూమిని దానము చేసిన దివ్య ఉత్పాతమునకు శాంతి కలుగును. అంరతిక్ష భౌమ ఉత్పాతములకు కూడ పైన తెల్పిన దానములతో శాంతి కలుగును.శివాలయములో భూమిపై గోవుల పాలు పితుకుట, కోటిసంఖ్యతో హవనము చేయుట వలన ఉత్పాత శాంతి కలుగును. తమశరీరము, పుత్రుడు ధనాగారము హవనము,నగరము,స్త్రీ, పురోహితుడు, జనపదము ఈ ఎనిమిది దైవకల్పిత ఉత్పాతముల ఫలమును పొందును.

శివలింగము దైవమూర్తి దేవస్థానము కారణము లేకుండ విరుగుట కంపించుట వాటిలో చెమటవచ్చుట, వాటిరోదనము, క్రిందికి పడటము, శబ్దము కలగటము మున్నగు వాటి వలన రాజుకు దేశమునకు నాశనము కలుగును.దేవస్థానములలో యాత్రా సమయములో బండి ఇరుసు కాళ్లు,ఎడ్లకాడి ధ్వజము విరుగుట, క్రిందపడుట, తిరగబడుట, అంటుకొనుట జరిగిన దేశమునకు రాజుకు శుభము కలుగదు.

ముని, ధర్మము, తండ్రి బ్రహ్మాదులలో ఉత్పన్నమగు వికృతి వలన బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యజాతులకు నష్టము కలుగును.రుద్ర ఇంద్రాదులలో ఉత్పన్నమగు వికృతి వలన పురోహితులకు, విష్ణువులో ఉత్పన్నమగు వికృతి వలన మనుష్యులకు, కార్తికేయ విశాఖ దేవతలలో ఉత్పన్నమగు వికృతి వలన మండలాధిపులైన రాజులకు,వేదవ్యాసునిలో ఉత్పన్నమగు వికృతి వలన మంత్రులకు,గణేశుని వలన ఉత్పన్నమగు వికృతి వలన

సేనాపతులకు బ్రహ్మ విశ్వకర్మలలో ఉత్పన్నమగు వికృతి వలన మనుష్యులకు, దేవకుమారులలో ఉత్పన్నమగు వికృతి వలన రాజకుమారులకు, దేవకుమార్తెలలో ఉత్పన్నమగు వికృతి వలన రాజపత్నులకు, దేవతల దాసులలో ఉత్పన్నమగు వికృతి వలన రాజ సేవకులకు,రాక్షసులలో ఉత్పన్నమగు వికృతి వలన రాజకుమారులకు, పిశాచములలో ఉత్పన్నమగు వికృతి వలన రాజకుమార్తెలకు, యక్షులలో ఉత్పన్నమగు వికృతివలన రాజపత్నులకు, నాగులలో ఉత్పన్నమగు వికృతి వలన రాజసేవకులకు, అశుభ ఫలము కలుగును. ఈ ఉత్పాతము ఫలితము ఎనిమిది మాసములలో జరుగును.

దేవతలలో వికృతిని తెలిసికొని పవిత్రము సంయుత స్నానము చేసి మూడు దినములు వ్రతముతో పురోహితుడు వికారయుక్త దేవతలకు స్నాన, పుష్పచందన, వస్త్రములు పెరుగు కలిసిన భోజనముతో విధి పూర్వకముగా పూజచేయవలెను. యజ్ఞాన్నమును దేవతా మంత్రమును చదువుతు అగ్నిలో హవనము చేయవలెను. ముందు తెల్పిన విధముగా దేవ వికారము జరిగినపుడు రాజు ఏడురాత్రుల వరకు బ్రాహ్మణులు దేవతలకు పూజ గీత నృత్యములు రాత్రి జాగరణము మున్నగు ఉత్సవములు చేయవలెను. ఈ విధముగా ఏదేవతలకు చేయుదురో వాటికి పూర్వోక్తశాంతి చేసి దక్షిణలనిచ్చిన ఉత్పాతముల అనిష్ట ఫలము నష్టమగును.

ఏరాజు రాజ్యములో అగ్ని లేకుండ జ్వాలలు కనపడిన, కాష్ఠయుతమైన అగ్ని ప్రజ్వలించకున్న, ఆరాజుకు రాజ్యమునకు పీడ కలుగును. జలము మాంసము తడిసిన వస్తువులలో అకారణముగా మంటలు కలిగిన రాజుకు మృత్యువు, ఖడ్గాదులలో మంట కలిగిన భయంకర యుద్ధము, సేనలలో నగరములో అగ్ని దొరకకున్న అగ్నిభయము కలుగును.

దేవగృహము, గృహము తోరణము ధ్వజము అగ్నిలేకుండ మెరుపుతో దగ్ధమైన ఆరుమాసములలో తప్పక ఇతర రాజుయొక్క ఆగమనము జరుగును. పొగలేకుండ అగ్ని పగలు దుమ్ములేక అంధకారము కనపడిన అధికభయము కలుగును. రాత్రి సమయములో మేఘ రహిత ఆకాశములో నక్షత్రములు కనపడకున్న పగలు కనిపించిన అధికభయ కారకమగును.

నగరము, పశు పక్షి మనుష్యులలో అగ్ని లేకుండ మంట కలిగిన అధికభయము కలుగును. శయ్య వస్త్రము కేశములలో ధూమము, అగ్నిజ్వాల లేక అగ్నికణములు కనపడిన రాజుకు మృత్యువు కలుగును. ఖడ్గాదులలో మంటకలుగుట,చలించుట శబ్దము కలుగుట, అన్యప్రకారమైన వికారము కలుగుట జరిగిన రాజ్యములో శీఘ్రముగా భయంకరమైన యుద్ధము జరుగును.

జిల్లేడు కర్ర, ఆవాలు, నెయ్యితో అగ్నిలో హవనము చేయవలెను. దీని వలన

అశుభ ఫలశాంతి జరుగును. ఈ ఉత్పాతములలో బ్రాహ్మణులకు బంగారమును దానము చేయవలెను. అకస్మాత్తుగా వృక్షశాఖ విరిగిపడిన యుద్ధమునకు ప్రయత్నము, వృక్షములు నవ్విన దేశమునకు నాశము, వృక్షములు రోధించిన వ్యాధి కలుగును.

ఋతువు కాని సమయములో వృక్షములు పుష్పఫలములను ఉత్పత్తి చేసిన రాజుల మధ్య విభేదము, చిన్నవృక్షముపై అధికముగా పూవులు పూసిన బాలురకు నాశము, వృక్షముల నుండి పాలు కారిన ద్రవ్యములకు నాశము కలుగును. వృక్షముల నుండి మద్యము బయటికి వచ్చిన వాహననాశము, రక్తము వచ్చిన యుద్ధము, తేనె వచ్చిన రోగము, నూనె వచ్చిన దిర్భిక్షము భయము, వృక్షముల నుండి నీరు వచ్చిన అధికభయము కలుగును.

ఎండిన వృక్షముల నుండి చిగురు ఏర్పడిన, శక్తి క్షీణించును. అన్నమునకు నాశము కలుగును. క్రిందపడిన వృక్షములు వాటికవే పైకి లేచిన దైనజనితమైన భయము కలుగును. ప్రధాన వృక్షములో పుష్పఫలముల ఉత్పత్తి రాజుకు నాశము ఆవృక్షముపై ధూమము లేక అగ్నిజ్వాల కూడ రాజుకు నాశనము కలిగించును. వృక్షములు చలించిన లేక వాటి నుండి శబ్దము బయటకు వచ్చిన మనుష్యులకు నాశము కలుగును. అన్ని వృక్షముల వికారము వలన కలుగు ఫలము పదిమాసములలో కలుగును.

ఈ ఉత్పాతములలో సుగంధ ద్రవ్యము, ధూపము వస్త్రములతో పూజించు వికృతరూపమైన వృక్షముపై ఛత్రమునుంచి ఏకాదశ రుద్రుల మంత్రములతో జపమును చేయవలెను. **"రుద్రేభ్యః స్వాహా"** ఈ మంత్రముతో ఆరుమార్లు హవనము చేయవలెను. నెయ్యితో కూడిన పాయసముతో బ్రాహ్మణులకు భోజనము చేయించవలెను. ఈవృక్ష వికారముతో పుట్టిన ఉత్పాతములో ప్రాణులహితమును కోరు మునులు భూమిని దానము చేయవలెనని తెలిపిరి.

కమలము, యవలు, ఒకనాలములో రెండు మూడు ఉత్పన్నమైన క్షేత్రాధిపతికి మరణము కలుగును. కమలపుష్పములు ఫలముల ఉత్పత్తి జరిగినను అధిపతికి మరణము కలుగును. ధాన్యములకు అధికవృద్ధి, ఒకే వృక్షములో అనేక విధములైన ఫలములు పుష్పములు ఉత్పన్నమైన నిశ్చయముగా పరదేశపు రాజు ఆగమనము కలుగును.

నువ్వుల పరిమాణములో సగము నూనె వచ్చిన, లేక కొంచెము కూడరాకున్న, అన్నము వికారయుక్తముగా నున్న అతిభయము కలుగును. వికారయుక్తమైన పుష్పములు ఫలములను గ్రామమునకు దూరముగా నుంచవలెను. సోమదేవునికి చరు(హవనము కొరకు వండు అన్నము)వును తయారు చేయవలెను. శాంతికొరకు మేకను దానము చేయవలెను. ధాన్యములందు పూర్వోక్త వికారము కనపడిన వెంటనే ఆభూమిని బ్రాహ్మణునికివ్వవలెను. అదే క్షేత్రములో పార్థివ చరువును తయారు చేసిన భూమి వలన

ఉత్పన్నమగు దోషము తొలగును.

అనావృష్టి వలన దుర్భిక్షము, అతివృష్టి వలన దుర్భిక్షము శత్రుభయము, వర్షఋతువుకు భిన్నమగు ఋతువులో వర్షము కురిసిన రోగము, మేఘములు లేకుండ వర్షము కురిసిన రాజుకు మృత్యువు కలుగును. చలికాలములో వేడి ఉష్ణకాలములో చలి, అదేవిధముగా ఋతుధర్మము నకు వ్యతిరేకముగా జరిగిన ఆరుమాసముల తర్వాత దేశమునకు భయము, దైవజనిత (పూర్వజన్మ పాపము వలన కలుగు)రోగభయము కలుగును. వర్షఋతువు కన్న భిన్నఋతువులో ఒకవారము వర్షము కురిసిన ప్రధానరాజుకు మరణము, రక్తవర్షము కురిసిన యుద్ధము, మాంసము ఎముకలు మసాదులు(నెయ్యి నూనె) కురిసిన మరణము (మహామారి)కలుగును. ధాన్యము బంగారము వృక్షపు బెరడు ఫలములు పుష్పములు మున్నగు వాని వృష్టి కలిగిన భయము, బొగ్గులు దుమ్ము వర్షించిన నగరమునకు నాశము కలుగును.

మేఘరహిత ఆకాశములో పగలు లేక రాత్రి ఇంద్రధనుస్సు తూర్పు లేక పశ్చిమదిశలో కనిపించిన అధిక దుర్భిక్షము కలుగును. సూర్యుడు చంద్రుడు మేఘము వాయుసంబంధమైన ఉత్పాతములు జరిగినపుడు యజ్ఞము చేయవలెను. శాలిధాన్యము భోజ్యన్నము ఆవు బంగారము బ్రాహ్మణులకు దక్షిణగానీయవలెను. అప్పుడు పాపమునకు శాంతి కలుగును.

నగర మధ్యలో లేక దగ్గరలో ప్రవహించుచున్న నదులు దూరముగా వెళ్ళిన, లేక ఎండిపోయిన, నగరము జనులు లేక శూన్యనగరమగును. నదులలో నూనె రక్తము మాంసము ప్రవహించిన లేక జలము మలినమైన ఆరుమాసములలో ఇతర రాజుల ఆగమనము జరుగును.

కూపములో అగ్నిజ్వాల పొగ, నీరుమరుగుట ఏడుపు శబ్దము,గీతము లేక వేరే విధమైన శబ్దము, ప్రజల మృత్యువు కొరకు కలుగును.

త్రవ్వకుండ భూమి నుండి జలము వచ్చుట జలగంధము మరియు రసములలో మార్పు జరుగుట జలాశయములలో వికారము కలుగుట వలన అగ్నిభయము కలుగును. దీనిశాంతి విధానము ముందు తెలుపబడును.

జలము వికారమైన వరుణమంత్రములలో పూజ జపము హవనము చేయవలెను. ఈ విధముగా చేసిన అశుభఫలము నివారణమగును. స్త్రీలకు ప్రసవవికారము కలిగిన లేక ఒకేసారి ఇద్దరు ముగ్గురు నలుగురు పిల్లలు కలిగిన లేక ప్రసవకాలమునకు ముందుకాని లేక ఆలస్యముగా గాని ప్రసవము జరిగిన దేశమునకు కులమునకు నాశనము కలుగును.

ఆడగుర్రము ఒంటె గేదె ఆవు ఏనుగులకుఒకేసారి రెండుపిల్లలు కలిగిన గుర్రము

మున్నగువాటికి నాశముకలుగును. ఆరుమాసముల తర్వాత ప్రసవవికార ఫలము కలుగును. వాటి శాంతి కొరకు ముందు గర్గుడు తెల్పిన రెండు శ్లోకములివ్వబడినవి.

"తనహితము కోరుమనుష్యుడు వికారయుత స్త్రీలను ఇతర దేశములలో వదలి రావలెను. బ్రాహ్మణులను ప్రసన్నులను చేసికొనవలెను. ఈఉత్పాతములకు శాంతి చేయవలెను. వికారయుత జంతువులకు వాటి సమూహముల నుండి వేరుచేసి ఇతర స్థానములలో వదలిరావలెను. లేనియెడల నగరము, నగరస్వామి, జనసమూహము నాశనము పొందును."(శ్లోకభావము)

ఒకజాతి పశువు వేరొక జాతి పశువుతో మైథునము జరిపిన ఆవు ఎద్దు పరస్పరము ఒకదాని కొకటి స్తనములను త్రాగిన మూడుమాసముల తర్వాత తప్పక పరరాజుల ఆగమనము కలుగును. దీనివివరణ కొరకు ముందు గర్గుడు తెల్పిన రెండు శ్లోకములున్నవి.

"వికారయుత పశువులను వదలిపెట్టుట లేక వేరొక చోట ఉంచుట చేసిన చతుష్పద ఉత్పాతములకు శాంతి జరుగును. ఈ ఉత్పాతములలో బ్రాహ్మణులను సంతుష్టి పరచి జపహవనములను చేయవలెను. చరు పశు ప్రజాపత్య మంత్రములతో బ్రహ్మ యజ్ఞమును చేయవలెను. అన్నమును దక్షిణగానియ్యవలెను."(శ్లోకభావము)

వాహనముల నుండి అశ్వాదులు దూరముగా పరిగెత్తిన, వాహనముతో కూడి వెళ్ళకున్న లేక రథచక్రము భూమిలో దిగబడిన లేక విరిగిన దేశమునకు భయము కలుగును. ఆకాశములో గీతము తూర్యనాదములు వినపడిన స్థిరపదార్థములు చరములై, చరపదార్థములు స్థిరములై కనపడిన మరణము రోగము కలుగును. తూర్యనాదము వికారయుత శబ్దములు కలిగిన శత్రువుల వలన పరాజయము కలుగును.

మ్రోగించ కుండ తూర్యనాదము వినపడిన మ్రోగించినపుడు శబ్దము రాకున్న అనేక విధములైన శబ్దములు వచ్చిన శత్రురాజుల ఆగమనము రాజుకు మరణము కలుగును. ఎద్దులకు నాగలికి అనుకోకుండ సంయోగము కలిగిన, గరిటె చేట మున్నగు గృహవస్తువులలో వికారము లుత్పన్నమైన, నక్క వికారయుతశబ్దము చేసిన భయము కలుగును. ఇదిముని వచనము.

ముందు తెల్పిన వికారములలో పేలపిండితో వాయుదేవతను పూజించవలెను. నియమముతో బ్రాహ్మణుడు **"ఆవాయో:"**ఇత్యాది ఐదు మంత్రములతో జపము చేయవలెను. పాయసముతో బ్రాహ్మణులను తృప్తిపరచి ప్రయత్నపూర్వకముగా అధిక అన్నమును దక్షిణగా నిచ్చి హవనము చేయవలెను.

వనములో నుండు పక్షివనములో వనములో నుండు పక్షి వనములో ప్రవేశించిన లేక పగలుచరించు పక్షిరాత్రిలో, రాత్రిచరించు పక్షి పగలు చరించిన మరియు సూర్యోదయ

అస్తమయ సమయములలో వనములో నుండు పశుపక్షులు మండలాకారముగా కూర్చొన్న లేక అన్ని కలిసి ఒక్కసారిగ అధిక శబ్దములు చేసిన భయము కలిగించునవగును. డేగ ఏడుస్తు కనపడిన, సూర్యునివైపుకి ముఖముపెట్టి నక్కపురద్వారము దగ్గర శబ్దము చేసిన, రాజభవనములో పావురము గుడ్లగూబ ప్రవేశించిన భయమును కలిగించును.

సూర్యాస్త సమయములో కోడి, హేమంత ఋతువులో కోకిల కూసిన, ఆకాశములో డేగ మున్నగు మాంస భక్షణము చేయు పక్షులు వృత్తాకారముగా ప్రదక్షిణముగా నడచిన భయమును కలిగించును. గృహము ప్రధానవృక్షము, పురద్వారము లేక గృహద్వారముపై పక్షుల సముదాయము తిరిగిన, గృహములపై తేనెపట్టు పుట్ట కమలముల ఉత్పత్తి నాశనము చేయుటకగును.

కుక్క ఎముకను లేక శశాంగమును గృహములోనికి తెచ్చిన మరణము కలుగును. పశువులు శస్త్రము మనుష్యులవలె పలికిన రాజుకు మృత్యువు కలుగును. మృగములు పక్షులకుపూర్వోక్త వికారములు కలిగిన దక్షిణతో పాటు హవనము చేయవలెను. ఐదుగురు బ్రాహ్మణులతో **"దేవా: కపోత"** ఇత్యాది మంత్రములు ఒక బ్రాహ్మణుని ద్వారా **"సుదేవా"** ఇత్యాది మంత్రమును జపము చేయించవలెను. దక్షిణతో పాటు గోదానము చేయవలెను. శకునసూక్తము లేక **"వేదశిరాంశి"** ఇత్యాది మంత్రములతో జపము చేయవలెను.

ఇంద్రధ్వజము, ఇంద్రకీలము, స్తంభ ద్వారము పడిన లేక విరిగిన అదే విధముగా ద్వారము తోరణము ధ్వజము పడిన లేక విరిగిన రాజుకు మరణము కలుగును. రెండు సంధ్యలలో అధికకాంతి కలుగుట, వనము లేక అగ్నిరహిత స్థానములో పొగ ఉత్పన్నమగుట, గట్టి భూమి పగులుట లేక కంపించుట జరిగిన భయము కలుగును.

పాఖండుడు నాస్తిక జనుల భక్తుడు, సజ్జన హీనుడు, క్రోధము కలిగినవాడు, ఈర్ష్యకలిగినవాడు, దుష్టుడు ఎల్లప్పుడు యుద్ధము చేయుటకు ఇచ్ఛకలిగిన రాజు తన దేశమునకు హాని కలిగించు వాడగును. ఏస్థానములో శస్త్రము, కర్ర, రాయిచేతిలో తీసుకొని కొట్టు, లాగు, నరుకు, విరగగొట్టు ఇటువంటి మాటలతో బాలకగణము ఒకరితో ఒంకొకరు దెబ్బలాడుతున్న ఆస్థానములో శీఘ్రముగా భయము కలుగును. ఏ ఇంటిలో గోడపై బొగ్గు మరియు ఎర్రమన్ను రంగుతో వికృతముగా మరణించిన పురుషుల చిత్రములు చిత్రించిన లేక బొగ్గుతో చిత్రించిన గృహస్వామి చిత్రము కనిపించిన అక్కడ శీఘ్రముగా నష్టము కలుగును.

మొసలి వలలతో కూడినది, రెండు సంధ్యలలో దేవతల పూజలు చేయబడనిది, ప్రతిరోజు కలహముతో అపవిత్రస్త్రీలతో కూడినదైన గృహము నాశనమగును. ప్రత్యక్షముగా రాక్షసుడు కనపడిన వెంటనే అంటువ్యాధులు వ్యాపించును. పూర్వోక్త ఉత్పాతముల నాశనము కొరకు గర్గముని ముందు తెల్పిన విధముగా శాంతిని తెల్పెను. పూర్వోక్త ఉత్పాతములకు

అధికశాంతిని చేయవలెను. బలిని అధిక భోజ్యమును చేయవలెను. ఇంద్రునికి ఇంద్రాణికి అధికపూజ చేయవలెను.రాజవినాశము దేశమునకు విపత్తి ,కేతు ఉదయము, సూర్యచంద్ర గ్రహణ సమయములో జరుగు ఉత్పాతములు ముందుతెల్పిన విధముగా ఋతువులో ఉత్పన్నమగు ఉత్పాతములు ఫలరహితములగును. ఏ ఉత్పాతములు ఋతుస్వభావ జన్యదోషములను ఉత్పన్నము చేయవో వాటిని ఋషి పుత్రుడు తెల్పిన శ్లోకముల ద్వారా సంక్షేపముగా తెలిసికొనవలెను.

వజ్రము (మెరుపు), అశని(ఉల్కాపాతము), భూకంపము, దీప్తసంధ్య, నిర్ఘాతము, శబ్దము, సూర్యచంద్ర పరివేషము, ధూళి, ధూమము, రక్తవర్ణపు సూర్య ఉదయాస్తమయము, వృక్షములతో భోజనము మధురాదిరసము, నూనె మున్నగువాటి ఉత్పత్తి, గోవులు పక్షులలో కామవృద్ధి ఈ ఉత్పాతములు చైత్ర వైశాఖ మాసములలో కల్యాణకారులగును.

ఉల్కాపాతముతో కూడిన ఆకాశము,సూర్యచంద్రుల కపిల(గోరోజనము)వర్ణము, అగ్నిలేకుండ జ్వాలాశబ్దము,ధూపము, ధూళి వాయువులతో రక్తకమలము వలె లోహిత వర్ణము కలిగిన సంధ్య, తరంగయుత సముద్రము వలె ఆకాశము, నదుల జలము ఎండుట – ఈ ఉత్పాతములు గ్రీష్మ(జ్యేష్ఠ ఆషాఢ)ఋతువులో శుభమును కలిగించును.

ఇంద్రధనుస్సు, సూర్యచంద్రుల పరివేషము,మెరుపు,ఎండిన వృక్షములు చిగురించుట, పృథ్వికంపించుట,పరివర్తనము, స్వరూపము మారుట,పగులుట, సరోవరములు పెరుగుట నదులు పొంగుట,వాపీకూప తటాకములో నీరు అధికముగా నుండుట,పర్వతములు గృహములు చలించు నట్లుండుట–ఈ ఉత్పాతములు వర్షఋతువు (శ్రావణ భాద్రపద)లో శుభమును కలిగించును.

దివ్య స్త్రీ గంధర్వ విమానములు ఆశ్చర్యజనక వస్తువుల దర్శనము పగలు గ్రహ నక్షత్రముల దర్శనము, పర్వతములలో గీతవాద్యముల ధ్వని, ధాన్యవృద్ధి, జలమునకు హాని – ఈఉత్పాతములుశరదృతువు(ఆశ్వయుజము కార్తీకము)లో శుభమును కలిగించును.

వాయువు మంచులలో చల్లదనము,మృగములు పక్షుల శబ్దము,రాక్షస యక్షాది ప్రాణుల దర్శనము, మనుష్యులు లేకుండ ధ్వని, అంధకారయుతమైన ఆకాశము, వనపర్వత దిశలలో పైభాగములో సూర్యోదయ అస్తమయములు జరుగుట – ఈఉత్పాతములు హేమంతఋతువు (మార్గశిరము పుష్యము)లో శుభప్రదమగును.

హిమపాతము వాయుసంబంధ ఉత్పాతము, భయానక ప్రాణుల దర్శనము, నల్లనికాటుకవలె రాత్రులు ఉల్కాపాతముతో ఆకాశము, స్త్రీల గర్భము నుండి వివిధప్రాణుల ఉత్పత్తి, ఆవు, మేక,గుర్రము,మృగము,పక్షుల గర్భము నుండి విజాతీయప్రాణుల ఉత్పత్తి పత్రలతాంకురములతో వికారము– ఈ ఉత్పాతములు శిశిరఋతువు (మాఘము పాల్గుణము)లో శుభప్రదమగును.

ఋతుస్వభావ జనిత ఉత్పాతములు ఆఋతువులో శుభఫలము నిచ్చును. అన్య ఋతువులలో కనపడిన కష్టమును కలిగించును. పిచ్చివాళ్ల పాటలు, బాలుర వచనములు, స్త్రీల పలుకులకు వ్యతిరేకముగా జరుగదు. వారు పలికినది సత్యమగును.

ప్రేరణ రహితముగా పలికే ఈసత్యస్వరూపమైన సరస్వతి పలుకు మొదట దేవతలలో సంచారము చేసేది. తర్వాత మనుష్యులకు ప్రాప్తించినది. గణితము తెలియని మనుష్యుడు కూడ పూర్వోక్త ఉత్పాతములను తెలిసికొని గౌరవనీయుడు రాజుకు ప్రియుడు అగును. ఈ ఋషివచనము గోపనీయముగా చెప్పబడినది. ఇది తెలిసిన మనుష్యుడు త్రికాల దర్శియగును.

నలుబది ఆరవ ఉత్పాతాధ్యాయము సమాప్తము

47. మయూర చిత్రకాధ్యాయము

నేను ముందుగ గ్రహచారము, చంద్రసమాగమము, యుద్ధము, వీధి ప్రసంగములో, దివ్య అంతరిక్షముల నాశ్రయించి ఫలితమును విస్తార పూర్వకముగా తెల్పితిని. ఇప్పుడదే విషయమును సంక్షేపముగా తెలుపుట ఉచితముకాదు. పునరుక్త దోషమగును. పండితులీవిధముగా తెలుపరాదు. బర్హిచిత్రక నామకప్రకరణము సంహితము లో ప్రసిద్ధ అంగముగా నున్నది. పునరుక్త ఫలమును చెప్పుట వలననే ఈ మయూర చిత్రకపు నిజస్వరూపము తెలియును. అనగా పూర్వము ఫలితమును చెప్పినప్పటికి ఇక్కడ మయూరచిత్ర విషయము తీసుకొని దాని ఫలవర్ణన చేయుట ఉచితముగా నుండును. అందువలన నేను తిరిగి చెప్పక పోవుట వలన నాకు నిందకలుగును.

ప్రకాశవంతమైన గ్రహము ఉత్తరవీధిలో (నాగ గజ ఐరావత సంజ్ఞక వీధులు) ప్రయాణము చేసిన క్షేమము, సుభిక్షము, కల్యాణకారియగును. ప్రకాశహీనమై దక్షిణ మార్గములో (మృగ అజ దహన సంజ్ఞకవీధి) ప్రయాణము చేసిన దుర్భిక్షము, దొంగల భయము, మృత్యువు కలుగును.

మఘా నక్షత్రములో శుక్రుడు, పుష్యమి నక్షత్రములో గురుడున్నచో రాజులు పరస్పరము ద్వేషరహితులై సుఖముగా నుందురు. ప్రజలు ప్రసన్నులు రోగరహితులగుదురు. సూర్యుని వదిలి (చంద్రాది)అన్యగ్రహములు కృత్తిక మఘ రోహిణి శ్రవణ జ్యేష్ఠ నక్షత్రములను పీడించిన పశ్చిమదిశ పీడింపబడును.

సంధ్యా సమయములో చంద్రాది గ్రహములు ధ్వజమువలె పూర్వదిశలో కనపడిన పూర్వదిశలోనున్న రాజులలో పరస్పరముయుద్ధము జరుగును. ఆకాశమధ్యములో కనపడిన మధ్యదేశములో పీడకలుగును. చంద్రాది గ్రహములు స్థిరముగా నున్న ఫలితము కలుగును. నిర్మలము సుందరమైన కిరణములు కలిగిన పూర్వ లేక మధ్యదేశములకు

పీడ కలుగును.

చంద్రాది గ్రహములు దక్షిణదిశలో నున్న దక్షిణదిశలో మేఘములను నాశనము చేయును. ఈ గ్రహములు అల్పబింబములతో రూక్ష (కఠినము)మైన విగ్రహము (యుద్ధము) స్థూలబింబమై కిరణయుక్తమైన శుభము కలుగును. చంద్రాదిగ్రహములు స్పష్టమైన కిరణములు కలిగి ఉత్తరమార్గములో నున్న, ఉత్తరదిశలో నున్న రాజులలో శాంతిని కలిగించును. అల్పబింబమైన లేక భస్మసమాన వర్ణమైన ఆదేశములో నున్న రాజులలో ద్వేషముత్పన్నమగును.

గ్రహనక్షత్రముల తారలు ధూమజ్వాల లేక అగ్నికణములతో వ్యాప్తమైన లేక అకారణముగా ప్రకాశరహితముగా కనిపించిన ఆదేశములో నున్న రాజుతో పాటు ప్రజలకు కూడ నాశనము కలుగును. ఆకాశములో రెండు చంద్రులు కనిపించిన సమయములో బ్రాహ్మణులకు వృద్ధి శుభము కలుగును. ఇద్దరు సూర్యులు కనిపించిన క్షత్రియుల మధ్యయుద్ధము జరుగును. ముగ్గురు నలుగురు సూర్యులు కనిపించిన ప్రపంచము నాశనమగును.

కేతువు సప్తర్షిమండలము, అభిజిత్ నక్షత్రము ధ్రువతార లేక జ్యేష్ఠ నక్షత్రమును స్పర్శించిన మేఘములకు నాశము, అమంగళము, కర్మలకు హాని, శోకము కలుగును. ఆశ్లేషా నక్షత్రమును స్పర్శించిన నిశ్చయముగా వర్షనాశము ఆకలి దప్పిక మున్నగు పీడలతో బాలురతో పాటు ప్రజలు అక్కడ నుండి అన్యస్థానమునకు వెళ్తూ నష్టపోదురు.

శని కృత్తికాది ఏడు నక్షత్రములో వక్రియై ప్రయాణించిన దుర్భిక్షము, మిత్రుల మధ్య విరోధము అనావృష్టి కలుగును. రోహిణి నక్షత్రమును శని కుజ కేతువులు భేదించిన అమంగళము ఏమి చెప్పగలను? ప్రపంచము కష్టసాగరములో పడి నశించును. నాలుగువైపుల అమంగళములే కనబడును. కేతువు కనపడు సమయములో సంపూర్ణ నక్షత్ర మండలములో ప్రయాణించిన సమయములో సంపూర్ణ జగత్తు నిరంతరము తమ పూర్వజన్మార్జిత పాపఫలము ననుభవించును.

చంద్రుడు ధనుషాకారముతో రూక్షమై రక్తవర్ణముతో కనపడిన దుర్భిక్షము సేనల మధ్య పరస్పరయుద్ధ భయము కలుగును. చంద్రుని జ్యా ఏవైపున ఉండునో ఆవైపు నున్న రాజులకు విజయము కలుగును. గో శృంగమువలె, చంద్రశృంగమున్న గోవులకు ధాన్యమునకు నాశము కలుగును. ప్రజ్వలించుచున్న ధూమము వలె కనపడిన రాజులకు మరణము కలుగును.

స్నిగ్ధము (నునుపు) స్థూలము(లావు)సమాన శృంగము, విశాలము ఉన్నతమై ఉత్తరదిశ నాగవీధిలో నున్న చంద్రుడు శుభగ్రహములతో చూడబడిన, పాపగ్రహములతో కూడి యుండకున్న ప్రజలకు అధిక ఆనందము కలుగును. చంద్రుడు మఘ, అనూరాధ,

జ్యేష్ఠ,విశాఖ, చిత్త నక్షత్రములలో దక్షిణదిశలో ప్రయాణము చేసిన అశుభము. ఉత్తర మధ్య మార్గములలో ప్రయాణించిన శుభము కలుగును.

సూర్యోదయ లేక అస్తమయ సమయములో మేఘరేఖ, పరిఘ సంజ్ఞకము, ప్రతిసూర్యుడు పరిధి సంజ్ఞకము, ఇంద్రధనుస్సు సమానరేఖ దండక సంజ్ఞక మగును. ఉదయాస్త సమయములో సూర్యుడు పొడుగు కిరణములు అమోఘ సంజ్ఞకము, ఇంద్రధనుసు ఖండము రోహిత సంజ్ఞకము, పొడవుగా నిటారుగా నున్న ఇంద్రధనుసు ఐరావత సంజ్ఞకమగును. అర్ధాస్తమయ సూర్యబింబ సమయములో తారలు కనిపించు వరకు పశ్చిమ సంధ్య, తారలు ప్రకాశహీనమగు సమయములో అర్ధోదిత సూర్యబింబ కాలము ప్రాక్సంధ్యయగును. ఈ సంధ్యా సమయములో వక్ష్యమాన చిహ్నముల వలన శుభాశుభ ఫలమును తెలుపవలెను. ఆకాశములో నున్న సూర్యబింబము స్నిగ్ధమైన వెంటనే వర్షము, రూక్షమైన భయము కలుగును.

అఖండిత పరిఘ, నిర్మల ఆకాశము, సూర్యుని శ్యామవర్ణ కిరణములు, స్నిగ్ధ దీధితి, శ్వేతవర్ణపు ఇంద్రధనుసు, పూర్వోత్తరవిద్యుత్తు స్నిగ్ధమైన సూర్యకిరణములతో వ్యాపించిన మేఘ వృక్షమున్న వర్షము కురియును. సాయంకాలములో పెద్దమేఘము సూర్యబింబమును ఆచ్ఛాదనము చేసిన వర్షముకురియును. ఖండితము,కుటిలము, కృష్ణము, స్వల్పము, కాకాది పక్షుల చిహ్నములతో వ్యాప్తము లేక రూక్షమై సూర్యబింబము కనపడిన ఆదేశపు రాజుకు నాశనము కలుగును.

యుద్ధమన్న కోరిక కలిగిన రాజు సేనలకు వెనుక మాంసమును తిను పక్షి సమూహము ప్రయాణము చేసిన ఆరాజు సేనలు యుద్ధమునుండి పరిగెత్తవలసి వచ్చును. పక్షిగణము సేనలకు ముందు ప్రయాణించిన యుద్ధములో విజయము కలుగును. సూర్యోదయము లేక అస్తమయములో పతాకయుతమైన గంధర్వ నగరపు ప్రతిమ సూర్యబింబమును కప్పివేసిన రాజుకు భయంకర యుద్ధము ప్రాప్తించునని చెప్పబడినది.

సంధ్యాకాలములో సూర్యునికి విరుద్ధదిశలో ముఖముపెట్టి పక్షిగణము అడవిజంతువులు మధురశబ్దము చేసిన, నిర్మలమైన వాయువు వీచిన శుభము కలుగును. ధూళి వ్యాపించిన, రూక్షమైన లోహితవర్ణమైన సంధ్య కనపడిన దేశమునకు నాశనము కలుగును. గర్గాదిమునులు విస్తారపూర్వకముగా తెల్పిన విషయములు పునరుక్త దోషమైనప్పటికి ఆవిషయములను మయూరచిత్రనామక అధ్యాయములో నేను తెలిపితిని. దుర్జనజనులు ఈవిషయమును తెలిపినప్పటికి నాకు హాని కలగదు. కోకిల కూతను విని కాకి శబ్దము చేసినప్పటికి అది స్వాభావిక శబ్దమేయగును కాని కోకిలను జయించవలెనను కోరికతో కాదు.

నలుబది ఏడవ మయూరచిత్రక నామాధ్యయము సమాప్తము

48. పుష్యస్నానాధ్యాయము

ఈ ప్రపంచములో ప్రజారూప వృక్షమునకు మూలస్వరూపుడు రాజు. ఆ రాజుకు కష్టము కలిగిన ప్రజలకశుభము. సంస్కారము వలన శుభము కలుగును. అందువలన రాజు వృద్ధి పొందవలెనని తలంచవలెను. ఇంద్ర శాంతి కొరకు బ్రహ్మ బృహస్పతితో హితార్థమును తెలిపెను. అదే విషయమును వృద్ధగర్గాచార్యుడు భాగురితో తెలిపెను. అదే విషయము శాంతి కొరకు వినుము. శ్లేష్మాత్మకము(ఔషధ వృక్షము) అక్ష(తాండ్ర) కంటకి (ముళ్ల వృక్షము) కటు(చేదు)తిక్త (దొండాది) దుర్గంధ యుత వృక్షములు లేనిది. గుడ్లగూబ గద్ద ఆది అశుభకారక పక్షులు లేనిది, నూతన వృక్షములు గుల్మములు లతల సముదాయముతో కూడినది, పత్రపల్లవములు (ఆకులు చిగుళ్లు) సుందరమైన మధురమైన వృక్షముల సముదాయముతో కూడినదైన వనసమీపములో రాజు పుష్యస్నానము చేయవలెను.

కోడి, తిత్తిరపక్షి, చిలుక, నెమలి, శతపత్రము, నీలకంఠము, పచ్చపిట్ట, క్రకరము, చకోరము,కపింజలము,వంజులము,పావురము – ఈ పక్షుల శబ్దములు పూవులరసాస్వాదనముతో మత్తిల్లిన భ్రమరములు, శ్రేష్ఠకోలలు, అన్యసుందర పక్షుల శబ్దములతో కూడిన వనసమీపములో శుద్ధపుష్యస్నాము చేయవలెను.

జలచర పక్షుల రూప నక్షత్రములు కన్నులకు మనసుకు ఆనందదాయకమైన నదీరూప కామినుల తటరూప సుందరమైన తొడలపై పుష్యస్నాము చేయవలెను. ఎగురతున్న హంస రూపఛత్రముతో సంపన్నమైన కారండవము (బాతులగుంపు) కురర సారసాది పక్షుల ధ్వనిరూప సంగీతము,కమలములువలె విరిసిన నేత్రములలో సంపన్నము, ఇంద్ర సదృశమైన శుభయుక్త నదుల ఒడ్డున పుష్యస్నానము చేయవలెను.

వికసించిన కమలరూప ముఖము కలిగినది, రాజహంసవలె మధురధ్వని కలిగినది, కమలపు మొగ్గల వంటి ఉత్పన్నమైన స్తనములు కలిగినదైన పుష్కరరూప స్త్రీ జంఘలపై (ఒడ్డుపై)పుష్యస్నానము చేయవలెను. ఆవులు నెమరు వేయుట వలన పడిన నురుగు,కొమ్ములతో కొట్టబడిన పేడ,దూడల హుంకారములు, గంతులతో కూడిన ఉత్సవ యుతమైన గోశాలస్థానములో పుష్యస్నానము చేయవలెను.

విఘ్నరహితమై రత్నములతో సంపన్నమైనది. దట్టమైన వృక్షములపై ఎగురు జలచరములు, తెల్లని పక్షులతో చిత్రితమైన దైన సముద్ర తటముపై పుష్యస్నానము చేయవలెను. హరిణి (లేడి) సింహములు సహజీవనము చేయుచున్న అభయదానమును పొంది పక్షులు మృగముల పిల్లలు భయరహితముగా తిరుగుతున్న మునుల ఆశ్రమములో పుష్యస్నానము చేయవలెను.

ఒడ్డాణములు నూపురములు గురుజఘనము (బరువైన తొడలు)లతో మందగతితో, కోయిలవలె మధుర శబ్దములతో, మృగనయనములు కలిగిన స్త్రీలతో, సుందరమైన గృహములో పుష్యస్నానము చేయవలెను. పవిత్ర దేవస్థానము, తీర్థము, జలాశయము, సుందరదేశము, పూర్వఉత్తరములందు పల్లపుభూమి, ప్రదక్షిణ క్రమములో ప్రవహించు నీరున్న స్థానములో పుష్యస్నానము చేయవలెను.

భస్మము,బొగ్గులు,ఎముకలు,ఊషరభూమి,(చవుడుభూమి) బూడిద, కేశములు, గోతులు, ఎండ్ర కాయ,కలుగులో ఉండు జంతువులు (ఎలుక మున్నగునవి) చెదలు లేకుండ ఉన్న భూమి, సారవంతము సుగంధయుక్తము, నిర్మలము,మధురము,సమమైన భూమి విజయమును కలిగించును. సేనల నివాసము కొరకు పూర్వోక్తభూమిని యుక్తి పూర్వకముగా నుపయోగించవలెను.

దైవజ్ఞుడు,మంత్రి,యాజ్ఞికుడు, (యజ్ఞము చేయువాడు) రాత్రిలో పట్టణము నుండి వెడలి పూర్వోక్తస్థానములో పూర్వఉత్తర ఈశానకోణములలో పురోహితుడు పాయసము అక్షతలు పెరుగు పుష్పములతో బలినివ్వవలెను. తరువాత మునులు తెల్పిన ఆవాహన మంత్రములను చదువవలెను.

పూజకు యోగ్యులైన దేవతలు దిశ నాగ బ్రాహ్మణ అన్యఅంశ భోగీ గణములు ఇక్కడకు రావలెను. ఈ విధముగా పురోహితుడు ఆవాహన చేసి వక్ష్యమాన రూపముతో ప్రార్థన చేయవలెను. మీరందరు ఆగామిప్రాత:కాలములో పూజను స్వీకరించి రాజుకు శాంతిని ప్రసాదించి వెళ్ళవలెను. ఆహ్వానించిన దేవతాదులను పూజించి అందరు (దైవజ్ఞుడు మంత్రి యాజ్ఞికుడు) అక్కడ రాత్రి గడపవలెను. రాత్రిలో కనపడిన స్వప్నము ననుసరించి శుభాశుభ ఫలము తెలిసికొనవలెను. దీనిని తెలుసుకొను విధానము యాత్రానామక గ్రంథములో చెప్పబడినది.

రెండవరోజు ప్రాత:కాలము ఆప్రదేశమునకు వెళ్ళి చెప్పబడిన గుణముతో కూడిన వస్తువులను ఒకచోట చేర్చవలెను. ఇక్కడ ముని గర్గుడు తెల్పిన శ్లోకములు తెలుపబడినవి.

పూర్వోక్త లక్షణయుత భూప్రదేశములో ఒకమండలము తయారుచేసి అనేక విధములైన రత్నముల సముదాయయముతో కూడిన భూమిని ఇతరస్థానములను కల్పన చేయవలెను. తర్వాత పురోహితుడు ప్రాధాన్యతా క్రమముగా నాగ యక్ష దేవ గంధర్వ అప్సర ముని సిద్ధులను స్థాపనచేయవలెను. అశ్విన్యాది నక్షత్రములతోపాటు గ్రహములు, బ్రహ్మాదులతోపాటు రుద్రుడు, కార్తికేయుడు, విష్ణువు, విశాఖుడు, లోకపాలుడు, ఇంద్రాణి, లక్ష్మి, గౌరి, ఆది స్త్రీదేవతలను మనసుకు ప్రసన్నత కలిగించు సుగంధయుతముగా వివిధ ద్రవ్యములు పుష్పమాల చందనము భోజ్యాన్నము, వివిధఫలములు మూలములు

మాంసము వివిధ రకములైన త్రాగేవస్తువులు మద్యము పాలు ఆసనము(ఫలములతో చేయు మద్యము)లతో పూజచేయవలెను.

తర్వాత యజ్ఞములో దేవతల పూజావిధి తెలుపబడును. యాత్రానామక పుస్తకములో గ్రహయజ్ఞ ప్రకరణములో గ్రహముల పూజావిధి తెలుపబడిన విధముగా పూజచేయవలెను. మాంసము అన్నము మద్యము మున్నగువాటితో పిశాచములు దైత్యులు దానవులకు పూజచేయవలెను. అభ్యంజనము(స్నిగ్ధపదార్థము) అంజనము(కాటుక) నువ్వులు మాంసము అన్నముతో తండ్రులకు, సామ యజుర్వేద మంత్రములు సుగంధద్రవ్యములు, ధూపము మాలలతో మునులకు, అమిశ్రిత వర్ణము త్రిమధుర (మధువు నెయ్యి పంచదార)పదార్థములతో సర్పములకు, ధూప ఘృత(నెయ్యి) హవనమాలా రత్నస్తోత్ర ప్రణామములతో దేవవతలకు, సుగంధద్రవ్యములు మాలలు సుందర గంధములతో గంధర్వులకు అప్సరసలకు అన్నివర్ణములతో కూడిన బలులతో శేషాదులకు పూజ చేయవలెను. పూజ మధ్యలో అందరికి కుంకుమతో ఎరుపు చేసిన సూత్రము (దారము) వస్త్రము, ధ్వజము భూషణములు యజ్ఞోపవీతము నీయవలెను.

మండలమునకు పశ్చిమ దిగ్భాగములో వేదిక నిర్మించి దానిపై అగ్నిని స్థాపించవలెను. పొడవైన విరగని గర్భరహిత కుశలను తీసుకొని రావలెను. పాయసము, నెయ్యి,అక్షతలు,పెరుగు, తేనె,ఆవాలు సుగంధ ద్రవ్యములు పుష్పములు ధూపము గోరోచనము అంజనము నువ్వులు ఆఋతువులో ఉత్పన్నమగు మధురఫలములను ఒకచోట చేర్చవలెను. ఈ వస్తువులతో పాటు నెయ్యి పాయసములు ప్రత్యేక మట్టిపాత్రలో నుంచి వేదిక పశ్చిమభాగములో పూజించవలెను. అదే పుష్యస్నానమునకు వేదికగును. దీనికి నాలుగు వైపుల దృఢమైన తెల్లని సూత్రములు కలిగి పాలతో వృక్షపల్లవములతో ఫలములతో నింపిన నాలుగు కలశములను స్థాపించవలెను. వాటిని పుష్పస్నానపు ఔషధములతో కూడిన జలముతో రత్నములతో గర్గమహర్షి తెల్పిన పుష్యస్నాన ద్రవ్యములతో పూజించవలెను.

జ్యోతిష్మతి, త్రియమాణ, అభయ అపరాజిత, జీవ, విశ్వేశరి, పాఠా, సమంగ విజయ, సహ, సహదేవి,పూర్ణకోశ,శతావరి,అరిష్టక,(కుంకుడు)శమి,భద్ర, ఈఔషధములను ముందు స్థాపించిన నాలుగు కలశములలో వేయవలెను. బ్రాహ్మి క్షేమ (గుగ్గులము) అజ (ఔషధ విశేషము) అన్నిబీజములు, పసుపు మంగళద్రవ్యములు దొరికిన వాటినన్నింటిని తేవలెను. అన్ని ఔషధములు అన్నిరసములు, రత్నములు, సుగంధద్రవ్యములు మారేడు మున్నగునవి ప్రశస్త ఔషధములు సువర్ణాది ధాతువులు మాంగలిక ఔషధములు (గోరోజనము, ధర్భలు,ఆవాలు, ఏనుగుమదము) పూర్వస్థాపిత కలశములో వేయవలెను.

ముసలిదై మరణించిన ఎద్దు చర్మమును తీసుకొనిపూర్వాభిముఖముగా

పరచవలెను. దీనితర్వాత లోహిత వర్ణము కలిగిన ఎద్దు ఛిద్రరహిత చర్మమును పరచవలెను. తర్వాత సింహ చర్మము దానితర్వాత పులి చర్మమును పరచవలెను. పుష్యమినక్షత్రములో చంద్రుడున్న సమయములోశుభముహూర్తములో వేదికపై నాలుగు చర్మములను పరచవలెను.

చర్మముపై బంగారము వెండి ఇత్తడి పాలుగారు వృక్షములతో చేసిన సుందర ఆసనము పరచవలెను. భద్రాసనము ఎత్తు మూడు విధములుగా నుండవలెను. ఒకహస్తము ఒకటింపావు హస్తము, ఒకటిన్నర హస్తముండవలెను. మొదటిది మాండలిక రాజుకు శుభమును కలిగించును. రెండవది విజయేచ్ఛ కలిగిన రాజుకు శుభమును కలిగించును. మూడవది చక్రవర్తియైన రాజుకు శుభమును కలిగించును. ఆ భద్రాసనము మధ్యలో సువర్ణము నుంచి మంత్రి,విశ్వాసము గల బంధువులు, పురోహితులు, దైవజ్ఞులు శుభ నామములతో కూడిన పురవాసులతో ప్రసన్నుడైన రాజు కూర్చొనవలెను.

వందిమాగతులు పురవాసులు బ్రాహ్మణుల ద్వారా పలుకబడిన పుణ్యాహ శబ్దములు, వేదధ్వని మృదంగ శంఖ భేరీ మంగళ ధ్వనులతో, అనిష్ట నివారణ జరిగిన రాజు ఆసనముపై కూర్చొనవలెను. కొత్తపట్టు వస్త్రమును ధరించి బలిని సమర్పించిన రాజును కంబలితో కప్పి పురోహితుడు నెయ్యితో కూడిన కలశమును అభిషేకము చేయవలెను. ఎనిమిది,పద్దెనిమిది,నూటెనిమిది,ఎనిమిదివందలు కలశముల ప్రమాణము అధికప్రమాణముతో అధికఫలము నిచ్చును. ఈఘృతాభిషేకములో గర్గముని తెలిపిన మంత్రములు ముందున్నవి.

నెయ్యి తేజస్సు కలిగినది పాపమును నశింపజేయునది. దేవతలకు ఆహారము ఘృతములో లోకము స్థాపింపబడినది. భౌమ (చరాచర) అంతరిక్ష (ఉల్క నిర్ఘాత పవన పరివేశ గంధర్వ ఇంద్రచాప) దివ్య (గ్రహనక్షత్ర) ఉత్పాతములు నేతిని స్పర్శించుటచే నాశనమగును.

దీనితర్వాత పురోహితుడు రాజు శరీరముపై నున్న కంబళి తీసి ఫలపుష్పముతో పుష్యస్థానీయ జలముతో ముందు తెలుపు మంత్రములతో అభిషేకము చేయవలెను.

ఓ రాజా! దేవతలందరు నీకు అభిషేకము చేయుగాక. సిద్ధ పురాతన దేవతలు బ్రహ్మ, విష్ణువు,శివుడు, వాయుగణము, ఆదిత్యుడు, వసువు,రుద్రుడు,వైద్యశ్రేష్ఠుడు, అశ్వినీ కుమారులు, అదితి, దేవమాత, స్వాహా, సిద్ధి, సరస్వతి, కీర్తి, లక్ష్మీ, ధృతి, శ్రీ, సినీవాలీ, కుహూ, దను, సురసా, వినతా, కద్రు, దేవపత్ని, దేవమాత, దివ్య, అప్సరసలు, మున్నగు వారందరు నీకు అభిషేకము చేయుగాక.

అశ్విని ఆది 27 నక్షత్రములు, ముహూర్తము, పక్షము అహోరాత్ర సంధ్యలు సూర్యాది గ్రహములు కలా కాష్ఠ క్షణ లవ వీరందరు కాలపురుషుని శుభ అవయములు

నీకు అభిషేకము చేయుగాక,వీరందరు మిగిలిన వేదవ్రత పరాయణులు శిష్యులు స్త్రీలతో కూడిన తపస్వీ జనులు నీకు అభిషేకము చేయుగాక.

విమానవాహక దేవుడు, మనువు సముద్రుడు నది ప్రధాననాగము, కిన్నరులు, వైఖానసులు, శ్రేష్ఠ బ్రాహ్మణులు, ఆకాశగాములు.స్త్రీలసహిత,సప్తర్షి గణము,సుఖీ, ధ్రువస్థానము,మరీచి,అత్రి, పులహ, పులస్త్య, క్రతు, అంగిర, భృగు, సనత్కుమార, సనక, సనందన, సనాతన,దక్ష, జైగీషవ్య, భగంధర,ఏకత, ద్విత, త్రిత, జాబాలి, కశ్యప, దుర్వాస, దుర్వినీత, కణ్వ, కాత్యాయన, మార్కండేయ,దీర్ఘతప, శున:శేప, విదూరథ, ఊర్వ, సంవర్తక, చ్యవన,అత్రి,పరాశర, ద్వైపాయన, యవక్రీత, సోదర సహిత దేవరాజు,పర్వత వృక్ష లత పుణ్యగృహ ప్రజాపతి, దితి, గోవు, విశ్వమాతలు, దివ్యవాహనము, చరాచరలోకములు, అగ్ని,పితర, తార, మేఘ, ఆకాశ, దిశ, జల, ఇవన్ని మరియు పవిత్రమైన కీర్తి కలిగినవి. మిగిలినవన్ని ఉత్పాతములను నాశనము చేయునవి. పవిత్రజలముతో ప్రసన్న చిత్తముతో ఇంద్రునికి అభిషేకము చేసినట్లుగా నీకు అభిషేకము చేయుగాక.

ఈ మంత్రముతో పాటు అథర్వకల్పములో తెల్పిన మంత్రములతో రుద్రగణ (ఏకాదశ రుద్రులు) కౌష్మాండ (మరుద్గణములు) మహారోహిణి కుబేర హృదయ నామక ఋచల (మంత్రము)తో అభిషేకము చేయవలెను.

స్నానము చేసి రాజు ఆపోహిష్టాది మూడు ఋచలతో హిరణ్యవర్ణ ఇత్యాది నాలుగు ఋచలతో అభిమంత్రించి వస్త్రముధరించవలెను. దీనితర్వాత పవిత్రమైన రాజు దేవత గురుబ్రాహ్మణులను పూజించి ఛత్రము ధ్వజము ఖడ్గములను పూజించవలెను. తర్వాత అభీష్ట దేవతకు పూజచేయవలెను.ఆయుష్యం వర్చస్యం రాయస్పోష ఉత్పాది ఆరుఋచలతో అభిమంత్రించి విజయమును కలిగించు నూతనభూషణములను ధరించవలెను.

తర్వాత ద్వితీయ వేదికకు వెళ్ళి చర్మముపై కూర్చొనవలెను. చర్మములను ముందు తెల్పిన విధముగా నుంచవలెను. మొదట ఎద్దు, తర్వాత పిల్లి, తర్వాత నల్లని మృగము, తర్వాత హిరణము, తర్వాత సింహము పైన పులి చర్మము నుంచవలెను. పురోహితుడు ముఖ్య స్థానములో కర్ర నువ్వులు నెయ్యి మున్నగువాటితో రుద్ర ఇంద్ర బృహస్పతి విష్ణు వాయు సంబంధ మంత్రములను చదివి అగ్నిలో ఆహుతి నియ్యవలెను.

దైవజ్ఞుడు ఇంద్రధ్వజములో తెలుపు అగ్ని లక్షణమును చెప్పవలెను. అన్ని పూర్తయిన తర్వాత పురోహితుడు హస్తములు జోడించి పలుకవవలెను. "ఓ దేవగణములారా! మీరందరు రాజు పూజను స్వీకరించి అతనికి గొప్పసిద్ధిని కలిగించి మరల వచ్చుటకు బయలు దేరండి."దీనితర్వాత రాజు అనేకవిధములైన ధనములతో దైవజ్ఞులను పురోహితులను పూజించవలెను.దక్షిణ నొసగుటకు అర్హులైన బ్రాహ్మణాదులను యథోచి

తముగా పూజించవలెను. ప్రజలకు అభయదానము నిచ్చి వధ్యస్థానములో నున్న పశువులను అభ్యంతరిక (అంత:పురమునకు సంబంధించిన) అపరాధమును చేసిన వారిని వదలి అన్నిబంధనముల నుండి ప్రజలను స్వతంత్రులను చేయవలెను.

ప్రత్యేక పుష్య నక్షత్రములో చేయు ఈస్నానము సుఖము,కీర్తి,ధనములను వృద్ధి కలిగించునదగును. పుష్యనక్షత్రమును వదలి అన్యనక్షత్రములలో యథావిధి ఈస్నానము చేసిన సగము ఫలము కలుగును. పుష్య నక్షత్రయుత పూర్ణిమ దినములో ఈస్నానము సర్వోత్కృష్ట మగును.రాజ్యములో ఏవిధమైన ఉత్పాతము, ఉపద్రవము జరిగిన లేక కేతు దర్శనము కలిగిన పుష్యస్నానము చేయవలెను. లోకములో ఈస్నానముతో నష్టముకాని ఉత్పాతమేదిలేదు.దీనికన్న అధికముగా శుభఫలితము నిచ్చు మాంగలిక కార్యము వేరొకటి లేదు.మహారాజపదవిని పుత్రునికోరు రాజు చేయు అభిషేకములో ఈవిధానము ప్రశస్తమైనది.

అధికకీర్తి కలిగిన బృహస్పతి ఇంద్రుని కొరకు ఈస్నానమును తెలిపెను. ఈస్నానము ఆయువును ప్రజావృద్ధిని, సౌభాగ్యమును కలిగించును.రాజు పూర్వోక్తవిధితో ఏనుగులకు గుర్రములకు అభిషేకము చేసిన రోగముల నుండి ముక్తిని పొందును. ఏనుగులు గుర్రములు అతనికి పరమసిద్ధిని కలిగించును.

నలుబది ఎనిమిదవ పుష్యస్నానాధ్యాయము సమాప్తము

49. పట్ట లక్షణాధ్యాయము

ప్రాచీన ఆచార్యులు విస్తారముగా రాజకిరీట లక్షణములను తెలిపిరి. ఆవిషయమును అర్థవంతముగా సంక్షేపముగా తెలిపెదను. మధ్యలో ఎనిమిది అంగుళముల విస్తారము కలిగిన కిరీటము రాజుకు, ఏడుఅంగుళముల విస్తారము కలిగినది రాణికి,ఆరు అంగుళములు విస్తారము కలిగినది యువరాజుకు, నాలుగు అంగుళముల విస్తారము కలిగినదిసేనాపతికి శుభమును కలిగించును.రెండు అంగుళముల విస్తారము కలిగినదానిని ప్రసాదపట్ట మందురు.ఈ కిరీటమును రాజు ఎవరికైన ధరింపజేయవచ్చును. ఈవిధముగా ఐదు కిరీటములు తెలుపబడినవి.

ముందు తెల్పిన వెడల్పుకు రెట్టింపు పొడవు, వెడల్పులో సగము పార్శ్వవిస్తారముండ వలెను.ఇది శుద్ధమైన సువర్ణముతో నిర్మించిన శుభ కారకమగును. ఐదు శిఖలు కలిగినది రాజుకు, మూడు శిఖలు కలిగినది యువరాజుకు, రాణికి, ఒక శిఖ కలిగిన కిరీటము సేనాపతికి శుభకారకమగును.ప్రాసాదపట్టము శిఖలేకుండ నిర్మించవలెను.

కిరీటములో తయారు చేసిన పత్రము అనాయాసముగా విస్తరించిన రాజుకు వృద్ధి విజయము కలుగును.ప్రజలకు సుఖసంపత్తి కలుగును. కిరీటము నిర్మించు సమయములో రంధ్రమైన ప్రాణము రాజ్యము రెండింటికి నాశము కలుగును. మధ్యలో

విరిగిన వదలిపెట్టవలెను. రెండువైపుల విరిగిన విఘ్నకారి యగును. కిరీటములోఅశుభ లక్షణములు కనపడినశాస్త్రము తెలిసిన పండితుడు రాజుకు శాంతినిచేయుటకా దేశించవలెను. శుభలక్షణములుకలిగినకిరీటమురాజుకురాజ్యమునకు వృద్ధిని కలిగించును.

నలుబది తొమ్మిదవ పట్టలక్షణాధ్యాయము సమాప్తము

50. ఖడ్గ లక్షణాధ్యాయము

50 అంగుళముల ప్రమాణము కలిగిన ఖడ్గము ఉత్తమమైనది. 25 అంగుళములది అధమము, 25 అంగుళముల నుండి 50 అంగుళముల మధ్య నున్న ఖడ్గము మధ్యమగును. అంగుళ మానమును తీసుకొనిన విషమ పర్వమందున్న వ్రణము (చిహ్నము) అశుభమగును. అనగా ప్రథమ తృతీయ పంచమాది విషమ అంగుళములు కలిగి ముందు తెలుపు లక్షణములు కలిగిన వ్రణమున్న అశుభమగును.

మారేడు, వర్ధమానము, ఛత్రము, కుండలము, కమలము, పతాకము, ఖడ్గము, మున్నగు శుభవస్తువుల చిహ్నము మంచిది. ఊసరవెల్లి, కాకి, గ్రద్ధ మాంసముతిను పక్షి, తలలేని పురుషుడు, తేలు ఆకారము శుభమునీయవు. ఖడ్గమునకు పైభాగములో వివిధ ఆకృతుల చిహ్నములు మంచివికావు. బ్రద్ధలైన విరిగిన వంశప్రదేశము నరుకబడిన దృష్టికి మనసుకు అప్రియమైన శబ్దరహితమైన ఖడ్గము అశుభమునిచ్చును. దీనికి వ్యతిరరేకముగా లక్షణ యుక్త ఖడ్గము శుభమునిచ్చును. ఖడ్గము వలన ధ్వని కలిగిన మరణము, మలినము నుండి బయటపడకున్న పరాజయము, తొందరగా బయటపడిన యుద్ధము అధికప్రకాశమానమైన విజయము కలుగును.

రాజు ఆకారణముగా ఖడ్గమును మ్లానము (మలినము)నుండి బయటకు తీయరాదు వాడకూడదు. దానిలో తనముఖమును చూడరాదు. దానిమూల్యమును ఉ త్పత్తి స్థానమును రహస్యముగా నుంచవలెను. ఖడ్గమును తనవ్రేళ్లతో కొలవరాదు. అవసరము లేనపుడు స్పర్శించరాదు. ఆవునాలుక వంటి ఆకారము కలిగినది, నీలికమలము వలె నున్నది, వెదురు ఆకువలెనున్నది. కరవీరపు (గన్నేరు)పూవువలె నున్నది, శూలము వలె అగ్రభాగము కలిగినది, వర్తులాకారముగా అగ్రభాగము కలిగిన ఖడ్గము ప్రశస్తమైనది.

ఖడ్గము తన ప్రమాణము కన్న అధికముగా నున్నదానిని నరకకూడదు. అరగదీసి సరైన ప్రమాణమునకు తీసికొని రావలెను. ఖడ్గము యొక్క మూలభాగమును ఖండించిన రాజుకు, అగ్రభాగము ఖండించిన రాజమాతకు, మృత్యువు కలుగును. స్త్రీలముఖమును చూచి రహస్యస్థానములో నున్న పుట్టుమచ్చచెప్పునట్లుగా ఖడ్గపు పిడికున్న మచ్చను చూచి దాని మధ్యలోనున్న వ్రణమును (రంధ్రము)ను తెలుపవలెను.

ఎవరైన ఖడ్గధారుడైన పురుషుడు వచ్చి ప్రశ్నించిన **'ఈఖడ్గములో వ్రణమున్నదా**

లేదా' అని, ఆసమయములో ఆప్రశ్నకర్త తన ఏఅంగమును స్పర్శించునో దానిని గుర్తించి శాస్త్రాను సారముగా ఖడ్గములో వ్రణమును గూర్చి తెలుపవలెను. శిరస్సును స్పర్శించిన ఖడ్గమూలములో ప్రథమ అంగుళములో, లలాటమును స్పర్శించిన ద్వితీయఅంగుళములో, భ్రూమధ్యమును స్పర్శించిన తృతీయఅంగుళములో, నేత్రములను స్పర్శించిన చతుర్థ అంగుళములో వ్రణమున్నదని తెలుపవలెను.

నాసిక(ముక్కు)ను స్పరించిన పంచమ అంగుళములో, పెదవి స్పర్శించిన ఆరవ అంగుళములో, బుగ్గను స్పర్శించిన ఏడవ అంగుళములో, గడ్డమును స్పర్శించిన ఎనిమిదవ అంగుళములో,చెవిని స్పర్శించిన తొమ్మిదవ అంగుళములో,మెడను స్పర్శించిన పదవ అంగుళములో,బుజమును స్పర్శించిన పదకొండవఅంగుళములో,గుండెను స్పర్శించిన పన్నెండవ అంగుళములో,పొత్తికడుపును స్పర్శించిన పదమూడవ అంగుళములో వ్రణ మున్నదని తెలుపవలెను.

స్తనములను స్పర్శించిన పద్నాలుగవ అంగుళములో, హృదయమును స్పర్శించిన పదిహేనవ అంగుళములో, పొట్టను స్పర్శించిన పదహారవ అంగుళములో, కుక్షిని (గర్భాశయము) స్పర్శించిన పదిహేడవ అంగుళములో, నాభిని స్పర్శించిన పద్దెనిమిదవ అంగుళములో, నాభిమూలను స్పర్శించిన పందొమ్మిదవ అంగుళములో, కటి (నడుము)ని స్పర్శించిన ఇరవయవ అంగుళములో, గుహ్యాభాగమును స్పర్శించిన ఇరువది ఒకటవ అంగుళములో వ్రణమును తెలుపవలెను.

తొడను స్పర్శించిన ఇరువది రెండవ అంగుళములో, రెండు తొడలను స్పర్శించిన ఇరువది మూడవ అంగుళములో, మోకాలును స్పర్శించిన ఇరువదినాల్గవ అంగుళములో, పిక్కలను స్పర్శించిన ఇరువదిఐదవ అంగుళములో, వ్రణమున్నదని తెలుపవలెను. పిక్కల మధ్యలో స్పర్శించిన ఇరువదిఆరవ అంగుళములో,గుల్ఫమును (చీలమండపైభాగము) స్పర్శించిన ఇరువది ఏడవ అంగుళములో, చీయమండను స్పర్శించిన ఇరువది ఎనిమిదవ అంగుళములో, పాదమును స్పర్శించిన ఇరువది తొమ్మిదవ అంగుళములో, కాలివ్రేళ్లను స్పర్శించిన ముప్పదవ అంగుళములో వ్రణమును తెలుపవలెను ఇది గర్గాచార్యుని మతము.

మొదటి అంగుళములో వ్రణమున్న పుత్రమరణమును తెలుపవలెను. రెండవ అంగుళములో నున్న ధనప్రాప్తి, మూడులో నున్న ధనహాని, నాలుగులోనున్న సంపత్తి, ఐదులో నున్న బంధనము, ఆరులోనున్న పుత్రలాభము, ఏడులో నున్న కలహము, ఎనిమిదిలో నున్న గజలాభము,తొమ్మిదిలోనున్న పుత్రమరణము, పదిలోనున్న ధనలాభము, పదకొండులో నున్న వినాశము, పన్నెండులో నున్న స్త్రీప్రాప్తి, పదమూడులోనున్న దు:ఖము కలుగును. పద్నాలుగవ అంగుళములో వ్రణమున్న లాభము, పదిహేనులోనున్న హాని, పదహారులోనున్న స్త్రీలాభము, పదిహేడులోనున్న వధ,పద్దెనిమిదిలోనున్న వృద్ధి, పందొమ్మిది

లోనున్నమరణము,ఇరువదిలోనున్న ప్రసన్నము,ఇరువదిఒకటిలోనున్న ధనహాని కలుగును.

ఇరవదిరెండవ అంగుళములో వ్రణమున్న ధనలాభము, ఇరువది మూడులో నున్న మృత్యువు, ఇరువదినాలుగులోనున్న ధనలాభము, ఇరువది ఐదులోనున్న మరణము, ఇరువది ఆరులోనున్న సంపత్తి, ఇరువదిఏడులోనున్న నిర్ధనము, ఇరువది ఎనిమిదిలోనున్న ఐశ్వర్యము, ఇరువది తొమ్మిదిలోనున్న మరణము,ముప్పదిఅంగుళములో వ్రణమున్న రాజ్యలాభము కలుగును.

కరవీరము,కమలము,ఏనుగుమదము,నెయ్యి కుంకుమ,కుంద(మల్లె) లేక చంపక పుష్ప సమానముగా సుగంధమున్న శుభదాయకమగును.గోమూత్రము, బురద లేక మేద (ఎముకలో నుండు మూలుగు)వలె గంధము కలిగిన అశుభఫలము నిచ్చును. తాబేలు,మూలుగు, రక్తము, క్షారము వలె వాసన కలిగిన భయము దు:ఖము కలుగును. వైడూర్యమణి, సువర్ణము, విద్యుత్తు సమానముగా ఖడ్గము కాంతి కలిగిన జయము ఆరోగ్యము ఉన్నతి కలుగును.లక్ష్మిని పొందవలెనను కోరిక కలిగినవాడు ఖడ్గమును రక్తముతో తడుపవలెను. గుణవంతులైన పుత్రులను కోరుకొనేవారు నేతితో, అపరిమిత ధనేచ్ఛ కలిగినవారు నీటితో, పాపమునుండి విముక్తిని పొందగోరువారు గుర్రము, ఒంటె ఏనుగుతొండమును నరుకు ఇచ్ఛ కలవారు తాటికల్లుతో కలిపిన చేప పిత్తముతో ఆడలేడి ఆడగుర్రము లేక మేకపాలుతో శస్త్రమును కడుగవలెను.

నువ్వులనూనె వ్రాసిన తర్వాత జిల్లేడు పాలు, మేకకొమ్ముల భస్మము, పావురము ఎలుకల మలమును కలిపి ఖడ్గముపై వ్రాయవలెను.తర్వాత దానిని పదును పెట్టి రాతిపై నూరిన అదివిరుగదు.అరటిచెట్టు బూడిదను మజ్జిగలో కలిపి దానిలో ఒకరోజు లోహము నుంచవలెను.తర్వాత దానినితీసి పదునుపెట్టి తర్వాత ఇతర లోహముపై నూరిన అది పగులదు.

యాబదవ ఖడ్గలక్షణాధ్యాయము సమాప్తము

51. అంగ విద్యాధ్యాయము

ప్రశ్నకర్త ఉన్నదిశ, అతను పలుకుస్థానము, అతను తెచ్చిన వస్తువులను చూచి ప్రశ్నకర్తతో పాటు అతనితో వచ్చిన తనవారి శరీర చేష్టలను చూచి తనబుద్ధి బలముతో విచారించి దైవజ్ఞుడు శుభాశుభ ఫలములను తెలుపవలెను. ఎందువలననగా ఆసమయము చరాచర ప్రాణులందరికి ఆత్మస్వరూపమగుట వలన ప్రభువు అందరిని చూచుచుండును. ఆచేష్టలు పలుకుల ద్వారా ప్రశ్నకర్త శుభాశుభ ఫలము కనపడును.

పుష్పరూప సుందరమైన నవ్వుతో కూడిన,ఎక్కువ ఫలములతో నిండిన నిర్మలమైన చర్మము ఆకులతో కూడిన, శుభపక్షులతో కూడిన ప్రశస్తసంజ్ఞ కలగిన వృక్షముల చాయతో

కప్పబడిన సమతల భూమి మరియు దేవతలు,ఋషులు,ధ్వజులు,సాధువులు, సిద్ధులకు సంబంధించిన స్థానము, సుందరపుష్పములతో ధాన్యములతో పరిపూర్ణమైన స్థానము సుందర స్వాదిష్ట జలముతో ఉత్పన్నమైన ఆహ్లాదితస్థానము, సుందరమైన గరికలతో కూడిన స్థానము అటువంటి స్థానములలో పృచ్ఛకుడు ప్రశ్నఅడిగిన శుభకారకమగును.

నరుకబడిన విరిగిన పురుగులతో తినబడిన కాలిన పాడైన కుటిలమైన అశుభ పక్షులతో కూడియున్న,ఎక్కువ ఆకులు చర్మములేని వృక్షము దగ్గర ప్రశ్నఅడిగిన అశుభము కలుగును. శ్మశానము, శూన్యదేవగృహము, చతుష్పథము (నాలుగు వీధులు కలిసినచోట) మనసులోబాధను కలిగించునది, ఎత్తుపల్లములున్నది చవుడు దేరిన అశుద్ధమైన విరిగిన బాండము, బొగ్గులు మనిషిపుర్రె, భస్మము,ఎండిన గడ్డితో నున్న స్థలములో ప్రశ్నవేసిన అశుభము కలుగును.

సన్యాసి, నగ్నశరీరము, మంగలి,శత్రువు, బంధనశాల,కసాయివాడు, చండాలుడు, యతి – వీరున్న స్థలములో ప్రశ్నవేయరాదు. శస్త్ర మద్యములను విక్రయించు స్థానములో ప్రశ్నించుట అశుభకారకము. పూర్వ ఉత్తర ఈశాన్యదిశలకు ముఖము పెట్టి ప్రశ్నించిన శుభము కలుగును. వాయువ్య పశ్చిమ దక్షిణ ఆగ్నేయ నైరృతి దిశలకు తిరిగి ప్రశ్నించిన అశుభమగును. పూర్వాహ్నములో శుభము రాత్రి రెండు సంధ్యలలో అపరాహ్ణములో ప్రశ్నించిన అశుభమగును.

యాత్రావిధానములో ఏశుభాశుభ నిమిత్తములు (శకునములు) తెలుపబడినవో ఆనిమిత్తములు ఎదురుగా కనపడినపుడు ప్రశ్నకర్త హస్తములో లేక వస్త్రములో కనపడినపుడు శుభాశుభఫలములను తెలుపవలెను. ఆవాలు, సీసా,జలము, కాటుకను చూచిన శుభమును, దూది, ఔషధము, నల్లని ధాన్యమును చూచి అశుభఫలమును తెలుపవలెను.

తొడలు, పెదవులు, స్తనములు, అండకోశము, కాళ్లు, దంతములు, బాహువులు, హస్తములు, బుగ్గలు, కేశములు, కంఠము, ముక్కు, బొటనవ్రేలు, శంఖము, కక్షి (చంక) కంధము (మెడక్రింది భాగము) చెవి,గుహ్యము, రెండుకన్నుల మధ్యస్థానము ఇవన్ని పురుష సంజ్ఞములు.

కనుబొమలు, ముక్కు, నితంబము (పిరుదులు) త్రివలి, (మూడు ముడుతలు) నడుము చేతులమధ్య సుందర రేఖ, వ్రేళ్లు, నాలుక, మెడ, రెండుపిక్కల వెనుకభాగము, చీలమండ,తొడలు,నాభి, చెవులు, మెడ వెనుకభాగము ఇవన్ని స్త్రీ సంజ్ఞకములు. ముఖము, పృష్ఠము, కన్నుల మధ్యభాగము,మోకాలు,ఎముకలు ప్రక్కభాగము, హృదయము, నాలుక, నేత్రము,లింగము, ఛాతి, త్రికము, కిటికి వెనుకభాగము,శిరస్సు లలాటము ఇవి నపుంసక సంజ్ఞకములు.

పురుషసంజ్ఞక అంగములను స్పర్శిస్తు ప్రశ్నించిన విషప్రయోగము (స్నేహితురాలితో

వియోగము) కలుగును.తనశరీరము నుండి వస్త్రమును తీస్తు ప్రశ్నించిన అనర్థము, వస్త్రమును పట్టుకొని ఒకకాలును వేరొకకాలిపై పెడుతు ప్రశ్నించిన ప్రియాలాభము కలుగును. ప్రశ్నకర్త బొటనవ్రేలితో భూమిపై వ్రాసిన వ్యవసాయభూమి గూర్చి చింత, రెండు చేతులతో రెండుకాళ్ళను గోకిన దాసికొరకు చింత తెలుపవలెను.

ప్రశ్నించే సమయములో తాటి వృక్షపు ఆకులు భోజపత్రములు కనపడిన వస్త్ర చింతను తెలుపవలెను. కేశములు పొట్టు ఎముకలు భస్మముపై కూర్చొని ప్రశ్నించిన ప్రశ్నకర్తకు వ్యాధి కలుగును. ప్రశ్నసమయములో త్రాడును వృక్షపు బెరడును చూచిన బంధనము కలుగును.

ప్రశ్నకాలములో రావిచెట్టు మిర్చి శొంఠి వారిదము(మేఘము) రోద్ర (ఔషధ వృక్షము) క్రూరుడు వస్త్రము జలము జీలకర్ర గంధమాంసి శతపుష్పము తగరపు పూల దర్శనమైన క్రమముగా స్త్రీకి దోషము, పురుషునికి దోషము,రోగము సర్వనాశము అర్థనాశము పుత్రనాశము ధాన్యనాశము ద్విపద చతుష్పదముల నాశము భూమినాశము కలుగునని తెలుపబడును. ప్రశ్నకాలములో పశువు ఏనుగు ఎద్దు కమలము వెండి పులి కనిపించిన క్రమముగా కంబళి మున్నగు ఉన్నివస్త్రములు ధనము పట్టు వస్త్రము చందనము భూషణములు ప్రాప్తించును.

ప్రశ్నకాలములో కాపాలికుని దర్శనమైన మిత్ర ద్యూత వనసంబంధిత చింత కలుగును. ఉత్తమ సన్యాసి, దర్శనమైన వేశ్య, రాజు గర్భిణీ స్త్రీ గురించి తెలుపవలెను. ప్రశ్నకాలములో బౌద్ధమతస్థుడు ఉపాధ్యాయుడు అర్హుడు, నిర్గంధి (మూర్ఖుడు) దైవజ్ఞుడు నిగముడు, ధైర్యవంతుని దర్శనమైన క్రమముగా దొంగ సేనాపతి కోమటి దాసి యోద్ధ దుకాణదారుడు వధ సంబంధ విచారమును చేయవలెను.

ప్రశ్నించు సమయములో ప్రశ్నకర్త ముఖము నుండి మొట్టమొదట నేను 'అడుగుదామను కుంటున్నాను.'మీరు చెప్పండి'ఈ విధమైన శబ్దము వచ్చిన సంధి లేక కుటుంబ సంబంధము, 'మీరుచూడండి' శబ్దము వెలువడిన లాభసంబంధము **'మీరు ఆజ్ఞ ఇవ్వండి'** ఈశబ్దము వచ్చిన ఐశ్వర్య సంబంధమైన విషయమును తెలుపవలెను.

ప్రశ్నకాలములో ప్రశ్నకర్త ముఖమునుండి మొదట 'చెప్పండి' అనే శబ్దము వచ్చిన మార్గ సంబంధ విషయములు తెలుపబడును. 'చూచి నాహృదయము లోని మాటను తెలుపండి:. ఈశబ్దము వచ్చిన బంధుకృతము 'మీరు వెంటనే చూడండి' అనివచ్చిన అందరి మధ్యనున్న ప్రశ్నకర్తకు దొంగకు సంబంధించిన విషయమును తెలుపవలెను.

ప్రశ్నించు సమయములో ప్రశ్నకర్త లోపలి అంగమును స్పర్శించిన తన మనుష్యులు, బయటి అంగమును స్పర్శించిన బయటి మనుష్యులు, కాలి బొటనవ్రేలిని స్పర్శించిన దాసుడు, కాలివ్రేలిని స్పర్శించిన దాసి, జంఘను స్పర్శించిన దూత,నాభిని

స్పర్శించిన సోదరి, హృదయమును స్పర్శించిన తనస్త్రీ, చేతి బొటనవ్రేలిని స్పర్శించిన తనపుత్రుడు, చేతివ్రేలిని స్పర్శించిన తనపుత్రికను దొంగగా తెలుపవలెను.

ప్రశ్నాకాలములో ప్రశ్నకర్త పొట్టను స్పర్శించిన తల్లి, శిరస్సును స్పర్శించిన గురువు, దక్షిణ భుజమును స్పర్శించిన సోదరుడు, వామభుజమును స్పర్శించిన వదినను దొంగగా తెలుపవలెను. ప్రశ్నాకాలములో ప్రశ్నకర్త లోపలి అంగములను వదలి బయటి అంగములను స్పర్శించి శ్లేష్మము (కఫము) మలమూత్ర విసర్జన చేసిన తనచేతిలో నున్న వస్తువును విసిరిన, తన శరీరమును వంచిన లేక తనఅంగములను పీడించిన దొంగిలించ బడిన వస్తువు దొరుకదు. ప్రశ్నసమయములో దొంగలించాడు పడ్డాడు నరుకబడ్డాడు మరచిపోయాడు నష్టపడ్డాడు విరిగాడు దొంగిలింపబడ్డాడు మరణించాడు ఇటువంటి అనిష్ట శబ్దములుత్పన్నమైన దొంగిలించిన వస్తువు దొరకదు.

నష్టచింతలో తెలుపబడిన పూర్వోక్తస్థితితో పాటు పొట్టు ఎముకలు విషము మున్నగువాటిని చూడటముతో పాటు ఏడుపు తుమ్ములు కలిగిన రోగికి మృత్యువు కలుగును. ప్రశ్నకర్త లలాటమును స్పర్శించిన యవాది ధాన్యముల దర్శనము చేసిన బియ్యమును, ఛాతిని స్పర్శించిన షష్టిక(అరవై దినములై పండు) ధాన్యము,మెడను స్పర్శించిన యవధాన్యమును తినెనని చెప్పవలెను. ప్రశ్నసమయములో పొత్తికడుపు స్తనము పొట్ట మోకాళ్లను స్పర్శించిన ప్రశ్నకర్త మినుములు జలము నువ్వులు యవలు తినివచ్చెను. అదేవిధముగా నములుతున్న మధురరసమును తిని వచ్చెనని తెలుపవలెను.

ప్రశ్నసమయములో పెదవిని నాలుక స్పర్శించిన ప్రశ్నకర్త పులుపు ముఖమును గోకిన చేదు,ఎక్కిళ్లు వచ్చిన కషాయము, ఊసిన ఉప్పును తినెనని తెలుపవలెను. ప్రశ్న సమయములో కఫమును ఊసిన కొంచెము చేదుగా కారముగా నున్న వస్తువును మాంసభక్ష పక్షిధ్వని వినిన చూచిన మాంస మిశ్రిత వస్తువు భూమధ్యము, బుగ్గలు, పెదవులను స్పర్శించిన ప్రశ్నకర్త పక్షిమాంసము తినెనని తెలుపవలెను.

ప్రశ్నసమయములో ప్రశ్నకర్త శిరస్సు కంఠము గడ్డము కేశములు కనురెప్పలు కన్నులు మోకాలు వస్తి (నాభి క్రింది స్థానము)ని తాకిన క్రమముగా ఏనుగు గేదె పంది మేక గోవు కుందేలు మృగము ఎద్దు మాంసములతో మిశ్రిత మాంసమును తినెనని తెలుపవలెను. ప్రశ్నకాలములో ప్రశ్నకర్త అపశకునములను చూచిన వినిన ఉడుము, చేపమాంసము తినివచ్చెనని తెలుపవలెను. గిర్భణీప్రశ్నలో గర్భస్రావమును కల్పన చేయవలెను. గర్భిణీ ప్రశ్నకాలములో అపశకునములు చూచిన వినిన గర్భస్రావమును తెలుపవలెను.

గర్భిణి ప్రశ్నకాలములో ప్రశ్నకర్త పురుషుడు స్త్రీ లేక నపుంసుకుని చూచిన వారిని కూర్చి తెలుపవలెను. వారి ఎదురుగా నుండిన లేక వారిని స్పర్శించిన క్రమముగా

వారి జన్మ గురించి తెలుపవలెను. పురుషుని దర్శనము వలన పురుషుని, స్త్రీ దర్శనము వలన స్త్రీని, నపుంసక దర్శనము వలన నపుంసక జన్మను తెలుపవలెను. ఈ సమయము ఆసవము (మద్యము) అన్నము పుష్పఫలముల దర్శనము శుభము కలిగించును.

స్త్రీ బొటనవ్రేలితో భ్రూమధ్యము (నొసలు) పొట్ట లేక వ్రేళ్ళను స్పర్శిస్తూ ప్రశ్నించిన ప్రశ్నకాలములో తేనె నెయ్యి సువర్ణము రత్నము పట్టు ముత్యము దాది(సేవకురాలు) పుత్రులతో కనిపించిన గర్భము గూర్చి ఆలోచనయని తెలుపవలెను. ప్రశ్నకాలములో కడుపుపై హస్తము నుంచి ప్రశ్నించిన గర్భమని తెలుపవలెను. ఆసమయములో అప శకునములు కనిపించిన లేక ప్రశ్నించు వ్యక్తి వీపుభాగమును తాకిన పొట్టను గోకిన లేక చేతిలో చెయ్యి నుంచి ప్రశ్నించిన గర్భపాతమును తెలుపవలెను.

'గర్భమగునా లేదా' ఈ విధముగా ప్రశ్నించు కాలములో స్త్రీముక్కు దక్షిణ ద్వారమును స్పర్శించిన రెండు సంవత్సరములలో, దక్షిణ కర్ణము(చెవి) ను స్పర్శించిన రెండు మాసముల తర్వాత, వామకర్ణమును స్పర్శించిన రెండు సంవత్సరముల తర్వాత, దక్షిణ స్తనమును స్పర్శించిన నాలుగు మాసముల తర్వాత, వామస్తనమును స్పర్శించిన రెండు వర్షములలో గర్భము కలుగునని తెలుపవలెను.

'నాకు ఎంతమంది సంతానము కలుగును' ఈ విధముగా ప్రశ్నించు కాలములో స్త్రీ కేశములను స్పర్శించిన ముగ్గురు మగపిల్లలు ఇద్దరు ఆడపిల్లలు, చెవిని స్పర్శించిన ఐదుగురు మగపిల్లలు, హస్తమును స్పర్శించిన ముగ్గురు మగపిల్లలు, కనిష్ఠ అంగుళిని స్పర్శించిన ఒక కుమారుడు, అనామికను (ఉంగరు వ్రేలు)స్పర్శించిన ఇద్దరు కుమారులు, మధ్యవ్రేలిని స్పర్శించిన ముగ్గురు కుమారులు, తర్జని (చూపుడు వ్రేలు) స్పర్శించిన నలుగురు కుమారులు లేక రెండు అరికాళ్ళను స్పర్శించిన ఒక పుత్రిక కలుగునని తెలుపవలెను.

పూర్వోక్త ప్రశ్నకాలములో స్త్రీ దక్షిణపు తొడను స్పర్శించిన ఇద్దరు కుమార్తెలు, వామ ఊరుపును స్పర్శించిన ఇద్దరు కుమారులు,లలాటమధ్యభాగమును స్పర్శించిన నలుగురు కుమార్తెలు లలాటము చివరిభాగమును స్పర్శించిన ముగ్గురు కుమార్తెలను తెలుపవలెను.

'సంతానము ఏనక్షత్రములో కలుగును' ఈ విధముగా ప్రశ్నించు కాలములో స్త్రీశిరస్సు లలాటము కనుబొమము ముక్కు బుగ్గలు కణత దంతము మెడ కుడిభుజము ఎడమ భుజము రెండుహస్తములు గడ్డము కంఠము ఛాతి కుడిస్తనము ఎడమస్తనము హృదయము కుడిచంక ఎడమచంక ఊరువు మోకాలు పిక్కలు నాలుక స్పర్శించిన క్రమముగా కృత్తికాది నక్షత్రములో జన్మించునని తెలుపవలెను. అనగా శిరస్సును స్పర్శించిన

కృత్తిక,లలాటమును స్పర్శించిన రోహిణి ఇత్యాదులు తెలుపవలెను.

అన్ని శాస్త్రములను సరైన విధముగా చూచి కోరిన కోరిక నెరవేరుటకు అతి స్పష్టముగా అవయవ స్పర్శలక్షణము తెలుపబడినది. అధిక బుద్ధిమంతుడు ఉదారుడైన దైవజ్ఞుడు సమస్తమును తెలిసికొనును. రాజు మరియు ప్రజలతో పూజింపబడును.

ఏబది ఒకటవ అంగవిద్యాధ్యాయము సమాప్తము

52. పిటక లక్షణాధ్యాయము

బ్రాహ్మణాది నాలుగు వర్ణములవారికి క్రమముగా తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు పిటకములు (పుండు,బొటిమ)ముందు తెల్పిన విధముగా ఫలితమునిచ్చును. తెల్లనిపుండు బ్రాహ్మణులకు,ఎరుపుపుండు క్షత్రియులకు,పసుపుపుండు వైశ్యులకు, నలుపుపుండు శూద్రులకు శుభమునిచ్చును. సుందరము, నిర్మలము స్పష్టమైన కాంతి కలిగిన పుండు శిరస్సుపైనున్న ధనలాభము, మస్తకము (మొఖము)పై నున్న శీఘ్రసౌభాగ్యము, నొసటిపై నున్న దౌర్భాగ్యము,రెండుకనుబొమల మధ్యలోనున్న బంధువులతో మిలనము, దుశ్శీలము, నేత్రపుటములపై నున్న శోకము అశ్రుపాత(చెమట పట్టు)స్థానములో నున్న చింత ఉత్పన్నమగును.

పుక్కుపై పుండు ఉన్న వస్త్రలాభము, బుగ్గలపై నున్న పుత్రలాభము, పెదవి గడ్డముపై నున్న అన్నలాభము,లలాటము హనువు(చెక్కిలి మీద భాగము)మీదున్న అధిక లాభము, కంఠముపైనున్న భూషణము అన్నపాన వస్తువుల లాభము, చెవిపై నున్న కర్ణ భూషణముల లాభము, ఆధ్యాత్మజ్ఞానము కలుగును. శిరస్సు క్రిందిభాగము,మెడ, హృదయము,స్తనము చంక, ఛాతీలో పుండు కలిగిన క్రమముగా శస్త్రపీడ, ఆఘాతము (దెబ్బతగులుట) పుత్రలాభము, శోకము, ప్రియవస్తుప్రాప్తి కలుగును. భుజముపై నున్న భిక్ష కొరకు మాటిమాటికి తిరగటము, పొత్తి కడుపుపైనున్న ధనమునకు అనేకవిధముల నాశనము కలుగును.

వీపుపై పుండు కలిగిన దు:ఖ సమూహము, బాహువులపై నున్న శత్రుసముదాయ మునకు నాశనము కలుగును. మణికట్టుపై నున్న చేతులకు బంధనము, రెండు హస్తముల సమీపములో నున్న భూషణము అన్నవస్త్రాది లాభము కలుగును. చేతిపై పుండు కలిగిన ధనలాభము, వేళ్లపై కలిగిన సౌభాగ్యము,పొట్టమీద శోకము, నాభిలోనైన సుందర అన్న జల లాభము, నాభిక్రిందనున్న దొంగల వలన ధనాపహరణము, వస్తి(నాభి లింగముల మధ్యభాగము)లోనైన ధనధాన్యలాభము, అంగముపై నున్న స్త్రీ సుందర పుత్రులప్రాప్తి, గుదములోనున్న ధనలాభము, అండకోశములోనున్న సౌభాగ్యము కలుగును.

తొడపై పుండు కలిగిన వాహనము,స్త్రీలాభము, మోకాలుపై నైన శత్రువుల వలన నష్టము, తొడపైనైన శస్త్రము వలన వినాశము, చీలమండపై నైన మార్గబంధనము వలన కష్టము కలుగును. పిరుదులపై నైన ధననాశము, కాలిమడమపై నైన గమనము, కాలిపైనైన భ్రమణము, వ్రేళ్లపైనైన బంధనము, బొటనవ్రేలిపై నైన బంధువులతో పూజాసత్కారము ప్రాప్తించును.

ఉత్పాతము (అంగములు అదురుట) గండము(కురుపు) మొటిమలు దక్షిణభాగములో పురుషులకు ఆఘాతము (కష్టము) కలిగించును. వామభాగములో శుభమునిచ్చును. దీనికి వ్యతిరేకముగా స్త్రీలకు వామభాగములో నైన ఘాతము,దక్షిణములో శుభమును కలిగించును. ఈ విధముగా శిరస్సు నుండి ప్రతి అంగములో పుండ్ల ఫలమును తెలుపబడెను. ఇదేవిధముగా వ్రణము, మచ్చల ఫలమును కూడ గుర్తించవలెను. అదే విధముగా ప్రాణుల శరీరములో మచకము(చర్మరోగము) చిహ్నము రోమావర్తము (వెంట్రుకలు నిక్కబొడుచు కొనుట) వలన కలుగు ఫలము పూర్వోక్తానుసారముగా కలుగును.

ఏబది రెండవ పిటక లక్షణాధ్యాయము సమాప్తము

ఉత్తరభాగము

53. వాస్తు విద్యాధ్యాయము

పిటక లక్షణమును తెలిపిన తర్వాత బ్రహ్మనుండి ఋషి మునులకు ప్రాప్తించిన పరంపరాగతమైన వాస్తు విద్యను దైవజ్ఞుల ప్రీతికొరకు నేను తెలియజేయుచున్నాను. ప్రాచీనకాలములో తన శరీరముతో భూమిని ఆకాశమును వ్యాపించిన ఒక అజ్ఞాత పురుషుని ఉత్పత్తి జరిగినది. అప్పుడు దేవతలు వెంటనే అతనిని పట్టుకొని భూమిపై అధోముఖముగా స్థాపన చేసెను. ఆసమయములో దేవతలు ఏఅంగమును పట్టుకొనెనో ఆఅంగమును వారి స్థానముగా చేసుకొనెను. ఆ అపరిచిత పురుషునికి బ్రహ్మ వాస్తుపురుష నామమును కల్పించెను.

రాజగృహములో 108 హస్తముల విస్తారము(వెడల్పు) ఉత్తమము. మిగిలిన నాలుగు గృహములను ఎనిమిదేసి హస్తముల విస్తారము తగ్గించి నిర్మించవలెను. వెడల్పుకు నాల్గవవంతు పెంచి పొడవు ఉండవలెను. ఉత్తమగృహములో 108 హస్తముల వెడల్పు విస్తారము 135 హస్తము పొడవు ఉండవలెను. రెండవ గృహములో 100 హస్తముల వెడల్పు 125 హస్తముల పొడవుండవలెను. మూడవ గృహము 92 హస్తముల వెడల్పు 115 హస్తముల పొడవు, నాల్గవ గృహములో 84 హస్తముల వెడల్పు 105 హస్తముల పొడవు, ఐదవగృహములో 76 హస్తముల వెడల్పు 95 హస్తముల పొడవుండవలెను.

సేనాపతి గృహవిస్తారము 64హస్తములుండవలెను. మిగిలిన నాలుగు గృహములు 6 హస్తములు తగ్గించి ఉండవలెను. వెడల్పుకు ఆరవవంతు అధికముగా పొడవుండవలెను. మొదటి గృహవిస్తారము 64 హస్తములు పొడవు 74 హస్తముల 16 అంగుళాలు, రెండవదాని వెడల్పు 58 హస్తములు పొడవు 76 హస్తముల 16 అంగుళాలు, మూడవదాని విస్తారము 52 హస్తములు పొడవు 60 హస్తముల 16 అంగుళాలు, నాల్గవదాని విస్తారము 46 హస్తములు పొడవు 53హస్తముల 16అంగుళాలు, ఐదవదాని వెడల్పు 40 హస్తములు పొడవు 46హస్తముల 16 అంగుళములుండవలెను.

మంత్రి గృహ ప్రమాణములో మొదటి గృహము వెడల్పు 60 హస్తములు పొడవు 66 హస్తముల 12 అంగుళములు, రెండవదాని విస్తారము 56 హస్తములు, పొడవు 63 హస్తములు, మూడవది వెడల్పు 52 హస్తములు పొడవు 58 హస్తముల12 అంగుళాలు, నాల్గవది వెడల్పు 48 హస్తములు పొడవు 54 హస్తములు, ఐదవది 44 హస్తములు పొడవు 49 హస్తముల 12 అంగుళములుండవలెను. దీనిలో సగము వెడల్పు పొడవులలో రాజమహిషి గృహము నిర్మించవలెను. అనగా ప్రథమగృహము వెడల్పు 30హస్తములు పొడవు 33 హస్తముల 6అంగుళములు, రెండవది వెడల్పు 28

హస్తముల పొడవు 31 హస్తముల 12 అంగుళములు,మూడవది వెడల్పు 26హస్తముల 29 హస్తముల 6 అంగుళములు, నాల్గవది వెడల్పు 24హస్తములు పొడవు 27హస్తములు, ఐదవ గృహము వెడల్పు 22 హస్తములు పొడవు 24హస్తముల 18 అంగుళము లుండవలెను.

యువరాజు గృహములు ఐదువిధములుగా నుండును. ప్రథమగృహ విస్తారము 80 హస్తములు మిగిలిన నాలుగు ఆరేసి హస్తములు తగ్గించి ఉండవలెను. రెండవ గృహము విస్తారము 74, మూడవది 68, నాల్గవది 62, ఐదవది 56హస్తములుండవలెను. వెడల్పులో మూడవవంతు కలిపి పొడవుండవలెను. అనగా క్రమముగా 106 హస్తము 16 అంగుళములు, 98 హస్తములు 16 అంగుళములు, 90హస్తములు 16 అంగుళములు, 82హస్తముల 16 అంగుళములు, 74హస్తముల 16 అంగుళములుండవలెను. యువరాజు గృహమునకు సగము వెడల్పు పొడవులతో అతని తమ్ముల,సేవకుల గృహములుండవలెను. అనగా వెడల్పు 40,37,34,31,28 హస్తములు పొడవు 53హస్తముల 8 అంగుళములు, 48 హస్తముల 8 అంగుళములు, 45 హస్తముల 8అంగుళములు, 41హస్తముల 8 అంగుళములు, 37హస్తముల 8 అంగుళములుండును.

ముందు తెల్పిన రాజు మంత్రుల ఐదు గృహముల వెడల్పు పొడవుల తేడాతో సమానముగా వెడల్పు పొడవులను తీసికొని మాండలిక రాజులు, ప్రధాన పురుషుల గృహములు నిర్మించవలెను. రాజు యువరాజు గృహముల మధ్యనున్న తేడాతో కంచుకి వేశ్యలు కళాజ్ఞానము కలిగిన వారిగృహములను నిర్మించవలెను. అశ్వశాల జగశాల గోశాల అధికారులకు కోశాగారము లేక రతిగృహముతో సమానముగా గృహములను నిర్మించవలెను. కర్మశాలాధికారులకు దూతలకు యువరాజు మంత్రుల గృహవిస్తారము పొడవులలో తేడాతో సమానముగా పొడవు వెడల్పులు తీసుకొని గృహములు నిర్మించవలెను.

స్ఫుటార్థ చక్రము

జ్ఞాతులు	హ.	అ	హ.	అ	హ.	అ	హ.	అ	హ.	అ	ప్రమాణము
రాజు	108	0	100	0	92	0	84	0	76	0	వెడల్పు
	135	0	125	0	115	0	105	0	95	0	పొడవు
సేనాపతి	64	0	58	0	52	0	46	0	40	0	వెడల్పు
	74	16	67	16	60	16	53	16	46	16	పొడవు
మంత్రి	60	0	56	0	52	0	48	0	44	0	వెడల్పు
	67	12	63	0	58	12	54	0	49	12	పొడవు

రాణి	30	0	28	0	26	0	24	0	22	0	వెడల్పు
	33	18	31	12	29	6	27	0	24	12	పొడవు
యువ	80	0	74	0	68	0	62	0	56	0	వెడల్పు
రాజు	106	16	98	16	90	16	82	16	74	16	పొడవు
యువరాజు	40	0	37	0	34	0	31	0	28	0	వెడల్పు
సోదరులు	53	8	59	8	45	8	41	8	37	8	పొడవు
భృత్యులు											
సామంత	48	0	44	0	40	0	36	0	32	0	వెడల్పు
రాజులు	67	12	62	0	56	12	49	0	45	12	పొడవు
కంచుకి	28	0	26	0	24	0	22	2	20	0	వెడల్పు
వేశ్యాదులు	28	8	26	8	24	8	22	8	20	8	పొడవు
కర్మాధ్య	20	0	18	0	16	0	14	0	12	0	వెడల్పు
క్షులు	39	4	35	16	32	4	28	16	25	4	పొడవు
జ్యోతిష,	40	0	36	0	32	0	28	0	24	0	వెడల్పు
పురోహిత	46	16	42	0	37	4	32	16	28	0	పొడవు
వైద్యులు											

జ్యోతిషులు వైద్యులు పురోహితుల గృహములు వరుసగా 40,36,32,28,24 హస్తములుండవలెను. వాటి ఆరవభాగమును జోడించి పొడుగు ఉండవలెను. 1) 46 హ-16అ, 2) 42హ 3) 36హ-8అ 4)32హ-16అ, 5) 28హ- 10అంగుళములు పొడవుండవలెను.

గృహము వెడల్పుకు సమానముగా ఎత్తు ఉండవలెను. ఏకశాల గృహములో విస్తారమునకు రెట్టింపు పొడవుండవలెను. బ్రాహ్మణాది నాలుగు వర్ణముల వారి గృహముల విస్తారము క్రమముగా 32హస్తముల నుండి నాలుగేసి హస్తములు తక్కువ చేసి 16 హస్తముల వరకుండవలెను. 32,28,24,20 లేక 16హస్తముల విస్తారముతో బ్రాహ్మణుల గృహము, 28,24,20,16 హస్తములతో క్షత్రియుల గృహము, 24,20, 16 హస్తములతో వైశ్యుల గృహము, 20,16 హస్తముల వెడల్పుతో శూద్రుల గృహముండ వలెను. వీటికన్న తక్కువ విస్తారముగల గృహము నీచజాతి వారు నిర్మించ వలెను. బ్రాహ్మణుల గృహముల విస్తారమును దశమాంశము, క్షత్రియుల గృహవిస్తారమునకు అష్టమాంశము, వైశ్యుల గృహముల విస్తారమునకు షష్ఠాంశము,శూద్రుల గృహముల విస్తారమునకు చతుర్థాంశము అధికముగా పొడవుండవలెను.

రాజు సేనాపతుల గృహముల తేడాతో సమానముగా కోశాగారము రతి గృహము నిర్మించవలెను. సేనాపతి నాలుగు వర్ణముల వారి గృహముల వెడల్పులో నున్న తేడాతో సమానముగా పురుషుల గృహము నిర్మించవలెను. సేనాపతులు బ్రాహ్మణుల గృహముల వెడల్పులో నున్న తేడాతో సమానముగా, బ్రాహ్మణ రాజపురుషుల గృహము, సేనాపతి క్షత్రియ గృహముల వెడల్పులో నున్న తేడాతో సమానముగా వైశ్య రాజ పురుషుల గృహము, సేనాపతుల శూద్ర గృహముల వెడల్పులోనున్న తేడాతో సమానముగా శూద్ర రాజ పురుషుల గృహములు నిర్మించవలెను.

స్ఫుటార్థ చక్రము

జ్ఞాతులు	హ.	అ	హ.	అ	హ.	అ	హ.	అ	హ.	అ	ప్రమాణము
బ్రాహ్మణులు	32	0	28	0	24	0	20	0	16	0	వెడల్పు
	35	5	30	19	26	10	22	0	17	14	పొడవు
సేనాపతి	28	0	24	0	20	0	16	0	--	--	వెడల్పు
	31	0	27	0	22	12	18	0	--	--	పొడవు
మంత్రి	24	0	20	0	16	0	--	-	--	--	వెడల్పు
	27	0	23	8	18	16	--	--	--	--	పొడవు
రాణి	20	0	16	0	--	-	--	--	--	--	వెడల్పు
	25	0	20	0	--	--	--	--	--	--	పొడవు
యువ	44	0	42	0	40	0	38	0	36	0	వెడల్పు
రాజు	60	8	57	8	54	8	51	8	48	8	పొడవు
యువరాజు	32	0	30	0	28	0	26	0	24	0	వెడల్పు
సోదరులు	39	11	36	21	34	6	31	16	29	2	పొడవు

పారశ (బ్రాహ్మణ శూద్ర స్త్రీవలన కలిగిన సంతానము) భూర్జకంటక బ్రాహ్మణ వైశ్య స్త్రీ సంతానము) మూర్ధావసిక్త (బ్రాహ్మణ క్షత్రియ స్త్రీ సంతానము) లు మాతపితల వర్ణ జనిత (పుట్టిన) పూర్వోక్తమానముల యోగార్ధమునకు (కలిపినవచ్చు) మానమునకు సమానమైన వెడల్పు పొడవులను తీసుకొని గృహము నిర్మించవలెను. పైన తెల్పిన ప్రమాణమునకు ఎక్కువ తక్కువలైన అశుభము కలుగును.

పశువుల సన్యాసుల గృహము, ధాన్యగృహము, ఆయుధగృహము, అగ్నిగృహము, క్రీడాగృహము ఎక్కువ పరిమాణము లేకుండ నిర్మించవలెను. కోరికననుసరించి నిర్మించ వలెను. వందహస్తముల కన్న ఎత్తున్న గృహమును వాస్తు శాస్త్రకారుడు నిర్మించడు. అనగా వందహస్తముల కన్న ఎత్తున్న గృహము నిర్మించుట అశుభము నిచ్చును.

సేనాపతి రాజుల గృహముల వెడల్పులను కలపగా వచ్చిన దానికి డెబ్బది కలిపి రెండు స్థానములలో నుంచవలెను.దానికి ఒకస్థానమును 14తో భాగించిన వచ్చిన లబ్ధము శాలాగృహము లోపలి భాగముగా భావించవలెను.తర్వాత రెండవస్థానమును 15చే భాగించిన వచ్చు లబ్దము అలిందము అనగా శాల బయటిభాగము సోపానములతో కూడిన వాకిలి ప్రమాణమగును.

ఉపరోక్త బ్రాహ్మణాది గృహముల ప్రమాణము క్రమముగా 32,28,24,20,16 హస్తముల వెడల్పును క్రమముగా 4హ-17అం, 4హ - 3అ, 3హ-15 అ, 3హ -13 అ, 3హ-4 అంగుళముల ప్రమాణముతో శాలను,3హ-19 అం, 3హ-8అ, 2హ-20అ, 2హ-18 అ, 2హ-3అంగుళముల ప్రమాణముతో అలిందమును నిర్మించవలెను.

భవనములో మూడవ వంతుభాగము శాల బయట ఖాళీస్థలము నుంచవలెను. రిక్త(ఖాళీ)స్థానము భవనమునకు పూర్వభాగములోనున్న భవన నామము **సోష్ణీష**మగును. పశ్చిమములో నున్న **సాయాశ్రయము**, ఉత్తరములో నున్న **సావష్టంభము**, దక్షిణములో నున్న **సుస్థిత**మగును. ఈ విధముగా వాస్తువిషయమును వాస్తుశాస్త్రజ్ఞులు తెలిపిరి.

మొదటి గృహము వెడల్పుకు పదహారవభాగములో నాలుగు హస్తములు కలిపిన మొదటి గృహము ఎత్తు అగును. దానిలో పన్నెండవ వంతు తీసిన రెండవ గృహము ఎత్తు అగును. ఈవిధముగా పన్నెండవభాగము తగ్గించి పై గృహము ఎత్తును నిర్మించవలెను.

ఇటుకుల గృహములో వెడల్పుకు పదహారవభాగముతో సమానముగా గోడ వెడల్పుండవలెను.కాని కర్ర,ఎదురులతో నిర్మించు గృహములలో ప్రమాణమును పయోగించరాదు. అక్కడ అవసరానుసారముగా గోడను నిర్మించవలెను. రాజు సేనాపతుల గృహములలో గృహవిస్తారములో పదకొండవ భాగములో డెబ్బది కలిపి దానికి సమాన మైన అంగుళములను తీసుకొని ప్రధానద్వారము ఎత్తును, ఎత్తులో సగము వెడల్పు నుంచి నిర్మించవలెను.

బ్రాహ్మణాది వర్ణముల గృహములో వెడల్పులో ఐదవభాగమునకు పద్దెనిమిది అంగుళములు కలిపి దానిలో ఎనిమిదవ భాగము కలిపిన వచ్చుప్రమాణముతో సమానము గా ద్వారము వెడల్పు,దానికి మూడురెట్లు ద్వారపు ఎత్తును ఉంచవలెను.

ఉదాహరణకు 30 హస్తముల విస్తారములో పంచమాంశము 6, దానికి 18 అంగుళములు కలిపిన 24 అగును. దీనిలో అష్టమాంశము 3 అగును. 24కు 3 కలిపిన 27 అంగుళములు ద్వారమునకు వెడల్పు, దానికి మూడురెట్లు 71 అంగుళములు ద్వారము ఎత్తు ఉండవలెను.

ద్వారము ఎత్తు ఎన్ని హస్తములున్నదో అన్ని అంగుళముల మందముతో ద్వారశాఖలు నిర్మించవలెను.ఆ మందమునకు ఒకటిన్నరభాగముతో ఉదుంబరము (ఇంటి

గడప)ను నిర్మించవలెను. రాజుద్వారము ఎత్తును 7చే గుణించి 80చే భాగించిన వచ్చు లబ్ధముతో సమానమైన వెడల్పుతో శాఖలను ఇంటి గడపను నిర్మించవలెను. స్తంభము ఎత్తును 9చే గుణించి 80చే భాగించిన వచ్చు లబ్ధముతో సమానముగా మూలభాగపు మందమును దానిలో పదవభాగము తగ్గించి అగ్రభాగపు మందమును నిర్మించవలెను.

ఉదాహరణకు రాజద్వారము 188 అంగుళములున్న దానిని 7చే గుణించి 80 చే భాగించిన 188×7÷80=16 9/20 అంగుళములతో శాఖను ఉదుంబరమును నిర్మించవలెను. స్తంభము ఎత్తు 10 హస్తములున్న 10×24=240×7÷80=21 అంగుళములు. దీనిలో పదవవంతు తగ్గించిన 2.21 అంగుళమగును. 21−2.24=18.76 అంగుళములు అగ్రభాగపు మందమగును.

స్తంభమధ్యభాగము నాలుగు కోణము కలిగియున్న **రుచకము** ఎనిమిది కోణములున్న **వజ్రము**, పదహారు కోణములున్న **ద్వివజ్రము**, 24 కోణములున్న **ప్రలీనకము**, వర్తులాకారముగా నున్న **వృత్తస్తంభ** మనబడును. ఈ ఐదు స్తంభములు శుభమును, మిగిలినవి అశుభమును కలిగించును.


స్తంభమును తొమ్మిదిభాగములు చేయవలెను. దాని క్రిందిభాగము పేరు **వహనము**. ద్వితీయభాగము **ఘటము**, తృతీయభాగము **పద్మము**, చతుర్థభాగ నామము **ఉత్తరోష్ఠము**, స్తంభ సమానమైన మందమున్న పంచమభాగమును **భారతుల,** షష్ఠభాగ నామము **తుల**, సప్తమభాగ నామము **ఉపతుల**. రాజగృహము లేక వేరే గృహములలో భారతుల నాల్గవభాగము తగ్గించి యుండవలెను.

గృహములో నాలుగువైపుల అలిందమున్న (వసారా) దానిని సర్వతోభద్ర వాస్తు వందురు. ఈగృహము నాలుగు దిశలలో నాలుగు ద్వారములలో కూడి రాజులకు దేవతల కొరకు నిర్మింపబడును. గృహములో శాలగోడ నుండి ప్రారంభమై ప్రదక్షిణ క్రమములో అలిందములు నిర్మించిన నంద్యావర్త వాస్తువగును. ఈగృహములో పశ్చిమ దిశను వదలి మిగిలిన దిశలలో ద్వారములుండును. ద్వారఅలిందములు దక్షిణోత్తర గోడలతో కలిసి యుండి ద్వితీయ తృతీయ అలిందములు ప్రదక్షిణ క్రమములో నుండి ద్వారము దక్షిణదిశలో నుండక పశ్చిమ ఉత్తర పూర్వదిశలలో ప్రదక్షిణ క్రమములో నిర్మింపబడిన వర్ధమాన వాస్తువగును.


స్వస్తికశాలలో పశ్చిమదిశలో అలిందముండును. పశ్చిమదిశ నుండి మొదలైన అలిందములు పూర్వదిశ శాలతో కూడియుండవలెను. పూర్వదిశలో రెండు అలిందములు నిర్మించవలెను. ఈవాస్తులో పూర్వదిశలో మాత్రమే ద్వారము నిర్మించిన శుభము కలుగును.

రుచకశాలలో పూర్వ పశ్చిమదిశలలో రెండు అలిందములు వాటి మధ్యలో రెండు అలిందముల నిర్మించవలెను. ఈవాస్తులో పూర్వదిశలో మాత్రమే ద్వారము నిర్మించిన శుభము కలుగును.


సర్వతో భద్రము




నంద్యావర్తము




వర్ధమానము



స్వస్తికము




రుచకము



ఉత్తర దిశలో శాల ఉండక మూడుదిశలలో శాలలున్న దానిని హిరణ్యానామక త్రిశాల వాస్తువందురు. ఈవాస్తువు ప్రశస్తము, పూర్వదిశలో శాల ఉండక మూడుదిశలలో శాలలున్న దానిని సుక్షేత్ర నామక త్రిశాలా వాస్తువందురు. ఈవాస్తువు ధన పుత్రాదులవృద్ధిని కలిగించును. దక్షిణము శాల ఉండక మూడు దిశలలో శాలలున్న దానిని చుల్లీనామక త్రిశాలవాస్తువందురు. ధననాశమును కలిగించును. పశ్చిమవైపుశాల ఉండక మూడు దిశలలో శాలలున్న దానిని పక్షఘ్ననామక త్రిశాల వాస్తువందురు. ఇది పుత్రనాశమును శత్రుత్వమును కలిగించును.

పశ్చిమ దక్షిణదిశలలో శాలలున్న సిద్ధార్థము,పశ్చిముత్తరములలో నున్న యమసూర్యము, ఉత్తరపూర్వ దిశలలోనున్న దండము, పూర్వదక్షిణములలో నున్న వాతము, పూర్వపశ్చిమములలో నున్న గృహచుల్లి, దక్షిణోత్తరములలో నున్న కాచ సంజ్ఞక వాస్తువందురు. సిద్ధార్థవాస్తులో ధనప్రాప్తి, యమసూర్యములో మృత్యువు, దండములో దండము మృత్యువు, వాతములో కలహము, గృహచుల్లిలో ధననాశము, కాచములో బంధునాశము కలుగును.



ఏకాశీ (ఎనభై ఒక్కటి) పదవాస్తును తయారు చేయుటకు పదిరేఖలు పూర్వపశ్చిమములలో పదిరేఖలు ఉత్తర దక్షిణములలో నిర్మించవలెను. ఈరేఖల నిర్మాణము వలన 81 పదముల క్షేత్రము తయారగును. దానిబయట పన్నెండు లోపల ముప్పదిరెండు మంది దేవతలుందురు.

పూర్వోక్తక్షేత్రములో ఈశాన్య కోణము తీసుకొని క్రమముగా శిఖి పర్జన్య జయంత ఇంద్ర సూర్య సత్య భృశ అంతరిక్ష దేతలుందురు. దక్షిణకోణము నుండి అనిల పూష వితథ బృహక్షత యమ గంధర్వ భృంగరాజ మృగదేవతలుందురు. నైరృతికోణము నుండి పిత దౌవారిక సుగ్రీవ కుసుమదంత వరుణ అసుర శోష పాపయుక్ష్మ దేవతలుందురు. వాయవ్యకోణము నుండి క్రమముగా రోగ సర్ప ముఖ్య భల్లాట సోమ భుజగ అదితి దితి దేవతలుందురు. మధ్యలో తొమ్మిది పదములలో బ్రహ్మ, బ్రహ్మకు పూర్వభాగములో అర్యమ, ప్రదక్షిణ క్రమములో ఒకపదమును వదలి సవిత వివస్వాన్ ఇంద్ర మిత్ర రాజయుక్ష్మ పృధ్వీధర ఆపవత్స ఈ ఎనిమిదిమంది దేవతలు బ్రహ్మ చుట్టు ఉందురు. ఈశాన్య కోణములో పర్జన్యుని క్రింద ఆప,ఆగ్నేయ కోణములో అంతరిక్షము క్రింద సావిత్ర, నైరృతికోణములో దౌవారికుని క్రింద జయ, వాయవ్యకోణములో పాపయుక్ష్మ క్రింద రుద్రుడు ఉండును.

ఈక్షేత్రములో ఈశాన్యకోణములో ఆప, ఆపవత్స, పర్జన్య అగ్ని,దితి ఈ ఐదుగురు దేవతలు ఒక్కొక్క పదమునకు స్వాములు. ఆగ్నేయకోణములో సవిత, సవిత్ర,అనల లేక అనిల,అంతరిక్ష,పూష,నైరృతికోణములో ఇంద్ర,జయ,దౌవారిక, పిత, మృగ, వాయవ్య కోణములో రాజయుక్ష్మ,రుద్ర,పాపయుక్ష్మ,రోగ,నాగ దేవతలు ఒక్కొక్క పదములో నుందురు. మిగిలిన బాహ్య(బయటి)పదములలో నున్న దేవతలు రెండు పదములలో నుందురు. ఇవి ఇరువది యగును. పూర్వదిశలో జయంతుడు, ఇంద్ర, సూర్య, సత్య, భృశ, దక్షిణములో వితథ,బృహక్షత,యమ, గంధర్వ,భృంగరాజ,పశ్చిమములో సుగ్రీవ, కుసుమదంత, వరుణ, అసుర, ఉత్తరదిశలో ముఖ్య,భల్లాట, సోమ, భుజంగ,అదితి వీరు రెండు పదములు కలిగి యుందురు.బ్రహ్మనుండి పూర్వదిశలలోనున్న నలుగురు దేవతలు(అర్యమ, వివస్వాన్, మిత్ర, పృధ్వీధర)మూడుపదములలో నుందురు.

వాస్తుపురుషుడు ఈశాన్యకోణములో తలనుంచి అధోముఖముగా నుండును. ఇతని శిరస్సుపై అగ్ని,ముఖములో ఆప,స్తనములో అర్యమ,ఛాతిపై అపవత్సుడుండును. పర్జన్యాది దేవతలు క్రమముగా నేత్రము చెవి ఛాతి భుజములపై నుందురు.భుజములో సత్యాది ఐదు దేవతలు(సత్య భృశ అంతరిక్ష అనిల పూష) చేతిలో వితథ బృహక్షత,పొట్టపై వివస్వానుడు, తొడపై యముడు, మోకాలుపై గంధర్వుడు, తొడలపై భృంగరాజ, పిరుదుపై మృగదేవత ఉందురు.ఈదేవతలందరు దక్షిణ అంగములో నుందురు. ఇదే విధముగా వామభాగములో అన్ని అంగములలో దేవతలుందురు. వామస్తనములో పృధ్విధరుడు

నేత్రములో దితి, చెవిలో అదితి, ఛాతిలో భుజగము, భుజముపై సోముడు,బాహువుపై భల్లాలుడు, ముఖ్య రోగ పాపయుక్ష్మ, హస్తముపై రుద్ర రాజయుక్ష్మ, చంకలో శోష అసుర, తొడలపై అసురుడు, మోకాలిపై కుసుమదంతుడు, తొడలపై సుగ్రీవ, పిరుదులపై దౌవారికుడుందురు. అంగముపై శక్ర జయంతులు, హృదయముపై బ్రహ్మ,కాలిపై పిత ఉందురు. ఈ విధముగా ఏకాశీపదములలో నగర,గ్రామ గృహాదులను వాస్తు పురుషుని అంగములుగా చేయవలెను.

అరువది నాలుగు పదముల క్షేత్రములో తొమ్మిదిరేఖలు ఉత్తర దక్షిణ దిశలలో తొమ్మిదిరేఖలు తూర్పు పడమరదిశలలో నిర్మించవలెను. కోణములలో కర్ణాకారములో రెండు రేఖలు గీయవలెను. ఈక్షేత్రములో బ్రహ్మ నాలుగు పదములలో నుండును. బ్రహ్మకు నాలుగుకోణములలో ఎనిమిది మంది దేవతలు(ఆప ఆపవత్స సవిత సవిత్ర ఇంద్ర జయంత రాజయుక్ష్మ రుద్ర) బయట నాలుగు కోణములలో ఎనిమిదిమంది దేవతలు (శిఖి అంతరిక్ష అనిల లేక అనల మృగ పిత పాపయుక్ష్మ రోగ దితి) సగము పదము కలిగి యుందురు. వారికి రెండువైపుల పర్జన్య భృశ పూష భృంగరాజ దౌవారిక శోష నాగ అదితులు ఒకటిన్నర పదముల స్వాములగుదురు. మిగిలిన ఇరువది మంది దేవతలు (జయంత ఇంద్ర సూర్య సత్య వితథ బృహక్షత యమ గంధర్వ సుగ్రీవ కుసుమదంత వరుణ అసుర ముఖ్య భల్లాట సోమ భుజగ అర్యమ వివస్వాన్ మిత్ర పృధ్వీధర) రెండు పదములలో నుందురు.

ఏకాశీపదవాస్తు చిత్రము

వాయువ్యం — ఉత్తరం — ఈశాన్యం

రోగ	నాగ	ముఖ్య	భల్లాట	సోమ	భుజగ	అదితి	దితి	శిఖి
పాప యుక్ష్మ	రుద్ర						ఆప	పర్జన్య
శోష		రాజ యుక్ష్మ	పృధ్వీధర			అపవత్స	జయంత	
అసుర		మిత్ర	బ్రహ్మ			అర్యమ	ఇంద్ర	
వరుణ							సూర్య	
కుసుమదంత							సత్య	
సుగ్రీవ		ఇంద్ర	వివస్వాన్			సవిత	భృశ	
దౌవారిక	జయ	భృంగ రాజ	గంధర్వ	యమ	బృహత్ క్షత	వితథ	సవిత్ర	అంతరిక్ష
పిత	మృగ						పూష	అనిల

పశ్చిమం — తూర్పు

నైరృతి — దక్షిణం — ఆగ్నేయం

చతు:షష్టి పదవాస్తు చిత్రము

వాయువ్యం ఉత్తరం ఈశాన్యం

రోగ పాప యక్ష్మ నాగ ముఖ్య భల్లాట సోమ భుజగ అదితి దితి శిఖి

శోష పర్జన్య

అసుర రుద్ర రాజ యక్ష్మ పృధ్వీధర ఆప ఆప వత్స జయంత

వరుణ ఇంద్ర

పశ్చిమం కుసుమదంత మిత్ర బ్రహ్మ అర్యమ సూర్య తూర్పు

సుగ్రీవ జయ ఇంద్ర వివస్వాన్ సవిత సావిత్రి సత్య

దౌవారిక భృశ

భృంగ రాజ గంధర్వ యమ బృహత్ క్షత వితథ పూష అంతరిక్ష అనిల

పిత మృగ

నైరృతి దక్షిణం ఆగ్నేయం

పదముల మధ్య స్థానములో వంశము (కోణము నుండి కోణము కుండు రేఖలు) లు పరస్పరము కలిసిన స్థానములను మర్మస్థానములందురు. బుద్ధిమంతుడైన పురుషుడు ఆమర్మస్థానములను పీడింపరాదు. ఈ మర్మస్థానములు అపవిత్ర వస్తువులు (కుండ పెంకులు మున్నగునవి) మేకులు స్తంభములు పాషాణములు అస్త్రములతో పీడింపబడిన అదే అంగములో గృహస్వామికి పీడ కలుగును. అనగా పీడింపబడిన స్థానము వాస్తుపురుషుని ఏఅంగములో నున్నదో ఆఅంగములో గృహయజమానికి పీడ కలుగును. హవనకాలములో గృహయజమానికి ఏఅంగములో దురద కలుగునో వాస్తుపురుషుని అదేఅంగములో శల్యములున్నవని తెలుపవలెను. లేకఏదేవతకు ఆహుతి నిచ్చినపుడు అశుభనిమిత్తములు(శకునములు తుమ్ములు ఏడ్చుట అరుచుట అశుభములను వినుట)లేక అగ్నిలో వికారముత్పన్నమైన ఆదేవతాస్థానములో శల్యమున్నదని తెలుపవలెను.

కాష్ఠ(కర్ర) శల్యములున్న ధనహాని,ఎముక శల్యములున్న పశుపీడ, రోగ భయము,లోహపు శల్యములున్న శస్త్రభయము, కపాలము కేశ శల్యములున్న మృత్యువు,

బొగ్గులున్న చోరభయము, భస్మమున్న అగ్నిభయము కలుగును. బంగారము వెండి కాక ఇతరశల్యములు వాస్తుపురుషుని మర్మస్థానములో నున్న అత్యంత అశుభము జరుగును. ధాన్యముల పొట్టు మర్మస్థానములు లేక అన్యస్థానములో నున్న ధనము వచ్చునది ఆగిపోవును. నాగదంతము మర్మస్థానములో నున్న దోషమును కలిగించును. మర్మస్థానము కాక వేరొకస్థానములో నున్న శుభము కలుగును.

రోగ నుండి వాయువు వరకు, పిత నుండి శిఖి వరకు, వితథ నుండి శోష వరకు,ముఖ్యనుండి భృశ వరకు, జయంత నుండి భృంగరాజ వరకు, అతిథి నుండి సుగ్రీవుని వరకు సూత్రము బంధించవలెను. ఈసూత్రముల తొమ్మిది సంపాత స్థానములు వాస్తుపురుషునికి అతిమర్మస్థానములు. ఒకపదములో ఎనిమిదవవంతు మర్మస్థాన పరిమాణముండును. ముందు తెల్పిన ఆరు సూత్రములను వంశములందురు. వాస్తు విభాగములో నున్న పూర్వపశ్చిమ, ఉత్తర దక్షిణదిశలలో నున్న పదేసి రేఖలు శిరలనబడును. వాస్తువులో ఒకపాద విస్తారము ఎన్ని హస్తములో అన్ని అంగుళముల విస్తారము ఒక వంశమునకు, ఒకటిన్నర విస్తారము శిరలకగును.

సుఖమును కోరు గృహస్వామి గృహము మధ్యలో నున్న బ్రహ్మను ప్రయత్నముతో రక్షించవలెను. దానిపై ఉమ్మి మున్నగు అపవిత్ర వస్తువులనుంచిన గృహస్వామికి పీడ కలుగును. వాస్తుపురుషుని దక్షిణ భుజము హీనమైన ధననాశము, స్త్రీకృతదోషమగును. వామభుజము హీనమైన ధనధాన్య నాశము, శిరస్సుహీనమైన ధనము ఆరోగ్యము అన్నిగుణములకు నాశము. చరణముహీనమైన స్త్రీదోషము పుత్రుని మృత్యువు దాసీతనము కలుగును. వాస్తు పురుషునికి అన్ని అంగములు సంపూర్ణములైన ఆస్థానములో నివసించు మనుష్యునికి మాన ధనయుతమైన సుఖము కలుగును.

గృహ నగర గ్రామములలో ఇదే విధముగా దేవతలుందురు. వాటిలోనివసించు బ్రాహ్మణాదులు యథాక్రమముగా నివాసముండవలెను. బ్రాహ్మణాది వర్ణములవారు క్రమముగా ఉత్తర దిశాదిగా నివసించవలెను. బ్రాహ్మణులు ఉత్తరదిశలో, క్షత్రియులు పూర్వదిశలో, వైశ్యులు దక్షిణదిశలో, శూద్రులు పశ్చిమదిశలో నివసించవలెను. పూర్వాభిముఖముగా గృహమునకు వాకిలి ద్వారము ఉత్తరదిశలో,దక్షిణాభిముఖ గృహమునకు వాకిలి ద్వారము పూర్వదిశలో, పశ్చిమాభిముఖ గృహమునకు వాకిలి ద్వారము దక్షిణములో, ఉత్తరాభిముఖమునకు వాకిలి ద్వారము పశ్చిమదిశలో నుంచవలెను.

పూర్వోక్త ఏకాశీ పదక్షేత్రములో నవగణిత సూత్రముతో, చతు:షష్టి పదముల క్షేత్రములో అష్టగుణిత సూత్రముతో విభజించిన అనలాది ముప్పదిరెండు ద్వారముల నిర్మాణమగును. క్రమముగా వాటి ఫలము తెలుపబడును.

శిఖి నుండి అంతరిక్ష వరకు పూర్వదిశలో ఎనిమిదిమంది దేవతలుందురు. శిఖి పదములో ద్వారము నిర్మించిన అగ్నిభయము, పర్జన్యలో కన్యాజన్మము, జయంతములో అధికధనము,ఇంద్రపదములో ప్రసన్నత, సూర్యపదములో క్రోధము, సత్యలో అసత్య భాషణము, బృశలో క్రూరత, అంతరిక్షములో ద్వారము నిర్మించిన దొంగతనము కలుగును. అనిలము నుండి మృగ వరకు ఎనిమిది మంది దేవతలు దక్షిణములో నుందురు. అనిలపదములో ద్వారము నిర్మించిన అల్పపుత్రులు, పౌష్ణలో దాసీతనము, వితథలో నీచత్వము, బృహక్షతలో భోజనపాన పుత్రవృద్ధి, యామ్యములో అశుభము, గంధర్వములో కృతఘ్నుత, భృంగరాజులో నిర్ధనత, మృగములో ద్వారము నిర్మించిన పుత్రబలమునకు హాని కలుగును.

పిత నుండి పాపయుక్ష్మ వరకు ఎనిమిదిమంది దేవతలు పశ్చిమదిశలో కలరు. పితాపదములో ద్వారము నిర్మించిన పుత్రులకు పీడ, దౌవారిక పదములో శత్రువృద్ధి సుగ్రీవపదములో పుత్రధనలాభము, కుసుమదంతపదములో పుత్రధన సంపత్తిప్రాప్తి, వరుణపదములో ధనసంపత్తి, అసురలో రాజభయము, శోషలో ధననాశము, పాపయుక్ష్మ పదములో ద్వారము నిర్మించిన రోగము కలుగును. రోగము నుండి దితి వరకు ఎనిమిది మంది దేవతలు ఉత్తరదిశలో కలరు.రోగపదములో ద్వారము నిర్మించిన మృత్యువు బంధనము, సర్పములో శత్రువృద్ధి, ముఖ్యలో పుత్రధనలాభము, భల్లాటములో సంపూర్ణ శౌర్య గుణసంపత్తి, సోమలో పుత్రులతో ద్వేషము, అదితిలో స్త్రీలద్వారా దోషము, దితిపదములో ద్వారము నిర్మించిన నిర్ధనత (ధనములేక పోవుట) కలుగును.

మార్గము వృక్షము ఇతరగృహముల కోణము కూపము స్తంభము మురికిగుంట లతో విద్ధమైన అనగా ద్వారమునకు ఎదురుగా నున్న అశుభము కలుగును.గృహద్వారము ఎత్తుకు రెట్టింపు దూరము దాటి వేధలున్న దోషము కలుగదు. గృహద్వారము మార్గముతో వేధింపబడిన గృహస్వామికి మృత్యువు, వృక్షముతో వేధింపబడిన బాలురకు దోషము, బురదతో వేధింపబడిన శోకము, మురికినీటి ప్రవాహముతో వేధింపబడిన అధికవ్యయము, కూపముతో వేధింపబడిన అపస్మార వ్యాధి (మూర్ఛ) రోగము, దేవతాప్రతిమతో వేధింపబడిన గృహస్వామి నాశము, స్తంభముతో వేధింపబడిన స్త్రీలకు దోషము, బ్రహ్మకు ఎదురుగాన్న కులనాశము కలుగును.

గృహద్వారము తెరువకుండ (దానికదే)తెరుచుకున్న దానిలో నివసించేవారికి ఉన్మాదము (పిచ్చి) కలుగును. దానికదే మూయబడిన కులనాశము, ముందు చెప్పిన దానికన్న అధిక పరిమాణముతో పెద్దద్వారమున్న జరిగిన రాజభయము, ప్రమాణముకన్న తక్కువైన ద్వారమున్న దొంగలభయము దు:ఖము కలుగును. ఒకగృహ ద్వారమునకు పైభాగమున రెండవ అంతస్తులో రెండవద్వారమున్న శుభము కలుగదు.

ఆద్వారము చిన్నదైనప్పటికి శుభము కలుగదు. మృదంగాకృతిలో పెద్దదిగా నున్న ద్వారము ఆకలి భయమును కలిగించును. కుబ్జ(చిన్న)ద్వారము కులనాశమును కలిగించును. పై భాగపు కాష్ఠము వలన నొక్కబడిన ద్వారము గృహస్వామికి పీడ కలిగించును. లోపలికి వంగిన ద్వారము గృహస్వామికి మృత్యువు కలిగించును. బయటకు వంగిన ద్వారము గృహస్వామిని ప్రవాసమునకు పంపును. దిగ్భ్రాంత(ద్వారము వ్యతిరేక దిశకు చూస్తున్న) ద్వారము గృహస్వామిని చోరులతో పీడించును.

ప్రధానద్వారము ఎంత సుందరముగా తయారుచేసి నిర్మింతుమో అంత అందముగా మిగిలిన ద్వారములను నిర్మించరాదు. కలశము శ్రీఫలము పత్ర పుష్పములతో ప్రధానద్వారము శోభను పెంచవలెను.

గృహము బయట ఈశానాది నాలుగు కోణములలో చరకి, విదారిక, పూతన, రాక్షసి నివాసముండును. పురము భవనము గ్రామముల కోణములలో నివసించువారికి దోషము కలుగును. కాని చండాలాదులు అంత్యజులు నీచజాతులు నివాసమున్న ఉన్నతి కలుగును.

జువ్వి,మర్రి,మేడి, రావి వృక్షములు దక్షిణాది క్రమములో దిశలలోనున్న అశుభము. ఉత్తరాది క్రమములో దిశలలోనున్న శుభమునిచ్చును. దక్షిణములో జువ్వి పశ్చిమములో మర్రి,ఉత్తరములో మేడి,పూర్వదిశలో రావి అశుభమును,ఉత్తరములో జువ్వి, పూర్వదిశలో మర్రి,దక్షిణములో మేడి, పశ్చిమదిశలో రావి శుభమునిచ్చును.

ముళ్ళవృక్షములు గృహసమీపమున నున్న శత్రుభయము కలుగును. పాలుగారు వృక్షములున్న ధననాశము, ఫలవృక్షములున్న సంతాన నాశము కలుగును. వీటి కఱ్ఱను గృహములో నుపయోగించిన శుభము కలుగదు. పైన తెల్పిన ముళ్ళ వృక్షములను నరికివేసి వాటిస్థానములో పున్నాగ,అశోక, అరిష్ట, వకుల,పనస,శమీ,శాలవృక్షములను పెంచిన పైన తెల్పిన దోషములు నశించును.

ప్రశస్తమైన ఔషధ వృక్షములతో లతలతో మంచిమట్టితో సుగంధముతో కూడిన నిర్మలము,ఛిద్రరహితమైన భూమిలో ప్రయాణము చేయునపుడు తన శ్రమ పోగొట్టుకొనుటకు అక్కడ కొంతసేపు మనుష్యుడు విశ్రమించిన లక్ష్మీ ప్రసన్నుడగును. అవన్నీ గృహమునకు దగ్గిరగా నున్న చెప్పేదేమున్నది,ఎల్లప్పుడు అక్కడ లక్ష్మీ ప్రసన్నము కలుగును.

గృహసమీపములో మంత్రి గృహమున్న ధననాశము, ధూర్తుని గృహమున్న పుత్రనాశము, దేవతా గృహమున్న మానసిక అశాంతి, చౌరాస్తాయైన కీర్తినాశము, ప్రధాన వృక్షమున్న గృహభయము కలుగును. చెదలున్న గృహము గృహస్వామికి కష్టము కలిగించును. గృహసమీపములో గొయ్యి ఉన్న దాహరోగము, తాబేలు ఆకృతిలో భూమి ఉన్న ధననాశము కలుగును.

ఉత్తరమువైపు పల్లపుభూమి బ్రాహ్మణులకు,పూర్వదిశలో పల్లపుభూమి క్షత్రియులకు, దక్షిణదిశలో పల్లపుభూమి వైశ్యులకు, పశ్చిమదిశలో పల్లపుభూమి శూద్రులకు శుభమునిచ్చును.బ్రాహ్మణులకు నాలుగు దిశలలో ఏదిశ పల్లముగా నున్నను గృహము నిర్మించవచ్చును.మిగిలిన వారికి వారివారి దిశలలో పల్లముగానున్న భూమిలో గృహము నిర్మించవలెను.

గృహకర్త హస్తముతో గృహమధ్యములో ఒకహస్తము పొడవు, ఒకహస్తము వెడల్పు ఒకహస్తము లోతు కలిగిన గోతిని త్రవ్వి అదేమట్టితో గోతిని పూడ్చవలెను. గోతిని నింపుటకు మట్టి తక్కువైన అశుభము, సమానమైన సమము, మట్టి అధికముగా మిగిలిన శుభము కలుగును.

ముందు తెల్పిన విధముగా గోతిని త్రవ్వవలెను. దానిలో జలమును నింపి వంద అడుగులు వెళ్ళి తిరిగిరావలెను.అప్పుడు గోతిలో నీరు అదేవిధముగా నున్న శుభము కలుగును. ఆమట్టిని ఒక అధకప్రమాణముతో బుట్టలో నింపి దానిని తూకము చేయవలెను. ఆమట్టి పదహారు పలముల బరువున్న ఆభూమి శుభమునిచ్చును.

నాలుగువత్తుల దీపమును వెలిగించి మట్టిపాత్రలో నుంచవలెను.ఉత్తరాది క్రమములో బ్రాహ్మణాది వర్ణములను కల్పనచేయవలెను.ఆపాత్రను గోతిలో నుంచవలెను. ఏదిశలో నున్న వత్తి ఎక్కువ సమయము వరకు వెలుగునో ఆదిశకు సంబంధించిన వర్ణము వారికొరకు ఆదిశ శుభమునిచ్చును.

సాయంకాలము బ్రాహ్మణాది వర్ణముల పుష్పములను (తెలుపు ఎరుపు పసుపు నలుపు) తీసుకొని గోతిలో వేయవలెను. రెండవరోజు ఆపుష్పములను తీసిచూచిన ఏపూవు వాడకుండ ఉండునో ఆభూమి శుభమునిచ్చును.లేని యెడల మనస్సు ఏప్రదేశములో ప్రసన్నముగా నుండునో అక్కడ నివసించవలెను. దీనిలో ఆలోచించవలసిన అవసరము లేదు.

బ్రాహ్మణాది వర్ణములకు క్రమముగా తెలుపు,ఎరుపు,పసుపు, నలుపు భూములు శుభమునిచ్చును. బ్రాహ్మణాది వర్ణములకు నెయ్యి,రక్తము, అన్నము, మద్యగంధముల భూమి శుభమునిచ్చును.బ్రాహ్మణాది వర్ణములకు కుశలు, మంజిగడ్డి, గరిక, రెల్లుగడ్డితో కూడిన భూమి శుభమునిచ్చును. బ్రాహ్మణాది క్రమములో తీపి,పులుపు,చేదు,రుచులు కలిగిన భూమి శుభమునిచ్చును.

గృహస్వామి బ్రాహ్మణులు తెలిపిన భూమిలో మొదట నాగలితో దున్ని దానిలో బీజములను చల్లవలెను.దానిలో ఒకరాత్రి గోవులను కట్టవలెను. తర్వాత దైవజ్ఞులు తెలిపిన ముహూర్తములో అక్కడికి వెళ్ళి అనేక విధములైన భక్ష్యపదార్థములు, పెరుగు, అక్షతలు, సుగంధములు, పుష్పములు, ధూపములతో గృహస్వామి, స్థపతి బ్రాహ్మణులను

పూజించవలెను. గృహస్వామి బ్రాహ్మణుడైన శిరస్సు, క్షత్రియుడైన ఛాతి, వైశ్యుడైన తొడలు, శూద్రుడైన కాళ్ళను స్పర్శించి గృహారంభములో రేఖను గీయవలెను.

బొటనవ్రేలు,మధ్యమవ్రేలు,తర్జని (చూపుడు వ్రేలు) బంగారము, వెండి, ముత్యము, పెరుగు, ఫలములు, పూవులు, అక్షతలతో గృహారంభరేఖను నిర్మించిన స్వామికి శుభము కలుగును. పైన తెల్పిన రేఖశస్త్రముతో గీచిన శస్త్రముతో గృహస్వామికి మృత్యువు, గడ్డితో చేసిన దొంగలభయము, కర్రతో చేసిన రాజభయము కలుగును. వంకరకాలుతో గీచిన, లేక కనిపించని రేఖ గీచిన శత్రుభయమును, కష్టమును కలిగించును. చర్మము, బొగ్గు,ఎముకలు, దంతములతో గీచినరేఖ గృహపతికి అశుభము కలిగించును. ఎడమ ప్రక్కనుండి గీచిన రేఖ శత్రుత్వమును,ప్రదక్షిణ క్రమములో గీచిన రేఖ సంపత్తిని కలిగించును. గృహారంభ కాలములో కఠోరవచనము పలుకుట,ఉమ్మిఊయుట,తుమ్ముట చేసిన అశుభము కలుగును. సగము నిర్మించిన లేక సంపూర్ణముగా నిర్మించిన గృహములో ప్రవేశించు సమయమున కార్మికుడు ముందు తెలుపబోవు చిహ్నములను, అనగా స్వామి ఎక్కడ ఉన్నాడో, ఏఅంగమును స్పృచించుచున్నాడో, ఆసమయములో దీప్తదిశలో నున్న పక్షి గణములు ఏ విధముగా కఠోరశబ్దము చేయుచున్నవో లేక గృహపతి ఏస్థానములో నిలబడెనో ఆస్థానమునకు క్రింద గృహపతి స్పర్శించిన అంగమునకు సమానమైన స్థలఅంగములో ఎముకలున్నవని తెలుపవలెను. ఉదయకాలములో ఒక్కొక్క ప్రహర క్రమములో పూర్వదిశలలో సూర్యుడుండును. ఉదయకాలములో మొదటిప్రహరలో పూర్వదిశలో, రెండవప్రహరలో ఆగ్నేయదిశలో,మూడవప్రహరలో దక్షిణములో, నాల్గవప్రహరలో నైరృతిదిశలో రాత్రి ప్రథమ ప్రహరలో పశ్చిమదిశలో,రెండవ ప్రహరలో వాయువ్యదిశలో మూడవప్రహరలో ఉత్తరదిశలో, నాల్గవప్రహరలో ఈశాన్యదిశలో సూర్యుడుండును. ఏదిశను సూర్యుడు విడిచెనో అది అంగారిణి, ఏదిశలో నుండెనో అది దీప్తము. ఏదిశకు వెళ్ళునో అదిధూమితము మిగిలిన ఐదు దిశలు శాంతమని పిలువబడును. అనగా ఉదయకాలములో ప్రథమప్రహరలో ఈశాన్యకోణము అంగారిణి, పూర్వదిశ దీప్తము, ఆగ్నేయదిశ ధూమితము మిగిలిన ఐదు దిశలు శాంత సంజ్ఞకములగును.

శకునము చూచు సమయమున దీప్తదిశకు ముఖము పెట్టి ఏనుగు, గుర్రము, కుక్క మున్నగు జంతువులు అరచిన స్వామి నిలబడిన స్థలములో భూమిలో గృహస్వామి స్పర్శించిన అంగములో ఎముకలుండును.

సూత్రమును కట్టు సమయమున గాడిద శబ్దము వినపడిన గృహపతికి క్రింద ఎముకలున్నవని చెప్పవలెను. కుక్కనక్క ఆత్రాడుపై నుండి దూకినపుడు కూడ పైన తెల్పిన స్థానములో ఎముకలున్నవని తెలుపవలెను. ఆసమయములో ఏస్థానములో శాంతదిశవైపుకి పక్షులు ముఖముపెట్టి మధురశబ్దము చేయుచున్నవో ఆస్థానములో లేక వాస్తుపురుషుని

ఏ అంగముపై కూర్చొన్నవో దానిక్రింద ధనమున్నదని తెలుపవలెను.

సూత్రముపట్టు సమయమున తెగిన గృహపతికి మృత్యువు, గోతిలో నుంచు సమయములో మేకు క్రిందికి వెళ్ళిన గృహపతికి పెద్దరోగము కలుగును. ఆసమయములో గృహపతి కార్మికులకిద్దరికి స్మరణశక్తి నశించిన ఇద్దరికి మృత్యువు కలుగును. నీటితో కలశమును తెచ్చునపుడు క్రిందపడిన గృహపతికి శిరోరోగము, క్రిందపడి తిరగబడిన గృహస్వామి కులములో ఉపద్రవము, పగిలిన కార్మికునికి మృత్యువు, కలశము చేతిలో విరిగిన గృహస్వామికి మృత్యువు కలుగును.

ముందు ఈశాన్యకోణములో పూజచేసి శిలాన్యాసము చేయవలెను. ప్రదక్షిణ క్రమములో మిగిలిన శిలలను స్థాపించవలెను. ఇదేవిధముగా స్తంభములను కూడ నిర్మించవలెను. ఛత్రము,మాల,వస్త్రము,ధూపము,చందనములతో అలంకరించి స్తంభమును నిలబెట్టవలెను. ఈ విధముగా ద్వారమును కూడ సరియైన విధముగా నిలబెట్టవలెను.

స్తంభము లేక ద్వారముపై పక్షి ఆదిప్రాణులు కూర్చొన్న, నిలబెట్టినపుడు కదిలిన, క్రిందపడిన సరిగా నిలబడకున్న పూర్వకథిత ఇంద్రధ్వజ సమానముగా దీని ఫలితమును తెలిసికొనవలెను. వాస్తు భూమిలో పూర్వ ఉత్తరదిశలలో ఎత్తున్న పుత్రనాశము, దుర్గంధముతో నున్న పుత్రనాశము, వంకరగానున్న బంధునాశము, దిక్కులు వంకరగానున్న స్త్రీల గర్భమునకు అభావము కలుగును. గృహవృద్ధిని కోరుకొను మనుష్యుడు వాస్తుభూమిని నాలుగు వైపుల సమానముగా పెంచవలెను. వాస్తుభూమి పెంచవలెనన్న ఉత్తర తూర్పు దిశలను పెంచవలెను. ఆవిధముగా పెరిగిన స్వల్పదోషము (మిత్రద్వేషము,సంతాపము) ఆదోషమును సహించు శక్తిలేనపుడు దానిని పెంచకూడదు.

వాస్తుభూమి పూర్వదిశవైపు పెరిగిన మిత్రుల వలన ద్వేషము, దక్షిణమునకు పెరిగిన మృత్యువు, పశ్చిమదిశకు పెరిగిన ధననాశము, ఉత్తరదిశకు పెరిగిన మనసులో సంతాపము కలుగును. ఈశాన్యకోణములో దేవతా గృహము,ఆగ్నేయకోణములో పాకశాల,నైరృతికోణములో గృహసామగ్రిస్థానము,వాయవ్య కోణములో ధనధాన్య స్థాపన గృహమును నిర్మించవలెను. పూర్వాది దిశలలో జలము క్రమముగా పుత్రనాశము, అగ్నిభయము,శత్రుభయము,స్త్రీకలహము,స్త్రీల దుశ్శీలత,నిర్ధనత,ధనవృద్ధి, పుత్రవృద్ధి కలిగించును.

పక్షిగూడు కలిగిన, విరిగిన, దేవాలయ సమీపములో నున్న, శ్మశానములో ఉన్న, పాలుకలిగిన వృక్షములు, దవ (ఔషధ వృక్షము) తాంద్ర,వేప,ఆరణి వృక్షములను వదిలి మిగిలిన వృక్షములను గృహము నిర్మించుటకు నరుకవలెను. వృక్షమును నరుకు నపుడు ఉత్తర పూర్వదిశలో పడిన శుభము, మిగిలిన దిశలలో పడిన అశుభము కలుగును.

వృక్షము నరికిన ప్రదేశము వికారరహితమైన ఆవృక్షపు కాష్ఠము గృహమునకు శుభమును కలిగించును. నరికిన ప్రదేశములో పీతవర్ణపు మండలము కనిపించిన వృక్ష మధ్యములో ఉడుము, మంజిష్ఠపు తీగ వలె ఎరుపు రంగు మండలము కనపడిన కప్ప, నీలిరంగు మండపము కనపడిన సర్పము, ఎరుపు రంగు మండలము కనపడిన ఊసరవెల్లి,పెసల వర్ణపు మండలము కనపడిన రాయి, పసుపువర్ణము కనపడిన ఎలుక, ఖడ్గమువలె మండలము కనపడిన నీరున్నదని తెలుపవలెను.

లక్ష్మిని కోరుకొను మనుష్యుడు అన్నము, గోవు, గురువు దేవతలపైన వంశములపైన నిద్రించరాదు. ఉత్తరపశ్చిమ దిశలకు తలనుంచి నిద్రించరాదు. నగ్నశరీరముతో, నీటితో తడిసిన కాళ్ళతో నిద్రించరాదు. పుష్పములతో శోభితమైన, తోరణములతో నలంకరించిన జలపూర్ణకలశములతో శోభితమైన, ధూప గంధాదులచే పూజింపబడిన దేవతలు కలిగిన, బ్రాహ్మణుల వేదమంత్రముల ధ్వనులతో కూడిన గృహములో యజమాని ప్రవేశించవలెను.

ఏబదిమూడవ వాస్తు విద్యాధ్యాయము సమాప్తము

54. దకార్గలాధ్యాయము

వాస్తు విషయములను వివరించిన తర్వాత భూమిలోనున్న జలమును గురించి తెలియజేయబడుతున్నది. ధర్మమును యశస్సును కలిగించునది దకార్గలమగును. మనుష్యుని శరీరములో రక్తపునాడులున్నట్లుగా భూమిలో నీరు పైకి క్రిందికి శిరల రూపములో ప్రవహించును. ఆకాశము నుండి ఒకేరుచి కలిగిన జలము భూమిపై పడును. భూమిపై వివిధస్థానములలో వర్షించి అనేక విధములైన రుచులు కలిగినదగును. భూమి వర్ణము రుచులననుసరించి జలము రంగు రుచులు మారుట జరుగును. అందువలన జలము రంగును రుచిని పరీక్షచేయవలెను.

పూర్వాది దిశలలో క్రమముగా ఇంద్ర అగ్ని యమ రాక్షస వరుణ వాయు చంద్ర శివులు స్వాములగుదురు. ఈ ఎనిమిది దిక్పాలకుల నామములతో ఎనిమిది శిరలు ప్రసిద్ధమైనవి. ఈఎనిమిది శిరల మధ్యలో మహాశిర పేరుతో తొమ్మిదవ శిర ఉన్నది. ఈతొమ్మిది శిరలే కాక శతాధిక శిరలు తమతమ పేర్లతో ప్రసిద్ధములైనవి. పాతాళము నుండి పైకివచ్చిన శిర పూర్వాది నాలుగుదిశలలో నున్న శిరలు శుభకరమైనవి. ఆగ్నేయాదికోణములలో నున్న శిరలు అశుభ కారకములు. అందువలన వీటి లక్షణములను తెల్పెదను.

నీరులేని ప్రదేశములో ప్రబ్బలి వృక్షమున్న దానికి పశ్చిమదిశలో మూడు హస్తముల దూరములో ఒకటిన్నర పురుషుని లోతులో జలమున్నదని తెలుపవలెను.

పురుష ప్రమాణము 120 అంగుళములు అనగా 5 హస్తములుగా భావించిన 7.1/2 హస్తముల లోతులో జలముండునని తెలుపవలెను. ఇక్కడ పశ్చిమదిశ నుండి ప్రవహించు శిర(జలనాడి) ఉండును. ఇక్కడ త్రవ్విన కొన్ని చిహ్నములు కనపడును. సగము పురుష ప్రమాణము (2 1/2 హస్తములు) త్రవ్విన తెల్లని కప్ప, దానిక్రింద పచ్చని మట్టి, దాని క్రిందరాయి, దాని క్రింద నీరు ఉండును.

జలములేని ప్రదేశములో నేరేడు వృక్షమున్న దానికి మూడు హస్తముల ఉత్తరములో రెండు పురుష ప్రమాణముల లోతులో పూర్వశిర ఉండును. ఇక్కడ త్రవ్విన ఒకపురుష ప్రమాణపు లోతులో లోహపు వస్తువులు, వాసన కలిగిన మట్టి, దాని క్రింద కొంచెము తెల్లని మట్టి దాని క్రింద కప్ప ఉండును. నేరేడు వృక్షమునకు పూర్వదిశలో చేప, దాని క్రింద పావురము రంగు కలిగిన రాయి కనపడును. ఈ గోతిలో నల్లని మట్టి ఉండును. దీర్ఘకాలము జలముండును.

జలరహిత ప్రదేశములో అత్తిచెట్టు ఉన్న దానికి మూడు హస్తముల పశ్చిమదిశలో 1 1/2 పురుషుల ప్రమాణము లోతులో సుందరమైన జలనాడి యుండును. ఇక్కడ త్రవ్విన 1/2 పురుష ప్రమాణపు లోతులో తెల్లని సర్పము దాని క్రింద నల్లనిరాయి, దాని క్రింద సుందరజల శిర ఉండును. మద్దిచెట్టుకు మూడు హస్తముల ఉత్తరదిశలో పుట్ట ఉన్న, దానికి మూడు హస్తముల పశ్చిమదిశలో 3 1/2 పురుషుల ప్రమాణపు లోతులో జలముండును. అక్కడ త్రవ్విన 1/2 పురుషుని లోతులో ఉడుము. 1 పురుష ప్రమాణపు లోతులో బూడిద రంగు మట్టి దాని క్రింద అధిక జలముండును.

పుట్టలతో కూడిన సింధువార (నల్లవావిలి చెట్టు)వృక్షమునకు మూడుహస్తముల దక్షిణదిశలో 2 1/4పురుషుల ప్రమాణపు లోతులో ఎప్పుడూ ఎండని నీరు ఉండును. ఇక్కడ త్రవ్విన 1/2 పురుషుని లోతులో ఎర్రని చేప, దానిక్రింద పచ్చని మట్టి,దాని క్రింద తెల్లని మట్టి,దాని క్రిందరాయి చిన్నకణములతో కూడిన ఇసుక దాని క్రింద జలముండును. రేగుచెట్టుకు పూర్వదిశలో పుట్ట ఉన్న దానికి మూడుహస్తముల పశ్చిమదిశలో 3 పురుషుల లోతులో జలమున్నదని తెలుపబడెను. ఇక్కడ 1/2 పురుషుని లోతులో తెల్లని బల్లి కనపడును.

జల రహిత ప్రదేశములో పలాశ(మోదుగ)వృక్షముతో రేగిచెట్టు కలిసి యున్న దానికి మూడుహస్తముల పశ్చిమదిశలో 3 1/4పురుషుని లోతులో జలముండును. ఇక్కడ ఒక పురుషుని లోతులో విషము లేని సర్పముండును. మారేడు చెట్టుతో అత్తిచెట్టు కలిసి యున్న వాటికి మూడుహస్తముల దక్షిణదిశలో 3పురుషుల లోతులో జలముండును. ఇక్కడ 1/2 పురుషుని లోతులో నల్లని కప్ప బయటికి వచ్చును.

కాకోదుంబరి వృక్షము(కుక్కమేడి చెట్టు) నకు సమీపములో పుట్టఉన్న ఆపుట్టలో 3 1/4 పురుషుల లోతులో పశ్చిమదిశలో ప్రవహించు శిర ఉండును. ఇక్కడ త్రవ్విన

తెల్లని పచ్చని ఎలుక కనపడును. జలరహిత ప్రదేశములో 3 1/4 పురుషుల లోతులో దక్షిణశిర ప్రవహించును. ఇక్కడ త్రవ్విన నీలికమలము వంటి రంగు కలిగిన మట్టి, దాని క్రింద పావురపురంగు మట్టి కనపడును. ఒకహస్తము క్రింద మేకవాసన కలిగిన చేప, దానిక్రింద ఉప్పునీరు ఉండును.

జలరహిత ప్రదేశములో శోణాక (ఎర్రజిల్లేడు) వృక్షము కనపడిన దానికి రెండుహస్తముల వాయవ్యకోణములో 3పురుషుల లోతులోకుముదనామక శిర ఉండును. విభేతక (తాండ్ర)వృక్షమునకు సమీపమున దక్షిణదిశలో పుట్టకనపడిన ఆవృక్షమునకు రెండు హస్తముల పూర్వదిశలో 1 1/2 పురుషుల లోతులో జలనాడి యుండును.

తాండ్ర వృక్షమునకు పశ్చిమదిశలో పుట్టఉన్న ఆవృక్షమునకు ఒకహస్తము దూరములో ఉత్తరదిశలో 4 1/2 పురుషుల లోతులో శిర ఉండును. అక్కడ త్రవ్విన 1 పురుషుని లోతులో తేలు కనపడును. దానిక్రింద ఎరుపురంగు రాయి దానిక్రింద పశ్చిమ దిశలో ప్రవహించు జలనాడి యుండును. కాని జలనాడి మూడు సంవత్సరముల తర్వాత నష్టమగును.

కోవిదార (సప్తపర్ణ) వృక్షమునకు ఈశానకోణములో దర్భలతో కూడిన పుట్ట ఉన్న సప్తవర్ణ వాల్మీకము (పుట్ట)ల మధ్యలో 5 1/2 పురుషులలోతులో అధికజలముండును. అక్కడ త్రవ్విన 1 పురుషుని లోతులో కమలపుష్ప మధ్యభాగపు రంగుతో సమానమైన రంగు కలిగిన సర్పము, దాని క్రింద ఎర్రనిమట్టి, దానిక్రింద కురువిందమను పేరు గల రాయి కనపడును.

పుట్టతో కూడిన సప్తపర్ణ వృక్షమున్న దానికి ఒకహస్తము ఉత్తరములో 5 పురుషుల లోతులో జలమున్నదని తెలుపవలెను. అక్కడ త్రవ్విన 1/2 పురుషుని లోతులో పచ్చని కప్ప, దానిక్రింద హరితాల సమానమైన పచ్చని మట్టి, దానిక్రింద మేఘ సమానమైన రాయి, దానిక్రింద మధుర జలముతో ఉత్తరమువైపు ప్రవహించు శిర ఉండును.

ఏదైన వృక్షములో కప్ప కనపడిన ఆవృక్షమునకు ఒకహస్తము ఉత్తరదిశలో 4 1/2 పురుషుల లోతులో జలముండును. అక్కడ త్రవ్వినపుడు పురుషుని లోతులో ముంగిస దానిక్రింద క్రమముగా నల్లని పచ్చని తెల్లని మట్టి, దానిక్రింద కప్ప ఆకారముగా రాయి, దానిక్రింద జలముండును.

గానుగచెట్టుకు దక్షిణదిశలో పుట్ట ఉన్న రెండు హస్తముల దక్షిణములో 3 పురుషుల లోతులో శిరుండును. అక్కడ త్రవ్విన 1/2 పురుషుని లోతులో తాబేలు, దానిక్రింద పూర్వవాహినిగా శిరఉండును. దానిక్రింద ఉత్తరవాహిని శిరుండును. దానిక్రింద పచ్చనిరాయి దానిక్రింద జలముండును.

మధూక (ఇప్ప)వృక్షమునకు ఉత్తరదిశలో పుట్ట ఉన్న దానికి 5 హస్తముల

పశ్చిమదిశలో 7 1/2 పురుషుల లోతులో జలముండును. అక్కడ త్రవ్విన 1 పురుషుని లోతులో ప్రధానసర్పము, దాని క్రింద బూడిదవర్ణపు మట్టి, దానిక్రింద మినుపరంగు రాయి, దానిక్రింద ఎల్లపుడు నురుగతో ప్రవహించు జలము పూర్వవాహినిగా బయటకు వచ్చును.

తిలక వృక్షమునకు దక్షిణదిశలో కుశలు(దర్భ) గరికలతో కూడిన పుట్ట ఉన్న దానికి ఐదుహస్తముల పశ్చిమదిశలో, 5పురుషుల లోతులో జలము పూర్వవాహినిగా ప్రవహించును. కదంబ(మేడిమి)వృక్షమునకు పశ్చిమములో పుట్ట ఉన్న ఆవృక్షము నుండి మూడు హస్తముల దక్షిణమున 2 3/4పురుషుల లోతులో జలముండును. అక్కడ లోహపు గంధముతోకూడిన అధికజలము ఉత్తరవాహినిగా ప్రవహించును. పురుషుని లోతులో బంగారపు రంగు కప్ప, దానిక్రింద పచ్చని మట్టి కనపడును.

పుట్టతో కూడి తాటి లేక కొబ్బరి వృక్షములున్న ఆవృక్షము నుండి ఆరు హస్తముల పశ్చిమదిశలో 4పురుషులలోతులో దక్షిణ వాహినిగా శిర ఉండును. కపిత్థ (వెలగ) వృక్షమునకు దక్షిణములో పుట్టఉన్న ఆవృక్షము నుండి 7హస్తముల ఉత్తరదిశలో 5 పురుషుల లోతులో జలముండును.అక్కడ ఒకపురుషుని లోతులో వివిధ రంగుల సర్పము నల్లనిమట్టి ఉండును.దాని క్రింద రాయి దానిక్రింద తెల్లనిమట్టి పశ్చిమ వాహిని యైన జలనాడి, దానిక్రింద ఉత్తరవాహినియైన జలనాడి యుండును.

అశ్మంతక (ముంజగడ్డి)ముతో కూడిన రేగి వృక్షము పుట్టతో కూడియున్న ఆవృక్షము నుండి 6హస్తముల ఉత్తరదిశలో 3 1/2 పురుషుల లోతులో జలముండును. 1 పురుషుని లోతులో తాబేలు దానిక్రింద బూడిదరంగు రాయి, దానిక్రింద ఇసుక మన్ను, దానిక్రింద దక్షిణ శిర, దానిక్రింద ఈశాన కోణములో శిర ఉండును.

హరిద్ర వృక్షమునకు ఎడమవైపున పుట్ట ఉన్న ఆవృక్షమునకు మూడు హస్తముల పూర్వదిశలో 5 1/3 పురుషుల లోతులో జలముండును. అక్కడ ఒకపురుషుని లోతులో నీలవర్ణ సర్పము,దానిక్రింద పచ్చనిమట్టి, దానిక్రింద ఎరుపు రంగురాయి,దానిక్రింద నల్లనిమట్టి, దానిక్రింద పశ్చిమశిర, దక్షిణశిరలుండును.

జలరహిత ప్రదేశములో అధికజలమున్న దేశచిహ్నములు కనిపించిన లేక అక్కడ నీటి ఊటలు గరిక కనిపించిన 1 పురుషుని లోతులో జలముండును. బొదంగి తెల్లతెగడ దంతి దూలగొండి వెలుగుతీగ నవమాలిక(విరజాజి)లున్న రెండు హస్తముల దక్షిణములో 3 పురుషుల లోతులో జలముండును.

నిర్మలమైన చిన్నపెద్ద కొమ్మలతో కూడిన చిన్న పెద్ద వృక్షములు జలము దగ్గరలో నుండును.అంతస్సార వృక్షములు, వివర్ణపత్రములు ఎండిన వృక్షములున్న చోట జల ముండదు.పుట్టతో కూడిన తిలక వృక్షము, ఆమ్రాతకము(అంబాళము)వరుణకము,భల్లాతక

(జీడిచెట్టు)మారేడు తిందుక (తుమికి) అంకోల పిండార శిరీష అంజన పరూషక (పేరీదు) అశోక అతివల ఈ వృక్షముల నుండి మూడు హస్తముల ఉత్తరదిశలో 4 1/2 పురుషుల లోతులో జలముండును.

గడ్డి లేని ప్రదేశములో ఒకచోట పచ్చగడ్డి కనపడిన లేక తృణయుత ప్రదేశములో ఒకచోట తృణరహితమై (ఎండిపోయి) కనిపించిన ఆస్థానములో 4 1/2 పురుషుల లోతులో జలనాడి లేక ధనముండును. ముళ్లవృక్షముల మధ్యలో ముళ్లులేని వృక్షము, ముళ్లు లేని వృక్షముల మధ్యలో ముళ్లున్న వృక్షమున్న అక్కడ ఆవృక్షము నుండి మూడు హస్తములు పశ్చిమదిశలో 1 1/3 పురుషుల లోతులో జలము, లేక ధనముండును.

ఎక్కడ కాలితో తన్నిన బలమైన శబ్దము వచ్చునో అక్కడ 3 1/2 పురుషుల లోతులో జలము ఉత్తరపు జలనాడి యుండును. వృక్షపు ఒకశాఖ క్రిందివైపుకి వంగి తెల్లగానున్న ఆకొమ్మ క్రింద 3పురుషుల ప్రమాణములో జలము దొరుకును. ఏవృక్షపు పుష్పఫలములు వికారముగానున్నవో ఆవృక్షము నుండి మూడు హస్తముల పూర్వదిశలో 4 పురుషుల లోతులో శిరలుండును. క్రిందరాయి పచ్చని రంగు మట్టి కనపడును.

కంఠకారిక వృక్షము ముళ్లు లేకుండ తెల్లని పుష్పములతో కనపడిన ఆవృక్షము క్రింద 3 1/2 పురుషుల లోతు త్రవ్విన జలముండును. జలములేని ప్రదేశములో రెండు శిరస్సులున్న ఖర్జూరపు చెట్టు ఉన్న ఆవృక్షమునకు రెండు హస్తముల పశ్చిమదిశలో 3 పురుషుల లోతులో జలమున్నదని తెలుపవలెను. తెల్లని పుష్పముల కర్ణికార(కొండగోగు) పలాశ(మోదుగ) వృక్షములున్న ఆవృక్షముల నుండి రెండు హస్తముల దక్షిణ దిశలో 2 పురుషుల లోతులో జలముండును. ఏస్థలములో ఆవిరి,పొగ కనపడునో అక్కడ 2 పురుషుల లోతులో అధికజలము కలిగిన శిర ఉండును. ఏపొలములో ధాన్యముత్పన్నమై నష్టమగునో నునుపుగా నుండి ఉత్పన్నమై పాలిపోవునో అక్కడ 2పురుషుల లోతులో అధిక జలము గల శిర ఉండును.

మరు (ఎడారి) దేశములో ఏవిధముగా శిర ఉండునో తెలుపబడును. ఒంటె మెడవలె భూమిలో ఎత్తైన లోతులో శిరలుండును. పీలు (గొనుగుచెట్టు) వృక్షమునకు ఈశానకోణములో పుట్ట ఉన్న ఆవృక్షము నుండి 4 1/2హస్తముల పశ్చిమదిశలో 5పురుషుల లోతులో ఉత్తరదిశకు ప్రవహించు శిర ఉండును. ఇక్కడ త్రవ్విన 1పురుషుని లోతులో కప్ప దాని క్రింద కపిల(గోరోజనము)వర్ణము పచ్చనివర్ణము కలిగిన మట్టి దాని క్రింద రాయి, దానిక్రింద జలముండును. పీలు వృక్షమునకు పూర్వదిశలో పుట్ట ఉన్న ఆవృక్షము నుండి 4 1/2 హస్తముల దక్షిణ దిశలో 7పురుషుల లోతులో జలముండునని తెలుపవలెను. ఇక్కడ ఒకపురుషుని లోతులో ఒకహస్తము పొడవున్న సర్పము దానిక్రింద ఉప్పు జలము

కలిగిన దక్షిణశిర ఉండును.

కరీర(వెణుతురు)వృక్షమునకు ఉత్తరదిశలో పుట్ట ఉన్న ఆవృక్షమునుండి 4 1/2 హస్తముల దక్షణదిశలో 7 పురుషుల లోతులో జలముండునని తెలుపవలెను. ఇక్కడ ఒకపురుషునిలోతులో పచ్చనికప్ప కనపడును. రోహితక(మోదుగ) వృక్షమునకు పశ్చిమదిశలో పుట్ట ఉన్న ఆవృక్షమునకు మూడుహస్తముల దక్షిణదిశలో 12 పురుషుల లోతులో ఉప్పుజలముతో పశ్చిమవాహినిగా శిర ఉండును. అర్జున వృక్షమునకు పూర్వదిశలో 14 పురుషుల లోతులో శిర ఉండును. 1 పురుషుని లోతులో కపిలవర్ణపు ఉడుము కనపడును.

ఉమ్మెత్తచెట్టుకు ఉత్తరమున పుట్ట ఉన్న ఆవృక్షమును రెండు హస్తముల దక్షిణ దిశలో 15 పురుషుల క్రింద జలముండును. దీనిలో ఉప్పు జలముండును. 1/2 పురుషుని లోతులో ముంగిస, తామ్రవర్ణపు రాయి, ఎరుపు మట్టి కనపడును. దక్షిణశిర ప్రవహించును.

పుట్టలేకుండ బదరి (రేగు) రోహిత (మోదుగ) వృక్షములు ఒకచోట కనిపించిన ఆవృక్షములకు 3 హస్తముల పశ్చిమములో 16 పురుషుల లోతులో మధుర జలముండును. ముందు దక్షిణశిర తర్వాత ఉత్తరశిర ప్రవహించును, పిండివలె తెల్లనిరాయి తెల్లనిమట్టి కనపడును. 1/2 పురుషుని లోతులో తేలు కనపడును. కరీర వృక్షముతో పాటు రేగిచెట్టు కనపడిన ఆవృక్షముల నుండి మూడుహస్తముల పశ్చిమదిశలో 18 పురుషుల లోతులో ఈశాన్యకోణములో ప్రవహించు అధిక జలము కలిగిన శిర ఉండును.

పీలు వృక్షముతో రేగిచెట్టున్న వాటికి మూడుహస్తముల పూర్వదిశలో 20పురుషుల లోతులో ఎప్పుడు ఎండని ఉప్పు జలముండును. అర్జున(మద్ది) కరీరవృక్షములు, అర్జున రేగి వృక్షములు కలిసి ఉన్న ఆవృక్షముల నుండి రెండు హస్తముల పశ్చిమదిశలో 25 పురుషుల లోతులో జలముండును. పుట్టపై గరిక లేక తెల్లని దర్భలున్న పుట్ట క్రింద త్రవ్విన 21 పురుషుల లోతులో జలము దొరుకును. కదంబ(కడప)వృక్షము పుట్టపై గరిక కనపడిన కదంబ వృక్షము నుండి దక్షిణదిశలో రెండు హస్తములలో 25 పురుషుల లోతులో జలముండును.

మూడుపుట్టల మధ్యలో విజాతీయములై మూడు విధములైన రోహితాది వృక్షములున్న ఆ రోహిత వృక్షమునకు ఉత్తరదిశలో 4హస్తములు 16 అంగుళములలో 40 పురుషుల లోతు త్రవ్వినరాయి దానిక్రింద శిర ఉండును. కణుపులతో కూడిన శమీ (జమ్మి) వృక్షమునకు ఉత్తరమున పుట్టఉన్న ఆవృక్షమునకు పశ్చిమదిశలో 5హస్తములలో 50 పురుషులలోతులో జలముండును.

ఒక స్థానములో 5 పుట్టలున్న దాని మధ్యపుట్ట తెల్లగానున్న ఆపుట్టను త్రవ్విన 55 పురుషుల లోతులో శిరుండును. పలాశవృక్షముతో కూడిన శమీవృక్షమున్న ఆవృక్షములకు పశ్చిమదిశలో ఐదు హస్తములలో 60 పురుషుల లోతులో జలముండును.

ఇక్కడ 1/2 పురుషుని లోతులో సర్పము తర్వాత పచ్చనిమట్టి ఉండును. పుట్టపై పడిన తెల్లని రోహిత వృక్షమున్న ఆవృక్షమునకు పూర్వదిశలో ఒకహస్తము దూరములో 70 పురుషుల లోతులో జలముండును. తెల్లని ముళ్లతో కూడి శమీవృక్షమునకు దక్షిణములో ఒకహస్తము దూరములో 75 పురుషుల లోతులో జలముండును. ఇక్కడ త్రవ్విన 1/2 పురుషుని లోతులో సర్పముండును.

ఏచిహ్నములతో మరుస్థలములో జలమున్నదని తెల్పితిమో అవేచిహ్నములున్న అడవిలో జలముండునని తెలుపరాదు. ముందు నేరేడు బెత్తములద్వారా జల విషయమును ఏపురుషప్రమాణములో తెలుపబడెనో దానికి రెట్టింపు చేసి మరుభూములలో జలవిషయమును తెలిసికొనవలెను. పుట్టపై నేరేడు త్రివృత,నిసోత,శిశుమారి, సారివ, శమీ,శ్యామ,వారాహి,జ్యోతిష్మతి,గరుడ వేగ,సూకరిక,మాషపర్ణి,వ్యాఘ్రపద ఈ ఔషధ వృక్షములు పుట్టకు మూడుహస్తములో ఉత్తరములో 3పురుషుల లోతులో జలముండును. జలము స్వల్పముగానున్న ప్రదేశములో పూర్వోక్త లక్షణములున్నపుడు 5పురుషుల లోతులో జలమున్నదని తెలుపవలెను.

తృణము (గడ్డి) వృక్షము పుట్ట గుల్మము (బోదెలేని చెట్టు)లు లేక ఒకేవర్ణము కలిగిన మట్టి ఉండి ఆభూమిలో అనేక విధములైన వికారములు కనపడిన ఆభూమిలో 5పురుషుల లోతులో జలముండును. నునుపైన లోతైన ఇసుకలో కాలుంచినపుడు శబ్దము కలిగిన భూమిలో 4 1/2 లేక 5 పురుషులలోతులో జలముండునని తెలుపవలెను.

స్నిగ్ధ (నునుపైన చిక్కని) వృక్షములున్న వాటికి 4పురుషుల లోతులో జలముండును. అనేక వృక్షముల మధ్య ఒకవృక్షము వికారయుక్తముగా కనపడిన ఆవృక్షము నకు దక్షిణములో 4 పురుషుల లోతులో జలముండును. అధికజలము లేక స్వల్పజలము కలిగిన దేశములో కాలుపెట్టిన దిగబడిన లేక ఉండకూడని స్థానములో అనేక క్రిములున్న 1 1/2పురుషుని లోతులో జలముండును.

అన్నిచోట్ల వేడిగా నుండి ఒకచోట చల్లగానున్న, అన్నిచోట్ల చల్లగా నుండి ఒకచోట వేడిగానున్న భూమిలో 3 1/2 హస్తముల లోతులో జలముండును. స్వల్పజలము లేక అధికజలమున్న ప్రదేశములో ఇంద్రధనుస్సు చేప పుట్ట ఉన్న ఆభూమిలో 4హస్తముల లోతులో జలముండును. ఎక్కువ పుట్టలున్న ప్రదేశములో ఒకపుట్ట ఎత్తుగానున్న ఆపుట్ట క్రింద 4పురుషుల లోతులో జలముండును. ఏపొలములో ధాన్యము ఎండిపోవుట, లేక మొలవకుండుట జరిగిన ఆపొలములో 4 పురుషుల లోతులో జలమున్నదని తెలుపవలెను.

మర్రి పలాశ (మోదుగ) ఉదుంబర(మేడి) వృక్షములు ఒకచోట ఉన్న లేక మర్రి మోదుగ వృక్షములున్న ఈవృక్షముల క్రింద మూడుహస్తములు త్రవ్విన జలముగల ఉత్తర శిర ఉండును. గ్రామము నగరముల యొక్క ఆగ్నేయ కోణములో కూపమున్న ఆగ్రామ నగరములకు అనేకవిధములైన భయము కలుగును. ఎక్కువగా మంట అంటు

కొనును. మనుష్యులు కూడ కాలి మరణింతురు. నైరృతికోణములో కూపమున్న బాలుర నాశము, వాయవ్యములో స్త్రీలకు భయము కలుగును. మిగిలిన ఐదు దిశలలో శుభము కలుగును.

సారస్వత ముని ఏకార్గల విషయము తెలిపిన దానినిచూచి నేను దకార్గల విషయములను తెలిపితిని. ఇప్పుడు మనువు తెల్పిన దకార్గల విషయములను తెలిపెదను.

స్నిగ్ధము, చిద్ర(రంధ్రము) రహితములైన పత్రములతో కూడిన వృక్షములు లత లుండుచోట 3పురుషుల లోతులో జలముండును. స్థలకమలము గోక్షురము ఉశీరము ఇవి ద్రవ్యవిశేషములు. గుంద్ర(గడ్డి)సహితము, కాశ కుశ నాలిక నల ఇవి త్రుణవిశేషములు. ఖర్జూర నేరేడు అర్జున(మద్ది) వేతస(ప్రబ్బలితీగ) ఇవి వృక్షవిశేషములు. పాలుగారు వృక్షములు పొదలు లతలు ఛత్రి హస్తికర్ణము నాగకేసరము కమలము కదంబము ఇవన్ని సింధువార వృక్షముతో కూడిన విభీతక మదయంతికలున్నచోట 15 హస్తముల లోతులో నీరుఉండును. పర్వతముపై మరొక పర్వతమున్న అక్కడకూడ 3 పురుషుల లోతులో జలముండును.

మౌంజి (ముంజిదర్భలు) కాశ(రెల్లుగడ్డి) కుశ(దర్భలు) యుత భూమిలో రాళ్లతో కూడిన నలుపురంగు మట్టి ఉన్న స్థలములో లేక నలుపు లేక ఎర్రమట్టి ఉన్నభూమిలో మధుర జలముండును.

చిరిగిన ఆకులతో కూడిన కాయగూరలు, అశ్వకర్ణ అర్జున బిల్వ సర్జ శ్రాపర్ణ అరిష్ట దన శింశిప వృక్షములు ఛిద్రమైన ఎండిన పత్రములతో కూడిన వృక్షములు గుల్మములు లతలున్న చాలదూరములో జలముండును. సూర్య అగ్ని భస్మము ఒంటె గాడిద రంగుభూమిలో ఎరుపు చిరుగులు పాలుగారు కరీర వృక్షము ఎరుపు వర్ణభూమి రాళ్లక్రింద జలముండును.

వైదూర్యమణి ముత్యము మేఘసమానమైనది పండిన మేడిపండుతో సమానమైనది. విరగగొట్టిన నలుపు లేక పసుపు రంగురాయి ఉన్న స్థలసమీపములో అధికజలముండును. పావురము తేనె పాలు సోమలత సమానమైన రంగు కలిగినరాయి ఉన్న ప్రదేశములో ఎపుడు ఇంకని సమృద్ధమైన జలము లభించును. తామ్రవర్ణ బిందువులతో విచిత్ర బిందువులతో కూడిన తెల్లనివర్ణము, భస్మము ఒంటె గాడిద సమానమైన వర్ణము కలది అంగుష్ఠికా వృక్ష సమానమైన నీలము సూర్య లేక అగ్ని సమానవర్ణము గల రాయి ఉన్న ప్రదేశములో జలముండదు.

ముందు తెల్పిన అన్ని మంచిశిలలు శుభమును కలిగించును. ఎల్లప్పుడు యక్షనాగులతో సేవింపబడును. ఏరాజ్యములో శిలలుండునో ఆప్రదేశములో అనావృష్టి ఎప్పుడు కలగదు. నూతిని త్రవ్వే సమయములో రాయి వచ్చిన తేలికగా విరగకున్న దానిపై పలాశ(మోదుగ) తిందుక (తుమికి) కర్రలతో ఎర్రగా కాల్చి దానిపై సున్నపునీరు

పోసిన వెంటనే పగులును. మోక్షక వృక్షపు కర్రభస్మమును నీటిలో మరగకాచి దానిలో శరవృక్ష భస్మమును కలిపి, అగ్నితో కాల్చబడిన శిలమీద ఏడుసార్లు జల్లిన శిల పగులును. మజ్జిగ,కలి,కల్లు, ఉలవలు, రేగుకాయలు కలిపి ఏడురోజులుంచవలెను. తర్వాత వేడిచేసి రాతిపై పలమార్లు జల్లిన శిల పగులును.

వేపాకులు వేపచెట్టు బెరడు నువ్వులకాడలు అపామార్గము తిందుక(తుమికి) ఫలము గుడూచి వీటి భస్మము గోమూత్రములో నుంచి క్షారముగా తయారు చేయవలెను. తర్వాత భస్మము కాల్చిన రాతిపై దానిని ఆరుమార్లు చల్లిన శిల పగులును.

శస్త్రముపై నువ్వులనూనెను వ్రాయవలెను. తర్వాత మేక కొమ్ముల భస్మము పావురము ఎలుక మలమును జిల్లేడు పాలతో కలిపి దానిని శస్త్రముపై రాసి నానబెట్టి తర్వాత పదును పెట్టిన దానితో రాతిని కొట్టినప్పటికి దాని అంచు పాడవ్వుదు. ఒకరోజు మజ్జిగలో అరటిచెట్టు భస్మము నుంచి దానిలో శస్త్రమును నానబెట్టి రాతిని కొట్టిన దాని ధార విరుగక గట్టిగానుండును.

పూర్వపశ్చిమములు పొడవుగానున్న బావినీరు ఎక్కువకాలము నిలువ యుండును. ఉత్తరదక్షిణ దిశలు పొడవుగానున్న బావిలో నీరు తొందరగా ఇంకి పోవును. వాయు తరంగముల వలన బావిలో నీరు నష్టపోవును. దక్షిణోత్తరముల పొడవుగా బావి నిర్మించ దలచిన తరంగముల నుండి రక్షించుటకు ఒడ్డున బలమైన కర్ర లేక రాయితో కట్టవలెను. అదేవిధముగా ఒడ్డునున్న భూమినిర్మించునపుడు ఏనుగులు గుర్రములతో మట్టిని గట్టిగా త్రొక్కించ వలెను. మట్టి గట్టిపడి నీరు నిలబడును.

కుకుభ (మద్ది)వట ఆమ్ర (మామిడి) ప్లక్ష (జువ్వి) కదంబ (కమిడి)జంబు (నేరేడు) వేతస్మ (పుబ్బరి) నీప (వేప) కురంబక(ఎర్రగోరింటాకు) తాడ(తాడి) అశోక మధూక(ఇప్ప) వకుల (పొగడ) వృక్షములను బావిఒడ్డున నాటవలెను. బావికి ఒకవైపున నీరు తోడుటకు రాళ్లతో ఒకమార్గమును నిర్మించవలెను. ఆమార్గమును రంధ్రములు లేని కర్రపలకలతో కప్పి వాటిపై మట్టిని కప్పవలెను. అంజన ముస్త ఉశీర రాజకేశర ఉసిరి వీటి చూర్ణములను బావిలో వేయవలెను. మలినముగా చేదుగా ఉప్పుగా రుచి లేకుండ ఉన్న జలములో పూర్వోక్తఔషధములను కలిపిన సుందరమైన అనేక సుగుణములు కలిగిన జలము తయారగును.

హస్త మఘ అనూరాధ పుష్యమి ధనిష్ఠ ఉత్తరాత్రయం రోహిణి శతభిషం ఈ నక్షత్రములలో బావిని త్రవ్వడం ఆరంభించిన శుభము కలుగును. వరుణుకి బలినిచ్చి గంధపుష్ప ధూపాదులతో వట వేతస కర్రలకు పూజచేసి మొదట శిరోస్థానములో వాటిని నాటవలెను. జ్యేష్ఠ పూర్ణిమ తర్వాత ఏవిధముగా జలజ్ఞానము కలుగునో నేను ముందుగానే తెలియజేసితిని. బలదేవాది ఆచార్యుల మతమును చూచి మునుల దయతో నేను జల జ్ఞానమును దకార్గలాధ్యాయములో తెలియజేసితిని.

ఏబది నాల్గవ దకార్గలాధ్యాయము సమాప్తము

55 వృక్షాయుర్వేదాధ్యాయము

వాపి (దిగుడుబావి) కూప(బావి) జలాశయము (చెరువు) ప్రాంతము ఛాయా రహితమైన (నీడ లేకుండున్న) సుందరములు కావు. అందువలన జలాశయముల ప్రక్కన తోటను నిర్మించవలెను. అన్ని వృక్షములకు కోమలమైన భూమిమంచిదగును. తోటను పెంచవలసిన ప్రదేశములో మొదట నువ్వులను చల్లవలెను. నువ్వుల మొక్కలు మొలిచిన తర్వాతదానిని బాగుగాదున్నవలెను. ఇదిభూమిలో మొదటిపని యగును. మొదట తోటలో శుభమును కలిగించు వేప,అశోకము,పున్నాగము,శిరీషము,పిప్పలివృక్షములను నాటవలెను.

పనస అశోకము అరటి నేరేడు గజనిమ్మ దానిమ్మ ద్రాక్ష పాలీవతము బీజపూరము (మాదీఫలము) గురివిందము – ఈవృక్షముల శాఖను తీసుకొని వాటికి పేడవ్రాసి కోసిన వేరొక వృక్ష మూలము లేక శాఖతో కలుపవలెను. ఈవిధముగా అంటు కట్టవలెను. అంటుతో భిన్నమైన వృక్షములు మాఘ ఫాల్గుణ మాసములలో, అంటుకట్టు వృక్షములను మార్గశీర్ష పుష్యమాసములలో పొడుగు కొమ్మలున్న వృక్షములను శ్రావణ భాద్రపద మాసములలో సరైన దిశలను గుర్తించి నాటవలెను.

నెయ్యి వట్టివేరు నువ్వులు తేనె విడంగము పాలు గోధుమలు ఈ వస్తువులను కలిపి రుబ్బి వృక్షమూలము చివరి వరకు పూత పూసి ఒకచోట నుండి వేరొక చోట నాటవలెను. దైవిక చర్యను పూర్తిచేసుకొని శుభ్రముగా స్నానము చేసి అనులేపనాది పూజాసామగ్రితో నాటబడు వృక్షమునకు పూజచేసి వేరొకచోట నాటవలెను. ఈ విధముగా వృక్షమును నాటిన దానికున్న చివుళ్లు ఆకులు సమృద్ధిగా వృద్ధిపొందును. ఎప్పుడు ఎండవు, ముందుతెల్పిన వృక్షములకు గ్రీష్మఋతువులో ఉదయము, సాయంకాలము, శీతాకాలములో రోజు విడిచి రోజు వర్షాకాలములో మట్టి ఎండినపుడు నీటిని పెట్టవలెను.

అధికజలమున్న ప్రదేశములో నేరేడు బెత్తము వాచీరము కదంబము మేడి మద్ది బీజపూరకము ద్రాక్ష గజనిమ్మ దానిమ్మ అశోకము గానుగ తిలకము పనస తిమిరము అంబాలము ఈ పదహారు వృక్షములు పెరుగును.

వృక్షములకు మధ్య 20 హస్తముల దూరముండవలెను. 16హస్తముల దూరమున్న మధ్యమము 12హస్తముల దూరమున్న అధమమగును. ఒక వృక్షమునకు ఇంకొక వృక్షము సమీపమునన్నున్న పరస్పరము స్పర్శ కలుగును లేక రెండింటి కొమ్మలు కలిసిపోవును. దానివలన ఫలములను సమృద్ధిగా నీయవు. అధిక చలి వేడి గాలి తగిలిన వృక్షములకు రోగము కలుగును. రోగవృక్షముల ఆకులు ఎండిపోవును. చిగుళ్లురావు. మొగ్గలు రావు, రసము స్రవించును. రోగవృక్షములకు చికిత్స చేయవలెను. పాడయిన వృక్షపుశాఖను మొదట నరకవలెను. విడంగము నెయ్యి బురదను కలిపి వృక్షములకు వ్రాయవలెను. తర్వాత పాలుతో కూడిన నీటిని వాటిపై చల్లవలెను.

వృక్షములకు ఫలములు రాకున్న ఉలవలు మినుములు పెసలు నువ్వులు యవలు వీటిని పాలలో కలిపి కాచవలెను. తర్వాత ఆపాలను చల్లబరచి ఆవృక్షములపై ఫలవృద్ధి కలుగుటకు చల్లవలెను. మేక గొఱ్ఱెల మలము చూర్ణము రెండు అఢకములు (కొలతల ప్రమాణము) నువ్వులు ఒక అఢకము, పేలపిండి ఒకప్రస్థము, నీరు ఒకద్రోణము, గోమాంసము ఒకతులము, వీటినన్నింటిని కలిపి ఒకపాత్రలో రాత్రి నిలువ ఉంచవలెను. తర్వాత ఆమిశ్రమమును ఫలము పుష్పముల వృద్ధికొరకు వృక్షములు లతలపై చల్లవలెను.

ఏదైన వృక్షపు బీజమునకు నేతిని వ్రాసి పాలలో వేయవలెను. ఈ విధముగా పదిరోజులు చేయవలెను. తర్వాత దానిని పేడతో అనేకమార్లు కలిపి ఎండబెట్టి పంది లేడిమాంసముతో ధూపము వేయవలెను. తర్వాత మాంసము పందికొవ్వుతో కూడిన ఆబీజములను, నువ్వులు చల్లి శుద్ధిచేసిన భూమిలో చల్లవలెను. పాలు కలిపిన జలమును చల్లవలెను. ఆవిధముగా చేసిన తప్పక పూలతో కూడిన వృక్షము ఉత్పన్నమగును. చెడిపోయిన మాంసములో ధాన్యము. మినుములు, నువ్వుల చూర్ణము పేలపిండిని చల్లి పసుపుతో ధూపము వేసిన అతికఠోరమైన చింతగింజ కూడ వెంటనే మొలకెత్తును.

వెలగచెట్టు తొందరగా పెరుగుటకు, విష్ణుకాంత ఉసిరి ధవ వస వీటివ్రేళ్లు, పత్రములతో కూడిన బెత్తము, సూర్యముఖి, శ్యామ, అతిముక్తము వీటివేళ్లను పాలలో కలిపి మరిగించవలెను. తర్వాత పాలను చల్లబరచి దానిలో వెలగచెట్టు బీజములను వేయవలెను. రెండు హస్తములతో చప్పట్లు చరచిన ఎంతసమయమగునో అంతవరకు బీజములను పాలలో నుంచవలెను. తర్వాత వాటిని పాల నుండి తీసి ఎండబెట్టవలెను. ఈ విధముగా ఒకమాసము వరకు చేసి బీజములను నాటవలెను. ఒకహస్తము వ్యాసముతో రెండు హస్తముల లోతు గోతిని త్రవ్వి దానిని పూర్వము తెల్పిన రీతిలో పాలతో కలిపిన జలముతో నింపవలెను. అదిఎండిన తర్వాత అగ్నితో కాల్చవలెను. తర్వాత తేనె నెయ్యితో కూడిన భస్మముతో గోతిని అలకవలెను. మట్టితో కూడిన మినుములు నువ్వులు యవధాన్యముల చూర్ణముతో గోతిని నింపి చేపలు మాంసయుత జలమును పోసి దానిపై గట్టిగా తయారుచేయవలెను. దానిపై ముందుగా సిద్ధము చేసిన వెలగ విత్తనములను నాటి చేపలు మాంసపు జలమును జల్లవలెను. ఈ విధముగా చేసిన పత్రములతో కూడి మండపమును మూయగల వెలగ వృక్షము ఉత్పన్నమగును.

అంకోల (ఉడుగుచెట్టు) వృక్ష ఫలములు మడ్డి లేక నూనెతో లేక శ్లేష్మాతక (చిన్నఔషధ వృక్షము) ఫలమును మడ్డి లేక నూనెతో బాగుగా కలిపి వర్షముతో తడిసిన మట్టిలో నాటిన అదేక్షణములో మొలకలు వచ్చును. శాఖలు ఫలముల భారముతో వృక్షము వంగిపోవును. దీనిలో ఆశ్చర్యములేదు. బుద్ధిమంతుడైన మనిషి పైపెచ్చు తీసిన శ్లేష్మాతక వృక్షబీజమును అంకోల ఫలముల మధ్యలో నుంచి ఆరబెట్టవలెను. ఈవిధముగా ఏడుమార్లు

చేయవలెను. దానికి ఎద్దుపేడను కలిపి నాటిన ఒక రోజులో ఫలమునిచ్చు చెట్టు ఉత్పన్నమగును.

ఉత్తరాత్రయము, రోహిణి, మృగశిర, చిత్త, అనూరాధ, మూల, విశాఖ, పుష్యమి శ్రవణ అశ్విని హస్త ఈ నక్షత్రములు వృక్షారోపణకు అనుకూలమైనవని దివ్యదృష్టి గల మునులు తెలిపిరి.

ఏబది ఐదవ వృక్షాయుర్వేదాధ్యాయము సమాప్తము

56. ప్రాసాద లక్షణాధ్యాయము

అధిక జలమున్న జలాశయమును నిర్మించి దాని ప్రక్క తోటను వేసి యశస్సు ధర్మవృద్ధి కొరకు దేవాలయము నిర్మించవలెను. ఇష్ట(యజ్ఞము) పూర్తా (వాపి కూప తటాకము)దులు చేసిన ఉత్తమలోకము ప్రాప్తించును. ఆరెండు లోకములను కోరుమనుష్యుడు దేవాలయము తప్పక నిర్మించవలెను. దానిలో రెండు లోకముల ప్రాప్తి కనిపించును. భగవంతుడు నివాసముండు దేవాలయము ప్రక్కన కృత్రిమమైన జలాశయమైనప్పటికి నిర్మించవలెను. ఇటువంటి సరోవరములో భగవంతుడు ఎల్లప్పుడు విహారము చేయును. అక్కడ కమలమనెడి ఛత్రములో సూర్యకిరణములు దూరమగును. హంస రెక్కలతో కొట్టబడిన తెల్లని కమలముతో కూడిన స్వచ్ఛమైన జలముండును. హంసలు కారండకములు క్రౌంచ పక్షుల, చక్రవాకాది పక్షులు ద్వారా మధురశబ్దములు వినబడును. దాని ఒడ్డునందు నిలిచిన వృక్షముల ఛాయలో జంతువులు విశ్రాంతిని పొందును.

ఆసరోవరములో క్రౌంచిపక్షి రూపమైన ఒడ్డాణ స్వరూపము, కలహంసల మధుర శబ్దరూప శబ్దము, ఒడ్డున పుష్పించిన వృక్షరూప కర్ణపూరము, జలస్థలరూప శ్రేణీమండలము, ఇసుక తిన్నెల వలె పైకెగసిన స్తనము, హంసరూప హాస్యము కలిగి క్రిందికి ప్రవహించు నదుల సమీపములో దేవతలు నివాసముందురు. వనము నది పర్వతము నీటిప్రవాహముల సమీపములో ఉపవనములతో కూడిన నగరములలో దేవతలు విహరింతురు.

మొదట బ్రాహ్మణాది వర్ణముల గృహములు నిర్మించుటకు ఏవిధమైన భూమి మంచిదని తెలుపబడినదో, అదే విధమైన భూమి దేవాలయము నిర్మాణమునకు మంచి దగును. దేవాలయమును చతు:షష్టివాస్తుతో నిర్మించవలెను. నాలుగు దిశలలో మధ్య ద్వారము నిర్మించుట శ్రేష్ఠము.

దేవాలయ విస్తారమునకు రెట్టింపు ఎత్తు,ఎత్తులో మూడవవంతు కటిభాగ ముండును. మెట్లపైన ఎక్కడ నుండి దేవాలయము ప్రారంభమగునో అదికటియన బడును. విస్తారములో సగము గర్భము మిగిలిన దిశలలో గోడ నిర్మింపబడును. గర్భములో నాల్గవవంతు ద్వారవిస్తారము దానికి రెట్టింపు ద్వారము ఎత్తు ఉండవలెను. ద్వారము

ఎత్తుతో సమానముగా చౌకట్టులు,ఉదుంబరము (చౌకట్టు పైభాగము)ల వెడల్పులుండును. శాఖల (చౌకట్టులు) నాల్గవవంతులో నాల్గవవంతు ప్రమాణముతో మందముండును. శాఖలవెడల్పుకు మధ్యలో మూడు ఐదు ఏడు తొమ్మిది శాఖలున్న శ్రేష్ఠమగును. రెండుశాఖల క్రింద నాల్గవవంతులో ఇద్దరు ప్రతిహారు (నంది దండములు)ల నుంచవలెను. శాఖలలో నాల్గింట మూడుభాగములో హంసాది శుభ పక్షులు, మారేడు, స్వస్తికము, కలశము, మిథునము (స్త్రీ పురుషులు) పత్రములు లతలతో సుందరముగా చేయవలెను. ద్వారము ఎత్తులో ఎనిమిదవభాగము వదలి మిగిలిన భాగములో దేవతా స్థాపన పీఠమును చేయవలెను. అక్కడి నుండి దేవతామూర్తి ఎత్తు అగును. పీఠికతో కలిపి దేవతామూర్తి ఎత్తును మూడుభాగములు చేయవలెను. రెండుభాగములలో ప్రతిమ ఒకభాగములో పీఠమును నిర్మించవలెను. ఈ ప్రమాణము అన్ని దేవాలయములలో సమానముగా నుండును.

మేరు మందరము కైలాసము విమానచ్ఛందము నందనము సముద్గము పద్మము గరుడము కుంజరము గృహరాజము వృషము హంసము సర్వతోభద్రము ఘటము సింహము వృత్తాంతము చతుష్కోణము షోడశాశ్రీ అష్టాశ్రి ఇవి ఇరవై ప్రాసాదనామములు, వాటి లక్షణములు తెలుపబడును.

మందరనామ ప్రాసాదము ఆరుకోణములు, ముప్పదిహస్తముల విస్తారముతో పదిభాగములతో శిఖరములు కలిగి యుండును. కైలాస సంజ్ఞక ప్రాసాదములో ఆరు కోణములుండును. పద్దెనిమిది హస్తముల వెడల్పుతో ఎనిమిదిభాగములు ఏడు శిఖరము లుండును. విమానచ్ఛందనామక ప్రాసాదములో తెరలతో కూడిన కిటికీలు, ఇరువది ఒక్క హస్తముల విస్తారము ఎనిమిది భూమికలు (భాగములు) ఆరుకోణము లుండును. నందననామక ప్రాసాదములో ఆరుకోణములు ఆరుభూమికలు ఇరువైరెండు హస్తముల విస్తారము, పదహారు శిఖరములుండును.

సముద్గ సంజ్ఞక ప్రాసాదములో వృత్తాకారముగా, పద్మసంజ్ఞక ప్రాసాదములో పద్మాకృతి నిర్మాణముండును. ఇవి రెండు ఎనిమిది హస్తముల విస్తారముతో ఒక్కొక్క శిఖరముతో ఒక భూమికతో నిర్మించబడును. గరుడ సంజ్ఞక ప్రాసాదము గరుడాకృతిలో నుండును. నందివర్ధన నామక ప్రాసాదము కూడ గరుడాకృతిలో నుండును. కాని రెక్కలు తోక ఉండవు. ఈ రెండు ప్రాసాదములు ఇరువదినాలుగు హస్తముల విస్తారముతో ఏడుభాగములతో ఇరువది నాలుగు శిఖరములతో నిర్మింపబడును.

కుంజర నామక ప్రాసాదము ఏనుగువీపు ఆకృతిలో నుండును. మూలమునుండి నాలుగువైపుల పదహారు హస్తముల విస్తారము కలిగిఉండును. గృహరాజ ప్రాసాదము

గృహాకృతిలో నుండి పదహారు హస్తముల విస్తారముతో నుండును. ఈ రెండు ప్రాసాదములు మూడు చంద్రశాలలతో కూడియుండును. వృషనామక ప్రాసాదము ఒక భూమికము ఒకశృంగము పన్నెండు హస్తముల విస్తారముతో నాలుగువైపుల వృత్తాకారముగా నుండును. హంసప్రాసాదము హంస ఆకారముతో పన్నెండు హస్తముల విస్తారము ఒకభూమిక ఒకశృంగము కలిగియుండును.ఘటనామక ప్రాసాదము కలశాకృతిలో ఎనిమిది హస్తముల విస్తారము ఒకభూమికతో కూడియుండును.

సర్వతోభద్రనామక ప్రాసాదము నాలుగు దిశలలో నాలుగుద్వారములు అనేక శిఖరములు, అనేక సంఖ్యల సుందర చంద్రశాలలతో శోభితమై ఇరువదిఆరు హస్తముల విస్తారముతో చతుష్కోణములు పంచభూములతో కూడియుండును. సింహనామక ప్రాసాదము సింహప్రతిమతో శోభించుచు, పన్నెండు కోణములు ఎనిమిది హస్తములతో నుండును. మిగిలిన నాలుగు ప్రాసాదములు (వృత్త, చతుష్కోణ, షోడశాశ్రి, అష్టాశ్రి) తమ నామానుసారము ఆకారమును కలిగిఉండును. వాటిలోపల అంధకారముండును.

ఒకభూమి ప్రమాణము మయమతము ననుసరించి 108 అంగుళములు, విశ్వకర్మ మూడున్నర హస్తములని తెలిపెను. బుద్ధిమంతుడైన స్థపతి మయ విశ్వకర్మల మతము ఒకటేనని తెల్పును. వారి మతానుసారము విశ్వకర్మ భూమిక ప్రమాణమును కపోతపాలికను వదలి తెలిపెను. అందువలన కపోత పాలిక ప్రమాణమునకు ఇరువది నాలుగు అంగుళములను కలిపిన మయమత ప్రమాణమునకు సమానమగును.

నేను సంక్షేపముగా ప్రాసాద లక్షణమును తెలిపితిని. గర్గాది మునులు ఈ ప్రకరణములో ఏ విషయములు తెలిపిరో ఆవిషయములన్ని దీనిలో నున్నవి. మన్వాదులు (వశిష్ఠ, మయ నగ్నజిత్) విస్తార పూర్వకముగా తెల్పిన విషయములను గ్రహించి ఇక్కడనే నేను తెలిపియున్నాను.

ఏబది ఆరవ ప్రాసాద లక్షణాధ్యాయము సమాప్తము



57. వజ్రలేప లక్షణాధ్యాయము

తిందుక (తుమికి) వెలగ వృక్షముల పచ్చికాయలు శాల్మలీ(బూరుగు) వృక్షపు పూవులు శల్లకీ (అందుగు చెట్టు) వృక్షపు బీజములు ధన్వనవృక్షపు బెరడు వసను నీటిలో కలిపి ఎనిమిదవ వంతగు వరకు మరిగించి కషాయము తయారుచేయవలెను. దానిలో శ్రీవాస(తామర)పు జిగురు, గుగ్గిలము, భల్లాతకము (జీడి) దేవదారు వృక్షముల జిగురు మద్దివృక్షపు జిగురు, అలసి (అగిసె) మారేడు ఫలములను చూర్ణము చేసి కషాయములో కలిపిన వజ్రలేప సంజ్ఞకమైన రసాయనము తయారగును.

వేడిచేసిన వజ్రలేపనమును దేవాలయము,భవనము, వలభి శివలింగము దేవప్రతిమ గోడ కూపములలో వ్రాసిన ఒక కోటి వర్షముల వరకు విరగవు. ముందు తయారుచేసిన కషాయములో లక్క దేవదారు వృక్షపు జిగురు, గిగ్గిలము, ఇంటిలో పొగతో ఏర్పడు తెరలు, వెలగకాయ, మారేడు, నాగఫలము,వేప తిందుక (తుమికి) మదనఫల (ఉమ్మెత్త) మధూక (ఇప్ప) మంజిష్ఠము మద్ది ఉసిరి వీటన్నింటిని నూరి కలిపిన మొదటి వజ్రలేపముతో సమానమైన రెండవ వక్రలేపము తయారగును.

ముందు తయారుచేసిన లేపనములో ఆవు, ఎద్దు,మేకకొమ్ములు, గాడిద వెంట్రుకలు, ఎద్దుచర్మము,పేడ వేపఫలములు, వెలగపండ్లు వీటన్నింటిని కలిపి నూరిన మూడవ రకమైన లేపనము తయారగును. ఎనిమిదిభాగములు సీసము రెండుభాగములు కంచు,రెండుభాగములు ఇత్తడి ఒకచోట చేర్చి కాల్చిన వజ్రసంఘాత నామక నాల్గవ రకపు లేపనము తయారగును.

ఏబది ఏడవ వజ్రలేపన లక్షణాధ్యాయము సమాప్తము

58. ప్రతిమా లక్షణాధ్యాయము

జలములో కనపడు సూర్యకిరణములో కనపడు ధూళి పరమాణు స్వరూపమగును. ఇది అన్ని ప్రమాణములో మొదటి ప్రమాణమగును. ఎనిమిది పరమాణు వులు రజము ఎనిమిది రజములు వాలాగ్రము, ఎనిమిది వాలాగ్రములు అక్ష ,ఎనిమిది అక్షలు యూకము, ఎనిమిది యూకలు ఒకయవ, ఎనిమిది యవలు ఒక అంగుళమగును.

దేవాలయ ద్వారమునకు ఎనిమిదవ వంతు ఎత్తులో మూడవవంతుతో సమానముగా పీఠము దానికి రెట్టింపు ఎత్తు ప్రతిమ (విగ్రహము) ఉండును. ప్రతిమ ఎత్తును పన్నెండు భాగములు చేసి ప్రత్యేకభాగమును తొమ్మిదిభాగములు చేయవలెను. ఈవిధముగా ఒక్కొక్క అంగుళభాగము తయారగును. అన్ని ప్రతిమలు రెండు అంగుళముల ప్రమాణము నుండి 108 అంగుళముల వరకుండును. అంగుళప్రమాణముతో ప్రతిమ

ముఖము 12 అంగుళముల వెడల్పు పదహారు అంగుళముల పొడవు ఉండవలెను. ఇది ద్రవిడదేశ ప్రమాణము.

ప్రతిమ ముక్కు లలాటము గడ్డము మెడ చెవి నాలుగేసి అంగుళములు పొడవు కనుపు (చెక్కిలి పైభాగము) గడ్డము రెండేసి అంగుళముల విస్తారముండవలెను. నుదురు వెడల్పు ఎనిమిది అంగుళములు రెండువైపుల నున్న నొసలు (కనులు చెవులు మధ్య భాగము) రెండేసి అంగుళములు,పొడవు నాలుగేసి అంగుళములు, రెండు చెవుల వెడల్పు రెండేసి అంగుళములుండవలెను. నేత్రప్రాంత కనుబొమల నుండి సమానాంత రముగా చెవుల అగ్రభాగమును నాలుగున్నర అంగుళములలో నిర్మించవలెను. చెవిలోపలి ఉన్నతభాగము నేత్ర సమానముగా నిర్మించవలెను.

కన్నులకు చెవులకు మధ్య నాలుగు అంగుళముల దూరము, క్రింది పెదవి ఒక అంగుళము పైపెదవి సగము అంగుళము ఉండవలెనని వసిష్ఠమహాముని తెల్పెను. సగము అంగుళము వెడల్పుతో గోచ్ఛ,నాలుగంగుళముల వెడల్పుతో ముఖము నిర్మించవలెను. ఒకటిన్నర అంగుళముల వెడల్పుతో చిన్నముఖము మూడంగుళముల వెడల్పుతో పెద్ద ముఖము (నృసింహాది దేవతల) నిర్మించవలెను. నాసికాపుటములు రెండు అంగుళములు పుటముల అగ్రభాగపు నాసిక నాలుగంగుళములు నాసిక విత్తు రెండు అంగుళములు, రెండు నేత్రముల మధ్యభాగము నాలుగంగుళములని తెలిసికొనవలెను.

నేత్రకోశము రెండేసి అంగుళములు, దానిలో మూడవవంతు సమతార, నేత్రములో ఐదవవంతు దృక్తార (నేత్రమునకు తారకు మధ్యభాగము) నేత్రవికాసము ఒకఅంగుళ ముండవలెను. ఒక కనుబొమచివరి నుండి రెండవ కనుబొమ చివరి వరకు పదంగుళములు, వెడల్పు అరంగుళము, కనుబొమల మధ్యభాగము రెండు అంగుళములు, ప్రతికనుబొమ పొడవు నాలుగంగుళములుండవలెను.

శిరముపై నున్న కేశరేఖను కనుబొమలతో సమానముగా చేయవలెను. అరంగుళము కేశముల వెడల్పునుంచవలెను. నేత్రముల చివర కరవీరము ఒక అంగుళ ముండవలెను. ముప్పదిరెండు అంగుళముల పొడవు పద్నాలుగు అంగుళముల వెడల్పుతో శిరస్సు నిర్మించవలెను. చిత్రములో కేవలము పన్నెండు అంగుళముల శిరస్సు కనపడును. మిగిలిన ఇరవై అంగుళముల వెనుకభాగము కనపడదు.

నగ్నజిత్తు ఆచార్యుడు కేశరేఖ సహితముగా ముఖము వెడల్పు పదహారు అంగుళములు, మెడ వెడల్పు పది అంగుళములు పొడవు ఇరువది ఒక్క అంగుళములని తెల్పెను. కంఠము క్రిందిభాగము నుండి హృదయము వరకు, హృదయము నుండి నాభి వరకు, నాభిమధ్య నుండి అంగము వరకు పన్నెండు అంగుళముల తేడా నుంచవలెను. మోకాలిపై భాగము తొడలు ఇరువది నాలుగేసి అంగుళములు, మోకాలు కపిచ్ఛము

నాలుగేసి అంగుళములు చీలమండ నుండి క్రిందికి నాలుగేసి అంగుళములుండవలెను. పన్నెండు అంగుళములు పొడవు ఆరు అంగుళముల వెడల్పుతో పాదము, కాలి బొటనవ్రేలు మూడు అంగుళముల పొడవు ప్రదేశిని (బొటనవ్రేలి ప్రక్కవ్రేలు)మూడంగుళములుండ వలెను. ప్రదేశిని నుండి ఎనిమిదేసి వంతులు తగ్గించి క్రమముగా మూడువ్రేళ్లను నిర్మించవలెను. బొటనవ్రేలి ఎత్తు ఒకటింపావు అంగుళము మిగిలిన వ్రేళ్ల ఎత్తు అనుపాతము ననుసరించి కొద్దిగా తగ్గించి నిర్మించవలెను.

ప్రతిమా లక్షణములను తెలిసికొనువారు బొటనవ్రేలి గోళ్లను ముప్పావు అంగుళము,మిగిలిన వ్రేళ్లను అరఅంగుళము లేక కొంచెము తగ్గించి నిర్మించిన సుందరము గా కనపడును. తొడల ముందుభాగపు మందము పద్నాలుగు అంగుళములు, వెడల్పు ఐదు అంగుళములు, మధ్యభాగపు విస్తారము ఎనిమిది అంగుళములు మందము ఇరువది ఒక్క అంగుళములుండవలెను.

మోకాలి మధ్యభాగపు విస్తారము ఎనిమిది అంగుళములు మందము ఇరువది నాలుగు అంగుళములు, తొడల మధ్యభాగము విస్తారము పద్నాలుగు అంగుళములు పరిధి ఇరువది ఎనిమిది అంగుళములుండవలెను.నడుము కొలత పద్దెనిమిది అంగుళములు పరిధి నలుబదినాలుగు అంగుళములు,నాభివిస్తారము ఒక అంగుళ ముండవలెను. నాభిస్థానము మందము నలుబదిరెండు అంగుళములు, రెండు స్తనముల మధ్య దూరము పదహారు అంగుళములు, స్తనములపైన ప్రక్కన ఆరేసి అంగుళములు కక్ష ముండును.

మెడ నుండి రెండు కంధముల వరకు పొడవు ఎనిమిది అంగుళములు, పన్నెండు అంగుళములతో బాహుప్రబాహువులను నిర్మించవలెను.బాహువిస్తారము ఆరు అంగుళము లు ప్రబాహువు (చేయిముందు భాగము)ను నాలుగంగుళములతో నిర్మించవలెను. బాహుమూలపు మందము పదహారు అంగుళములు, ప్రకోష్ఠపు (ముంజేయి) మందము పన్నెండు అంగుళములు అరచేయి వెడల్పు ఆరు అంగుళములు పొడవు ఏడు అంగుళము లుండవలెను.

మధ్యవ్రేలు పొడవు ఐదు అంగుళములు,ప్రదేశిని (చూపుడువ్రేలు) అనామిక ఉంగరపు వ్రేలు అరపర్వము(కణుపు) తగ్గించి ఐదు అంగుళములుండును. కనిష్ఠికపొడవు (చిటికెనవ్రేలు) అనామిక కన్న ఒకపర్వము తక్కువగా నుండవలెను. బొటనవ్రేలు రెండు పర్వములు, మిగిలిన నాలుగు వ్రేళ్లు మూడేసి పర్వములతో నిర్మించవలెను. తమతమ పర్వములలో సగభాగముతో వ్రేళ్లను నిర్మించవలెను.

ప్రతిమకు భూషణములు వేషము అలంకారములను వారివారి దేశాను రూపముగా శుభలక్షణములతో నిర్మించిన వారికి ఉన్నతి కలుగును. దశరథుని కుమారుడు రాముడు విరోచనుని కుమారుడు బలి ప్రతిమలను 120 అంగుళముల పొడవుగా

నిర్మించవలెను. మిగిలిన ప్రతిమలు నూట ఎనిమిది అంగుళములైన ఉత్తమము. తొంబది అంగుళములు మధ్యమము, ఎనుబదినాలుగు అంగుళములు అధమమగును. విష్ణుప్రతిమను ఎనిమిది భుజములు, నాలుగు భుజములు లేక రెండుభుజములతో నిర్మించవలెను. వక్షస్థలముపై శ్రీవత్స చిహ్నము కౌస్తుభమణిని నిర్మించవలెను. అతసీపుష్ప సమానమైన శ్యామవర్ణము,పీతాంబరము ధరించిన ప్రసన్నముఖము, పృష్ఠకంఠము, వక్షస్థలము కంధము భుజము దక్షిణభాగమున మూడుహస్తములలో ఖడ్గము,గద, శరము, నాల్గవ హస్తములో అభయముద్ర,ఎడమవైపు నాలుగు హస్తములలో ధనుస్సు, ఢాలు, చక్రము, శంఖము కలిగిన అష్ట భుజములున్న విష్ణుప్రతిమను నిర్మించవలెను.నాలుగు భుజముల విష్ణుప్రతిమను తయారుచేసి దక్షిణమువైపు ఒకహస్తములో అభయముద్ర రెండవ హస్తములో గద,ఎడమవైపు ఒకహస్తములో శంఖము,రెండవ హస్తములో చక్రము కలిగిన మూర్తిని నిర్మించవలెను. ద్విభుజ ప్రతిమలో దక్షిణహస్తములో అభయముద్ర వామహస్తములో శంఖధారణ కలిగిన మూర్తిని నిర్మించవలెను. ఐశ్వర్యమును కోరుమనుష్యుడు ఈవిధముగా విష్ణుప్రతిమను నిర్మించవలెను.

బలదేవుని ప్రతిమలో ఒకహస్తములో నాగలిని నిర్మించవలెను. మదములో చలించు నేత్రములను నిర్మించవలెను. ఒకచెవిలో కుండలములు, శంఖ,చంద్ర మృణాల సమానమైన తెల్లని వర్ణముతో నిర్మించవలెను. బలదేవ కృష్ణుల మధ్యలో ఏకనవాంశా నామక ప్రతిమను తయారుచేయవలెను. అతని ఎడమ హస్తమును నడుముపై నుంచవలెను. దక్షిణ హస్తములో కమలముండవలెను. చతుర్భుజపు ఏకానంశా దేవికి ఎడమవైపున ఒకహస్తములో పుస్తకము రెండవ హస్తములో కమలము, దక్షిణవైపు ఒకహస్తములో అభయముద్ర, రెండవహస్తములో మాలాధారణముండవలెను. అష్టభుజముల ఏకానంశా దేవి మూర్తిలో ఎడమవైపు నాలుగు హస్తములలో క్రమముగా కమండలము, ధనుస్సు, కమలము పుస్తకము, దక్షిణవైపు నాలుగు హస్తములలో క్రమముగా వరముద్ర,బాణము, దర్పణము, అక్షసూత్ర (రుద్రాక్ష)ధారణముండును.

శాంబుని ప్రతిమను గదతో,ప్రద్యుమ్నుని ప్రతిమను ధనుస్సుతో నిర్మించవలెను. రెండు ప్రతిమలకు రెండు భుజములు సుందరముగా చేయవలెను. వారిద్దరి స్త్రీల ప్రతిమ ల హస్తములలో ఖేటకము, ఖడ్గములను ధరింపజేసి నిర్మించవలెను. బ్రహ్మమూర్తిని ఒకచేతిలో కమండలముతో నిర్మించవలెను. నాలుగు ముఖములతో నిర్మించిన కమలముపై ఆసనము కల్పించవలెను. కార్తికేయుని బాలుని రూపములో నిర్మించవలెను. హస్తములో శక్తి ఆయుధమును,మయూరధ్వజమును నిర్మించవలెను.

ఐరావత ప్రతిమను తెల్లని దంతములతో నిర్మించవలెను. ఇంద్రప్రతిమ చేతిలో వజ్రాయుధము నిర్మించవలెను. లలాటము మధ్యలో మూడవ నేత్రపు చిహ్నమును

తయారుచేయవలెను. శివునిప్రతిమలో మస్తకముపై చంద్రుని,ధ్వజముపై వృషభ చిహ్నమును నిర్మించవలెను. లలాటముపై మూడవ నేత్రమును నిర్మించవలెను. ఒకచేతిలో త్రిశూలము రెండవ చేతిలో పినాక నామక ధనుస్సు, ఎడమవైపు సగముభాగములో పార్వతి ప్రతిమను నిర్మించవలెను.

బుద్ధప్రతిమలో హస్తము పాదములలో కమలచిహ్నము ప్రసన్న ముఖము చిన్నచిన్న కేశములతో కూడిన శిరస్సు పద్మాసనముపై కూర్చొని ప్రపంచమునకు తండ్రివలె కనిపించు ప్రతిమను నిర్మించవలెను. పొడవైన చేతులతో శ్రీవత్స చిహ్నముతో శోభించుచున్న శాంతము దిగంబరము తరుణ సుందరమైన ప్రతిమను నిర్మించవలెను.

సూర్యప్రతిమలో నాసిక,లలాటము,మోకాలు తొడలు చెక్కిలి వక్షస్థలము ఎత్తు, ఉత్తరదేశ వాసులవలె వేషముండవలెను. కాలి నుండి ఛాతీ వరకు వస్త్రముతో కప్పబడిన రెండు భుజములలో రెండు నఖ రూప కమలములతో కూడి తలపై కిరీటము, చెవులలో కుండలములు,కంఠములో వడ్డాణమువంటి హారము,విష్ణుసమానమైన ముఖకాంతి, వస్త్రముతో కప్పబడిన శరీరము,హాస్యయుతమైన ప్రసన్నముఖము రత్నములతో ప్రకాశవంతముగా నిర్మించవలెను. ఈ విధముగా సూర్యప్రతిమను నిర్మించిన శుభము కలుగును.

ఒకహస్తము ఎత్తు సూర్యప్రతిమ శుభమును కలిగించును. రెండు హస్తములున్న ధనమునిచ్చును. మూడుహస్తములున్న క్షేమము, సుభిక్షము కలుగును. అధిక అంగములున్న ప్రతిమ రాజు వలన భయము,తక్కువ అంగములున్న ప్రతిమరోగము, కృశించిన ఉదరము గల ప్రతిమ ఆకలిని భయమును ధననాశమును, కృశించిన అంగములు గల ప్రతిమ ధననాశమును కలిగించును. పొడయిన ప్రతిమను నిర్మించిన శస్త్రము వలన మృత్యువు, ఎడమవైపు వంగిన ప్రతిమను నిర్మించిన వాని పత్నికి నాశము, దక్షిణ వైపుకి వంగిన ప్రతిమ నిర్మించిన ఆయుక్షీణము కలుగును. ప్రతిమ దృష్టి పైవైపుకున్న నిర్మించినవాడు అంధుడగును. క్రిందువైపుకున్న నిర్మించినవాడు దు:ఖితుడగును. ఇది సూర్య ప్రతిమకు సంబంధించిన శుభాశుభ ఫలము. ఇదేవిధముగా ఇతర ప్రతిమలను తెలిసికొనవలెను.

అంగ పరిధిని పొడవు సూత్రముతో కొలచి దాని సమానముగా రాయి, కర్ర లేక మణులతో అంగమును నిర్మించవలెను. దానిని మూడు భాగములు చేసి మూలభాగము చతురస్రముగా మధ్యభాగమును ఎనిమిది కోనములతో, చివరిభాగమును గోళాకారముగా నిర్మించవలెను. చతురస్ర భాగమును భూమిలో పాతవలెను. అష్టకోణభాగమును జలమున్న పాత్రలో వర్తులభాగమును పైభాగములో నుంచవలెను. వర్తులభాగపు ఎత్తుతో సమానముగా క్రిందిభాగమున పీఠమును నిర్మించవలెను. శిలింగము సన్నగా పొడవుగానున్న దేశమునకు నాశము. రెండు వైపుల ఖండింపబడిన నగరమునకు నాశము. విరిగిన శిరస్సు ఉన్న

స్వామికి నాశము కలుగును.

మాతృగణముల ప్రతిమ తమతమ నామములననుసరించి నిర్మించవలెను. బ్రహ్మతో సమానముగా బ్రాహ్మిణిని నిర్మించవలెను. ఈ ప్రతిమలలో స్తనశోభను కృశించిన మధ్యభాగమును పెద్దపిరుదులను నిర్మించవలెను. స్త్రీశోభ ప్రతిమలో కనపడవలెను. గుర్రమునధిరోహించిన, మృగరూప క్రీడలో లగ్నమైన పరివారము కలిగిన రేవంతుని (సూర్యపుత్రుడు) ప్రతిమను నిర్మించవలెను.

యముని ప్రతిమను చేతిలో దండముతో ఎద్దుపై కూర్చొన్న విధముగా, వరుణుని ప్రతిమను కూర్చొని పాశధారణ చేయుచున్న విధముగా, కుబేర ప్రతిమను మనిషిపై కూర్చొన్న విధముగా, ఎడమవైపుకి వంగిన కిరీటము పెద్ద ఉదరమున్నట్లుగా నిర్మించ వలెను. ఏనుగుతో సమాన ముఖము, పొడవైన పొట్ట, కుఠారధారణము, ఏకదంతము, తామరదుంప, సునీల దలకందము (ఎర్రకమలము)లను ధరించిన గణేశుని ప్రతిమను నిర్మించవలెను.

ఏబది ఎనిమిదవ ప్రతిమాలక్షణాధ్యాయము సమాప్తము

59. వన సంప్రవేశాధ్యాయము

ప్రతిమ తయారుచేయుట కనుకూలమైన దినములో దైవజ్ఞుని ద్వారా తెలుపబడిన ముహూర్తములో యాత్రా ప్రకరణములో తెల్పిన శుభ శకునమును చూచి ప్రతిమను తయారు చేయుటకు కావలసిన కర్రను తీసికొని వచ్చుటకు వనములో ప్రవేశించవలెను. శ్మశానము, మార్గము, దేవాలయము, పుట్ట, ఉపవనము, తాపసుల ఆశ్రమము, చైత్యము, నదుల సంగమస్థానములో పుట్టినది, కుండలతో జలము పోయునది, పొట్టిది, ఇతర వృక్షములతో కూడియున్నది, మెరుపుతో కాలినది, గాలివలన పడినది, ఏనుగుల వలన కొట్టబడినది, ఎండినది,అగ్నిలో కాలినది,తేనెపుట్ట కలదియైన వృక్షమును వదలి పెట్టవలెను. కోమలమైన పత్రములు ఫలములు పూవులు కలిగిన వృక్షములు శుభము నిచ్చును. ఈవిధముగా అనుకూల వృక్షముల దగ్గరకు వెళ్లి బలినిచ్చి పుష్పములతో పూజించవలెను.

దేవదారు,చందనము,జమ్మి, ఇప్ప వృక్షములు బ్రాహ్మణులకు వేప, మర్రి,చంద్ర మారేడు, వృక్షములు క్షత్రియులకు, జీవక,చంద్ర,వావిలి,స్యందన (తినాసము) వృక్షములు వైశ్యులకు, తుమికి,నాగకేసరము,మద్ది,సాలవృక్షములు శూద్రులకు శుభ దాయకములగును. వృక్షముల దిశ వైపుకి శివలింగ ప్రతిమ స్థాపించవలెను. వృక్షపు పైభాగము ప్రతిమకు పైభాగముగా క్రిందిభాగమును క్రిందిభాగముగా నుంచి ప్రతిమను తయారుచేయవలెను. నరుకుట ముందుగానే వృక్షములో అన్ని దిశల చిహ్నములను గుర్తించవలెను.

పాయసము లడ్డు అన్నము పెరుగు మాంసము ఉల్లోపికము(ఒక విధమైన

భోజనపదార్థము)మున్నగు భక్ష్యములు,మద్యము, పుష్పసుగంధ ద్రవ్యములతో వృక్షమును పూజించవలెను. రాత్రిలో దేవతలు పితురులు పిశాచములు రాక్షసులు నాగులు సురగణములు గణేశుడు మున్నగువారిని పూజించి వృక్షమును స్పర్శించి వక్ష్యమాన మంత్రమును పఠించవలెను.

అర్చార్థమముకస్య త్వం దేవస్య పరికల్పిత:
నమస్తే వృక్ష పూజేయం విధివత్ సమ్ప్రగృహ్యతామ్
యానీహ భూతాని వసన్తి తాని బలిం గృహీత్వా విధివత్ప్రయుక్తమ్
అన్యత్ర వాసం పరికల్పయన్తు క్షమన్తు తాన్యద్య నమోఽస్తు తేభ్య:

ఓ వృక్షమా! అముక దేవత పూజకొరకు కల్పించబడిన నీకు నమస్కారము చేయుచున్నాను. ఈ పూజను గ్రహింపుము. ఈ వృక్షముపై నివాసమున్న ప్రాణులు విధి పూర్వకముగా చేయు ఈపూజను స్వీకరించి ఇతర ప్రదేశములో నివాసమేర్పరచు కొనవలెను. ఆప్రాణులన్ని నన్ను క్షమించవలెను. వారికి నమస్కారము చేయుచున్నాను.

ప్రాత:కాల జలముతో వృక్షమును తడిపి తేనె నేయి వ్రాసిన కత్తితో ముందు ఈశాన్యకోణములో నరికి తర్వాత ప్రదక్షిణ క్రమములో వృక్షమును నరుకవలెను.

నరికిన వృక్షము తూర్పు ఈశాన్య ఉత్తరదిశలలో పడిన బుద్ధి కలుగును. ఆగ్నేయాది ఐదు దిశలలో పడిన క్రమముగా అగ్నిదాహము, రోగము, రోగము, రోగము, గుఱ్రముల నాశము కలుగును. ఈ వనసంప్రవేశ నామక అధ్యాయములో నేను తెలుపని వృక్షనిపాతము (పడగొట్టుట)వృక్షఛేదనము వృక్ష గర్భాదులను పూర్వకథిత ఇంద్ర ధ్వజాధ్యాయము వాస్తువిద్యాధ్యాయములో చూచి తెలిసికొనవలెను.

ఏబది తొమ్మిదవ వన సమ్ప్రవేశాధ్యాయము సమాప్తము

60. ప్రతిమా ప్రతిష్ఠాపనాధ్యాయము

నాలుగు తోరణములతో ప్రశస్తమైన వృక్షముల ఆకులతో కప్పబడిన మండపమును తయారుచేయవలెను. మండప పూర్వభాగములో అనేక వర్ణముల పుష్పమాలలు పతాకము లను ఏర్పాటుచేయవలెను. అగ్నికోణములో ఎరుపు దక్షిణ నైరృతులలో నలుపు పశ్చిమము లో తెలుపు,వాయవ్యములో పాండుర వర్ణము(బూడిద రంగు)ఉత్తరములో అనేక వర్ణములు కలిగినది,ఈశాన్య కోణములో పచ్చని పుష్పమాలల పతాకములను నిర్మించవలెను.

కఱ్ఱ మట్టిప్రతిమలు, ఆయువు, స్త్రీబలము విజయము నిచ్చును. మణులతో నిర్మించు ప్రతిమ ప్రజలకు మంచిని కలిగించును. బంగారపు ప్రతిమ పుష్టినిచ్చును. వెండి ప్రతిమ గౌరవమును పెంచును. ఇత్తడి ప్రతిమ సంతానవృద్ధిని కలిగించును. రాతి ప్రతిమ లేక శివలింగము అత్యధిక భూలాభమును కలిగించును. ఏదైన కీలుతో పీడింప

బడిన ప్రతిమ ప్రధానవ్యక్తికి సంతానమునకు నాశనము కలిగించును. రంధ్రముతో కూడిన ప్రతిమ రోగమును ఉపద్రవమును మృత్యువును కలిగించును.

మండపము మధ్యలో నిర్మించిన స్థండిలము (శుభ్రము చేసిన భూమి)ను అలికి దానిపై ఇసుకను దానిపై దర్భలు, దానిపై ప్రతిమ నుంచవలెను.ప్రతిమ శిరస్సును ఆసనముపై కాలును దిండుపై నుంచవలెను.జువ్వి రావి మేడి శిరీషము మర్రి వృక్షములతో చేసిన కషాయము మంగల సంజ్ఞక సర్వౌషధములు. (జయ జయంతి జీవంతి జీవపుత్రి పునర్నవ విష్ణుకాంత లక్షణ) ఏనుగు గుర్రములతో త్రవ్వబడినది,పర్వతము పుట్ట నదీసంగమ స్థానము కమల సరోవరములో నున్న మట్టితో పంచగవ్యము తీర్థజలము సువర్ణము రత్నముల జలముతో పూర్వదిశ వైపుకు శిరస్సున్న ప్రతిమను స్నానము చేయించి సుగంధద్రవ్యములు అనేక విధములైన వాద్యములతో పుణ్యాహవాచనములతో వేద ధ్వనులతో పూజించవలెను.

బ్రాహ్మణుల ద్వారా పూర్వదిశలో ఇంద్రునికి,ఆగ్నేయదిశలో అగ్నికి మంత్రము లతో జపమును చేయించవలెను. తర్వాత యజమాని బ్రాహ్మణులకు దక్షిణాదులనిచ్చి పూజించవలెను. ఏదేవత ప్రతిష్ఠ జరుగునో ఆదేవతకు మంత్రములతో బ్రాహ్మణుల ద్వారా హవనము చేయవలెను.ఇంద్రధ్వజాధ్యాయములో శుభాశుభ లక్షణములు తెలుపబడినవి.హవన సమయములో అగ్ని పొగతోకూడియున్న,అగ్నిజ్వాల వామావర్తము గా తిరుగుతున్న, మాటిమాటికి శబ్దము చేయుచున్న అగ్నిజ్వాలలుపైకి లేచుచున్న శు భమునీయదు. హవనము చేయు వానికి మతిమరుపు కలిగిన ప్రసర్పణమైన (ముందు కూర్చున్న చోటు నుండి కదిలిన) శుభము కలుగదు.

ప్రతిష్ఠ చేయు పురుషుడు స్నానము చేయించిన, వస్త్రము ధరింపజేసిన, భూషణములు తొడిగిన, పుష్పసుగంధ ద్రవ్యములతో పూజించిన ప్రతిమను సుందరముగా పరచిన శయ్యపై స్థాపనచేయవలెను. పరుండిన ప్రతిమను గీతనృత్యములు జాగరణము లతో అధివాసము చేసి దైవజ్ఞుల ద్వారా తెలుపబడిన ముహూర్తములో ప్రతిష్ఠను చేయవలెను.ఆ ప్రతిమను పుష్పములు, వస్త్రములు చందనము సుగంధ ద్రవ్యములతో పూజచేసి శంఖము మరియు తూర్యనాదపు ధ్వనులతో అదివాసన మండపము నుండి ప్రదక్షిణ క్రమములో భవనములోనికి తీసికొనిరావలెను. తర్వాత అనేక విధములైన బలులనిచ్చి,వస్త్రము దక్షిణాదులతో సభ్యజనులను పూజించి, బంగారపు ముక్కనుంచి గోతిలో ప్రతిమను స్థాపించవలెను. ప్రతిష్ఠచేసిన వ్యక్తి జ్యోతిష్కులను సభ్యజనులను శిల్పులను విశేషరూపములో పూజించవలెను.ఈవిధముగా చేసిన మనిషి ఈలోకములో కల్యాణకారకుడగును. స్వర్గమును పొందును.

భగవంతుడైన విష్ణు ప్రతిమను వైష్ణవుడు, సూర్య ప్రతిష్ఠను మగ(శాఖద్వీపము)

బ్రాహ్మణుడు, శివప్రతిష్ఠను భస్మధారణ చేయుబ్రాహ్మణుడు, మాత్రుకల ప్రతిష్ఠ మండల క్రమము తెలిసిన బ్రాహ్మణుడు,బ్రహ్మప్రతిష్ఠను బ్రాహ్మణుడు, బుద్ధప్రతిష్ఠను శాంతచిత్తము కలిగిన శాక్యబ్రాహ్మణుడు,జినప్రతిష్ఠను దిగంబర క్షపణకుడు చేయవలెను. ఈవిధముగా భగవంతునుకి భక్తుడైన మనుష్యుని ద్వారా ఆయాదేవతల ప్రతిష్ఠలను విధివిధానముతో చేయవలెను.

ఉత్తరాయణములో శుక్లపక్షములో చంద్రగురులు షడ్వర్గములో నుండగా, స్థిర లగ్నములో స్థిరనవాంశలో,శుభగ్రహము పంచమ నవమ లగ్న చతుర్థ సప్తమ దశమ స్థానములలో నుండగా ఉత్తరాత్రయములో రోహిణి మృగశిర రేవతి చిత్త అనూరాధ శ్రవణ పుష్యమి స్వాతి నక్షత్రములలో, మంగళవారము వదలి మిగిలిన వారములలో ప్రతిష్ఠ చేయువానికి శుభము జరుగు సమయములో దేవతాస్థాపనము చేయవలెను. సంక్షేపముగా సామాన్య రూపముగా ప్రతిమా ప్రతిష్ఠా విషయమును తెలిపితిని సూర్య ప్రతిమ అధివాసనము ప్రతిష్ఠాపన విధానము శాస్త్రములో వేరే విధముగా చెప్పబడినది.

అరువదవ ప్రతిమా ప్రతిష్ఠాపనాధ్యాయము సమాప్తము

61. గో లక్షణాధ్యాయము

పరాశరముని తనశిష్యుడు బృహద్రథునికి తెల్పిన గోలక్షణములను నేను సంక్షేపముగా తెల్పెదను. గోవులన్ని శుభలక్షణములు కలిగియుండును. అయినప్పటికి ముని ప్రణీత శాస్త్రమును తీసుకొని శుభాశుభ లక్షణములను తెలిపెదను.

నీటితో నిండిన కళ్లు కలిగినది రూక్షము (కరుకు)గానున్న కన్నులు కలది, మూషిక సమానమైన కన్నులు కలది, కదులుతున్న కొమ్ములు కలది, చప్పిడి కొమ్ములు కలది, కృష్ణలోహిత వర్ణములు కలది,గాడిదవర్ణము కలదైన గోవు శుభమునీయదు. పది ఏడు నాలుగు దంతములు కలది, పొడుగు ముఖముకలది, కొమ్ములులేనిది,వంగిన వీపుకలది,చిన్నది లావైన మెడకలది, యవధాన్యము వలె మధ్యలావుగా నుండి విరిగిన కొమ్ములు కలది,నల్లని పొడవైన నాలుక కలది,చాలా చిన్న లేక చాలాపెద్దది,లావుగా నున్న చీలమండ కలది, సన్నగా నున్నది తక్కువ లేక ఎక్కువ అంగము కలిగినదైన గోవు శుభమునీయదు.

ముందు తెల్పిన లక్షణములు గల ఎద్దు కూడ శుభమునీయదు. లావుగా పొడవుగా నున్న అండకోశము కలది,నరములు కనపడుతున్న పాదములు కలది. లావు శిరలతో కూడిన ముఖము కలిగినది,మూడుస్థానముల నుండి (నేత్ర,మూత్ర, పురీషములు) ఒకేసారి విసర్జన చేయునది, పిల్లికన్నులు కలిగినది కృష్ణలోహిత వర్ణము కలదైన ఎద్దు బ్రాహ్మణులకు కూడ శుభమునీయదు. మిగిలిన వర్ణముల గూర్చి ఏమిచెప్పవలెను. పెదవులు

దవుడులు నాలుక నల్లగానున్న ఎద్దు తన జాతిని నాశనము చేయును.

స్థూలముగానున్న (బలిసిన)పేడ,అంగపు అగ్రభాగము, కొమ్ములు కలిగినది, తెల్లని పొట్ట కలిగినది, కృష్ణలోహిత వర్ణము కలిగినదైన ఎద్దు తమ ఇంటిలో పుట్టినప్పటికి దానిని వదిలిపెట్టవలెను. ఆ ఎద్దుకూడ తమ జాతిని నాశనము చేయును. శరీరముపై నల్లటి రంగు మచ్చలు, తెలుపు ఎరుపు కలిసిన వర్ణము, పిల్లివంటి నేత్రములు కలిగిన ఎద్దును గ్రహించిన బ్రాహ్మణులకది శుభమునీయదు. బండికి కట్టిన ఎద్దు బురదలో చిక్కుకొని పైకిలేపిన విధముగా కాళ్లున్నది బలహీనమైన చిన్న మరియు లోపలికి నొక్కబడిన వీపు కలిగినదైన ఎద్దు బరువును మోయలేదు.

కోమలమైనది,తామ్రవర్ణము కలిగిన పెదవులు కలది,సన్నని నడుము పిరుదులు కలది, తామ్రవర్ణపు నాలుగు దవుడలు కలది,చిన్నవి పలుచనివి ఎత్తు కలిగిన చెవులు కలిగినది,సుందరమైన పొట్ట కలది,నిదానముగా నున్న కొమ్ములు కలది, తామ్రవర్ణపు గిట్టలుకలది, బలమైన ఛాతీ కలది, పెద్దమూపురము కలది,కోమలమైన పలుచని శరీరము రోమములు కలిగినది,తామ్రవర్ణపు కొమ్ములు శరీరము కలిగినది,పలుచని భూమిని స్పర్శించు తోక కలది,ఎర్రని కన్నులు కలది,ఎక్కువ గాలిపీల్చునది, సింహ సమానమైన భుజములు కలది,పలుచని కంబలము (మెడక్రింది భాగము) కలది, సుందరమైన గతి (నడక)కలదియైన ఎద్దు మంచిది.

వామపార్శ్వములో వామావర్తము,దక్షిణ పార్శ్వములో దక్షిణావర్తమైన రోమములు కలిగినది,మృగము వంటి తొడకలిగినదైన ఎద్దుశుభకరమైనది. వైడూర్యమణి, మల్లికా పుష్పము బుడగలతో సమానమైన నేత్రము కలది, స్థూలనేత్రములు శరీరము కలిగినది, గిట్టలపైభాగము విరుగకుండ ఉన్న ఎద్దు శుభకరమైనది,అధికభారము మోయ గలదగును. ముక్కు సమీపములో సుడికలది, పిల్లివలె ముఖమున్నది,దక్షిణభాగము తెల్లగా నున్నది, కమలము లక్క సమానమైన కాంతి కలది,మంచితోక గుర్రము వంటి నడక కలది,పెద్ద అండకోశము కలది,తోడేలు వంటి పొట్ట కలది, వెనుకవైపునున్న తొడ అండ కోశములమధ్య భాగము, మరియు ముందు తొడలమధ్య భాగము తక్కువ స్థలము కలిగినదైన ఎద్దు ఎక్కువ బరువును మోయుటకు సమర్థురాలగును. గుర్రమువలె ప్రయాణించు ఎద్దు శుభఫలము నిచ్చును.

తెల్లనివర్ణము,తామ్రవర్ణపు కొమ్ములు,కళ్లు పెద్దముఖము కలిగిన ఎద్దు హంస సంజ్ఞకమగును. ఈ వృషభము శుభమును కలిగించి తన జాతిని వృద్ధి పరచును. భూమికి తగులుతున్న తోక, తామ్రవర్ణపు కొమ్ములు, ఎర్రని కన్నులు, మట్టితో కూడి కల్మాష (ఎరుపు తెలుపు పసుపు రంగుల మిశ్రమము) వర్ణము కలిగిన ఎద్దు తనస్వామిని ధనవంతుని చేయును. ఏరంగు కలిగిన ఎద్దైన నాలుగుకాళ్లు తెల్లగా నున్న అది శుభము

నిచ్చును. అన్ని శుభలక్షణములు కలిగిన ఎద్దు దొరకకున్న మిశ్రిత ఫలమునిచ్చు ఎద్దును కొనవలెను. కాని దీనిలో శుభఫలమధికముగా నుండవలెను.

అరువది ఒకటవ గోలక్షణాధ్యాయము సమాప్తము

62. శ్వలక్షణాధ్యాయము

మూడుకాళ్లలో ఐదేసి గోళ్లు ముందువైపు కుడివేలుకు ఆరుగోళ్లు కలిగి, పెదవులు, ముందుభాగము తామ్రవర్ణము కలిగి సింహ సమానగతి కలిగి,భూమిని వాసన చూస్తు వెళ్లుతున్న,ఎక్కువ వెంట్రుకలతో కూడిన తోకతో ఎలుగుబంటి వంటి కన్నులు, రెండు చెవులు పొడవుగానున్న కోమలమైన కుక్క తనస్వామికి గృహమునకు శుభమును కలిగించును.మూడుకాళ్లలో ఐదేసి గోళ్లు మిగిలిన ఎడమకాలిలో ఆరుగోళ్లు కలిగి మల్లికా పుష్పమువలె కన్నులు,వంకరతోక పచ్చని పొడవైన చెవులు కలిగిన కుక్క తనస్వామిని రాజ్యమును రక్షించును.

అరువది రెండవ శ్వలక్షణాధ్యాయము సమాప్తము

63. కుక్కుట లక్షణాధ్యాయము

రెక్కలు వ్రేళ్లు నిలువుగా నున్నది తామ్రవర్ణపు ముఖము,గోళ్లు,నెత్తి జుట్టు కలిగినది, తెల్లనివర్ణము కలిగినది, తెల్లవారుజామున మంచి స్వరముతో అరచునదైన కోడి రాజుకు రాజ్యమునకు గుఱ్ఱములకు వృద్ధిని కలిగించును.యవధాన్య సమానమైన కంఠము, పండిన రేగిపండు సమానమైన వర్ణము పెద్దతల తెలుపు పసుపు ఎరుపు నలుపు మున్నగు అనేక రంగులు కలిగిన కోడి యుద్ధములో శుభమును కలిగించును. తేనె,భ్రమర సమానమైన వర్ణము కలిగిన కోడి యుద్ధములో విజయమును పొందును.దీనికి భిన్నమైన వర్ణము, బలహీనశరీరము, మందశబ్దము కుంటిదైన కోడి అశుభమునిచ్చును. కోమలము, సుందరమైన శబ్దము చేయునది, స్నిగ్ధశరీరము కలిగినది, సుందరమైన కోడి చిరకాలము వరకు రాజులకు యశస్సు, బలము సంపత్తినిచ్చును.

అరువది మూడవ కుక్కుటాధ్యాయము సమాప్తము

64. కూర్మ లక్షణాధ్యాయము

స్ఫటికము, వెండి సమానమైన వర్ణము,నీలిరేఖలతో కూడినది, కలశము వంటి ఆకారము కలిగినది, సుందరమైన వీపు ఎముక కలిగినది ఎరుపు వర్ణము కలిగి,ఆవాల వర్ణముతో కూడిన మచ్చలు కలదైన తాబేలు రాజు గొప్పతనమును పెంచును. కాటుక తుమ్మెదల వలె నల్లని వర్ణము కలది, మచ్చలతో చిత్రించబడినది సంపూర్ణ అంగములు కలిగినది లావుమెడ కలిగిన తాబేలు రాజ్యమునకు వృద్ధిని కలిగించును. వైడూర్యమణి

వలె కాంతి కలిగినది,స్థూలకంఠము కలిగినది,త్రిభుజాకారము కలిగినది, సుందరమైన పృష్ఠ (వెనుక)భాగము కలిగిన తాబేలును రాజులకు శుభము కలుగుటకు విహారయోగ్యమైన నూతిలో లేక పెద్దకుండలో నుంచవలెను.

అరువది నాల్గవ కూర్మలక్షణాధ్యాయము సమాప్తము

65. ఛాగ లక్షణాధ్యాయము

మేక శుభాశుభ లక్షణములు తెలుపబడును. తొమ్మిది పది లేక ఎనిమిది దంతము లున్న మేకను గృహములో నుంచిన శుభము కలుగును. ఏడు దంతములున్న మేక అశు భము కలిగించును. దానిని వదలవలెను. మేక దక్షిణపు ప్రక్క తెల్లని రంగుమచ్చ ఉన్న, మృగమువలె కృష్ణలోహిత వర్ణముతో నున్న లేక నలుపు వర్ణములుండి దక్షిణ పార్శ్వములో తెల్లని వర్ణపు మండలమున్న శుభము కలుగును. మేక కంఠము క్రింద స్తనములవలె వ్రేలాడు వాటిని మణియందురు. ఒకమణి ఉన్న శుభము రెండు లేక మూడు మణులున్న అత్యంత శుభము కలుగును.

కొమ్ములు లేనిది, నలుపు శరీరము కలిగినది, సగము నలుపు సగము పచ్చని వర్ణము,సగము నల్లని రంగు కలిగిన మేక శుభమునిచ్చును. తమమందకు ముందు నడిచి అన్నింటికన్న ముందుగ నీటిలో దిగేది, తెల్లని తల కలిగినది, కృత్తికా నక్షత్రము వలె ఆరుబిందువులు కలిగిన ముఖము కలదైన మేక శుభమునిచ్చును. దానిని కుట్టక మందురు.

మెడ తలపై భిన్నవర్ణముల బిందువులు కలది, తెలగ పిండి సమానమైన తెల్లని వర్ణము కలది, తామ్రసమానమైన ఎర్రని నేత్రములు కలది,తెల్లనిశరీరము నల్లని కాళ్లు కలిగినది లేక నల్లని శరీరము తెల్లనికాళ్లు కలదైన మేక శుభకరమైనది. అటువంటి మేకను కుటిలమందురు. నల్లనిఅండకోశము,తెల్లనివర్ణము,మధ్యలో నల్లనిపట్టీ, నడిచేటప్పుడు శబ్దముచేయునది,మెల్లగానడిచే మేక శుభమునిచ్చును. ఆ మేకను జటిలమందురు.

నల్లని మృగ సమానమైన శిరస్సు, వెంట్రుకలు కాళ్లున్న లేక ముందుభాగముల పాండువర్ణము వెనుకభాగము నీలివర్ణమున్న మేక శుభకరమైనది. ఇటువంటి మేకను వామనమందురు. ఈ విధముగా గర్గుని శ్లోకమున్నది. కుట్టకము,కుటిలము, జటిలము, వామనము ఈనాలుగు మేకలు లక్ష్మీపుత్రులు, లక్ష్మిలేని దేశములో నుండవు.

గాడిదవలె శబ్దము చేయునది,వేడిగ లేక వంకర తోక కలది చెడు గోళ్లు చెడువర్ణము తెగినచెవి కలిగి,ఏనుగువలె తలకలిగినది,నల్లని దవుడ నాలుక కలిగిన మేక అశుభము నిచ్చును. ఉత్తరమైన రంగు కలిగిన మణులతో కూడిన,కొమ్ములు లేని,ఎర్రనికనులు కలిగిన మేక ఉన్న ఇంటిలో ఎల్లప్పుడు సుఖము యశస్సు ధనమువృద్ధి పొందును.

అరువది ఐదవ ఛాగలక్షణాధ్యాయము సమాప్తము

66. అశ్వ లక్షణాధ్యాయము

పొడవైన మెడ నేత్రములు కేశములు విస్తీర్ణమైన నడుము, హృదయము, తామ్ర వర్ణపు నాలుక పెదవులు సూక్ష్మచర్మము, వెంట్రుకలతో కూడిన శిరస్సు తోక సుందరమైన గిట్టలు, గమనము,ముఖము,చిన్నచెవులు,పెదవులు, తోక, గుండ్రని తొడ, మోకాలు, సమానమైన తెల్లని దంతములు, దర్శనీయ ఆకారము, శరీరశోభ అన్ని అంగములు పరిశుద్ధముగా నున్న గుఱ్ఱము రాజుయొక్క శత్రువులను నాశనము చేయును.

నేత్రముల క్రిందిభాగము, దవుడ, ముఖకపోలము, హృదయము,మెడ నాసిక క్రిందిభాగము,శంఖము(చెవి సమీపభాగము)నడుము, బస్తి(నాభి లింగముల మధ్యభాగము) మోకాలు, కకుదము (భుజము వెనుక భాగము) గుదము దక్షిణకుక్షి, కాళ్లు ఈభాగములలో వెంట్రుకలు ఆవర్తముగా (తిరిగి) నున్న గుఱ్ఱమును అశుభముగా భావించవలెను.

ప్రపాణము (పైపెదవి క్రిందిభాగము) కంఠము చెవి వీపుమధ్యభాగము నేత్రముల పైభాగము,కనుబొమ్మల దగ్గర, పెదవి వెనుకభాగము, భుజము,తొడ కుక్షి పార్శ్వ భాగము, లలాటాది అంగములలో రోమములు ఆవర్తముగా నున్న గుఱ్ఱము అతిశుభకరమైనదని భావించవలెను. గుఱ్ఱము శరీరముపై పదిరోమావర్తములు (సుడులు) తప్పక ఉండును. వీటికి ధ్రువావర్తమందురు.ప్రపాణము తలపైభాగములలో ఒక్కొక్క రంధ్రము (పొట్ట నాభి మధ్యభాగము) రంధ్రముపై భాగము, మస్తకము ఛాతి ఈ నాలుగు భాగము లలో రెండేసి సుడులు ఉండును. ఈ విధముగా పది ధ్రువార్తములుండును.

గుఱ్ఱము క్రిందినున్న దంతపంక్తిలో రెండు గడ్డముల మధ్య ఆరుదంతములు కనపడును. ఈ విధముగా రెండు దంత పంక్తులకు ముందు ఆరు దంతములు తెల్లని వర్ణముతో నున్న అశ్వము ఒక సంవత్సరము, ఆ దంతములు కృష్ణ లేక రక్తవర్ణముతో నున్న రెండు వర్షముల వయసుకలదని తలంచవలెను. ఈ విధముగా రెండు దంతపంక్తుల మధ్యనున్న రెండేసి దంతములను సదంశమని,ప్రక్కనున్న రెండేసి దంతములను మధ్యమములని దానికి ప్రక్కనున్న రెండు దంత పంక్తులను అంత్యమని తెలుపుదురు.

పైన తెల్పిన సదంశ దంతపంక్తి ఊడి క్రొత్తవి ఉత్పన్నమైన అశ్వము మూడు వర్షములదని తలంచవలెను. మధ్యదంతములు విరిగి క్రొత్తవి వచ్చిన అశ్వము వయసు నాలుగు వర్షములు, అంత్యదంతములు ఊడి క్రొత్తదంతములు ఉత్పన్నమైన అశ్వమునకు ఐదువర్షములుండును.

సదంశ దంతముపై నల్లని బిందువు కనపడిన అశ్వమునకు ఆరువర్షములు, మధ్యమముపై నల్లని బిందువు కనపడిన ఏడువర్షములు, అంత్యముపై నల్లని బిందువు కనపడిన ఎనిమిది వర్షములని తలంచవలెను. సదంశ దంతముపై పచ్చని బిందువున్న పదకొండు వర్షములు, సదంశముపై తెల్లని బిందువు కనపడిన పన్నెండు వర్షములు,

మధ్యమములో తెల్లని బిందువుల కనపడిన పదమూడు వర్షములు, అంత్యములో తెల్లని బిందువు కనపడిన గుఱ్ఱమునకు పద్నాలుగు వర్షములుండును.

సదంశ దంతముపై గాజువలె తెల్లని బిందువు కనపడిన అశ్వమునకు పదిహేను వర్షములని, మధ్యమముపై కనపడిన పదహారు వర్షములు, అంత్యముపై కనపడిన పదిహేడు వర్షములుండును.సదంశముపై మధువర్ణ బిందువు కనపడిన పద్దెనిమిది సంవత్సరములు, మధ్యమముపై కనపడిన పందొమ్మిది వర్షములు, అంత్యముపై కనపడిన ఇరువది వర్షములుండును. సదంశముపై శంఖవర్ణపు బిందువు కనపడిన ఇరువది ఒక్క వర్షములు, మధ్యమమున కనపడిన ఇరువది రెండు వర్షములు, అంత్యమున కనపడిన ఇరువదిమూడు వర్షములు అశ్వమునకుండును.

సదంశము ఛిద్రమైన ఇరువది నాలుగు, మధ్యమము ఛిద్రమైన ఇరువది ఐదు, అంత్య దంతము ఛిద్రమైన ఇరువది ఆరు వర్షములు అశ్వమునకుండును. సదంశము కదిలిన ఇరువది ఏడు, మధ్యమము కదిలిన ఇరువది ఎనిమిది, అంత్యము కదిలిన ఇరువది తొమ్మిది వర్షములుండును.సదంశము ఊడిపడిన ముప్పదివర్షములు, మధ్యమము పడిన ముప్పది ఒక్క వర్షము, అంత్యము ఊడిపడిన ముప్పది రెండు సంవత్సరములు గుఱ్ఱమునకుండును.

అరువది ఆరవ అశ్వ లక్షణాధ్యాయము సమాప్తము

67. హస్తి లక్షణాధ్యాయము

తేనె రంగు దంతములు, పరిపూర్ణ అవయములు, అధికస్థూలము(లావు) అధిక బలము,కార్యక్షమము,సమాన అంగములతో కూడినది,ధనుషాకారములోనున్న వీపు భాగము,పందివలె వర్తులాకారముగానున్న మోకాలుపొట్టకలిగిన ఏనుగు భద్ర సంజ్ఞకమగును.

పొడవు ఛాతి, బలహీనమైన శరీరమధ్యభాగము, పెద్దపొట్ట,లావుచర్మము,కంఠము పొట్ట తోక జడ సింహము వలె చూపు కలిగిన ఏనుగు మందసంజ్ఞకమగును.క్రిందిపెదవి, తోకవెంట్రుకలు, లింగము, కాలు, కంఠము దంతము తొండము,చెవులు చిన్నవిగా నుండి, పెద్దకన్నులున్న ఏనుగు సంకీర్ణ సంజ్ఞకమగును.

మృగజాతి ఏనుగు ఐదు హస్తముల ఎత్తుండును. తోకనుండి కుంభస్థలము వరకు పొడవు ఏడు హస్తములు, మధ్యభాగము లావు ఎనిమిది హస్తములుండును. మృగము ఎత్తు మున్నగువాటికి ఒక్కొక్క హస్తము పెంచిన మందగజము, రెండు హస్తములు పెంచిన భద్ర గజాదుల ప్రమాణమగును. సంకీర్ణజాతి ఏనుగుల ఎత్తు మున్నగువాటిని నిశ్చయించలేము. భద్రజాతి ఏనుగు మదము ఆకుపచ్చగా,మందజాతి ఏనుగు మదము

పసుపుపచ్చగా, మృగజాతి ఏనుగు మదము నలుపుగ సంకీర్ణ జాతి ఏనుగు మదము మిశ్రిత వర్ణముతో నుండును.

తామ్రమువలె ఎరుపురంగు పెదవులు, ముఖము కలది,ఇండ్లలోనుండు పక్షులతో సమానమైన నేత్రములు కలది, గట్టివి పెద్దవైన దంతములు కలది విశాలమైన పొడవైన ముఖముకలది, ధనువువలె ఉన్నతమైన పొడవైన వెడల్పైన వీపుభాగము కలది, తాబేలువంటి కుంభస్థలముపై ఒక్కొక్క సూక్ష్మరోమము కలది, విశాలమైన చెవి దవుడ బొడ్డు లలాటము లింగము కలది, తాబేలువలె పద్దెనిమిది లేక ఇరువది గోళ్లుకలది, మూడురేఖలు వర్తులాకారమైన తొండము,తోక, సుగంధయుతమైన గండస్థలము గల గజము శుభకరమైనది.

ఏనుగు తొండము అగ్రభాగమున పుష్కరము, పుష్కరపు అగ్రభాగమున అంగుళి యుండును. పొడవైన అంగుళి ఎరుపురంగు పుష్కరము, మేఘగర్జనతో సమానమైన ఘీంకారధ్వని, విశాలమైన పొడవైన వర్తులాకారపు మెడ ఉన్న ఏనుగు శుభమునిచ్చును.

మదములేని, హీనమైన గోళ్లు అవయములు కలది, పొట్టిది, మేక కొమ్ముల వంటి దంతములు, కనిపించుచున్న అండకోశము కలది, పుష్కరము లేనిది, మలినము నీలము చిత్రలేక నల్లని దవుడలు, చిన్న దంతములు, ముఖరోమములు కలది, దంతములు లేనిది, కదలనిది, గర్భముతో కూడినదైన ఏనుగును పరదేశమునకు పంపవలెను. అది అన్ని విధములుగా చెడుఫలము నిచ్చును.

అరువది ఏడవ హస్తిలక్షణాధ్యాయము సమాప్తము

68. పురుష లక్షణాధ్యాయము

సాముద్రిక శాస్త్రజ్ఞుడు మొదట పురుషుని ఉచ్చత(ఎత్తు) పరిమాణము గతి సంహతి(ఉన్నతి)సారము,వర్ణము,స్నేహము,స్వరము,ప్రకృతి,సత్వము, అనూకము(పూర్వజన్మ కర్మఫలము) క్షేత్రము,లావణ్యములను పరిశీలన చేసి శుభశుభా ఫలములను తెలుపవలెను.

స్వేద(చెమట) రహితము, కోమలము, కమలోదర సమానమైన వర్ణము,వ్రేళ్ల మధ్య ఖాళీ లేకపోవడము, తామ్రమువలె ఎర్రగా ప్రకాశించు గోళ్లు, సుందరమైన మడమలు,వేడికలిగి నరములు పైకి కనపడక ఉండటము, పాదము చీలమండపైకి కనపడకుండ ఉండటము, తాబేలు వలె పైకి ఉబ్బెత్తుగా పాదాలు ఉండటము, ఈ లక్షణములు రాజుకుండును. చేట ఆకారము కలిగి తెల్లగా పాలిపోయిన గోళ్లు వంకరగా పైకి తేలినరాలు, వ్రేళ్లమధ్య ఖాలీలున్న పాదాలు దు:ఖమును కలిగించును. మధ్యభాగము ఎత్తుగా పాండుర వర్ణము కలిగిన పాదాలు ప్రయాణమును సూచించును.కషాయపు రంగు (నలుపు ఎరుపు)పాదాలు వంశమును నశింపజేయును. పాదముల క్రిందిభాగము

పచ్చగానున్న పొందరాని స్త్రీని పొందుటకు ప్రయత్నించును.

తక్కువగా సూక్ష్మమైన రోమాలు కలిగిన పిక్కలు, ఏనుగు తొండము వంటి గుండ్రని తొడలు,పుష్టిగా సమానముగా నున్న రెండు మోకాళ్లు రాజుకుండును. కుక్క నక్కలతో సమానమైన పిక్కలు కలిగిన వ్యక్తి ధనహీనుడగును. రాజుపిక్కలపై నున్న రోమ కూపములో ఒక్కొక్క రోమముండును. పండితులు క్షత్రియుల రోమకూపములలో రెండేసి రోమములుండును. మూడు అంతకు మించి రోమ కూపములున్న మనుష్యుడు నిర్ధనుడు దరిద్రుడగును.

మాంసరహితమైన మోకాళ్లు కలిగిన వ్యక్తి ప్రవాసములో మరణించును. చిన్న మోకాళ్లున్న భాగ్యశాలి, పెద్దగా మోకాళ్లున్న దరిద్రుడగును. క్రిందికి వంగిన మోకాళ్లున్న స్త్రీని జయించుట జరుగును. మాంసముతో కూడిన మోకాళ్లు కలిగిన వ్యక్తి రాజ్యమును భోగించును. పెద్దమోకాళ్లున్న వ్యక్తి దీర్ఘకాలము జీవించును.

అంగము చిన్నగానున్న ధనవంతుడు, లావుగానున్న సంతానరహితుడు, అంగము ఎడమవైపుకి వంగిన దరిద్రుడు, వంకరగానున్న సంతాన ధనహీనుడగును. అంగము నిటారుగానున్న పుత్రవంతుడగును. క్రిందికి వంగియున్న దరిద్రము, నరములతో కూడిన అంగము అల్పసంతానము, బలమైన గ్రంథులున్న సుఖము, కోమలముగానున్న ప్రమేహ (మూత్రమార్గము నుండి వీర్యము పోవు రోగము)రోగముతో మరణమును పొందును.

ఒక అండమున్న మనుష్యుడు నీటిలో మునిగి మరణించును. చిన్న పెద్ద అండము లున్న మనుష్యుడు స్త్రీలోలుడగును. సమానమైన అండములు కలవాడు రాజగును. పైకి క్రిందికి అండములున్న అల్పాయువు కలుగును. పొడవైన అండములున్న నూరు సంవత్సరములు జీవించును. ఎరుపురంగు మణి(అంగ అగ్రభాగము) కలిగిన పురుషుడు ధనవంతుడు తెలుపు మలినపు మణి కలిగినవాడు నిర్ధనుడగును. మూత్రము చేయు సమయమున శబ్దము కలిగిన సుఖవంతుడు శబ్దము లేకున్న ధనహీనుడగును. దక్షిణావర్తముగా రెండు మూడు నాలుగు మూత్రధారలు క్రిందికి పడిన రాజగును. మూత్రధారలు రెండు వైపులకి పడిన నిర్ధనుడు, ఒకమూత్రధార కలిగిన వ్యక్తి సుందరముగా నున్నను పుత్రులుండరు. మణిస్నిగ్ధముగా ఎత్తుగా సమానముగానున్న పురుషుడు ధనము స్త్రీ రత్నములతో సుఖమును పొందును. మణిమధ్యభాగము వంగియున్న మనుష్యుడు కన్యా సంతానముతో ధనహీనుడగును. మణిమధ్యభాగము ఎత్తుగానున్న మనుష్యుడు అనేక పశువులకు స్వామియగును. మణిలేనివాడు ధనవంతుడగును.

బస్తి(నాభి అంగముల మధ్యభాగము) పైభాగము మాంసరహితమైన ధనహీనుడగును. అన్ని అప్రియములు కలుగును. వీర్యము పుష్ప సమాన వాసన కలిగిన వ్యక్తి రాజగును. తేనె సమానమైన వాసన కలిగిన ధనవంతుడగును. చేప వాసన కలిగిన

అధికసంతాన వంతుడగును. తక్కువ వీర్యమున్న స్త్రీ సంతానము కలుగును. మాంస సమాన గంధముతో వీర్యమున్న భోగవంతుడగును. మద్య సమాన గంధముతో వీర్యమున్న యజ్ఞము చేయువాడు, క్షార(ఉప్పు) సమానముగా వీర్యమున్న ధనహీనుడగును. శీఘ్రముగా మైథునము చేయువాడు ఎక్కువకాలము ఆలస్యముగా మైథునము చేయువాడు అల్పాయువు కలిగియుండును.

అతిలావుగానున్న పిరుదులు దరిద్రమును, సమానముగా మాంసమును కలిగి యున్న సుఖము, కొంచెము మాంసము కలిగియున్న పులి వలన మరణము కలుగును. కప్ప ఆకృతిలో పిరుదులున్న రాజగును. సింహసమానమైన కటి ప్రదేశమున్న రాజ్యాధికారము, కోతి వంటి కటి వలన దరిద్రము కలుగును. సమానంగా నున్న పొట్ట భోజనమును, బానవంటి పొట్ట నిర్ధనమును కలిగించును.

పరిపూర్ణముగా ప్రక్కభాగమున్న (కటి పైభాగము)మనుష్యుడు ధనవంతుడగును. వంగిన వంకర పార్శ్వమున్న భోగరహితము, సమానముగా పొట్ట మధ్యభాగమున్న భోగము,లోతైనపొట్ట భోగహీనము,పొట్టమధ్యభాగము ఎత్తుగానున్న రాజగును. సమానముగా లేకున్న కఠోర మనస్తత్వము కలుగును. సర్పమువలె పొట్ట ఉన్న ధనరహితుడు అధిక ఆహారము తినేవాడగును.

గుండ్రముగా ఎత్తుగా విస్తీర్ణముగానున్న నాభి సుఖమునిచ్చును. చిన్నగా లోపలి భాగము కనపడకుండ నున్న నాభిక్లేశాన్ని కలిగించును. సుడిమధ్యలో వంకరగా నున్న శూలరోగము దరిద్రము కలుగును. నాభి వామావర్తముగానున్న రహస్యముగా అపకారము చేయు స్వభావము, దక్షిణావర్తమైన మేధావితనము కలుగును. నాభి రెండువైపుల విస్తరించిన దీర్ఘాయువు కలుగును. పైభాగమునకు విస్తరించిన ధనవంతుడగును. నాభిక్రింది వైపుకి విస్తరించిన గోసంపద కమలకర్ణిక వలెనున్న రాజ్యాధికారము కలుగును.

పురుషుని ఉదరముపై ఒకరేఖ ఉన్న శస్త్రము ద్వారా మరణము, రెండు రేఖలున్న స్త్రీభోగము, మూడురేఖలున్న ఆచార్యత్వమును పొందును. నాలుగు రేఖలున్న అధిక సంతానము కలుగును. రేఖలు విషమముగా నున్న మనుష్యులు అగమ్య స్త్రీ గాములై (పొందకూడని స్త్రీలను పొందుట) పాపులగుదురు. రేఖలు నిదానముగా నున్న వ్యక్తులు పుత్రవంతులు,పరస్త్రీలందాసక్తి లేనివారగుదురు.

బాహుమూలములు కోమలమై దక్షిణావర్తముగా రోమములున్న పురుషుడు రాజగును. దానికి వ్యతిరేకముగా నున్న మనుష్యుడు ధనహీనుడు, సుగములేనివాడు దాసుడగును, స్తన చూచకము (అగ్రభాగము)లు ఎత్తుగా లేకున్న మనుష్యుడు సౌభాగ్యశాలి యగును. చూచకములు పెద్దవిగా నున్న ధనహీనుడగును. చూచకములు లావుగా ఎత్తుగా నున్న రాజగును సుఖమును పొందును.

వక్షస్థలము ఎత్తుగా మాంసముతో వెడల్పుగా నున్నవాడు రాజగును. ధనహీనుని వక్షస్థలము నరములతో విపరీతలక్షణములతో కృశించి యుండును.సమానమైన వక్షస్థలము కలవాడు ధనవంతుడు, చిన్న వక్షస్థలము కలవాడు పురుషార్థహీనుడు, విషమ వక్షస్థలము కలవాడు ధనహీనుడు శస్త్రము వలన మృత్యువు పొందువాడగును.విషమ జత్రువులు(కంఠము క్రిందనున్న ఎముకలు) కలవాడు విషమస్వభావము కలవాడు, ఎముకల సంధులతో కూడిన మనుష్యుడు ధనము లేనివాడు, పుష్టి కలిగిన జత్రువులు కలవాడు ధనవంతుడగును.

సన్నగా చిక్కిన నరములు కలగిన మెడలు కలవాడు ధనహీనుడగును. దున్నపోతు వలె మెడకలవాడు శూరుడగును. ఎద్దువంటి మెడ కలవాడు, శస్త్రములతో మరణించును. శంఖ సమానమైనమెడకలిగిన రాజు,పొడవైన మెడకలవాడు అధికముగా తినువాడు, భగ్నము కాని రోమాలు లేని వీపుభాగము కలవాడు ధనవంతుడు, రోమములతో కూడిన వీపు గలవాడు ధనరహితుడగును.

స్వేద(చెమట)రహితము పుష్టము ఉన్నతము, సుగంధయుతము సమానమైన రోమములతో కూడిన కక్ష (చంక)భాగము ధనవంతులకుండును. చెమటతో అపుష్టమై వంగినదై దుర్గంధముతో కూడి విషమము రోమరహితమైన కక్షము ధనరహితమగును.

మాంసహీనమై, రోమాలు లేక భగ్నమై చిన్నవిగానున్న భుజాలు మనిషిని ధనహీనుని చేయును.విశాలమైన భగ్నరహితమైన పరస్పరము కలిసియున్న భుజాలు కలిగిన మనుషులు సుఖవంతులు బలవంతులగుదురు. ఏనుగు తొండమువలె వర్తులాకారముగా నుండి మోకాళ్లవరకు పొడవున్న సమముగా బలముగానున్న బాహువులు రాజు కుండును. రోమములతో కూడి చిన్నచేతులు ధనహీనుని చేయును.

చేతివ్రేళ్లు పొడవుగానున్న దీర్ఘాయువు కలుగును.పటిష్ఠంగా నున్నవి సౌభాగ్యమును,సన్నగానున్న వ్రేళ్లు తెలివితేటలను, తప్పడగానున్న వ్రేళ్లు సేవకవృత్తిని కలుగజేయును. లావుగానున్న వ్రేళ్లు ధనరాహిత్యమును, బయటకు వంగిన వ్రేళ్లు శస్త్రము వలన మృత్యువును కలిగించును. వానర సమానమైన హస్తములు ధనము నిచ్చును. పులి పాదాలవంటి చేతులు పాపములను చేయించును.

నిగూఢము(పైకి కనపడకుండటము)దృఢము(బలము)గానున్న సంధులు కలిగిన మణిబంధము (మణికట్టు) రాజుకుండును. చిన్నమణిబంధము కలవాని హస్తము ఖండింప బడును. శబ్దము కలిగిన మణిబంధము వలన ధనహీనుడగును. అరచేయి లోతుగానున్న తండ్రి వలన ధనము కలుగును. వర్తులాకారముగా లోతుగానున్న అరచేయి ధనమును, ఎత్తుగానున్న అరచేయి ధనహీనతను కలిగించును.విషమముగానున్న అరచేయి నిర్ధనమును,లక్కవలె ఎరుపుగానున్న అరచేయి ధనమునిచ్చును.పసుపు రంగులో నున్న పరస్త్రీ గమనము,కఠినముగా నున్న నిర్ధనత్వము కలుగును.

ఊకవంటి రేఖలున్న గోళ్లు నపుంసకత్వమును, తప్పడగానున్న పగిలిన గోళ్లు

ధనరాహిత్యాన్ని కలిగించును. పుచ్చుపట్టిన వర్ణహీనమైన గోళ్లు గలవారు ఇతరుల సుఖమును చూచుచు బ్రతుకువారగును. తామ్రవర్ణపు గోళ్లు కలవారు సేనాపతులగుదురు. యువరేఖలు అంగుష్ఠ మధ్యభాగములోగాని మూలలోగాని యున్న పుత్రవంతులు ధనవంతులగుదురు. వ్రేలు మధ్యనున్న పర్వములు పొడవుగానున్న సౌభాగ్యవంతులు దీర్ఘాయువు కలవారుగుదురు. కోమలమైన లోతైన రేఖలు ధనవంతులకు దానికి వ్యతిరేకముగా నున్న రేఖలు దరిద్రుల కుండును. వ్రేళ్లమధ్యలో దూరమున్న ధనహీనులు, దగ్గరగానున్న ధనవంతులగుదురు.

మణికట్టు నుండి బయలుదేరిన మూడురేఖలు కరతల సమీపమునకు ప్రవేశించిన రాజగును. రెండు మీనరేఖలతో కూడిన హస్తమున్న వాడు ఎల్లపుడు అన్నదానము చేయును. హస్తములో వజ్ర సమానమైన రేఖ ఉన్న ధనవంతుడు, మత్స్య(చేప) సమానమైన రేఖ ఉన్న విద్వాంసుడు, శంఖము ఛత్రము పల్లకి ఏనుగు గుర్రము కమల సమానమైన రేఖలున్న రాజగును. పతాకము అంకుశము సమానముగా చేతిలో రేఖలున్న భూమిలో ధనము నిలువచేయువాడగును. త్రాడువలె చేతిపై రేఖలున్న ధనము, స్వస్తికమువలె రేఖలున్న ఐశ్వర్యము కలుగును. చక్రము ఖడ్గము పరశువు తోమరము శక్తి ధనుస్సు కుంతములతో సమానమైన రేఖలున్న సేనాపతి, ధ్వజము రోలు ఆకారములో నున్న యజ్ఞము చేయు వాడగును. మకరము, ధ్వజము, కోష్ఠాగారము (గాదె) వలె రేఖలున్న అధిక ధనవంతు డగును. వేదిక వలె అంగుష్ఠమూల భాగమున్న అగ్నిహోత్రి యగును. వాపి దేవమందిరము మున్నగునవి(సింహాసనము, శ్రీవృక్షము యూపము) త్రికోణ చిహ్నము కనపడిన ధార్మికుడగును. అంగుష్ఠమూలములో ఎన్ని లావురేఖలుండునో అంతమంది పుత్రులు, ఎన్ని సన్నని రేఖలుండునో అమతమంది కన్యలు కలుగుదురు. చూపుడు వ్రేలు మూలకు మూడురేఖలు వెళ్ళిన వ్యక్తి వందసంవత్సరము జీవించును. చిన్నరేఖ వెళ్ళిన అనుపాతముననుసరించి ఆయుకల్పన చేయవలెను. చేతిలో మధ్యలో ఆగిన రేఖలున్నవాడు వృక్షము నుండి పడును. అధికరేఖలున్న లేక తక్కువ రేఖలున్న ధనహీనుడగును.

చాలాచిన్న లేక పెద్దపెదవి ఉన్న ధనహీనము, మాంసయుతమైన అధరమున్న ధనవంతుడగును. దొండపండువలె ఎరుపు రంగు కలిగి వంకరగా లేని చిన్నపెదవి ఉన్న రాజగును. పగిలిన, ఖండితమైన వర్ణరహితమైన ఎండిన అధరమున్న ధనహీనుడగును. కోమలము దృఢము తీక్ష్ణమైన దంతము శుభమునిచ్చును. ఎరుపురంగు కలిగిన పొడవైన కోమలమైన నాలుక భోగమును కలిగించును. తెలుపు నలుపు రంగు కలిగి ఎండిన నాలుక ధనరహితుని చేయును. ఈవిధముగా దవుడను కూడ తెలిసికొనవలెను.

సుందరము వర్తులాకారము నిర్మలము కోమలము సమానమైన ముఖము రాజులకుండును. దీనికి వ్యతిరేకముగానున్న భాగ్యహీనుడగును. స్త్రీసమానమైన ముఖమున్న

వాడు సంతానహీనుడు, గుండ్రని ముఖమువాడు శఠుడు(చెడ్డవాడు) పొడవు ముఖమువాడు నిర్ధనుడు, భయంకర ముఖమువాడు ధూర్తుడు, నిమ్న (లోతు) ముఖమువాడు పుత్రహీనుడు చిన్నముఖమువాడు కృపణుడు (లోభి) సంపూర్ణమైన సుందరమైన ముఖమున్న వాడు భోగవంతుడగును.

ముందువైపు భాగము పగలకుండ సుందరము కోమలమై క్రిందికి వంగియున్న గడ్డము శుభమునిచ్చును. ఎరుపు ఎండిన గడ్డమున్నవాడు దొంగయగును. మాంసహీనమైన చెవులున్నవాడు పాపకర్మద్వారా మరణించును. తప్పడగా నున్న చెవులవాడు అధికభోగము ననుభవించును. చిన్నచెవులున్నవాడు లోభియగును. శంఖాకారములోనున్న సైన్యాధి పత్యము, రోమములున్న దీర్ఘాయువు, పెద్దగాచెవులున్న ధని, నాడులతో కూడిన చెవులున్నవాడు క్రూరుడగును. పొడవైన పుష్టి కలిగిన చెవులున్నవాడు సుఖమును పొందును.

ఎత్తైన చెక్కిలి కలిగిన ధనవంతుడు, మాంసయుతమైన చెక్కిలి కలిగిన రాజు అగును. చిలుకవలె ముక్కు కలిగిన భోగి,సుఖి యగును. మాంసరహిత నాసిక దీర్ఘాయువును, కోసినట్లున్న నాసిక అగమ్యస్త్రీ గమనమును, పొడవైన నాసిక భాగ్యశాలిని, పైకిలేచి ఉన్న నాసిక చోరుని, చప్పిడి నాసిక స్త్రీచేతులలో మృత్యువును, ముందువైపు వంకరగా నున్న నాసిక ధనవంతుని, కుడివైపుకి వంగి ఉన్న నాసిక అతిగా తినే క్రూరుని, తిన్నగా చిన్న నాసికాపుటముతో సుందరముగా నున్న నాసిక భాగ్యశాలిని చేయును.

ఒకమారు తుమ్మిన ధనవంతుడు, రెండు మూడు మార్లు తుమ్మిన ఆహ్లాదపరిచే లక్షణము కలవాడగును. మొదటి నుండి చివరి వరకు ఒకేవిధముమైన ధ్వని వచ్చినట్లు తుమ్మిన దీర్ఘాయువు కలుగును.

కమలము వంటి నేత్రములు కలవాడు ధనవంతుడగును. ఎరుపురంగు నేత్రములున్న భాగ్యవంతుడగును. పిల్లికళ్లవాడు పాపకార్యములు చేయును. లేడికళ్ల వలె గుండ్రము గానున్న దొంగ, నీలినేత్రములున్న క్రూరుడు,ఏనుగువలె నేత్రములున్న సేనాపతి, గాంభీర్యమైన నేత్రములున్న ఐశ్వర్యవంతుడు, నీలి కమలమువలె నున్న విద్వాంసుడగును. అతినల్లని కనుపాపలున్న ఆకన్నులు తొలగింపబడును. స్థూలమైన కన్నులున్న మంత్రి, కపిలవర్ణ నేత్రములున్న భాగ్యశాలి, దీర్ఘమైన నేత్రములున్న నిర్ధనుడు,కోమలమైన స్థూలమైన నేత్రము లున్న ధనవంతుడు భోగియగును.

మధ్యలో ఎత్తుగానున్న కనుబొమలు అల్పాయువును,పెద్దవి పొడవైన కను బొమలు అతిసుఖమును, విషమమైన కనుబొమలు నిర్ధనమును, బాలచంద్రుని వలె వంగిన కనుబొమలు ధనవంతుని, పొడవుగానుండి పరస్పరము కలువని కనుబొమలు ధనమును, విరిగిన కనుబొమలు నిర్ధనమును, మధ్యలో వంగిన కనుబొమలు అగమ్య స్త్రీగమనమును కలిగించును.

ఎత్తుగా విశాలముగా నున్న కణత ధనమును, పల్లంగా ఉన్న సంతానము ధనములేని వారిని చేయును. విషమముగా నున్న లలాటము ధనరాహిత్యమును, అర్థచంద్రాకారములో నున్న ధనవంతుని చేయును. పురుషుల లలాటము విశాలముగా ముత్యపుచిప్ప వలెనున్న ఆచార్యుని, నరములు పైకి కనపడు లలాటము అధర్మపరుని చేయును. ఎత్తుగా స్వస్తికా కృతిలో నరములున్న ధనాధిక్యమును, నిమ్నలలాటము వధ,బంధనము, పాపకర్మల యందా సక్తిని కలిగించును. ఎత్తుగా లలాటమున్న రాజగును. గుండ్రముగా లలాటమున్న లోభి యగును.

దీనత్వము లేకుండ, కన్నీటిబిందువులు లేకుండ కోమలమైన ఏడుపు శుభము నిచ్చును. దీనమైన అధికమైన కన్నీటితో కూడిన ఏడుపు మంచిఫలమునీయదు. కంపము లేకుండ చేయునవ్వు శుభకరమైనది. కళ్లుమూసి నవ్వేవాడు పాపి, మాటిమాటికి నవ్వేవాడు దుష్టుడు, నవ్విన తర్వాత చివరిలో మాటిమాటికి నవ్వేవాడు ఉన్మాద పురుషుడగును.

లలాటముపై మూడు రేఖలున్న వందసంవత్సరములు జీవించును. నాలుగు రేఖలున్న 95 సంవత్సరములు జీవించును. రేఖలు మధ్యలో ఖండింపబడిన అగమ్యస్త్రీ గమనాన్ని 90 సంవత్సరముల ఆయువును సూచించును. కేశముల చివరి వరకు రేఖలున్న 80 సంవత్సరములు, ఐదురేఖలున్న డెబ్బది సంవత్సరములు, లలాటములోనున్న రేఖలన్ని కలిసిన 60 సంవత్సరములు, ఆరు ఏడు లేక అధిక రేఖలున్న 50 సంవత్సరములు, వంకర రేఖలున్న 40 సంవత్సరములు ఆయువుండును. లలాటము నుండి కనుబొమల వరకు రేఖలున్న 30 సంవత్సరముల ఆయువుండును.

లలాటమునకు ఎడమభాగమున వంకర రేఖలున్న 20 వర్షములుండును. చిన్నరేఖలున్న ఇరువది కన్న తక్కువ వర్షములు జీవించును. రేఖలవృద్ధి ననుసరించి ఆయువును తెలుపవలెను. మూడురేఖలున్న 100 వర్షములు, నాలుగున్న 95వర్షములు, మూడున్నర రేఖలున్న 97 1/2 వర్షములు జీవించునని తెలుపవలెను.

గోళాకారములోనున్న శిరస్సు గోసంపదను, ఛత్ర ఆకారములోనున్న శిరస్సు రాజును సూచించును. తప్పడగానున్న శిరస్సు తల్లిదండ్రుల వినాశనమును, శిరస్త్రాణము వలె నున్న శిరస్సు దీర్ఘాయువును తెలుపును. కుండ ఆకారములోనున్న శిరస్సు ధ్యాన పరాయణత్వమును సూచించును. పల్లముగానున్న శిరస్సు కలవాడు పాపి నిర్ధనుడగును. ఎక్కువ పల్లమున్న శిరస్సు అనర్థము కలిగించును.

ఒక రోమకూపములో ఒకరోమము, నలుపురంగు, ఉంగరాల జుట్టు, చివరలు పగులకుండ కోమలముగా దట్టముగా నున్న కేశములు సుఖవంతుని రాజుని చేయును. ఒకరోమ కూపములో అధికముగా రోమములు, విషమము, కపిలవర్ణము, స్థూలము, పగిలిన అగ్రభాగము కలిగి బిరుసుగా గట్టిగా వంకరలు తిరిగిన కేశములు ధన

రాహిత్యమును సూచించును.

అంగములు కరుకుగా మాంసరహితముగా నరములు కనపడుతున్న అశుభ మగును. దీనికి వ్యతిరేకముగా (కోమలము, మాంసయుతము, నరములు కనపడకుండ) నున్న శుభము కలుగును. మూడు అంగములు విస్తీర్ణముగా మూడు అంగములు గంభీరముగా, ఆరు అంగములు ఎత్తుగా నాలుగు అంగములు చిన్నగా,ఏడు అంగములు ఎరుపుగా ఐదు అంగములు పొడవుగా సూక్ష్మముగానున్న రాజగును.

పురుషునికి నాభి,శబ్దము, సత్వము ఈమూడు గంభీరముగా, ఛాతి, లలాటము, ముఖము ఈ మూడు విస్తారముగానున్న శుభము కలుగును. పురుషుని వక్షస్థలము, కక్షము (చంక) నఖములు(గోళ్లు) నాసిక ముఖము కృకాటిక(తల వెనుకభాగము) ఈ ఆరు అంగములు ఎత్తుగా ఉండవలెను. లింగము వీపుభాగము, కంఠము, పిక్కలు, ఈ నాలుగు చిన్నగా నుండవలెను. నేత్రముల చివరిభాగము (కంటికొనలు) అరికాలు అరచేతి, దవుడలు క్రిందిపెదవి నాలుక గోళ్లు ఈ ఏడు ఎరుపు రంగుతో నున్న సుఖదాయకమగును. దంతములు వ్రేళ్ల పర్వములు (కణుపులు) కేశములు చర్మము గోళ్లు ఈ ఐదు చిన్నవిగానున్న సుఖమునిచ్చును. దవుడలు కళ్లు బాహువులు ముక్కు స్తనముల మధ్యభాగము ఈఐదు పొడుగా నుండవలెను. రాజులకు తప్ప మిగిలిన వారికి పై ఐదు భాగములు పొడవుగా నుండవు. స్ఫటికములతో నిర్మించిన పాత్రలోనుంచిన దీపకాంతి బయటకు వెలువడి ప్రకాశము కలిగించునట్లు,ఛాయ లేక శరీరకాంతి శుభాశుభ ఫలములను వ్యక్తపరచును. లక్షణజ్ఞులైన విద్వాంసులు దానిని గుర్తించవలెను.

దంతములు,చర్మము,గోళ్లు, రోమములు, తలవెంట్రుకలు సుందరముగా శరీరము సుగంధమైన పృథ్వీతత్వము వలన ఉత్పన్నమైనఛాయ (శరీరశోభ)గా తెలుసుకొనవలెను. ఇది ప్రాణులకు సంతోషము ధనలాభము ఐశ్వర్యమును కలిగించును. ఎముకలు మాంసము నఖములు చర్మము రోమములు ఇవి పధ్వీతత్వములు. సుందరమైన శరీరకాంతి తెలుపు స్వచ్ఛత ఆకుపచ్చ రంగులతో కన్నుల కింపుగ కనిపించిన దానిని జలఛాయగా గుర్తించవలెను. అది సౌభాగ్యము మార్దవము(మంచితనము) సుఖము అభ్యుదయమును కలిగించును. అన్నికార్యములను నెరవేర్చి తల్లివలె హితమును కలిగించును.

కమలము,అగ్ని సువర్ణము వంటి కాంతి కలిగి తేజస్సు పరాక్రమము ప్రతాపముతో కూడినది అగ్నిఛాయ. ఇదిప్రాణులకు జయమును కలిగించును. కోరిన కోరికలను తీర్చును. మలినము పరుషము నలుపు దుర్గంధయుక్తముగానున్నది వాయుఛాయ. ఇది వధ బంధనము రోగము లాభములో బాధను, ధననాశనమును కలిగించును. ఆకాశఛాయ స్ఫటిక సమానకాంతి కలిగియుండును. ఇది భాగ్యమును ఔదార్యమును నిధివలె ఎల్లవేళలా శుభమును శ్రేయస్సును కలిగించును.

క్రమముగా భూమి జలము అగ్ని వాయువు ఆకాశఛాయలను నేను తెలిపితిని. కొందరు మునులు పది ఛాయలు తెలిపిరి. ముందు తెల్పిన భూమ్యాది పంచఛాయలు సూర్యుడు విష్ణువు ఇంద్రుడు యముడు చంద్రుడు వీరిని కలిపి పదిఛాయలు తెలిపెదరు. కాని సూర్యాది ఐదుఛాయల లక్షణముల ఫలము భూమ్యాది ఛాయలతో సమానము. అందు వలన నేను సంక్షేపముగా ఐదుఛాయలను తెల్పితిని.

ఏనుగు,ఎద్దు, రథసమూహము, భేరి,మృదంగము, సింహము, మేఘము వీటితో సమానమధ్వని కలిగినవాడు రాజగును.గాడిద, జర్జర (శిధిలము)బొంగురు ధ్వని కలిగిన వారు ధనము సుఖమును పొందలేరు. శరీరములో మేదస్సు, (మెదడు) మజ్జ (ఎముకలలో నుండు భాగము) చర్మము, ఎముకలు, వీర్యము, రక్తము, మాంసము ఇవి ఏడుసారములు సంక్షేపముగా వీటిఫలము తెలిపెదను.

దవుడ, పెదవి, దంతములు, మాంసము, నాలుక, నేత్రముల లోపలిభాగము, గుదము, కాళ్లుచేతులు ఇవన్ని ఎరుపుగా నున్న రక్త సార మనుష్యుడగును. ఇతడు అధిక సుఖముతో,స్త్రీ ధనపుత్రులతో కూడియుండును.కోమలమైన శరీరము కలవాడు ధనవంతుడు, మృదువుగానున్న శరీరము కలవాడు భాగ్యశాలి పలుచని చర్మము కలవాడు పండితుడగును.మజ్జసారము మేదసారముకల మనుష్యుడు సుందరుడు పుత్రవంతుడు ధనవంతుడగును. అస్థిసారము గల మనుష్యుడు లావు ఎముకలతో బలవంతుడు విద్వాంసుడు సుందరుడగును.వీర్యసారము గల మనుష్యుడు,చక్కని వీర్యము కలవాడు, భాగ్యవంతుడు విద్వాంసుడు సుందరుడగును. మాంససారము గల మనుష్యుడు లావైన శరీరము కలవాడు విద్వాంసుడు ధనవంతుడు సుందరుడు అన్ని అంగముల సంధులు శక్తివంతముగా నున్న మనుష్యుడు సుఖవంతుడగును.

వాక్కు, నాలుక, దంతము, కళ్లు, గోళ్లు –ఈ ఐదు స్థానములు స్నేహభావముతో సుందరముగానున్న పుత్ర ధనసౌభాగ్యములు కలుగును. కఠినముగా నున్న ధనహీనులగును రాజుల కాంతి ప్రకాశవంతముగా నుండును. మధ్యమకాంతి కలిగినవారు పుత్రవంతులు ధనవంతులగుదురు. కాంతిహీనముగానున్న ధనహీనులగుదురు. శుద్ధమైన సుందరమైన వర్ణము శుభమును మిశ్రితవర్ణము అశుభమును కలిగించును.

ముఖమును చూచి పూర్వజన్మ కల్పనచేయవలెను.గోవు, ఎద్దు, పులి, సింహము, గరుడునితో సమానమైన ముఖము కలవారు పూర్వజన్మ శుభులై యుందురు. ప్రతాపవంతులై శత్రువులను జయించు రాజులగుదురు.కోతి, దున్నపోతు, పంది, మేకతో సమానమైన ముఖము కలిగినవారు పూర్వజన్మలో మధ్యములగుదురు. వారు శస్త్రము ధనము సుఖములను పొందుదురు. ఒంటెతో సమానమైన ముఖము కలవారు పూర్వజన్మలో అశుభులగుదురు. వారు ధన సుఖరహితులగుదురు.

తమ అంగుళములతో 108 అంగుళములున్న ఉత్తములు 96 అంగుళములున్న మధ్యములు. 84 అంగుళములున్న అధములగుదురు. ఒక భారము రెండువేల పలములగును. దానిలో సగముభారమున్న పురుషుడు సుఖవంతుడగును. దానికన్న తక్కువ బరువున్న దు:ఖము కలుగును. ఒకభారమున్న అధిక ధనవంతుడు, ఒకటిన్నర భారమున్న చక్రవర్తియగును. 20 సంవత్సరముల స్త్రీ, 25 సంవత్సరముల పురుషుని బరువును విచారించవలెను. లేని యెడల గణితముచే నిర్ణయించబడిన ఆయువులో నాల్గవవంతు గడిచిన తర్వాత బరువు గురించి తెలిసికొనవలెను.

పురుషులలో భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, దేవత, మనుష్యుడు, రాక్షసుడు, పిశాచము, వంకరగా నడిచేవాడు – వీరి స్వభావముండును. వారి లక్షణములు చెప్పబడును. భూప్రకృతి కలిగిన పురుషుడు సుందరమైన పుష్పసమానమైన వాసన కలవాడు, భోగి సుగంధయుతమైన శ్వాసకలవాడు స్థిరస్వభావము కలవాడగును. జలప్రకృతి మనుష్యుడు, అధికజలము త్రాగేవాడు,మధుర వచనములు పలుకువాడు,మధుర రస ప్రియుడగును. అగ్నిప్రకృతి మనుష్యుడు చంచల మనస్తత్వము కలవాడు, పాపాత్ముడు క్రూరుడు ఆకలిని సహించలేనివాడు అధికభోజనము చేయువాడు, వాయుప్రకృతి కలవాడు, చంచలుడు బలహీనుడు తొందరగా కోపము వచ్చువాడగును.

ఆకాశ ప్రకృతి మనుష్యుడు కార్యనిపుణుడు, వికసించినముఖము కలవాడు, సంస్కృత పదజ్ఞానము కలవాడు, సుందరాంగుడగును. దేవతా ప్రకృతి మనుష్యుడు దానము చేయువాడు స్వల్పకోపము కలవాడు ప్రేమికుడు, మనుష్య ప్రకృతి కలిగిన మనుష్యుడు,గాన భూషణ ప్రియుడు, బంధువులకుపకారము చేయువాడగును. రాక్షస ప్రకృతి గల మనుష్యుడు మనుష్యులపై కోపము చూపువాడు, దుష్టస్వభావము కలవాడు పాపాత్ముడగును. పిశాచ ప్రకృతి గల మనుష్యుడు చంచల మనస్తత్వము కలవాడు, మలినుడు అధికముగా తినువాడు లావు శరీరము కలవాడగును.

తిర్యక్ ప్రకృతి కలిగిన మనుష్యుడు భయపడును. ఆకలిని సహించలేనివాడు, అధికముగా తినువాడగును. ఈ విధముగా మనుష్యుల స్వభావములు చెప్పబడెను. అవి ప్రకృతి లక్షణజ్ఞుల వలన సత్యనామములతో చెప్పబడినవి. సింహము, హంస మదించిన ఏనుగు, ఎద్దు, నెమలితో సమాన గమనము గల మనుష్యుడు రాజగును. శబ్ద రహితము, మందగతి కలిగిన మనుష్యుడు ధనవంతుడగును. శీఘ్రము కప్పవలె గమనము (నడక) కలవాడు దరిద్రుడగును. **శ్రమ కలిగినపుడు వాహనము, ఆకలి కలిగినపుడు భోజనము, దాహమేసినపుడు నీరు,భయము కలిగినపుడు రక్షణ కలిగిన మనుష్యుడు భాగ్యశాలి యని మనుష్యలక్షణములు తెలిసిన పండితులు తెలిపెదరు.**

అరువది ఎనిమిదవ పురుష లక్షణాధ్యాయము సమాప్తము

69. పంచ మహాపురుష లక్షణాధ్యాయము

స్థానము దిక్కు చేష్ట కాలబలముతో కూడిన మంగళాది ఐదు గ్రహములు తమ గృహములో లేక ఉచ్చస్థానములో నుండి లగ్న చతుర్థ సప్తమ దశమస్థానములలో నున్న ఐదుగురు ప్రముఖ పురుషులుత్పన్నమగుదురు. స్వగృహము ఉచ్చలో నున్న కేంద్రములో బలవంతుడైన గురుడున్న హంస, శనియున్న శశక, కుజుడున్న రుచక, బుధుడున్న భద్ర, శుక్రుడున్న మాలవ్య యోగములగును.

సూర్యుడు బలంగా ఉన్న సత్వగుణ సంపన్నుడు, చంద్రుడు బలముగా నున్న మానసిక బలసంపన్నుడగును. సూర్య చంద్రులిద్దరు ఏరాశిభేదము (రాశి హెూర ద్రేక్కాణ నవాంశ ద్వాదశాంశ త్రింశాంశ)లో నుండిరో ఆ రాశ్యాధిపతుల ధాతువు, మహాభూతము, ప్రకృతి, కాంతి వర్ణము,సత్వము, రూపము మున్నగు లక్షణములతో పురుషు డుండును. బలవంతుడైన సూర్యుడు చంద్రుడు ఏగ్రహముల రాశి భేదములో నుండిరో ఆగ్రహముల ధాత్వాది లక్షణములతో కూడి పురుషుడుండును. లేక సూర్యచంద్రులలో ఒకరు బలవంతుడై ఏగ్రహరాశి భేదములో నుండునో ఆగ్రహ ధాతు లక్షణములతో పురుషుడుండును. లేక ఇద్దరు బలవంతులై ఏగ్రహరాశి భేదములో నుండిరో ఆరెండింటి మిశ్రమ లక్షణములు పురుషునకగును.

కుజుని వలన సత్వము, బుధుని వలన సమత్వము, గురుని వలన స్వరము, శుక్రుని వలన స్నేహము,శనివలన కాంతి కలుగును.మంగళాది గ్రహములు బలవంతులైన సత్వాదిగుణములతో, బలహీనులైన సత్వాదిగుణములు లేకుండ యుండును. సంకీర్ణ లక్షణములు గల మనుష్యుడు రాజుకాలేడు. కాని కుజాది గ్రహదశలలో సుఖమును పొందును.శత్రు నీచ ఉచ్చస్థానములలో నున్న ఫలితములలో భేదము కలుగును. ఈ భేదము వలన మనుష్యులకు సంకీర్ణతా దోషము కలుగును.

96 అంగుళముల ఎత్తు 9 అంగుళముల వ్యాయామము (రెండు భుజములు చాపిన వచ్చువెడల్పు) హంసయోగములో పుట్టిన వ్యక్తికుండును. దీనికి మూడేసి అంగుళము లు పెంచిన క్రమముగా శశ రుచక భద్ర మాలవ్య పురుషుల ఎత్తు వ్యాయామము లగును.

సాత్విక పురుషునికి దయ స్థిరత్వము ప్రాణులపైన సరళస్వభావము దైవభక్తి యుండును. రజోగుణ పురుషుడు కావ్య, కల, యజ్ఞము, స్త్రీలందు ఆసక్తి కలవాడు, అతిశూరుడగును. తమోగుణ పురుషుడు ఇతరులను మోసము చేయువాడు, మూర్ఖుడు, సోమరి, కోపస్వభావము గలవాడు, అధికముగా నిద్రించువాడగును.మిశ్రిత గుణములతో (సత్వ, రజ,సత్వ తమ, రజస్తమ, సత్వరజస్తమ) ఏడు విధములైన మనుష్యులగుదురు.

మాలవ్య పురుషుడు ఏనుగుతో సమానమైన నాసిక, సమానమైన భుజబలము

మోకాలి వరకు పొడవుగానున్న చేతులు, పృష్ఠఅంగ సంధులు కలవాడు, సమానమైన సుందర శరీరము కలవాడు, సన్నని నడుము కలవాడు,గడ్డమునుండి శిరస్సు వరకు పదమూడు అంగములున్నవాడు, గడ్డము నుండి చెవి వరకు పదిఅంగుళములున్నవాడు, వెలుగుచున్న నేత్రములు ముఖము కలవాడు, సుందరమైన కపోలములు కలవాడు, సమానముగా తెల్లగా నుండు దంతములవాడు, పలుచని పెదవి కలవాడగును. మాలవ్య పురుషుడు, మాలవ మరు కచ్ఛ సౌరాష్ట్ర లాట సింధు దేశములు పరిసర పర్వత ప్రాంతములను రక్షించువాడు, తన పరాక్రమముతో ధనమును సంపాదించువాడు మంచి మనసు కలిగిన రాజగును.

మాలవ్య పురుషుని ఆయుస్సు డెబ్బది సంవత్సరములుండును. తీర్థస్థానములో ప్రాణములను విడుచును. ఈ విధముగా మాలవ్య పురుషుని శుభ లక్షణములను తెలిపి భద్రాది పురుషుల లక్షణములను తెలిపెదను.

భద్రపురుషుడు పుష్టము(బలము) సమానము గుండ్రముగానున్న బాహువులు కలవాడు, బాహువులను చాచిన ఎంత పొడవు ఉన్న వో అంత ఎత్తు కలవాడు, కోమలము సూక్ష్మము దట్టమైన రోమములతో కూడిన కపోలములు కలవాడగును. సుందరశరీరము, చిక్కని వీర్యము, విస్తీర్ణము బలమైన వక్షస్థలము, అధిక సత్వగుణము,పులి వంటి ముఖము, స్థిరస్వభావము, శాంతిశీలము, ధర్మగుణము, కృతజ్ఞత, ఏనుగువలె గమనము, అధికశాస్త్ర విజ్ఞానము, సుందర లలాటము శంఖము, కళలజ్ఞానము, ధీరత్వము, సుందరమైన పొట్ట, కమలగర్భ సమానమైన హస్తములు, కాళ్లు, సుందరమైన నాసిక, సమానమైన భుజములతో కూడియుండును.

భద్ర పురుషుని శరీరములో నవీనజలముతో తడిసిన భూమివంటి గంధము, గంధపత్రము, కుంకుమ ఏనుగు మదముతో సమానమైన గంధముండును. శిరస్సులో నున్న ఒక్కొక్క రోమకూపములో నల్లని ఒక్కొక్క రోమముండును. గుర్రము ఏనుగు సమానముగా గుప్తమైన అంగముండును. భద్ర పురుషుని చేతిలో నాగలి, ముసలము, గద,ఖడ్గము,శంఖము,చక్రము,ఏనుగు,మొసలి కమలము,రథముతో సమానమైన రేఖలుండును.ఇతని సంపత్తిని ఇతరులు కూడ అనుభవింతురు. బంధువులను క్షమించని వాడు స్వతంత్ర మనస్తత్వము కలవాడగును.

భద్రపురుషుడు 84 అంగుళముల ఎత్తు ఒకతులము బరువు మధ్యదేశమునకు రాజుగానుండును. ఇతనికి 105 అంగుళములు వ్యాయామమున్న చక్రవర్తి యగును. భద్ర పురుషుడు తన పరాక్రమముతో సంపాదించిన భూమిని అనుభవించి ఎనుబది సంవత్సరముల వయసులో తీర్థయాత్రా స్థానములో ప్రాణములను వదలి స్వర్గమునకేగును.

కొంచెము ఉన్నత దంతములు చిన్న దంతములు, గోళ్లు కలవాడు, బలమైన

నేత్రకోశములు కలవాడు, తొందరగా నడుచువాడు, విద్యాధాతువులు వ్యాపారక్రియలలో ఆసక్తుడు, బలమైన కపోలము కలవాడు, శఠుడు, సేనాపతి, మైథునప్రియుడు, పరస్త్రీల యందాసక్తి కలవాడు, శశపురుషుడగును. 92 అంగుళముల ఎత్తు ప్రత్యేక చేష్టలు కలవాడు, వ్యవహారములో శంక కలవాడు, ఇతరుల దోషములను వెదుకువాడు, మజ్జాసారము కలవాడు, స్థిరమైన గమనము కలవాడు, ఎక్కువ లావుగా లేనివాడగును.

శశ పురుషుని మధ్యభాగము బలహీనముగా నుండును. కాళ్లు చేతులందు డాలు ఖడ్గము వీణ పంగలము మాల మృదంగము త్రిశూలముతో సమానమైన రేఖలుండును. శశ పురుషుడు మ్లేచ్ఛదేశము లేక మాండలిక రాజుగా నుండును. తుంటి ఎముకలు విరుగుట వలన బాధపడును. డెబ్బది సంవత్సరములు ఆయువులో మృత్యువు కలుగును.

ఎరుపుముఖము బలహీనమైన కపోలములు, ఎత్తైననాసిక, సువర్ణము వంటి కాంతి, గోళాకారముతో నున్న శిరస్సు, తేనెవంటి కన్నులు, ఎర్రని గోళ్లతో కూడినవాడు, మాల అంకుశము శంఖము మత్స్యయుగళము, యజ్ఞాంగము, కలశము కమల సమానమైన రేఖలు చేతులందు కాళ్లయందు కలవాడు, హంసవలె మధుర స్వరము కలవాడు, సుందరమైన కాళ్లు కలవాడు, నిర్మలమైన ఇంద్రియములు కలవాడు హంస పురుషుడగును. హంస పురుషునికి జలమన్న ప్రేమ,శుక్రసారముండును. ఇతని ఎత్తు 96 అంగుళములుండును. నేపాలము శూరసేన గాంధార గంగ యమునల మధ్య దేశములకు హంస పురుషుడు రాజగును. తొంబది వర్షములు రాజ్యము చేసి వన సమీపములో మృత్యువును పొందును.

రుచక పురుషుడు సుందరుడు కనుబొమలు కేశములతో కూడినవాడు ఎరుపు నలుపు వర్ణమువాడు, శంఖ సమానమైన కంఠమువాడు, పొడవైన ముఖమువాడు, శూరుడు, క్రూరుడు, శ్రేష్ఠుడు,మంత్రి దొంగలకు రాజు వ్యాయామము చేయువాడగును. ఇతని ముఖము పొడవునకు సమానముగా ఉదర మధ్యభాగపు వెడల్పుండును.స్వల్పకాంతి మాంస రక్తములలో సారము కలవాడు, శత్రువులను నాశము చేయువాడు, తన పరాక్రమముతో కార్యములను సాధించువాడగును.రుచక పురుషుని కాళ్లు చేతులలో ఖడ్గాంగము వీణ ఎద్దు ధనుస్సు వజ్రము శక్తి (ఆయుధము) చంద్రుడు త్రిశూలములతో సమానమైన చిహ్నములుండును. గురుబ్రాహ్మణ దేవతల భక్తుడుగానుండును. వంద అంగుళముల ఎత్తు ఒకవెయ్యి పలముల శారీరిక భారమున్న వాడగును. రుచక పురుషుడు మంత్రములు అభిచారము (మారణమోహన, వశీకరణ ఉచ్చాటన విద్వేషణము)లలో కుశలుడు సన్నని ఊరువులు మోకాలు కలవాడగును. వింధ్యాచలము సహ్యాచలము ఉజ్జయినీ రాజ్యములను పాలించి డెబ్బది సంవత్సరములలో శస్త్ర లేక అగ్ని వలన

మరణించును.

పూర్వోక్త పంచమహా పురుషులేకాక వారి అనుచరూపమైన వారు సంకీర్ణ సంజ్ఞతో వామనక,జఘన్య,కుబ్జ,మండలక,సాచియను ఐదుగురు పురుషులుందురు. వారి లక్షణములను వినుడు.

వామనక పురుషుడు సంపూర్ణ అవయములతో కూడినవాడు విరిగిన వీపుభాగము కలవాడు పెరుగని ఊరువుల మధ్యభాగము కలవాడు, సంపూర్ణముగా లేని అంగములు కలవాడు, ప్రసిద్ధులు భద్రజీవులైన రాజులమధ్యలో జీవించువాడు, ధనవంతుడు, విష్ణు భక్తుడగును.

జఘన్య పురుషుడు మాలవదేశపు రాజుకు సేవకుడగును. అర్ధచంద్రాకారము గల చెవి,సుందరమైన అష్టసంధులు శుక్రసారము పిశనుడు(చాడీలు చెప్పువాడు) పండితుడు ఎండిన శరీరపు కాంతి కలిగినవాడు, లావైన చేతివ్రేళ్లు కలవాడు యగును. క్రూరుడు ధని స్థూలబుద్ధి, ప్రసిద్ధుడు తామ్రవర్ణకాంతి కలిగినవాడు, హాస్యప్రియుడగును. అతని వక్షస్థలము కాళ్లు చేతులు ఖడ్గము శక్తి పాశము పరశువుతో(గొడ్డలి)సమానమైన రేఖలతో కూడియుండును.

కుబ్జ పురుషుడు నాభిక్రిందిభాగము సంపూర్ణముగా పైభాగము తక్కువగా వంగినదై యుండును. హంసనామక రాజుకు సేవకుడు,నాస్తికుడు ధనవంతుడు విద్వాంసుడు సూచకుడు (సూచన చేయువాడు) కృతజ్ఞుడగును. కుబ్జపురుషుడు కళలందు ప్రవీణుడు కలహప్రియుడు సేవకులతో కూడినవాడు, స్త్రీజనులను ప్రజలను ఆదరించి అకస్మాత్తుగా వదులువాడు ఉత్సాహవంతుడగును.

మండలనామక పురుషుడు రుచకరాజుకు సేవకుడు అభిచారము(మారణ మోహన, ఉచ్చాటన,వశీకరణ,విద్వేషణములు) తెలిసినవాడు, సమర్థుడు, కృత్యుడు(అభిమంత్రము ద్వారా శత్రువధ కొరకు అగ్నిలో నుండి స్త్రీ ఉత్పన్నమగును దానిని కృత్యమందురు) వేతాలుడు(మరణించిన వానిని మంత్రములతో లేపువాడు) విద్యయందాసక్తి కలవాడు, ముసలివాని వలె శరీరము కలవాడు, కఠోరమైన ఎండిన రోమములు కలవాడు, శత్రువును సంహరించుటలో సమర్థుడు, బ్రాహ్మణదేవ యజ్ఞయోగములలో ఆసక్తి కలవాడు, స్త్రీలను జయించు తెలివి కలవాడగును.

సాచిపురుషుడు అతి కురూపుడు శశనామక రాజుకు సేవకుడు ప్రజలకప్రియుడు, దానము చేయువాడు, పెద్దపెద్ద కార్యములను నిర్వహించువాడు, గుణములతో శశ సమానుడగును. మునుల మతమును గ్రహించి నేను పురుషుల లక్షణములను తెలిపితిని. దీనిని గ్రహించిన వ్యక్తి రాజులకు మిత్రుడు మిగిలిన ప్రజలకు ప్రియుడగును.

అరువది తొమ్మిదవ పంచమహా పురుష లక్షణాధ్యాయము సమాప్తము

70. స్త్రీ లక్షణాధ్యాయము

సుందరమైనపాదములు ఎత్తైన పలుచని ఎరుపురంగు కలిగినగోళ్లు సమానము పుష్టిగా సుందరముగా నున్న పిరుదులు, కలిసియున్న వేళ్లు కలిగినది కమలము వలె కాంతి కలిగినది, పృధ్వీపతి కోరుకొను కన్యను మనుష్యుడు వివాహము చేసుకొనవలెను. చెమట లేని కోమలమైన పాదములలో మత్స్యము,కమలము,యవలు, వజ్రము నాగలి ఖడ్గసమానమైన రేఖలు కలిగినది. రోమహీనమైనది నాడులు కనపడనిది, సుందరము గుండ్రమైన తొడలు కలది స్థూలమైన సంధులు కలది,బలమైన ఏనుగు తొండముతో సమానమైన రోమరహితమైన తొడలు కలది, రావి ఆకువలె సమానవిస్తీర్ణము కలిగిన భగము కలది, తాబేలు పృష్ఠభాగము వలెనున్న కటి ప్రదేశము కలది, గూఢమైన (దాగిన)మణికలిగిన కన్య అధిక లక్ష్మీప్రదమగును.

విస్తీర్ణమైన బలమైన ఒడ్డాణముతో కూడిన పిరుదులు కలది, గంభీరము విస్తీర్ణము దక్షిణావర్తమైన నాభి కలదైన స్త్రీ శుభమును కలిగించును.మధ్యభాగము మూడు వళు లతో కూడినదై రోమహితమైనది, గోళాకారము పుష్టము సమానము కఠోరమైన స్తనములు కలది, రోమరహితము కోమలమైన వక్షస్థలము కలది, శంఖ సమానముగా మూడు రేఖలతో కూడిన కంఠము కలదైన స్త్రీ ధనమును, అధరము కుందపుష్పముల వంటి దంతములు కలిగిన స్త్రీ పతిసుఖము అధికధనము నిచ్చును.సౌభాగ్యవతియైన స్త్రీ కపటరహితము దయాశీలము కోకిల హంసలతో సమానమైన ధ్వని కలిగియుండును. నాసిక సమానమైన పుటములతో సుందముగా నుండును. నీలికమలముల వంటి నేత్రములు కలిగిన స్త్రీ దృష్టి శుభమును కలిగించును.

కోమలము రెండు కలువని అధికపొడవు లేని కనుబొమలు బాలచంద్రునివలె సుందరమైన ముఖము కలిగిన స్త్రీ శుభమునిచ్చును. అర్ధచంద్ర సమానముగా రోమములు లేకుండ సమానమైన స్త్రీ లలాటము శుభమునిచ్చును.అల్పమాంసయుతము కోమలము సమానముగానున్న రెండు చెవులు శుభమునిచ్చును. సుకుమారము అతికృష్ణము (నలుపు)) కోమలము కుటిలమై(వంకర తిరిగిన)ఒక రోమకూపములో ఒకరోమమున్న సుఖము నిచ్చును.సమానమైన శిరస్సు శుభమునిచ్చును.

కాళ్లు చేతులలో భృంగారము,(జాడి)ఆసనము,గుర్రము, ఏనుగు, రథము, మారేడు వృక్షము, యజ్ఞస్తంభము, శరము, మాల, కుండలము, అంకుశము, యవలు, పర్వతము, ధ్వజము, తోరణము, మత్స్యము, స్వస్తికము, యజ్ఞవేది, పంఖము, శంఖము, ఛత్రము, కమలముతో సమానమైన రేఖలున్న స్త్రీ రాణియగును. రాణి నూతన కమల గర్భసమానముగా పలుచని పొడవైన కణుపులు కలిగిన వ్రేళ్లుతో కూడి నిగూఢమైన మణిబంధము కలిగియుండును. పైకి క్రిందికి లేని రేఖలతో కూడిన కరతలము కలిగిన

స్త్రీ సౌభాగ్యవతి పుత్రవతి సుఖవతి సంభోగవతి యగును.స్త్రీ లేక పురుషుని మణికట్టునుండి మధ్యవ్రేలు వరకున్న రేఖ, పాదములో పైవరకున్న రేఖ రాజ్యసుఖమును కలిగించును. కనిష్టిక (చిటికెనవ్రేలు) మూలనుండి ప్రదేశిని(చూపుడువ్రేలు) మధ్యమవ్రేలు మధ్యలోనికి వెళ్ళినరేఖ పరమాయువును కలిగించును. రేఖచిన్నదైన అల్పాయువు కలుగును. స్త్రీల బొటనవ్రేలి మూలలో సంతాన రేఖలుండును.వాటిలో పెద్దరేఖలు పుత్రరేఖలుగా భావించవలెను. చిన్నరేఖలు కన్యలుగా భావించవలెను. రేఖలు స్వచ్ఛముగా పొడవుగానున్న దీర్ఘాయువు కలుగును. భిన్నభిన్నముగా చిన్నచిన్నరేఖలున్న అల్పాయువు కలుగును.

ఈ విధముగా స్త్రీల శుభ లక్షణములు తెలుపబడినవి. వీటికి వ్యతిరేకముగా నున్న అశుభలక్షణములు కలుగును. ఇప్పుడు నేను అశుభ లక్షణములను తెలిపెదను.

భూమిని స్పర్శించని కనిష్ఠిక అనామికలు పాదమునకున్న బొటనవ్రేలి కన్న పొడవైన తర్జని ఉన్న స్త్రీవ్యభిచారిణి అతిపాపిని యగును.ఎత్తైన పిండికలి (తొడల పశ్చిమభాగములు పిక్కలందు మాంసము) నాడులతో కూడిన, ఎండిన రోమములతో కూడిన ఎక్కువ లావు కలిగిన వామావర్త రోమములతో కూడిన తొడలు క్రిందికి వంగిన చిన్న భగము, కుంభాకారముగా నున్న పొట్ట కలిగిన స్త్రీలు దు:ఖమును పొందుదురు. చిన్న మెడ ఉన్న ధనహీనము,పెద్దమెడ ఉన్న కులక్షయము, లావుగా మెడున్న స్త్రీ క్రూర స్వభావము కలిగి యుండును. మెల్లకన్ను ఉన్న స్త్రీ, పింగళ(గోరోజనము)వర్ణము, చంచల మనస్తత్వము గల స్త్రీ దుశ్శీలు(చెడుప్రవర్తన)రాలగును. నవ్వినపుడు బుగ్గలపై చొట్టపడిన స్త్రీ వ్యభిచారిణి యగును.

లలాటము పొడవుగా నున్న స్త్రీ మరిదిని, పొట్ట పొడవుగా నున్న స్త్రీ మావను, పిరుదులు పొడవుగానున్న స్త్రీ భర్తను చంపును. పై పెదవిపై అధిక రోమములున్న స్త్రీ భర్తకు శుభము కలిగించదు. స్తనములు చెవులు రోమయుక్తము మలినము అభద్రమై చిన్నవి లేక పెద్దవిగా నున్న స్త్రీ కష్టములను పొందును. లావైన బయటికి వచ్చిన వంకరగా నున్న నల్లని మాంసముతో కూడియున్న దంతములు కలిగిన స్త్రీ దొంగయగును.

చేతిలో మాంసము తిను పక్షి,తోడేలు,కాకి, గద్ద సర్పము గుడ్లగూబతో సమానమైన రేఖలున్న లేక ఎండిన నాడులతో కూడిన,చిన్న పెద్దహస్తమున్న సుఖ ధనహీనురాలగును.

పైపెదవి ఎత్తుగా నున్న, కేశముల చివరిభాగము ఎండియున్న స్త్రీ ఇతరులతో జగడమునకు దిగును.అధికముగా కురూప స్త్రీలందు దోషము సుందరమైన స్త్రీలందు సుగుణములుండును.

శుభాశుభ ఫలములను తెలిసికొనుటకు శరీరమును పదిభాగములను చేయుదురు. చీలమండ నుండి పాదము మెదటిభాగము, మోకాలితో కూడిన తొడలు రెండవ భాగము, అంగము ఊరువు అండకోశము మూడవభాగము, నాభి నడుము,నాల్గవభాగము

ఉదరము ఐదవభాగము, స్తనసహిత హృదయము ఆరవభాగము, భుజము భుజసంధులు ఏడవభాగము, పెదవులు కంఠము ఎనిమిదవభాగము, కనుబొమలతో కూడిన నేత్రము తొమ్మిదవభాగము,లలాటముతోకూడిన శిరస్సు పదవభాగము. ఈ విధముగా పరమాయువు (120 సంవత్సరములు) కూడ పదిభాగములు చేసిరి. అంగము ప్రథమభాగము శుభ లక్షణములతోనున్న ఆయువులో ప్రథమభాగము సుఖముగా నుండును. అశుభ లక్షణములతో కూడియున్న ఆయువులో ప్రథమభాగము అశుభఫలము నిచ్చును. ఇదేవిధముగా ద్వితీయాదిఅంగముల శుభాశుభ లక్షణములను గ్రహించి ఆయువులో ద్వితీయాది భాగముల శుభాశుభ లక్షణములను తెలుపవలెను.

డెబ్బదవ స్త్రీ లక్షణాధ్యాయము సమాప్తము

71. వస్త్ర ఛేదన లక్షణాధ్యాయము

అశ్వినీ నక్షత్రములో నూతన వస్త్రమును ధరించిన అధిక వస్త్రలాభము, భరణిలో ధరించిన వస్త్రహాని,కృత్తికలో అగ్నివలన వస్త్ర దహనము,రోహిణిలో ధనప్రాప్తి, మృగశిరలో ఎలుకల వలన వస్త్రభయము,ఆర్ద్రలో మృత్యువు,పునర్వసులో శుభప్రాప్తి,పుష్యమిలో ధన లాభము,ఆశ్లేషలో వస్త్రనాశము మఘలో మృత్యువు,పుబ్బలో రాజభయము,ఉత్తరలో ధనలాభము,హస్తలో కార్యసిద్ధి,చిత్తలో శుభప్రాప్తి,స్వాతిలో భోజనప్రాప్తి,విశాఖలో జనులకు ప్రియము, అనూరాధలో మిత్రసమాగమము, జ్యేష్ఠలో వస్త్రనాశము, మూలలో మునిగే భయము,పూర్వాషాఢలో రోగము,ఉత్తరాషాఢలో మృష్టాన్న లాభము, శ్రవణంలో నేత్ర రోగము,ధనిష్ఠలో అన్నలాభము, శతభిషంలో అధికభయము, పూర్వాభాద్రలో జల భయము, ఉత్తరాభాద్రలో పుత్రలాభము రేవతి నక్షత్రములో నూతన వస్త్రములు ధరించిన రత్నలాభము కలుగును.

వివాహములో రాజసన్మానములో బ్రాహ్మణుల ఆజ్ఞ దొరికినపుడు స్వనక్షత్రము లో వస్త్రములు ధరించిన శుభము కలుగును. తొమ్మిదిభాగముల వస్త్రములో నాలుగు కోణములలో దేవతలు, వస్త్రఅగ్రభాగములలో మనుష్యులు మధ్యలో నున్న మూడుభాగములలో రాక్షసుల కల్పన చేయవలెను. ఇదేవిధముగా ఆసనము, శయ్య, పాదుకలతో కూడ విచారణ చేయవలెను.

దేవతలు	రాక్షసులు	దేవతలు
నరులు	రాక్షసులు	నరులు
దేవతలు	రాక్షసులు	దేవతలు

నూతన వస్త్రముపై రంగు,పేడ,బురదపడిన కాలిన చిరిగిన సంపూర్ణమైన అశు భము లేక శుభము కలుగును. వస్త్రము మధ్యలోనైన కొంచెము పాతవస్త్రమైన చాల కొంచెము అశుభము లేక శుభఫలమును గ్రహించవలెను. శరీరముపై కప్పుకొనిన వస్త్రమైన

అధిక అశుభము లేక శుభఫలము కలుగును. రాక్షస భాగములో రంగుడిన రోగము లేక మృత్యువు,మనుష్యభాగములో పడిన పుత్రజన్మము తేజప్రాప్తి(గౌరవము పొందుట) దేవతలభాగములోనైన భోగము పొందటము, అన్నిభాగములలో రంగులు మున్నగునవి పడిన అశుభఫలము కలుగును. ఇది మునుల వాక్యము. దేవతలభాగములో గ్రద్ద కప్ప గుడ్లగూబ పావురము కాకి మాంసాహరపు పక్షి,నక్క గాడిద ఒంటె సర్పసమానమైన ఆకారములో వస్త్రము చిరిగిన మృత్యుభయము కలుగును. రాక్షసులభాగములో ఛత్రము ధ్వజము స్వస్తికము వర్ధమానము బిల్వవృక్షము కలశము కమలము తోరణాదులతో సమానమైన రంధ్రము పడిన చాలాతొందరగా లక్షలాభము కలుగును.

చెడు నక్షత్రములలో కూడ బ్రాహ్మణుల ఆజ్ఞతో, రాజు ఇచ్చిన వస్త్రమును లేక వివాహ సమయములో ప్రాప్తమైన (వచ్చిన)వస్త్రమును ధరించిన శుభఫలమునిచ్చును.

డెబ్బది ఒకటవ వస్త్రఛేదనాధ్యాయము సమాప్తము

72. చామర లక్షణాధ్యాయము

దేవతలు వెంట్రుకల కొరకు హిమాలయ లోయలలో చమరీ మృగములనుత్పత్తి చేసెను. వాటి తోకకున్న వెంట్రుకలు పసుపు నలుపు తెలుపు రంగులలో నుండును. స్నిగ్ధము కోమలము అధికము నిర్మలము పరస్పరము కలువక మధ్యలో చిన్న ఎముక కలిగి యుండుట – ఈలక్షణములు వెంట్రుకలకు సంపత్తిగానుండును. అటువంటి లక్షణములు కలిగిన వెంట్రుకలు శుభమునిచ్చును. విరిగిన తెగిన చిన్నవైన ఊడివచ్చిన చామరము శుభమునీయదు.

చామర దండము ఒకటిన్నర హస్తములు, ఒకహస్తము లేక అరత్ని కొలతలో చేయవలెను. బంగారము వెండి రత్నములతో శ్రేష్ఠమైన కర్రతో చేసిన దండము రాజులకు హితమును కలిగించును. యష్టి(చేతికర్ర)ఛత్రము అంకుశము వితానము (పందిరి) కుంతము (బళ్ళెము)ఛామరదండముల వర్ణములు బ్రాహ్మణాది వర్ణములకు క్రమముగా పసుపు, ఎరుపు, తేనెరంగు, నల్లనిరంగులతో నుండవలెను. ఈ విధముగా యష్టి ఆదులు శుభమును కలిగించును.

పూర్వోక్త దండలములకు రెండు పర్వముల నుండి రెండేసి వృద్ధి చేసి పన్నెండు పర్వముల వరకు మాతృక్షయాది ఫలమును తెలిసికొనవలెను. రెండు పర్వముల దండము మాతృక్షయము,నాలుగు పర్వములున్న భూక్షయము,ఆరుపర్వములున్న ధనక్షయము, ఎనిమిది పర్వములున్న కులక్షయము, పదిపర్వములున్న రోగము,పన్నెండు పర్వములున్న మృత్యువు కలిగించును. దండము మూడు పర్వములున్న స్వామికి విజయము, ఐదుపర్వము లున్న శత్రునాశము, ఏడుపర్వములున్న అధికలాభము, తొమ్మిదిపర్వములున్న భూలాభము, పదకొండు పర్వములున్న పశువృద్ధి,పదమూడుపర్వములున్న అభీష్టవస్తు లాభము కలుగును.

డెబ్బది రెండవ చామర లక్షణాధ్యాయము సమాప్తము

73. ఛత్ర లక్షణాధ్యాయము

హంస పక్షి(కోడి) మయూరము (నెమలి)సారసము వీటి రెక్కలతో నిర్మించిన నవీనము విశిష్టమైన శ్వేతవస్త్రముతో కప్పబడిన, వ్రేలాడుతున్న ముత్యముల మాలలతో కూడిన స్పటిక మణులతో తయారు చేయబడిన పిడి కలిగిన ఛత్రమును నిర్మించవలెను. దానిలో ఆరుహస్తముల పొడవుతో బంగారముతో కప్పబడిన తొమ్మిది లేక ఏడు పర్వములు కలిగిన కాష్ఠమును దూర్చవలెను. మూడుహస్తములు ఛత్రవ్యాసముండవలెను. నాలుగు వైపుల నుండి కప్పబడి రత్నములతో నలంకరింపబడి యుండవలెను. ఈ విధముగా రాజుకు శ్రేష్ఠమైన ఛత్రము కల్యాణకారి విజయమును కలిగించునదగును.

యువరాజు,రాణి,సేనాపతి దండనాయకుల ఛత్రదండము నాలుగున్నర హస్తములు వ్యాసము రెండున్నర హస్తములుండును. యువరాజును వదలి మిగిలిన రాజపుత్రులకు మయూర హంసపక్షులతో తయారుచేయబడిన ప్రాసాదపట్టిలతో సుందర మైన శిరము కలిగి వ్రేలాడుతున్న రత్నములతో కూడిన ఛత్రమును ధూపాదులతో రక్షణ కొరకు నిర్మించవలెను.ఇతరులకు ధూపనివృత్తి కొరకు చతుర్భుజాకారముగా నున్న ఛత్రమును బ్రాహ్మణులకు గోళాకార ఛత్రమును నిర్మించవలెను.

డెబ్బది మూడవ ఛత్ర లక్షణాధ్యాయము సమాప్తము

74. స్త్రీ పశంసాధ్యాయము

సంపూర్ణ పృథివిని జయించుటకు రాజుకు తన రాజధాని సారభూతమైన స్థానమగును. రాజధానిలో రాజభవనము, రాజభవనములో తానుండు స్థానము, తానుండు స్థానములో శయ్య, శయ్యపై రత్నములతో నలంకరింపబడిన స్త్రీ యున్న సుఖము సారవంత మగును.మిగిలిన వస్తువులు సారహీనములు. స్త్రీ రత్నములకు వెలుగు నిచ్చును కాని రత్నములు స్త్రీని అలంకరింపవు. రత్నములు లేని స్త్రీకూడ మనసును దోచుకొనును. స్త్రీ సంగము లేకుండ రత్నములు మనసును జయించలేవు.

సుఖము భయము సంతోషము మున్నగు వికారములను దాచుటకు శత్రుసేనలను జయించుటకు ప్రయత్నించునపుడు, కృతాకృత వ్యాపార రూపకర్మలలో వ్యాకులతను పొందునపుడు మంత్రులు మున్నగువారు సమర్థించు న్యాయసూత్రములను సేవించునపుడు, పుత్రాదుల వలన శంకను పొందుతున్నపుడు, దు:ఖ సముద్రములోనున్న రాజులకు స్త్రీ ఆలింగనము సుఖమును కలిగించును.

ప్రపంచములో బ్రహ్మ స్త్రీకన్న గొప్పదైన వేరొక రత్నమును నిర్మించలేదు. ఆమెను వాసన చూపిన, స్పర్శించిన స్మరించిన ఆనందము కలుగును.స్త్రీ కొరకు ధర్మార్థములు సేవచేయును. స్త్రీలవలన పుత్ర సుఖము విషయ సుఖములు కలుగును.స్త్రీగృహములో

లక్ష్మీ సమానముగా నుండును. అందువలన మానసమ్మానముల ద్వారా స్త్రీని ఎల్లపుడు ఆదరించవలెను.

కొందరు వైరాగ్యభావముతో స్త్రీగుణములను విడిచి దోషముల వర్ణన చేయుదురు. వారు దుర్జనులని నా అభిప్రాయము అందువలన వారి వచనము ప్రామాణికముకాదు. పురుషులు చేయని దోషమును స్త్రీలు చేయలేరు. ముందు పురుషులు అన్ని దోషములు చేసిన తర్వాత స్త్రీలు నేర్చుకొనిరి. పురుషులు తమదుష్టస్వభావముతో స్త్రీలను జయించిరి. పురుషులకన్న స్త్రీలకధిక సుఖములున్నవి. ఈ విషయమును మునులు కూడ తెల్పిరి.

చంద్రుడు పవిత్రతను, గంధర్వులు శిక్షిత వచనమును, అగ్ని అన్నిపదార్థములు తినుటను స్త్రీలకిచ్చెను. అందువలన స్త్రీలు బంగారముతో సమానము. బ్రాహ్మణులు కాళ్లతో, గోవు పృష్ఠభాగముతో,మేక గుర్రము ముఖముతో పవిత్రులగుదురు. కాని స్త్రీఅన్ని అంగములతో పవిత్రురాలగును. స్త్రీలతో సమానమైన వస్తువు వేరొకటిలేదు.ఎప్పుడు వారు దోషము పొందరు.అందువలన ప్రతినెల వారిరజము వారి పాపములను నశింపజేయును.

కులస్త్రీని అనాదరము చేసిన గృహమును శపించును. ఆగృహము చేతబడి చేసిన దానివలె నష్టమును పొందును. మనుష్యుల ఉత్పత్తి స్త్రీ వలన కలుగును. భార్యద్వారా పుత్రరూపములో ఉత్పత్తి జరుగును. అందువలన భార్య కావచ్చు లేక తల్లికావచ్చును. ఓకృతఘ్నుడా! వాకిద్దరిని నిందించిన నీకు శుభమెట్లు కలుగును. స్త్రీ పురుషులిద్దరి వ్యుత్క్రమ (పరస్త్రీ గమనము పురుషునికి, పరపురుష గమనము స్త్రీకి) దోషము సమానముగా నుండునని ధర్మశాస్త్రము తెలిపినది. కాని పురుషుడు ఆదోషమును చూడడు. అందువలన పురుషుని కన్న స్త్రీ శ్రేష్ఠమైనది.తన స్త్రీని వదిలి పరస్త్రీ గమనము చేయు పురుషుడు బయటకు తీసిన రోమములు గల గాడిద చర్మమును శరీరముపై ధరించి ఆరుమాసములు **'బిక్షాందేహి'** అని యాచించిన శుద్ధుడగును.

వందవత్సరములు గడిచిన తర్వాత కూడ పురుషునికి విషయ వాంచతీరదు. శారీరక శక్తి నశించిన తర్వాత పురుషుడు దానినుండి నివారణపొందును. స్త్రీ ధైర్యముతో నివృత్తిని పొందును. పవిత్రమైన స్త్రీలను నిందించుట దుర్జనుడు ఎదుటవానిని దుష్టుడని, దొంగ ఎదుటవాడిని దొంగయని పిలిచినట్లుండును. కామాతురుడైన మనుష్యుడు స్త్రీలతో ఏకాంతములో మధురవచనములను పలుకును. కాని తర్వాత ఆప్రేమ స్త్రీలపై యుండదు. కాని స్త్రీ మరణించిన పతిని ఆలింగనము చేసుకొని అగ్నిలో ప్రవేశించును.

ఉత్తమస్త్రీతో సంగమము చేసిన పురుషుడు దరిద్రుడైనప్పటికి రాజుతో సమానుడగును. రాజ్యమునకు సారము,భోజనము స్త్రీ ఈ రెండు వస్తువులగును.మిగిలిన ధనాదులు కోరిక రూపమైన అగ్నిలో మండు కాష్ఠముల వంటివి. మందగమనము

సుందరము కోమలము మృదువైన శబ్దములను చేయుచు ఎత్తైన స్తనములతో కూడిన యౌవనవతియైన స్త్రీని ఆలింగనము చేసుకొనినపుడు కలుగు సుఖము బ్రహ్మలోకములో కూడ ప్రాప్తించదు. ఇది నామతము.

దేవతలు మునులు సిద్ధులు చారణుల (నటనర్తక గీత, వాద్యజ్ఞులు) ద్వారా పూజింపబడటము పూజసేవలు ఉపాసనలు చేయుటము కాక బ్రహ్మలోకములో వేరే సుఖమేమున్నది. దానికి మించిన సుఖము స్త్రీఅంగము వలన ప్రాప్తించును. బ్రహ్మ మొదలుకొని కీట(పురుగు) పర్యంతము సమస్త ప్రపంచము స్త్రీ పురుషుల సంబంధముతో బంధింపబడినది. దీనిలో ఏమి సిగ్గు ఉన్నది? జగత్పిత మహాదేవుడు యువతీరూప తిలోత్తమను దర్శించు లోభముతో చతుర్ముఖుడైనాడు.

డెబ్బది నాల్గవ స్త్రీప్రశంసాధ్యాయము సమాప్తము

75. సౌభాగ్య లక్షణాధ్యాయము

సౌభాగ్యవంతుడైన పురుషునికి కామదేవ సంబంధిత సుఖము శ్రేష్ఠమైనది. స్త్రీకి మనోవియోగ కారణముగా దుర్భగ పురుషుని రతి సంబంధ సుఖము ఆభాస మాత్రముగా నగును. ఎందువలనగా స్త్రీ రతి సమయములో దూరముననున్న ఏపురుషుని ధ్యానించునో ఆ పురుషునితో సమానమైన గర్భమును ధరించును.

ఏవృక్షపు బీజమును నాటెదమో అదే వృక్షముత్పన్నమగును. ఇతర వృక్షము పెరగదు. అదే విధముగా ఆధారభూతమైన స్త్రీలో పుత్రరూపముతో ఆత్మయే ఉత్పన్నమగును. కేవలక్షేత్ర యోగము వలన కొంత విశేషము కలుగును. క్షేత్రభేదముతో వృక్షములలో సాధారణ భేదము కలుగును. అదే విధముగా స్త్రీలలో కలుగునని తెలిసికొనవలెను.

మనసుతో పాటు ఆత్మ, ఇంద్రయములతో మనస్సు, విషయముననుసరించి ఇంద్రియములు చలించును. ఇక్కడ ఆత్మ యొక్క చలనక్రమమును సంబంధమును తెలిపెను. మనసుకు అగమ్య (కనిపించని)స్థానమేదియులేదు. అందువలన ఎక్కడకు మనసు వెళ్లునో అక్కడకు ఆత్మకూడ వెళ్లును. అతి సూక్ష్మమైన జీవాత్మ మధ్యలో పరమాత్మ స్థితుడగును. జీవుడు తన స్థిరచిత్తము నిరంతరము ఎవరిని చింతన చేయునో వారిలో తన్మయత్వము పొందును. అందువలన స్త్రీకూడ నిరంతరము స్మరణ చేయుట వలన సౌభాగ్య పురుషుని పొందును.

స్త్రీ తనమనసులో తలచిన కార్యములు చేయుట సౌభాగ్యమునకు కారణమగును. దానికి వ్యతిరేకముగా చేసిన విద్వేషము కలుగును. విస్మయము కలిగించు మంత్రము ఔషధములతో స్త్రీని వశము చేసికొనిన అనేక దోషములు కలుగును. అది మంచిది కాదు. గర్వము విడిచిన మనుష్యుడు అందరికి ప్రియుడగును. గర్విష్ఠుడైన మనిషి

దౌర్భాగ్యమును పొందును. అభిమానవంతుడైన మనిషి అతికష్టముతో కార్యమును సఫలము చేయును. మధుర వచనములను పలుకుతు తన కార్యమును తేలికగా నెరవేర్చును.

అందరికి ప్రియమైన వానిగా నుండవలెనన్న మానవుడు పరోక్షముగా జనులందరిని ప్రశంస చేయవలెను. ఇతరులను నిందించు వ్యక్తి అకారణముగా కలంకమును పొందును. అకారణముగా నలుగురిలో దోషిగా నిలబడును. ఇతరులకు ఉపకారము చేయు వ్యక్తికి జనులందరు ఉపకారము చేయుదురు. కష్టకాలములో శత్రువులకుపకారము చేసిన కీర్తికలుగును. అల్పపురుషునికి ఆ ఫలము లభించదు. గడ్డితో కప్పబడిన అగ్నివలె లోపలదాగిన గుణము వృద్ధిని పొందును. ఇతరుల గుణములను నాశనము చేయు మనుష్యుడు నలుగురిలో దుర్జనుడుగా పిలువబడును. గుణములను నాశనము చేసినను నాశనమును పొందవు.

డెబ్బది ఐదవ సౌభాగ్య కరణాధ్యాయము సమాప్తము

76. కాందర్పికాధ్యాయము

గర్భధారణ సమయములో రక్తమధికమైన కన్య, శుక్రమధికమైన పుత్రుడు రెండు సమానమైన నపుంసకుడు కలుగును. అందువలన వీర్యము వృద్ధిపొందుటకు రసాయనమును సేవించవలెను. ప్రాసాదపుష్ఠము,చంద్రుని కిరణము, నీలోత్పలము, మదాలస ప్రియ,వీణ, కామదేవుని కథ, ఏకాంతము ఇవన్ని కామదేవుని బంధించుటకు త్రాడుల వంటివి. బంగారము తేనె పాదరసము లోహచూర్ణము కరక్కాయ శిలాజిత్తు నెయ్యి సమభాగములుగా తీసికొని చూర్ణముచేసి తేనె లేక నేతితో కలిపి 21 రోజులు తినిన ఎనభై వర్షముల వృద్ధుడు యువకునివలె స్త్రీతో సంభోగించును.

దూలగొండి వ్రేళ్లను పాలలోవేసి కషాయముగా చేసి త్రాగిన మనిషి స్త్రీ ప్రసంగములో బలహీనుడుకాడు. పాలనుండి తీసిన నెయ్యిలో మినుముల పిండి కలిపి ఆరు గ్రాసములు తిని పాలుత్రాగిన స్త్రీ సంగమములో పురుషుడు బలహీనుడుకాడు. ఎక్కువ స్త్రీలున్న పురుషుడు విదారికందపు చూర్ణములో విదారి కందరసమును ఎక్కువ మార్లు కలిపి ఎండబెట్టవలెను. ఆచూర్ణమును తిని మరగకాచిన పాలను మిశ్రిని కలిపి త్రాగవలెను.

ఉసిరికాయ చూర్ణమును ఉసిరిరసములో పలుమార్లు కలిపి ఎండబెట్టవలెను. దానిలో తేనె మిశ్రి కలిపి నాకవలెను. తర్వాత తనశక్తి ననుసరించి పాలుత్రాగిన అనేకమంది స్త్రీలతో సంభోగము చేయవచ్చును. మేక అండమును నూరి పాలలో వేసి కషాయము చేయవలెను. తర్వాత నువ్వులను నూరి పాలలో పోసి ఎండబెట్టవలెను. ఆనువ్వులను తిని తర్వాత పాలను త్రాగిన అతనిని తేజోవంతురాలైన స్త్రీ కూడ ఏమి చేయలేదు.

రాత్రులందు నేతిలో మినపపిండితో పాటు షష్టిక(ఒకరకపు ధాన్యము) బియ్యపు అన్నమును తిని పాలు త్రాగినవాడు రాత్రులందు కామదేవుని చేరును. నువ్వులు అశ్వగంధము దూలగుంట వ్రేళ్లు విదారికందము వీటన్నింటిని సమానముగా తీసుకొని చూర్ణము చేయవలెను.షష్టిక బియ్యపుపిండిని దానిలో కలుపవలెను. దానిని మేకపాలలో కలిపి మేకనెయ్యిలో వండవలెను. అది తినిన శుక్రవృద్ధి కలుగును.

పల్లేరుకాయ చూర్ణము లేక విదారికందము చూర్ణమును తిని పాలనుత్రాగిన స్త్రీసంగములో బలహీనుడుకాడు. తగిన విధముగా ఉడికిన తర్వాత ఆచూర్ణమును తినవలెను.తక్కువమంటలో పూర్తిగా ఉడకనట్లైన ముందుగా చెప్పబోవు చూర్ణమును సేవించ వలెను.వాము ఉప్పు కరక్కాయ శొంఠి రావి వీటన్నింటిని సమభాగములుగా తీసుకొని చూర్ణము చేయవలెను.ఆచూర్ణమును మద్యము మజ్జిగ కదుగునీరు లేక వేడినీళ్ళతో సేవించిన జఠరాగ్ని వృద్ధిపొందును.

ఎక్కువగా వగరు, ఉప్పు, చేదు, కారము కలిగిన భోజనము చేయు యువకుడు కూడ వీర్యబలములు లేనివాడై వృద్ధునివలె స్త్రీసంగమమునకు పనికిరాడు.

డెబ్బది ఆరవ కాందర్పికాధ్యాయము సమాప్తము

77. గంధయుక్తిర్నామాధ్యాయము

తెల్లని వెంట్రుకలున్న పురుషుని మాల సుగంధద్రవ్యములు దూపము వస్త్రము భూషణాదులు శోభను కలిగించవు. అందువలన వెంట్రుకలను నలుపు చేసికొనుటకు ప్రయత్నము చేయవలెను. ద్రాక్షరసములో కోద్రవపు బియ్యమును లోహపాత్రలో వేసి వండవలెను.దానిలో లోహ చూర్ణమును కలిపి బాగుగా నూరవలెను. తలవెంట్రుకలకు ద్రాక్షరసమును పట్టించి దానిపై లోహచూర్ణముతో కూడిన బియ్యపు పిండి లేపనము వ్రాయవలెను. తర్వాత కరక్కాయ ఆకులతో తలను కప్పిరెండు ప్రహరల కాలము వరకు ఉంచవలెను. తలకు స్నానము చేసి దానిపై ఉసిరికాయల లేపనము రాసి కరక్కాయ ఆకులను కప్పి ఎండువరకు ఉంచి మధ్యాహ్న సమయములో నీటిలో కడిగిన కేశములు నల్లగా తయారగును.

కేశములు నల్లగానైన తర్వాత స్నానము సుగంధతైలములతో చేయవలెను. లోహము ఆమ్లగంధములను దూరము చేయవలెను.మనోహరమైన సుగంధ ద్రవ్యములు ధూపములతో రాజు పరిశుభ్రముగా తయారుచేసికొని రాజ్యసుఖమును పొందవలెను. దాల్చిని,కుష్ఠము (పులుపు) రేణునలిక స్పృక్క (ప్రసిద్ధలత) చోలరసము, తగరము, నాగకేశరము, గంధపత్రము వీటిని సమభాగములో తీసికొని రుబ్బి తలకురాసి చేసిన స్నానము యోగ్యమైన తలస్నానమగును.

మంజిష్ఠ (వృక్షవిశేషము) వ్యాఘ్రనఖము (పులిగోరు) ముత్యము కుష్ఠము రసాదులను సమపాళ్లలో తీసుకొని చూర్ణము చేయవలెను. తర్వాత ఆచూర్ణమును నువ్వులనూనెలో కలిపి వేడిచేసిన, ఆనూనె చంపాపుష్ప సుగంధము వలెనుండును. గంధపత్రము, తురుష్కము బాలకము తగరము వీటిని సమాన రూపములో కలిపిన కామదేవుని కూడ ప్రేరేపించు సుగంధము తయారగును. దీనిలో గంధద్రవ్య విశేషమును కలిపి దానిలో గుగ్గులము ఇంగువను కలిపి పొగ వేయవలెను. ఈ విధముగా చేసిన వకుళపుష్పమువలె గంధము వచ్చును. దానిలో కుష్ఠము నీలికమలము చందనమును కలిపిన చంపాపుష్పమువలె సువాసన కలుగును. జాజికాయ దాల్చిని ధనియాలు కలిపిన అతిముక్తక పుష్పము వంటి వాసన కలిగిన సుగంధద్రవ్యము తయారగును.

సోంపు, కుందరకము(దేవదారు వృక్షపు జిగురు) నాల్గవవంతు నఖము(శంఖము నుండి ఉత్పన్నమగు పొర) సిహ్లకము ఎనిమిదవభాగము తెల్లచందనము ప్రియంగువు నాల్గవవంతు వీటన్నింటిని కలిపి ద్రవ్యమును తయారుచేయవలెను. వాటిపై గుడనఖముల ధూపము వేయవలెను. గుగ్గులము, బాలకము, లక్క,తుంగముస్తలు, నఖములను సమాన భాగములో కలిపి ధూపమువేయవలెను. మాంసి,బాలకము,తురుష్కము, నఖచందనము లను సమానభాగములో తీసుకొని ధూపము వేయవలెను. కరక్కాయ, శంఖము, నఖము, ద్రవ, అంబుబాలకము, గుడము (బెల్లము) ఉత్పలము, శైలకము, ముస్తము ఈ వస్తువులను ఒకపాదము నుండి తొమ్మిది పాదముల వరకు తీసుకొనవలెను. కరక్కాయ ఒకపాదము, శంఖము రెండు పాదములు, నఖము మూడుపాదములు, ద్రవ్యము నాలుగుపాదములు, అంబు బాలకము ఐదుపాదములు, గుడము ఆరుపాదములు, ఉత్పలము ఏడు పాదములు, శైలకము ఎమినిది పాదములు, ముస్తము తొమ్మిదిపాదములు తీసుకొనిన ఒకధూపమగును. వీటిలో గుడము ఉత్పలము శైలకము, ముస్తములను ఒకపాదమునుండి నాలుగుపాదముల వరకు తీసుకొనిన రెండవ విధమైన ధూపము తయారగును. శైలకము ముస్తములను ఒకటి రెండు పాదములు తీసుకొనిన మూడవ విధమైన ధూపము తయారగును. కరక్కాయ శంఖములను కలిపిన నాల్గవ విధమైన ధూపము తయారగును. దీనిలో నఖమును మూడు పాదములు కలిపిన ఐదవ ధూపము తయారగును. ఈ విధముగా అనేక విధములైన ధూపములు తయారగును.

శర్కర, శైలేయము, తుంగ గడ్డలు, ఇవి నాలుగుభాగములు శ్రీవాసకము సర్జరసము రెండుభాగములు నఖము గుగ్గులము రెండు భాగములు వీటిని కలిపి నూరి కర్పూరచూర్ణముతో సుగంధయుక్తముగా చేయవలెను. తర్వాత దీనిలో మధువును కలిపి గోళాకారపు ఉండలు చేయవలెను. ఇదికోపచ్ఛద నామకధూపముతో రాజులకు సుగంధ ద్రవ్యముగా తయారగును.

డాల్చిని వట్టివేరు గంధపత్రము మూడుభాగములు, ఆమూడింటిలో సగభాగము చిన్నఏలకులు కలిపి చూర్ణముచేసి కస్తూరి లేక కర్పూరముతో కలిపిచూర్ణము చేయవలెను. వస్త్రములు సుగంధయుక్త మగుటకు పుటవాసచూర్ణము తయారగును. తుంగగడ్డలు బాలకము, శైలేయకము, కర్పూరము, శారము, నాగకేసరపుష్పము, సముద్రపునురుగు, దమనము, నఖము,తగరము,ధనియాలు,కర్పూరము,చోరకము ఈ పదహారు ద్రవ్యములతో ఇచ్ఛానుసారము నాలుగు ద్రవ్యములను తీసుకొని క్రమముగా ఒకటి రెండు మూడు నాలుగుభాగములలో మార్చిమార్చి కలిపిన సుగంధద్రవ్యము తయారగును.

ధనియాలు కర్పూరము అధికగంధము కలిగినవగుట వలన వాటినుపయోగించు నపుడు జాగ్రత్తగా నుండవలెను. ధనియాలు ఒకభాగము కర్పూరము ఒకభాగము కన్న తక్కువ గంధద్రవ్యములను తయారుచేయుటకు పయోగించవలెను. ఈ రెండింటి రెండు భాగములను ఎప్పుడు ఉపయోగించరాదు. ఈ రెండు ద్రవ్యములు అధికగంధమును వ్యాపింప జేయుట వలన ఇతరద్రవ్యముల గంధమును నాశనము చేయును.

ఉపరోక్త సర్వద్రవ్యములు శ్రీవాసకము సర్జరసము గుడము నఖాది నాలుగు ద్రవ్యములతో వేరువేరుగా ధూపము వేయవలెను. ఒక్కసారిగా రెండింటి ధూపము వేయరాదు. తర్వాత కర్పూరము కస్తూరిధూపమును వేయవలెను. ఈ విధముగా ఉపరోక్త గ్రంధద్రవ్యములతో 174720 గంధద్రవ్యములను నిర్మించవచ్చును.

ఒక్కొక్క గ్రంధద్రవ్యము యొక్క ఒక్కొక్కభాగము మిగిలిన ద్రవ్యముల రెండు మూడు నాలుగుభాగములు తీసుకొనిన ఆరువిధములైన గంధములగును. ఈ విధముగా ఆద్రవ్యముల క్రమముతో రెండు మూడు నాలుగుభాగములతో మొదటి రెండుభాగములను కలిపిన ఆరుగంధ ద్రవ్యములగును. ఈ విధముగా ఆరువిధములైన ద్రవ్యములతో నాలుగు ద్రవ్యములను కలిపిన 24విధములగును. మిగిలిన మూడు స్థలములలో నున్న నాలుగేసి నాలుగేసి కలిపిన 72 విధములగును. మొత్తము కలిపిన 96విధములగును.

ముందు తెల్పిన 16 ప్రకారములైన గంధద్రవ్యములకు నాలుగేసి నాలుగేసి ద్రవ్యములను జోడించిన 1820 విధములైన గంధద్రవ్యములగును. పైన తెల్పిన నాలుగు ద్రవ్యముల గంధముతో 96 విధములైన గంధములగును. నాలుగేసి నాలుగేసి ద్రవ్యములను కలిపిన 1820 విధములుగా చెప్పబడును. ఈ రెండు సంఖ్యలను గుణించిన 96×1820=174720 గంధముల సంఖ్య సిద్ధమగును.

ఒకటి నుండి తీసుకొని ఎన్ని ద్రవ్యములున్నవో అంత సంఖ్యను క్రిందినుండి తీసుకొని పైవరకు తెలిపిన పంక్తిలో అంకెలను వ్రాయవలెను. పూర్వపూర్వ గత అంకెలతో పైఅంకెలను కలుపుకుంటు వెళ్ళవలెను. చివరిస్థానమును వదలిన సంఖ్యవచ్చును. ఈ విధముగా అభీష్టమైన వికల్పములతో చరలోష్టకమును వేరేచోటికి తీసుకొనివెళ్ళి దానిని

అక్కడ వదలి మరల అన్యచరలోష్టకమును వేరేచోటికి తీసికొని వెళ్ళవలెను.

పదహారు పదముల కోష్ఠమును తయారుచేసి మొదటి పంక్తిలో అగరు గంధపత్రము మూడుభాగములు, తురుష్కము ఐదుభాగములు, శైలేయము ఎనిమిదిభాగము లుంచ వలెను. రెండవ పంక్తిలో ప్రియంగువు ఐదుభాగములు, తుంగగడ్డలు ఎనిమిదిభాగములు, రసములు రెండుభాగములు, శాలీజాతము మూడుభాగము లుంచవలెను. మూడవ పంక్తిలో స్పృక్కు నాలుగుభాగములు, త్వక్కు ఒకభాగము, తగరము ఏడుభాగములు, కాంస్యము ఆరుభాగములుంచవలెను. నాల్గవపంక్తిలో చందనము ఏడుభాగములు, నఖము ఆరుభాగములు, శ్రీవాసకము నాలుగుభాగములు,కుందురుకము (కుందురువు) ఒకభాగము ఉంచవలెను.

పదహారు పదములలోనున్న ఏనాలుగు ద్రవ్యభాగములను కలిపినను పద్దెనిమిది ప్రకారములైన గంధములు తయారగును. ఈ విధముగా పద్దెనిమిది భాగములలో నఖము, తగరము, చిహ్లకము సమభాగముతో కలుపవలెను. జాజికాయ కర్పూరము కస్తూరి సమభాగములు తీసుకొని చేసిన సర్వతోభద్రనామకమైన అనేక విధములైన గంధములు తయారగును. ఈ చక్రములో నిలువుగా వంకరగా అడ్డముగా భాగములను కలిపిన అన్ని స్థలములలో పద్దెనిమిది భాగములగును. అందువలన ఈ గంధద్రవ్యముల నామము సర్వతోభద్రమైనది.

సర్వతోభద్ర చక్రము

అగరు 2	గంధపత్రము 3	సిహ్లకము 5	శైలేయము 8
ప్రియంగు 5	ముస్త 8	రసము 2	శాలిజాత 3
స్పృక్కు 4	త్వక్కు 1	తగరము 7	మాంసి 6
చందనము 7	నఖము 6	శ్రీవాసకము 4	కుందుకము 1

పూర్వోక్త ద్రవ్యములలో నియమానుసారము తమ ఇచ్ఛానుసారము ఏవైన నాలుగు ద్రవ్యములను తీసుకొని జాజికాయ, కస్తూరి, కర్పూరము కలిపి మామిడిరసముతో తేనెలో కలిపిన పారిజాత సమానమైన గంధము తయారగును. ముందుతెల్పిన కచ్ఛ పుటములో ఎన్ని విధములైన సర్జరసము శ్రీవాసకముల సంయోగములు తెలుపబడెనో

వాటిలో శ్రీవాసకము సర్జరసములను కలపకుండ రసము దాల్చినిని మాత్రము కలిపిన అనేకవిధములైన స్నానమున కుపయోగపడు చూర్ణములు తయారగును.

రోద్రము,ఉశీరము,తగరము,అగరు,ముస్తలు,గంధపత్రము,ప్రియంగువు పరిపేలవము,హరీతకి ద్రవ్యములను విధి ప్రకారము తయారుచేసిన నవకోష్ఠ క్రమముతో మూడేసి ద్రవ్యములను కలిపి చందనము ఒకభాగము,తురుష్కము ఒకభాగము,ముత్యము సగ భాగము,సోంపు ఒకభాగములో నాల్గవవంతు కలుపవలెను. కటుకము,గిగ్గులము, బెల్లముతో ధూపము వేసిన 84 విధములైన వకులపుష్ప సమానమైన గంధ ద్రవ్యము తయారగును.

గోమూత్రములో కరక్కాయ చూర్ణము కలిపి ఏడురోజులు దంతకాష్ఠము(దంతపుల్ల) ను నానబెట్టవలెను. తర్వాత దానినితీసి వక్ష్యమాన గంధోదకములో వేయవలెను. గంధోదకము తయారు చేయుటకు ఏలకులు దాల్చిని,గంధపత్రము, సౌవీరకము,తేనె, మిరుయాలు, నాగకేసరము, కుష్ఠము వీటిని సమానభాగములుతో తీసుకొని జలములో వేసి గంధజలము తయారు చేయవలెను. దానిలో పన్నుపుల్లను కొంతసమయము వరకు నానబెట్టవలెను. తర్వాత నాలుగుభాగములు జాజికాయ, రెండుభాగములు గంధపత్రము, ఒకభాగము ఏలకులు మూడుభాగములు కర్పూరము ఒకచోట కలిపి ఆచూర్ణములో దంతపుపుల్లను ముంచి ఎండలో ఎండబెట్టి ఉంచవలెను. ఉపరోక్తవిధిలో తయారుచేసిన దంతకాష్ఠము నుపయోగించిన మనిషి శరీరవర్ణము, ముఖకాంతి ఉత్తమ మగును. నోరు లోపలిభాగము సుగంధయుక్తమగును. అటువంటి మనుషుల నోటినుండి మధుర శబ్దము వెలువడి వినసొంపుగానుండును.

తాంబూలము కామభావనను పెంపొందించును. శారీరిక సౌందర్యమును వృద్ధి పరచును. సౌభాగ్యమును కలిగించి ముఖమును సుగంధయుక్తము చేయును. కఫమువలన ఉత్పన్నమగు రోగములను నశింపజేయును. అనేక గుణములనభివృద్ధి పరచును. తాంబూలము రాగమునుత్పన్నము చేయును. ఎక్కువ వక్కలు వేసుకున్న రాగహాని కలుగును. ఎక్కువ సున్నమున్న తాంబూలము ముఖములో దుర్గంధము కలిగించును. తమలపాకులు ఎక్కువ ఉన్న ముఖమును సుగంధయుక్తము చేయును.

రాత్రులందు తమలపాకులను,పగలు వక్కలను అధికముగా నుపయోగించిన మంచిది. దీనికి వ్యతిరేకముగా భక్షించిన పురుషుడుపహాస (నింద)పాత్రుడగును. కక్కోలము (వృక్ష విశేషము) వక్కలు,లవంగము,జాజిఫలములతో కూడిన తాంబూలమును తినిన పురుషుడు మదయుక్తుడై సంతోషమును పొందును.

డెబ్బదిఏడవ గంధయుక్త్యధ్యాయము సమాప్తము

78. పుంస్త్రీ సమాయోగాధ్యాయము

విధూరథుడను రాజును తనభార్య జడలో దాచిన కత్తితో, కాశీరాజును విరుక్తు రాలైన తనపత్ని విషము రాసిన నూపురముల (గజ్జెలు)తో యమలోకమునకు పంపెను. అనురక్తురాలైన స్త్రీకి సమస్తభావములు(శరీరము కంపించుట, ముఖము ఎండుట, ముఖము పాలిపోవుట, మున్నగువి) కామజనితమైన ప్రేమతో కూడియుండును.నాభి,భుజము,వక్ష స్థలము,భూషణము చూపించుట, వస్త్రము ధరించుట, కేశములు బంధించుట, కేశములు వదులుట కనుబొమలు ఎత్తి కంపించిన కనులతో చూచుట మొదలగు చిహ్నములు కనపడును.

గట్టిగా అరుచుట, శబ్దము చేస్తు నవ్వుట, ప్రియుని శయ్య ఆసనముల దగ్గరకు వెళ్ళుట, తనశరీరాంగములతో శబ్దము చేయుట, ఆవులించుట చిన్న వస్తువును కూడ ప్రేమతో అడుగుట, ప్రియుని ఎదుట బాలురను ఆలింగనము చేసికొనుట, ముద్దుపెట్టు కొనుట,ప్రియుని ఎదురుగా సఖిని చూచుట, వేరేవైపు చూచుచున్న ప్రియుని చూచుట, ప్రియుని గుణములను వర్ణించుట, చెవులను గోకుట ఇవన్నీ అనురక్తురాలైన స్త్రీచేష్టలు. అనురక్తురాలైన స్త్రీ ప్రియమైన వచనములు పలుకును ప్రియునికి ధనము నిచ్చును. ప్రియుని చూచి ప్రసన్నరాలగును.కోపము లేకుండ ప్రియుని గుణములను మాత్రమే తెలిపి ప్రియుని దోషములను దాచును.ప్రియుని మిత్రులను పూజిస్తు శత్రువులను ద్వేషిస్తు ప్రియుడు చేయుపనులను స్మరణ చేయును. ప్రియుడు పరదేశము వెళ్ళిన దు:ఖించును. స్తనస్పర్శ, అధరపానము, ఆలింగనము, చుంబనము, చేయును. ఇవన్నీ అనురక్తికలిగిన స్త్రీచేష్టలుగా గుర్తించవలెను.

కనుబొమలు ఎగురవేయుట, పతివైపుకి ముఖము చూపించకుండుట, పతిచేసిన పనులు మరచిపోవుట, పతిని అనాదరించుట, కష్టముతో తృప్తిని పొందుట, పతిశత్రువులతో మైత్రి,కఠోరవాక్యములు పలుకుట,పతిని చూచిన తాకిన శరీరముకంపించుట, అభిమానము చూపుట, వెళ్ళుచున్న పతిని ఆపకుండుట, పతి ముద్దు పెట్టిన ముఖము తుడుచుకొనుట, పతికన్న ముందు పరుండుట, తర్వాతలేచుట, ఇవన్నీ విరక్తి కలిగిన స్త్రీచేష్టలు.

స్త్రీకి పరపురుషునితో సంబంధము కలిగంచుటకు బికారిస్త్రీ సన్యాసిని,దాసి,దాది, చాకలి, మలినస్త్రీ, దుష్టస్త్రీ, సఖి, మంగలిస్త్రీ, దూతలగుదురు. ఈ దూతల కారణముగా కులమునకు నాశము కలుగును. అందువలన ప్రయత్నముతో వంశము, గౌరవము, మానరక్ష ణార్థము అటువంటి దూతలతో స్త్రీకి రక్షణ కలిగించవలెను. రాత్రి ఒంటరిగ బయటికి వెళ్ళటము, బయటకు వెళ్ళుటకు రోగమును సాకుగా చెప్పటము, ఇతరుల ఇండ్లకు వెళ్ళటము, ఇతరుల కష్టములో వివాహాదులలో పాలుపంచుకొనటము, ఇవన్నీ స్త్రీకి సంకేత హేతువులు. అందువలన ఇటువంటి ఘటనలు కలుగకుండ చూచుకొనవలెను.

మొదట రతిక్రియకు ఇచ్ఛచూపనప్పటికి రతిక్రియ వదిలి పెట్టనిది, సిగ్గుతో ఆలస్యము చేయుచున్నది ,రతిమధ్యలో లజ్జారహితమై తర్వాత సిగ్గుతో తలవంచునది. ఆదరముతో అనేక విధములుగా రతిని చేయుచున్న పురుషుని భావములను తెలిసికొని సుఖ దు:ఖములలో పాలు పంచుకొనుచున్న స్త్రీతో రతిక్రియను చేయవలెను.స్త్రీలకు యౌవనము, రూపము, వేషము, చాతుర్యము, కామశాస్త్రకళలలో కుశలత్వము, విలాసము (మధుర వచనము కటాక్షము) ఇవి గుణములు.చతురుడైన పురుషునకు గుణములతో కూడిన స్త్రీ రత్నసమానము, గుణరహిత స్త్రీ వ్యాధిసమానమగును.

గ్రామీనభాషను మాట్లాడునది మలినముగానుండు అంగములు గల స్త్రీతో రతి సంబంధ విషయములను మాట్లాడరాదు. రతికొరకు ఏకాంతములో నున్న స్త్రీ ఇతర విషయములను స్మరించరాదు.ఎందువలననగా కామదేవునికి మనస్సే ప్రధానము. మనసు అన్యవిషయములలో ఆసక్తి కలిగియున్న రతి సుఖము కలుగదు.

దుష్టస్వభావము కలది, రతిక్రీడా సమయములో పీడను భరించలేని స్త్రీని వదిలిపెట్టవలెను.ఋతుసమయములో రక్తము నలుపు, నీలము, పసుపుపచ్చ, తామ్రవర్ణము గానున్న స్త్రీ శ్రేష్ఠురాలుకాదు. అధికముగా నిద్రించునది, అధిక రక్తపిత్తము కలది, ప్రవాహిని,అధికవాతము కఫము కలది,అధికముగా తినునది, చెమటతో కూడిన శరీరము కలది, చిన్న కేశములు కలది, తెల్లని కేశములు కలది,వదులైన మాంసము కలిగిన శరీరము కలది,పెద్ద పొట్టకలది,స్పష్టముగా పలుకనిది, స్త్రీ లక్షణాధ్యాయములో తెలిపిన అశుభ లక్షణము గల స్త్రీతో రతిని చేయకూడదు.

ఋతుకాలపు రక్తము, కుందేలు రక్తము, లక్కతో సమానమైనది, వెంటనే పోవునది శుద్ధి కలిగినదగును. శుద్ధమైన రక్తముతో పీడారహితమై మూడుదినముల తర్వాత ఆగిన రక్తము కలిగిన స్త్రీతో పురుషుడు సంభోగము చేసిన గర్భము కలుగును. రజస్వలాస్త్రీ మూడుదినముల వరకు స్నానము, మాల అనులేపనముల సేవనము చేయకూడదు. నాల్గవరోజు శాస్త్రోక్తముగా స్నానము చేయవలెను. పుష్యస్నానాధ్యాయములో తెల్పిన ఔషధములు నీటిలో కలిపి, అక్కడ తెల్పిన మంత్రములను జపిస్తు స్నానము చేయవలెను.

ఋతుకాలము నుండి సమరాత్రులలో పురుషుడు,విషమరాత్రులలో స్త్రీ ఉత్పన్నమగును. దూరస్థితమైనసమరాత్రులలో(ఆరవ,ఎనిమిదవ,ఆదిరాత్రులలో) దీర్ఘాయువు, సుఖవంతుడైన పురుషుడుత్పన్నమగును.స్త్రీకి దక్షిణభాగములో గర్భమైన పురుషుడు, వామభాగములో గర్భమైన కన్య రెండువైపుల గర్భమైన కవలలు, మధ్యలో గర్భమైన నపుంసకుడుత్పన్నమగును.

కేంద్ర (1,4,7,10) త్రికోణ (5,9)స్థానములలో శుభగ్రహములున్న చంద్రుడు రెండు శుభగ్రహములతో కూడియున్న, మూడు,ఆరు,పదకొండు స్థానములలో పాపగ్రహము

లున్న పుంజన్మయోగములో భార్యతో కలిసిన పుత్రప్రాప్తి కలుగును. పురుషుడు ఋతు కాలములో స్త్రీ అంగములను నఖ, దంతములతో క్షతి చేయరాదు. ఋతుకాలములో మొదటి మూడు రోజులు సంభోగము చేయరాదు.

డెబ్బది ఎనిమిదవ స్త్రీ సమాయోగాధ్యాయము సమాప్తము

79. శయ్యాసన లక్షణాధ్యాయము

మనుష్యలందరికి అన్ని కాలములలో ఈశాస్త్రముపయోగపడును. రాజులకు విశేష రూపముతో, అందువలన శయ్యాసన లక్షణము తెలియజేయుచున్నాను. విజయసారము, స్పందనము, హరిద్రము, దేవదారు, తిందుకి, శాల, కాశ్మరి, అంజన, పద్మక, శాక, శింశిపా వృక్షముల కర్ర శయ్యకు ఆసనములకుపయోగపడును.

మెరుపు నీరుగాలి ఏనుగుల వలన పడిన, తేనెపట్టు పక్షి గూడులున్న, చైత్యము శ్మశానము మార్గములో నున్న, ఎండిన లతలతో కూడిన, వృక్షముల కర్ర శయ్యాసన నిర్మాణమునకు మంచిదికాదు. ముళ్లుకలది, మహానది, దేవాలయములో పుట్టిన పశ్చిమ దక్షిణదిశలలో పడిన వృక్షములు శయ్యాసనములకు పనికిరావు. అశుభ వృక్షముల కర్రతో చేసిన శయ్యాసనములను ఉపయోగించిన కులనాశము,రోగభయము, ధనహాని, కలహము అనేక విధములైన అనర్థములు కలుగును.

శయ్యాసనముల నిర్మాణమునకు ముందు పూర్వదిశలో నరికిన వృక్షముల శుభాశుభ ఫలములను పరీక్షించవలెను. నరికిన వృక్షముపై అకస్మాత్తుగా బాలుడు ఎక్కిన ఆ వృక్షము పశువులకొరకు ఉపయోగపడును. శయ్యాసనములు నిర్మించు కాలములో తెల్లనిపుష్పములు, మదించిన ఏనుగు,పెరుగు,అక్షతలు,జలముతో నిండిన కుండ, రత్నములు మంగళద్రవ్యములను చూచిన శుభము కలుగును.

చెమ్మలేని ఎనిమిది యవలను అడ్డముగా ప్రక్క ప్రక్కన పేర్చిన ఒకకర్మాంగుళ మగును. వందకర్మాంగుళములు పొడవున్న శయ్య రాజులకు జయము కలుగును. రాజపుత్రులు మంత్రులు సేనాపతి పురోహితుల శయ్య క్రమముగా 90,86, 78, 72, అంగుళముల పొడవుండవలెను. శయ్యపొడవును సగము చేసి దానిలో ఎనిమిదవ వంతు తగ్గించిన మిగిలినది వెడల్పుగానుండును. వెడల్పుకు మూడవవంతుతో సమానముగా కుక్షి శిరస్సుతో కూడిన కాలు పొడవుండును. ఇది విశ్వకర్మమతము.

శ్రీపర్ణ వృక్షముతో చేసిన శయ్యి ధనమునిచ్చును. అసనవృక్షముతో చేసిన శయ్య రోగమును పోగొట్టును. తిందుక వృక్షపు శయ్య ధనమును,శింశుపా వృక్షపు శయ్య అనేక విధములుగా వృద్ధిని, చందన వృక్షపు శయ్య శత్రునాశము కీర్తి దీర్ఘాయువు,

పద్మక వృక్షపు శయ్య దీర్ఘాయువు ధనమును, ధర్మమును శాలవృక్షపు శయ్య కల్యాణమును కలిగించును. కేవలము చందన వృక్షముతో నిర్మించిన శయ్య సువర్ణముతో చుట్టబడి రత్నములతో కూడిన శయ్యపై శయనించిన రాజును దేవతలు కూడా పూజింతురు.

తిందుక శింశిప వృక్షపు కర్రతో వేరే వృక్షపు కర్రను కలిపిన, అదేవిధముగా శ్రీపర్ణవృక్షపు కర్రతో దేవదారు లేక ఆసన వృక్షపుకర్రను కలిపి తయారుచేసిన శయ్యాసనములు శుభఫలము నీయవు. శాల శాకవృక్షముల కర్రలు కలిపిన లేక వేరువేరుగా నున్నను శుభఫలమునిచ్చును. హరిద్రక కదంబ వృక్షపు కర్ర పరస్పరము కలిపిన లేక వేరువేరుగానున్న శుభఫలమునిచ్చును. కేవలము స్పందనవృక్షపు కర్రతో చేసిన శయ్యాసనములు శుభమునీయవు. అంబవృక్షపు కర్రతో నిర్మించిన శయ్యలు ఆసనములు వెంటనే దోషమును కలిగించును. అంబ స్పందన వృక్షములతో నిర్మించిన శయ్యకు కాళ్లు స్పందన వృక్షపు కర్రతో చేసిన శుభము కలుగును. అన్ని ఫలవృక్షముల కర్రలతో నిర్మించు శయ్యాసనములు అభీష్టఫలమును కలిగించును.

పూర్వోక్త వృక్షముల కర్రతో పాటు ఏనుగు దంతమును కలుపుట శుభమునిచ్చును. అందువలన ప్రశస్తమైన లక్షణములు కలిగిన ఏనుగు దంతముతో శయ్యాసనములను అలంకరించవలెను. గజదంత మూలములో ఎన్ని అంగుళముల పరిధి ఉన్నదో దానికి రెండింతలు వదలి మిగిలిన భాగపు దంతముతో అన్ని కల్పనలు చేయవచ్చును. జల ప్రాయ దేశముల ఏనుగులైన దానికన్న కొంచెము అధికము, పర్వతములలో తిరుగు ఏనుగులైన దానికన్న కొంచెము తక్కువ భాగమును వదలి మిగిలినది అలంకరణకు వాడవచ్చును.

నరుకు సమయమున ఏనుగు దంతములో బిల్వవృక్షము, వర్ధమానము,ఛత్రము, ధ్వజము,చామరము వంటి చిహ్నములు కనపడిన ఆరోగ్యము ధనవృద్ధి సుఖము కలుగును. శస్త్రసమానమైన చిహ్నము కనపడిన జయము,జలమువలె చిహ్నము కనపడిన నష్టదేశప్రాప్తి, రాతిముక్క వలె చిహ్నము కనపడిన ముందు దొరికిన దేశము మరల ప్రాప్తించును. స్త్రీసమాన చిహ్నము కనిపించిన ధననాశము, తుమ్మెద వలె కనపడిన పుత్రోత్పత్తి ఘటము వలె కనపడిన నిధిప్రాప్తి, దండ సమానముగా కనపడిన యాత్రలో ఆటంకము, ఊసరవెల్లి కోతి సర్పమువలె చిహ్నము కనపడిన దుర్భిక్షము, వ్యాధి,శత్రువు అధికారములో ఉండుట జరుగును. గద్ద, గుడ్లగూబ, కాకి, డేగ సమానముగా చిహ్నము కనపడిన మహామారి(వ్యాధులు) పాశకబంధ (మొండెము) చిహ్నములు కనపడిన రాజుకు మృత్యువు, నరికినపుడు రక్తము బయటకు వచ్చిన విపత్తి, నలుపు పసుపు కఠిన దుర్గంధములతో నున్న అశుభము కలుగును.

దంతపు రంధ్రము తెలుపు సుగంధయుక్తము నిర్మలముగానున్న శుభమునిచ్చును.

ఇవన్ని ఆసనముల ఫలితములు ఇదేవిధముగా పూర్వోక్త లక్షణము శయ్యలోకూడ ఫలితము నిచ్చును. ఈష (శయ్యలో పొడుగు అడ్డములలో నుండు కఱ్ఱలు)జోడించినపుడు ప్రదక్షిణ క్రమములో కలుపవలెను. (శిరస్సువైపున్న కఱ్ఱపై భాగములో దక్షిణవైపు కఱ్ఱమూల భాగము, దక్షిణవైపు కఱ్ఱ చివరిభాగములో కాలువైపు కఱ్ఱ మూలభాగము, కాలువైపున్న కఱ్ఱ చివరిభాగములో ఉత్తరవైపుకి కఱ్ఱమూలభాగము, ఉత్తరవైపు కఱ్ఱ చివరిభాగములో శిరస్సు వైపున్న కఱ్ఱమూలభాగము) అపసవ్య క్రమములో శయ్య ఆసనముల ఒకకాలు అథోముఖము (కఱ్ఱమూలము కాలిపైభాగములో, కఱ్ఱ చివరిభాగము కాలిమూల భాగములో)గానున్న దానిపై పరుండువాని కాలికి పీడకలుగును. రెండుకాళ్లు అధోముఖము లైన అజీర్ణము, మూడు లేక నాలుగు కాళ్లు అధోముఖములైన క్లేశము వధ బంధనము కలుగును.

కాలిచివరిభాగము పగిలిన వివర్ణమైన గ్రంథి(ముడులు) యుతమైన దానిపై పరుండువానికి వ్యాధి కలుగును. కాలి కుంభములో ముడులున్న (కణుపు) ఉదరరోగము, కుంభము క్రిందిభాగములో ముడియున్న ధననాశము, ఖురప్రదేశము(మంచపు కోడి)లో ముడిఉన్న గిట్టలున్న జంతువుల పీడ, ప్రక్కభాగము పైభాగములో మూడవభాగముపై ముడిఉన్న సుందరముగా నుండదు. నిష్కటము, కోలాక్షము, సూకరనయనము, వత్సనాభము, కాలకము, ధుంధుకము ఇవి సంక్షేపముగా రంధ్రముల సంజ్ఞలు.

రంధ్రము బెజ్జము మధ్యభాగములో కుండసమానమైన వెడల్పుతో పైన తురంగ (గుఱ్రపు జీనును బిగించు పరికరము) ముఖ ఆకృతిలో కనపడిన **నిష్కట**మగును. శాలి ధాన్యము, మినుములతో సమానముగా నీలవర్ణముతో నున్న **కోలాక్షము,** వివర్ణమై ఒకటిన్నర పర్వముల వామావర్తముగా రంధ్రమున్న **వత్సనాభము**, నల్లని రంధ్రమైన **కాలకము**, రెండవ వైపుకి కూడ కనపడు నల్లని రంధ్రము **ధుంధు**కమనబడును. కఱ్ఱవలె సమాన వర్ణముతో కనపడు అశుభ రంధ్రము కూడ అశుభఫలము నిచ్చును.

నిష్కటనామక ఛిద్రము వలన ధననాశము, కోలాక్షము వలన కులక్షయము, సూకరమైన శస్త్రభయము, వత్సనాభము వలన రోగభయము, కలుగును. కాలక ధుంధుక సంజ్ఞక ఛిద్రములు పురుగులతో నున్న శుభమునీయదు. ఎక్కువ పగుళ్లున్న కఱ్ఱ ఎప్పుడు కూడ శుభమునీయదు.

ఒకవృక్షపు కఱ్ఱతో చేసిన శయ్య ధన్యమైనది. రెండు వృక్షముల కఱ్ఱతో చేసిన ధన్యంతరము, మూడువృక్షముల కఱ్ఱతో చేసిన పుత్రులను పెంచును. నాలుగు వృక్షముల కఱ్ఱతో చేసిన శయ్య ఉత్తమ ధనము యశమునిచ్చును. ఐదు వృక్షముల కఱ్ఱతో చేసిన శయ్యపై పరుండు వానికి మరణము కలుగును. ఆరు ఏడు ఎనిమిది వృక్షముల కఱ్ఱతో చేసిన శయ్య కులనాశము కలిగించును.

డెబ్బది తొమ్మిదవ శయ్యాసన లక్షణాధ్యాయము సమాప్తము

80. రత్న పరీక్షాధ్యాయము

శుభరత్నధారణ వలన రాజులకు శుభము,అశుభరత్నధారణ చేయుట వలన అశుభము కలుగును. అందువలన రత్నములలో నున్న శుభాశుభములను రత్నజ్ఞులు పరీక్ష చేయవలెను. ఏనుగు గుర్రము స్త్రీ మున్నగువాటిలో తమతమ గుణవిశేషములతో రత్నశబ్ద ప్రయోగము చేయబడును. గజ రత్నము, అశ్వరత్నము, స్త్రీరత్నము అని,కాని వజ్రాది రాళ్లను రత్నములని యందురు.

బలసంజ్ఞక రాక్షసుని వలన రత్నముల ఉత్పత్తి జరిగినదని కొందరి మతము. దధీచిముని ఎముకలచే రత్నముల ఉత్పత్తి కలిగినదని తెల్పెదరు. కొందరు భూమి స్వభావము, రాళ్ల పరివర్తన వలన రత్నముల ఉత్పత్తి జరుగునని తెల్పెదరు.

వజ్రము, ఇంద్రనీలము, మరకతము, కర్కేతరము, పద్మరాగము, రుధిరము, వైడూర్యము,పులకము, విమలకము, రాజమణి, స్ఫటికము, చంద్రకాంతము, సౌగంధికము, గోమేధికము, శంఖము, మహానీలము, పుష్యరాగము, బ్రహ్మమణి, జ్యోతిరసము, సస్యకము, ముత్యము, ప్రవాళములను రత్నములందురు.

రేణానదీతటముపై శుద్ధమైన వజ్రము,కోశలదేశములో శిరీష పుష్పసమానము, సౌరాష్ట్రదేశములో కొంచెము ఎరుపు,సురపారక దేశములో నలుపు, హిమత్పర్వతముపై కొంచెము నలుపు,మతంగదేశములో నల్లపుష్పసమానము,కళింగ దేశములో నల్లపుష్ప సమానము, కళింగ, పౌండ్రదేశములలో శ్యామవర్ణము కలిగిన వజ్రములుత్పన్న మగును. ఆరుకోణముల తెల్లని వజ్రమునకు ఇంద్రుడు, సర్పాకారముఖము కలిగిన నల్లని వజ్రమునకు యముడు, నలుపు పసుపు రంగులు కలిగిన వజ్రమునకు విష్ణువు, సామాన్య రూపముతో నుండు అన్నివిధములైన వజ్రములకు వరుణుడు, కర్ణికార పుష్ప సమానము, త్రిభుజాకారము లేక పులినేత్ర సమానమైన వజ్రమునకు అగ్ని, అశోక పుష్ప సమానమైన వర్ణము కలిగిన వజ్రమునకు వాయువు దేవతలు నదీప్రవాహము, గని, ప్రకీర్ణకము (సముద్రాదులు) మూడు ప్రదేశములలో వజ్రములుత్పత్తి యగును.

ఎర్రని పచ్చని వజ్రములు క్షత్రియులకు, తెల్లనివి బ్రాహ్మణులకు, శిరీష పుష్ప వర్ణము కలవి వైశ్యులకు, నీలవర్ణముకలవి శూద్రులకు శుభమును కలిగించును. తెల్లని ఆవాలు ఎనిమిది ఒకతండుల (బియ్యము)మగును. 20తండులముల వజ్రము రెండు లక్షల కార్షాపణములగును. వాటిలో క్రమముగా రెండేసి బియ్యపు గింజలు తగ్గించిన ముందు తెల్పిన మూల్యమునకు నాల్గవవంతు తగ్గించిన ఒకటిన్నర లక్ష, తృతీయాంశము తగ్గిన (144443 1/3),సగమైన (1లక్ష) తృతీయాంశమైన (66666 2/3) పంచమాంశమైన (12500) పంచవింశాంశమైన (8000) శతాంశమైన (2000) సహస్రాంశమైన (200) కార్షాపణముల మూల్యమగును. అనగా 18 తండులములతో సమానమైన బరువు

కలిగిన వజ్రము వెల (150000) 16 తండులముల వెల(144443 1/3) 10 తండులముల వెల ఒక లక్ష కార్షాపణములుగా తెలిసికొనవలెను.

ఏవస్తువు వలన విరుగనిది జలములో కిరణమువలె తేలేది, నిర్మలమైనది, మెరుపు అగ్ని ఇంద్రధనుస్సుతో సమానమైన వర్ణము కలిగిన వజ్రము కల్యాణకారియగును. కాకి పాదము తేనెటీగతో సమానమైన చిహ్నములు కలది, కేశ సమానమైన రేఖ కలది, ధాతువులతో కూడినది, కంకరతో కూడినది, ఉండవలసినదానికన్న రెట్టింపు కోణములు కలది, అగ్నిలో కాలినది, మలినమైనది, కాంతిహీనమైనది, జర్జరాది (సరియైన ఆకారము లేని) వజ్రము శుభమునీయదు.

నీటిబుడగల వలె పగిలినది చిపిటము (అటుకుల)వాసీఫలమువలె సమానముగా పొడవుగా నున్న వజ్రము శుభమునీయదు. దోషయుక్తమైన వజ్రములు ముందు తెలిపిన మూల్యములో అష్టమాంశము తక్కువగును. పుత్రులు కావలసిన స్త్రీలు వజ్రము ధరించరాదని వజ్రలక్షణములు తెలిసిన పండితులు తెలిపెదరు. శృంగాటక (పరివెగడ్డ) ఆకారములో మూడు పుటములతో నున్నది, ధాన్యఫలము శ్రోణి(పిరుదులు) సమానమైన వజ్రము ధరించిన పుత్రులనుకోరు స్త్రీలకు శుభముకలుగును.

అశుభ లక్షణములు కలిగిన వజ్రమును ధరించిన రాజుకు బంధు ధన ప్రాణనాశము కలుగును. శుభలక్షణములు కలిగిన వజ్రమును ధరించిన వజ్రభయము, విషము, శత్రువుల నాశము భోగవృద్ధి కలుగును.

ఎనుబదవ రత్నపరీక్షాధ్యాయము సమాప్తము

81. ముక్తా లక్షణాధ్యాయము

ఏనుగు సర్పము ముత్యపుచిప్ప మేఘము వెదురు మత్స్యము (చేప) పంది వీటినుండి ముత్యములు ఉత్పన్నమగును. వాటిలో ముత్యము నుండి ఉత్పన్నమైనవి ఉత్తమమైనవి. సింహల దేశము పారలోక దేశము, సౌరాష్ట్రదేశము తామ్రపర్ణీనది, పారశవ దేశము, కౌబేరదేశము పాండ్యవాటక దేశము, హిమాలయము ఈ ఎనిమిది ప్రదేశములు ముత్యములు దొరుకు స్థానములు.

సింహలదేశములో అనేక ఆకారము కలిగినవి,కోమలము హంససమానము స్థూలమైన ముత్యములుండును. తామ్రపర్ణీ నదిలో కొంచెము ఎరుపు తెలుపు పచ్చని ముత్యములుండును. పారలోకదేశములో నలుపు పసుపు కంకరతో కూడిన విషమ ముత్యములుండును. సౌరాష్ట్రదేశములో లావుకాని చిన్నవికాని వెన్నతో సమాన కాంతి కలిగిన ముత్యములుండును. పారశవ దేశములో తేజోవంతమైన తెల్లని బరువైన అధిక గుణము కలిగిన ముత్యములుండును. హిమాలయములందు చిన్నవి పాడైన పెరుగుతో

సమానమైన కాంతి కలిగిన పెద్దవైన శ్రేష్ఠమైన ఆకారము కలిగిన ముత్యములుండును. కౌబేరదేశములో విషమము, నలుపు తెలుపు తేలిక అతి తేజస్సు కలిగిన ముత్యము లుండును. పాండ్యవాటవదేశములో వేపఫల సమానమైన మూడుపుటములతో కూడిన, ధాన్యాక ఫలసమానమైన అతిచిన్న ముత్యములుండును.

నాలుగు మాసము(కొలత ప్రమాణము)లున్న తేజస్సు కలిగిన ముత్యము ధర 3400 కార్షాపణములుండును. నాలుగు మాసముల ముత్యమును సగము సగము చేసిన క్రమముగా 3200,2000,1300,800,343,కార్షాపణముల మూల్యమగును. ఈ విధముగా 3 1/2 మాసముల ముత్యపు మూల్యము 3200, మూడుమాసముల ముత్యపుమూల్యము 2000, 2 1/2మాసములది 1300, ఒకమాసము గల ముత్యము మూల్యము 135,ఐదుకృష్ణల(గురిగింజ)తో సమానమైన ముత్యము 90,మూడున్నర కృష్ణలది 70,మూడుకృష్ణలది 50,రెండున్నర కృష్ణల ముత్యపుమూల్యము34కార్షాపణము లుండును.

ఒకధరణ (పలములో పదవవంతు) సమానమైన తూకములో పదమూడు ముత్యములు వచ్చిన దానివెల 200రూపాయలు. 20ముత్యములు వచ్చిన దాని వెల 130 రూపాయలు, 30 ముత్యములు వచ్చిన దానివెల 70 రూపాయలు, 40ముత్యములు వచ్చిన దానివెల 50రూపాయలు, 45 ముత్యములు వచ్చిన దాని మూల్యము 40రూపాయలు, 80 ముత్యములు వచ్చిన దానిమూల్యము 30రూపాయలు, 100 ముత్యములు వచ్చిన దాని మూల్యము 25 రూపాయలు, రెండువందల ముత్యములు వచ్చిన దాని మూల్యము 12 రూపాయలు, మూడువందల ముత్యములు వచ్చిన దాని మూల్యము 5రూపాయలు, 500ముత్యములు వచ్చిన దానిమూల్యము 3 రూపాయలగును,

ఒకధరణములో 13 ముత్యములు వచ్చిన పిక్క. 16 ముత్యములు వచ్చిన పిచ్చ, 25 ముత్యములు వచ్చిన అర్ధము, 30 ముత్యములు వచ్చిన ఖకము, 40 ముత్యములు వచ్చిన సిక్థము, 55ముత్యములు వచ్చిన నిగర మందురు. దీని తర్వాత 80ముత్యముల నుండి 500 ముత్యముల వరకు ధరణము నందు వచ్చిన దానిని చూర్ణమందురు.

ఒకధరణ సమానమైన ముత్యముల మూల్యము తెలుపబడినది. దీని మధ్యలో నున్న ముత్యముల మూల్యమును వాటి పరిమాణము గుణములననుసరించి గుర్తించ వలెను. కొంచెము నలుపు, కొంచెము తెలుపు కొంచెము పసుపు,కొంచెము ఎరుపు, కొంచెము విషమముగా నున్న ముత్యములకు ముందు తెల్పిన మూల్యములో మూడవవంతు ఉండును. విషమము పాలిపోయిన ముత్యములకు ఆరవవంతు మూల్యముండును.

పుష్యమి లేక శ్రవణ నక్షత్రములలో చంద్రుడు లేక రవిలో ఉత్తరాయణములో రవి చంద్రుల గ్రహణకాలములో ఐరావత కులములో నుత్పన్నమగు భద్రగజముల దంతములలో లేక కుంభస్థలములలో అనేక విధములైన కాంతివంతమైన ముత్యములు

బయటపడును. వీటికిమూల్యమును నిర్ణయించరాదు. ఈ పవిత్రమైన ముత్యములు ధరించిన రాజు రాజపుత్రులకు విజయము ఆరోగ్యము కలుగును.

పంది దంతములో చంద్రకాంతితో సమానమైన కాంతితో అనేక సుగుణములతో కూడిన ముత్యములుత్పన్నమగును. మత్స్యముల నుండి మత్స్యముల నేత్రములతో సమానము, స్థూలము, పవిత్రము అనేక గుణములు కలిగిన ముత్యములుత్పన్నమగును. వర్షాకాలపు రాయి సమానముగా సప్తవాయు స్కంధము వలన క్రిందిపడిన విధముగా మెరుపుతో సమానమైన కాంతి కలిగిన మేఘములనుండి ఉత్పన్నమైన దేవతల ద్వారా ఆకాశము నుండి ముత్యములు క్రిందకుపడును.

తక్షకుడు వాసుకి నాగకులములో ఉత్పన్నమైన స్వేచ్ఛా విహారము కలిగిన సర్పపు పగడల అగ్రభాగములో కోమలమైన నీలికాంతి కలిగిన ముత్యములుండును. ప్రశస్తమైన భూమిపై వెండిపాత్రలో ముత్యములనుంచిన వెంటనే వర్షము పడిన నాగుల వలన ఉత్పన్నమైన ముత్యములుగా భావించవలెను. సర్పముల నుండి ఉత్పన్నమైన ముత్యములను ధరించిన రాజులకు విషము, అ లక్ష్మీ (ధనము లేకపోవుట) నాశనమగును. శత్రువులకు భయము కలుగును. గౌరవము విజయము కలుగును.

వెదురునుండి పుట్టిన కర్పూరము స్ఫటిక సమానకాంతి కలిగిన ముత్యములు, చిపిట(అటుకులు) ఆకారములో విషమముగా నుండును. శంఖము నుండి ఉత్పన్నమగు ముత్యములు చంద్రునివలె కాంతి కలిగి గుండ్రముగా కాంతితో సుందరముగా నుండును.

శంఖము, చేప వెదురు ఏనుగు పంది సర్పము మేఘముల నుండి ఉత్పన్నమైన ముత్యములు రంధ్రము చేయుటకు పనికిరావు. అమిత గుణముండుట వలన శాస్త్రములో వీటి మూల్యమును తెలుపలేదు. అధికగుణము కలిగిన ఈ ముత్యములు రాజులకు పుత్రులు, ధనము,సౌభాగ్యము, యశము నిచ్చును. రోగము శోకములను హరించును. అన్నికోరికలను తీర్చును. 1008 ముడులు కలిగిన మాల పొడవు నాలుగు హస్తములున్న ఇందు చందసంజ్ఞకమగును. ఇదిదేవతలకు హారముగా నుపయోగపడును. 500 ముడులు కలిగిన మాలపొడవు రెండు హస్తములున్న విజయ ఛందమగును. 108 ముడులున్న మాల అర్ధహారమగును. 54 ముడులున్న రశ్మికలాపము, 22ముడులున్న మాల గుచ్ఛము, 20 ముడులున్న అర్ధగుచ్ఛము, 16 ముడులున్న మాల మాణవకము, 12 ముడులున్న అర్ధమాణవకము, 8 ముడులున్న మందరము, 5 ముడులున్న ఫలసంజ్ఞకమగును. ఒకహస్తము పొడవున్నమాల మధ్యలో మణి లేక సువర్ణగుళిక నుంచిన దానిని మణిసోపాన మందురు. బంగారమునుంచిన చాటుకారమని పిలుతురు. ఇచ్ఛానుసారము ముత్యములతో నిర్మించిన మధ్యమణి లేనిమాలను ఏకావలియని, మధ్యమణి యున్న మాలను యష్టియని యందురు.

ఎనుబది ఒకటవ ముక్తా లక్షణాధ్యాయము సమాప్తము

82. పద్మరాగ లక్షణాధ్యాయము

సౌగంధికము, కురువిందము, స్ఫటికము – ఈ విధములైన రాళ్లతో పద్మరాగ మణులుత్పన్నమగును. సౌగంధిక రాయినుండి ఉత్పన్నమగు పద్మరాగము,భ్రమరము (తుమ్మెద) అంజనము(కాటుక) మేఘము, నేరేడురస సమనమైన కాంతితోనుండును. కురువిందరాయి నుండి ఉత్పన్నమగు పద్మరాగము తెలుపు నలుపు కలిసిన,తక్కువ కాంతి కలిగిన ధాతువులతో మలినముగానుండును. స్ఫటికముతో నుత్పన్నమగు పద్మరాగము అనేక వర్ణములతో మంచికాంతి కలిగి యుండును.

కోమలమైన కాంతితో ప్రకాశించేది, స్వచ్ఛమైనది,సుందరమైన ఆకాశము కలది, మధ్యలో కాంతి కలది, అతిలోహిత (ఎరుపు)మైనది,శ్రేష్ఠగుణములతో కూడినది పద్మరాగ మణి యగును. మలినము కాంతి కలిగిన, రేఖలు కలిగిన, మట్టి మున్నగు ధాతువులతో కూడిన,విరిగిన, అప్రశస్తమైన, పగిలిన, అందవిహీనముగానున్న కంకరతో కూడిన మణి దోషయుక్తమైనది.

తుమ్మెద, నెమలి కంఠముతో సమానమైన వర్ణముకల,దీపశిఖవలె కాంతి కల అమూల్యమైన మణి సర్పముల శిరస్సుపై నుండును. ఏరాజు ముందు తెల్పిన మణిని ధరించునో అతనికి ఎప్పుడు విషము,రోగ సంబంధ దోషములు కలుగవు. అతని రాజ్యములో ఇంద్రుడు ఎల్లప్పుడు వర్షము కురిపించును. మణిప్రభావము వలన రాజు శత్రువులను నాశనము చేయును.

ఒకపలము పద్మరాగమూల్యము1600 రూపాయలు,మూడుకర్షముల పద్మ రాగము మూల్యము 2000, అరపలము పద్మరాగము మూల్యము 1200 రూపాయలు, ఒకకర్షము పద్మరాగము మూల్యము 6000 రూపాయలు, ఎనిమిది మాసముల పద్మరాగ మూల్యము 500 రూపాయలు. మణుల నాణ్యత హీనతలననుసరించి మూల్యమును నిర్ణయించవలెను. అల్పవర్ణపు పద్మరాగము సగముధర, తేజోహీనమైన పద్మరాగము ధర ఎనిమిదవవంతు, తక్కువ గుణములు అధికదోషము కలిగిన పద్మరాగపు వెల ఇరవైవవంతు, కొంచెము తామ్రవర్ణము,ఎక్కువ రంధ్రములు తక్కువ గుణములున్న పద్మరాగ మూల్యము రెండువందలవ వంతు ఉండును. ఈ విధముగా పూర్వాచార్యులు పద్మరాగ మణిమూల్యమును తెలిపిరి.

ఎనుబది రెండవ పద్మరాగ లక్షణాధ్యాయము సమాప్తము.



83. మరకత లక్షణాధ్యాయము

చిలుక, వెదురు ఆకులు,అరటి,శిరీషపుష్పముతో సమానమైన కాంతి కలిగిన మరకత (పచ్చ)మును దేవతల పితురుల కార్యములలో ధరించిన అధికశుభము కలుగును.

ఎనుబది మూడవ మరకత లక్షణాధ్యాయము సమాప్తము

84. దీప లక్షణాధ్యాయము

దీపశిఖ వామా (పడమర)వర్తముగా తిరిగిన, మలిన కిరణములు కలిగిన, అగ్నికణములు బయటకు వచ్చిన, చిన్న శిఖతోనున్న, నిర్మలమైన వత్తి ఉన్నప్పటికి వెంటనే ఆరిపోయిన, శబ్దము చేసిన, కంపించిన, బెదిరిన కిరణములు కలిగిన, మిడుతలు లేకుండ పడిన, గాలిలేకుండ ఆరిపోయిన దీపము పాపఫలమునిచ్చును.

కలిసియున్న శిఖ కల, పొడవైన ఆకారము కల కంపనరహిత కాంతితో కూడిన శబ్దరహితము ప్రదక్షిణ క్రమములో తిరుగు జ్వాల కలిగిన, వైడూర్యమణి లేక సువర్ణ సమానమైన వెలుగు కలిగిన చాలాకాలము వరకు వెలుగుతున్న దీపము లక్ష్మీ ఆగమనమును సూచించును. మిగిలిన లక్షణములు అగ్ని సమానముగా తెలిసికొనవలెను.

ఎనుబది నాల్గవ దీపలక్షణాధ్యాయము సమాప్తము

85. దంతకాష్ఠ లక్షణాధ్యాయము

తీగలు,లతలు,గుల్మములు (పొదలు) వృక్షముల భేదముతో వెయ్యి విధములుగా దంత కాష్ఠము (ఎన్నుపుల్ల)లుండును. వాటిఫలము తెలుపబడును. అపరిచిత పత్రములతో రెండుపర్వము (కణుపులు)లతో కూడిన,విరిగిన,వృక్షముపై ఎండిన, చర్మములేకుండ ఉన్న దంతకాష్ఠమును పయోగించరాదు.

వైకంకము, కొబ్బరి,కాశ్మరి వృక్షముల పుల్లతో దంత ధావనము చేసిన బ్రాహ్మణ సంబంధ గౌరవము కలుగును. క్షామవృక్షపు పుల్లతో దంత ధవనము చేసిన ఉత్తమస్త్రీ లాభము, వటవృక్షముతో చేసిన ధనవృద్ధి, జిల్లేడుతో దంతధావనము చేసిన అధికతేజము, ఇప్పపుల్లతో చేసిన పుత్రలాభము, అర్జున వృక్షముతో చేసిన జనులకు ప్రియము, లాభము కలుగును.

శిరీష కరంజ వృక్షముల పుల్లతో దంతధావనము చేసిన లక్ష్మీప్రాప్తి, జువ్వి వృక్షముతో దంతధావనము చేసిన అభీష్టసిద్ధి, చమేలివృక్షముతో దంతధావనము చేసిన మానసిక లాభము, రావిచెట్టుతో దంతధావనము చేసిన అధికప్రాధాన్యత కలుగును.

రేగి, ముళ్ల వృక్షములతో దంతధావనము చేసిన ఆరోగ్యము,దీర్ఘాయువు, లాభము, చంద్ర మారేడు వృక్షముల పుల్లతో దంతధావనము చేసిన ఐశ్వర్యవృద్ధి, అతిముక్తక

కదంబ(కడప)వృక్షముతో దంతధావనము చేసిన ఇష్టద్రవ్యలాభము కలుగును. వేప వృక్షముతో దంతధావనము చేసిన ధనలాభము, గన్నేరువృక్షముతో చేసిన అన్నలాభము, భాండీవ వృక్షముతో చేసిన అధిక అన్నలాభము,శమీవృక్షముతో చేసిన శత్రువుల మరణము, అర్జున(మద్ది)వృక్షముతో చేసిన శత్రునాశనము,శ్యామవృక్షముతో దంత ధావనము చేసిన శత్రువుల మరణము కలుగును.

శాల దారు వాసిక వృక్షముల పుల్లతో దంతధావనము చేసిన అధిక గౌరవము కలుగును.ప్రియంగువు (పిప్పలి) అపామార్గము(ఉత్తరేను),నేరేడు దానిమ్మ వృక్షములతో దంతధావనము చేసిన అన్నివిధములైన కోరికలు ఫలించును.

ఉత్తరముఖము లేక పూర్వముఖముతో కూర్చొని శుభమైన కోరికలను మనసులో తలంచి మంచి కర్రతో దంతధావనమైన తర్వాత పవిత్రమైన స్థలములో వదిలిపెట్టవలెను. భోజనము చేసిన దిశలో దంతధావనము పడిన శుభము, నిలబడిన అతిశుభము వెల్లకిల పడిన అశుభము కలుగును. నిలబడి పడిన మృష్టాన్న భోజనలాభము కలుగును.

ఎనుబది ఐదవ దంతకాష్ట లక్షణాధ్యాయము సమాప్తము

86. శకునాధ్యాయము

శుక్రుడు, ఇంద్రుడు, బృహస్పతి, కపిష్ఠలముని, గరుడుడు, భాగురి, దేవలుడు వీరి మతములను చూచి ఋషిభాచార్యుడు తెలిపినది,భారధ్వాజముని మతమును చూచి అవంతి దేశాధీశుడు ద్రవ్యవర్ధనుడు తెలిపినది,సంస్కృత ప్రాకృతభాషలలో సప్త మహర్షులమతము,గర్గాది యాత్రాకారుని మతము,వీటినన్నింటిని చూచి వరాహ మిహురుడు శిష్యులకు ప్రీతికొరకు ఉత్తమజ్ఞాన యుతమైన శకున సంగ్రహమును తెలిపెను.

మనుష్యులు పూర్వజన్మలో చేసిన శుభాశుభకర్మల ఫలితముగా శకునములు కనపడును. గ్రామములో నుండువాడు, వనచర,జలచర,ఆకాశచర,దినచర,రాత్రిచర, ఉభయచర జీవుల శబ్దము గమనము,దృష్టి,పలుకుతో పురుషస్త్రీ నపుంసకములను గ్రహించవలెను. వేరువేరు జాతుల అవస్థల కారణముగా ప్రాణుల వ్యక్తిగత పురుష స్త్రీ, నపుంసక భేదములు స్పష్టముగా తెలియవు. అందువలన ఋషులు ముందు తెలిపిన శ్లోకములలో దీని లక్షణములను తెలిపెను.

లావు ఎత్తు వెడల్పున్న భుజమువాడు, వెడల్పుగానున్న మెడవాడు, సుందరమైన ఛాతికలవాడు, అల్పగంభీరస్వరమువాడు, స్థిరుడు పరాక్రమవంతుడైన జీవి, పురుషసంజ్ఞక శకునమగును. కృశించిన ఛాతి,శిరస్సు, మెడకలవాడు, చిన్నముఖము, కాళ్లు, పరాక్రమము కలవాడు, మధురశబ్దము చేయు జీవి స్త్రీ సంజ్ఞకమగును. స్త్రీపురుషుల మిశ్ర లక్షణముల గల జీవి నపుంసక సంజ్ఞక శకునమగును. గ్రామములో నుండువాడు, వనములో

నుండువాడు, ఉభయచరులైన శకునములను తెలిసికొనవలెను. సంక్షేపముగా యాత్రలో ప్రయోజనము కలిగించు శకునములను తెలిపెదను.

మార్గములో నడుచుచున్నప్పుడు మనుష్యునిపైన, సైన్యములో రాజుపైన, పురములో దేవతపైన, జనసముదాయములో ప్రధానవ్యక్తిపైన, ప్రధానుల సామ్యము(సమానము)లో జాతిపైన, జాతుల సామ్యములో విద్యపైన, విద్యల సామ్యములో వృద్ధులపైన శకునముల ఫలితము పడును. సూర్యోదయమునకు ఒకప్రహర ముందు ఈశాన్యదిశలో ముక్త సంజ్ఞసూర్యుడు, పూర్వదిశలో ప్రాప్తసూర్యుడు, ఆగ్నేయదిశలో ఐశ్వత్ సూర్యుడుండును.

ఒకప్రహర తర్వాత రెండవ ప్రహర జరుగు వరకు పూర్వదిశలో ముక్తిసూర్యుడు, ఆగ్నేయదిశలో ప్రాప్తసూర్యుడు, దక్షిణదిశలో ఐశ్వత్ సూర్యుడుండును. ఇదేవిధముగా మిగిలిన ఆరు ప్రహరలను తెలిసికొనవలెను. ముక్తసూర్యుడు అంగారిణి, ప్రాప్తసూర్యుడు దీప్తము, ఐష్యత్ సూర్యుడు ధూమిని యగును. మిగిలిన ఐదు దిశలు శాంతములగును.

అంగారిణి దిశకు ఐదవదిశలో కనపడు శుభాశుభ శకున ఫలము భూతకాలములో, దీప్తదిశకు ఐదవదిశలో కనపడు శుభశకున ఫలము వర్తమానములో, ధూమిని దిశకు ఐదవదిశలో కనపడు శుభాశుభ శకునముల ఫలము భవిష్యత్ కాలములలో జరుగును. మిగిలిన అంగారిణి నుండి శాంతదిశకు దగ్గర దిశలలో, ధూమిని నుండి శాంతదిశకు దగ్గర దిశలలో జరుగు శుభాశుభ శకునఫలములు క్రమముగా భూత భవిష్యకాలములలో జరుగునని తెలిసికొనవలెను.

సమీపములో పల్లములోనున్న శకునఫలము శీఘ్రముగా, ఎత్తులో దూరముగానున్న శకునఫలము ఆలస్యముగా జరుగును. పెరుగుతున్న స్థానములో చూడబడిన శుభాశుభ శకునఫలము పెరుగును, తగ్గుతున్న స్థానములో కనపడు శుభాశుభ ఫలము తగ్గును. క్షణము(దారుణ ఉగ్రసంజ్ఞక నక్షత్రముల ముహూర్తము)లో కనపడు శకునము క్షణదీప్తమగును. తిథులలో (చతుర్థి,షష్ఠి,అష్టమి, నవమి,చతుర్దశి) కనపడు శకునము తిథి దీప్తమగును. నక్షత్రములలో(మూల,జ్యేష్ఠ,ఆర్ద్ర, ఆశ్లేష, పూర్వాత్రయము, భరణి, మఘ) కనపడు శకునము నక్షత్ర దీప్తమగును. వాత(భయంకర,ఖర,కఠోర,ప్రతిలోమ వాయువు)ములో కనపడు శకునము వాయుదీప్తమగును. సూర్యునికి ఎదురుగా నున్న శకునము సూర్యదీప్తమగును. ఈ ఐదు దీప్తములు యథోత్తర క్రమముతో దీప్తములగును. క్షణదీప్తముతో తిథిదీప్తము,తిథి దీప్తముతో నక్షత్రదీప్తము, నక్షత్ర దీప్తముతో వాయు దీప్తము, వాయుదీప్తముతో సూర్యదీప్తము అధికదీప్త(వెలుగు)మగును. ఇదేవిధముగా గతి, స్థానము,భావము, స్వరము,చేష్ట ఇవి క్రియాదీప్తములు. ఇవికూడ యథోత్తర క్రమముతో దీప్తములగును.

పూర్వము తెలిసిన క్షణాది పదిదీప్తములు శాంతశకునములు. ఈ శకునములలో

తృణము (గడ్డి)ఫలములను భక్షించువారు సౌమ్యశకునము. మాంసము అమేధ్యాది అపవిత్ర పదార్థములను తినువారు రౌద్రము అన్నము తినువారు మిశ్రమమని తెలుపబడెను.

రాజభవనము, దేవమందిరము, మంగళస్థానము,(దేవతా బ్రాహ్మణ గోవులున్న స్థానము), మనోజ్ఞము(పచ్చనిగడ్డి శీతల వృక్షముఛాయ) మధురఫలము, పాలు, పుష్పములు కలిగిన వృక్షములు శుభశకునముల నిచ్చును. పగలు దినచర శకునము పర్వతముపై రాత్రియందు రాత్రిచరుల శకునము జలప్రదేశములో కలిగిన బలవంతుడగును. నపుంసకుని కన్న స్త్రీ, స్త్రీకన్న పురుషజాతి శకునము బలమైనదగును.

రెండు శకునముల దర్శనము కలిగిన గతి,జాతి,బలము స్థానము,హర్షము, సత్వము, స్వరము, వీటిలో ఏది బలమైనదో దానిననుసరించి శుభాశుభ ఫలము కలుగును. తమస్థానములో అనులోమ (ఆరోహనము, ఎక్కుట)గతిలో నున్న శకునము బలమైన దగును. దానికి వ్యతిరేకమైన బలహీనమగును.

కోడి,ఏనుగు, పిరిలి (పక్షి విశేషము) మయూరము,వంజులము, (పక్షి విశేషము) ఛిక్కరము (మృగజాతి)సింహనాదము(పక్షి విశేషము),కరాయికములు పూర్వదిశలో బలమైనవి. నక్క,గుడ్లగూబ,చిలుక, కాకి, చక్రవాకము,ఎలుగుబంటి, పింగల (పక్షి విశేషము) పావురము మున్నగునవి ఏడ్చిన, అరచిన, కఠోరశబ్దము చేసిన దక్షిణదిశలో బలమైన వగును. ఆవు,కుందేలు,క్రౌంచపక్షి,గౌర్రె,హంస,కపింజలపక్షి,పిల్లి మున్నగునవి పశ్చిమదిశలో బలమైనవి. శతపత్రము (పక్షివిశేషము)లేడి, ఎలుక, మృగము, (జింక) అశ్వము, గాడిద, కోయిల, నీలకంఠము, కలుగులలో నివసించు ప్రాణులు, పుణ్యాహవచన ధ్వని, ఘంట శంఖము ఇవి దక్షిణదిశలో బలమైనవగును.

అరణ్యములో గ్రామశకునములు, గ్రామములో అరణ్యశకునములు, రాత్రిలో పగటిశకునములు,పగటియందు రాత్రి శకునములు కలుగుట మంచిది కాదు. స్త్రీ పురుషుల జంట, రోగపీడితుడు,భయపడువాడు, కలహకారకుడు, మాంసము తినువాడు, నదికి అవతల ఒడ్డున ఉన్నవాడు. ఋతుకాలవశమున మత్తురాలైన స్త్రీ శకునములు మంచివికావు. రోహితమృగము,అశ్వము,మేక,గాడిద,కురంగము(మృగజాతి)కుందేలు,శకునములు శిశిరకాలములో,కాకి,కోకిలశకునములు వసంతకాలములో నిష్ఫలములగును.

భాద్రపద మాసములో పంది, కుక్క, తోడేలు, కలుగులో నుండు జంతువులు, శరత్కాలములో నీటిలోనుత్పన్నమగు పక్షులు కొంగమున్నగునవి. ఆవు,క్రౌంచపక్షి, శ్రావణమాసములో ఏనుగు,చాతకపక్షుల శకునము మంచిదికాదు. హేమంత ఋతువులో పులి,ఎలుగుబంటి,కోతి,చిరుతపులి,దున్నపోతు, సర్పము,మనుష్యుడు మున్నగు శకునములు నిష్ఫలమగును. పూర్వఆగ్నేయ కోణముల మధ్యప్రదేశపు త్రిభాగములో ప్రదక్షిణ క్రమములో కోశాధ్యక్షుడు,అగ్నిజీవి,తపస్వి,ముగ్గురు ఉందురని తెలిపిరి.

దక్షిణ అగ్నికోణముల మధ్యప్రదేశపు త్రిభాగములో క్రమముగా కార్మికుడు, భిక్షకుడు, నగ్నస్త్రీ ఈ ముగ్గురుందురు. దక్షణ నైర్పతికోణముల మధ్య ప్రదేశపు త్రిభాగములో క్రమముగా ఏనుగు, గోపాలకుడు ధార్మికులుందురు.

పశ్చిమ నైర్పరతికోణముల మధ్యలో త్రిభాగములో క్రమముగా స్త్రీ, బాలింతస్త్రీ, దొంగ ఈముగ్గరుందురు. వాయవ్య పశ్చిమదిశల మధ్యలో త్రిభాగములో శౌండికుడు (మద్యమునమ్మేవాడు) పక్షిని చంపువాడు, హింసను చేయువాడు, ఈ ముగ్గరుందురు. వాయవ్య ఉత్తరకోణముల మధ్యనున్న త్రిభాగములో క్రమముగా విషమును నశింప జేయువాడు. గోస్వామి (ఇతర రాజుకొడుకు) ఇంద్రజాలికులుందురు. ఉత్తర ఈశాన్య కోణముల మధ్యప్రదేశమునకు త్రిభాగములో ధనవంతుడు దైవజ్ఞుడు, మాలాకారు డుందురు. ఈశాన్య పూర్వదిశల త్రిభాగములో క్రమముగా వైష్ణవుడు, చరకుడు (భౌద్ధ భిక్షువు), వాజినుడు (అశ్వరక్షకుడు) ఉందురు. ఈ విధముగా ఎనిమిది దిశలలో ఇరువది నాలుగు భేదములుండును.

పూర్వాది ఎనిమిది దిశలలో ప్రదక్షిణ క్రమముగా రాజు,కుమారుడు, సేనాపతి, దూత, వైశ్యుడు,గుప్తచరుడు,బ్రాహ్మణుడు,గజాధ్యక్షుడు ఉందురు.పూర్వాది నాలుగు దిశలలో క్షత్రయా (క్షత్రియ,వైశ్య శూద్ర బ్రాహ్మణ) దులు నలుగురు అధిపతులగుదురు.

యాత్రచేయునపుడు ఒకస్థానములోనున్న పురుషుడు ఏదిశలో నుండి శకున శబ్దము చేయునో ఆదిశలోనున్న ప్రాణితో సమాగమము తెలుపవలెను. పూర్వ ఆగ్నేయ కోణములలో ప్రథమ త్రిభాగములో శకునమైన కోశాధ్యక్షుడు,ద్వితీయములో నైన అగ్నిజీవి, త్రిభాగములోనైన తపస్వి వీరితో సమాగమము కలుగునని తెలుపవలెను.

విషమము, భయంకరము, దీనము, జర్జరము (పగిలినది) ఈ శబ్దములు శుభమునీయవు. పూర్వాభిముఖముమై మధుర స్వరముతో సంతోషముతో చేయు శబ్దములు శుభమునిచ్చును.నక్కపోతకి (నల్లపిచ్చుక)కలహ కారిక,చుంచెలుక, పింగల పక్షి, బల్లి, పంది, కోకిల, పురుష సంజ్ఞక జంతువులు. నడిచేవానికి ఎడమవైపున నున్న శుభమును కలిగించును. భాసపక్షి, భషకము, కోతి,శ్రీకర్ణపక్షి, ధిక్కరము (మృగజాతి), గద్ద స్త్రీ సంజ్ఞక జంతువులు నడిచేవానికి కుడివైపున నున్న శుభము కలుగును.

ముఖశబ్దము, హస్తముల శబ్దము పుణ్యాహవచనముల ధ్వని, శంఖము, జల, తూర్యనాదముల ధ్వని, వేదధ్వని,ఇవన్ని పురుషుని వామభాగమున కలిగిన శుభము కలుగును. అన్యమాంగలిక ధ్వనులు, స్త్రీలవలె దక్షిణవైపున కలిగిన శుభకారకమగును.

యాత్రలో మధ్యమ,షడ్జ, గాంధార స్వరములు శుభము, షడ్జ మధ్యమ, గాంధార ఋషభస్వరములు హితమును కలిగించును.భారద్వాజ పక్షి,మేక,నెమలి,శబ్దము, నామకీర్తనము చూచిన ధన్యమగును. ముంగిస,నీలకంఠము, ఊసరవెల్లి ఇవి మూడు

యాత్రాసమయములో ముందు కనపడిన శుభము కలుగును. విషమసంఖ్యలో(1, 3, 5,7, ఆది)మృగము, ముంగిస, అండజ ప్రాణులు, వామపార్శ్వము (ఎడమవైపు) నుండి ముందుకి వచ్చి కుడివైపుకి వచ్చిన, ముంగిసతో పాటు చాషపక్షి ప్రక్కనుండి ఎడమవైపుకి వచ్చిన శుభము కలుగును. భృగుముని మతముననుసరించి ఇవన్ని అపరాహ్ణ (సాయంకాలము)లో శుభమునిచ్చును. పూర్వాహ్ణములో (ఉదయము) శుభమునీయవు.

పగలు నక్క, కరాయిక, పిరిలి (పక్షి విశేషము) దక్షిణభాగములో శుభమునిచ్చును. పంది, కన్నములో నుండు జంతువులు,ఎడమభాగములో శుభమునిచ్చును. పూర్వదిశలో గుర్రము, తెల్లనివస్తువులు, దక్షిణములో శవము, మాంసము, పశ్చిమములో కన్య, పెరుగు,ఉత్తరములో ఆవు, బ్రాహ్మణుడు, సజ్జన పురుషుడు, శుభదాయకమగును. పూర్వ దిశలో వలను తీసికొని వెళ్లువాడు, కుక్కతో వెళ్లువాడు, దక్షిణములో శస్త్రముతో భాధించు వాడు, పశ్చిమములో మద్యము నపుంసకుడు, ఉత్తరములో ఆసనము (మంచము) నాగలి అశుభమును కలిగించును.

కర్మసాధనము, మైథునము, యుద్ధము, గృహప్రవేశము, నష్టద్రవ్యము, అన్వేషణము, యాత్రలలో పూర్వోక్త శకునముల కన్న వ్యతిరేక శకునములు శుభమునిచ్చును. యాత్రలో దక్షిణములో శుభముకానివి ఇక్కడ వామభాగములో శుభము. యాత్రలో వామభాగములో శుభమైనవి ఇక్కడ దక్షిణములో,యాత్రలో ఏవి ముందుభాగమున శుభమో అవిఇక్కడ వెనుకభాగములో, వెనుక భాగములో శుభమైనవి ఇక్కడ ముందు భాగములో,పూర్వభాగములో శుభమైనవి పశ్చిమములో, పశ్చిమములో శుభమైనవి పూర్వ భాగములో,దక్షిణములో శుభమైనవి ఉత్తరభాగములో,ఉత్తరభాగములో శుభమైనవి దక్షిణ భాగములో శుభమునిచ్చును.

పగలు పూర్వోక్త కర్మాదులు చేయవలసినచో అక్కడ లేడి, రురువు (మృగజాతి) కోతి, శకునము శుభమునిచ్చును. ఉదయకాలములో నీలకంఠము, వంజులము, కోడి, సాయంకాలములో నప్తృకము,గుడ్లగూబ,పింగలములను యాత్రలో వలననే గ్రహించ వలెను. కానిస్త్రీల కొరకు ముందు తెల్పిన శకునముల ఫలములనువ్యతిరేకముగా గ్రహించ వలెను. యాత్రలో వామ దక్షిణములలో కలుగు ఈ శకునములు శుభమునిచ్చును. అవి రాజదర్శనము, గృహప్రవేశాదులు, పర్వత ప్రవేశము, వనప్రవేశము, నదిని దాటునపుడు క్రమముగా ముందు వెనుకలందు శుభమునిచ్చును. యాత్రలో వామభాగములో శు భమైనవి. ఇక్కడ ముందుభాగమున, యాత్రలో దక్షిణభాగమున శుభమైనవి. ఇక్కడ వెనుకభాగములో శుభమునిచ్చును.

యాత్రాసమయములో దీప్తమైన(స్థాన భావస్వర చేష్టలు) రెండువైపుల శకునములు కనపడిన పరిఘ సంజ్ఞకమగును. పరిఘ సంజ్ఞక శకునము జరుగునపుడు ప్రయాణము

చేసిన నాశనము పొందును. కాని రెండు వైపుల (దక్షిణభాగములో నున్నవి దక్షిణములో, వామభాగములో నున్నవి వామభాగములో) శకునములుండి శాంతి పూర్వకముగా శబ్దము చేసిన శకునద్వార సంజ్ఞకములగును. దీనిలో ప్రయాణము చేసిన కోరిన కోరికలు సిద్ధించును.

కొందరి మతముననుసరించి ఒకేజాతివి శాంత చేష్టలతో శబ్దము చేయునవి, రెండువైపుల నున్న శకునములు ద్వారసంజ్ఞక శకునములగును. యాత్రా సమయములో ఒక శకునము యాత్ర చేయుటకాజ్ఞనిచ్చి రెండవది నిషేధించిన అది విరోధ సంజ్ఞక అశుభఫలము నిచ్చునదగును. లేనియెడల ఆరెండింటిలో ఏది బలమైనదో దానిని గ్రహించవలెను.

యాత్రాకాలములో మొదట ప్రవేశకాలిక శకునమై తర్వాత యాత్రాకాలిక శకునమైన సుఖముగా కార్యము సిద్ధించును. గృహప్రవేశాది కాలములో దీనికి వ్యతిరేకముగా జరిగిన (ముందు యాత్రా కాలిక శకునము తర్వాత ప్రవేశకాలిక శకునము) సుఖ పూర్వకముగా కార్యము సిద్ధించును. శకునము ముందు శుభచేష్టను చేసి తర్వాత యాత్రను నిషేధించిన, ప్రయాణము చేయువానికి శత్రువు ద్వార మృత్యువు, శస్త్రకలహము రోగ సూచన కలుగును. దీప్తదిశలో నుండి ఎడమవైపు శకునమున్న భయమును సూచించును. కార్యమునకు ప్రారంభములోనే శకునము కనపడిన ఒకసంవత్సరము వరకు కార్యములో భయము కలుగును.

తిథి, వాయువు, నక్షత్రము, సూర్యుడు, స్థానము, చేష్ట దీప్తమైన క్రమముగా ధనము, సైన్యము, బలము, అంగము, ఇష్టము, కర్మలకు భయము కలుగును. మేఘధ్వని వలన కలుగు దీప్తశకునము వలన వాయుభయము, రెండు సంధ్యలలో దీప్తశకునము శస్త్రభయమును కలిగించును. శకునము చితి,కేశములు,కపాలములపై కూర్చొనిన క్రమముగా మృత్యువు బంధనము, వధను కలిగించును. ముళ్లవృక్షములు,కాష్ఠము భస్మముపై కూర్చొనిన క్రమముగా కలహము, ఉపద్రవము, దు:ఖము కలుగును. శకునము నిస్సార వస్తువుపై కూర్చొనిన కార్యమునకు సిద్ధి(జరుగక పోవడము) రాతిపై కూర్చొనిన భయము కలుగును. ఇవన్ని దీప్తశకునములకు ఫలము. శాంత శకునము తక్కువ అశుభ ఫలము నిచ్చును.

మలవిసర్జన చేయువాడు, భోజనము చేయువాడు, శకున క్రమముతో కార్యమునకు అసిద్ధిని, సిద్ధిని కలిగించును. శబ్దము చేయుచు శకునము తనస్థానము నుండి బయటకు వెళ్ళిన, తిరిగి తనస్థానమునకు వచ్చి కూర్చొనిన, ఎవరైన ఒకరు వచ్చునని సూచించును. స్వరదీప్త శకునము వలన కలహము, స్థానదీప్తములో విరోధము కలుగును. ముందు గట్టిగా శబ్దము చేసి తర్వాత తక్కువచేసిన దోషము చేసినవాడగును.

ఒకస్థానములో నున్న శకునము దీప్తమై ఏడురోజుల వరకు శబ్దము చేయుచున్న గ్రామమునకు నాశము, రెండు నెలల వరకు శబ్దము చేసిన పురమునకు నాశనము, మూడుమాసములు శబ్దము చేసిన దేశమునకు నాశము, ఒకవర్షము వరకు శబ్దము చేసిన రాజుకు నాశనము కలుగును. సర్పము,ఎలుక పిల్లి,మత్స్యము ఇవికాక వేరే శకునములు తమజాతి జంతువుల మాంసభక్షణము చేసిన దుర్భిక్షము కలుగును.

కంచరగాడిదలుత్పన్నమైన (గుర్రముతో గాడిద మైథునము చేసిన ఖచ్చరములు (కంచరగాడిద) త్పన్నమగును) మనుష్యులను వదలి మిగిలిన శకునములు అన్యజాతితో మైథునము చేసిన దేశము నాశనమగును. పాదము, తొడ, శిరస్సుకి దగ్గరగా శకునము వెళ్ళిన క్రమముగా బంధనము, ఘాతము, భయము కలుగును. గడ్డిని తింటు శకునము కనపడిన దోషమును, జలమును త్రాగుతు కనిపించిన వర్షము, మాంసము తినుచు కనిపించిన అంగములకు నష్టము, అన్నము తినుచు కనిపించిన బంధు సమాగమము కలుగును.

దీప్తదిశలో నున్న శకునము క్రూరునితో కూడిన ఇతర పురుషుని ఆగమనము ధూమిత దిశలోనున్న శకునము దండముతో ఇతర పురుషుని ఆగమనము, శాంతదిశలో నున్న శకునము దోషయుక్త పురుషునితో ఇతర పురుషుని ఆగమనము తర్వాత దుష్టపురుషుదు తో, తర్వాత ప్రధాన పురుషునితో, తర్వాత రాజుతో తర్వాత శ్రావకునితో, తర్వాత అంగారిత దిశలో నున్న శకునము ఆలస్యముగా ఇతర పురుషుని ఆగమనమును సూచించును.

భక్ష్యపదార్థములతో కూడి బలమైన శకునములు కనపడిన ఆ దినము ద్రవ్యలాభము కలుగును. దీప్తయుతమైన అధోముఖ దృష్టి కలిగిన శుభశకునము కనపడిన భయానకవృత్తాంతమును సూచించును. విదిక్కులోనున్న దీప్తశకునము వామభాగములోనున్న అన్య శకునము ద్వారా శబ్దము చేసిన ఆదిశలో చెప్పబడు పురుషుని వలన స్త్రీకి సంయోగము సూచితమగును. శాంతశకునము తననుండి ఐదవ దీప్తదిశలో నున్న దీప్త శకునము ద్వారా శబ్దాయమానమైన ఆదిశలో నున్న పురుషుని ఆగమనము జరుగును. దానికి వ్యతిరేకముగా (దీప్తశకునము తమ నుండి ఐదవ శాంతదిశలో శాంతశకునము ద్వారా ధ్వనిచేసిన)నైన దోషమును కలిగించును.

మధ్యలో నున్న శకునము ఎడమప్రక్క శకునము ద్వారా శబ్దాయమానమైన ఆత్మీయుల వలన, దక్షిణప్రక్కనున్న శకునము ద్వారా శబ్దాయమానమైన శత్రువుల వలన భయము కలుగును. అందరు సమకాలములో సమానముగా శబ్దము చేసిన మరణము కలుగును. వృక్షాగ్రముపై శకునము కూర్చొనిన గజారూఢైన మనుష్యుని, వృక్షమునకు మధ్యభాగములో శకునమున్న అశ్వారూఢ మనుష్యుని, వృక్ష మూలములో శకునము కూర్చొనిన రథారూఢుడైన మనుష్యుని లేక పల్లకిపై కూర్చొనిన మనుష్యుని

ఆగమనమును సూచించును.

పర్వతాదులపై శకునము కూర్చొనిన శకటారూఢ మనుష్యుని, ఛాయలో శకునమున్న ఛత్రముతో కూడిన మనుష్యుని సూచించును. పూర్వాది దిశలలో ఆగ్నేయాది విదిశలలో పూర్వోక్త శకునములు కూర్చొనిన క్రమముగా ఒకటి, మూడు, ఐదు, ఏడు రోజులలో శుభా శుభఫలములు కలుగును. అనగా పూర్వదిశలో శకునము కూర్చొనిన ఒకరోజులో, దక్షిణమున మూడు రోజులలో, పశ్చిమమున ఐదు రోజులలో, ఉత్తరమున ఏడురోజులలో శుభాశుభఫలము కలుగును. ఆగ్నేయకోణములో శకునము కూర్చొనిన ఒకదినములో, నైరృతిలో కూర్చొనిని మూడు దినములలో, వాయవ్యములో కూర్చొనిన ఐదు దినములలో, ఈశాన్యమున శకునము కూర్చొనిన ఏడు దినములలో శుభాశుభ ఫలము కలుగును.

ఇంద్ర, అగ్ని, యమ, రాక్షస, వరుణ, వాయు, చంద్ర, శివ వీరు పూర్వాది ఎనిమిది దిశలకు స్వాములగుదురు. వాటిలో పూర్వదిశలు పురుషసంజ్ఞకములు, ఆగ్నేయాది విదిశలు స్త్రీ సంజ్ఞకములు, పూర్వదిశలో శకునమైన వృక్షపు చర్మము లేక పత్రముపై, ఆగ్నేయ కోణములో శకునమైన తాళవృక్ష పత్రముపై, దక్షిణదిశలో శకునమైన ఖండిత పత్రముపై, నైరృతికోణములో శకునమైన వస్త్రముపై, పశ్చిమదిశలో శకునమైన కమలపత్రముపై, వాయవ్యకోణములో శకునమైన కాండముపై, ఉత్తరదిశలో శకునమైన చర్మముపై, ఈశాన్యకోణముపై శకునమైన పలకపై వ్రాసిన లేఖప్రాప్తమగును.

పూర్వదిశలో ఇష్టశకున ఫలము యుద్ధములో, ఆగ్నేయదిశలో ఇష్టశకునఫలము సమీపములో,దక్షిణములో శకునఫలము శబ్దయుతమై ఏదైనదేశములో, నైరృతిలో శకున ఫలము కలహస్థానములో, పశ్చిమములో శకునఫలము జలస్థానములో, వాయవ్యములో శకునఫలము బంధనాది ప్రదేశములో, ఉత్తరదిశలో శకునఫలము వేదధ్వని స్థానములో, ఈశాన్యకోణములో ఇష్టశకునఫలము ఆవులశబ్దములతో కూడిన స్థానములో ప్రాప్తించును. పూర్వదిశలో ఎరుపు, దక్షిణములో పసుపు, పశ్చిమములో నలుపు, ఉత్తరములో తెలుపు వర్ణమును తెలిసికొనవలెను. విదిశలలో మిశ్రితవర్ణముండును. ఆగ్నేయము రక్తపీతము, నైరృతిలో పీతకృష్ణము,వాయవ్యములో కృష్ణసితము,ఈశాన్యములో సితరక్త వర్ణము లుండునని తెలిసికొనవలెను.

పూర్వదిశలో శకునమైన ధ్వజ చిహ్నము విశిష్టస్థానములో ఆగ్నేయకోణములోనైన అగ్ని దగ్ధస్థానములో,దక్షిణములోనైన శ్మశానములో,నైరృతిలోనైన గృహములో, పశ్చిమము లోనైన జలస్థానములో,వాయవ్యములో నైన పర్వతముపై, ఉత్తరములోనైన యజ్ఞ స్థానములో, ఈశాన్యలోనైన గుహలో సంయోగము భయము కలుగును. అనగా శుభ శకునములో సంయోగము అశుభశకునములో భయము కలుగును.

పూర్వదిశలోవృద్ధురాలు,ఆగ్నేయకోణములోకుమారి,దక్షిణములో అంగహీనురాలు, నైరృతిలో దుర్గంధముతో కూడినది, పశ్చిమములో వస్త్రము ధరించినది, వాయవ్యములో నిందచేయునది, ఉత్తరములో పొడవైనది, ఈశాన్యములో కులట స్త్రీ యుండును.విదిశలు స్త్రీ సంజ్ఞకములు. అందువలన ఒక ఆచార్యుడు ఈశాన్య కోణములో పొడవైన కుమారి, ఆగ్నేయకోణములో అంగహీనురాలు,దుర్గంధవతి, నైరృతి కోణములో నీలవస్త్రము ధరించినది,నిందవేయునది,వాయవ్యకోణములో పెద్దవిధవస్త్రీ ఉండునని అర్థము తెలిపెను.

ప్రశ్నకాలములో శకునము లేక ప్రశ్నకర్త పూర్వదిశలో నున్న రజతము, ఆగ్నేయ కోణములో బంగారము, దక్షిణములో పీడితము, నైరృతిలో స్త్రీ,పశ్చిమములో మేక, వాయవ్యములో ప్రయాణసాధనము,ఉత్తరములో యజ్ఞము, ఈశాన్యకోణములో శకునము లేక ప్రశ్నకర్త ఉన్న గోకుల సంబంధమైన ప్రశ్నను తెలుపవలెను. పూర్వదిశలో వటవృక్షము, ఆగ్నేయకోణములో రక్తతరు వృక్షము, దక్షిణములో లోధ్రకము (ఔషధ వృక్ష విశేషము), నైరృతిలో ఛిద్రమైన వెదురు, పశ్చిమములో మామిడివృక్షము, వాయవ్యములో ఖదిరి వృక్షము, ఉత్తరములో మారేడు, ఈశాన్యములో మద్ది వృక్ష ముండును. పూర్వాది దిశలలో శుభ శకునమున్న పూర్వోక్త స్థానములలో రజితాది లాభము, అశుభ శకునములున్న హాని కలుగును.

ఎనుబది ఆరవ శకునాధ్యాయము సమాప్తము

87. అంతర చక్రాధ్యాయము

పూర్వదిశలో శకునము అరిచిన రాజును ఆశ్రయించిన పురుషుని ఆగమనము, పూజాలాభార్థము మణులు రత్నములప్రాప్తిని సూచించును. ఆశకునము శుభమైన శుభమును,మధ్యమమైన మధ్యమఫలము, కొంచెము అశుభమైన అశుభఫలము కలుగును. పూర్వదిశ తర్వాత ప్రదక్షిణ క్రమములో ద్వితీయభాగములో నున్న శకునము అరిచిన బంగారము ప్రాప్తించును. అభీష్టఫలము కలుగును. తృతీయభాగములో నున్న శకునము అరిచిన శాస్త్ర,ధన,పోకచెక్కలు ప్రాప్తించును. చతుర్థభాగములో నున్న శకునము అరిచిన పవిత్రబ్రాహ్మణుడు అతిహోత్ర,దర్శనమగును.

ఆగ్నేయ కోణములో నున్న శకునము అరిచిన సువర్ణము లోహము ప్రాప్తించును. భిక్షకుని దర్శనమగును.దక్షిణదిశలో ప్రథమభాగములోనున్న శకునము అరిచిన రాజకుమారుని దర్శనము,కార్యసిద్ధి, కోరిన కోరిక ఫలించును.ద్వితీయభాగములో నున్న శకునము అరిచిన స్త్రీ మరియు ధర్మప్రాప్తి ఆవాలు,యవధాన్యము ప్రాప్తించును. ఆగ్నేయకోణములో చతుర్థభాగములో నున్న శకునము అరిచిన ముందుపోయిన వస్తువులు

లభించును. గమనము చేయువాడు, గమనకాలములో దొరికే ఫలము ఏదోవిధముగా ప్రాప్తించును.

దక్షిణభాగములో నున్న శకునము అరిచిన యాత్రాసిద్ధి,నెమలి,ఎద్దు,కోడి ప్రాప్తించును. దక్షిణభాగము నుండి ద్వితీయభాగములో నున్న శకునము అరిచిన చరణుల (నట,నర్తకులు)తో సంయోగము శుభకార్యము ధర్మాదుల ప్రాప్తి కలుగును. తృతీయ భాగములో నున్న శకునము అరిచిన కార్యసిద్ధి కైవర్త(చేపలు పట్టటము) సంయోగము, చేపలు తిత్తిరిపక్షి ప్రాప్తించును. చతుర్థభాగములో నున్న శకునము అరిచిన సన్యాస దర్శనము పక్వాన్నము, ఫలలాభము కలుగును.

నైరృతి కోణములో నున్న శకునము అరిచిన స్త్రీ, భూషణము,దూత, వ్రాసిన వస్తువులు లభించును. నైరృతికోణములో ద్వితీయభాగములో నున్న శకునము అరిచిన చర్మ శిల్పదర్శనము,చర్మము,తయారుచేయు కుండలు మున్నగునవి లభించును. నైరృతి కోణములో మూడవభాగములో నున్న శకునము అరిచిన కోతి, భిక్షకులు, బౌద్ధుడు సన్యాసుల దర్శనమగును. నైరృతికోణములో చతుర్థభాగములో నున్న శకునము అరిచిన ఫలపుష్పములు, దంతముతో తయారైన వస్తువులు ప్రాప్తించును.

పశ్చిమదిశలో నున్న శకునము అరిచిన సముద్రములో నుత్పన్నమగు రత్నములు, వైదూర్యమణులు, రత్నములతో తయారైన భాండములు దొరుకును. పశ్చిమదిశలో ద్వితీయ భాగములో నున్న శకునము అరిచిన భిల్లులు, వ్యాధులు, దొంగలతో మైత్రి, మాంస లాభము కలుగును. పశ్చిమదిశలో తృతీయభాగములోనున్న శకునము అరిచిన రోగుల దర్శనము, చందనము, అగరులు ప్రాప్తించును. పశ్చిమదిశలో చతుర్థభాగములో నున్న శకునము అరిచిన శాస్త్రములు, పుస్తకములు ప్రాప్తించును. ఈ వస్తువులను అమ్మువారితో పరిచయమేర్పడును.

వాయవ్యకోణములో నున్న శకునము అరిచిన సముద్రపు నురుగు, చామర మృగము, ఉన్నివస్త్రము ప్రాప్తించును. కాయస్థజాతి మనుష్యునితో పరిచయ మేర్పడును. వాయవ్యకోణములో నున్న రెండవశకునము అరిచిన మట్టికుండలభించును. నగ్నా చార్యునితో సంయోగము మృదంగాది వాద్య విశేషముల లాభము కలుగును. వాయవ్య కోణములో తృతీయభాగములో నున్న శకునము అరిచిన మిత్రులతో సమాగమము, ధనప్రాప్తి కలుగును. వాయవ్యకోణములో చతుర్థభాగములో నున్న శకునము అరిచిన వస్త్రములు, గుర్రముల ప్రాప్తి, ప్రియమిత్ర జనులతో సమాగమము కలుగును.

ఉత్తరదిశలో నున్న శకునము అరిచిన పెరుగు, బియ్యము, పేలాలు లభించును. బ్రాహ్మణుల దర్శనమగును. ఉత్తరదిశలో రెండవభాగములో నున్న శకునము అరిచిన ధనప్రాప్తి, వైశ్యునితో సమాగమము కలుగును. ఉత్తరదిశలో మూడవభాగములో నున్న

శకునము అరిచిన వేశ్య, బ్రాహ్మణ, భృత్యులతో సమాగమము, తెల్లని పూలలాభము కలుగును. ఉత్తరదిశలో నాల్గవభాగములో నున్న శకునము అరిచిన చిత్రకార దర్శనము, చిత్రవస్తువుల లాభము కలుగును.

ఈశాన్యకోణములో నున్న శకునము అరిచిన పూజారులతో సమాగమము, ధాన్యము,రత్నములు,పశువుల లాభము కలుగును. ఈశాన్యకోణములోద్వితీయ భాగము లో నున్న శకునము అరిచిన వస్త్రప్రాప్తి, వేశ్యాసమాగమము కలుగును. ఈశాన్యకోణములో తృతీయభాగములో నున్న శకునము అరిచిన చాకలివానితో సమాగమము, ద్రవ్యలాభము కలుగును. ఈశాన్యకోణములో నాల్గవభాగములో నున్న శకునము అరిచిన ఏనుగులతో జీవించు వానితో సమాగమము, ధనము ఏనుగుల లాభము కలుగును.

దిక్చక్రములో చివర ముప్పది రెండుభాగములలో నున్న శకునముల ఫలితము తెలుపబడినది. ఇప్పుడు చక్రములో మధ్యభాగములో నున్న శకునముల ద్వార కలుగు ఫలితము తెలుపబడును. నాభిస్థానములో నున్న శకునము వలన బంధు మిత్రులతో సమాగమము కలుగును. ఉత్తమతుష్టి లాభము కలుగును. పూర్వభాగములో నున్న ఆరలో శకునమైన ఎరుపువస్త్ర లాభము రాజుతో సమాగమము కలుగును.

ఆగ్నేయకోణములో నున్న ఆరలో శకునమైన సాలెవాడు, వంద్రంగి కార్మికుడు, గణికుడు, గుర్రము, సూతులతో సమాగమము, వీరు చేయు వస్తువుల లాభము, గుర్రముల లాభము కలుగును. చక్రము నేమిభాగము, నాభిభాగములకు దక్షిణారలో శకునమైన ధార్మిక మనుష్యులతో సమాగమము ధర్మలాభము కలుగును.

నైరృతికోణములో ఆరలో శకునమున్న ఆవు, ఆటలాడువాడు, కాపాలికులతో సమాగమము, ఎద్దుల లాభము, మినుములు ఉలవలు మున్నగువాటితో భోజన లాభము కలుగును. పశ్చిమదిశలోనున్న ఆరలో శకునమున్నరైతులతో సమాగమము సముద్రములో నుత్పన్నమగు ద్రవ్యములు, మణివిశేషములు, ఫలములు మద్యలాభములు కలుగును. వాయవ్యకోణములో ఆరలో శకునమున్న బరువు మోసేవారు,వడ్రంగి,భిక్షకుల దర్శనము, తిలకము, నాగము, పున్నాగము, పూలలాభము కలుగును.

ఉత్తరదిశలో ఆరలో శకునమున్న ధనలాభము,వైష్ణవ, బ్రాహ్మణ పచ్చని వస్త్రము లతో సమాగమము కలుగును. ఈశాన్యకోణములో నున్న ఆరలో శకునమున్న వ్రతముచేయు స్త్రీ దర్శనము, నల్లని లోహము, శస్త్రము, ఘంటల లాభము కలుగును.

ప్రదక్షిణ క్రమములో దక్షిణములో ఎనిమిదవ,పశ్చిమములో పదవ,ఆరవ, మూడవ,ఏడవ,ఎనిమిదవ,ఉత్తరములో రెండవ అష్టమాంశములలో శాంత శకునమైన మధ్యమఫలము కలుగు యాత్రజరుగును. మిగిలిన ఇరువది ఐదు అష్టమాంశములలో శుభఫలము నిచ్చు యాత్రజరుగును. నాభిమధ్యలో వాయవ్య నైరృతులను వదలి మిగిలిన

ఆరు ఆరలలో శకునమైన శుభఫలము నిచ్చును. వాయువ్య నైరృతికోణములలో ఆరలలో నున్న శకునము కష్టముతో కూడిన యాత్రను కలిగించును.

శాంతదిశలలో కలుగు ఫలములు ముందు తెలుపబడినవి. ఇప్పుడు దీప్తదిశల లోని ఫలము తెలుపబడును. పూర్వదిశలో శకునమున్న రాజుకు భయము, శత్రువులతో సమాగమము కలుగును. పూర్వదిశలో ద్వితీయభాగములో శకునమైన బంగారము నాశము, కంసాలికి భయము కలుగును. పూర్వదిశలో మూడవభాగములో శకునమైన ధననాశము, కలహము,శస్త్ర ప్రకోపము కలుగును. పూర్వదిశలో చతుర్థభాగములో (అగ్నికోణము) శకునమైన అగ్ని, దొంగలవలన భయము కలుగును.

ఆగ్నేయకోణములో ద్వితీయభాగములో దీప్త శకునమైన ధనక్షయము, రాజుల పుత్రుల నాశనము కలుగును. ఆగ్నేయకోణములో తృతీయభాగములో దీప్తశకునమైన గర్భనాశము కలుగును. ఆగ్నేయకోణములో చతుర్థభాగములో దీప్తశకునమైన కంసాలి, చిత్రకారుడు నాశనమగును. శస్త్రకోపము కలుగును. ఆగ్నేయకోణములో పంచమ భాగములో దీప్తశకునమైన భయము, మారకము, మృతపురుషుల దర్శనము కలుగును.

ఆగ్నేయకోణములో ఆరవభాగములో దీప్తశకునమైన డోంబ (వాద్యకారులు) గంధర్వుల వలన భయము కలుగును. ఆగ్నేయకోణములో సప్తమభాగములో దీప్తశకునమైన ధీవరులు, పక్షులు,చంపువారి వలన భయము కలుగును. ఆగ్నేయకోణములో అష్టమ భాగములో దీప్త శకునమైన భోజననాశము, నగ్నసన్యాసి భయము కలుగును.

నైరృతికోణములో దీప్తశకునమైన రక్తస్రావము, అగ్నిప్రకోపము, పశ్చిమదిశలో ప్రథమభాగములో దీప్త శకునమైన చర్మపు చెప్పులు, వస్త్రాదుల నాశనము, చర్మకారుల వలన భయము కలుగును. పశ్చిమదిశలో ద్వితీయభాగములో దీప్తశకునమైన తాపసులు, బౌద్ధులు, సన్యాసుల భయము కలుగును. తృతీయభాగములో శకునమైన ఉపవాసభయము, సరైన పశ్చిమదిశలో నున్న వర్షభయము ఐదవభాగములో దీప్త శకునమైన కుక్క, దొంగల వలన భయము కలుగును. పశ్చిమదిశలో ఆరవభాగములో దీప్తశకునమైన వాతరోగుల నాశము, సప్తమభాగములోనైన శస్త్రములు పుస్తకముల వలన జీవించువారి నాశము కలుగును.

వాయవ్యకోణములో దీప్త శకునమున్న శాస్త్రనాశము, వాయువ్యకోణములో ద్వితీయభాగములో దీప్తశకునమైన విష,చోర వాయువుల వలన భయము కలుగును. వాయవ్యకోణములో తృతీయభాగములో దీప్త శకునమైన ధననాశము, మిత్రులతో కలహము కలుగును. చతుర్థభాగములో దీప్త శకునమైన అశ్వమరణము, పురోహితులకు భయము కలుగును.

ఉత్తరదిశలో దీప్తశకునమైన గోవులు,దొంగలు,శస్త్రములకు నాశము, ఉత్తర దిశలో ద్వితీయభాగములోనైన వ్యాపారులకు ధనమునకు నాశనము,ఉత్తరదిశలో తృతీయ భాగములోనైన వ్రాత్యులు (ఎనిమిది సంవత్సరముల నుండి పదహారు సంవత్సరముల మధ్య ఉపనయనము జరిగినవారు) భృత్యులు, వేశ్యలకు భయము కలుగును.

ఈశాన్యకోణపు సమీపములో (ఉత్తరదిశ చతుర్థభాగము) దీప్త శకునమైన చిత్ర వస్త్రములు, చిత్రములు తయారు చేయువారికి భయము కలుగును. ఈశాన్య కోణములో దీప్తశకునమైన అగ్నిభయము, ఉత్తమస్త్రీలకు దోషము కలుగును. ఈశాన్యకోణ సమీపములో దీప్తశకునమైన దు:ఖము, స్త్రీనాశము కలుగును.ఈశాన్యకోణ తృతీయ భాగములో దీప్త శకునమైన చాకలి, గంధర్వులకు భయము కలుగును.

మండలము (దిశాచక్రము చివరిభాగము) చివరిభాగములో శకునమైన ఏనుగు నెక్కువారికి భయము,ఏనుగు మరణము కలుగును. పూర్వదిశ మధ్యభాగములో దీప్త శకునమైన నిశ్చయముగా స్త్రీమరణము కలుగును.

ఆగ్నేయకోణములో నున్న ఆరలో దీప్తశకునమైన శస్త్రము, అగ్నిప్రకోపము, అశ్వనాశము, శిల్పులకు భయము కలుగును.దక్షిణదిశలో దీప్తశకునమైన ధర్మనాశము, నైరృతికోణములో ఆరలో దీప్తశకునమైన అగ్ని అవస్కంధము(నిద్రించునపుడు శత్రువు పైనపడుట) దుర్మార్గుని వలన మృత్యువు కలుగును.పశ్చిమభాగమున నున్న ఆరలో దీప్త శకునమైన కార్మికులకు భయము, వాయవ్యకోణములో నున్న ఆరలో దీప్తశకునమైన గాడిద, ఒంటెలకు నాశము, మనుష్యులకు ఉదరశూల రోగము, విషభయము కలుగును. ఉత్తరదిశలో నున్న ఆరలో దీప్తశకునమైన ధనమునకు, బ్రాహ్మణులకు పీడ కలుగును. ఈశాన్యకోణములో నున్న ఆరలో దీప్తశకునమైన సంతాపము, గ్రామీణ, గోపికాజనులతో పీడ కలుగును. నాభిలో దీప్తశకునమైన మృత్యువు కలుగును.

ఎనుబది ఏడవ అంతరచక్రాధ్యాయము సమాప్తము



88. విరుతాధ్యాయము

శ్యామ(నల్లపిచ్చుక) డేగ, శరఘ్నుము, నెమలి, శ్రీకర్ణము, చక్రవాకము, పాలపిట్ట, అందరీకము, ఖంజనము, చిలుక, కాకి, మూడువిధములైన పావురములు భరధ్వాజపక్షి, గర్తాకుక్కుటము, ఈపక్షులు గాడిద, హారీతము,(పచ్చపిట్ట)గద్ద ఈరెండు పక్షులు, కోతి, పోష్టపక్షి, కోడి, పూర్ణకూటము, పిచ్చుక, ఇవన్ని దినమునందు చరించును.

లోమాసిక, పింగల, ఛిప్పికాపక్షి, బల్లులి, గుడ్లగూబ, కుందేలు, ఇవి రాత్రియందు చరించును. పైన తెల్పిన జంతువులు తమ నియమిత సమయమును వదలి అనగా రాత్రి చరించునవి పగలు,పగలు చరించునవి రాత్రి చరించిన దేశమునకు రాజ పురుషులకు మరణ సంకేతమగును.

అశ్వము, మనుష్యుడు, సర్పము, ఒంటె, చిరుతపులి, సింహము, ఋక్షము, ఉడుత, తోడేలు, ముంగిస,లేడి, కుక్క, మేక, ఆవు, సింహము, హంస, పృషతము (మృగజాతి) మృగము, నక్క, బిలములో నుండు జంతువులు, కోకిల, పిల్లి, సారసపక్షి, పంది ఇవి పగలు రాత్రులందు సంచారము చేయును.

భష, కూటపురి, కురబక, కరాయిక, ఇవిపూర్ణ కూటమునకు, పింగలిక, పేచిక, హక్క ఇవి ఉలూక చేటిసంజ్ఞలు. పోతకికి, శ్యామ కపోతకీ సంజ్ఞలు. వంజుల పక్షి, ఖదిర చంచుసంజ్ఞ, నృపసుత ఛుచ్ఛుందరి,ఛుచ్ఛుందర సంజ్ఞ; వాలేయ గర్దభ గాడిదకు సంజ్ఞలు, స్రోతోభేద్య, తటాకభేద్య కలహకారిక ఇవి రలకుసంజ్ఞలు, రల రెండు అంగుళములుండును. రాత్రులందు భృంగారము వలె శబ్దము చేయును. దుర్బలికమని భాండరీకమని అందురు. ఈ భాండరీకము పూర్వదేశనివాసులకు దక్షిణభాగములో అన్యదేశ నివాసులకు వామభాగములో వచ్చిన శుభము కలుగును. ధిక్కారమృగజాతిని కుక్కుట, కృకవాకులను కుక్కటము (కోడి) లందురు. గర్తా కుక్కుటము, కులాల కుక్కుటము, ఇవి గర్తము(గోయి) లో నుండు కుక్కుటములు, కుడ్యమత్స్యము, గృహగోధిక వీటికి గోడలో నుండు మీనముల సంజ్ఞయగును. ధన్వనము , క్రోడ, సూకరము ఇవి సూకర సంజ్ఞలు. ఉస్రము గోవుకి శ్వా కుక్కుటము, సారమేయము ఇవి కుక్కకు, సూకరికము చటుకా (పిచ్చుక)జాతికి సంజ్ఞలగును.

ఈవిధముగా ప్రతిదేశములో శకునముల నామములను తెలిసికొని పండితులు వాటిశబ్దములను గుర్తించు కొనుటకు బాగుగా విచారణచేసి శాస్త్రములో సమన్వయము చేసికొనవలెను. వంజుల దీప్త శబ్దము తిత్తిడము, పూర్ణశబ్దము కిల్కిలి యగును. డేగ,చిలుక, గద్ద కంక(తెల్లడేగ) ఇవి స్వభావమునకు విపరీతముగానున్న దీప్తశబ్దమగును.

పావురము, వాహనము, ఆసనము,శయ్యమీద కూర్చొనుట ఇంటిలో ప్రవేశించుట వలన మనుష్యులకు శుభము కలుగును. జాతిభేదము ననుసరించి ఫలితము కూడ

వేరగును. తెల్లని వర్ణము కలిగిన ఫలితము ఒక సంవత్సరములో, చిత్రవర్ణము కలిగిన పావురము ఫలితము ఆరునెలలలో, కుంకుమ ధూమ్రవర్ణము కలిగిన పావురము ఫలితము అదే సమయములో జరుగును.

శ్యామ పక్షి చిచి శబ్దము సంపూర్ణము, శూలి శూల శబ్దము శుభము, చచ్చుశబ్దము దీప్తము, చిక్‌చిక్ శబ్దము మిత్రలాభమును కలిగించును. హారీతపక్షి గుగ్గుశబ్దము పూర్ణము, మిగిలిన శబ్దములు దీప్తమగును. భారధ్వాజ పక్షి చేయు శబ్దములన్ని శుభమునిచ్చును. కరాయక పక్షి, కిషికిషి శబ్దము పూర్ణము, కహకహ శబ్దము శుభము,కరకరశబ్దము కేవలము కల్యాణమును కలిగించును. కానిసగము ఫలమునిచ్చును. కరాయిక పక్షి కోటుక్లి శబ్దము క్షేమము,కటుక్లిశబ్దము వృష్టిని,కోటికిలి శబ్దము నిష్ఫలము, సంశబ్దము దీప్తమగును.

గమనము చేయువానికి వామభాగములో ధన్వనపక్షి యున్న శుభము, అదే వామభాగములో ఒకహస్తము ఎత్తు ప్రదేశములో నున్న ఇష్టకార్యసిద్ధిని కలిగించును. ఎక్కువ ఎత్తు ప్రదేశములోనున్న సముద్ర పర్యంతము భూమిని వశము కలిగించునదగును. గమనము చేయువాని ఎదురుగా సర్పము వచ్చిన శత్రుసమాగమము, బంధువుల వధ, వినాశము సూచితమగును. గమన సమయములో దక్షిణభాగములో నుండి వామభాగము నకు సర్పము వైళ్ళిన కార్యము సిద్ధించదు.

ఖంజనపక్షి, కమలము, గుర్రము, ఏనుగు, సర్పముల తలపై కనపడిన రాజ్యము నిచ్చునదగును. పవిత్రస్థానము పచ్చునిగడ్డిపై కనపడిన కుశలము కలిగించును. భస్మము, ఎముకలు, కర్ర పొట్టు, కేశములపై కనపడిన ఒకసంవత్సరము వరకు దు:ఖము కలుగును. తిత్తిరపక్షి కిల కిల శబ్దము శాంతమును, శుభమును కలిగించును. దానికి భిన్నముగా శబ్దము చేసిన శుభఫలము కలుగదు. కుందేలు రాత్రిలో వామభాగములో శబ్దము చేసినశుభఫలము కలుగును.

కాకితోపాటు యుద్ధము చేయు పాలపిట్ట కాకికి దక్షిణభాగములో పరాజయము పొందిన గమనము చేయువానికి వధకలుగును. దానికి విపరీతముగా (కాకికి ఉత్తర భాగములో పాలపిట్ట జయమును పొందిన)జరిగిన గమనము చేయువ్యక్తికి జయము కలుగును. పాలపిట్ట వామపార్శ్వములో కరాయిక వలె కేకాశబ్దము చేసిన జయమును కలిగించును. దాని క్రాక్ర దీప్తశబ్దము శుభమునీయదు. కాని దీని దర్శనము ప్రయాణము చేయువానికి ఎల్లప్పుడు శుభమునిచ్చును.

అండరీక, టీశబ్దములు పూర్ణము, టిట్టి ట్టి శబ్దము దీప్తమగును. పేంటపక్షి గమనము చేయువారికి దక్షిణభాగములోనున్న శుభముకలుగును. దీని శబ్దములో ఇంతకన్న విశేషమేమిలేదు. శ్రీకర్ణ పక్షి దక్షిణభాగములో క్వ క్వ క్వశబ్దము చేసిన శుభము కలుగును. చిక్ చిక్ శబ్దము మధ్యమము, మిగిలిన శబ్దములు నిష్ఫలమగును.

గమనము చేయువాని వామభాగములో నున్న భాండరీక పక్షి చిరిల్విరిలు శబ్దము చేసిన శుభము, వామభాగము నుండి దక్షిణములోనికి వచ్చిన వెంటనే కార్యసిద్ధి కలుగును. భాండరీక పక్షి చిక్ చిక్ శబ్దము చేస్తు గమనము చేయువాని వామభాగము నుండి దక్షిణభాగమునకు వచ్చిన క్షేమమును కలిగించును.కాని కోరిన కోరిక ఫలించదు. దీనికి వ్యతిరేకముగా (దక్షిణము నుండి వామభాగమునకు వచ్చిన) జరిగిన వధ బంధనము భయము కలుగును.

గోరువంక క్ర క్ర శబ్దము చేయుచున్న, లేక భయరహితమై త్రే త్రే శబ్దము చేయుచు గమనము చేయువానికి వామభాగములో ఎగిరిన శరీరము నుండి శీఘ్రముగా రక్తము బయటకు వచ్చుటను సూచించును.గమనము చేయువానికి వామభాగములో ఫేంటపక్షి చిరిల్బిరులు శబ్దము చేసిన శుభఫలము నిచ్చును. వ్యతిరేకమైన దీని శబ్దము దీప్తమగును. గమనము చేయువానికి వామభాగములోనున్న గద్దశ్రేష్ఠము. అది ఓం కార శబ్దము చేసిన గమనము చేయువానికి శుభము కలుగును. దీనికి వ్యతిరేకముగా గద్ద చేసిన శబ్దము దీప్తమగును.

ఆ కారశబ్దము చేయు కురంగము, మృగము, ఓంకార శబ్దము చేయు పృషతము దీప్తములగును.మిగిలిన అన్ని శబ్దములు దీప్తములు అన్ని శకునముల పూర్ణస్వరము శు భము దీప్తస్వరమశుభమగును. రాత్రిలో భయపడి కోళ్ళు కు కు కు కుశబ్దమును వదలి మిగిలిన అన్ని విధములైమ శబ్దములు చేసిన భయమును కలిగించును. రాత్రి చివరిలో ఆరోగ్యముతో 'తార' స్వరమును చేసిన రాజ్యము, పురము, రాజులకు అభివృద్ధి కలుగును.

చిప్పిక పక్షికి అనేక విధములైన స్వరములుండును. దాని కులు కులు శబ్దము శుభమునీయదు. మిగిలిన శబ్దములు శుభమునిచ్చును.పిల్లి శబ్దము గమనము చేయువానికి అశుభమును కలిగించును.గోజాతి తుమ్ము యాత్ర చేయువానికి మృత్యు సూచకమగును.

తనప్రియని అభిలషించుచున్న గుడ్లగూబ ఆనందముతో 'హు హు గు గులుక్ శబ్దము చేయును. ఈశబ్దము పూర్ణమైనది. కిక్కిసి శబ్దము ప్రదీప్తమగును. గుడ్లగూబ మాటిమాటికి బల బల శబ్దము చేసిన కలహము, ట టు ట్ట టశబ్దము చేసిన దోషము, మిగిలిన శబ్దములు దీప్తములగును.

సారస పక్షుల జంట ఒకేసారి శబ్దము చేసిన ఇష్టఫలమును కలిగించును. ఒకపక్షి శబ్దము శుభమునీయదు. ఒకపక్షి శబ్దము చేసిన తర్వాత రెండవపక్షి ఎక్కువకాలము శబ్దము చేసిన శుభమునీయదు. పొంగలపక్షి చిరిల్చురిలు శబ్దముతో శుభము నిచ్చును. అన్యశబ్దములు ప్రదీప్త సంజ్ఞకములై అశుభఫలమునిచ్చును. పింగలపక్షి 'ఈ' శబ్దము గమనమును ఆపునది, కుశు కుశు శబ్దము క్లేశమును కలిగించునదగును. అభీష్టసిద్ధి ఏవిధముగా కలుగునో దాని విధివిధానమును తెలిపెదను.

దినాంతకాలిక సంధ్యా సమయములో పవిత్రమై నూతన శస్త్రములను ధరించి పింగలపక్షి నివాసమున్న వృక్షసమీపమునకు వెళ్ళి సుగంధ ద్రవ్యములతో (చందనము, కుంకుమ, కస్తూరి, అగరులు) వృక్షమునకు బ్రహ్మ విష్ణు మహేశులకు పూజచేసి మధ్యరాత్రి సమయములో ఆగ్నేయ కోణములో కూర్చొని దివ్య మరియు లౌకిక శపథములతో సంబోధన చేస్తు వక్ష్యమాన(ముందు చెప్పబోవు) మంత్రములతో తనమనసులోనున్న కోరిక సిద్ధించుటకు పలుకవలెను.

"ఓ భద్రే ! నేను ఈ అర్థమును అడుగుటకు ప్రారంభము చేయుచున్నాను. అది నీకు తెలుసు. నీవు అన్ని కార్యములు తెలిసిన దానివని తెలిపెదరు. నేను ఇప్పుడు అడిగెదను. ప్రాత:కాలములో వచ్చి అగ్నికోణములో కూర్చొని అడిగెదను. నేను ఏప్రశ్న అడుగెదనో దానికి ఓకాళ్యాణి నీచేష్టద్వారా నిస్సంశముగా ఏవిధముగా తెలిసికొందునో అదే విధముగా తెలుపుటకు నీవు సమర్థురాలవు కావలెను."

ఈ విధముగా కోరిన తర్వాత వృక్షముపై కూర్చొన్న పింగలపక్షి "చిరులు – ఇరులు" శబ్దము చేసిన కార్యసిద్ధి, "దిశికార", 'కుచాకుచ' శబ్దము చేసిన వ్యాకులత(కలత చెందుట) మౌనముగా నున్న అభీష్టసిద్ధి కలుగును. దీనికి వ్యతిరేకముగా పూర్వము తెలిపిన దినచక్ర ఫలమునకనుసరించి దీని ఫలితము తెలుపవలెను. పింగలపక్షి ప్రధానశాఖ మీద కూర్చొనిన ఉత్తమము. మధ్యశాఖపై కూర్చొనిన మధ్యమము, క్రిందిశాఖపై కూర్చొనిన అల్పఫలము నిచ్చును.

ముప్పై రెండుచే విభజించిన దిశాచక్రపు నాభిస్థానములో, నాభి బయటిభాగములో నున్న ఊసరవెల్లి ఫలమునిచ్చును. ఛుంఛెలుక 'చిచ్చిడ'శబ్దము ప్రదీప్తము, తిత్తిడ శబ్దము పూర్ణముగా తెలిసికొనవలెను.

ఎనుబది ఎనిమిదవ విరుతాధ్యాయము సమాప్తము

89. శ్వచక్రాధ్యాయము

కుక్క ఏసమయములో నైన మనుష్యుడు గుర్రము, ఏనుగు, కుండ, పర్యాణము, క్షారవృక్షము, ఇటుకుల గుట్ట, ఛత్రము, శయ్య, ఆసనము, రోలు, ధ్వజము, చామరము, గరిక, పువ్వులపై మూత్రము పోసి గమనము చేయువారి ముందు నుండి వెళ్ళిన కార్యసిద్ధి, పచ్చిపేడపై మూత్రము పోసి వెళ్ళిన మృష్టాన్న భోజనప్రాప్తి, ఎండిన వస్తువుపై మూత్రము పోసివెళ్ళిన ఎండిన అన్నము, బెల్లము, కుడుము ప్రాప్తించును.

కుక్క విషవృక్షము, ముళ్లవృక్షము, కాష్ఠము, రాయి, ఎండిన వృక్షము శ్మశానము లోనున్న ఎముకలపై మూత్రము పోసి కాలితో భూమిని తన్నుతు గమనము చేయువాని ముందు నుండి వెళ్ళిన అశుభఫలము సూచితమగును. శయ్య, విరుగని కుమ్మరికుండపై

మూత్రము పోసిన కన్యాదోషము, పాతసామానులపై మూత్రము పోసిన యాత్రచేయువాని గృహిణికి దోషము కలుగును. చెప్పులపై మూత్రము పోసినను ఇదేఫలము కలుగును. గోజాతులపై మూత్రము పోసి గమనము చేయువాని ముందు నుండి వెళ్ళిన అతని ఇంటిలో నీచవర్ణములో సంకరజాతి ఉత్పన్నమగును.

కుక్క నోటితో చెప్పులు గ్రహించి గమనము చేయువాని సమీపము నుండి వెళ్ళిన కార్యసిద్ధి, మాంసము తీసుకొని వెళ్ళిన ధనప్రాప్తి, ఎముకను తీసుకొని వెళ్ళిన శుభప్రాప్తి, కాలిన కర్రను, ఎండుమాంసమును తీసికెళ్ళిన గమనము చేయువానికి మృత్యువు, అగ్నిలేని కాలిన కర్రను తీసుకొని వెళ్ళిన ఉపద్రవము కలుగును. మనుష్యుని శిరము, హస్తము, కాలు, ఆది అవయములను నోటితో కరుచుకొని వెళ్ళిన భూప్రాప్తి, వస్త్రాదులను తీసుకొని వెళ్ళిన మృత్యువు కలుగును. కొంతమంది వస్త్రముతో కుక్క ముందుకు వచ్చిన శుభమని తెల్పెదరు. ఎండిన ఎముకను తీసుకొని ఇంటిలో ప్రవేశించిన గృహపతికి మృత్యువు, ఇనుప గొలుసు పాతలత,చర్మపుత్రాడు మున్నగునవి తీసుకొని వచ్చిన గమనము చేయువానికి బంధనము కలుగును.గమనము చేయువాని కాలిని నాకిన చెవులు కదుపుతు గమనము చేయువాని పైకి వచ్చుటకు ప్రయత్నించిన యాత్రలో విఘ్నము కలుగును. గమనము చేయు వాని మార్గమును అడ్డగించిన లేక తన అంగములను గోకుతున్న మార్గములో విరోధము కలుగును.గమనము చేయువానికి లేక ఒకచోట ఆగిన మనుష్యునిపై కాలు పెట్టిన దోషకారియగును.

సూర్యోదయ సమయములో ఒకటి లేక ఎక్కువ కుక్కలు ఒకచోట చేరి సూర్యుని వైపు ముఖము పెట్టి అరిచినశీఘ్రముగా దేశమునకు ఇతరరాజు వచ్చు సూచన కలుగును. అగ్నికోణములో నున్న కుక్క సూర్యునివైపు ముఖము పెట్టి అరిచిన శీఘ్రముగా దొంగ, అగ్నిభయములు,మధ్యాహ్నములో సూర్యునివైపు ముఖము పెట్టి అరిచిన అగ్ని మృత్యుభయములు, అపరాహ్ణకాలములో సూర్యాభిముఖముగా అరచిన యుద్ధము సూచితమగును.

సూర్యాస్తమయ కాలములో సూర్యునివైపుకి ముఖము పెట్టి కుక్క అరిసిన రైతులకు భయము, ప్రదోషకాలము (మునిమాపు)లో వాయవ్యకోణములో అరిచిన వాయువు దొంగలభయము కలుగును. అర్థరాత్రి ఉత్తరదిశవైపు తిరిగి అరిచిన బ్రాహ్మణులకు పీడ, గోవుల దొంగతనమును సూచించును. రాత్రి చివరిలో ఈశాన్యకోణమువైపు ముఖము పెట్టి అరిచిన కన్యలకు దోషము అగ్నిభయము స్త్రీలకు గర్భపాతము కలుగును.

వర్షాకాలములో గడ్డితో నిర్మించిన గృహము, ప్రాసాదము,ఉత్తమ గృహము లోనున్న కుక్క అధికస్వరముతో శబ్దముచేసిన అధికవృష్టిని సూచించును. అన్య ఋతువులో పూర్వోక్తస్థానములో నుండి శబ్దము చేసిన మృత్యువు అగ్నిభయము రోగభయము

సూచితమగును. వర్షాకాలములో అనావృష్టి కలిగినపుడు కుక్క జలములో స్నానము చేసి మాటిమాటికి ప్రక్కకు తిరుగుతు ఊరేచక(ఊపిరివదులుట) ము చేయుచు జలమును తన్నుతు త్రాగుతున్న తర్వాత పన్నెండురోజులు వర్షము కురియును.

కుక్క ద్వారముపై శిరస్సు బయట శరీరముంచి గృహిణిని చూస్తు మాటి మాటికి ఏడుస్తున్న ఆగృహిణి వేశ్యయగు సూచన కనబడును. గృహము గోడల సున్నమును కుక్క త్రవ్వుతున్న ఆ ఇంటిలో సంధిభేద భయము కలుగును. గోవుల నివాసస్థానములో త్రవ్విన గోహరణము, ధాన్యమున్న భూమిని త్రవ్విన ధాన్యలాభము కలుగును.

కుక్క ఒకకన్ను నీటితో నిండి అల్పదృష్టి కలిగి స్వల్పభోజనము చేయుచున్న గృహమున దు:ఖము కలిగించునదగును. గోవులతో పాటు కుక్క ఆడుతున్న సుభిక్షము క్షేమము,ఆరోగ్యము,సంతోషము కలుగును. కుక్క ఎడమతొడను వాసనచూచిన ధనలాభము, కుడితొడను వాసన చూచిన స్త్రీలమధ్య కలహము,ఎడమతొడను వాసనచూచిన బుద్ధి ఇంద్రియములకుపయోగము, దక్షిణ తొడను వాసన చూచిన మిత్రవిరోధము కలుగును. గమనము చేయువాని రెండు కాళ్లను వాసన చూచిన యాత్రానిషేధమగును. అక్కడే యాత్ర చేయువాడు నిశ్చలముగా నిలబడిన అభీష్టసిద్ధి కలుగును. ప్రయాణము చేయువాని చెప్పులను వాసనచూచిన శీఘ్రముగా యాత్ర జరుగును.

గమనము చేయువాని రెండు భుజములను కుక్కవాసన చూచిన శత్రువులు దొంగల వలన భయము కలుగునని తెలిసికొనవలెను. భస్మములో తినే వస్తువు, మాంసపు ఎముకలను దాచిన అగ్నిప్రకోపము కలుగును. ముందు గ్రామములోతర్వాత శ్మశానమునకు వెళ్ళి అరచిన ప్రధాన పురుషునికి నాశనము కలుగును. గమనముచేయువాని ఎదురుగా వచ్చి కుక్క ఏడ్చిన యాత్రకు ఆటంకముల కలుగును. కుక్క ఉకారవర్ణముతో శబ్దము చేసిన అర్థసిద్ధి,ఓంకార వర్ణముతో శబ్దము చేసిన వ్యాకులత కలుగును. గమనము చేయువాని ఎదురుగావచ్చి ఏవర్ణముతో శబ్దము చేసినను యాత్రకు ఆటంకము కలుగును.

కుక్క దండముతో కొట్టినట్టుగ ఎక్కువ స్వరముతో మాటిమాటికి 'ఖంఖ' శబ్దము చేసిన, లేక అన్ని కలిసి పరిగెడుతున్న నగరమునకు శూన్యము, మృత్యుభయము కలుగును. దంతములను బయటికి తీసి పెదవుల చివరిభాగములను నాకిన, కుక్క చేష్టలను చూచు వానికి మృష్టాన్న భోజనలాభము కలుగును. ముఖమునాకు సమయమున పెదవుల చివరి భాగము నాకకున్న భోజనము చేయుటకు సిద్ధముగానున్న పురుషునికి అన్నము తినుటలో ఆటంకము కలుగును.

గ్రామము పురముల మధ్య కుక్కలు కలిసి మాటి మాటికి శబ్దము చేసిన గ్రామపెద్దకు కష్టము కలుగును. వనములో నున్న కుక్క ఫలవిచారము మృగమువలె

గ్రహించవలెను.

వృక్ష సమీపములో కుక్క శబ్దము చేసిన వర్షము కురియును. ఇంద్రకీల సమీపములో శబ్దము చేసిన మంత్రికి పీడ, గృహమధ్యమములో వాయవ్యకోణములో శబ్దము చేసిన ధాన్యభయము, పురద్వారములో నుండి శబ్దము చేసిన పీడ, శయ్యమీద శబ్దము చేసిన, శయ్యమీద పరుండిన వారికి భయము కలుగును. యాత్రచేయువారి వెనుక శబ్దము చేసిన వారికి భయము కలుగును. మనుషుల సమీపములో వామభాగములో శబ్దము చేసిన శత్రువులకు భయము కలిగించునదగును.

ఎనుబది తొమ్మిదవ శ్వచక్రాధ్యాయము సమాప్తము

90. శివారుతాధ్యాయము

నక్క కుక్కతో సమానమైనది. కాని శిశిరఋతువులో నక్కకు మదము కలుగును. అదేదాని విశేషము. ఆసమయములో దాని వలన శుభాశుభ ఫలము జరుగదు. శబ్దము చేయునపుడు చివరిలో 'హు హు' తర్వాత టా టా శబ్దము దీనికి పూర్ణస్వరమగును. దీనికన్న వ్యతిరేకమైన శబ్దము దీప్తమగును. నక్కకు స్వభావసిద్ధముగా నుత్పన్నమగు కుక్క శబ్దము పూర్ణమగును. ఇతర స్వభావ విరుద్ధ స్వరములు దీప్తమగును.

పూర్వ ఉత్తదిశలలో నున్న నక్క శుభఫలము నిచ్చును. ఎల్లప్పుడు శాంతదిశలో నున్న శ్రేష్ఠము. ధూమితదిశవైపు ముఖము పెట్టి దీప్తశబ్దము చేసిన ఆదిశలోనున్న స్వామికి నాశనమగును. రాజు, కుమారుడు, సేనాపతి, దూత, వైశ్యుడు, గుప్తచరుడు, బ్రాహ్మణుడు, రాజాధ్యక్షుడు వీరు ప్రదక్షిణ క్రమములో పూర్వాది ఎనిమిదిదిశలకు స్వాములు. క్షత్రియ వైశ్య, శూద్ర, బ్రాహ్మణులు పూర్వాది నాలుగు దిశలకు స్వాములు.

అన్ని దిశలలో దీప్తస్వరము శుభమగును. పగలు అధికముగా అశుభము కలిగించును. నగరము, సేనలమధ్యలో దక్షిణభాగము నందుండి సూర్యాభిముఖమైన కష్టము కలిగించును. నక్క 'యాహి' శబ్దము చేసిన అగ్నిభయము, టా టా శబ్దము చేసిన మృత్యువు, ధిక్ ధిక్ శబ్దము చేసిన అతికష్టము. ముఖమునుండి అగ్నిజ్వాలలు వెలువడు నక్క వలన దేశమునకు నాశనమగును.

కాశ్యపాది మునుల మతముననుసరించి ముఖము నుండి అగ్నిజ్వాల వెలువడుతున్న భయంకరమైన ఫలితమునిచ్చును. లాలాజల స్వభావము వలన సూర్యాది జ్వాలల వలె దాని ముఖము జ్వాలతో కూడియుండును. ఇతర నక్కలతో దక్షిణభాగములో నున్న నక్క శబ్దము చేసిన ఉరి వలన మృత్యువు సూచితమగును. ఇతర నక్కలతో కూడి పశ్చిమభాగములో నున్న నక్క శబ్దము చేసిన జలమువలన మృత్యువు సూచితమగును.

నక్క ఒకసారి శబ్దము చేసి ఆగిన అనుకూలము. రెండు మార్లు శబ్దము చేసి

ఆగిన ఇష్టశ్రవణము(మంచి మాట వినటము) మూడుసార్లు శబ్దము చేసి ఆగిన అర్థలాభము, నాలుగుసార్లు శబ్దము చేసి ఆగిన ప్రియమైనవారి ఆగమనము, ఐదుమార్లు శబ్దము చేసి ఆగిన వ్యాకులత్వము, ఆరుమార్లు శబ్దము చేసి ఆగిన ప్రధానవ్యక్తుల మధ్య భేదము,ఏడుమార్లు శబ్దము చేసి ఆగిన సంపత్తి, ఎనిమిదిమార్లు శబ్దము చేసిన గ్రహింప రాదు. దక్షిణదిశలో నాలుగవ ఐదవఫలితములను వదలి మిగిలిన ఫలములను వ్యతిరేకము గా గ్రహించవలెను. ఎక్కువసార్లు శబ్దము క్షోభము,రెండుమార్లు అనిష్ట శ్రవణము, మూడు మార్లు ధనహాని, నాలుగుమార్లు ప్రయాణయోగము, ఐదుమార్లు చేసిన క్షోభము, ఆరుమార్లు చేసిన ప్రధానవ్యక్తుల మధ్యభేదము, ఏడుమార్లు చేసిన సంపత్తికి హాని జరుగును.

నక్క తనశబ్దముల వలన మనుష్యులకు రోమాంచము కలిగిన, గుఱ్ఱము మలమూత్ర విసర్జన చేసిన, మనుష్యులు భయపడిన ఆనక్క శుభమునీయదు. ధ్వని చేయుచున్న నక్క మనుష్యుడు, ఏనుగు, గుఱ్ఱముల ప్రతిశబ్దములతో ఆగిన అదిసైన్యమునకు, నగరమునకు శుభమును కలిగించును. నక్క 'ఛేభా శబ్దము చేసిన భయము, భో భో శబ్దము చేసిన మృత్యువు బంధనము, హూ హూ శబ్దము చేసిన వినువారికి శుభము కలుగును.

నక్క శాంతదిశలో నుండి ముందున్న ఆకారములో ఉచ్చారణ చేసి తర్వాత ఆ ఆ వర్ణములతో, లేక టా టా శబ్దము, లేక ముందు టే టే శబ్దముచేసి థే థే శబ్దము చేసిన, ఇవన్ని ప్రసన్నమైన శబ్దములగును. శుభమునిచ్చును. నక్క గట్టిగా మొదట క్రూరవర్ణముతో ఉచ్చారణ చేసి తర్వాత నక్కవలె శబ్దము చేసిన క్షేమము, ధనలాభము, ప్రియసమాగమము సూచితమగును.

తొంబదవ శివారుతాధ్యాయము సమాప్తము

91. మృగచేష్టి తాధ్యాయము

వన్యమృగము గ్రామసీమలో దీప్తశబ్దము చేయుచున్న తాత్కాలికము, గ్రామసీమ బయటకు వెళ్ళిన భూతకాలికము, గ్రామసీమ వైపు తిరిగి వచ్చిన భవిష్యకాలికమైన భయము కలుగును. గ్రామములో నాలుగు వైపులకు తిరుగుతున్న గ్రామమును శూన్యము చేయును. దీప్తశబ్దము చేయుచు గ్రామమునకు వచ్చిన ఆమృగము వెనుక గ్రామీణ జంతువులు శబ్దము చేసిన భయము, వనములో నున్న ఇతర జంతువులు శబ్దము చేసిన రోధనము, వనచర ప్రాణులు, గ్రామీనప్రాణులు రెండు కలిసి శబ్దము చేసిన బలవంతము స్త్రీలనపహరించు సూచన కలుగును.

వనములో నుండు ప్రాణి పురద్వారము దగ్గర ఉన్న శత్రువుల ద్వారా నగర ఆక్రమణము, గృహములో ప్రవేశించునపుడు పురనాశము, గృహములో ప్రసవించిన

మృత్యువు, గృహములోనున్న భయము, గృహములో ప్రవేశించిన గ్రహస్వామికి బంధనము కలుగును.

తొంబది ఒకటవ మృగచేష్టితాధ్యాయము సమాప్తము

92. గవేంగితాధ్యాయము

దీనురాలైన గోవు రాజుకు అమంగళము కలిగించును. తనపాదములతో భూమిని త్రవ్వే ఆవు రోగమును కలిగించును. నీళ్లున్న నేత్రములు కలిగిన ఆవు స్వామికి మృత్యువు కలిగించును. భయపడి అతిగాశబ్దము చేయు ఆవు దొంగల వలన భయమును కలిగించును. కారణము లేకుండ ఆవు అరచిన అనర్థము. రాత్రులందు శబ్దము చేసిన భయము, ఎద్దు రాత్రి శబ్దము చేసిన మంగళకరమగును. ఆవు, ఈగలు, కుక్కలు పిల్లులతో చుట్టబడిన వెంటనే వర్షము కురియును.

మధురశబ్దము చేస్తు ఆవు ఇంటిలోనికి వచ్చిన ఆవులవృద్ధి జరుగును. జలముతో తడిసిన శరీరము, రోమాంచ యుక్తమైన ఆవు ఆవుల వృద్ధిని కలిగించును. ఈవిధముగా గేదె కూడ ఫలితమునిచ్చును.

తొంబది రెండవ గవేంగితాధ్యాయము సమాప్తము

93. అశ్వేంగి తాధ్యాయము

గుర్రముల ఆసన స్థానము నుండి పశ్చిమ వామభాగములలో వేడి కలిగిన శుభము కలుగదు. దీనికి విరుద్ధముగా (పూర్వ దక్షిణములు) వేడి కలిగిన శుభము కలుగును. అన్ని అంగములలో వేడి కలిగినఅభివృద్ధికారియగును. గుర్రమునకు రెండువర్షముల వరకుశరీరము నుండిఅగ్నికణము లేక పొగవెలువడిన అవృద్ధికారియగును.

గుర్రపు అంగము ప్రదీప్తమైన (వెలిగిన) రాజాంత:పురమునకు నాశము, పొట్ట ప్రదీప్తమైన కోశాగారమునకు, గుదము తోక ప్రదీప్తమైన పరాజయము, ముఖము శిరము ప్రదీప్తమైన జయము కలుగును. గుర్రపు కంధము ఆసనము మెడ పార్శ్వభాగము ప్రదీప్తమైన జయము, కాలుప్రదీప్తమైన స్వామివధ, లలాటము, ఛాతి, కన్నులు భుజము, ధూమ యుతమైన (పొగతో కూడిన) పరాజయము, ప్రదీప్తమైన విజయము కలుగును.

రాత్రులందు గుర్రపు ముక్కు రంధ్రములు, ముక్కు మధ్యభాగము శిరస్సు అశ్రు పాత(దవుడల క్రిందిభాగము) ప్రదీప్తమైన జయము కలుగును. పలాశమువలె ఎరుపు, నలుపు, తెలుపు నలుపు, కపోత వర్ణము, చిలుకవర్ణము, తెల్లనివర్ణము కలిగిన గుర్రము ఒకటి లేక అనేక అంగములు ప్రకాశమానమైన శుభము కలుగును. కారణము లేకుండ గడ్డి, నీటిపై విరక్తి కలుగుట, చెమట వచ్చుట, వణుకుట, రక్తముపడుట, రాత్రులందు ఇతర

జంతువులపై ద్వేషముతో లేచుట, పగలు పరుండుట, బద్ధకముగా నుండుట, చింతపడుట, అనారోగ్యము చేయుట, క్రిందికి ముఖముపెట్టుట, పైకిచూచుట, ఇవన్ని చేష్టలు గుఱ్ఱమునక శుభము కలిగించును. సవారి చేయుచున్న అశ్వముపై ఇతరగుఱ్ఱము ఎక్కుట, గుఱ్ఱముపై స్వారీచేయుసమయములో ఏమి తినకుండ ఉండుట, కష్టముకలుగుట శుభమునీయదు.

గుఱ్ఱము క్రౌంచపక్షివలె శబ్దము చేయుట,మెడ స్థిరముగా నుండి పైకి ముఖముపెట్టి శబ్దము చేయుట, గట్టిగా మధురశబ్దము చేయుట, ముఖమును బంధించి నప్పటికి ఆనందముతో శబ్దము చేయుటవలన శత్రువధ జరుగును. శబ్దము చేయుచున్న గుఱ్ఱము దగ్గర శుభద్రవ్యములతో కూడిన పాత్ర, పెరుగు, బ్రాహ్మణుడు, దేవత సుగంధ ద్రవ్యములు, ఫలములు, పువ్వులు, బంగారము మున్నగు అన్యశుభ ద్రవ్యములు వచ్చిన శుభము కలుగును.

తినేవస్తువులు, జలము, కళ్ళెమును ఆనందముతో గ్రహించునది, స్వామికోరిక ననుసరించి నడిచేది,దక్షిణము వైపుకి దృష్టినిపెట్టు గుఱ్ఱము అభీష్టఫలము నిచ్చును. ఎడమకాలితో భూమిని త్రవ్వే గుఱ్ఱము తనస్వామి విదేశీ గమనమునకు కారణమగును. సంధ్యలలో (సూర్యోదయము మధ్యాహ్నము, సూర్యాస్తమయము, అర్ధరాత్రి) దీప్తదిశను చూస్తు శబ్దముచేసిన స్వామి బంధనము పరాజయమునకు కారణమగును. అధికశబ్దము చేయుచున్న తోక వెంట్రుకలను అటు ఇటు కదుపుతున్న నిద్రించుచున్న గుఱ్ఱము యాత్రను సూచించును. వెంట్రుకలను వదలిన, గాడిదవలె శబ్దము చేసిన దుమ్మును తినిన గుఱ్ఱము భయమును కలిగించును.

పాత్రవలె మోకాళ్ళను మడిచి దక్షిణవైపు పరుండునది, దక్షిణపుకాలును ఎత్తి భుమిపై నిలబడు గుఱ్ఱము స్వామికి జయము కలిగించును. మిగిలిన (ఏనుగు ఒంటె మున్నగునవి) వాహనములకు కూడ ముందుతెల్పిన విధముగా ఫలితములను తెలుపవలెను. రాజు ఎక్కిన తర్వాత గుఱ్ఱము వినయముతో రాజు ఇచ్చిననుసరించి ప్రయాణము చేసిన ఇతర గుఱ్ఱములు శబ్దము చేసిన శబ్దము చేయుచు లేక ముఖముతో తనదక్షిణపార్శ్వమును స్పర్శించుట చేసిన వెంటనే స్వామి ధనము వృద్ధిని పొందును.

మాటిమాటికి మలమూత్ర విసర్జన చేసేది, కొట్టినప్పటికి అభీష్టదిశకు వెళ్ళనిది, కారణములు లేకుండ బయపడేది, నీళ్ళునిండిన నేత్రములు కలదైన గుఱ్ఱము తనస్వామికి మంగలకారికాదు. ఈ విధముగా గుఱ్ఱపుచేష్టలు చెప్పబడినవి. దీనితర్వాత ఏనుగుల చేష్టలు చెప్పబడును. ఏనుగుల దంతముల కల్పన,విరుగుట, మలినమగుట మున్నగు చేష్టలఫలము తెలుపబడును.

తొంబది మూడవ అశ్వేంగితాధ్యాయము సమాప్తము

94. హస్తిచేష్టితాధ్యాయము

గజదంతమూలము ఎన్ని అంగుళముల పరిధి ఉన్నదో దానికి రెట్టింపుకు సమానమైన కొలతలతో మూలమునుండి వదలి మిగిలిన భాగములో వివిధకల్పనలు చేయవలెను. ప్రదేశములలోనున్న ఏనుగులకు కొంచెము ఎక్కువగా పర్వతములోనున్న ఏనుగులకు కొంచెము తక్కువభాగము వదలి మిగిలిన భాగములో కల్పన చేయవలెను.

నరికే సమయము ఏనుగు దంతములో బిల్వవృక్షము, వర్ధమానము, ఛత్రము, ధ్వజము,చామరమువంటి చిహ్నములు కనపడిన ఆరోగ్యము, ధనవృద్ధి సుఖము కలుగును. శస్త్రసమానముగా చిహ్నము కనపడిన జయము, నదితిరుగుతున్నట్లు చిహ్నమున్న నష్టదేశప్రాప్తి, డోలువంటి చిహ్నమున్న ముందు ప్రాప్తించిన దేశము మరల ప్రాప్తించును.

స్త్రీసమానముగా చిహ్నము కనపడిన ధననాశము, పొదవలె చిహ్నమున్న పుత్రోత్పత్తి, కుండవలె చిహ్నమున్న నిధిప్రాప్తి, దండ సమానముగా చిహ్నము కనపడిన యాత్రలో విఘ్నము కలుగును. పాశము, కబంధ(తలలేని పురుషుడు) సమానముగా చిహ్నమున్న రాజుకు మృత్యువు, నరికినపుడు రక్తము వచ్చిన మనుష్యులకు కష్టము, నలుపు పసుపు కఠినము దుర్గంధముగానున్న అశుభము కలుగును.

గజదంత ఛేదము(రంధ్రము) తెలుపు, సమానము, సుగంధము నిర్మలమైన శుభము కలుగును. దంతము పాడైన మలినమైన దాని ఫలము దంతము విరిగినపుడు కలుగుదానితో సమానముగా నుండును.ఏనుగుదంతము మూలము మధ్యభాగము,అగ్ర భాగములో క్రమముగా దేవతలు,దైత్యులు మనుష్యులు నివాసముందురు. దంత మూలము లో దేవతలు,మధ్యభాగములో రాక్షసులు అగ్రభాగములోమనుష్యులు నివాస ముందురు. మూలభాగము వక్ష్యమానఫలము పూర్ణముగా,మధ్యభాగములో మధ్యమముగా, అగ్ర భాగములో అల్పముగా నుండును. ఒదేవిధము వక్ష్యమాన ఫలితము, మూలములోవెంటనే (ఒకవారములో)మధ్యలో మధ్యకాలములో (ఒకనెలలో) చివరిలో ఆలస్యముగా జరుగును.

దక్షిణభాగములో దంతమూలము నుండి విరిగిన రాజు పరిగెత్తుకొని వెళ్ళేభయము, మధ్యలో విరిగిన దేశము నుండి వెళ్ళేభయము, అగ్రభాగములో విరిగిన సేనలు వెళ్ళే భయము కలుగును.వామభాగములో దంతమూలాదులు విరిగిన క్రమముగా రాజపుత్రులు, పురోహితులు, సాధనపతులు, సేన, స్త్రీలు ప్రధానపురుషులకు మరణము కలుగును. ఏనుగు రెండు దంతములు విరిగిన సంపూర్ణ రాజకులమునకు నాశము. శు భగ్రహముల లగ్నము (వృషభ మిథున కర్కాటక కన్య తుల ధనుస్సు మీనము)శుభ తిథి (రిక్త వర్జిత తిథి) శుభ నక్షత్రము(దారుణ ఉగ్ర నక్షత్రములు వదలి మిగిలిన నక్షత్రములు) లలో పుట్టిన ఏనుగు శుభఫలము నిచ్చును. వ్యతిరేకమైన పాపఫలమునిచ్చును.

వామభాగ దంతము పాలు,మధురఫలములు, పూవులు కలిగిన వృక్షములను కొడుతున్నప్పుడు మధ్యనుండి విరిగిన శత్రునాశనమగును. దీనికి వ్యతిరేకముగా చెడువృక్షము లతో ఘర్షణ చేసినపుడు దంత అగ్రభాగము మూలభాగము విరిగిన శత్రువృద్ధి కలుగును.నడుస్తున్న ఏనుగు ఆగిన, చెవులు కదుపుట ఆగిన,అత్యంత దీనముగా తొండమును భూమిపై ఉంచి మెల్లమెల్లగా గాలిని తీసుకొనుచు సగము మూసిన కన్నులు కలిగినదై ఎక్కువ సమయము నిద్రించిన, వ్యతిరేకముగా నడిచిన, అభక్ష్య వస్తువులను తినిన అనేకమార్లు రక్తముతో కూడిన మలమును విసర్జించిన భయమును కలిగించును.

ఏనుగు తన ఇచ్ఛతో పుట్ట,స్థాణువు (కొమ్మలేని వృక్షము) పొద, గడ్డి, అన్యవృక్షము లను ఘర్షణచేస్తు దృష్టిని, ముఖమును పైకినిలిపి శీఘ్రగతితో అనుకూల ప్రయాణము చేసిన, దానిపై అంబారి భిగించినపుడు జలబిందువులను చిందించిన, గర్జన చేసిన, మద యుక్తమైన, తొండముతో కుడిదంతమును చుట్టిన జయమును కలిగించును.

ఏనుగును పట్టుకొని మొసలి జలములో ప్రవేశించిన రాజకు నాశము, మొసలిని పట్టుకొని ఏనుగు జలమునుండి బయటికి వచ్చిన రాజుకు వృద్ధికలుగును.

తొంబది నాల్గవ హస్తచేష్టితాధ్యాయము సమాప్తము

95. వాయస విరుతాధ్యాయము

పూర్వదేశ వాసులకు దక్షిణభాగములో కాకి, వామభాగములో కరాయికము, అన్యదేశవాసులకు వామభాగములో కాకి దక్షిణములో కరాయిమున్న శుభము. లోకప్రసిద్ధి ననుసరించి పూర్వాదిదేశములను తెలిసికొనవలెను. కాకి వైశాఖమాసములో ఉపద్రవ రహితమైన వృక్షముపై గూడును నిర్మించిన సుభిక్షము, మంగళము కలుగును. నిందితమైన ముళ్లు కలిగిన, ఎండిన వృక్షముపై గూడును నిర్మించిన దేశమునకు దుర్భిక్షము భయము కలుగును.

కాకి శరత్కాలములో వృక్షమునకు పూర్వదిశలో శాఖపై గూడును నిర్మించిన పశ్చిమదిశలో మొదట వర్షము కురియును. దక్షిణ లేక ఉత్తరదిశలో గూడు నిర్మించిన ప్రధానవృష్టి కలుగును. ఆగ్నేయములో గూడు నిర్మించిన శరత్కాల ధాన్యములకు వృద్ధి కలుగును. వాయవ్య ఈశాన్య కోణములలో గూడు నిర్మించిన సుభిక్షము, వాయవ్య కోణములో గూడు నిర్మించిన ఎలుకలధికమగును.

ఏదేశములో కాకి శరకండము, దర్భలు, పొదలు, లతలు, ధాన్యము, ప్రాసాదము, గృహముల క్రిందగూడు నిర్మించునో ఆదేశము దొంగలు అనావృష్టి రోగముల వలన శూన్యమగును.కాకికి రెండు మూడు నాలుగు పిల్లలైన ఇతరరాజుకు అధికారము, అండములు పడిన,ఒకఅండము పెట్టిన, పెట్టకున్న అమంగళమగును.కాకి పిల్లల వర్ణము

గంధద్రవ్య సమానముగా నున్న దొంగల ఉత్పత్తి, చిత్రవర్ణమైన మృత్యువు, తెల్లనివర్ణమైన అగ్నిభయము, ఏదైనపిల్ల అంగహీనమైన దుర్భిక్షము భయము కలుగును. కాకి కారణము లేకుండ గ్రామము మధ్యలో అధికశబ్దము చేసిన దుర్భిక్షము, చక్రాకారముగా కాకులున్న నగరమునకు రోధము (ఆటంకము) గుంపు గుంపులుగానున్న ఉపద్రవము కలుగును.

కాకిభయము లేక ముక్కుతో రెక్కలతో కాళ్లతో మనుష్యులను కొట్టిన శత్రువృద్ధి, రాత్రులందు తిరిగిన జనులకు నష్టము కలుగును. ఆకాశములో ప్రదక్షిణ క్రమములో భ్రమణము చేసిన ఆత్మీయుల వలన, అపసవ్య క్రమములో భ్రమణము చేసిన శత్రువుల వలన భయము కలుగును. కాకిపైకి ముఖము పెట్టికొని రెక్కలను కదిపిన మార్గములో భయము,ధాన్యమును దొంగిలించిన దుర్భిక్షము, సేనల అంగములపై కూర్చొనిన యుద్ధము కోయిలవలె నల్లని రెక్కలు కాకికున్న దొంగలభయము కలుగును.

కాకి శయ్యపై భస్మము, ఎముక, కేశములు, ఆకులు పడవేసిన శయ్యపై పరుండు స్వామికి వధ,మణులు,పూవులు ఫలములను వేసిన పుత్రజననము, గడ్డి కాష్ఠము వేసిన కన్యాజన్మమగును. ఇసుక, ధాన్యము, అడుసుమట్టి, పుష్పము, ఫలములు ముఖములో నుంచుకొని తనస్థానమునకు వచ్చిన ధనలాభము కలుగును.జలసమీపము నుండి కొన్ని వస్తువులు తీసుకొని ఎగిరిపోయిన భయము కలుగును.

ఎవరి వాహనము, చెప్పులు ఛత్రఛాయను, కాకి తన్నునో వారికి మరణము కలుగును. ఆ వాహనాదులను పూలతో పూజ చేసిన వాటిస్వామికి సన్మానప్రాప్తి కలుగును. ఆ వాహనములపై మలవిసర్జన చేసిన భోజనలాభము కలుగును. కాకిద్రవ్యమును వేరే చోటునుండి తెచ్చిన లాభము, తీసికొని వెళ్ళిన నాశము కలుగును. దూదికి సంబంధించిన వస్తువుతో వస్త్రలాభము తెల్లని వస్తువుతో రజతలాభము లేక నాశము కలుగును.

పాలుగారు వృక్షము, అర్జునవృక్షము, వంజల వృక్షము, నదుల రెండు ఒడ్డు లందున్న కాకి శబ్దము చేసిన, లేక జలములో స్నానము చేసిన వర్షాకాలములో వృష్టి, అన్యఋతువులో దుర్భిక్షము కలుగును. చెట్టు తొఱ్ఱలో నుండి కాకి భయంకరశబ్దము చేసిన భయము కలుగును.జలమును చూచిన, మేఘగర్జన తర్వాత శబ్దము చేసిన వర్షము కురియును. లతలతో సూర్యాభిముఖముగా దు:ఖముతో ముక్కుతో తన శరీరమును పొడుచుకొనుచు, రెక్కలను కదుపుతున్న, ఎరుపు ద్రవ్యములు, పాలు, గడ్డి, కాష్ఠములను ఇంటిలోనికి తెచ్చిన అగ్నిభయము కలుగును.

కాకి గృహస్థుల ఇంటిలో నుండి పూర్వాది దీప్తదిశల వైపు ముఖముపెట్టి శబ్దము చేసిన క్రమముగా రాజభయము, చోరభయము, బంధనము కలహము కలుగును. అనగా దీప్తపూర్వదిశ వైపుకి ముఖముపెట్టి శబ్దము చేసిన రాజభయము, దీప్తదక్షిణదిశ వైపుకి ముఖము పెట్టి శబ్దము చేసిన దొంగలభయము, దీప్తపశ్చిమదిశ వైపుకి ముఖము

పెట్టి శబ్దము చేసిన బంధనము,దీప్త ఉత్తరదిశవైపుకి ముఖముపెట్టి శబ్దము చేసిన కలహము కలుగును.

కాకి శాంత పూర్వదిశలను చూస్తు శబ్దము చేసిన రాజపురుషులు మిత్రుల సమాగమము, సువర్ణలాభము శాలిధాన్యము, బెల్లముతో కూడిన భోజనలాభము కలుగును. శాంత ఆగ్నేయ కోణమునకు చూస్తు శబ్దము చేసిన అగ్నితో జీవించు (కంసాలి, కంచరి) వారికి, యువతితో సమాగమము, ఉత్తమ ధాతులాభము కలుగును. శాంత దక్షిణదిశను చూస్తు శబ్దము చేసిన మినుములు,ఉలవల భోజనము, గానవిద్యను తెలిసిన వానితో స్నేహము కలుగును.

శాంత నైరృతికోణమును చూస్తు శబ్దము చేసిన,దూత, గుర్రము, వస్తువులు, పెరుగు,నూనె, మాంసము, భోజ్యపదార్థముల లాభము కలుగును. శాంత పశ్చిమదిశను చూస్తు శబ్దము చేసిన మాంసము, మద్యము, ధాన్యము, సముద్రములో పుట్టిన రత్నముల లాభము కలుగును. శాంత వాయవ్య కోణమును చూస్తు శబ్దము చేసిన శస్త్రము, లోహము, ఆయుధము, కమలము, లత,ఫలము,భోజనముల లాభము కలుగును. శాంత ఉత్తర దిశను చూస్తు శబ్దము చేసిన పాయసభోజనము, గుర్రము, వస్త్రముల లాభము కలుగును. శాంత ఈశాన్య కోణమును చూస్తు శబ్దము చేసిన నేతితో కూడిన భక్ష్యపదార్థములు, ఎద్దులు లభించును. ఈ విధముగా ఇంటివెనుక నున్న కాకి ఫలితము గృహస్వాములకు కలుగును.

యాత్రాకాలములో చెవిఎత్తులో కాకి ఎగిరిన కుశలమగును. కాని కార్యసిద్ధి కలుగదు. యాత్రచేయువాని ఎదుట శబ్దము చేస్తు వచ్చిన యాత్రలో ఆటంకములు కలుగును. యాత్ర చేయువాని వామభాగములో శబ్దము చేసి, తర్వాత దక్షిణభాగములో శబ్దము చేసిన ధనము అపహరింపబడును. దీనికి వ్యతిరేకముగా దక్షిణభాగములో శబ్దము చేసి తర్వాత వామభాగములో శబ్దము చేసిన ధనలాభము కలుగును.

ప్రయాణ సమయములో వామభాగములో నున్న కాకి వెనుకవైపుకి వెళుతు మాటిమాటికి శబ్దము చేసిన అర్థసిద్ధి యగును. యాత్రా సమయములో పూర్వదిశవాసులకు దక్షిణములో నున్న కాకి వెనుకవైపుకి వెళుతు శబ్దము చేసిన ధనలాభము కలుగును. ప్రయాణము చేయువానికి వామభాగములో నున్న కాకి ఎదురుగా వస్తు శబ్దము చేసిన యాత్రకు విఘ్నము కలుగును. కాని యాత్రలో ఏవిధమైన ఫలితము కలుగునో అది ఇంటిలో నున్నను కలుగును.

ప్రయాణము చేయువాని దక్షిణభాగములో శబ్దము చేసి, వామభాగములో శబ్దము చేసిన కోరిన ధనము లభించును. శబ్దము చేస్తు ముందు నుండి వెళ్ళిన ప్రయాణము చేయువానికి అధిక ధనలాభము కలుగును. వీపువైపున శబ్దము చేస్తు దక్షిణదిశకు

వెళ్ళిన గమనము చేయువాని శరీరము నుండి ఏదోఒక కారణము వలన రక్తము బయటకు వచ్చును. ఒకకాలితో నిలబడి సూర్యుని చూస్తున్న కాకి|||శబ్దము చేసిన ముందు రక్తము పడుటకు కారణమగును. ఒకకాలితో నిలబడి సూర్యుని చూస్తు తనముక్కుతో రెక్కలను దువ్వుతున్న భవిష్యత్తులో ప్రధానవ్యక్తికి వధజరుగును.

ధాన్యసహితమైన పొలములో శాంతదిశలో కాకి శబ్దము చేసిన ధాన్యముతో కూడిన భూమికి లాభము. గ్రామసీమకు చివరినుండి వ్యాకులతతో శబ్దము చేసిన గమనము చేయువానికి కష్టము కలుగును. కోమలమైన ఆకులు, నూతనమైన పల్లవములు, పూవులు,ఫలములు,సుకుమారము,సుగంధయుతము,మధురము, ఛిద్రరహితము మనోహర మైన వృక్షముపైనున్న కాకి అర్థసిద్ధిని కలిగించును.పండినధాన్యమున్న స్థానము, గరికతో కూడిన గృహము, దేవగృహము, హార్మ్యము, శుభస్థానము, ఉన్నతస్థానము, ప్రశస్తస్థానము లో నున్న కాకిశబ్దము చేసిన ధనప్రాప్తి కలుగును.

ఆవుతోక, పుట్టపై కూర్చొనిన కాకి శబ్దము చేసిన సర్పదర్శనమగును. గేదెపై కూర్చొని శబ్దము చేసిన వెంటనే జ్వరము, పొదలలో కూర్చొని శబ్దము చేసిన అల్పశు భాశుభ ఫలము కలుగును. గడ్డిమోపుపై ఎడమవైపున ఉన్న జలములో కూర్చొన్న కాకిశబ్దము చేసిన కార్యనాశము, ఉచ్చభాగములో అగ్నిదగ్ధము, మెరుపు వలన కాలిన వృక్షముపై కూర్చొని కాకి శబ్దము చేసిన వధకలుగును.ముళ్ళు, పాలు కలిగిన వృక్షములపై నున్న కాకి కార్యసిద్ధిని, కలహమును కలిగించును.ముళ్ళవృక్షముపై కూర్చొనిన కాకి కార్యవిఘ్నము, లతలతో కూడిన వృక్షముపై కూర్చొనిన కాకి బంధనమును కలిగించును.

నరికిన వృక్షముపై కాకి కూర్చొనిన అంగచ్ఛేదము, ఎండిన వృక్షముపై కూర్చొనిన కలహము, పేడకు ముందు వెనుకలందు కూర్చొనిన ధనలాభము కలుగును. మృత పురుషుని శరీరముపై శబ్దము చేస్తు కాకి గమనము చేయు వానికి ఎదురుపడిన మృత్యుభయము, ముక్కుతో ఎముకను విరగగొడితు శబ్దము చేసిన ప్రయాణము చేయువాని ఎముక విరుగుటను సూచించును. కాకి త్రాడు, ఎముక, కర్ర, ముళ్ళవస్తువు, అసారవస్తువు, కేశములను ముక్కుతో తీసికొని శబ్దము చేసిన క్రమముగా సర్పము, రోగము, పంది, దొంగ, శస్త్రము, అగ్నిభయము కలుగును.

కాకి తెల్లని పూవులు, అపవిత్ర వస్తువులు, మాంసమును ముఖముతో తీసికొని శబ్దము చేసిన ప్రయాణము చేయువారి కోరిక ఫలించును. రెక్కలను కదిలిస్తు పైకి ముఖముపెట్టి మాటిమాటికి శబ్దము చేసిన యాత్రలో విఘ్నము కలుగును. లోహపు గొలుసులు,చర్మపుత్రాడు, లతలు ముఖముతో తీసికొని శబ్దము చేసిన బంధనము,రాతిపై కూర్చొనిన మార్గములో అపరిచిత వ్యక్తితో సమాగమము కలుగును.

కాకులు ఒకదానికొకటి ముఖముతో భోజనము నిచ్చిన ప్రయాణము చేయువానికి అధికతృప్తి లాభము కలుగును. ఆడ మగకాకులు రెండు కలిసి శబ్దము చేసిన స్త్రీలాభము కలుగును.స్త్రీల నెత్తిపైనున్న నీటికుండపై కాకి కూర్చొనిన స్త్రీలాభమును కలిగించును.కుండను కాలితో తన్నిన పుత్రమరణమగును.కుండపై మలవిసర్జన చేసిన భోజన లాభము కలుగును. యాత్రకు వెళ్ళిన రాజు నివసించు ప్రదేశమును స్కంధావారమందురు. స్కంధావార నిర్మాణకాలములో రెక్కలను కదుపుతు కాకి శబ్దము చేసిన వేరొకస్థానములో నివాసమును సూచించును. రెక్కలను స్థిరముగా నుంచి శబ్దముచేసిన కేవలము భయమును సూచించును.

గద్ద కంకపక్షులతో కూడి కాకి మాంసరహితముగా విరోధము లేకుండ పురము గ్రామములలో ప్రవేశించిన శత్రువులతో స్నేహము కలుగును. కలహము జరుగుతున్న ప్రదేశములో యుద్ధము జరుగును. పందిపై నిలబడిన బంధనము, బురదనిండిన పందిపై నున్న ధనలాభము, ఒంటెపై నిలబడిన క్షేమము కలుగును, కొందరి మతానుసారము గాడిదపై నున్న కాకి వధను కలిగించును.

గుర్రముపై కూర్చొన్న కాకి శబ్దము చేసిన వాహనలాభము, వెనుకవైపు వస్తున్న కాకి శబ్దము చేసిన రక్తముపడును. కాకిని వదిలి మిగిలిన పక్షిగణము ప్రయాణము చేయువాని వెనుక నడిచిన కాకివలె ఫలితముండును. ముప్పదిరెండు భాగములు చేసిన దిక్చక్రములో ఏవిధముగా ఫలితము తెలుపబడెనో అదేవిధముగా ప్రయాణము చేయువారి గుణదోష ఫలములను తెలుపవలెను. శాంత పూర్వదిశలో నున్న శకునము శుభమును, అశుభ శకునము మధ్యమ ఫలము, దీప్తపూర్వదిశలో క్రూర చేష్టతో కూడిన శకునము రాజుల వలన భయము, ఇత్యాదిఫలములను తెలుపవలెను.

తనగూటిలో నున్న కాకి 'కా'శబ్దము నిష్ఫలమగును. 'క వ' శబ్దము ప్రసన్నత కొరకు, 'క'శబ్దము వలన ప్రియమిత్రప్రాప్తి, కర శబ్దము కలహము, కురుకురు శబ్దము ఆనందమును కలిగించును, కట కట శబ్దము పెరుగన్నమును కలిగించును, 'కే కే', 'కు కు, శబ్దములు గమనముచేయువానికి ధనప్రాప్తిని కలిగించునవగును. 'ఖరే ఖరే' శబ్దము పథికుని ఆగమనమును సూచించును. 'కఖాఖా' శబ్దము మృత్యువును, 'ఆ'శబ్దము యాత్రలో విఘ్నము, కఖలా'శబ్దము వెంటనే వర్షమును కలిగించును.

కాక' శబ్దము నాశమును కలిగించును. 'కాకటి' శబ్దము భోజనములో విషాది దోషమును, 'కవ కవ' శబ్దము ఇతరులపై ప్రీతి, 'క గా కు' శబ్దము భయమును, వ డ' శబ్దము వస్త్రలాభమును, 'క ల య'శబ్దము బ్రాహ్మణులతో శూద్రుల సమాగమమును కలిగించును. 'క డ' శబ్దము అభీష్ట ఫలప్రాప్తి, శుభమును సర్పదర్శనమును కలిగించును.'ట డ్డు' శబ్దము వధను, 'స్త్రీ' శబ్దము స్త్రీలాభమును, గడ్ శబ్దము గోలాభమును, షడ్' శబ్దము పూవుల లాభమును కలిగించును. 'టాకు టాకు శబ్దము యుద్ధకారణమగును.

'గుహ' శబ్దము అగ్నిభయము, కటే కటే శబ్దము కలహము, 'టాకులి' 'చిణ్టిచి' కేకేకా' శబ్దములు దోషమును కలిగించును.

శబ్దము, చేష్ట, భోజనము, స్థితి ద్వారా ఒక కాకి వలన ఏఫలితము తెలుపబడెనో దానిని రెండు మూడింటికి కూడ గ్రహించవలెను. తెలుపని ఇతరపక్షుల ఫలితము కూడ కాకి వలనే గ్రహించవలెను. ఈ విధముగా వనములో నుండు జంతువులు,పంది మున్నగు వాటి ఫలితము కుక్క మాదిరిగా తెలిసికొనవలెను.

స్థలచరములు(మేకలు మున్నగునవి) జీవ జలచరములు, జలచరములు (చేపలు మున్నగునవి)జీవ స్థలచరులున్న వర్షాకాలములో అతివృష్టి కలుగును. అన్యఋతువులలో భయము కలిగించును. తేనెటీగలు గృహములో తేనెపట్టు పెట్టిన శీఘ్రముగా ఆభవనము జనసూన్యమగును. నీలవర్ణపు తేనె టీగలు శిరముపై కూర్చున్న మనుష్యునికి మరణము కలుగును.

చీమలు తమ అండములను జలములో వేసిన వర్షము కురవదు. అవే చీమలు అండములను వృక్షము,ఉచ్చస్థానములో నుంచిన వర్షము కురియును.పనులు ప్రారంభించు నపుడు కనపడు శకునములననుసరించి పని చివరివరకు శుభాశుభములు కలుగును. పనిమధ్యలో శకునము కనపడిన దాని ఫలితము అదేరోజు జరుగును. అన్ని కార్యముల ఆరంభసమయములో, యాత్రాకాలములో, గృహప్రవేశకాలములో పూర్వోక్త శకునముల నన్నింటిని విచారించవలెను. ఏకార్యములో కూడా తుమ్మటము శుభమునీయదు.

పూర్వోక్త శకునము రాజుకు శుభఫలము, నిర్విఘ్నముగా కార్యసాధనము, మూలస్థాన పాలనము,మార్గములో సహాయము, దుష్టశత్రునాశనము, ఆరోగ్యము, ఇవన్ని శుభ చేష్టలద్వారా సూచితమగును.కాశ్యపాదుల మతము ననుసరించి ఒకకోశము దూరము వెళ్ళిన తర్వాత శకున శబ్దము నిష్ఫలమగును. యాత్రకాలములో మొదటి శకునమ శుభమైన పదకొండు ప్రాణాయామములు, రెండవ శకునమశుభమైన పదహారు ప్రాణాయామములు చేయవలెను. మూడవ శకునమశుభమైన ఇంటికి తిరిగి రావలెను.

తొంబది ఐదవ వాయసవిరుతాధ్యాయము సమాప్తము



96. శకునోత్తరాధ్యాయము

దిక్కులు, దేశము, చేష్ట, స్వరము(దీప్తశాంతములు) దిననక్షత్రము, ముహూర్తము (శివారులు) హెూర(రాశ్యర్థ కాల హెూరలు)కరణ, లగ్న,అంశలు (ద్రేక్కాణము నవాంశము, ద్వాదశాంశము త్రింశాంశము)చర (మేష,కర్కాటక,తుల,మకర) స్థిర (వృషభ సింహ వృశ్చిక కుంభ)ద్విస్వభావ(మిథున,కన్య,ధనుస్సు,మీన)శకునముల,రాశుల బలాబలము లను తెలిసికొని ఫలితమును తెలుపవలెను.

ఒక దేశములోనున్న పురుషునికి రెండు విధములైన కార్యములు తెలుపబడినవి. ఒకటి ఆగామి(భవిష్యత్తు) రెండు స్థిరసంజ్ఞకము (వర్తమానము) రాజు దూత గుప్తచరులు మరియు ఇతరదేశములలో కలుగు కార్యములు స్థిరసంజ్ఞములు,ఉపద్రవము, బంధు మిత్రుల ఆగమన కార్యములు భవిష్యత్కాలికములగును.

ఉద్బుద్ధము(అక్కడే ఉండుట)సంగ్రహణము(ఇతరులతో సమాగమము) భోజనము దొంగతనము,అగ్నివర్షము,ఉత్సవము, పుత్రుడు,వధ,కలహము, భయము ఇవి స్థిర వర్ణములు. స్థిరస్థానములో ఉత్పన్నమైన స్థిరశకునముల ద్వారా సూచింపబడుతు స్థిరవర్ణములో నుండి ఉదయకాలిక లగ్నము, చంద్రుడున్న రాశిలోనున్నపుడు చర సంజ్ఞకములగును.ఆ కార్యము అదేరోజున జరుగవలెను. లేక ముందు జరిగి ఉండవలెను. లగ్నము చంద్రుడు చరరాశిలోనున్న చరరాశిలో శకునమున్న ఉద్బుద్ధకార్యము భవిష్యత్తులో జరుగునని తెలుపవలెను.

స్థిరస్థానము,రాయి,గృహము,దేవాలయము,భూమి,జలసమీపము ఈ స్థానము లలో శకునమున్న స్థిరకార్యమునకు శుభాశుభ ఫలములగును. ఆశకునములు చల ప్రదేశములోనున్న భవిష్యత్తులో కలుగుకార్యమును సూచించును.జల చర (కర్కాటక మకర మీన)లగ్నములు జలసంజ్ఞక నక్షత్రము (పూర్వాషాఢ శతభిషం) జలసంజ్ఞక ముహూర్తము, పశ్చిమదిశ,జలస్థానము ఈస్థానములలో అమావాస్య పూర్ణిమలలో ప్రదీప్త శకునము శబ్దము చేసిన వర్షము కురియును.శాంత జలచర శకునము జలాదులలో నున్న వర్షము కురియును.

ఆగ్నేయ (పూర్వ దక్షిణ)దిశ, ఆగ్నేయ(మేష సింహ వృశ్చిక మకర కుంభ) లగ్నము అగ్నిముహూర్తము, ఆగ్నేయ(కృత్తిక) నక్షత్రము,ఆగ్నేయదేశము – ఈస్థానములలో సూర్యుని వలన ప్రదీప్తమైన శకునము శబ్దముచేసిన అగ్నిభయము కలుగును. విష్టికరణము మకర కుంభములు లగ్నములో నున్న ముళ్లవృక్షములు, పత్రరహిత లతలపైనున్న సూర్యునితో దీప్తశకునము కూర్చొనిన దోషమును కలిగించును. గ్రామీణశకునము స్వరము చేష్టతో ప్రదీప్తమైన,చాలగట్టిగ శబ్దము చేస్తున్న, ముళ్లవృక్షముపైనున్న సమ్ముఖ,వామ, దక్షిణ పార్శ్వభాగములలో కనపడిన కలహము కలుగును.

కర్కాటక లగ్నములో శుక్రనవాంశలో విదిక్కులలో నుండి దీప్తశకునము క్రిందికి చూస్తు శబ్దము చేసిన ఆదిశలో తెలుపబడు స్త్రీతో సమాగమమగును. పురుషరాశి (మేష మిథున సింహ తుల ధను కుంభ)లగ్నములో విషమ(1,3,5,7,9,11బు,13,15) తిథులలో పూర్వాది దిశలలో పురుషసంజ్ఞక దీప్తశకునమున్న పురుషులతో సమాగమమగును. మిశ్రితమైన (పురుష లగ్నములో సమతిథి, సమరాశి లగ్నములో విషమతిథి, విదిశ విదిశలలో నున్న పురుష సంజ్ఞక దీప్త శకునము) నపుంసకునితో సమాగమమగును.

ఈ విధముగా నవాంశము, లగ్నములలో రవిరాశి లేక లగ్నములో స్వయముగా సూర్యుడున్న సమయములో శబ్దము చేసిన ప్రధానపురుషుని ఆగమనమునకు కారణమగును. అన్ని పనులతో ప్రారంభములో సూర్యుడున్న రాశి నుండి లగ్నరాశి వరకు లెక్కించవలెను. రవి ఉన్న రాశి సంపత్తు, ద్వితీయరాశి విపత్తు, తృతీయరాశి సంపత్తు ఈ విధముగా లగ్నరాశి వరకు లెక్కించవలెను. సంపత్‌రాశిలో కార్యసిద్ధి, విపత్‌రాశిలో కార్యనాశమును తెలిసికొనవలెను.

లగ్నము నుండి పన్నెండవ స్థానములో సూర్యుడున్న ఎడమకన్నులో గుడ్డితనము, చంద్రుడున్న కుడికన్నులో గుడ్డతనము, లగ్నస్థిత సూర్యుడు పాపగ్రహములతో (మంగళ,శని) చూడబడిన గుడ్డితనము, సింహలగ్నములో సూర్యుడున్న గూని,చెవుడు, మూర్ఖత్వము కలుగును. లగ్నమునుండి పాపగ్రహము(రవి కుజ శనులు) ఆరవస్థానములో నుండి పాపగ్రహముతో చూడబడు రాశికి సంబంధించిన అంగములో వ్రణముతో కూడిన పురుషునితో సమాగమమగును. ఈవిధముగా జన్మవిషయములో నేను తెల్పిన విషయములు ఈప్రకరణములో తెలిసికొనవలెను.

ప్రశ్నజ్ఞానమైన తర్వాత ద్రవ్యము (ధాతు మూల జీవులు)లలో లోకప్రసిద్ధము, అనేక అక్షరములతో సంగృహీతము, ఇష్టు(నారాయణ, అర్క, వశిష్ట, పరాశర, మయాదులు) లతో నిర్మితము విభాగీకృత నామముల కేంద్రమును క్రమముగా తెలిపెదను.

లగ్న, చతుర్థలగ్న, సప్తమలగ్న, దశమలగ్నములో రాశినవాంశమున్న దానినుండి తమతమ రాశి నాశ్రయించిన అక్షరములు గ్రహములను గణముల క్రమములో అక్షరము లను తెలిసికొనవలెను.

క, ఖ, గ, ఘ ఙ – ఇవి మంగళగ్రహ వర్గులు

చ, ఛ, జ, ఝ ఞ – ఇవి శుక్రగ్రహ వర్గులు

ట, ఠ, డ, ఢ, ణ – ఇవి బుధగ్రహ వర్గులు

త, థ, ద, ధ, న – ఇవి గురుగ్రహ వర్గులు

ప, ఫ, బ, భ, మ – ఇవి శనిగ్రహ వర్గులు

య, ర, ల, వ, శ, ష, స, హ క్ష ఇవి చంద్రగ్రహ వర్గులు

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః – ఇవి సూర్యగ్రహ వర్గులు

ద్రేక్కాణవృద్ధితో నామమును తెలిపెదను. విషమరాశి ప్రథమద్రేక్కాణములో మూడు అక్షరములు, ద్వితీయద్రేక్కాణములో ఐదు అక్షరములు, తృతీయద్రేక్కాణములో ఏడు అక్షరముల నామమును తెలిసికొనవలెను. సమరాశి ప్రథమ ద్రేక్కాణములో రెండు అక్షరములు, ద్వితీయద్రేక్కాణములో నాలుగు అక్షరములు, తృతీయద్రేక్కాణములో ఆరు అక్షరముల నామమును తెలిసికొనవలెను. గ్రహదృష్టి వృద్ధి వలన నామాక్షరములగును. ఇక్కడ రెండు విధములైన నామాక్షరములు తేబడును. మొదటిది స్థితివశము, రెండవది దృష్టివశము. దృష్టివశమున నామాక్షరము తెచ్చునపుడు దృష్టి బలవిచారణ చేయవలెను.

చరరాశిలో ప్రథమనవాంశము, స్థిరరాశిలో పంచమ నవాంశము, ద్విస్వభావ రాశిలో నవమ నవాంశము వర్గోత్తమ సంజ్ఞకమగును. సమరాశులలో చరరాశి వర్గోత్తమ నవాంశమైన రెండు అక్షరములు, స్థిరరాశి వర్గోత్తమ నవాంశమైన మూడు అక్షరములు, స్థిరరాశి వర్గోత్తమ నవాంశమైన ఐదు అక్షరముల నామమగును. ద్విస్వభావరాశులలో రాశివలె నామాక్షరముల సంఖ్య ఉండును. విషమరాశి(మిథున ధనుస్సులు) వర్గోత్తమ నవాంశమైన మూడు ఏడు అక్షరములు, సమరాశి(కన్య మీనములు) నవాంశమైన నాలుగు ఆరు అక్షరముల నామమగును.

ద్విస్వభావరాశి, లేక బుధునితో చూడబడు ద్విస్వభావరాశిలో రెండు నామములను తెలుపవలెను. లగ్న నవాంశలో జరిగిన సంఖ్యననుసరించి నామాక్షర సంఖ్యను తెలుపవలెను.

విషమరాశులలో నామము మొదట సంయుక్తాక్షరములను గుర్తించవలెను. (శ్రీధర,క్షీర,స్మర,మున్నగునవి)సమరాశులలో చివరిలో సంయుక్తాక్షరమును తెలిపెను. (పద్మ, ధర్మ, వత్సమున్నగునవి) ఉచ్చాంశలో రాశియోగముతో ఒకఅక్షరము రెండు మార్లు వచ్చును.(దరద, దామోదర మున్నగునవి) సమరాశిలో ఉచ్చాంశ ఉన్న ద్వితీయాది సమ అక్షరములు రెండుమార్లు వచ్చును.(దేవదత్త, ధరాధర మున్నగునవి) లగ్నములోనున్న నవాంశరాశిలో గురుఅక్షరముండును.(కపిత్థ,అశ్వత్థమున్నగునవి) సమరాశియైన సమాక్షరము సంయుక్తమగును (దగ్ధము,శుద్ధము,రక్తము మున్నగునవి)

లగ్నమునుండి పంచమ నవమస్థానములలో సూర్యాదిగ్రహములున్న నామాక్షరము మాత్రాయుక్తమగును.సమరాశి ద్రేక్కాణమైన సమాక్షరము మాత్రాక్షర మగును (ఈశ్వర మున్నగునవి) విషమరాశి ద్రేక్కాణమైన విషమాక్షరములు మాత్రాయుక్త మగును (శ్రీధర ఇత్యాది) లగ్నమునుండి దశమస్థానము బలీయమైన ఊర్ధ్వమాత్రతో కూడిన నామము మొదటి అక్షరము శ్రీధర, వాసుదేవ, వైశ్రవణ, శౌండ ఆదులు, చతుర్థ స్థానము బలీయమైన అధోమాత్రతో కూడిన నామపు మొదటి అక్షరము సుహిరణ్య,

శూర వర్మ, ఆది సప్తమస్థానము బలీయమైన విసర్గయుత నామాది అక్షరమగును.

లగ్న, చతుర్ధ, సప్తమ, దశమస్థానములలో నున్న నవాంశల ద్వార నామాక్షర సంగ్రహమగును. పాపగ్రహము కేంద్రము, త్రికోణములోనున్న లేక పాపగ్రహముల దృష్టి వలన అక్షరములు నాశనమగును. అతిబలమైన శుభగ్రహము ఏరాశి ఏసంఖ్య నవాంశలో నున్నదో దానితో సమానమైన అక్షరములనిచ్చును. అత్యంత బలమైన శుభ గ్రహ కేంద్ర త్రికోణ ఉచ్చ నవాంశలలో నుండి చూడబడినచో రెండు అక్షరములగును.

లగ్నస్వామి నవాంశ బలహీనమైన దానితో సంపన్నమైన మాత్రాక్షరము నాశనమగును. అదే లగ్నస్వామి, నవాంశము బలహీనమైన ఉచ్చస్థిత నవాంశస్వామిచే చూడబడిన మాత్రాక్షరముల ఉత్పత్తి జరుగును. కేంద్రములో రాశి రాశిపతి స్థానము బలములను తెలిసికొని ఆనుపూర్విక సంయోగము చేయవలెను. మాత్రాదుల సంయోగము ను కూడా కల్పన చేయవలెను.

మొదట లగ్నరాశి,తర్వాత చతుర్ధరాశి ప్రథమనవాంశము క్రమముగా నవాంశాధి పతి గ్రహముల తమ తమ వర్గాక్షరముల సంయోగములో ఈ నిష్పత్తిని చేయవలెను. తర్వాత దీని అర్ధము స్పష్టమగును. లగ్నములో మేషరాశి, ప్రథమ నావంశమైన దానినుండి నాలుగేసి క్రమములో మేషము, కర్కాటకము, తుల, మకర రాశులగును. మేషములో ప్రథమనవాంశ స్వామి కుజుడు, అతని వర్గప్రథమాక్షరము 'క'కారము, చతుర్ధరాశి (కర్కాటకము) ప్రథమ నవాంశ స్వామి చంద్రుడు, అతని వర్గప్రథమాక్షరము 'ప' కారము. మేషరాశి లగ్నములో ద్వితీయ నవాంశమైన మేషరాశిలో ద్వితీయ నవాంశమైన శుక్ర వర్గము ద్వితీయ అక్షరము 'చ'కారము. చరుర్ధరాశిలో (కర్కాటకములో) ద్వితీయ నవాంశ స్వామి సూర్యునివర్గపు ప్రథమాక్షరము 'అ' కారము. సప్తమరాశి తులలో ద్వితీయ నవాంశ స్వామి మంగళ గ్రహవర్గ ద్వితీయ అక్షరము 'ఖ' కారము. దశమరాశి (మకరము) లో ద్వితీయ నవాంశస్వామి శని వర్గపు ద్వితీయ అక్షరము 'ఫ' కారమగును.

మేషలగ్నములో తృతీయ నవాంశమైన మేషరాశిలో తృతీయ నవాంశాధిపతి బుధుని వర్గప్రథమాక్షరము 'ట' కారము,చతుర్ధరాశి (కర్కాటకము)లో తృతీయ నవాంశాధి పతి బుధవర్గములో ద్వితీయఅక్షరము'ఠ'కారము. సప్తమ(తుల)రాశిలో తృతీయ నవాంశాది పతి గురుని వర్గ ప్రథమాక్షరము 'త' కారము. దశమ(మకర)రాశిలో తృతీయ నవాంశాధి పతి గురుని వర్గ ద్వితీయ అక్షరము 'థ' కారమగును. మేషలగ్నములో చతుర్ధ నవాంశమైన మేషరాశికి చతుర్ధ నవాంశాధిపతి చంద్రవర్గ ద్వితీయఅక్షరము 'ర' కారము. చతుర్ధరాశి (కర్కాటకము)లో చతుర్ధ నవాంశాధిపతి శుక్రవర్గ తృతీయ అక్షరము'జ' కారము. సప్తమ రాశి (తుల)లో చతుర్ధ నవాంశాధిపతి శనివర్గ తృతీయ అక్షరము 'బ' కారము. దశమ (మకరము)రాశిలో చతుర్ధ నవాంశాధిపతి కుజవర్గ తృతీయాక్షరము 'గ' కారమగును.

మేషలగ్నములో పంచమ నవాంశమైన మేష పంచమ నవాంశాధిపతి సూర్యవర్గ ద్వితీయాక్షరము 'ఆ'కారము, చతుర్థరాశి(కర్కాటకము)లో పంచమ నవాంశాధిపతి కుజవర్గ చతుర్థాక్షరము 'ఘ' కారము. సప్తమ(తుల)రాశిలో పంచమనవాంశాధిపతి శనివర్గ చతుర్థాక్షరము 'భ'కారము. దశమరాశిలో (మకరము)పంచమ నవాంశాధిపతి శుక్రవర్గ చతుర్థ అక్షరము 'ఝ'కారమగును. మేషలగ్నములో షష్ఠనవాంశాదిపతి బుధునివర్గ తృతీయాక్షరము 'డ' కారము. చతుర్థరాశిలో షష్ఠనవాంశాధిపతి గురునివర్గ తృతీయాక్షరము 'ద' కారము. సప్తమ(తుల)రాశిలో షష్ఠ నవాంశాధిపతి చతుర్థాక్షరము 'ధ'కారము దశమరాశి (మకరము)లో షష్ఠనవాంశాధిపతి బుధునివర్గ చతుర్థాక్షరము 'ఢ' కారమగును.

మేషలగ్నములో సప్తమనవాంశమైన మేషములో సప్తమ నవాంశాధిపతి శుక్ర వర్గ పంచమాక్షరము 'ఞ' కారము. చతుర్థరాశి(కర్కాటకము)లో సప్తమ నవాంశాధిపతి శనివర్గపంచమాక్షరము 'మ' కారము. సప్తమరాశి (తుల)లో సప్తమనవాంశాధిపతి మంగళ వర్గపంచమారము 'ఙ' కారము. దశమరాశి(మకరము)లో సప్తమ నవాంశాధిపతి చంద్రవర్గ తృతీయ అక్షరము 'ల' కారమగును. మేషలగ్నములో అష్టమ నవాంశమైన మేషములో అష్టమనవాంశాధిపతి మంగళవర్గ ప్రథమ అక్షరము 'క' కారము. చతుర్థరాశిలో అష్టమ నవాంశాధిపతి శనివర్గ ప్రథమ అక్షరము 'ఏ' కారము. సప్తమరాశిలో అష్టమ నవాంశాధిపతి శుక్రవర్గ ప్రథమ అక్షరము 'చ' కారము. దశమరాశిలో అష్టమ నవాంశాధిపతి సూర్యవర్గ తృతీయ అక్షరము 'ఇ' కారమగును.

మేషలగ్నములో నవమ నవాంశమైన మేషములో నవమనవాంశాధిపతి గురువర్గ పంచమాక్షరము 'న' కారము. చతుర్థరాశి కర్కాటములో నవమ నవాంశాధిపతి గురువర్గ ప్రథమ అక్షరము 'త'కారము. సప్తమరాశిలో నవమ నవాంశాధిపతి బుధుని వర్గ పంచమాక్షరము 'ణ' కారము. దశమరాశి(మకరము)లో నవమ నవాంశాధిపతి బుధవర్గ ప్రథమ అక్షరము 'ట' కారము వచ్చును. ఇది చర సంజ్ఞక రాశుల గురించి తెలుపబడినది. ఇప్పుడు స్థిరసంజ్ఞక రాశుల గురించి తెలుపబడును.

వృషభలగ్నములో ప్రథమ నవాంశమైన వృషభములో ప్రథమ నవాంశాధిపతి శనివర్గ ద్వితీయ అక్షరము 'ఫ' కారము. చతుర్థరాశిలో ప్రథమ నవాంశాధిపతి మంగళవర్గ ద్వితీయ అక్షరము 'ఖ' కారము. సప్తమ (వృశ్చిక)రాశిలో ప్రథమ నవాంశాధిపతి చంద్రవర్గ చతుర్థాక్షరము 'వ' కారము. దశమరాశి(కుంభము)లో ప్రథమ నవాంశాధిపతి శుక్రవర్గ ద్వితీయ అక్షరము 'ఛ' కారమగును. ఈ విధముగా స్థిరసంజ్ఞక రాశుల ప్రథమ నవాంశములో వర్గవిన్యాసము చేయవలెను.

వృషభలగ్నములో ద్వితీయ నవాంశమైన వృషభ ద్వితీయనవాంశాధిపతి శనివర్గ

తృతీయ అక్షరము 'బ' కారము. చతుర్థరాశి (సింహము)లో ద్వితీయ నవాంశాధిపతి శుక్రవర్గ తృతీయ అక్షరము'జ'కారము. సప్తమరాశి(వృశ్చికము)లో ద్వితీయ నవాంశాధిపతి సూర్యవర్గ చతుర్ధ అక్షరము 'ఈ' కారము. దశమరాశి (కుంభము)లో ద్వితీయ నవాంశాధిపతి మంగళవర్గ తృతీయ అక్షరము 'గ' కారము వచ్చును. వృషభలగ్నములో తృతీయ నవాంశమైన వృషభములో తృతీయ నవాంశాధిపతి గురువర్గ ద్వితీయఅక్షరము 'థ'కారము. చతుర్ధరాశి(సింహము)లో తృతీయ నవాంశాధిపతి బుధవర్గ ప్రథమ అక్షరము'ట' కారము. సప్తమరాశి (తుల)లో తృతీయ నవాంశాధిపతి బుధవర్గ తృతీయ అక్షరము 'డ' కారము. దశమరాశి (కుంభము)లో తృతీయ నవాంశాధిపతి గురువర్గ తృతీయ అక్షరము 'ద' కారము వచ్చును.

వృషభలగ్నములో చతుర్ధ నవాంశమైన వృషభములో చతుర్ధ నవాంశాధిపతి మంగళ వర్గ చతుర్ధ అక్షరము 'ఘ' కారము. చతుర్ధరాశిలో చతుర్ధ నవాంశాధిపతి చంద్ర వర్గ పంచమాక్షరము'శ' కారము. సప్తమరాశిలో చతుర్ధ నవాంశాధిపతి శుక్రవర్గ చతుర్ధ అక్షరము 'ఝ' కారము. దశమరాశిలో చతుర్ధనవాంశాధిపతి శనివర్గ చతుర్ధ అక్షరము 'భ' కారము వచ్చును. వృషభలగ్నములో పంచమ నవాంశమైన వృషభములో పంచమ నవాంశాధిపతి శుక్రవర్గ పంచమాక్షరము'ఞ'కారము. చతుర్ధరాశిలో పంచమ నవాంశాధిపతి సూర్యవర్గ పంచమాక్షరము 'ఉ'కారము. సప్తమరాశిలో పంచమ నవాంశాధిపతి మంగళవర్గ పంచమాక్షరము 'ఙ' కారము. దశమరాశిలో పంచమ నవాంశాధిపతి శనివర్గ పంచ మాక్షరము 'మ' కారము వచ్చును.

వృషభలగ్నములో షష్ఠనవాంశమైన వృషభములో షష్ఠ నవాంశాధిపతి బుధవర్గ చతుర్ధ అక్షరము 'ఢ'కారము. చతుర్ధరాశిలో షష్ఠ నవాంశాధిపతి బుధవర్గ పంచమాక్షరము 'ణ' కారము. సప్తమరాశిలో షష్ఠ నవాంశాధిపతి గురువర్గ చతుర్థాక్షరము 'ధ' కారము. దశమరాశిలో షష్ఠనవాంశాధిపతి గురువర్గ పంచమాక్షరము 'న' కారము వచ్చును. వృషభలగ్నములో సప్తమనవాంశమైన వృషభములో సప్తమ నవాంశాధిపతి చంద్రవర్గ షష్ఠఅక్షరము 'ష' కారము. చతుర్ధరాశిలో సప్తమనవాంశాధిపతి శుక్రవర్గ ప్రథమ అక్షరము 'చ' కారము. సప్తమరాశిలో సప్తమనవాంశాధిపతి శనివర్గ ప్రథమ అక్షరము 'ప' కారము. దశమరాశిలో సప్తమ నవాంశాధిపతి మంగళవర్గ ప్రథమాక్షరము 'క' కారము వచ్చును.

వృషభలగ్నములో అష్టమ నవాంశమైన వృషభములో అష్టమ నవాంశాధిపతి సూర్యవర్గ షష్ఠ అక్షరము 'ఊ' కారము. చతుర్థరాశిలో అష్టమ నవాంశాధిపతి మంగళవర్గ ద్వితీయ అక్షరము 'ఖ' కారము. సప్తమరాశిలో అష్టమ నవాంశాధిపతి శుక్రవర్గ ద్వితీయ అక్షరము 'ఛ' కారము వచ్చును. వృషభలగ్నములో నవమ నవాంశమైన వృషభములో నవమనవాంశాధిపతి బుధవర్గ ప్రథమ అక్షరము 'ట' కారము, చతుర్థరాశిలో నవమ

నవాంశాధిపతి గురువర్గ ప్రథమ అక్షరము 'త'కారము,సప్తమరాశిలో నవమ నవాంశాధిపతి గురువర్గ ద్వితీయ అక్షరము 'థ' కారము. దశమరాశిలో నవమ నవాంశాధిపతి బుధవర్గ ద్వితీయాక్షరము 'ఠ' కారము వచ్చును.

ద్విస్వభావరాశి మిథునలగ్నములో ప్రథమ నవాంశమైన మిథునములో ప్రథమ నవాంశాధిపతి శుక్రవర్గ తృతీయ అక్షరము 'జ'కారము, చతుర్థరాశిలో ప్రథమనవాంశాధిపతి శనివర్గ తృతీయ అక్షరము బ కారము, సప్తమరాశిలో ప్రథమ నవాంశాధిపతి మంగళవర్గ తృతీయ అక్షరము గ కారము, దశమరాశిలో ప్రథమ నవాంశాధిపతి చంద్రవర్గ సప్తమ అక్షరము స కారము వచ్చును.

మిథునలగ్నములో ద్వితీయ నవాంశమైన మిథునములో ద్వితీయ నవాంశాధిపతి మంగళవర్గ చతుర్ధ అక్షరము ఘ కారము, చతుర్థరాశిలో(కన్య)ద్వితీయ నవాంశాధిపతి శనివర్గ చతుర్థ అక్షరము 'భ' కారము, సప్తమరాశి(ధనుస్సు)లో ద్వితీయ నవాంశాధిపతి శుక్రవర్గ చతుర్థ అక్షరము 'ఝ' కారము, దశమ(మీన)రాశిలో ద్వితీయ నవాంశాధిపతి సూర్యవర్గ చతుర్థ అక్షరము 'ఈ' కారము వచ్చును. మిథునలగ్నములో తృతీయనవాంశమైన మిథునములో తృతీయ నవాంశాధిపతి గురువర్గ తృతీయ అక్షరము 'ద' కారము, చతుర్థరాశిలో తృతీయ నవాంశాధిపతి గురువర్గ చతుర్థ అక్షరము 'ధ'కారము, సప్తమరాశిలో తృతీయ నవాంశాధిపతి బుధవర్గ తృతీయ అక్షరము 'డ' కారము, దశమరాశిలో తృతీయ నవాంశాధిపతి బుధవర్గ చతుర్ధాక్షరము 'ఢ' కారము వచ్చును.

మిథునలగ్నములో చతుర్థ నవాంశమైన మిథునములో చతుర్థ నవాంశాధిపతి శనివర్గ పంచమాక్షరము'మ'కారము, చతుర్థరాశి(కన్య)లో చతుర్థనవాంశాధిపతి మంగళవర్గ పంచమాక్షరము 'ఙ' కారము, సప్తమరాశి(ధనుస్సు)లో చతుర్థ నవాంశాధిపతి చంద్రవర్గ అష్టమ అక్షరము 'హ' కారము, దశమరాశిలో చతుర్థ నవాంశాధిపతి శుక్రవర్గ పంచమాది అక్షరము 'ఞ'కారము వచ్చును. మిథునలగ్నములో పంచమ నవాంశాధిపతియైన మిథునములో పంచమ నవాంశాధిపతి శనివర్గ ప్రథమాక్షరము 'ప' కారము, చతుర్థరాశి (కన్య)లో పంచమ నవాంశాధిపతి శుక్రవర్గ ప్రథమాక్షరము 'చ' కారము, సప్తమ (ధనుస్సు) రాశిలో పంచమ నవాంశాధిపతి సూర్యవర్గ అష్టమాక్షరము 'ఐ' కారము, దశమరాశిలో (మీనము)లో పంచమ నవాంశాధిపతి మంగళవర్గ ప్రథమ అక్షరము 'క'కారము వచ్చును.

మిథునలగ్నములో షష్ఠనవాంశమైన మిథునములో షష్ఠనవాంశాధిపతి గురువర్గ పంచమాక్షరము 'న'కారము,చతుర్థరాశి (కన్య)లో షష్ఠనవాంశాధిపతి బుధవర్గ పంచమాక్షరము 'ణ' కారము,సప్తమరాశి (ధను)లో షష్ఠనవాంశాధిపతి బుధవర్గ ప్రథమాక్షరము 'ట' కారము, దశమరాశి(మీన)లో షష్ఠనవాంశాధిపతి వర్గ ప్రథమాక్షరము 'త' కారము వచ్చును. మిథునలగ్నములో సప్తమ నవాంశమైన మిథునములో సప్తమ నవాంశాధిపతి

మంగళ వర్గ ద్వితీయాక్షరము 'ఖ' కారము, చతుర్థరాశి (కన్య)లో సప్తమ నవాంశాధిపతి చంద్రవర్గ ప్రథమాక్షరము 'య' కారము, సప్తమరాశి (ధను)లో సప్తమ నవాంశాధిపతి శుక్రవర్గ ద్వితీయ అక్షరము 'ఛ' కారము, దశమరాశి(మీనం)లో సప్తమ నవాంశాధిపతి శనివర్గ ద్వితీయ అక్షరము 'ఫ' కారము వచ్చును.

మిథునలగ్నములో అష్టమ నవాంశమైన మిథునములో అష్టమ నవాంశాధిపతి శుక్రవర్గ తృతీయ అక్షరము 'జ' కారము,చతుర్థరాశి(కన్య)లో అష్టమ నవాంశాధిపతి సూర్యవర్గ నవమాక్షరము 'ఓ' కారము, సప్తమరాశి(ధనుస్సు)లో అష్టమనవాంశాధిపతి మంగళవర్గ తృతీయాక్షరము 'గ' కారము, దశమరాశి (మీనము)లో అష్టమ నవాంశాధిపతి శనివర్గ తృతీయాక్షరము 'బ' కారము, వచ్చును. మిథునలగ్నములో నవమ నవాంశమైన మిథునములో నవమ నవాంశాధిపతి బుధవర్గ ద్వితీయాక్షరము 'ఠ' కారము, చతుర్థరాశి (కన్య)లో నవమ నవాంశాధిపతి బుధవర్గ తృతీయాక్షరము 'డ' కారము, సప్తమరాశి (ధనుస్సు) లో నవమ నవాంశాధిపతి గురువర్గ ద్వితీయాక్షరము 'థ' కారము, దశమరాశి (మీనము)లో నవమ నవాంశాధిపతి గురువర్గ తృతీయాక్షరము 'ద' కారము వచ్చును.

ఈ విధముగా నామాక్షరముల సంగ్రహ నిర్విశేషవిధి తెలుపబడినది. కొందరు ఆచార్యులు మేషాది అన్నిలగ్నములలో ముందు తెల్పిన విధముగా చేయవలెనని తెలిపెదరు.

కేంద్రగత మేషాది రాశుల నవాంశ సంఖ్యతో కేంద్రగత రాశి అక్షరములను గుణించి తొమ్మిదితో భాగించిన మిగిలిన శేషసమానముగా నవాంశాధిపతి క్రమములలో అక్షరములను తెలిసికొనవలెను. ఇక్కడ ఆచార్యుల అభిప్రాయము ఈ విధముగా నున్నది. చరాది మూడు కేంద్రములలో మంగళాది పంచగ్రహములు ఆరేసి నవాంశములగును. కేంద్రములో తొమ్మిది అక్షరములుండును. నవ నవాంశములో తొమ్మిది అక్షరములున్న షష్ఠనవాంశములో ఆరు అక్షరములు వచ్చును. అందువలన చరరాశి ప్రథమ నవాంశములో తమవర్గ ప్రథమాక్షరము ద్వితీయములో ద్వితీయము, తృతీయములో తృతీయము, చతుర్థములో చతుర్థము, పంచమములో పంచమము, షష్ఠమములో ప్రథమము, స్థిరరాశిలో ప్రథమ నవాంశములో తమ వర్గ ద్వితీయ అక్షరము, ద్వితీయములో తృతీయము, తృతీయములో చతుర్థము, చతుర్థములో పంచమము, పంచమములో ప్రథమము, షష్ఠములో ద్వితీయము, ద్విస్వభావరాశిలో ప్రథమ నవాంశలో తమవర్గ తృతీయము, ద్వితీయములో చతుర్థము, తృతీయములో పంచమము, చతుర్థములో ప్రథమము, పంచమములో ద్వితీయము,షష్ఠనవాంశములో తమవర్గ తృతీయ అక్షరమును తెలిసికొనవలెను. సూర్యచంద్రుల చరాది మూడుకేంద్రములలో మూడేసి నవాంశలుండును. అందువలన చరరాశి ప్రథమ నవాంశములో తనవర్గ ప్రథమాక్షరము,ద్వితీయములో ద్వితీయము, తృతీయములో తృతీయము, స్థిరరాశిలో ప్రథమనవాంశములో తమవర్గ చతుర్థాక్షరము

ఇత్యాదులను క్రమముగా తెలిసికొనవలెను.

మనసులో తలంచు కార్యముల కల్పన, ప్రార్థిత నిర్గతము (వాణి వాక్కు బయటకు వచ్చుట) నష్టవస్తువు, క్షతము, స్త్రీ, రతి, భోజనము, స్వప్నము, నక్షత్రము, చింత పురుషాది నామములను తెలిసికొనవలెను. ఇక్కడ నాలుగు కేంద్రములున్న కారణముగా లగ్నాది క్రమముతో తలంచిన నామములను తెలిసికొనవలెను. లగ్నములో తలంచిన చతుర్థముతో ప్రార్థితము, సప్తమముతో నిర్గతము, దశమముతో నష్టవస్తువు, మరల లగ్నముతో క్షతము, చతుర్థముతో స్త్రీ సప్తమముతో రతి, దశమముతో భోజనము, మరల లగ్నముతో స్వప్నము, చతుర్థముతో నక్షత్రము, సప్తమముతో చింత,దశమముతో పురుషాది నామములను తెలిసి కొనవలెను. ఇంతవరకు యవనేశ్వరుడు తెల్పిన అక్షరకోశము.

చరలగ్నము చరనవాంశములో ప్రశ్నకర్త రెండు అక్షరముల నామము, స్థిరలగ్న స్థిరనవాంశములో నాలుగక్షరములనామము కలుగును. ద్విస్వభావరాశి లగ్నము, నవాంశములో రెండు నామములుండును. దానిలో ఒకటి మూడు అక్షరములు, రెండవది ఐదు అక్షరములు కలవగును.

మంగళ,శుక్ర,బుధ,బృహస్పతి,శని క్రమముగా క వర్గాదులగును. మంగళ గ్రహము క వర్గు, శుక్ర చ వర్గు, బుధ ట వర్గు, బృహస్పతి త వర్గు, శని ప వర్గు యగును. చంద్రుని య కారాది ఎనిమిదవర్గములు (య ర ల వ శ ష స హ) రవి అ కార స్వరములగును. ప్రయోజనము - లగ్నము, చతుర్థము, సప్తమము, దశమము, ఈ నాలుగు స్థానములలో వర్తమాన నవాంశాధిపతి అక్షరములున్న వాటిని క్రమముగా స్థాపించి నామరచనను చేయవలెను. ఏగ్రహమైన వర్గోత్తమము స్వరాశి స్వద్రేక్కాణము, స్వనవాంశము స్వోచ్చలోనున్న,బలమైన అది తన అక్షరములను ద్విగుణితము, త్రిగుణితము, చేయును. వర్గోత్తమాదులతో వదలిపెట్టబడిన, తమ అక్షరములను నాశనము చేయును. లగ్ననవాంశాధిపతి సూర్యుడైన ఇంద్ర పర్యాయము శుక్రుడైన ఇంద్రాణి పర్యాయము, శనియైన బ్రహ్మపర్యాయ నామమగును. సూర్యాది గ్రహములను విచారణ చేసి రెండు మూడు ఆది అక్షర నామములతో తమవృద్ధిని కల్పన చేయవలెను.

నామాక్షరములనిచ్చు గ్రహములలో చంద్రుడు బలవంతుడైన స్తనపానము చేయు బాలుడు, మంగళగ్రహమైన బాలుడు, (రెండు నుండి ఆరువర్షములు) బుధుడైన బ్రహ్మచారి,శుక్రుడైన యువకుడు,గురువైన మధ్యవయస్కుడు, సూర్యుడైన వృద్ధుడు శనియైన అతివృద్ధుడగును.

తొంబది ఆరవ శకునోత్తరాధ్యాయము సమాప్తము



97. పాకాధ్యాయము

సూర్యుని ఫలితము ఒకపక్షములో, చంద్ర ఫలితము ఒకమాసములో కుజగ్రహ ఫలితము భౌమచార ప్రకరణములో చెప్పిన విధముగ,బుధఫలము ఉదయించిన సమయములో,గురుని ఫలము సంవత్సరములో, శుక్రఫలము ఆరుమాసములలో, శని ఫలము సంవత్సరములో,చంద్ర గ్రహణములో రాహుఫలము ఆరుమాసములలో, సూర్య గ్రహణఫలము సంవత్సరములో,త్వష్టానామ గ్రహ,తామస,కీలకమునకు తత్కాలములో, ధూమకేతు ఫలము మూడుమాసములలో, శ్వేతకేతు ఫలము ఏడురాత్రులలో,సూర్య చంద్ర పరివేష, ఇంద్రధనుస్సు, సంధ్య అభ్రసూచీఫలము, ఏడు రోజులలో కలుగును.

శీతాకాలములో వేడి, ఉష్ణకాలములో శీతలము,ఋతువుకానపుడు ఫలములు, పూవులు, దిగ్దాహము, స్థిర(వృక్షాది) చర (చతుష్పదాది)ములకు విపర్యయము(వృక్షాదుల చలనము,చతుష్పదాదుల నిశ్చలనము) ప్రసూతి వికృతి ఫలము ఆరుమాసములలోనగును. ఆచారరహిత కార్యము చేయుట, భూకంపము, ఉత్సవము చేయకుండుట,అశుభ వస్తువులు కలుగుట,ఎండని సరోవరము ఎండిపోవుట, నదీప్రవాహములు వ్యతిరేకముగా ప్రవహించుట వీటి ఫలితము ఆరుమాసములలో జరుగును.

స్తంభము, మట్టికోటలు, ప్రతిమ, వాటిసంభాషణము, ఏడ్చుట, నీరుకారుట, చెమటపట్టుట, కలహము, ఇంద్రధనుస్సు, నిర్ఘాత ఫలము మూడుమాసములలో జరుగును. ఇంద్రధనుస్సు ఫలితము ఒకవారములో లేకున్న మూడు మాసములలో జరుగును.

పురుగులు, ఎలుకలు, ఈగలు, సర్పముల ఆధిక్యము, మృగపక్షుల శబ్దములు, జలములో మట్టిగడ్డి తేలుట వీటి ఫలితము మూడుమాసములలో జరుగును. వనములో కుక్కలు ప్రసవించుట, వనజంతువులు గ్రామములోనికి ప్రవేశించుట, తేనెపట్టుట, తోరణము ఇంద్రధనుస్సు వీటిఫలితము ఒకసంవత్సరములో లేక కొంచెము అధిక సమయములో జరుగును. నక్క గద్దల సమూహముల ఫలితము పదిరోజులలో, వాయించని తూర్యనాద ఫలము తత్కాలములో, శాపము పుట్ట భూమి పగులుట వీటి ఫలము ఒక పక్షములో జరుగును.

అగ్ని లేకుండ జ్వాలలు పైకి లేచుట, నెయ్యి, కొవ్వు మున్నగువాటి (మాంసము రక్తము, అన్నము,మద్యము పుష్పము ఫలము పత్రము మట్టి రాయి) వర్షఫలము తత్కాలములో జనాపవాద ఫలము ఒకటిన్నరమాసములలో జరుగును. ఛత్రము,యజ్ఞచితి, యజ్ఞయూపము, అగ్ని బీజము వీటి వికారములుత్పన్నమైన కలుగుఫలము పక్షములో జరుగును. కొంతమంది ఆచార్యులు ఛత్రతోరణముల ఫలము ఒకమాసములో కలుగునని తెలిపిరి.

అతిశయముగా శత్రుత్వము కలవారి మధ్యస్నేహము, ఆకాశములో ప్రాణుల శబ్దము, ఎలుకలతో పిల్లి, ముంగిసల స్నేహముల ఫలము ఒకమాసములో జరుగును. గంధర్వనగరము, మధురాది రసములలో వికారము, సువర్ణములో వికారము కలిగిన ఫలము ఒకమాసములో జరుగును. ధ్వజము విరుగుట, గృహములో వికారము, దుమ్ముతో దిశలన్ని వ్యాపించుట వలన కలుగు ఫలితము ఒకమాసములో జరుగును.

అశ్వని నుండి పుష్యమి వరకు ఎనిమిది నక్షత్రముల యోగతారలలో ఉత్పాతమైన క్రమముగా తొమ్మిది, ఒకటి,పద్దెనిమిది,ఒకటి,ఒకటి,ఆరు, మూడు, మూడు, మాసములలో, ఆశ్లేషయైన తత్కాలములో ఫలితము కలుగును. మఘ నుండి మూల నక్షత్రము వరకు పది నక్షత్రములో యోగతారలో ఉత్పాతము జరిగిన క్రమముగా ఒకటి, ఆరు, ఆరు, మూడు,సగము,ఎనిమిది,మూడు,ఆరు ఒక ఒక మాసములలో పూర్వాషాఢ ఉత్తరాషాఢలలో ఫలితము నాలుగుమాసములలో అభిజిత్ నక్షత్ర ఫలితము తత్కాలములో జరుగును.

శ్రవణము నుండి రేవతి వరకు ఆరు నక్షత్రముల యోగతారలో ఉత్పాతము జరిగిన క్రమముగా ఏడు ఎనిమిది ఒకటిన్నర మూడు మూడు ఐదుమాసములలో ఫలితము కలుగును. ముందు తెల్పిన సమయములో ఫలితము కనపడకున్న వాటికి రెట్టింపు కాలములో అధికఫలము కలుగును. బ్రాహ్మణుల ద్వార సువర్ణము, రత్నములు ఆవుల దానముతో శాంతి చేయించినను శాంతి కలుగనపుడు రెట్టింపు సమయములో ఫలితము కలుగును.

తొంబది ఏడవ పాకాధ్యాయము సమాప్తము

98. నక్షత్ర కర్మగుణాధ్యాయము

అశ్వన్యాది నక్షత్రములలో క్రమముగా శిఖి (3) మున్నగు తారలున్నవి. అశ్వనిలో మూడు, భరణిలో మూడు, కృత్తికలో ఆరు, రోహిణిలో ఐదు, మృగశిరలో మూడు, ఆర్ద్రలో ఒకటి,పునర్వసులో నాలుగు,పుష్యమిలో మూడు, ఆశ్లేషలో ఐదు, మఘలో ఐదు, పుబ్బలో రెండు, ఉత్తరలో రెండు,హస్తలో ఐదు, చిత్తలో ఒకటి, స్వాతిలో ఒకటి, విశాఖలో నాలుగు, అనూరాధలో నాలుగు,జ్యేష్ఠలో మూడు,మూలలో పదకొండు, పూర్వాషాఢలో రెండు,ఉత్తరాషాఢలో రెండు, అభిజిత్‌లో మూడు, శ్రవణంలో మూడు ధనిష్ఠలో నాలుగు, శతభిషంలో వంద, పూర్వాభాద్రలో రెండు, ఉత్తరాభాద్రలో రెండు, రేవతిలో ముప్పది రెండు తారలున్నవి.

అశ్వనీ కుమారులు, యముడు,అగ్ని, బ్రహ్మ, చంద్రుడు, శివుడు, అదితి, బృహస్పతి, సర్పము,భగ (సూర్య విశేషము) అర్యమ (సూర్యవిశేషము) రవి, త్వష్ట (విశ్వకర్మ) వాయువు, ఇంద్రాగ్ని, మిత్రుడు, ఇంద్రుడు, నిర్రృతి(రాక్షసుడు) జలము, విశ్వేదేవుడు,

బ్రహ్మ, విష్ణువు, వసువు, వరుణుడు, అజ, చరణము, (సూర్యవిశేషము) అహిర్బుధ్న్యుడు (సూర్యవిశేషము) పూష(సూర్యవిశేషము) వీరు క్రమముగా అశ్వన్యాది నక్షత్రములకు స్వాములు.

పూర్వోక్త నక్షత్రములలో ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, రోహిణి నక్షత్రములు ధ్రువ (స్థిర)సంజ్ఞకములు. వాటిలో రాజ్యభిషేకము శాంతి (ఉత్పాతములకు ప్రతీకారము) వృక్షారోపణము నగరప్రతిష్ఠ,ధర్మక్రియ,విత్తనములు నాటుట, స్థిరకార్యములను ప్రారంభము చేయవలెను. మూల ఆర్ద్ర జ్యేష్ఠ ఆశ్లేష తీక్షసంజ్ఞక నక్షత్రములు. వీటిలో అభిఘాత (ఉపద్రవ) మంత్రము, వేతాలము (వేతాల ఉత్తాపన మంత్రము) బంధనము, వధ,భేదము (కలిసిన వారిని విడదీయుట) సంబంధము(రాజ కులమునకు నివేదనము) సిద్ధియగును.

పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, భరణి, మఘ, నక్షత్రములు ఉగ్రసంజ్ఞకములు. వీటిలో ఉత్పాదనము, నాశము శాఠ్యాదికర్మలు చేయవలెను. ఈ నక్షత్రములలో బంధనము, విషప్రయోగము,దహనము,శస్త్రప్రహారము, ఘాతము(మరణము) మున్నగునవి సిద్ధించును. హస్త అశ్విని పుష్యమి నక్షత్రములు లఘుసంజ్ఞకములు. ఈ నక్షత్రములలో విక్రయము, రతి, జ్ఞానము,భూషణము,కళలు,శిల్పకర్మ, ఔషధము, యాత్రాదులు సిద్ధించును. అనూరాధ చిత్త రేవతి మృగశిర నక్షత్రములు మృదు సంజ్ఞకములు. ఇవి మిత్ర సురత విధి వస్త్రము భూషణము మంగళకార్యములు,గానమునకు శుభమైనవి.

కృత్తిక విశాఖ మృదు తీక్ష్ణ సంజ్ఞక నక్షత్రములు. ఇవి మిశ్రమఫలమునిచ్చును. వీటిలో మృదు దారుణకర్మలు చేయవచ్చును. ధనిష్ఠ శతభిషము, పునర్వసు, స్వాతి నక్షత్రములు చరసంజ్ఞకములు. ఇవి చరకార్యములలో శుభమునిచ్చును. హస్త చిత్త స్వాతి మృగశిర శ్రవణ ధనిష్ఠ శతభిష రేవతి, అశ్విని జ్యేష్ఠ పుష్యమి పునర్వసు ఈ నక్షత్రములలో లేక ఈనక్షత్రముల ఉదయకాలములో లేక ఈనక్షత్రముల దేవతా సంబంధ ముహూర్తముల ఉదయములో (హస్త నక్షత్ర దేవత సూర్యుడు అందువలన సూర్యసంజ్ఞక ముహూర్త ఉదయములో)చంద్రుడు తారలు అనుకూలమైన క్షౌరము చేయించుకొనిన శుభము కలుగును.

స్నానము చేసిన తర్వాత, ఎక్కడికైన వెళ్లు సమయమున, నూనెను రాసుకున్న తర్వాత, యుద్ధసమయములో, ఆసన రహితముగా, సంధ్యాకాలము, రాత్రిసమయము, శని, మంగళ రవివారములలో, రిక్తతిథిలో,తొమ్మిదవ రోజులో,విష్టికరణములో క్షౌరము చేయించు కొనుట మంచిదికాదు.

రాజాజ్ఞ వలన బ్రాహ్మణుల సమ్మతితో వివాహకాలములో,మరణాశౌచము, జననాశౌచము, ఖైదు నుండి బయటకు వచ్చిన తర్వాత యజ్ఞదీక్ష సమయములో అన్ని

నక్షత్రములలో క్షౌరము చేయించుకొనవచ్చును. హస్త మూల శ్రవణ పునర్వసు మృగశిర పుష్యమి ఇవి పురుష సంజ్ఞక నక్షత్రములు. వీటిలో పురుష సంజ్ఞక కార్యములు చేసిన శుభమగును.

హస్త, రేవతి, స్వాతి, అనూరాధ, పుష్యమి, చిత్త, మృగశిర ఈ నక్షత్రములలో శుక్ర,బుధ,చంద్ర,గురువారములలో నామకరణము,దీక్ష, ఉపనయనము, మౌంజీ బంధనము, మున్నగు కార్యములు చేయవలెను. లగ్నము నుండి ద్వాదశము, కేంద్రము, అష్టమ గృహములో శుభగ్రహము, తృతీయ షష్ఠ ఏకాదశములో పాపగ్రహము, లగ్నము లేక కేంద్రములో గురుడు లేక శుక్రుడున్న అన్ని కార్యములు సిద్ధించును. కర్మ కర్త జన్మరాశి (సింహ వృశ్చికములు) లగ్నములోనున్నప్పుడు గృహము నిర్మించటము, గృహములో ప్రవేశము శుభమునిచ్చును.

తొంబది ఎనిమిదవ నక్షత్ర కర్మగుణాధ్యాయము సమాప్తము

99. తిథి కర్మగుణాధ్యాయము

పాడ్యమికి బ్రహ్మ, విదియకు విధాత, తదియకు విష్ణువు, చవితికి యముడు, పంచమికి చంద్రుడు, షష్ఠికి కార్తికేయుడు, సప్తమికి ఇంద్రుడు, అష్టమికి వసువు, నవమికి సర్పము, దశమికి ధర్మము, ఏకాదశికి శివుడు, ద్వాదశికి సూర్యుడు, త్రయోదశికి కామదేవుడు,చతుర్దశికి కలి,పూర్ణిమకు విశ్వేశ్వరుడు, అమావాస్యకు పితరుడు స్వాములగుదురు. పాడ్యమిలో బ్రహ్మకర్మ (వివాహాదులు) విదియలో భవన నిర్మాణాదులు, తదియలో చౌలకరణము, చతుర్థిలో శత్రుమరణాదులు, పంచమిలో వమనము, ఔషధ సేవణము, పౌష్ఠికర్మాదులు, షష్ఠిలో మిత్రసంగ్రహము, అభిషేకాదులు, సప్తమిలో సవారి, క్రియలు గమనాదులు, అష్టమిలో శస్త్రగ్రహణము దుర్గ ఉపకరణాదులు, నవమిలో పరవిఘాతము, మరణాదులు, దశమిలో ధర్మము బ్రాహ్మణ తర్పణాదులు, ఏకాదశిలో స్థిర చర మృదు సౌమ్యకర్మాదులు, ద్వాదశిలో అగ్న్యాధానాదులు, త్రయోదశిలో మైత్రి, కామసేవనాదులు, చతుర్దశిలో విషము, రసప్రయోగాదులు, పంచదశిలో పిత్రుతర్పణాది కార్యములు చేయవలెను.

నంద భద్ర విజయ రిక్త పూర్ణ తిథులు మూడు విధములు గానగును. నంద (1,6,11) భద్ర (2,7,12) విజయ(3,8,13) రిక్త (4,9,14) పూర్ణ (5,10,15) తిథులగును. ఏ నక్షత్రములో ఏకార్యము చేయవలెనని తెలిపెనో ఆనక్షత్ర దేవత తిథిలో చేయవలెను. ఉదాహరణకు రోహిణి నక్షత్రములో ఆనక్షత్ర దేవత బ్రహ్మకు సంబంధించిన తిథి(పాడ్యమి)లో చేయవలెను. ఇదేవిధములో అభిజిత్ నక్షత్రము ఏకార్యము తెలిపెనో అది విదియతిథిలో, శ్రవణా నక్షత్రకార్యము తదియలో, భరణిలో చేయుకార్యము చతుర్థిలో,

మృగశిరలో చేయుకార్యము పంచమిలో,కృత్తికలో చేయుకార్యము షష్ఠిలో, జ్యేష్ఠలో చేయు కార్యము సప్తమిలో,హస్తలో చేయుకార్యము ద్వాదశిలో,పుబ్బలో చేయుకార్యము చతుర్దశిలో, ఉత్తరాషాఢలో చేయుకార్యము పౌర్ణమిలో,మఘలో చేయుకార్యము అమావాస్యలో చేయవలెను.

ఇదేవిధముగా నక్షత్రములలో చెప్పబడిన కార్యములు ఆనక్షత్రస్వాముల కరణములు, ముహూర్తములలో చేయుట మంచిది. అనగా జ్యేష్ఠ నక్షత్రములో తెల్పిన కార్యమును దానిస్వామియైన ఇంద్రకరణము బవలో చేయవలెను. అదేవిధముగా మిగిలినవి, ఆర్ద్రా నక్షత్రములో తెల్పిన కార్యము శివసంజ్ఞక ముహూర్తములో చేయవలెను.

తొంబది తొమ్మిదవ తిథికర్మగుణాధ్యాయము సమాప్తము

100. కరణ గుణాధ్యాయము

బవ,బాలవ,కౌలవ,తైతిల,గర,వణిజ,విష్టి-ఇవి చరకరణములు. వీటికి క్రమముగా, ఇంద్ర,బ్రహ్మ,మిత్ర,అర్యమ,భూమి,శ్రీ, యములు - స్వాములు. కృష్ణపక్షము చతుర్దశి ఉత్తరార్థములో శకుని అమావాస్య పూర్వార్ధములో నాగ, ఉత్తరార్థములో చతుష్పదము, శుక్లపక్ష పాడ్యమి పూర్వార్ధములో కింస్తుఘ్న కరణమగును. ఇవి నాలుగు స్థిరకరణములు. వీటికి స్వాములు క్రమముగా కలి,వృష,సర్ప,పవనములు.

బవ కరణములో శుభధర్మాదులు, చర (అల్ప సమయములో జరుగునది) స్థిర (ఏక్కువ సమయము జరిగేది) పుష్టికార్యమును చేయుట, బాలవ కరణములో ధర్మక్రియ, బ్రాహ్మణులకు హితకార్యములు, కౌలవ కరణములో స్నేహము, మిత్రత్వము, కన్యావరణము, తైతిల కరణములో సౌభాగ్యము, సంశ్రయము, గృహసంబంధ కార్యములు, గర కరణములో వ్యవసాయము, బీజములు, ఆశ్రమ సంబంధ కార్యములు శుభము. వణిజ కరణములో స్థిరకార్యములు, వాణిజ్య సంగమ సంబంధ కార్యములు శుభమునిచ్చును. విష్టి కరణములో ఏకార్యము శుభముకాదు. శత్రువుల నాశము విషాది ప్రయోగము అగ్నిదాహాది కార్యములు శుభమునిచ్చును.

శకుని కరణములో పౌష్టిక కార్యము,ఔషధ సేవనాదులు, మూలమంత్ర సాధన సంబంధ కార్యములు,చతుష్పద కరణములో గోవులు బ్రాహ్మణాదులు, పితురులు, రాజ సంబంధ కార్యములు, నాగ కరణములో స్థావరము, దారుణ హరణ, దౌర్భాగ్యములకు సంబంధించిన కార్యములు, కింస్తుఘ్న కరణములో ధర్మ,పుత్రకామేష్టి, పుష్టి, వివాహాదులు సిద్ధిక్రియలు శుభమునిచ్చును.

లగ్నము, ఏకాదశ, తృతీయములలో శుభగ్రహమున్న శుభగ్రహరాశి (వృషభ

మిథున కన్య ధను మీనములు) లగ్నములలో నున్న పాపగ్రహ రహితములై గురునితో కలిసియున్న పుష్యమి, మృగశిర, చిత్త, శ్రవణ,రేవతి, నక్షత్రములలో కర్ణవేధ శుభమును కలిగించును.

రోహిణి, ఉత్తరాత్రయము, (ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర) రేవతి,మృగశిర, మూల, అనూరాధ, మఘ, హస్త, స్వాతి, నక్షత్రములలో కన్య తుల మిథున లగ్నములలో సప్తమి, అష్టమ, ద్వాదశస్థానముల కన్న వేరైనస్థానములలో శుభగ్రహములున్న, ఏకాదశ ద్వితీయ తృతీయస్థానములలో చంద్రుడున్న,తృతీయ షష్ఠ ఏకాదశములలో పాపగ్రహమున్న, షష్టమంలో శుక్రుడు, అష్టమంలో కుజుడు లేకున్న వివాహము శుభమునిచ్చును. వర, కన్యలలో ఒకరాశి నుండి వేరొకరి రాశి రెండవ, తొమ్మిదవ,ఎనిమిదవ రాశి కాకున్న అనగా ద్విద్వాదశము, నవపంచకము, షడష్టకము కాకున్న, సూర్యచారానుకూల (తృతీయ, షష్ఠ, దశమ, ఏకాదశములలో)ముగా నున్న సూర్య కుజ శని శుక్రులతో కూడియున్న లేక రెండు పాపగ్రహముల మధ్యలో చంద్రుడున్న, వ్యతీపాత వైధృతి యోగములు, విష్ఠి కరణము, రిక్తతిథులు, పాపగ్రహ వారములు, దక్షిణాయణము, చైత్ర పుష్యమాసములను వదలి,మిథున కన్య తులాలగ్నములలో వివాహము శుభమునిచ్చును.

నూరవ కరణగుణాధ్యాయము సమాప్తము

101. నక్షత్రజాతకాధ్యాయము

అశ్వినీ నక్షత్రములో జన్మించినవాడు అలంకార ప్రియుడు, సుందరుడు, సర్వులకు ప్రియుడు,అన్నికార్యములలో సమర్థుడు,బుద్ధిమంతుడగును. భరణి నక్షత్రములో పుట్టినవాడు కార్యములు ప్రారంభించి సంపూర్ణము చేయువాడు, సత్యము పలుకువాడు, నిరోగుడు, చతురుడు సుఖియగును.

కృత్తికలో జన్మించివాడు అధికభోజనము చేయువాడు, ఇతర స్త్రీలతో రమించువాడు, తేజస్వి విఖ్యాతుడగును. రోహిణిలో జన్మించినవాడు సత్యవచనుడు, పవిత్రుడు,ప్రియములు పలుకువాడు, స్థిరమైన మనసుకలవాడు, సుందరరూపము కలవాడగును. మృగశిరలో జన్మించినవాడు చంచలుడు చతురుడు భయపీడితుడు, సమర్థుడు, ఉత్సాహవంతుడు ధనవంతుడు భోగియగును. ఆర్ద్రలో జన్మించినవాడు శఠుడు (పరోపకారము చేయువాడు) అభిమాని ఇతరుల కార్యములను నాశనము చేయువాడు, జంతువులను వధించువాడు, పాపియగును. పునర్వసులో జన్మించినవాడు ఇంద్రియ నిగ్రహుడు, సుఖి, సుందర స్వభావము కలవాడు, దుర్బుద్ధి, రోగి, కోరికలు కలవాడు, అల్ప సంతోషి యగును.

పుష్యమిలో జన్మించినవాడు శాంతుడు, సర్వప్రియుడు పండితుడు, ధని, ధర్మ

యుతుడగును. ఆశ్లేషలో పుట్టినవాడు శఠుడు, ఖాద్యాఖాద్యములను తినువాడు, పాపి, ఇతరకార్యములను నాశనము చేయువాడు, ధూర్తుడగును. మఘలో జన్మించినవాడు అనేక మంది సేవకులు కలవాడు, ధని, భోగి, దేవత పితురుల భక్తికలవాడు, అత్యంత ఉద్యమ స్వభావము కలవాడగును. పుబ్బలో జన్మించినవాడు ప్రియవచనములు పలుకువాడు దానము చేయువాడు కాంతిగలవాడు, భ్రమణము చేయువాడు రాజసేవకుడగును.

ఉత్తరలో జన్మించినవాడు సర్వజనప్రియుడు, విద్యవలన ధనార్జన చేయువాడు, భోగి, సుఖియగును. హస్త నక్షత్రములో జన్మించినవాడు ఉత్సాహి, ప్రతిభావంతుడు, సిగ్గులేనివాడు, మద్యపానము చేయువాడు, దయారహితుడు, దొంగయగును. చిత్త నక్షత్రములో జన్మించినవాడు అనేకరంగుల వస్త్రములు మాలలు ధరించువాడు, సుందర నేత్రములు సుందర శరీరము కలవాడగును. స్వాతిలో జన్మించినవాడు ఇంద్రియ నిగ్రహము కలవాడు,వ్యాపారశీలుడు,దయకలవాడు, ప్రియవచనుడు, ధర్మముగా ప్రవర్తించువాడగును.

విశాఖలో జన్మించువాడు ఇతరుల ఉన్నతినిచూచి అసూయపడువాడు, కాంతి మంతుడు, చతురసంభాషణ చేయువాడు, జగడములాడు వాడగును. అనూరాధలో జన్మించినవాడు ధనవంతుడు, పరదేశములో నుండువాడు, అధికమైన ఆకలితో బాధపడు వాడు, భ్రమణము చేయగలవాడగును. జ్యేష్ఠలో జన్మించినవాడు మిత్రులు లేనివాడు, సంతుష్టుడు, ధర్మముచేయువాడు అధికకోపము కలవాడగును.

మూల నక్షత్రములో జన్మించినవాడు అభిమానవంతుడు, ధనవంతుడు, సుఖి, హింసను చేయువాడు, స్థిరబుద్ధి కలవాడు, భోగియగును. పూర్వాషాఢలో జన్మించినవాడు ఆనందమునిచ్చు స్త్రీలతో కూడినవాడు, అభిమాని, మంచిమిత్రులతో కూడినవాడగును. ఉత్తరాషాఢలో జన్మించినవాడు నమ్ర(వంగిన)స్వభావము కలవాడు, ధార్మికుడు, అధిక మిత్రులు కలవాడు, కృతజ్ఞుడు, అందరికి ప్రియుడగును. శ్రవణములో జన్మించిన వాడు శ్రీమంతుడు పండితుడు ఉదారమైన స్త్రీకలవాడు, ధని, విఖ్యాతుడగును. ధనిష్ఠలో జన్మించినవాడు దాని, ధని, గీతవాద్యాదులందు ప్రేమ కలవాడు లోభియగును.

శతభిషంలో జన్మించినవాడు స్పష్టముగా పలుకువాడు, వ్యసనములు కలవాడు, శత్రువులను నాశము చేయువాడు, సాహసి,కష్టముతో ఇతరులకు వశమగువాడగును. పూర్వాభాద్రలో జన్మించినవాడు దు:ఖితుడు, స్త్రీవశుడు, ధని,పండియుడు, కృపణు (లోభి) డగును. ఉత్తరాభాద్రలో పుట్టినవాడు వక్త,సుఖి,సంతానవంతుడు,శత్రువులను జయించువాడు, ధర్మాచరణము చేయువాడగును. రేవతీ నక్షత్రములో జన్మించినవాడు సంపూర్ణమైన అంగములు కలవాడు, అందిరికి ప్రియుడు, శూరుడు పవిత్రుడు ధనవంతుడగును.

నూట ఒకటవ నక్షత్రజాతకాధ్యాయము సమాప్తము

102. రాశివిభాగాధ్యాయము

అశ్విని నాలుగుపాదములు,భరణి నాలుగు పాదములు, కృత్తిక మొదటిపాదము మేషరాశి. కృత్తిక మూడుపాదములు,రోహిణి నాలుగుపాదములు, మృగశిర రెండు పాదములు వృషభరాశి.మృగశిర రెండు పాదములు, ఆర్ద్ర నాలుగుపాదములు పునర్వసు మూడు పాదములు మిథునరాశి, పునర్వసు చివరిపాదము పుష్యమి నాలుగు పాదములు ఆశ్లేష నాలుగు పాదములు కర్కాటక రాశి, మఖ నాలుగుపాదములు పుబ్బ నాలుగు పాదములు, ఉత్తర మొదటి పాదము సింహరాశి, ఉత్తర మూడుపాదములు, హస్త నాలుగుపాదములు చిత్త రెండు పాదములు కన్యారాశి, చిత్తరెండు పాదములు స్వాతి నాలుగు పాదములు విశాఖ మూడుపాదములు తులారాశి, విశాఖ చివరి పాదము అనూరాధ నాలుగు పాదములు జ్యేష్ఠ నాలుగు పాదములు వృశ్చికరాశి, మూల నాలుగు పాదములు పూర్వాషాఢ నాలుగుపాదములు ఉత్తరాషాఢ మొదటి పాదము ధనూరాశి, ఉత్తరాషాఢ మూడుపాదములు శ్రవణము నాలుగు పాదములు ధనిష్ఠ రెండుపాదములు మకరరాశి, ధనిష్ఠ రెండు పాదములు శతభిషం నాలుగుపాదములు పూర్వాభాద్ర మూడుపదములు కుంభరాశి, పూర్వాభాద్ర చివరి పాదము ఉత్తరభాద్ర నాలుగుపాదములు రేవతి నాలుగుపాదములు మీనరాశి.

నూట రెండవ రాశి విభాగాధ్యాయము సమాప్తము

103. వివాహ పటలాధ్యాయము

వివాహకాలిక లగ్నములో సూర్యుడు కుజుడున్న విధవరాలు, రాహువున్న నష్టసంతానము, శనియున్న దరిద్రము, శుక్ర బుధ గురులున్న సాధ్వి, చంద్రుడున్న నష్ట ఆయువు కలిగినదగును. వివాహకాలిక లగ్నము నుండి ద్వితీయభావములో సూర్యుడు, శని, రాహువు, కుజులున్న ఎల్లప్పుడు అతిదరిద్రము, దు:ఖము; గురు శుక్ర, బుధులున్న ధనవతి, వైధవ్యరహితురాలు, చంద్రుడున్న అధిక సంతానవతి యగును.

వివాహకాలములో లగ్నమునుండి తృతీయభావములో సూర్యుడు చంద్రుడు కుజుడు గురువు శుక్రుడు బుధుడున్న అధికసంతానవతి ధనవతి, శనియున్న కీర్తి కలిగినది, సుభగురాలు, రాహువున్న మృత్యువును పొందునదగును. లగ్నమునుండి చతుర్థభావములో శనియున్న స్తనముల నుండి తక్కువపాలు వచ్చును.సూర్య చంద్రులున్న భాగ్యరహితము, రాహువున్న సవితి కలిగినది, కుజుడున్న అల్పధనము కలది, శుక్ర గురు బుధులున్న సుఖమును పొందునదగును.

వివాహకాలములో లగ్నమునుండి పంచమస్థానములో రవి కుజులున్న సంతానము మరణించును. బుధ గురు శుక్రులున్న అధిక సంతానము, రాహువున్న

మృత్యువు, శనియున్న కఠోరరోగము, చంద్రుడున్న శీఘ్రకన్యానాశము కలుగును. లగ్నమునుండి షష్ఠమభావములో శని,సూర్యుడు, గురువు కుజుడున్న మావకు సేవ చేయునది, చంద్రుడున్న విధవరాలు, శుక్రుడున్న నిర్ధనము, బుధుడున్న ధనవంతురాలు కలహకారి యగును.

వివాహకాలములో లగ్నమునుండి సప్తమభావములో శని కుజుడు గురువు బుధుడు రాహువు సూర్యుడు చంద్రుడు శుక్రులున్న క్రమముగా విధవ,బంధనము, మరణము, వినాశము, ధననాశము, వ్యాధి, ప్రవాసము, మృత్యువు కలుగును. లగ్నము నుండి అష్టమభావములో బుధుడున్న పతి వియోగము, చంద్ర శుక్ర రాహువులున్న మృత్యువు, సూర్యుడున్న సౌభాగ్యశాలి, కుజుడున్న రోగము, శనియున్న ధనము, భర్తకు ప్రియురాలగును.

వివాహసమయములో లగ్నమునుండి నవమస్థానములో శుక్రుడు సూర్యుడు కుజుడు గురుడున్న ధర్మముచేయునది, బుధుడున్న రోగము లేనిది, రాహువు శనియున్న వంధ్యరాలు,చంద్రుడున్న స్త్రీసంతానము కలది, తిరిగేది యగును. లగ్నమునుండి దశమ స్థానములో రాహువున్న విధవరాలు,సూర్య శనులున్న పాపముచేయునది, కుజుడున్న మృత్యువు, చంద్రుడున్న ధనహీనురాలు, కులట,మిగిలిన గ్రహములున్న ధనవతి, సుభగురాలగును.

వివాహసమయములో లగ్నమునుండి ఏకాదశభావములో రవియున్న అధికపుత్రులు కలది, చంద్రుడున్న ధనవతి, కుజుడున్న పుత్రవతి, శనియున్న ధనవతి, గురుడున్న ఎక్కువకాలము జీవించునది,బుధుడున్న ధనవతి, రాహువున్న పతితో కూడినది, శుక్రుడున్న ధనవతి యగును. లగ్నమునుండి ద్వాదశభావములో గురుడున్న ధనవతి, సూర్యుడున్న ధనహీనురాలు,చంద్రుడున్న అధికముగా ఖర్చుచేయునది, రాహువున్న కులట, శుక్రుడున్న సాధ్వి, బుధుడున్న అధికపుత్రులు కలది, శని కుజులున్న మద్యపానము చేయునదగును.

సాయంకాలము గోవులగిట్టలతో తాడనము చేయబడినది గోవులద్వారా ఖండింప బడిన ధూళి స్త్రీల వివాహములో అత్యధిక ధనము, పుత్రులు, ఆరోగ్యము, సౌభాగ్యము నిచ్చునదగును. ఆ గోధూళి కాలములో నక్షత్రము, తిథి,కరణము, లగ్నము, యోగములను విచారణ చేయవలసిన అవసరములేదు.పురషుల సుఖము కొరకు ఆసమయము తెలుపబడినది. ఈ విధముగా వెలువడిన గోవులధూళి అన్ని దుష్కృతము(చెడుపనులు)లను నాశనము చేయును.

నూట మూడవ వివాహపటలాధ్యాయము సమాప్తము



104. గ్రహగోచారాధ్యాయము

దారములు లేకుండ రంధ్రములు కలిగిన పురాతన రత్నము, నూతనదారములతో కట్టబడిన సుందరముగా నలంకరించుటకు సమర్థమగును. అదే విధముగా దారములేనిది, ప్రకటింపబడిన దోషములు కలది, పురాతనమైనది, నవీన గుణములతో కూడిన శాస్త్రము కూడ సుందరమగుటకు సమర్థమగును.

మాండవ్యఋషి తెల్పిన వాణిని విన్నవారికి నావాక్కు బాగుగానుండదని చెప్పటము కూడ ఉచితముకాదు. సాధ్విస్త్రీ వేశ్యస్త్రీవలె పురుషులకు ప్రియము కలిగించదు.

జన్మరాశి నుండి ఆరవ, మూడవ, పదవరాశులలో సూర్యుడు, మూడవ పదవ, ఆరవ,ఏడవ,మొదటి రాశులలో చంద్రుడు, ఏడవ,తొమ్మిదవ,రెండవ, పదవ రాశులలో గురుడు, ఆరవ,మూడవ రాశులలో కుజ శనులు, ఆరవ,రెండవ, నాల్గవ,పదవ, ఎనిమిదవ రాశులలో బుధుడు,పదకొండవ రాశిలో అన్నిగ్రహములు శుభమును కలిగించును.

సూర్యుడు జన్మరాశిలోనున్న ఉపద్రవము,ధననాశము, ఉదరరోగము, మార్గము లలో భ్రమణము,ద్వితీయములో నున్న ధననాశము, దు:ఖము, సర్వకార్యనాశము, నేత్రరోగము, తృతీయములో నున్న స్థానలాభము, ధనలాభము, ఆనందము, శత్రునాశము, చతుర్థరాశిలో నున్న రోగము, మాలను ధరించు స్త్రీతో భోగములో మాటిమాటికి ఆటంకములు కలుగును.

చంద్రరాశి నుండి సూర్యుడు పంచమరాశిలో నున్న రోగము, శత్రువుల వలన పీడ, షష్ఠమములో నున్న రోగము,శత్రుశోకనాశము, సప్తమములో నున్న మార్గములో భ్రమణము, ఉదరరోగము భయము దు:ఖము, అష్టమములోనున్న రోగము భయము కలుగును. తనస్త్రీ కూడ సరిగమాట్లాడదు. నవమరాశిలో నున్న ఆపత్తి, దీనత, ధన యోగములో ఆటంకములు, దశమములో నున్న కఠిన విజయము, కార్యసిద్ధి, ఏకాదశమములో నున్న విజయము,స్థానలాభము పూజ,రోగనాశము, ద్వాదశమములో నున్న సుందర స్వభావము కలవారికి ఫలము కలుగును. దుర్జనులకు కలుగదు.

చంద్రుడు జన్మరాశిలోనున్న అన్నము, ఉత్తమ శయ్య వస్త్రలాభము కలుగును. ద్వితీయములో నున్న ధననాశము,విఘ్నము కలుగును. తృతీయములో నున్న వస్త్రము, ధనము,విజయము, సుఖలాభము, చతుర్థములోనున్న పర్వతముపై నున్న సర్పమువలె అన్నింటి యందు అవిశ్వాసము కలుగును. పంచమరాశిలోనున్న దీనత, రోగము, శోకము, మార్గములో విఘ్నము, షష్ఠరాశిలోనున్న ధనము, సుఖము, శత్రురోగనాశము కలుగును. సప్తమములోనున్న వాహనము, పూజ శయ్య, భోజనము, ధనము కలుగును. అష్టమ రాశిలోనున్న ప్రయత్నము లేకుండ గ్రహించిన సర్పము ఎవరికి భయము కలిగించదు? అందిరికి భయమును కలిగించును. అదే విధముగా అష్టమములో నున్న చంద్రుడు

అందరికి భయమును కలిగించును. నవమరాశిలో చంద్రుడున్న బంధనము, ఉద్వేగము, ఖేదము, ఉదరరోగము కలుగును. దశమములోనున్న ప్రభుత, కర్మసిద్ధి, ఏకాదశమములో నున్న ధనవృద్ధి,మిత్ర సమాగమము ధనము కలుగును. ద్వాదశములో నున్న ధనహాని, ఎద్దుకొమ్ము గిట్టలతో పీడ కలుగును.

చంద్రరాశిలో కుజుడున్న ఉపద్రవము, ద్వితీయములో రాజపీడ కలహదోషము, శత్రుదోషము, ధాతుదోషము, అగ్ని, దొంగ, రోగము వీటివలన అతికష్టము కలుగును. తృతీయములో నున్న దొంగలు, బాలుర (ఎనిమిది సంవత్సరములవారు) ద్వారఫలము, ఆదేశము,ధనము,ఉన్నివస్త్రము,గనిలో ఉత్పన్నమగు ద్రవ్యముల లాభము కలుగును. చతుర్థములోనున్న జ్వరము,ఉదరరోగము, రక్తవికారము,నిందిత పురుషులతో సమాగమము, అశుభము కలుగును. పంచమములో నున్న శత్రువు,రోగము,క్రోధము,భయము, పుత్రుల వలన దోషము కలుగును కోతితలపై మాలతీపుష్పము ఎక్కువ సమయముండనట్లు మనుష్యుని కాంతి ఎక్కువకాలము నిలువదు. షష్ఠమస్థానములోనున్న శత్రుభయము, కలహరహితము, సువర్ణము, ప్రవాలము, తామ్రలాభము ఇతర వ్యక్తి ముఖవికారమును చూడవలసి వచ్చును.

జన్మరాశినుండి సప్తమములో కుజుడున్న స్త్రీలతో విరోధము నేత్రరోగము ఉదరరోగము కలుగును. అష్టమములో నున్న రక్తముతో వివర్ణ శరీరము, ధనమానముల నాశము, పరాభవము, అర్థనాశము శరీరములో దుర్బలత, ధాతువుల క్షయము, మందగతి వాడగును. దశమస్థానములోనున్న మధ్యమఫలము, ఏకాదశమములోనున్న అనేక విధములైన ధనప్రాప్తి జయము కలుగును. పుష్పిత అగ్రభాగములు గల వృక్షములతో వనములో భ్రమరమువలె ప్రజలతో ప్రధానుడై భోగమును పొందును. వ్యయస్థానము లోనున్న చంద్రుని వలన పొందిన గర్వమున్నప్పటికి అనేక విధములైన వ్యయము, ఉపద్రవము, స్త్రీలపై కోపము పిత్త నేత్రరోగములచే పీడితుడగును.

చంద్రుని జన్మరాశిలో బుధుడున్న కఠోరవాక్యము, చాడీలు చెప్పుట,శత్రుత్వము, పరస్పరభేదములు, ధననష్టము కలుగును. శుభగమనములో కూడ కుశలవార్త ఎవరు వినరు. ద్వితీయములో బుధుడున్న అనాదరము, ధనలాభము, తృతీయములో నున్న మిత్రులకు లాభము చేయువాడు,రాజు, శత్రువుల భయము వలన తన చెడుప్రవర్తన వలన పరిగెత్తువాడగును. చతుర్థములో బుధుడున్న ఆత్మీయజనులకు బంధువులకు వృద్ధి, ధనప్రాప్తి కలుగును. పంచమములోనున్న స్త్రీకలహము,ఉద్వేగకారణముగా సుందరస్త్రీతో భోగము కలుగదు. ఆరవ రాశిలో నున్న సౌభాగ్యము, విజయము ఉన్నతి కలుగును.

సప్తమరాశిలో బుధుడున్న వివర్ణము కలుగును. అష్టమరాశిలో నున్న విజయము, పుత్ర వస్త్ర ధనలాభము, ఆనందముతో కూడిన నిపుణులలాభము కలుగును. నవమములో

నున్న విఘ్నకారకము, దశమములో నున్న శత్రునాశనము, ధనలాభము, స్త్రీ, శయ్య, స్త్రీ పరుండుటకు సుందర గృహము, ఐతిహాసిక వార్త, సుందర శయనము కలుగును. పదకొండవరాశిలో నున్న ధనము, పుత్ర సుఖ స్త్రీ మిత్ర వాహనప్రాప్తి సంతృప్తి మధురముగా పలుకు వాడగును. పన్నెండవరాశిలో నున్న శత్రువు, అనాదారము రోగముతో పీడితుడగును. మాలాధారణ చేయు స్త్రీతో సంగమసుఖమును పొందలేడు.

చంద్రుడున్న రాశిలో గురుడున్న ధనము, బుద్ధినాశము, స్థాననాశము అనేక విధములైన విరోధము కలుగును. ద్వితీయములో నున్న ధనప్రాప్తి శత్రురహితుడై స్త్రీముఖకమలముపై భ్రమరము వలె విలాసయుతమగును. తృతీయములోనున్న స్థాననాశము, కార్యనాశము, పీడితధనము కలవాడగును. చతుర్థములోనున్న అనేక విధములైన క్లేశములు బంధువులతో పీడింపబడిన చిత్తము కలవాడగును. గ్రామములో, మత్తిల్లిన మయూరములున్న వనములో కూడ శాంతి దొరకదు. పంచమములో నున్న పరిజనము, ధర్మాదులు, పుత్రులు, ఏనుగు, గుర్రము, ఎద్దుల లాభము, సువర్ణము, నగరము, గృహము, స్త్రీ, వస్త్రము, మణులలాభము, షష్ఠమములో నున్న గృహములో సుఖముకలగదు. మయూరము, కోకిలల శబ్దములు గెంతుతున్న మృగములు హరిణ శిశువులతో కూడిన వనము కూడ ఆనందమును కలిగించదు.

సప్తమరాశిలో గురుడున్న శయ్య, సురతభోగము,ధనము, భోజనము, వాహనము, లలితపదముల వాణి, బుద్ధిని కలిగించును. అష్టమములోనున్న బంధనము, పీడ, కఠోరము, శోకము, మార్గములో క్లేశము, మృత్యురోగము కలుగును. నవమరాశిలో నున్న అన్నికార్యములలో నైపుణ్యము, ఆదేశము, పుత్ర, కార్యార్థసిద్ధి, ధాన్యయుత భూలాభము కలుగును. దశమములోనున్న ఆరోగ్యము, ధనము నాశనమగును. ఏకాదశములో నున్న ఆరోగ్యము ధనమునిచ్చును. ద్వాదశమములోనున్న రథములో ఎక్కినప్పటకి మార్గములో చెడుమార్గములో పయనించుట వలన దు:ఖము కలుగును.

చంద్రుడున్న రాశిలో శుక్రుడున్న ఉపకరణముల వలన (శయనము, భూషణము, ఆచ్ఛాదనము, అనులేపనము, గీతము, వాద్యము, నృత్యము) మనస్సుకు ఆనందము, సుగంధద్రవ్య వస్త్రలాభము,శయ్య గృహ ఆసన భోజనముతో మద్యపానముతో మదవతియైన స్త్రీ ముఖకమలముపై భ్రమరత్వ అనుభవము కలుగును. ద్వితీయరాశిలో నున్న సంతానము,ధనము, ధాన్యము, రాజప్రియత్వము, బంధువుల వలన హితకార్యప్రాప్తి, పుష్పరత్నములతో అలంకరింపబడిన వసంత తిలక వృక్షపుష్ప సమానమై అతితెల్లని కేశములున్నను కామదేవుని సేవ కలుగును. తృతీయములో నున్న ప్రభుత్వము, ధనము, మానము, స్థానము, సమృద్ధి, వస్త్రము శత్రునాశము కలుగును. చతుర్థములో నున్న మిత్రసమాగమము, శివ ఇంద్ర వజ్రమువలె శక్తి కలుగును. పంచమములోనున్న

సంతోషము, బంధుప్రాప్తి, పుత్రధనలాభము, శత్రుసైన్యములో అనవస్థితి(లేకుండుట) కలుగును. షష్ఠిలోనున్న అనాదరము, రోగము సంతాపము కలుగును.

సప్తమరాశిలో శుక్రుడున్న స్త్రీవలన అనిష్టము, అష్టమరాశిలో నున్న గృహము వస్త్రము నిచ్చునది, లక్ష్మీవతియైన స్త్రీలాభము కలుగును. ఏకాదశమములో నున్న మిత్ర ధన అన్న సుగంధ ద్రవ్య లాభము, ద్వాదశములోనున్న ధనవస్త్రలాభము కలుగును. వస్త్రలాభము స్థిరముగానుండదు.

చంద్రరాశిలో శనియున్న విషము, అగ్నితో పీడితము, బంధురహితమగును. బంధువధ చేయువాడు, పరదేశము వెళ్లువాడు, మిత్రులు గృహము లేనివాడు, ధనపుత్ర రహితుడు, భ్రమణశీలుడు, దీనముఖము కలవాడగును. ద్వితీయములో నున్న రూప సుఖరహితుడు అహంకార రహితుడు దుర్బలుడగును. విద్యాదిగుణములతో ధనమును గ్రహించినప్పటి, వెదురు ఆకుపై పడిన బిందువు వలె చిరకాలము నిలబడదు. తృతీయ రాశిలోనున్న ధన,భృత్య, పరివారములు, ఒంటె ఎద్దు, గుర్రము ఏనుగు, గాడిద, గృహము, ఐశ్వర్యము, అతిసౌఖ్యము, ఆరోగ్యలాభము కలుగును. భయస్థుడైనప్పటికి వీర చరిత్రతో శత్రువును తన వశమందుంచుకొనును. చతుర్థములోనున్న మిత్ర ధన స్త్రీరహితుడగును. చిత్తము సర్వత్ర అసాధువు దుష్టభుజంగ (పము) గమనమును అనుకరించున దగును. పంచమములో నున్న పుత్ర ధనరహితము కలహము, షష్ఠమములోనున్న శత్రురహితము, రోగరహితము సుందరమైన పెదవులతో కూడినస్త్రీతో సుఖమును పొందును.

సప్తమ అష్టమరాశులలో శనియున్న మార్గములో గమనము, స్త్రీ పుత్రహీనము, దీనచేష్టలతో కూడియుండును. నవమములో నున్న పూర్వమువలె ఫలమునిచ్చును. ద్వేషము హృదయరోగము, వైశ్వదేవీక్రియ ఆదిధర్మములు నష్టమగును. దశమములోనున్న కర్మలాభము, ధనలాభము, విద్య, కీర్తినాశము, ఏకాదశమములో నున్న కఠోరస్వభావము, ఇతరస్త్రీ ధనలాభము, ద్వాదశములోనున్న శోకతరంగ సముదాయప్రాప్తి కలుగును.

వసంతకాలములో మేఘసముదాయములతో అధికజలవృష్టి కలిగినప్పటికి పాత్రలో అధికజలముండదు.. అదేవిధముగా శుభముచేయు గ్రహకాలము పాత్రానురూపముగ ఫలమునిచ్చును. రక్తపుష్పము, సుగంధద్రవ్యము, రక్తచందనము, తామ్రము, బంగారము వృషభములతో సూర్య కుజులకు, గోవు తెల్లని పుష్పము, వెండి మృష్టాన్నముతో చంద్రునికి, కామోద్దీపక ద్రవ్యము (గంధము పుష్పము ధూపము బలి)లతో శుక్రునికి,చల్లని ద్రవ్యములతో శనికి, మణి వెండి తిలపుష్పములతో బుధునికి, పచ్చని ద్రవ్యములతో (పుష్పములు, సుగంధద్రవ్యములు) ఉపహారములు) గురునికి భక్తి పూర్వకముగా పూజచేయవలెను. ఎత్తుప్రదేశములో పడిన, క్రీడాసక్త సర్పములలో ప్రవేశించి నప్పటికి, ఈ విధమైన పూజలతో తృప్తిపొందిన గ్రహములు పీడను కలిగించవు. దేవతలు,

బ్రాహ్మణుల పూజతో శాంతి, మంత్రజపము, నియమము,దానము,జితేంద్రియ తత్వముతో సుజనులతో సంభాషణము,వారితో సమాగమముతో అశుభదృష్టి,జన్య దోషములు నాశనమగును.

సూర్యుడు మంగళరాశికి పూర్వార్ధములో,చంద్ర శనిరాశుల అంతములో శుభా శుభ ఫలములనిచ్చును. చందములో ఆర్యపూర్వార్ధ సమానమై రెండు సగములున్న దానిని గీతియని, ఉత్తరార్ధ సమానమై రెండు అర్ధములున్న ఉపగీతి చందమందురు. ఉపగీతి మాత్రా గణములవలె సాధువుల సమాగమమువలె బుధరాశికి ఆది అంతములలో సమానమైన ఫలమునిచ్చును. అనగా ఉపగీతి ఛందములో రెండు అర్ధతుల్య లక్షణములు తెలుపబడును. అదేవిధముగా సాధువుల సమాగము ఎల్లప్పుడు ఒకేవిధముగా నుండును. అదేవిధముగా బుధరాశికి ఆది అంతములలో సమాన ఫలము కలుగును.

ఏవిధముగా విషమగణములోనున్న అంతగురువు (జగణము) ఆర్యాచందమును విషమస్థిత గణము ఉత్తమపురుషులను నాశనము చేయునో అదే విధముగా విషమస్థితి గురురాశికి మధ్యభాగములో ఉత్తమపురుషులను కూడా నాశనము చేయును. ఆర్యా చందములో ఆరవగణములో నున్న జగణముకు సర్వలఘుత్వము ప్రాప్తించును. అదే విధముగా షష్ఠరాశిగత గురువు జనులలో సర్వలఘుత్వము (లోకులలో గౌరవహీన భావము)ను పొందును.

సంస్కృతములో నర్కుటకము, ప్రాకృతములో గీతకము ఈ రెండు ఛందములు సమాన ప్రస్తారము కలవి, అదేవిధముగా శుభఫలమునిచ్చు గ్రహములు అశుభఫలమునిచ్చు గ్రహములతో, మరియు అశుభఫలమునిచ్చు గ్రహములు శుభఫలములనిచ్చు గ్రహములతో చూడబడిన తమతమ శుభ అశుభఫలములకు సమానత్వము కలిగించును. అనగా మధ్యమఫలము నిచ్చును.

అంధుని ఎదుట కామయుక్త స్త్రీ విలాస కటాక్షములతో చూచినప్పటికి వ్యర్థమగును. అదేవిధముగా నీచరాశిగత, శత్రురాశిగత అస్తమయమైన శత్రుగ్రహముతో చూడబడిన గ్రహమునకు ఏశుభఫలములు తెలుపబడెనో అవన్ని నిష్ఫలమగును. అశుభ ఫలవృద్ధి జరుగును.

సూర్య సమానముగా శనిఫలము నిచ్చును. ఏవిధముగా సంస్కృతములో ఆర్యాగతి ప్రాకృతములో స్కంధకములు,సంస్కృతములో వైతాలీయ, ప్రాకృతములో మాగధి, సంస్కృతములో ఆర్య,ప్రాకృతములో గాథ సమానముగా నుండునో అదేవిధముగా బుధుడు ఫలమునిచ్చును. అనగా శుభగ్రహముతో శుభము, పాగ్రహముతో పాపము నిచ్చును.

ఏవిధముగా సూర్యప్రకోపముతో పిత్తప్రకోపము పెరుగునో అదేవిధముగా సూర్య కిరణముల యోగముతో అస్తంగత శని వికారయుతమై అశుభఫలమునిచ్చి మనుష్యులను

బాధించును. కాని పథ్యభోజనము చేయు ఆర్యులకు అశుభఫలమునీయదు. ప్రసన్న మనమున్న ప్రసన్నముఖము,దు:ఖితమనమున్న నిరాశతోకూడిన ముఖముండును. అదే విధముగా శుభాశుభ గ్రహముతో ఏవిధముగా చంద్రుడుండునో అదే విధముగా శుభాశుభ ఫలము కలుగును. అనగా శుభగ్రహముతో కూడిన చంద్రుడు శుభఫలమును, అశుభగ్రహముతో కూడిన చంద్రుడు అశుభఫలము నిచ్చును.

ఏవిధముగా శ్లోకములో నాలుగు పదములతో పంచమాక్షరము, ద్వితీయ, చత్థుపాదములలో సప్తమాక్షరము లఘువగునో అదేవిధముగా ప్రతికూల గ్రహములతో మనుష్యులకు లఘుత్వప్రాప్తి కలుగును. ఏవిధముగా లఘు అక్షరము పదాంతములో గురువగునో అదేవిధముగా పురుష స్వభావముతో లఘువు దుశ్శీలమైనను అనుకూల గ్రహము వచ్చిన లోకులతో పూజింపబడును.

ఏ విధానముగా అవిధాన బేతాలసిద్ధి కొరకు చేయు కర్మ సాధకులను నాశము చేయునో అదేవిధముగా పండితులు చెడుగ్రహములు వచ్చినపుడు ఆత్మవృద్ధి కొరకు చేయు కర్మ వారిని నాశనము చేయును. సుస్థితగ్రహములను చూచి రాజు శత్రువులపై ఆక్రమణము చేయును. తక్కువ సైన్యమున్నప్పటికి ఔపచందసిక వృత్త (వేదోక్త క్రియ)ముతో దాటగలుగును.

జన్మరాశి నుండి ఉపచయము (3, 6, 10,11) భావములలో లేక లగ్నములో సూర్యుడున్న సూర్యకారకమైన బంగారము తామ్రము, గుర్రము, బాలిక, ఎముక, చర్మము, ఉన్నివస్త్రము, పర్వతము, వృక్షము, శరీరము, శుక్తి, సర్పము,దొంగ, ఖడ్గ సంబంధము, వనము,క్రూరుడు, రాజారాధనము, రాజ్యాభిషేకము, ఔషధము, క్షేమము, క్రయవిక్రయము, మున్నగునవి, వనములో ఉత్పన్నమగు ద్రవ్యములు, గ్రహణ పోషణాదులు, గోపాలుడు, మరుభూమి,వైద్యము,శిల,దంభము,సత్కులోత్పన్నము,కీర్తియుక్తము,శూరత్వము, యుద్ధములో కథనీయము,గమనశీలము,అగ్నికర్మ ఈ వస్తువులకు సంబంధించిన కర్మలు సిద్ధించును.

సోమవారములో లేక కర్కాటక లగ్నములో లేక కేంద్రములో చంద్రుడున్న భూషణము,శంఖము, ముత్యము, కమలము, వెండి, జలము, యజ్ఞము, చెరుకు, భోజ్యము, స్త్రీ, పాలు, అఖరోటు వృక్షము, గడ్డి, జలాశయ ప్రదేశము, ధాన్యము, ద్రవ ద్రవ్యము, బ్రాహ్మణుడు, మార్గము, గానకర్మ, హరిణము, కృషిఆదులు, సేనాధిపుడు, పార్శ్వ రక్షకుడు, రాజు, జనప్రియత్వము, రాత్రిచరులు, కఫము కలిగించు ద్రవ్యము,మామకు హితము, పూవులు, వస్త్రములు ఈ వస్తువుల సంబంధకర్మలు సిద్ధించును.

మంగళవారములో ధాతువుల సంబంధ అన్ని కార్యములు, బంగారము, అగ్ని, ప్రవాళము,శస్త్రము,క్రూరత్వము,దొంగతనము,ఇతరులకు ఉపద్రవము,వనము,దుర్గము,

సేనాధిపుడు, రక్తపుష్పముల వృక్షము, రక్తవస్తువు, వేపాదులు, కటుద్రవ్యము, కూటము, సర్పసంబంధము వలన ధనసంపాదనము,కుమారుడు,వైద్యుడు,సన్యాసి,రాత్రిలో కార్యములు చేయువాడు, కోశాధికారి. శఠుడు, దంభము వీటికి సంబంధించిన కార్యములు సిద్ధించును.

బుధవారములో లేక బుధలగ్నములో హరితమణి, భూమి, సుగంధ ద్రవ్యము, వస్త్రము, సాధారణకార్యము, నాటకము, శాస్త్రము, విజ్ఞానము, కావ్యము, అన్నికళలు, ద్రవ్యసంబంధ సంయోగము, మంత్రక్రియ, ధాతుక్రియ వివాదము, నిపుణత, పుణ్యము, వ్రతగ్రహణము, దూత, ఆయువు కొరకు హితకార్యము, మాయ, మిథ్య, స్నానము, శీఘ్రకార్యము, ఆలస్యముగా జరుగు కార్యము, మధ్యలో కలుగుకార్యము, హ్రస్వ, దీర్ఘ, మధ్యమ కార్యములు వీటికి సంబంధించిన కార్యములు సిద్ధించును.

గురువారములో బంగారము, వెండి, గుర్రము, ఏనుగు, ఎద్దు, వైద్యము,ఔషధము, బ్రాహ్మణతర్పణము, పితృశ్రాద్ధము, దేవకార్యము, ఛత్రము, చామరము, భూషణము, రాజు, దేవగృహము, దేవతప్రతిష్ఠ, గృహప్రతిష్ఠ, ధర్మాశ్రయము, మంగళము, శాస్త్రము, సుందరము, బలప్రదము, సత్యవచనము, చాంద్రాయణాదివ్రతము, హవనము, ధనము, వీటన్నింటికి సంబంధించిన వస్తువుల సిద్ధి కలుగును.

శుక్రవారములో చిత్రకర్మ, వస్త్రము, వీర్యవృద్ధి ప్రయోగము, వేశ్య, కామాత్మకస్త్రీ, విలాసము, ఉపహారము, స్త్రీ ప్రసంగము, వెండి, కామదేవుని ఉపచారము, వాహనము, చెరుకు, శారదీయిధాన్యము, వాణిజ్యము, పొలము, ఔషధము, కమలము, శత్రుసంబంధ కార్యసిద్ధి కలుగును.

శనివారములో దున్నపోతు, మేక, ఒంటె, కృష్ణలోహము, (శస్త్రము ఆయుధము మున్నగునవి) భృత్యుడు, వృద్ధులు, నీచుడు, పక్షి, దొంగ, బంధనాదులను తెలిసినవాడు, నమ్రతలేనివాడు, పగిలిన కుండ, ఏనుగు గ్రహించటము, విఘ్నకారణము మున్నగు కార్యముల సిద్ధి కలుగును. ఈ పూర్వోక్త నియమములను విడిచి సముద్రము దగ్గరకు వెళ్ళినప్పటికి జలబింధువులు కూడ ప్రాప్తించవు. అధిక విస్తీర్ణముగా ఛందప్రస్తారములను తెలిసికొనినప్పటికి ఇంతమాత్రమే పని జరుగును. అందువలన వరామిహురుడు కర్ణసుఖముగా ఛంద సంగ్రహమును తెల్పెను.

నూటనాల్గవ గ్రహ గోచారాధ్యాయము సమాప్తము



105. రూపసత్రాధ్యాయము

నక్షత్రపురుషుని రెండు కాళ్లలో మూలా నక్షత్రము, రెండు తొడలలో రోహిణి, రెండు మోకాళ్లలో అశ్విని, రెండు ఊరువులలో పూర్వాషాఢ ఉత్తరాషాఢలు, అంగములో పుబ్బ ఉత్తరలు, నడుములో కృత్తిక, రెండు ప్రక్కభాగములలో పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర, పొట్టలో రేవతి, ఛాతిలో అనూరాధ,వీపుపై ధనిష్ఠ, రెండు భుజములలో విశాఖ రెండు హస్తములలో హస్త, వ్రేళ్లలో పునర్వసు, గోళ్లలో ఆశ్లేష, మెడలో జ్యేష్ఠ, రెండు చెవులలో శ్రవణము, ముఖములో పుష్యమి, దంతములలో స్వాతి, హస్తలో శతభిషం, ముక్కులో మఘ, రెండు కళ్లలో మృగశిర, లలాటముపై చిత్త, శిరస్సుపై భరణి, కేశములలో ఆర్ద్ర స్థాపించవలెను.సుందర రూపముకోరు పురుషులు ఈనక్షత్ర చక్రమును తయారు చేయవలెను.

చైత్రశుక్ల అష్టమి మూల నక్షత్రము సోమవారమైన ఆదినమున విష్ణువును నక్షత్రమును పూజించి మొదటి ఉపవాసము నారంభించి రోహిణి నక్షత్రాదులతో పాటుగా ఆర్ద్రా నక్షత్రము వరకు ఉపవాసముండవలెను. వ్రతము పూర్తయిన తర్వాత తమ శక్త్యనుసారము బ్రాహ్మణులకు బంగారము రత్నములు వస్త్రములు నెయ్యితో కూడిన సంపూర్ణపాత్రను దానము చేయవలెను.

లావణ్యమును కోరు మనుష్యుడు పాలు, నెయ్యి బెల్లము కలిపి అన్నముతో బ్రాహ్మణులను పూజించవలెను. బ్రాహ్మణులకు బంగారము, వస్త్రము, వెండిని ఇవ్వవలెను. కాలి నక్షత్రముల నుండి ఆరంభించి ఉపవాసము చేస్తు విష్ణువుకు అంగ నక్షత్రములకు పూజచేయవలెను. ముందు తెల్పిన పూజ చేసిన మనుష్యుడు పొడవైన భుజములతో కూడినవాడు, విస్తీర్ణము బలమైన ఛాతీకలవాడు, చంద్ర సమానముఖమువాడు, తెల్లని దంతములు, గజసమాన గమనము, కమల సమాన విస్తీర్ణ నేత్రములు కలిగి స్త్రీచిత్తమును హరించువాడు కామధేనువుతో సమానమరూపము కలవాడగును.

ముందు తెల్పిన వ్రతము స్త్రీ చేసిన శరత్కాల చంద్రునితో సమాన ముఖకాంతి, కమల దళముతో సమానమైన నేత్రములు, సుందర దంతములు, సుందరమైన చెవులు, తుమ్మెదల వంటి కేశములు కోకిల సమానమైన పలుకులు, తామ్ర సమానమైన పెదవులు, కమల సమానమైన కాళ్లు, చేతులు, స్తనముల బరువుతో వంగిన నడుము, దక్షిణావర్తమైన నాభి, అరటి బోదెల వంటి ఊరువులు, సుందరమైన పిరుదులు, స్వామిప్రియురాలు, కలిసియున్న వేళ్లతో కూడిన కాళ్లు కలిగినదగును. ఇదేవిధముగా వ్రతము చేసిన పురుషుడు కూడ ఉండును.

ఈ లోకములో తన కాంతితో శోభను కలిగించుచున్న నక్షత్రమాల ఎంతవరకు ఆకాశములో నుండునో అంతవరకు స్త్రీ పురుషులు నక్షత్రరూపములతో నక్షత్రముల వలె

కల్పాంతము వరకు చరించును. తర్వాత రెండవ కల్పము మొదటిభాగములో బుద్ధిమంతుడైన చక్రవర్తి యగును. చక్రవర్తిత్వము నాశనమైన తర్వాత ప్రపంచములో జన్మను పొంది రాజు లేక ధనాఢ్యుడైన బ్రాహ్మణుడగును.

కేశవుడు నారాయణుడు, మాధవుడు, గోవిందుడు, విష్ణువు, మధుసూధనుడు, త్రివిక్రముడు, వామనుడు, శ్రీధరుడు, హృశీకేశుడు, పద్మనాభుడు, దామోదరుడు – ఈ విధముగా మార్గశీర్షాది పన్నెండుమాసములకు నామములగును. మనుష్యుడు విధి పూర్వకముగా ద్వాదశిలో మాసనామములతో వ్రతముచేసి కేశవ నారాయణాదులకు పూజచేసి వారి నామమును కీర్తన చేస్తు వారి పదమును పొందును. అక్కడ పునర్జన్మ భయము లేదు.

నూట ఐదవ రూప సత్రాధ్యాయము సమాప్తము

106. ఉపసంహారాధ్యాయము

నేను (వరాహమిహురుడు) బుద్ధిరూపమైన మందరాచలము ద్వారా జ్యోతిషరూప సముద్రమును బాగుగా మథించి లోకములో ప్రకాశించు శాస్త్రరూప చంద్రుని తీసితిని. ఈ శాస్త్రమును నిర్మిస్తు నేను పూర్వాచార్యులు వ్రాసిన గ్రంథముల ఆశయమును వదిలిపెట్టలేదు. అందువలన వారు వ్రాసిన గ్రంథములను ఈ శాస్త్రమును ప్రయత్న పూర్వకముగా చూచి పండితులు దీనిభావమును గ్రహించవలెను. లేనియెడల సజ్జనులైన మనుష్యులు దోషరూప సముద్రములో కొంచెము గుణములను చూచి వాటిని అధికముగా తెల్పెదరు. నీచ పురుషులు దీనికి వ్యతిరేక స్వభావము కలిగియుందురు. మంచి గుణములను దాచి స్వల్పదోషములను అధికముగా చేయుదురు. ఇది సాధు అసాధువుల లక్షణము.

కావ్యరూప సువర్ణము దుర్జనరూపమైన అగ్నితో కాల్చబడి పరిశుద్ధమగును. అందువలన దుర్జన మనుష్యులకు ప్రయత్నముతో శాస్త్రమును వినిపించవలెను. ప్రచారోన్ముఖమైన ఈ గ్రంథములో లేఖక దోషములున్న, నాచే ఆగమ విరుద్ధముగా చేయబడిన, లేక చేయబడకున్న, వాటినన్నింటిని అసూయను విడనాడి బహుశ్రుత మనుష్యుల ముఖముల నుండి విని పండితులు సరిచేయవలెను. సూర్యమునిగణ గురుజన చరణములకు నమస్కారము చేయుట వలన కలిగిన అనుగ్రహము వలన ఉత్పన్నమైన బుద్ధితో ఈ గ్రంథమును సంగ్రహించితిని. అందువలన పూర్వాచార్యులకు నానమస్కారము.

నూట ఆరవ ఉపసంహారాధ్యాయము సమాప్తము

107. శాస్త్రానుక్రమణాధ్యాయము

ముందు శాస్త్రోపనయనము తర్వాత సాంవత్సర సూత్రము, అర్కచారము, చంద్రచారము, రాహుచారము, భౌమచారము, బుధచారము, గురుచారము,శుక్రచారము, శనిచారము, కేతుచారము, అగస్త్యచారము, సప్తర్షిచారము, కూర్మవిభాగము, నక్షత్ర వ్యూహము, గ్రహభక్తియోగము, గ్రహయుద్ధము, శనిగ్రహ సమాగమము, గ్రహవర్ష ఫలము, గ్రహ శృంగాటకము, మేఘ గర్భలక్షణము,గర్భధారణము, ప్రవర్షణము, రోహిణీ యోగము, స్వాతియోగము, ఆషాఢీయోగము, వాతచక్రము, సద్యోవర్షణము, కుసుమలత సంధ్యాలక్షణము,దిగ్దాహ లక్షణము,భూకంపలక్షణము,ఉల్కా లక్షణము, పరివేష లక్షణము, ఇంద్రాయుధ లక్షణము, గంధర్వ నగర లక్షణము, ప్రతిసూర్య లక్షణము, నిర్ఘాత లక్షణము, సస్యజాతకము, ద్రవ్యనిశ్చయము, అర్ఘకాండము, ఇంద్రధ్వజము, నీరాజన విధి, ఖజన లక్షణము, ఉత్పాత లక్షణము, మయూర చిత్రకము,పుష్యస్నానము, పట్ట లక్షణము, ఖడ్గ లక్షణము, వాస్తువిద్య, ఉదకార్గళము, వృక్షాయుర్వేదము, ప్రాసాద లక్షణము, వజ్రలేపము, ప్రతిమాలక్షణము, వనప్రవేశము, సురభవనప్రతిష్ఠ, గోలక్షణము,శ్వాన లక్షణము, కుక్కుట లక్షణము,కూర్మలక్షణము,ఛాగ లక్షణము, పురుష లక్షణము, పంచ మహాపురుష లక్షణము, స్త్రీ లక్షణము, వస్త్రవిచ్ఛేద లక్షణము,చామర లక్షణము, దండపరీక్ష, స్త్రీప్రశంస, సౌభాగ్య కరణము, కాందర్పికము,గంధయుక్తి, పుం స్త్రీ సమాగమము, శయనవిధి, వజ్రపరీక్ష, ముక్తా లక్షణము,పద్మరాగ పరీక్ష,దీప లక్షణము,దంతకాష్ఠ లక్షణము, శకున మిశ్రఫలము, అంతర చక్రము, విరుతము, శ్వచక్రము, శివారుతము, మృగచేష్ట, హస్తచేష్ట, వాయసవిద్య.

శివారుతాధ్యాయములో శ్వచేష్టితము,గో చేష్టితాధ్యాములో ఉష్ట్రి, వ్యాఘ్రి, సింహ, ఆది ప్రధానజీవుల లక్షణము చెప్పబడినది. మృగజాతుల మధ్యలో మార్జాలము, వ్యాఘ్రము, సూకరము, ఒంటె మున్నగు జంతువుల లక్షణము చెప్పబడినది. పాకాధ్యాయము, నక్షత్ర గుణము తిథిగుణము, కరణగుణము, నక్షత్రజాతకము, గ్రహగోచారాధ్యాయము, నక్షత్ర పురుషము, రూపసత్రము ఈ అధ్యాయములు ఈగ్రంథములోనున్నవి.

ఇక్కడ తెల్పిన విధముగా అదే క్రమములో గ్రంథములో ఒకవంద అధ్యాయములు రచింపబడినవి. దీనిలో వంద తక్కువగా నాలుగువేల శ్లోకములివ్వబడినవి. వాతచక్రము, అంగవిద్య, పిటక లక్షణము, అశ్వలక్షణము, గజలక్షణము, ఈ ఐదు అధ్యాయములు ఈ ప్రమాణముకన్న వేరైనవిగా భావించవలలెను. ఈ ఐదు అధ్యాయముల శ్లోకసంఖ్యతో కలిపి మొత్తము నాలుగువేల శ్లోకములగును. దీనిలో పరివేష విషయము యాత్రానామక పుస్తకములో తెలుపబడినది. ఈ విధముగా నేను అత్యంత ఆశ్చర్యమును కలిగించు జాతకమును ప్రశస్తమైన కరణము (పంచసిద్ధాంతిక)లో తెలిపితిని.

నూట ఏడవ శాస్త్రానుక్రమణాధ్యాయము సర్వము సమాప్తము



గ్రంథకర్త పరిచయం

జ్యోతిషవిశారద - వాస్తు సమ్రాట్

డా॥ ముదుండి విశ్వనాథరాజు పి.హెచ్.డి.

జననం : 01.11.1952

జన్మస్థలం : పాలకోడేరు (మండలం) పశ్చిమగోదావరిజిల్లా.

విద్యార్హతలు : భాషా ప్రవీణ.ఎం.ఏ.తెలుగు, హిందీ, సంస్కృతం,
ఎం.ఏ జ్యోతిషం.(యూనివర్సిటీలో ప్రథములుగా ఉత్తీర్ణత)
జ్యోతిర్వాస్తు డిప్లొమ, కన్నడ భాషా డిప్లొమ. వాస్తు శాస్త్రంలో పి.హెచ్.డి.

అధ్యాపకత్వం : ప॥గో॥జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో
1976 నుండి 1982 వరకు తెలుగు భాషా బోధన
(ప్రస్తుతం) నేషనల్ పోలీసు అకాడమీలో ఐ.పి.ఎస్ అధికారులకు
తెలుగు కన్నడ భాషల బోధన.
తెలుగు యూనివర్సిటి జ్యోతిష విభాగంలో
వాస్తు, జ్యోతిషశాస్త్ర బోధన.

రచనలు : కాలేజీ విద్యార్థుల కొరకు తెలుగు వ్యాకరణం, ఇంగ్లీషు తెలుగు
హిందీ భాషలలో డిక్షనరీలు, స్వబోధినులు, కన్నడ హిందీ
ఇంగ్లీషు సంస్కృత భాషల అనువాదాలు.
విశ్వకర్మ ప్రకాశము, ప్రాచీన వాస్తు శాస్త్రాలు - ఆధునిక వాస్తు పరిశీలన
నారద సంహిత, మయమతము, వాస్తురాజ వల్లభము,
ముహూర్తచింతామణి

అభిలాష : ప్రాచీన ఆధునిక వాస్తుల సమన్వయంతో భవన నిర్మాణ
సలహాలను, జ్యోతిష శాస్త్ర ప్రయోజనాలను
సామాన్యులకు కూడా అందజేయాలని.....

Deepthi Printers, Hyd. 9949703224